యాత్రికుని ప్రయాణం
Pilgrim's Progress

జాన్ బన్యన్
John Bunyan

ఉచిత పంపిణీకి మాత్రమే
For Free Distribution Only



DEPUTAATSCHAP BIJBELVERSPREIDING

BRANCH OF THE NETHERLANDS REFORMED CONGREGATIONS

©2014 Deputaatschap Bijbelverspreiding
The Netherlands (Telugu edition)
Translation : Simon Sandepagu

All rights reserved. No part of this publication may be reproduced, stored in a retrieval system, or transmitted, in any form or by any means, digital, electronic, mechanical, photocopying, recording, or otherwise, without the prior written permission.

పీఠిక

ఒక్క బైబిల్‌ని మినహాయిస్తే, ఆంగ్ల భాషలోని ఏ ఇతర పుస్తకం కన్నా అత్యధికంగా చదువబడిన గ్రంథం యాత్రికుని ప్రయాణము. ఆంగ్లసాహిత్యంలో ఒక మహాగ్రంథంగా ఆమోదించబడిన ఈ పుస్తకం పాఠకులను మంత్రముగ్దులను చేసే మనోహరమైన రూపకాలంకార గ్రంథం. నిజమైన క్రైస్తవుల అనుభవాలకు ఏమాత్రం తీసిపోని ఈ గ్రంథంలో సమకాలీన మానవులకు విశేషమైన సందేశం ఉన్నది.

బన్యన్ కథనాన్ని వర్తమాన పాఠకులకు అర్థమయ్యే రీతిలో తిరిగి రాయడం జరిగింది. ఇందులోని యాత్రికులు పూర్వకాలపు ప్రయాణికుల వలె కాలినడకన ప్రయాణించి, సత్రాలలో, వసతి గృహాలలో, వేరేవారి ఇళ్లలో బసచేసినప్పటికీ ఈ కథను చెప్పిన విధానం ఆధునికంగా ఉంటుంది. పరలోక పట్టణానికి బయలుదేరిన యాత్రికులతో పాటు పాఠకుడు సులువుగా పయనించగలిగేందుకు వీలుగా కొన్ని అనవసర వివరాలను తొలగించాం. కొన్ని పాత్రల పేర్లు మార్చటమే గాక, రెండు మూడు కొత్త పాత్రలను కలుపడం జరిగింది. కొన్నిచోట్ల గ్రంథకర్త ఉద్దేశించిన భావ స్పష్టత కోసం విస్తరించి రాయడం జరిగింది. అయినప్పటికీ సందేశం మారలేదు.

మానవజీవితాన్ని, దాని గుణాన్ని ఎంతో హృద్యంగా చిత్రీకరించి, దానికి కలిగే అమోఘమైన దైవ ప్రత్యక్షతలు, నిత్య సత్యము, రక్షణమార్గము మొదలైన అంశాల గురించి కళ్లకు కట్టినట్లు వివరించబడిన యాత్రికుని ప్రయాణం అనే మహాగ్రంథాన్ని రాయడానికి తన నమ్మకమైన సేవకుడగు జాన్ బన్యన్‌ని ఉపయోగించుకున్న మహిమాన్వితుడగు ప్రభువుకు స్తుతి చెల్లించబడునుగాక.

జాన్ బన్యన్ గారు రాసిన మహాగ్రంథాన్ని సవరించి సమకాలీన పాఠకులకు అందించడంలో కడు జాగ్రత్త వహించిన జేమ్స్ హెచ్. థామస్ ప్రశంశనీయులు.

– ప్రచురణకర్తలు

విషయ సూచిక

మొదటి భాగము

క్రైస్తవుని ప్రయాణం

1. కష్టాల్లో క్రైస్తవుడు 9
2. క్రైస్తవుడు మంచి మార్గమునకు తిరిగి వచ్చుట 26
3. సుందర గృహం దిశగా ప్రయాణం 38
4. దీనత్వము మరియు మరణపు లోయలలో 56
5. క్రైస్తవుడు మరియు విశ్వాసి 67
6. మాయాసంత మరియు మాయపట్టణం 86
7. మనోహర పర్వతాలకు ప్రయాణం 98
8. మనోహర పర్వతాల దగ్గర 117
9. అహంకారమనే లోతట్టు దేశంలో 121
10. అజ్ఞానంతో సంభాషణ 134
11. దేవుని పట్టణానికి సమీపాన 143

రెండవ భాగము

క్రిస్టియానా ప్రయాణం

12. క్రిస్టియానా క్రైస్తవుడిని అనుసరించుట 152
13. వివరణకర్త ఇంటివద్ద 162
14. గొప్పమనస్సు నడిపింపు 171
15. కావలివాని సత్రం 178
16. గొప్పమనస్సుతో ప్రయాణం 191
17. గాయు, నాసోను ఇంటివద్ద 207
18. మనోహర పర్వతాల వద్ద క్రిస్టియానా 217
19. మంత్రభూమిపైన 224
20. బ్యూలాదేశము 231

x————————x

యాత్రికుని ప్రయాణం 240
యాత్రికుని ప్రయాణంలోని పాత్రలు 242

మొదటి భాగము

క్రైస్తవుని ప్రయాణం

ఉచిత పంపిణీకి మాత్రమే
For Free Distribution Only

అధ్యాయం 1
కష్టాల్లో క్రైస్తవుడు

ఈ లోకమనే అరణ్యం గుండా నేను నడిచివెళుతుండగా, గుహ ఉన్న ఒక చోటికి చేరుకున్నాను. అక్కడ నిద్రించేందుకు నేను పడుకున్నాను. ఆ నిద్రలో నేనొక కల గన్నాను. నా కలలో చింపిరిగుడ్డలు ధరించిన ఒక మనిషి చేతిలో ఒక పుస్తకంతో, వీపుమీద గొప్ప బరువుతో ఆ దారి ప్రక్కన నిలబడి ఉండటం చూశాను. అక్కడికి దగ్గరలోనే ఉన్న అతని ఇంటికి వ్యతిరేక దిశలో నిలబడి అతడు చూస్తున్నాడు. అతడు తన చేతిలో ఉన్న పుస్తకాన్ని తెరచి చదవడం, ఆ తరువాత అతడు రోధించడం నేను చూశాను. తన ఉద్వేగాన్ని ఇక ఏమాత్రం అదుపుచేసుకోలేక, దుఃఖపూరితమైన స్వరంతో పెద్దగా అరుస్తూ, "నేనేం చెయ్యాలి?" అని కేకవేశాడు.

ఆ స్థితిలోనే అతడు తన ఇంటిలోనికి వెళ్లాడు. తన నిరుత్సాహం గురించి తన భార్యకు, పిల్లలకు తెలియకుండ ఉండాలన్న ఉద్దేశంతో కన్నీళ్లు తుడుచుకొంటూ, వీలైనంత వరకు తన దుఃఖాన్ని ఆపుకున్నాడు. అయితే తన బాధ అధికం కావడంతో, ఎక్కువసేపు మౌనంగా ఉండలేకపోయాడు. తన భార్యకు, పిల్లలకు జరిగిన విషయం సవివరంగా చెప్పసాగాడు: "ఓ నా ప్రియమైన భార్యా, పిల్లలారా, మీ తండ్రిని, సహచరుడనైన నేను, నా గుండెలమీద ఉన్న ఈ భయంకరమైన బరువు కారణంగా నశించిపోయాను. ఆకాశం నుంచి అగ్ని దిగివచ్చి ఈ మన పట్టణాన్ని కాల్చివేస్తుందని నేను ఖచ్చితంగా హెచ్చరించబడ్డాను. మనం తప్పించుకునే మార్గం ఏదైనా కనిపిస్తే తప్ప, ఈ భయంకరమైన నాశనంలో మనమంతా తప్పక నశించిపోవడం ఖాయం." అతని కుటుంబం ఆశ్చర్యపోయింది. తాను చెప్తున్న విషయాలు సత్యమని వారు నమ్మినందుకు కాదుగాని, అతడు మతిభ్రమించి మాట్లాడుతున్నాడని అభిప్రాయపడ్డారు.. చీకటి పడుతున్నందువల్ల, నిద్రపోతే అతని భయాలన్నీ సమసిపోతాయన్న ఆశతో అతన్ని త్వరత్వరగా నిద్రబుచ్చారు. కానీ ఆ రాత్రంతా అతడు నిట్టూర్పులతో, కన్నీటితోనే గడిపాడు.

తెల్లారినప్పుడు, ఇప్పుడు ఎలావుంది అని వారతన్ని అడిగారు. "దారుణం, దారుణం" అంటూ అతడు బదులిచ్చాడు. తన పరిస్థితి గురించి అతడు మరలా మాట్లాడనారంభించే సరికి అతని కుటుంబం ఒకింత అసహనంతో కటువుగా మారిపోయింది. కొంతసేపు అతని దుఃఖపూరితమైన మాటలు విన్నతరువాత, అతనితో కఠినంగా, అమర్యాదగా ప్రవర్తించడం ద్వారా దయనీయమైన అతని మానసిక స్థితిని తొలగించేందుకు ప్రయత్నించారు. కొన్నిసార్లు చీవాట్లు వేయడం, కొన్నిసార్లు

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

బుద్ధిచెప్పడం, మరికొన్నిసార్లు అతన్ని పూర్తిగా పట్టించుకోకుండ వదిలివేయడం వంటి పనులు చేశారు. తన దౌర్భాగ్య స్థితి గురించి విలపించడానికి, తన కుటుంబం గురించి జాలిపడుతూ, వారికోసం ప్రార్థించడానికి ఒంటరిగా తన గదిలోనికి వెళ్లాడు. పొలంలో ఒంటరిగా నడుస్తూ, అప్పుడప్పుడు తన పుస్తకం చదువుకుంటూ, బిగ్గరగా ప్రార్థనచేస్తుండేవాడు.

ఒకరోజు, లోతుగా ధ్యానంచేస్తూ, పొలంలో నడుచుకుంటూ వెళుతూ, ఇలా పెద్దగా అరిచాడు: "రక్షణపొందుటకు నేనేం చెయ్యాలి?" పరుగెత్తబోతున్నవాడిలా అతడు అటూ ఇటూ చూశాడు; అయినా, ఎటుపోవాలో పాలుపోక అక్కడే నిలబడ్డాడు.

సువార్తికుని కలుసుకొనుట

అప్పుడొక మనిషి అతని వైపు రావడం నేను చూశాను, అతడు ఈ మాటలు పలకడం నేను విన్నాను. "నా పేరు సువార్తికుడు. నువ్వింత కలవరపడుతున్నావు ఎందుకో తెలుసుకోవచ్చా?"

అందుకతడు ఇలా జవాబిచ్చాడు, "అయ్యా, నాకు మరణశిక్ష విధించబడిందని, ఆ తర్వాత తీర్పు జరుగుతుందని నా చేతిలో ఉన్న ఈ పుస్తకం ద్వారా నేను గ్రహించాను. అయితే మొదటిపని చెయ్యడం నాకు ఇష్టంలేదు, రెండవది చేసే శక్తికూడ లేదు."

"ఈ జీవితంలో ఎన్నో కీడులు జరగడం చూస్తూనే, చావడానికి నువ్వు ఎందుకు సుముఖంగా లేవు?" అడిగాడు సువార్తికుడు. "ఎందుకంటే నా వీపుమీద ఉన్న ఈ భారం నన్ను సమాధికంటే దిగువకు ముంచివేసి నన్ను నరకంలో పడవేస్తుందేమోనని నాకు భయంగా ఉంది. నేను చావడానికే సిద్ధంగా లేనంటే, తీర్పుకు, అక్కడినుంచి ఉరికంబానికి వెళ్లేందుకు కూడ సిద్ధంగా లేనట్టే కదా. ఈ విషయాలకు సంబంధించిన తలంపులు నాకు కన్నీరు తెప్పిస్తున్నాయి." అని బదులిచ్చాడు.

"నీ పరిస్థితి అలావుంటే, ఇక్కడెందుకు నిలుచున్నావు?" అడిగాడు సువార్తికుడు.

"ఎందుకంటే, ఎటువెళ్లాలో నాకు తెలియదు."

అప్పుడు సువార్తికుడు అతనికి ఒక తోలు చుట్టను ఇచ్చాడు. అందులో ఈ మాటలున్నాయి: "రాబోతున్న ఉగ్రతను తప్పించుకొని పారిపో."

ఆ మాటలు చదివిన మీదట అతడు సువార్తికుని వైపు ఎంతో ఆశగా చూస్తూ అడిగాడు: "కాని, నేను ఎక్కడికి వెళ్లాలి?"

విశాలంగా ఉన్న పొలంవైపు అతని చేయి చూపిస్తూ, "అదుగో ఆ పొలానికి దూరంగా ఉన్న ఆ చిన్న ద్వారం నీకు కనిపిస్తోందా?" అన్నాడు సువార్తికుడు.

"లేదు" కనిపించడం లేదన్నాడు.

"మరి మిణుకు మిణుకుమంటూ వెలుగుతున్న ఆ చిన్న నక్షత్రం నీకు కనిపిస్తోందా?"

"ఆ కనిపిస్తున్నట్లుంది" అని అతడు బదులిచ్చాడు.

"ఇప్పుడు నీ దృష్టినంతా ఆ వెలుగుమీద కేంద్రీకరించి వెళితే, నేరుగా ఆ చిన్న ద్వారం దగ్గరకు చేరుకుంటావు. అక్కడికి వెళ్లి తలుపు తట్టితే, నీవు ఏమిచెయ్యాలో నీకు చెప్పబడుతుంది."

నాశనపురమును విడిచిపెట్టుట

ఇప్పుడు నా కలలో అతడు పరుగెత్తడం చూశాను. అతడు తన ఇంటిని విడిచి ఎంతో దూరం వెళ్లకముందే అతని భార్య, పిల్లలు ఏడ్చుకుంటూ వచ్చి, ఇంటికి తిరిగి రమ్మని అడుగుతున్నారు. అయితే అతడు తన చెవ్వుల్లో వేళ్లు పెట్టుకొని "జీవం! జీవం! నిత్యజీవం!" అంటూ పెద్దగా కేకలు వేస్తూ పరుగెత్తుకుంటూ వెళ్లాడు. అతడు వెనక్కి తిరిగి చూడకుండా, ఇంకా వేగం పెంచి ఆ మైదానం మధ్యలోకి చేరుకున్నాడు.

మొండి, మెత్తనలు అతని వెంబడించుట

పారిపోతున్న అతన్ని చూడాలని ఇరుగుపొరుగువాళ్లంతా బయటికొచ్చారు. అతడు పరుగెత్తుతుండగా కొందరు ఎగతాళిచేశారు, కొందరు బెదిరించారు, మరికొందరు అతన్ని తిరిగి రమ్మని పిలిచారు. అలా చేసినవారిలో ఇద్దరు అతని వెంట వెళ్లి ఎలాగైనా అతన్ని వెనక్కి

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

తీసుకురావాలని తీర్మానించుకున్నారు. వారిలో ఒకడి పేరు మొండి, రెండోవాని పేరు మెత్తన.

ఇప్పటికే అతడు చాలాదూరం వెళ్లాడు. అయితే ఆ ఇద్దరు కూడ బాగా పరుగెత్తగలిగినవారే కాక కృతనిశ్చయంతో ఉన్నారు గనుక త్వరలోనే అతన్ని చేరుకోగలిగారు.

"పొరుగువారలారా, మీరెందుకొచ్చారు?" అని అతడు వారిని అడిగాడు.

"మాతో తిరిగి రమ్మని నిన్ను ఒప్పించడం కోసం" మేము వచ్చామని వాళ్ళు జవాబిచ్చారు.

"అది ఎన్నటికీ సాధ్యం కాదు. మీరు నాశనపురంలో నివసిస్తున్నారు. నేను కూడ జన్మించిన ఆ ఊరిలో చనిపోయేవాళ్లంతా సమాధికంటే దిగువకు మునిగిపోయి అగ్నిగంధకాలతో కాల్చబడే చోటుకు జారిపోతారు. నా మంచి పొరుగువారలారా, నన్ను నమ్మండి. నాతోపాటు రండి." అన్నాడు.

"ఏమిటీ! మా స్నేహితులను, సుఖాలను అన్నీ విడిచి రావాలా?" ఆశ్చర్యంగా అడిగాడు మొండి.

"అవును" అన్నాడు క్రైస్తవుడు (చెప్పడం మరిచాను, ఇదే అతని పేరు). "నేను అనుభవించడానికి వెదుకుతున్న దానితో పోల్చితే మీరు విడిచిపెట్టేవన్నీ ఎందుకూ కొరగావు. మీరు కూడ నాతో వచ్చి, ఈ మార్గంలోనే ఉన్నట్లయితే, నాతోపాటు మీరుకూడ ఆనందిస్తారు; ఎందుకంటే నేను వెళుతున్న ఆ స్థలంలో అందరికీ సరిపోయినంత సమృద్ధిగా ఉంటుంది. నాతో వచ్చి, నా మాటలు నిజమో కాదో మీరే రుజువు చేయండి."

మొండి: లోకమంతా విడిచి దేనినో వెతుక్కుంటూ వెళుతున్నావు కదా, ఏమిటది?

క్రైస్తవుడు: అక్షయమైనది, అపవిత్రము కానిది, ఎప్పటికీ వాడిపోనిది, శ్రద్ధగా వెతికేవారిపై తగిన సమయంలో కుమ్మరించబడుటకు పరలోకంలో భద్రంగా దాచివుంచబడినది. అయిన వారసత్వం కోసం నేను వెతుకుతున్నాను. కావాలంటే మీరు కూడ చదవండి. ఇదిగో, ఆ సంగతులన్నీ నా గ్రంథంలోనే[1] ఉన్నాయి.

మొండి: ఓహో, చాల్లేవయ్యా! నీ గ్రంథాన్ని ప్రక్కనపడెయ్! నువ్వు మాతో వస్తున్నావా లేదా?

క్రైస్తవుడు: లేదు, నేనిప్పుడు నాగటిమీద చెయ్యివేశాను గనుక తిరిగి రాలేను.

మొండి: అయితే మెత్తనా, రా, అతడు లేకుండానే మనం వెళ్లిపోదాం; తాము పట్టిన కుందేలుకు మూడేకాళ్లు అంటూ మూర్ఖంగా వాదించే ఇటువంటి వెఱ్ఱివాళ్లు చాలామందే ఉంటారు. ఇలాంటివాళ్లు తమ దృష్టికి తామే జ్ఞానులమనుకుంటారు.

మెత్తన: అలా దూషించకు. ఈ మంచిమనిషి చెప్పేది సత్యమే అయితే, అతడు మనకంటే తెలివైనవాడే అవుతాడు; అతడు సంపాదించాలని ఆశించేవి మనకున్నవాటికంటే చాలా శ్రేష్ఠమైనవి. నేను అతనితో వెళ్లాలనుకుంటున్నాను.

మొండి: మరొక మూర్ఖుడు తోడయ్యాడా? నా మాట విని నాతో తిరిగివస్తే నీకు ఎంతైనా మేలు. ఈ మతిస్థిమితం లేనివాడు నిన్ను ఎక్కడికి నడిపిస్తాడో ఏమో, ఎవరికి తెలుసు? బుద్ధిగా నాతో తిరిగి రా వెళ్లిపోదాం.

క్రైస్తవుడు: వెళ్లొద్దు. మెత్తనా, నువ్వు నాతోనే రా. నేను చెప్పిన సంగతులే కాక, మనం సంపాదించుకోవడానికి ఇంకా అద్భుతమైనవి బోలెడన్ని ఉన్నాయి. నన్ను నమ్మకపోతే, నా చేతిలో ఉన్న ఈ గ్రంథాన్ని చదువు. ఇందులో వ్యక్తపరచబడిన సత్యాన్ని దీన్ని రాసినవాని రక్తమే నిర్ధారిస్తుంది.

మెత్తన: మంచిది. మొండిగారూ, నేనొక నిర్ణయానికి వచ్చేశాను. నేనీ మంచిమనిషితో కూడ

1. 1 పేతురు 1:4 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

వెళుతున్నాను; అతనితో వెళ్లి నా అదృష్టాన్ని పరీక్షించుకుంటాను. అయితే, మంచి క్రైస్తవుడా, ఈ ఆనందకరమైన స్థలానికి వెళ్లే మార్గం నీకు తెలుసా?

క్రైస్తవుడు: మనముందు ఉన్న ఆ చిన్న ద్వారం వద్దకు త్వరగా వెళ్లమని సువార్తికుడు అనే వ్యక్తి నాకు ఉపదేశించాడు. అక్కడికి చేరుకున్న తర్వాత ఆ మార్గం గురించిన ఆదేశాలు నాకు దొరుకుతాయి.

మెత్తన: అలాగైతే, వెళదాం పద.

మొండి: నేను మాత్రం నా యింటికి తిరిగివెళ్తున్నాను. ఇటువంటి మోసపోయిన, విచిత్రమైన మూర్ఖులతో సహవాసం చెయ్యడం నావల్ల కాదు.

ఇప్పుడు నా కలలో, వారిని విడిచి మొండి వెళ్లిపోయిన తర్వాత, క్రైస్తవుడూ, మెత్తన ఇద్దరూ కలిసి ఆ మైదానంలో నడుచుకుంటూ ముందుకు సాగిపోవడం చూశాను.

క్రైస్తవుడు: మిత్రమా మెత్తనా, నీ గురించి కాస్త వివరంగా చెప్పు. మొత్తానికి నువ్వు నాతో రావాలని నిర్ణయించుకున్నందుకు నాకెంతో ఆనందంగా ఉంది. ఇంకనూ అదృశ్యంగా ఉన్నదానికి చెందిన శక్తిని, భయోత్పాతాలను నావలె మొండి కూడ అనుభవించి వుంటే అతడు అంత తేలికగా వెనుదిరిగి వెళ్లేవాడు కాదు.

మెత్తన: క్రైస్తవుడా, ఎలాగూ మనమిద్దరమే ఒంటరిగా ఉన్నాం గనుక, ఈ సంగతులేమిటి, మనం ఎక్కడికి వెళుతున్నాము, వాటిని ఎలా సంపాదించుకోవాలి వంటి విషయాలగురించి ఇంకా వివరంగా చెప్పవా.

క్రైస్తవుడు: వాటి గురించి నోటితో చెప్పగలిగేకంటే, నా మనస్సులోనే బాగా గ్రహించగలుగుతున్నాను; అయినా, తెలుసుకోవాలన్న ఆశ నీలో ఉంది గనుక, వాటి గురించి నా గ్రంథంలో ఏమున్నదో చదివి వినిపిస్తాను.

మెత్తన: నీ గ్రంథంలో ఉన్న మాటలు ఖచ్చితంగా సత్యమేనని నీవు భావిస్తున్నావా?

క్రైస్తవుడు: అవును, సత్యమే; ఎందుకంటే, ఇది అబద్దమాడనేరని వానిచేత వ్రాయబడింది.

మెత్తన: మంచిది, ఇంతకీ, ఏమీటా సంగతులు?

క్రైస్తవుడు: మనకోసం మహిమ కిరీటాలు, ఆకాశంలో సూర్యుడికంటే తేజోవంతంగా మెరిసే ప్రకాశవంతమైన వస్త్రాలున్నాయి.

పరలోకమును వివరించుట

మెత్తన: ఆహా, అద్భుతం. ఇంకా ఏమేమి ఉన్నాయి?

క్రైస్తవుడు: ఇకమీదట ఏ దుఃఖమూ, ఏడ్పులు ఉండవు. ఎందుకంటే ఆ రాజ్యపు అధికారి ప్రతి కన్నీటినీ తుడిచివేస్తాడు.

మెత్తన: అక్కడ మనకు తోడుగా ఎవరెవరు ఉంటారు?

క్రైస్తవుడు: చూసేందుకు కళ్లుమిరుమిట్లు గొలిపే సెరాపులు, కెరూబులతో మనముంటాం. అంతేకాదు, ఈ భూలోకంలోనుంచి విమోచింపబడి, మనకంటే ముందుగా ఆ సుఖమయ రాజ్యానికి వెళ్లిన కోట్లకొలది పరిశుద్ధులు, మంచివారిని కలుసుకుంటాం; ప్రతి ఒక్కరూ పవిత్రతలో నడుచుకుంటూ, మహారాజు సన్నిధిని శాశ్వతంగా అనుభవిస్తూ ఉంటారు. ఒక్క మాటలో చెప్పాలంటే, బంగారు కిరీటాలను ధరించిన పెద్దలను; బంగారు వీణలు మీటుతున్న పరిశుద్ధులైన కన్యకలను చూస్తాం; ఆ రాజ్యము నేలే ప్రభువు పట్ల వారికున్న ప్రేమను బట్టి లోకం చేత ముక్కలు ముక్కలుగా నరికివేయబడి, లేదా మంటల్లో కాల్చివేయబడి, లేక క్రూరమృగాలకు ఆహారంగా వేయబడి, లేదా సముద్రంలో ముంచివేయబడి, అటుపిమ్మట రూపాంతరము చెందిన మనుష్యులు అక్కడుంటారు– అందరూ క్షేమంగా, మచ్చలేని దుస్తులు ధరించినవారై, అక్షయమైన శరీరాలు ధరించి ఉంటారు.

మెత్తన: ఒకని ఆత్మ ఆనందడోలికలలో తేలియాడటానికి ఈ సంగతులు వింటేచాలు. అయితే, వాటిని మనం అనుభవించ గలమా? వాటిలో మనం కూడా పాలిభాగస్తులమవ్వడం ఎలా?

క్రైస్తవుడు: ఆ దేశపు పరిపాలకుడైన ప్రభువు ఈ గ్రంథంలో అవన్నీ రాసి వుంచాడు. వాటి సారాంశమంతా ఇదే: మనం నిజంగా ఆయన్ని, ఆయన రాజ్యాన్ని కోరుకుని, ఆయన్ని మన ప్రభువుగా, రక్షకుడిగా స్వీకరించడానికి ఇష్టపడితే, ఆయన మన కోరికను ఉచితంగా నెరవేరుస్తాడు.

మెత్తన: మంచిది, నా మంచి మిత్రుడా, ఈ విషయాల గురించి వింటుంటే నాకు చాలా ఆనందంగా ఉంది. పద, త్వరత్వరగా వెళదాం.

క్రైస్తవుడు: నా వీపుమీద ఉన్న ఈ భారం వల్ల నేను ఆశించినంత వేగంగా నడువలేను.

బురదగుంటలో పడిపోవుట

ఇప్పుడు, నా కలలో, వారీ సంభాషణ ముగించగానే ఆ మైదానం మధ్యలో ఉన్న బురదగుంటకు సమీపంగా వాళ్లు రావడం చూశాను. అజాగ్రత్తగా ఉండటం వల్ల, వాళ్లిద్దరూ ఆ గుంటలో పడిపోయారు. దానిపేరు నిరుత్సాహపు రొంపి. ఇక్కడ కొద్దిసేపు వారు ఆ బురదలో పెనుగులాడారు. క్రైస్తవుడు తన వీపుమీద ఉన్న బరువు కారణంగా త్వరలోనే మునిగిపోసాగాడు.

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

అప్పుడు మొత్తన ఇలా అన్నాడు, ''అయ్యో, మంచి క్రైస్తవుడా, నువ్వెక్కడున్నావు?

క్రైస్తవుడు: నిజంగానే, నాకు తెలియదు.

ఆ మాటకు నొచ్చుకున్న మొత్తన ఆగ్రహంతో తన తోటి ప్రయాణికుణ్ని విమర్శించాడు: ''ఇంతవరకూ తమరు చెప్పుకొచ్చిన ఆనందం ఇదేనా? మన ప్రయాణం ఆదిలోనే ఇంత నికృష్టపు దరిద్రం వెంటాడితే, మొత్తం యాత్ర ముగిసేలోపు ఇంకా ఏమేమి సంభవిస్తాయో ఎవరికి తెలుసు? ఈ కంపులో నుంచి నేను ప్రాణాలతో బయటపడితే చాలు, అదే పదివేలు. ఇక ఆ పరలోక దేశాన్ని, దాని నమస్త మహిమలనూ నువ్వొక్కడివే హాయిగా అనుభవించవచ్చు.'' అంతటితో అతడు తెగించి ఒక్క ఉదుటన బయటికి దూకి, ఆ బురదగుంటకు అవతలివైపున పడ్డాడు. సరిగ్గా అతని ఇల్లు అటువైపే ఉంది. అంతటితో అతడు క్రైస్తవుని కంటికి కనిపించనంత దూరం వెళ్లిపోయాడు.

ఒంటరిగా ఆ బురదగుంటలో తొక్కిసలాడుతూ, ఆ చిన్నద్వారం ఉన్నవైపు పోరాడుతూ ఉండిపోయాడు క్రైస్తవుడు. అయితే తన శక్తికొలది, తన నైపుణ్యమంతా ఉపయోగించి విశ్వప్రయత్నం చేసినా, అతనిమీద ఉన్న భారం వల్ల గుంటలోనుండి బయటికి రాలేకపోయాడు. అప్పుడు, ఒక మనిషి అతనివైపు రావడం నేను చూశాను. అతని పేరు సహాయం. "అక్కడ నువ్వు ఏం చేస్తున్నావ్?" అంటూ అడిగాడు.

క్రైస్తవుడు: అయ్యా, నా భారమును విడిపించుకొని, రానున్న ఉగ్రతనుండి తప్పించుకోడానికి వీలుగా అదుగో అక్కడ సుదూరంగా కనిపిస్తున్న ద్వారం వద్దకు వెళ్లమని సువార్తికుడు అనేవ్యక్తి నాకు చెప్పాడు. నేనక్కడికి వెళుతుండగా ఇదుగో ఈ గుంటలో పడిపోయాను.

సహాయం: మరి నువ్వు మెట్లకోసం ఎందుకు వెతకలేదు?

క్రైస్తవుడు: నా మనస్సునిండా భయం ఆవరించినందున, నేను దగ్గర దారిని ఎంచుకున్నాను.

అప్పుడు సహాయం అన్నాడు, "నీ చెయ్యి ఇలా ఇవ్వు". ఆ విధంగా అతన్ని బయటికి లాగి గట్టినేలమీద నిలబెట్టి, ఆ చిన్నద్వారం వద్దకు వెళ్లే దారి చూపించాడు.

అప్పుడు నేను క్రైస్తవుణ్ణి బయటికి లాగినవాని దగ్గరకు వెళ్లి, "అయ్యా, ఇది నాశనపురం నుండి ఆ ద్వారం వద్దకు వెళ్లే మార్గం కదా, ఆ ద్వారం వద్దకు వెళ్లే యాత్రికులంతా మరింత భద్రంగా వెళ్లగలిగేలా ఈ స్థలాన్ని ఎందుకు సరిచేయలేదు?" అని అడిగాను.

అందుకతడు ఇలా బదులిచ్చాడు: "ఈ బురదగుంట బాగుచేయగలిగేది కాదు. ఇది లోతట్టు ప్రాంతం గనుక, పాపపు ఒప్పుకోలు ద్వారా అపరాధభావనతో కూడిన మనస్సాక్షి యొక్క సమస్త మలినమూ, మురికి ఇక్కడికే వచ్చి చేరుతుంది. అందుకే దీన్ని నిరాశాపూరిత రొంపి అంటారు. పరిశుద్ధాత్మచేత పాపులు చైతన్యపరచబడి వారి నీచస్థితిని చూచినప్పుడు, వారి ఆత్మలో ఎన్నో సందేహాలు, భయాలు, ఎన్నో నిరాశ నిస్పృహలు, ఆందోళనలు పుట్టి, అవన్నీ కలిసి ఏకంగా ఇక్కడికొచ్చి, ఈ స్థలంలో స్థిరపడతాయి; ఈ చిత్తడి బురదగుంట ఏర్పడటానికి కారణం అదే.

"ఈ చోటు అంత మలినంగా మిగిలిపోవడం రాజుగారికి ఏమాత్రం ఇష్టంలేదు. ఈ గుంటను బాగుచెయ్యడానికి గత పదహారువందల ఏళ్లుగా ఆయన సర్వేక్షకుల పర్యవేక్షణలో ఆయన పనివారు నియమించబడ్డారు. అది ఇప్పటివరకు ఈ రాజ్యంలోని ప్రతి ప్రాంతంనుండి ప్రతి కాలంలోనూ తీసుకొచ్చిన ఇరవై వేల బండ్లకు సరిపడా స్థిరమైన సత్యాన్ని, టన్నులకొద్ది పరిపూర్ణమైన ఆదేశాలను ప్రింగివేసింది. ఈ స్థలాన్ని గట్టిపరచడం కోసం శ్రేష్ఠమైన పదార్థాలనే తీసుకొచ్చారని తెలిసినవాళ్లు చెబుతుంటారు. అయినా ఇది నిరాశాపూరిత రొంపిగానే ఉంది, వాళ్లు చేయగలిగినదంతా చేశాక కూడా ఇది ఇలాగే మిగిలిపోతుంది.

అతడు ఇంకా కొనసాగిస్తూ, "రక్షణకర్తయైన ప్రభువులవారి ఆదేశాల మేరకు ఈ చిత్తడి నేలలో మేలురకమైన గట్టి మెట్లు వేయించారన్నది సత్యమే, కాని కొన్ని సమయాల్లో ఈ చిత్తడినేల ఎంతో విస్తారమైన మురికిని వెళ్లగక్కుతుంది, పైగా వాతావరణం మారినప్పుడు ఆ మెట్లు సరిగ్గా కనిపించేవి కూడ కాదు. ఒకవేళ సామాన్యుడికి ఆ మెట్లు కనిపించినా, ఇక్కడికొచ్చేసరికి అతనికి మెట్లుకూడ కనిపించనంతగా తల తిరుగుతుంది; అంతటితో అతడు ఒకవైపు తూలిపోయి ఆ బురదగుంటలోనికి జారి పడిపోతాడు. అక్కడ మెట్లు మాత్రం ఉన్నాయి. ఏదిఏమైనా, ఆ చిన్నద్వారానికి అవతల ఉన్న నేల గట్టిగా ఉంటుంది."

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

ఇప్పుడు నా కలలో మెత్తన తన ఇంటికి చేరుకోవడం చూశాను. అతన్ని చూడటానికి ఇరుగుపొరుగువాళ్లంతా వచ్చారు. నువ్వు జ్ఞానవంతుడివి కాబట్టే తిరిగి వచ్చేశావని కొందరన్నారు; క్రైస్తవుడిలాంటి వ్యక్తితో వెళ్లి ప్రాణాలమీదికి తెచ్చుకున్నందుకు కొందరతన్ని బుద్ధిలేనివాడన్నారు; ఇంకా కొందరైతే, "నేనే గనుక అలాంటి సాహసం చెయ్యదలిస్తే, ఏవో కొన్ని కష్టాలు ఎదురైనంత మాత్రాన దాన్ని వదిలేసి వెనక్కి తిరిగి వచ్చేంత బలహీనుడిని, పనికిమాలినవాడిని మాత్రం ఖచ్చితంగా కాదు" అంటూ అతని పిరికితనాన్ని చూసి హేళన చేశారు.

అవమానభారంతో మెత్తన వారిమధ్య తలదించుకొని కూర్చున్నాడు. అయితే చివరికి ధైర్యం కూడగట్టుకొని వారితో మాట్లాడాడు. అంతటితో వాళ్లందరూ తమ కోపాన్ని క్రైస్తవుడి వైపుకు మళ్లిస్తూ అతని పరోక్షంలో అతన్ని దూషించారు.

లోకజ్ఞానితో కలుసుకొనుట

ఇప్పుడు క్రైస్తవుడు ఒంటరిగా నడుస్తుండగా, ఆ మైదానంలో ఒకడు తనవైపే రావడం చూశాడు. అతడు ఎవరో కాదు, క్రైస్తవుడి ఇంటికి ఎంతోదూరంలో లేని ఇహలోక ధర్మం అనే ఊరివాడైన లోకజ్ఞాని. అదృశ్యమైన ఓ దేశం కోసం అన్వేషిస్తూ క్రైస్తవుడు ఇల్లువిడిచి వెళ్లడం గురించిన

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

సమాచారం అతడు విన్నాడు. అతని గురించిన వివరాలు కొన్ని తెలుసు గనుక అతడు ఎవరైంది లోకజ్ఞాని త్వరగానే పోల్చుకున్నాడు. వారిద్దరూ కలుసుకున్నప్పుడు లోకజ్ఞాని క్రైస్తవుడితో మాటలు కలిపాడు: "ఎలా ఉన్నావు మిత్రమా? ఇంత భారంతో ఎక్కడికి బయలుదేరావు?"

క్రైస్తవుడు: నిజంగా భారమే. సామాన్యుడు భరించలేని భారమిది. మీరు అడిగారు కాబట్టి చెప్తున్నాను, అదిగో అల్లంత దూరాన కనిపిస్తుందే, ఆ చిన్న ద్వారం వద్దకే నేను వెళుతున్నాను; ఎందుకంటే నా భారాన్ని తొలగించుకొనే మార్గం నాకు అక్కడే ఉపదేశించబడుతుందని నాకు చెప్పారు.

లోకజ్ఞాని: నీకు భార్యా పిల్లలున్నారా?

క్రైస్తవుడు: ఉన్నారు, కానీ ఈ మధ్య నేను ఎంత ఇబ్బందికి గురయ్యానంటే, ఒకప్పుడు ఆనందించినంతగా నా భార్య, బిడ్డలను చూసి ఆనందించలేక పోతున్నాను, పైగా నా అనేవాళ్లు నాకెవరూ లేనట్లే అనిపిస్తోంది.

లోకజ్ఞాని: నేనొక సలహా ఇస్తాను, నా మాట వింటావా?

క్రైస్తవుడు: అది మంచిదైతే తప్పక వింటాను; నాకు మంచి సలహా అవసరం.

లోకజ్ఞాని: అలాగైతే, నీ మనస్సు దిటవుచేసుకొని, ఉన్న పళంగా ఆ భారాన్ని విసిరి పారెయ్. అలా చెయ్యనంతవరకు నీ మనస్సు కుదుటపడదు; సరికదా, నీవు ఆ భారాన్ని మోస్తున్నంత కాలం దేవుడు నీకు అనుగ్రహించిన ఆశీర్వాదాలను అనుభవించలేవు.

క్రైస్తవుడు: నేను కోరుకునేది కూడ అదేనండీ– ఈ మహా భారాన్ని ఎలాగైనా వదిలించుకోవాలనే ఉంది– కానీ, నా మనస్సులోనుంచి దాన్ని తొలగించలేక పోతున్నాను. నామీద నుండి ఈ బరువును తొలగించగలవాళ్లు మా ఊళ్లో ఎవరూ లేరు. అందుకే, మీకు చెప్పినట్లుగా నేను ఈ భారాన్ని వదిలించుకొని, సంతోషంగా, స్వేచ్ఛగా బ్రతకడం కోసమే నేనీ మార్గంలో వెళుతున్నాను.

లోకజ్ఞాని: ఈ భారం నుంచి విముక్తి పొందడానికి ఈ మార్గంలో వెళ్లమని నీకు చెప్పిందెవరు?

క్రైస్తవుడు: చూడ్డానికి తెలివైనవాడిగా, మంచివ్యక్తిగా కనిపించిన ఒకాయన చెప్పాడు. అతని పేరు సువార్తికుడు.

లోకజ్ఞాని: సువార్తికుడా! అటువంటి సలహా చెప్పినందుకు వాడికి శిక్షపడేవుంటుందనుకుంటాను! అతడు నిన్ను నడిపించిన ఈ దారికంటే అత్యంత ప్రమాదకరమైనది, ఇబ్బందికరమైనది మరొకటి లేదంటే నమ్ము. నీ ఆకారం చూస్తుంటే, నువ్వు నిరాశపూరిత రొంపిలో దిగబడ్డావని ఇట్టే తెలిసిపోతుంది. ఈ దారిన ప్రయాణించేవారు అనుభవించబోయే కష్టాలకు ఈ రొంపి కేవలం ఆరంభం మాత్రమే. నీకంటే వయస్సులో పెద్దవాణ్ణి గనుక, నా మాట విను. దారిలో నీకు వేదన, దారిద్ర్యం, ఆకలి, ఆపదలు, అపాయాలు, సింహాలు, మొసళ్లు, ఆఖరికి మరణం సహా

ఎదురవుతాయి, పైగా చీకటిలో తచ్చాడుతూ ఎటుపోవాలో దిక్కుతోచక, అలసిపోయి, చాలావరకు ఒంటరితనమే అనుభవిస్తావు. ఈ మార్గంలో వెళ్లిన అనేకులచేత ఇది నిర్ధారించబడింది గనుక ఇది ముమ్మాటికీ నిజం. ఎవడో పిచ్చివాడు చెప్పిన మాటలు విని నీలాంటి మంచివాడు, తెలివైనవాడు ఇంత నిర్లక్ష్యంగా తన ప్రాణాలు ఎందుకు పోగొట్టుకోవాలి?

క్రైస్తవుడు: అయ్యా, మీరు ప్రస్తావించిన ఈ సంగతులన్నిటికంటే నా వీపు మీద ఉన్న ఈ బరువే మహా దారుణంగా ఉంది. ఈ భారం నుంచి నాకు ఉపశమనం కలిగితే చాలు, నాకేమి సంభవించినా నేను లెక్కచెయ్యను.

లోకజ్ఞాని: ఇంతకీ నీ వీపుమీద భారం ఉందన్న సంగతి నీకెలా తెలిసింది?

క్రైస్తవుడు: నా చేతిలో ఉన్న ఈ పుస్తకం చదవడం ద్వారానే.

లోకజ్ఞాని: అదే అనుకున్నాను. తక్కిన బలహీనుల మాదిరిగానే, నీక్కూడ అలాగే జరిగిందన్నమాట. కొంతమంది తమకు అర్థం కాని లోతైన సంగతుల జోలికి వెళ్లి, అకస్మాత్తుగా ఇదిగో నీలాంటి పరిస్థితిలో పడిపోతారు. ఇది మనుష్యుల్ని అధైర్యపరచడమే కాక, తమకు తెలియనివాటికోసం అన్వేషిస్తూ అనవసరమైన సాహసాలకు ఒడిగట్టేలా కూడ చేస్తుంది.

క్రైస్తవుడు: నాకు కావలసిందేమిటో నాకు బాగా తెలుసు– ఈ భారం నుంచి విముక్తుణ్ణి కావడమే నాకు కావాలి.

లోకజ్ఞాని: అయినా, అది కష్టాలు, అపాయాలతో కూడుకున్నదని చూస్తూనే, ఆ ఉపశమనాన్ని ఇలాగే పొందాలని ఎందుకు ప్రయత్నిస్తున్నావ్? ఇప్పుడు, (నా మాట వినే ఓపిక నీకు ఉంటే) నీవు కోరుకున్నది సాధించే మార్గంలో నిన్ను నేను నడిపించగలను. నీవున్న ఈ దారిలో నీకు ఎదురయ్యే అపాయాలకు, శోధనలకు నీవు గురికాకుండానే అది నీవు సాధించేలా చెయ్యగలను. అవును, ఉపశమనం అందుబాటులోనే ఉంది. దీనికితోడు, నేను చెప్తున్నాను కదా, అపాయాలు, శ్రమలకు బదులు నీవు మరింత భద్రత, స్నేహం, సంతృప్తిని కనుగొంటావు సుమా.

క్రైస్తవుడు: అయ్యా, నాకు కావలసింది అదే. దయచేసి మీరు ఆ రహస్యం నాకు చెప్తారా?

లోకజ్ఞాని: సరే, అదుగో ఆ గ్రామంలో (దానిపేరు నైతికత) చట్టబద్ధత అనే పేరుగల మనిషి ఉంటాడు. చాలా వివేకవంతుడు, మంచి పేరుప్రతిష్టలు గలవాడు, నీవు మోస్తున్నటువంటి భారాలను తొలగించడంలో అతనికి మంచి నైపుణ్యం ఉంది. అవును, నాకు తెలిసినంతమట్టుకు ఇలాంటి విషయాల్లో అతడు ఎంతోమందికి మేలుచేశాడు. అంతేకాదు, ఇలాంటి బరువులు మోస్తూ, ఒకింత సమతుల్యం కోల్పోయినవారిని బాగుచెయ్యగలడు. అతని వద్దకు వెళ్లి నీవు వెంటనే సహాయం పొందవచ్చు.

అతని ఇల్లు ఇక్కడికి ఒక మైలు కంటే ఎక్కువదూరం ఉండదు; ఒకవేళ అతడు ఇంటివద్ద లేకపోయినా, అతనికి నాగరికత అనే ఓ అందమైన కొడుకు ఉన్నాడు. అతడు కూడ అచ్చం పెద్దాయనతో సమానంగా నీకు సహాయపడగలడు. అక్కడ నీవు నీ భారం నుంచి నెమ్మది పొందవచ్చు; ఒకవేళ నీకు నీ పాత ఇంటికి తిరిగివెళ్లాలని అనిపించకపోతే, నీ భార్యా పిల్లలను పిలిపించుకొని నైతికత అనే గ్రామంలో మీరు నివసించవచ్చు. ఇప్పుడు అక్కడ ఖాళీ ఇళ్లున్నాయి, వాటిలో ఏదైనా ఒకదాన్ని సరసమైన ధరకు నీవు కొనుక్కోవచ్చు; నిత్యావసర వస్తువులన్నీ అక్కడ సమృద్ధిగా, తక్కువ ధరల్లోనైనా మంచివి లభిస్తాయి; నిజాయితీపరులైన ఇరుగుపొరుగువాళ్లు తప్పక ఉంటారు– వెరసి నీ జీవితం సుఖమయం అవుతుంది.

ఒక్క క్షణం క్రైస్తవుడు ఎటూ తేల్చుకోలేకపోయాడు, కానీ వెంటనే ఈ ముగింపుకొచ్చాడు. "ఈ పెద్దమనిషి చెప్పింది నిజమే అయితే, నేను చెయ్యగల తెలివైన పని అతని సలహా పాటించడమే." ఈ ముగింపుకు వచ్చినమీదట, లోకజ్ఞాని గారితో అతడిలా అన్నాడు: "అయ్యా, మీరు చెప్పిన ఈ మనిషి ఎక్కడ ఉంటున్నాడు, అతని ఇంటికి నేను ఎలా వెళ్లగలను?"

లోకజ్ఞాని: అక్కడ ఓ పెద్ద కొండ ఒకటి ఉంది, నీకు కనిపిస్తోందా?

క్రైస్తవుడు: ఆ, కనిపిస్తోంది.

లోకజ్ఞాని: నువ్వా కొండ దగ్గరకు వెళ్లు, అక్కడ నీకు ముందుగా కనిపించే ఇల్లే అతనిది.

సీనాయి పర్వతం వద్దకు వస్తాడు

ఆవిధంగా, క్రైస్తవుడు తన మార్గాన్ని విడిచి, చట్టబద్ధంగారి ఇంటికి వెళ్లే దారిన బయలుదేరతాడు. అయితే అతడా కొండ దగ్గరకు చేరుకోగానే అది చాలా ఎత్తుగా ఉన్నట్లనిపించింది. తన ప్రక్కనే ఉన్న కొండచెరియ దారిమీదకు చొచ్చుకొని వచ్చినట్లుంది. ఆ కొండచెరియ తనమీద ఎక్కడ పడిపోతుందో నన్న భయంతో క్రైస్తవుడు దానికి సమీపంగా ఇక ఏమాత్రం అడుగు ముందుకు వెయ్యలేకపోయాడు. ఏం చెయ్యాలో తెలియక, అతడు అక్కడే నిలబడిపోయాడు. అతని భారం మునుపటికంటే అధికమైనట్లనిపించింది. ఆ కొండలోనుండి బయటికొచ్చిన అగ్ని మెరుపులు అతనికి భయంతో ముచ్చెమటలు పట్టించాయి. లోకజ్ఞాని సలహా పాటించినందుకు అతడు ఎంతగానో విచారించాడు.

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

తిరిగి కలిసిన సువార్తికుడు

అప్పుడు అతనివైపుగా వస్తున్న సువార్తికుణ్ణి చూసి, క్రైస్తవుడు సిగ్గుపడ్డాడు. సువార్తికుడు తీక్షణంగా చూస్తూ, అతన్ని గద్దించసాగాడు.

"క్రైస్తవుడా, నువ్విక్కడ ఏం చేస్తున్నావ్?" ఏం చెప్పాలో క్రైస్తవుడికి తెలియలేదు. అతనికి నోరు పెగలడం లేదు. అప్పుడు సువార్తికుడన్నాడు, "నాశనపురం గోడ బయట ఏడుస్తూ నాకు కనిపించింది నువ్వే కదూ?"

క్రైస్తవుడు: అవునయ్యా, అది నేనే అని ఒప్పుకుంటున్నాను.

సువార్తికుడు: చిన్న ద్వారం వద్దకు వెళ్లమని నేను నీకు చెప్పలేదా?

క్రైస్తవుడు: అవును, సహోదరుడా, నువ్వు చెప్పావు.

సువార్తికుడు: మరి అంత త్వరగా నీవు దారితొలగిపోవడం ఎలా జరిగింది? ఇప్పుడు నీవు ఆ దారినుండి చాలా దూరం తొలగిపోయావు.

క్రైస్తవుడు: నేను ఆ నిరాశల రొంపిలో నుండి బయటపడ్డ మరుక్షణమే ఒకరిని కలిశాను. ఆ కొండ అవతల గ్రామానికి వెళితే, అక్కడ నా భారాన్ని తొలగించగల ఒక పెద్దమనిషిని నేను కలుసుకుంటానని అతడు నన్ను నమ్మించాడు.

సువార్తికుడు: నువ్వు ఎవరిని కలిశావు? అతడు ఎలాంటి వ్యక్తి?

క్రైస్తవుడు: అతడు మంచి నిజాయితీపరుడిలా కనిపించాడు, నాతో చాలాసేపు వాదించి, చివరికి తన సలహా పాటించేలా నన్ను ఒప్పించాడు. అందుకే నేనిక్కడికి వచ్చాను. కానీ ఇదిగో దారిమీదికి పొడుచుకొచ్చి, అగ్నిని, పొగను విరజిమ్ముతున్న ఈ భయంకరమైన కొండను చూచి, నేను నశించిపోతానేమో నన్న భయంతో ఆగిపోయాను.

సువార్తికుడు: ఆ మనిషి నీకు ఏం చెప్పాడు?

క్రైస్తవుడు: నేను ఎక్కడికెళుతున్నది చెప్పమని అడిగాడు. నేనతనికి చెప్పాను.

సువార్తికుడు: అప్పుడు అతనేం చెప్పాడు?

క్రైస్తవుడు: తక్షణమే నా మీద ఉన్న భారాన్ని తీసిపారవేయమని చెప్పాడు. నాకు కావలసిన ఉపశమనం అదేనని నేను చెప్పాను. నాకు విముక్తి లభించే స్థలాన్ని కనుగొనేందుకు తగిన ఆదేశాలు పొందటం కోసమే నేను ఒకానొక చిన్న ద్వారం వద్దకు బయలుదేరానని చెప్పాను. అప్పుడు అతడన్నాడు, నీవు చూపించిన దారివంటి ఎన్నో కష్టాలతో కూడినది కాక మరింత శ్రేష్టమైన మార్గం చూపిస్తానన్నాడు. నేను ఆ నిరాశల రొంపిలో పడ్డాను గనుక, అతని మాటలు

వినేందుకు మొగ్గుచూపాను. ఎందుకంటే, "ఈ మార్గం ప్రజల భారాలనుండి ఉపశమనం కలిగించే నైపుణ్యం కలిగిన ఓ పెద్దమనిషి ఇంటికి నిన్ను నడిపిస్తుంది" అని అతడు నాతో అన్నాడు. నేను ప్రయాణిస్తున్న మార్గంలో నాకు ఏ మాత్రం ఉపశమనం కలుగక పోగా, మరిన్ని కష్టాలు ఎదురయ్యాయని గుర్తించాను గనుక అతని మాటలు నమ్మి, అక్కడినుండి తొలగి, త్వరలోనే నాకు విముక్తి కలుగుతుందని భావించి ఈ మార్గంలో ప్రవేశించాను. అయితే, నేనీ కొండ దగ్గరకు వచ్చి, ఇంతకు మించి ముందుకు సాగడం ఎంత అపాయకరమో చూశాక, నా ప్రాణం పోగొట్టుకుంటానేమో నన్న భయంతో ఆగిపోయాను. ఇప్పుడు ఏం చెయ్యాలో నాకు తెలియదు.

"నేను నీకు దేవుని వాక్యం అందించేవరకు ఒక్క క్షణం ఆగు." అన్నాడు సువార్తికుడు. క్రైస్తవుడు తన భారం క్రింద వణికిపోతూ నిలబడ్డాడు.

అప్పుడు సువార్తికుడు అతనితో ఇలా అన్నాడు, "నీతో మాట్లాడువానిని తిరస్కరించకుండ చూచుకో; భూమిమీద మాటలాడినవానిని తిరస్కరించినవారే తప్పించుకోలేకపోతే, పరలోకం నుండి మాట్లాడువాని మాటలు తిరస్కరించిన మనం తప్పించుకోవడం మరీ కష్టం."[2] "ఇప్పుడు నీతిమంతులు విశ్వాస మూలముగా జీవించవలెను; అయితే ఎవడైనను వెనుకతీసినయెడల వానియందు నా ఆత్మ ఏ మాత్రమును సంతోషించదు"[3] అని కూడ చెప్పాడు. ఆ తర్వాత సువార్తికుడు ఈ మాటల్ని అతనికి అన్వయిస్తూ, "నీవు కష్టాలలోనికి పరుగులు తీస్తున్న మనిషివి. నీవు సర్వోన్నతుని ఆలోచనను పెడచెవిన పెట్టనారంభించి, సమాధానకరమైన మార్గం నుంచి వెనుకడుగు వేసి, దాదాపుగా నీ ప్రాణాలమీదికి తెచ్చుకున్నావు" అని చెప్పాడు.

అప్పుడు క్రైస్తవుడు "అయ్యో నాకు శ్రమ, నేను నశించిపోయాను" అంటూ అతని పాదాలమీద పడి రోధించాడు.

అప్పుడు సువార్తికుడు కుడిచేత పట్టుకొని దగ్గరకు తీసుకొని, "మనుష్యులు చేయు ప్రతివిధమైన పాపము, దేవదూషణ క్షమింపబడును... అవిశ్వాసివి కాక, నమ్ము." అప్పుడు క్రైస్తవుడు తెప్పరిల్లి, సువార్తికుని ఎదుట నిలబడ్డాడు.

సువార్తికుడు: ఇప్పుడు నేను చెప్పబోయే సంగతులను మరింత శ్రద్ధగా ఆలకించు. నిన్ను తప్పుత్రోవను నడిపించింది ఎవరో, అతడు నిన్ను ఎవరి వద్దకు నడిపించాడో ఆ వివరాలన్నీ నీకు చూపిస్తాను. మైదానంలో నిన్ను కలిసిన ఆ వ్యక్తి పేరు లోకజ్ఞాని. అతనికి ఆ పేరు సరిగ్గానే పెట్టారు. ఎందుకంటే అతడు ఈ లోకపు విషయాల్లో జ్ఞానవంతుడే గాని, రాబోయే జీవితం గురించి అతనికి ఏమీ తెలియదు. ఇహలోక బోధ అతణ్ణి సిలువ నుండి కాపాడుతుంది గనుక అతడు దాన్ని ఎంతో ప్రేమిస్తాడు. కాబట్టి అతడు ఎల్లప్పుడూ నైతికత అనే పట్టణంలో ఉండే గుడికి వెళతాడు. అతడు శరీరానుసారమైన మనస్సు గలవాడు కనుక, నీ గ్రంథంలో ఉన్న సత్యాన్ని వక్రీకరించేందుకు ప్రయత్నిస్తాడు. ఇతని సలహాలో నీవు పూర్తిగా అసహ్యించుకోవలసిన మూడు సంగతులున్నాయి:

2. హెబ్రీయులకు 12:25 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8
3. హెబ్రీయులకు 10:38

1) అతడు నిన్ను సరైన మార్గం నుండి తప్పించడం

2) సిలువను హేయమైనదిగా చూపించేందుకు అతడు చేసిన ప్రయాసం

3) నిన్ను మరణానికి నడిపించే మార్గంలో అతడు నీ అడుగులను నిలపడం.

ముందుగా, అతడు నిన్ను సత్యమార్గంలో నుండి తొలగించడాన్ని నీవు అసహ్యించుకోవాలి. ఎందుకంటే ఇది ఒక తిరిగి జన్మించని వ్యక్తి సలహాకోసం దేవుని సలహాను తిరస్కరించడంతో సమానం. నీ ప్రభువైన యేసు ఇలా అంటున్నాడు: "ఇరుకు మార్గమున ప్రవేశించుటకు ప్రయాసపడుము"[4] "ఇరుకు మార్గము జీవమునకు నడుపును, దానిని కనుగొనువారు కొందరే."[5] ఈ చిన్న ద్వారము నుండి, మరియు జీవమునకు నడిపించు మార్గము నుండి ఈ దుర్మార్గుడు నిన్ను దాదాపుగా నాశనమునకు దగ్గరగా చేర్చిన మార్గం వైపుకు నడిపించాడు. కావున సరైన మార్గము నుండి అతడు నిన్ను తప్పించుటను ద్వేషించి, సరైన మార్గమునుండి అంత సులభంగా దారితొలగినందుకు నిన్ను నీవు నీచునిగా ఎంచుకో.

రెండవది, సిలువను నీకు అసహ్యముగా కనబడునట్లు చేయుటకై అతడు పడ్డ ప్రయాసమును నీవు హేయముగా ఎంచాలి. ఎందుకనగా ఐగుప్తు ధనముకంటె సిలువకు ప్రాధాన్యత ఇవ్వవలెనని నీవు నేర్చుకున్నావు. ఇదియు కాక, తన ప్రాణమును రక్షించుకొనగోరువాడు దానిని పోగొట్టుకొనును అని మహిమరాజు నీకు చెప్పాడు. కాబట్టి, ఏ మార్గమైతే లేకుండ మనము నిత్యజీవమును పొందలేమో – ఆ మార్గము మరణమునకు నడిపించు మార్గమని చెప్పు బోధయే నిజానికి నాశనకరమైన బోధ. అందుచేత నీవు ఈ బోధను అసహ్యించుకోవాలి.

మూడవది, అతడు నిన్ను ఎట్టి మనిషి యొద్దకు పంపినాడో, అతడు నీ భారమును తొలగించుటకు గాని, నిత్యనాశనము నుండి నిన్ను తప్పించుటకు గాని అతడు ఎంత అశక్తుడో కూడ నీవు గమనించవలెను. కర్మకాండుడనే ఆ వ్యక్తి ఒక దాసురాలి కుమారుడు. ఆమె తన బిడ్డలతో సహా దాస్యములో ఉన్నది. దృశ్యరూపకంగా చూస్తే, ఒక విధంగా నీ మీదికి దూసుకొచ్చిన ఆ పెద్ద కొండయైన సీనాయి పర్వతమే. అది నీ మీద పడుతుందని నీవు భయపడ్డావు కదా. ఆమె తన బిడ్డలతో సహా అందరూ దాస్యంలో ఉంటే, వారిలో ఎవరైనా నిన్ను స్వతంత్రులను చేస్తారని ఎలా ఆశించగలవు? సీనాయి పర్వతము పైన పుట్టిన ఈ కర్మకాండుడు నీ భారము నుండి నీకు విడుదల కలుగజేయలేడు. పాపభారము నుండి అతడు ఇంతవరకూ ఎవరికీ విడుదల నివ్వలేదు, ఎప్పటికీ ఇవ్వలేడు.

ధర్మశాస్త్రపు క్రియలద్వారా నీవు నీతిమంతుడవుగా తీర్చబడలేవు; ధర్మశాస్త్ర క్రియల ద్వారా ఎవడూ తన పాపము నుండి శుద్ధినొందలేడు, తన భారమునుండి ఉపశమనము పొందలేడు. కాబట్టి లోకజ్ఞాని అనేవాడు అన్యుడు, కర్మకాండుడు మోసగాడు; ఇక అతని కుమారుడైన మర్యాదస్తుడి తెచ్చిపెట్టుకున్న నవ్వులను ప్రక్కనపెడితే, అతడు కూడ జిత్తులమారి, గనుక ఎవరికీ

4. లూకా 13:24 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8
5. మత్తయి 7:13,14

సహాయం చెయ్యలేడు. నన్ను నమ్ము, బుద్ధిహీనులైన ఈ మనుష్యుల గురించి నీవు విన్నదాంట్లో ఏ మాత్రం సత్యంలేదు. సరికదా, ఆత్మలను మోసపుచ్చి, రక్షణమార్గమునుండి వారిని తప్పుదారి పట్టించడమే వారి ఉద్దేశం. నిన్ను మరులుకొల్పి, నేను పంపించిన మార్గం నుండి నిన్ను తొలగించేందుకే వారీ పనిచేశారు.

ఇవి చెప్పిన తర్వాత, తాను చెప్పిన మాటలను నిర్ధారించేందుకై సువార్తికుడు ఆకాశము తట్టు పెద్దగా కేకలువేశాడు. అందువలన వారు నిలబడివున్న పర్వతములోనుండి అగ్ని, మాటలు వెలువడ్డాయి. ఇది చూచిన క్రైస్తవుని ఒళ్లు గగుర్పొడిచి, రోమాలు నిక్కబొడుచుకున్నాయి. ఆ మాటలు బిగ్గరగా తేటగా వినిపించాయి; "ధర్మశాస్త్రము విధించిన క్రియలకు సంబంధులందరు శాపమునకు లోనైయున్నారు. ఎందుకనగా ధర్మశాస్త్రగ్రంథమందు వ్రాయబడిన విధులన్నియు చేయుటయందు నిలుకడగా ఉండని ప్రతివాడును శాపగ్రస్తుడు అని వ్రాయబడియున్నది."[6]

ఇప్పుడు క్రైస్తవుడు తనకు మరణమే శరణమని భావించినవాడై, అతడు లోకజ్ఞానిని కలిసిన సమయాన్ని కూడ ఆక్షేపిస్తూ, అతని సలహాను పాటించినందుకు తనను తానే ఒక బుద్ధిలేని మూర్ఖుడిగా ఎంచుకుంటూ, దయనీయమైన స్వరముతో ఏడ్వసాగాడు. లోకజ్ఞాని వాదనలు కేవలం శరీరానుసారమైన మనస్సులోనుండి పుట్టినవే అయినా, అవి తన మీద ఎంతగా ప్రభావం చూపాయంటే, తాను సరైన మార్గాన్ని విడిచిపెట్టి, లోకపు మార్గంలో ప్రవేశించేందుకు సరిపోయినంత ప్రభావం చూపాయి గనుక దానిగురించి ఆలోచించడానికే సిగ్గుపడుతున్నానని కూడ అతడు ప్రకటించాడు. ఇలా చేసిన మీదట, అతడు మరల సువార్తికుని జ్ఞానవాక్కులకు, ఆత్మీయ ఉపదేశానికి అప్పగించుకొని, పరలోకపు రాజుపట్ల సంపూర్ణ భక్తిని కనపరచాడు.

క్రైస్తవుడు: అయ్యా, మీరేమనుకుంటున్నారు? ఇక నాకేమైనా నిరీక్షణ ఉన్నదంటారా? ఇప్పుడు నేను వెనక్కి వెళ్లి, ఎక్కడ విడిచిపెట్టానో అక్కడినుంచి బయలుదేరి ఆ చిన్న ద్వారం వద్దకు వెళ్లగలనంటారా? లేక నా యీ అపనమ్మకత్వమును బట్టి విడిచివేయబడి, ఆ ద్వారము వద్దనుండి సిగ్గుతో తిరిగి వెనక్కి పంపివేయబడతానా? నేనీ లోకజ్ఞాని సలహాను పాటించి, సరైన మార్గమునుండి తొలగినందుకు నిజంగా బాధపడుతున్నాను, కానీ నా పాపాలు క్షమించబడతాయా?

సువార్తికుడు: నీ పాపము చాలా గొప్పది. అందులో రెండు దుష్టత్వము లున్నాయి. నీవు సరైన మార్గమును విడిచిపెట్టి, నిషేధించబడిన మార్గంలో నడిచావు. అయినాసరే, ఆ ద్వారము వద్ద ఉన్న మానవుడు నిన్ను చేర్చుకుంటాడు. సర్వమానవాళి పట్ల అనుగ్రహము చూపే గొప్ప దయామయుడాయన. అయితే, నీవు మరల దారి తొలగకుండ మాత్రం జాగ్రత్త వహించు. ఎందుకంటే, "ఆయన కోపము త్వరగా రగులుకొనును... అప్పుడు మీరు త్రోవ తప్పి నశించెదరు"[7]

6. గలతీయులకు 3:10
7. కీర్తనలు 2:12

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

అధ్యాయం 2
క్రైస్తవుడు మంచి మార్గమునకు తిరిగి వచ్చుట

అప్పుడు క్రైస్తవుడు మంచిమార్గమునకు తిరిగి వెళ్లేందుకు నిశ్చయించుకున్నాడు. సువార్తికుడు చిరునవ్వుతో అతనికి చెయ్యందించి, "దేవుడు నిన్ను దీవించును గాక" అని చెప్పాడు. కాబట్టి అతడు హడావుడిగా బయలుదేరి, దారిలో ఎవరితోనూ మాట్లాడేందుకు తిరస్కరించాడు. అతడు నిషేధిత భూభాగంలో తిరుగుతున్నవాడిలా నడిచాడు. సువార్తికుడు వెళ్లమని అతనికి సూచించిన మార్గంలోనికి వెళ్లేంతవరకు అతడు ఏ మాత్రం సురక్షితంగా లేనట్లు భావించాడు.

తిరిగి ఆ మార్గంలో ఎట్టకేలకు చిన్న ద్వారం వద్దకు చేరుకున్నాడు. ఆ ద్వారం మీద పెద్ద అక్షరాలతో ఇలా వ్రాయబడి వుంది: **"తట్టుడి, మీకు తెరువబడును."**

చిన్నద్వారమున ప్రవేశించుట

క్రైస్తవుడు తట్టాడు. జవాబేమీ రాలేదు. అతడు మరల మరల తట్టాడు. ఎవరూ రాలేదు. "నేనిప్పుడు లోపల ప్రవేశించవచ్చా? దయచేసి నాకోసం తలుపులు తెరుస్తారా? ఇంతవరకూ నేను అయోగ్యుడినైన తిరుగుబాటు దారుడినే కాని, నన్ను క్షమించి, లోనికి అనుమతించినట్లయితే, నేను దేవుని స్తుతించడం ఎన్నడూ మానను" అంటూ కేకలు వేశాడు.

ఎట్టకేలకు "అనుగ్రహకారి" అనేవ్యక్తి ద్వారం వద్దకు వచ్చాడు. గంభీరమైన స్వరముతో ఆయన అడిగాడు, "ఎవరక్కడ, నీవు ఎక్కడినుండి వచ్చావు, నీకేమి కావాలి?"

క్రైస్తవుడు: నేనొక భారము మోయుచున్న దీన పాపిని. నేను నాశనపురము నుండి వచ్చాను. రాబోవు దేవుని ఉగ్రతనుండి తప్పించుకొనుటకై సీయోను పర్వతం వద్దకు వెళ్లాలనుకుంటున్నాను. ఈ ద్వారం గుండా వెళితే సీయోను పర్వతం వస్తుందని తెలుసుకున్నాను. కాబట్టి, మీరు నన్ను లోనికి అనుమతిస్తారో లేదో తెలుసుకోవాలను కుంటున్నాను.

అనుగ్రహకారి: అవును, తప్పక తెరుస్తాను. వెంటనే అనుగ్రహకారి ద్వారము తెరిచాడు, క్రైస్తవుడు లోనికి ప్రవేశిస్తుండగా, అతని చేయిపట్టుకొని, ఒక్క ఉదుటన లోనికి లాగాడు. "అలా ఎందుకు చేశావు?" అడిగాడు క్రైస్తవుడు. "అక్కడ బయట, ఈ ద్వారానికి కొద్ది దూరంలోనే బయల్జెబూబు, అతని మనుష్యులు కావలికాస్తున్న బలమైన కోట ఒకటుంది; అక్కడి నుండి వారు ఈ ద్వారమున

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

ప్రవేశించు వారిని అంగవికలురుగా చేయాలనో లేక లోనికి ప్రవేశించకుండ నివారించడానికో బాణాలు వేస్తుంటారు" అని అనుగ్రహకారి వివరించాడు.

"నేను ఆనందముతో వణకుతున్నాను" అన్నాడు క్రైస్తవుడు. అతడు సురక్షితంగా లోపల చేరాక, నిన్ను ఇక్కడికి నడిపించింది ఎవరు అని అనుగ్రహకారి క్రైస్తవుడి నడిగాడు.

క్రైస్తవుడు: అయ్యా, ఇక్కడికి వచ్చి తలుపు తట్టమని సువార్తికుడు నాకు చెప్పాడు. నేను ఏమి చెయ్యవలసింది మీరు నాకు తెలియపరుస్తారని కూడ చెప్పాడు.

అనుగ్రహకారి: తెరువబడిన ద్వారము నీ ఎదుట ఉన్నది, దానిని ఎవడూ మూసివేయలేడు.

క్రైస్తవుడు: ఇప్పుడు నేను నా కష్టాలకు ఫలితం అనుభవిస్తున్నాను.

అనుగ్రహకారి: అయితే, ఇక్కడికి నీవు ఒక్కడివే వచ్చావేమిటి?

క్రైస్తవుడు: ఎందుకంటే, నా పొరుగువారిలో ఎవ్వరూ తమకు ఎదురుకానున్న అపాయాన్ని నేను చూసినట్లుగా వారు చూడలేక పోయారు.

అనుగ్రహకారి: నీవు వస్తున్న సంగతి వారిలో ఎవరికైనా తెలుసా?

క్రైస్తవుడు: అవును, నా భార్య, పిల్లలు నేనిక్కడికి రావడం చూశారు, తిరిగి రమ్మని నా వెంటపడి పిలిచారు. మా పొరుగువారిలో కొందరు కూడ అక్కడ నిలబడి నన్ను వెనక్కి వచ్చేయమని పిలుస్తూ ఉన్నారు. అయితే నా చెవుల్లో వేళ్లు పెట్టుకొని నా దారిన నేను వచ్చేశాను.

అనుగ్రహకారి: మరి నిన్ను తిరిగివెళ్లేందుకు ఒప్పించడానికి వాళ్లలో ఎవ్వరూ నీ వెంట రాలేదా?

క్రైస్తవుడు: ఆ, మా పొరుగువారిలో మొండి, మెత్తన అనే ఇద్దరు నా వెంట వచ్చారు. నన్ను ఒప్పించడం వారి వల్ల కాదని తెలిశాక, మొండి అనేవాడు బాగా తిట్టుకుంటూ తన ఇంటికి తిరిగి వెళ్లిపోగా, మెత్తన మరికొంత దూరం నాతోపాటు వచ్చాడు.

అనుగ్రహకారి: మరి అతడు నీతో ఎందుకు రాలేదు?

క్రైస్తవుడు: నిరాశల రొంపి వరకూ మేమిద్దరం కలిసే వచ్చి, అందులో పడిపోయాం. ఆ తర్వాత మెత్తన నిరుత్సాహపడి, ముందుకు కొనసాగే సాహసం చెయ్యలేకపోయాడు. తన ఇల్లు ఉన్నవైపునకే బయటికి దుమికి, అతడిలా అన్నాడు: "నా బదులు కూడా నీవే ఆ మంచి దేశాన్ని అనుభవించు" అంటూ మొండి వెళ్లినదారినే వెళ్లాడు; అంచేత, అతడు లేకుండనే నేను వచ్చాను.

అనుగ్రహకారి: అయ్యో, ఎంత దౌర్భాగ్యుడు! అతని దృష్టిలో దివ్యనగరానికి ఏ మాత్రం విలువ లేదన్నమాట. మార్గంలో ఎదురయ్యే ఆ కొద్దిపాటి కష్టాలకున్నంత విలువకూడ లేదా దివ్య నగరానికి?

క్రైస్తవుడు: నిజమే, నా గురించి నేను సత్యం చెబితే, నాకూ, అతనికి మధ్య పెద్ద తేడా ఏమీ

లేదనిపిస్తుంది. అతడు తన ఇంటికి తిరిగి వెళ్లాడన్నది నిజమే కాని, నేను కూడ లోకజ్ఞాని అనే ఒకని తప్పుడు వాదనలచేత ఎంతగానో ఒప్పించబడి మరణమునకు దారితీయు మార్గంలో నడిచేందుకు ప్రక్కదారి పట్టాను.

అనుగ్రహకారి : ఓహో, నువ్వతన్ని కలిశావా? కర్మకాండుడనే వ్యక్తివద్ద శరీరానుసారమైన నెమ్మది పొందమని అతడు నీకు వ్యర్థమైన సలహా ఇచ్చివుంటాడే! వాళ్లిద్దరూ ఘోరమైన మోసగాళ్లు. ఇంతకీ నీవు అతని సలహా పాటించావా?

క్రైస్తవుడు: నేను ధైర్యం చెయ్యగలిగినంత వరకు పాటించాను. అతని సూచనల మేరకు కర్మకాండుని ఇల్లు వెతుక్కుంటూ వెళ్లి, అతని ఇంటి ప్రక్కనే ఉన్న పెద్ద కొండను చూచి, అది నామీద పడుతుందేమో నని భయపడ్డాను. అక్కడ నేను బలవంతంగా అడ్డగించబడ్డాను.

అనుగ్రహకారి : దాని క్రిందపడి ముక్కలు ముక్కలుగా నలిగిపోకుండ క్షేమంగా తప్పించుకున్నావు. ఆ కొండ అనేకమంది యాత్రికులకు మృత్యువుగా మారింది, ఇంకా ఎంతోమందికి అది మృత్యువుగానే ఉంటుంది.

క్రైస్తవుడు: అక్కడ నా వద్దకు సువార్తికుడు రాకపోతే, నా గతి ఏమైయుండేదో నిజంగా నాకు తెలియదు. సరిగ్గా ఆ దిక్కుతోచని స్థితిలో నేను అల్లాడుతున్న సమయంలోనే అతడు రావడం నిజంగా దేవుని కనికరమే; లేకపోతే, నేనిక్కడికి ఎప్పటికీ రాగలిగేవాడిని కాదు. అయితే ఇప్పుడు, అలాంటివాడనైన నేను ఇక్కడ ఉన్నాను– మీతో మాట్లాడుతూ ఇక్కడ ఉండటం కంటే మరణానికే ఎక్కువ పాత్రుడను. ఆహా, క్షమాపణా ద్వారంలోపలికి ప్రవేశించే అనుమతి లభించడం నిజంగా నాకు ఎంత మేలు జరిగింది!

అనుగ్రహకారి : ఇక్కడికి వచ్చేవారిని మేము ఎన్నడూ తృణీకరించం. వచ్చేముందు వారు ఏమైనా చేయనీ, వారు ఎంతమాత్రమూ బయటికి త్రోసివేయబడరు.[1] ఇక, నా మంచి యాత్రికుడా, మరికొంత దూరం నాతో రా, నీవు వెళ్లవలసిన మార్గం నీకు చూపిస్తాను. అదిగో అక్కడ చూడు. ఆ ఇరుకు మార్గం నీకు కనబడుతోందా? అదే నీవు వెళ్లవలసిన మార్గం. పూర్వకాలంలో ఆ దారిన పితరులు, ప్రవక్తలు, క్రీస్తు, ఆయన అపొస్తలులు ప్రయాణించారు; అది ఎంతో తిన్నని మార్గం.

క్రైస్తవుడు: అయితే, ఒక పరదేశి దారితప్పిపోగల మలుపులు, ఇరుకు దారులు అక్కడ లేనేలేవా?

అనుగ్రహకారి : ఆ, వున్నాయి. దీనినుంచి ప్రక్కకు వెళ్లే ఉపదారులు చాలానే ఉన్నాయి. అయితే తప్పుమార్గం నుంచి సరైన మార్గమేదో నీవు గుర్తించగలవు. ఎందుకంటే, సరైన మార్గమొక్కటే తిన్నగా ఇరుకైనదిగా ఉంటుంది.

1. యోహాను 6:37 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

అప్పుడు క్రైస్తవుడు అనుగ్రహకారిగారిని అడిగాడు, తన వీపుమీది భారాన్ని ఆయన తొలగించగల డేమోనని. ఎందుకంటే అతడా భారాన్ని ఇంకా మోస్తూనే ఉన్నాడు, పైగా ఇతరుల సహాయం లేకుండ దాన్ని తొలగించుకోవడం సాధ్యం కాదు. అనుగ్రహకారి అతనికి ఈ సలహా ఇచ్చాడు. "నీవు విముక్తి స్థలానికి చేరేవరకు మరికొంతసేపు ఈ భారాన్ని మోయుటకు ఇష్టపడు. అప్పుడది నీ భుజాలమీది నుంచి దానికదే జారిపడిపోతుంది."

ఇప్పుడు క్రైస్తవుడు తన ప్రయాణానికి సిద్ధపడసాగాడు. అందుచేత అనుగ్రహకారి ఇలా వివరించాడు. "ఈ ద్వారం నుండి నీవు కొంతదూరం వెళ్లాక, వివరణకర్త ఇల్లు కనబడుతుంది. అతడు నీకు స్వాగతం పలికి ఎంతో విలువైన సమాచారం నీకు అందిస్తాడు." అప్పుడు క్రైస్తవుడు తన స్నేహితునికి వీడ్కోలు పలికి, తన దారిన వెళ్లిపోయాడు.

వివరణకర్త ఇంటికి చేరుట

ఒక గంటసేపు నడిచిన తర్వాత అతడో పెద్ద ఇంటివద్దకు వచ్చాడు. వివరణకర్త ఇల్లు అదే అయ్యుంటుందనుకున్నాడు. అనేకసార్లు అతడు తలుపు తట్టిన మీద లోపలినుంచి ఒక స్వరం వినపడింది, "ఎవరక్కడ?"

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

క్రైస్తవుడు: "ఇక్కడ కొన్ని ఆదేశాలను పొందడం కోసం ఈ ఇంటికి చెందినవారి స్నేహితుని సూచన మేరకు వచ్చిన యాత్రికుణ్ణి నేను. ఈ యింటి యజమానితో మాట్లాడాలనుకుంటున్నానండీ." త్వరలోనే వివరణకర్త వచ్చి, అతనికి ఏమి కావాలో అడిగాడు.

క్రైస్తవుడు: అయ్యా, నా పేరు క్రైస్తవుడు. నేను నాశనపురానికి చెందినవాడను, సీయోను పర్వతానికి వెళ్లే దారిలో ఉన్నాను. ఇక్కడ మిమ్మల్ని కలిస్తే, నా ప్రయాణానికి అవసరమైన దివ్యమైన సంగతులను చూపిస్తారని, ఆ చిన్న ద్వారం వద్ద ఉన్న మంచివ్యక్తి నాకు చెప్పాడు.

వివరణకర్త: "ఓ, తప్పకుండ. లోపలికి రా. నీకు ప్రయోజనకరమైన సంగతులే చూపిస్తాను" అంటూ అతన్ని సాదరంగా ఆహ్వానించాడు. తర్వాత ఇంటిలోపలికి దారి చూపించమని అతని సేవకునికి ఆదేశించాడు. "నన్ను వెంబడించు" అంటూ సేవకుడు అతన్ని ఒక వ్యక్తిగత గదివద్దకు తీసుకెళ్లి, తలుపు తీయమని ఒక సేవకుడికి చెప్పాడు. తలుపు తెరువబడినప్పుడు, ఒక గంభీరమైన వ్యక్తి చిత్రాన్ని చూశాడు క్రైస్తవుడు. ఆ చిత్రంలోని వ్యక్తి ఆకాశంవైపు తేరిచూస్తున్నాడు. అతని చేతిలో శ్రేష్ఠమైన గ్రంథాలు పట్టుకొని ఉన్నాడు. సత్యము యొక్క వ్యక్తీకరణ అతని పెదవులపైన ఉన్నది. లోకము అతని వెనుక ఉన్నది. అతడు మనుష్యులను బ్రతిమాలుతున్నట్లు నిలబడివున్నాడు. అతని తలపైన ఒక బంగారు కిరీటం వ్రేలాడుతోంది. వివరణకర్త మౌనంగా ఉన్నాడు.

క్రైస్తవుడు: దీని భావమేంటి?

వివరణకర్త: ఈ మనిషి వేయిమందిలో ఒకడు. అపొస్తలుని మాటల్లో అతడు ఇలా చెప్పగలడు, "క్రీస్తునందు మీకు ఉపదేశకులు పదివేలమంది యున్నను తండ్రులు అనేకులు లేరు. క్రీస్తు యేసునందు సువార్త ద్వారా నేను మిమ్మును కంటిని."[2] "నా పిల్లలారా, క్రీస్తు స్వరూపము మీయందేర్పడు వరకు మీ విషయమై మరల నాకు ప్రసవవేదన కలుగుచున్నది."[3] అతని కన్నులు ఆకాశంవైపు ఎత్తబడి ఉండటం, తన చేతిలో శ్రేష్ఠమైన గ్రంథాలను పట్టుకొని, సత్యమును గూర్చిన ధర్మశాస్త్రము అతని పెదవులపై వ్రాయబడియుండుట చూశావు కదా, ఇవన్నీ అతడు చేసే పనిని చూపిస్తున్నాయి. చీకటి సంగతులను తెలుసుకొని పాపులకు తెలియజేయుటయే అతని పని; అందుకే అతడు మనుష్యులను బ్రతిమాలుతూ నిలబడివున్నాడు. అతని వీపు వెనుక లోకము ఉన్నట్లు, అతని తలపైన ఒక కిరీటము వ్రేలాడుతూ వున్నట్లు నీవు చూస్తున్నావే, అవి తన యజమాని సేవపట్ల అతనికున్న ప్రేమకారణంగా ప్రస్తుత సంగతులను తృణీకరించి, అల్పమైనవి ఎంచుతున్నట్లు సూచిస్తున్నాయి. రాబోయే లోకంలో మహిమ కిరీటం బహుమానంగా లభిస్తుందన్న నిశ్చయత అతనికుంది.

"ఇప్పుడు నేనీ చిత్రాన్ని నీకు ముందుగా ఎందుకు చూపించానంటే, నీ మార్గంలో నీకు ఎదురయ్యే కఠినమైన చోటెల్లా నీకు మార్గదర్శిగా ఉండేందుకై నీవు వెళ్తున్న స్థలానికి చెందిన ప్రభువులవారి అధికారం పొందిన వ్యక్తి ఇతడొక్కడే. కాబట్టి నేను నీకు చూపించిన వాటి విషయంలో

2. 1కొరింథీయులకు 4:15 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8
3. గలతీయులకు 4:19

అప్రమత్తంగా ఉండి, నీవు ఏమి చూశావో గుర్తుంచుకో, లేనియెడల, నిన్ను సరైన మార్గంలో నడిపిస్తున్నట్లు నటించేవారు ఎదురవుతారు. వారి మార్గం మరణానికి దారితీస్తుంది." అని చెప్పాడు వివరణకర్త.

తర్వాత అతన్ని ఒక విశాలమైన చావిడిలోనికి తీసుకెళ్లాడు. దాన్నిండా దుమ్ము పేరుకొనివుంది. వారొక క్షణం దాన్ని పరిశీలించిన మీదట, దాన్ని తుడిచేందుకు వివరణకర్త ఒక మనిషిని పిలిచాడు. అతడు ఊడ్చటం ఆరంభించేసరికి ఆ గదినిండా దుమ్ము అలుముకుంది, అందువల్ల క్రైస్తవుడికి ఊపిరాడనంత పనైంది. అప్పుడు వివరణకర్త అక్కడే నిలబడివున్న ఒక యువతిని పురమాయించి "నీళ్లు తెచ్చి గదిలో చల్లు" మని చెప్పగా, ఆమె అలాగే చేసింది. అప్పుడు దుమ్ము అణిగిపోగా ఆ యువతి గదిని ఊడ్చింది.

క్రైస్తవుడు: ఇది దేన్ని సూచిస్తోంది.

వివరణకర్త: ఈ చావిడి సువార్త ద్వారా, దేవుని కృపచేత ఎన్నడూ కడుగబడి, పరిశుద్ధపరచబడని మానవ హృదయం. మానవుణ్ణి సంపూర్ణముగా అపవిత్రపరచిన మూల పాపము, పతనాలే ఆ దుమ్ము. మొదట ఊడ్వటానికి ప్రయత్నించిన వ్యక్తి ధర్మశాస్త్రము. నీరు తెచ్చి పని చేసిన కన్యపడుచు సువార్త. మొదటివాడు తన శక్తికొద్ది పనిచేసినా, ఆ గదిని శుభ్రం చెయ్యలేకపోయాడు; అతడు కేవలం అణిగివున్న దుమ్మును రేపి, లోపల జీవించడమే కష్టంగా మార్చాడు. గనుక ఇది ధర్మశాస్త్రమును సూచిస్తోంది. అది పాపమునుండి హృదయాన్ని శుద్ధిచేయడానికి బదులు, కేవలం పాపాన్ని ఉజ్జీవింపజేస్తుంది, పాపము తన బలాన్ని చూపేలా చేసి, ఆత్మలో దాని కార్యములను అధికం చేస్తుంది. పాపమును కనిపెట్టి నిషేధించినా, దానిని అణచివేసే జీవాన్ని శక్తిని మాత్రం ఇవ్వలేదు. కాబట్టి మానవుడు ముందుగా పైనుండి దైవిక జీవమును, సహాయమును పొందకుండ, తనంతట తానుగా పాపాన్ని విడిచిపెట్టలేడు. అందుకే ఆ యువతి వచ్చి గదిలో నీళ్లు చల్లి, సునాయాసంగా శుభ్రం చేసింది. ఇది మనకు ఏమి సూచిస్తుంటే, క్రీస్తు సువార్త హృదయంలోనికి వచ్చినప్పుడు, దాని మధురమైన కృపాభరిత ప్రభావం చేత నూతన జీవం లోనికి ప్రవేశిస్తుంది, పాపము అణిచివేయబడి, ఓడించబడి, క్రీస్తునందలి విశ్వాసము చేత ఆత్మ శుద్ధీకరించబడుతుంది. ఫలితంగా మానవుడు మహిమరాజుకి నివాసయోగ్యంగా మారుతాడు.

అప్పుడు వివరణకర్త క్రైస్తవుణ్ణి ఒక చిన్న గదిలోనికి తీసుకెళ్లాడు, ఆ గదిలో ఇద్దరు చిన్నారులు ఎవరి కుర్చీలో వారు కూర్చొని ఉన్నారు. పెద్దవాడి పేరు ఆవేశం, చిన్నవాడి పేరు సహనం. పేరుకు తగ్గట్టే సహనం ఎంతో నిమ్మళంగా ఉంటే, ఆవేశం మాత్రం అస్సలు సంతృప్తిగానే లేదు.

"ఆవేశం అంత అసహనంగా ఉన్నాడెందుకు?" అడిగాడు క్రైస్తవుడు.

"వారు పొందబోయే శ్రేష్ఠమైన వస్తువులకోసం వచ్చే సంవత్సరం వరకు వేచివుండాలన్నది వారి పై అధికారి కోరిక" అని చెప్పాడు వివరణకర్త. "అయితే, ఆవేశం తనకు రావలసిన మేలైన వస్తువులన్నీ ఇప్పుడే కావాలంటున్నాడు; సహనమేమో వేచివుండటానికి ఇష్టపడుతున్నాడు."

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

అప్పుడొకడు ఆవేశం వద్దకు వచ్చి, ఒక సంచెడు డబ్బును అతని కాళ్ల దగ్గర కుమ్మరించగా, ఎంతో ఆనందంతో వాటన్నిటినీ తన చేతుల్లోకి తీసుకున్నాడు. అతడు పెద్దగా నవ్వుతూ, సహనాన్ని చూచి ఎగతాళి చేశాడు. అయితే త్వరలోనే అతడు పొందినదంతా వ్యర్థం చేసుకున్నాడు. ఇప్పుడతని చేతిలో ఖాళీ సంచి తప్ప మరేమీ మిగల్లేదు.

"ఈ సంగతిని మరింత సంపూర్ణంగా వివరించు"మని అడిగాడు క్రైస్తవుడు.

వివరణకర్త: ఆవేశం ఈ లోకస్తులకు సూచనగా ఉన్నాడు; సహనం రాబోవు లోకానికి సూచన. లోకస్తులు తమకు రావలసిన బహుమానాలన్నీ ఈ జీవితంలోనే కావాలని ఆశిస్తారు; వాళ్లు వేచివుండలేరు. బైబిల్లో ఉన్న వాగ్దానాలన్నిటి కన్నా "మబ్బులు చూచి ముంత ఒలకపోసుకోకూడదు" అన్న సామెతే వారికి ఎక్కువ విలువైనదిగా భావిస్తారు. అయితే త్వరలోనే వారు తమచేతిలో ఉన్నదంతా వ్యయం చేసుకుంటారు, చివరికి జీవితంలో వారికి మిగిలేదేమీ వుండదు.

"ఎన్నో కారణాలను బట్టి ఇప్పుడు నాకనిపిస్తోంది, సహనానికే ఎక్కువ జ్ఞానం ఉందని. మొదట, అతడు శ్రేష్ఠమైనవాటి కోసం ఎదురుచూస్తాడు. రెండవది, వేరేవాడికి చినిగిన గుడ్డలు తప్ప ఏమీ లేకపోగా ఇతడు తన బహుమానాల వల్ల కలిగే మహిమను హాయిగా అనుభవిస్తాడు" అన్నాడు క్రైస్తవుడు.

వివరణకర్త: అవును, నీవు చెప్పినదానికి ఇది కూడ జతచెయ్యవచ్చు: రాబోవు లోకపు మహిమలు ఎన్నటికీ గతించిపోవు, లేక తరిగిపోవు గాని ఈ జీవితపు మహిమలు త్వరలోనే గతించిపోతాయి. అందుకే, ఒకానొక ధనవంతుడి గురించి ఇలా చెప్పబడింది: "నీవు నీ జీవితకాలమందు నీకిష్టమైనట్టు సుఖము అనుభవించితివి, ఆలాగుననే లాజరు కష్టము అనుభవించెనని జ్ఞాపకము చేసుకొనుము; ఇప్పుడైతే వాడు ఇక్కడ నెమ్మది పొందుచున్నాడు, నీవు యాతన పడుచున్నావు"[4]

క్రైస్తవుడు: అలాగైతే, ఈ లోకపు విషయాలను ఆశించక, రాబోవు మేలుకరమైన వాటికోసం ఎదురుచూడటమే ఉత్తమమని నాకనిపిస్తోంది.

వివరణకర్త: నీవు సత్యమే చెప్పావు. "ఏలయనగా దృశ్యమైనవి అనిత్యములు; అదృశ్యమైనవి నిత్యములు."[5] అయిననూ, ఇప్పటి సంగతులు మన శరీరాశలకు ఎంతో దగ్గరగా ఉన్నట్లు, నిత్యమైన సంగతులు మన ఆత్మలకు ఎంతో దూరాన ఉన్నట్లు కనిపిస్తాయి; నిత్యమైన సంతృప్తి కోసం ఎదురుచూడటం కన్నా మన శరీరకోర్కెలకు లోబడటానికే మనము తగినవారము. ఆవిధంగా మనము ఈ లోకపు సంగతులతో చేయికలిపి, భవిష్యత్తులో పొందబోయే బహుమానాన్ని కోల్పోతున్నాం.

మరొక చోట ఒక గోడ మీదికి మంటలు చెలరేగుతూ ఉండగా ఒకడు దానిమీద నిత్యమూ నీళ్లు పోస్తున్నాడు. అయినా ఆ మంటలు మరింత వేడిగా ఎగిసిపడుతూ ఉన్నాయి.

"దాని ఉద్దేశమేంటి? అడిగాడు క్రైస్తవుడు.

4. లూకా 16:25 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8
5. 2కొరింథీయులకు 4:18

వివరణకర్త: మనిషి హృదయంలో దేవుడు జరిగించే కృపాకార్యమే ఈ అగ్ని. దానిమీద నీళ్లుపోస్తున్నవాడు అపవాది. అయినా, ఆ మంటలు మండుతూనే ఉన్నాయి, చూడు. ఇలా ఎందుకు జరుగుతుందో తెలియాలంటే ఆ గోడ ప్రక్కకు వెళదాం పద. (గోడకు అవతలివైపున ఒక వ్యక్తి రహస్యంగా అగ్నికి ఆజ్యం పోస్తున్నాడు.) అందుకే, ఆత్మలో దేవుని కృపాకార్యం ఎలా కొనసాగుతుందో గ్రహించడం శోధింపబడిన వానికి ఎందుకంత కష్టమవుతుందో దీనిద్వారా నీకు అర్థమవుతుంది. లోకం చల్లే నీళ్లను, అపవాది కలిగించే శోధనలన్నిటినీ తట్టుకోనేలా విశ్వాసి ఆత్మలో క్రీస్తు తన కృపను దయచేయు మార్గం ఇదే.

అక్కడినుండి వారొక అందమైన ఉద్యానవనంలోనికి వెళ్లి, ఒక వైభవోపేతమైన రాజభవనం వద్దకు చేరుకున్నారు. ఆ భవనం మీద బంగారపు వస్త్రాలు ధరించి మెరిసిపోతున్న వ్యక్తులు అటూ ఇటూ నడుస్తున్నారు. ఆ దృశ్యం క్రైస్తవుడిని ఆశ్చర్యచకితుణ్ణి చేసింది. "మనం లోనికి వెళ్లవచ్చా?" అని అడిగాడు.

అప్పుడు వివరణకర్త అతన్ని రాజభవనం ద్వారంవైపుకు తీసుకెళ్లాడు. ఆ ద్వారం వద్ద ఒక పెద్ద గుంపుగా ప్రజలు నిలబడివున్నారు. లోపలికి వెళ్లేందుకు అందరూ ఆతురతతో ఉన్నారు కానీ ప్రవేశించడానికి ఎవరూ సాహసం చెయ్యలేదు. దీనిద్వారా క్రైస్తవుడు ఒక విషయం గ్రహించాడు. పరలోకరాజ్యంలో ప్రవేశించాలని ఆశించి, ఇష్టపడేవారు చాలామంది ఉన్నారు గాని భయంతో వెనుకంజ వేస్తున్నారు.

ఆ రాజభవనం తలుపులకు సాయుధులైన బలవంతులు కావలికాస్తున్నారు. జన సమూహానికి, ద్వారానికి మధ్య ఒక బల్లమీద ఒకడు పుస్తకం కలం పట్టుకొని, లోనికి ప్రవేశించేవారి పేర్లు రాయడానికి కూర్చొని ఉన్నాడు. ఆ గుంపులోనుండి ధైర్యం అనేవాడు ముందుకొచ్చి, బల్ల దగ్గర ఉన్న వ్యక్తికి అతని పేరు చెప్పాడు. అప్పుడతడు తలమీద ఒక శిరస్త్రాణం పెట్టుకొని, కత్తిదూసి తలుపువైపు దూసుకెళ్లాడు. సాయుధ భటులు అతన్ని పట్టుకున్నారు కాని అతని ధాటికి వారు తట్టుకోలేకపోయారు. అతడు వారిని ఎంత ప్రచండంగా, తీవ్రంగా గాయపరచాడంటే, వారు ఓడిపోయి, అతన్ని లోనికి వెళ్లనిచ్చారు. లోపలినుంచి, భవనం పైనుంచి ఈ మాటలు వినిపించాయి: "లోనికి ప్రవేశించు, లోనికి ప్రవేశించు, నిత్య మహిమను జయించు."

ఆ విధంగా ధైర్యవంతుడు లోనికి ప్రవేశించి రాజభవనానికి చెందిన అందమైన దుస్తులు ధరించాడు. "దీని భావం నాకు తెలుసనుకుంటాను" అన్నాడు చిరునవ్వుతో క్రైస్తవుడు.

వారు ఈ దృశ్యాన్ని విడిచి, ఒక చీకటి గదిలోకి వెళ్లారు. అక్కడ క్రైస్తవుడు ఒక ఇనుప బోనులో విషాద వదనంతో ఉన్న ఒక మనిషిని చూశాడు, అతని పేరు నిరాశ. అతడు చేతులు కట్టుకొని, నేలచూపులు చూస్తూ కూర్చున్నాడు; అతని గుండె పగిలిపోతుందా అన్నట్లు బిగ్గరగా నిట్టూర్పు విడిచాడు.

"అతనికేమైంది? అడిగాడు క్రైస్తవుడు.

"ఏమైందో అతన్నే చెప్పనిస్తాను" అన్నాడు వివరణకర్త.

నిరాశ: నేను ఒకప్పటి మనిషిని మాత్రం ఖచ్చితంగా కాదు.

క్రైస్తవుడు: అప్పుడు నువ్వు ఎలా వుండేవాడివి?

నిరాశ: ఒకప్పుడు నేను నా సొంత అభిప్రాయంలోను, ఇతరుల దృష్టిలోనూ ఎంతో ఆనందంగా ఉండే చురుకైన క్రైస్తవుణ్ణి. మహిమ నగరానికి నేను తగినవాడనని భావించాను, అందులో ప్రవేశించడానికి ఎంతో సంతోషంతో ఎదురుచూసేవాడిని.

క్రైస్తవుడు: మరి, ఇప్పుడెలా ఉన్నావు?

నిరాశ: ఇప్పుడు నేను నిరుత్సాహంతో, తృణీకరించబడి, తప్పించుకునే వీలులేని ఈ ఇనుప బోనులో బంధించబడివున్నాను.

క్రైస్తవుడు: ఆ స్థితి నీకు ఎలా దాపురించింది?

నిరాశ: నేను మెలకువతో స్థిరమైన బుద్ధి కలిగివుండటం మానేశాను. జీవవాక్యాన్ని అనుమానించడంతో పాటు, నా ఆశలకు తావిచ్చాను. దేవుని వాక్యపు వెలుగుకు, దేవుని మంచితనానికి విరోధంగా నేను పాపం చేశాను. సాతాను వాదనలకు నేను లొంగిపోయాను, అంతటితో వాడు నా ఆత్మను స్వాధీనపరచుకున్నాడు. దేవునికి ఆగ్రహం తెప్పించాను, అందువల్ల ఆయన నన్ను విడిచిపెట్టాడు. పరిశుద్ధాత్మను దుఃఖపెట్టాను, ఆయన కూడ నన్ను విడిచివెళ్లాడు. నా హృదయాన్ని కఠినపరచుకున్నాను, ఇప్పుడు నేనిక పశ్చాత్తాప పడలేను.

అప్పుడు క్రైస్తవుడు వివరణకర్తను ఇలా అడిగాడు, "అయితే, ఇతనికి నిరీక్షణ లేదా మరి?"

వివరణకర్త: అతన్నే అడుగు.

క్రైస్తవుడు: ఈ నిరుత్సాహపు ఇనుప బోను నుండి ఎప్పటికైనా తప్పించుకుంటావన్న ఆశ ఇక లేదంటావా?

నిరాశ: లేదు, ఏమాత్రం లేదు.

క్రైస్తవుడు: ఎందుకు లేదు? దైవ తనయుడు ఎంతో జాలిగలవాడు, దయామయుడు కదా.

నిరాశ: అవును, కానీ నేనాయన కనికరాన్ని తిరస్కరించాను; నా ఇష్టానుసారంగా మరల ఆయన్ని సిలువవేసి, నలుగురిలో నవ్వులపాలు చేశాను. ఆయన నీతిని తిరస్కరించాను. నామీద ఆయన ప్రభుత్వాన్ని ద్వేషించాను. కృపగల ఆత్మను నొప్పించాను. ఏ రక్తంచేత నేను కొనబడ్డానో, ఆ రకాన్ని అపవిత్రమైందిగా ఎంచాను. కాబట్టి, వాగ్దానాలన్నిటికీ దూరంగా నన్ను నేను

బంధించుకున్నాను; ఇప్పుడు నాకోసం మిగిలిందల్లా బెదిరింపులే. తీర్పును గురించిన బెదిరింపులు, భీతిగొలిపే భయంకరమైన, బెదిరింపులు మరియు ఒక విరోధిలా నన్ను హతమార్చాలని చూసే తీక్షణమైన ఆగ్రహమే.

క్రైస్తవుడు: ఇవన్నీ దేనికోసం చేశావు, ఈ పరిస్థితిని ఎందుకు కొనితెచ్చుకున్నావు?

నిరాశ: శరీరాశల కోసం, ఈ లోకపు సుఖాలు, ప్రయోజనాల కోసం: వీటిని అనుభవిస్తూ ఎంతో ఆనందించగలననుకున్నాను. అయితే, ఇప్పుడవన్నీ విష సర్పాల్లా కాటువేస్తున్నాయి. అయ్యో, నేను మారుమనస్సు పొందగలిగితే ఎంతబావుండును! కానీ దేవుడు నాకు మారుమనస్సు దయచేయటానికి నిరాకరించాడు. ఆయన వాక్యం నాకు విశ్వాసం కలిగించేలా ఎటువంటి ప్రోత్సాహమూ ఇవ్వదనిపిస్తోంది. నా సొంత పాపము, అవిశ్వాము అనే ఈ ఇనుప బోనులో ఆయన నన్ను బంధించి, ఇక ఎన్నటెన్నటికీ నాకు విముక్తిని ప్రసాదించడు; ఈ లోకంలో ఉన్న మనుష్యులందరూ కలిసినా నన్ను ఈ చెరసాల నుండి విడిపించలేరు. ఆహా, నిత్యత్వం! నిత్యత్వం! నా పాలిటి ఈ దౌర్భాగ్యాన్ని శాశ్వతంగా ఎలా భరించగలను?

క్రైస్తవుడితో వివరణకర్త: ఇతని మాటలు నీకు ఎల్లవేళల గుర్తుండి, అవి నీకు నిత్యమూ ఒక హెచ్చరికగా ఉండును గాక.

క్రైస్తవుడు: మంచిది, కానీ ఇది భయంకరం! దేవా, నేను మెలకువగా, అప్రమత్తంగా ఉండి, ప్రార్థించుటకు, ఆ మార్గమును వెళ్లువారి దౌర్భాగ్యమును, దుష్టత్వమును విసర్జించుటకు సహాయం చేయుము. అయ్యా, నా దారిన నేను వెళ్లుటకు సమయం అయింది కదా?

వివరణకర్త: నీకు మరొకటి చూపించేదాక ఆగు; అప్పుడు నీవు వెళ్లవచ్చు.

అప్పుడతడు క్రైస్తవుణ్ణి ఒక గదిలోనికి తీసుకెళ్లగా, అక్కడ ఒక వ్యక్తి మంచంమీద నుండి లేచి, బట్టలు ధరిస్తూ, వణుకుతుండటం చూశాడు. "ఈ మనిషి అలా ఎందుకు వణకుతున్నాడు?" అడిగాడు క్రైస్తవుడు.

వివరణకర్త: దానికి జవాబు అతడే చెప్పగలడు. లోకప్రియం వైపు చూస్తూ, వివరణకర్త ఇలా అన్నాడు, "నీవు వణకుతూ, ఊగిపోతున్నావెందుకో ఇతనికి వివరించు."

లోకప్రియం: నాకొక భయంకరమైన కలవచ్చింది. ఆకాశం విపరీతంగా నలుపెక్కింది. ఆకాశమంతటా కారుమేఘాలు అలముకున్నాయి. ప్రచండమైన ఉరుములు, మెరుపులతో భూమి వణికింది. నేనొక గొప్ప బూరశబ్దం విన్నాను. ఒకాయన వేలాది పరలోకపు మనుష్యులతో కలిసి మేఘాలమీద భూలోకానికి రావడం చూశాను. వారందరూ అగ్నివలె మండుతున్నారు. అప్పుడు నేను చూడగా ఆకాశాలు తగలబడిపోతున్నాయి; అప్పుడొక మహా స్వరం ఇలా చెప్పడం వినపడింది: "మృతులారా, లెండి, తీర్పుకు రండి." అప్పుడు బండలు దొర్లి బ్రద్దలైపోసాగాయి, సమాధులు

తెరుచుకున్నాయి, చనిపోయినవారు లక్షలాదిగా బయటికొచ్చారు. కొందరు మిక్కిలి సంతోషంతో పైకి చూస్తున్నారు; కొందరు భీతిచెంది తమను మరుగుచెయ్యమని పర్వతములతోను, బండలతోను చెప్పుకుంటున్నారు.

అప్పుడు మేఘం మీద ఉన్నవాడు గ్రంథం తెరచి లోకాన్ని తన ఎదుటికి రమ్మని ఆదేశించాడు. ఆయనకు పరిచర్యలు చేస్తున్న వారికి ఈ విధమైన ఆజ్ఞలు ఇవ్వడం కూడ నేను విన్నాను: "గురుగులను, పొట్టును, కొయ్యకాలును ప్రోగుచేసి వాటిని అగ్నిలో పారవేయండి." అప్పుడు ఒక లోతైన గొయ్యి సరిగ్గా నా కాళ్ల దగ్గరే తెరచుకుంది; ఆ గుంటలో నుండి పొగతో కూడిన మేఘాలు, ఘోరమైన శబ్దాలు వచ్చాయి. "నా గోధుమలను కొట్టులోనికి చేర్చండి" అని కూడా ఆయన ఆజ్ఞాపించాడు. అప్పుడు అనేకులు పట్టబడి మేఘాలలోకి కొనిపోబడ్డారు, కానీ నేను విడువబడ్డాను. మేఘంమీద ఉన్న వ్యక్తి యొక్క చూపు నామీదే ఉంది గనుక దాక్కునేందుకు ఒక స్థలంకోసం వెదికాను గాని దొరకలేదు. నా పాపాలు నా యెదుట కనిపించాయి, నా మనస్సాక్షి నన్ను తీవ్రంగా నిందించింది. అప్పుడు నేను మహాభయంతో మేల్కొన్నాను.

క్రైస్తవుడు: కాని, ఈ ప్రత్యక్షతను చూచి నువ్వెందుకు భయపడాలి?

లోకప్రియం: ఎందుకంటే, తీర్పుదినం వచ్చేసిందనుకున్నాను, అయితే నేను సిద్ధంగా లేను. నన్ను బాగా కలతపరచిన దేమిటంటే, దేవదూతలు పరలోకరాజ్యం కొరకు అనేకమందిని ప్రోగుచేశారు, కాని నన్ను విడిచిపెట్టారు. అంతేకాదు నరకకూపం నా యెదుట తెరుచుకుంది, నా మనస్సాక్షి నన్ను భయంకరంగా దెబ్బకొట్టింది. పైగా న్యాయమూర్తి ఎల్లప్పుడూ నామీదే ఒక కన్నేసి వుంచి, ఆగ్రహంతో నన్ను కనిపెట్టి చూస్తున్నాడు.

వివరణకర్త (క్రైస్తవుడితో): ఇప్పుడు, నీవీ సంగతులన్నీ బాగా గమనించావా?

క్రైస్తవుడు: అవును, అవి నాకు నిరీక్షణను, భయాన్ని కలిగిస్తున్నాయి.

వివరణకర్త: మంచిది, అవి నిన్ను కీడుకు దూరంగా ఉండమని హెచ్చరిస్తూ, నీవు వెళ్లవలసిన మార్గంలో ముందుకు నడిపించేందుకు ముల్లుగర్రలా పనిచేసేలా వాటిని ఎల్లప్పుడూ మనస్సులో ఉంచుకో; ఆనంద పురమునకు నడిపించే మార్గంలో నిన్ను నడిపించేందుకు ఆదరణకర్త నీకు నిత్యమూ తోడుగా ఉండును గాక.

అలా క్రైస్తవుడు తన దారిని వెళ్లిపోయాడు.

అధ్యాయం
3
సుందర గృహం దిశగా ప్రయాణం

సిలువయొద్ద అతని భారమును పోగొట్టుకొనుట

ఇప్పుడు నా కలలో క్రైస్తవుడు ఇరువైపులా పెద్ద గోడతో కంచెవేసివున్న రాజమార్గంలో వడి వడిగా నడుస్తుండటం చూశాను. అతడు పరుగెత్తడం ఆరంభించాడు కానీ వీపుమీద ఉన్న బరువుకారణంగా వేగంగా పరుగు తీయలేకపోతున్నాడు. ఆ కొండ శిఖరాన అతడొక సిలువ దగ్గరకు చేరాడు. అతడు సిలువను చేరగానే అతని భారం వదులై, అతని భుజాలమీదినుంచి జారి, దొర్లుకుంటూ కొండదిగువన తెరచివున్న ఒక సమాధిలో పడిపోయింది, ఆ తర్వాత దాని జాడ నాకు కనిపించలేదు.

ఇప్పుడు క్రైస్తవుడి హృదయం తేలికపడింది. అతని భారం నుంచి ఉపశమనం లభించింది. తనకు తాను ఇలా చెప్పుకున్నాడు: "ఆయన తన దుఃఖము చేత నాకు విశ్రాంతినిచ్చెను, తన మరణము చేత నాకు జీవమునిచ్చెను." సిలువవైపే తదేకంగా చూస్తూ, అపరాధభావము, అవమానాలతో సతమతమవుతున్న ఒక వ్యక్తి సిలువను చూడగానే ఇంతటి విడుదల ఎలా లభించిందో ఆశ్చర్యంతో నిలబడి పోయాడు. ఇప్పుడతనికి ఏ విషయంలోనూ అపరాధ భావన లేదు. తన పాపాలన్నీ

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

క్షమించబడ్డాయని అతని మనస్సాక్షి అతనితో చెప్పింది. అప్పుడతడు నిర్దోషిగా, శుభ్రంగా, సంతోషంగా, స్వేచ్ఛగా ఉన్నట్లు భావించాడు. సిలువమీద చనిపోయినవాని మరణం ద్వారా తన పాపశిక్ష యావత్తు మూల్యం చెల్లించబడిందని అతనికి తెలుసు. అవి వెళ్లి, రక్షకుని సమాధిలో పాతిపెట్టబడ్డాయి, అతని పక్షంగా ఇక దేవుడు వాటిని ఎన్నటికీ జ్ఞాపకం చేసుకోడు. అతని మనస్సు ఎంతటి కృతజ్ఞతాభావంతో, సంతోషంతో నిండిపోయిందంటే, కళ్లవెంట ఆనందబాష్పాలు వర్షింపసాగాయి.

అతడు సిలువవైపే చూస్తూ నిలబడి, సంతోషంతో ఏడుస్తూ వుండగా, పరలోకపు జీవులు ముగ్గురు అతనికి సమీపంలో నిలబడ్డారు. "నీకు సమాధానము కలుగును గాక" అంటూ అతనికి శుభములు తెలిపారు. మొదటివాడు "నీ పాపాలు క్షమించబడ్డాయి" అన్నాడు. రెండోవాడు అతని మురికి గుడ్డలు తొలగించి, తెల్లని శుభ్రమైన దుస్తులు ధరింపజేశాడు. మూడోవాడు అతని నుదుటిపైన ఒక గురుతు వేసి, మార్గంలో చదువుకునేందుకు, ఆనందపురం ద్వారం వద్ద గుర్తింపు చిహ్నంగా ఒక గ్రంథాన్ని ఇచ్చాడు. అప్పుడు క్రైస్తవుడు ఆనందంతో గంతులు వేస్తూ, పాటలు పాడుకుంటూ తన దారిన వెళ్లిపోయాడు.

అబద్ధపు క్రైస్తవులను కలుసుకొనుట

అతడు కొండ దిగువకు రావడం నేను చూశాను. అక్కడికి కొంచెందూరంలో ముగ్గురు మనుష్యులు గాఢనిద్రలో ఉన్నారు. ఆ ముగ్గురి కాళ్లకూ ఇనుప సంకెళ్లున్నాయి. వారిలో ఒకని పేరు అమాయ కుడు; రెండోవాని పేరు సోమరి, మూడోవాడు మొండిధైర్యం.

వారికి పొంచివున్న ప్రమాదం గురించి హెచ్చరించడం కోసం క్రైస్తవుడు వారి వద్దకు వెళ్లాడు. "మీరు తెరచాప కొయ్యమీద పండుకున్నవారిలా, సముద్రపు అడుగున నిద్రించే వారిలా ఉన్నారు. మేల్కొనండి, నాతో రండి. మీ బంధకాలను విడిపించనివ్వండి. గర్జించు సింహంలా తిరిగేవాడు ఇటువైపు వచ్చాడంటే, మిమ్మల్ని మింగివేయడం ఖాయం"[1] అంటూ కేకలు వేశాడు.

ఒక్కొక్కడు ముఖం చిట్లిస్తూ, నిద్రముఖంతోనే అతనివైపు గుర్రుగా చూశారు. "నాకు ఎలాంటి ప్రమాదం కనిపించడంలేదు" అన్నాడు అమాయకుడు. "కాసేపు నన్ను పడుకోనివ్వు" అన్నాడు సోమరి. మొండిధైర్యం ఏమన్నాడంటే, "నీకెందుకయ్యా బాధ, ఎవడి కాళ్లమీద వాడు నిలబడాలి కదా." అంతటితో వాళ్లు మరలా నిద్రలోకి జారుకున్నారు. వీళ్లు ఎంత ప్రమాదంలో ఉన్నారో ఆలోచించుకుంటూ నిరాశతో క్రైస్తవుడు తన దారిన ముందుకు సాగిపోయాడు. అయినా వాళ్లు దాన్ని చూడలేకపోయారు; పైగా వాళ్లకి సహాయం చెయ్యడానికి ముందుకొచ్చిన వ్యక్తిని ఏమాత్రం అభినందించలేకపోయారు.

1. 1 పేతురు 5:8 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

సరిగ్గా అప్పుడే ఇద్దరు మనుష్యులు అతని వెనుక కొంచెం దూరంలో గోడమీదుగా వచ్చారు. వారు వేగంగా నడిచి, అతన్ని చేరుకున్నారు. ఒకడి పేరు మర్యాద, రెండోవాని పేరు వేషధారి.

క్రైస్తవుడు: అయ్యలారా, మీరు ఎక్కడినుండి వస్తున్నారు, ఎక్కడికి వెళుతున్నారు?

తాము అహంకారం అనే పట్టణం నుంచి సీయోను పర్వతం వద్దకు వెళుతున్నామని చెప్పారు.

క్రైస్తవుడు: ఈ దారి మొదలయ్యే చోట ఉన్న ద్వారం నుంచి మీరు ఎందుకు రాలేదు? ఈ మార్గాన్ని నిర్మించినవాడు గ్రంథంలో ఇలా రాయించాడని మీకు తెలుసు కదా: "ద్వారమున ప్రవేశింపక వేరొక మార్గమున ఎక్కువాడు దొంగయు దోచుకొనువాడునై యున్నాడు."[2]

తాముంటున్న ఊరునుంచి ఆ ద్వారం వద్దకు వెళ్లాలంటే చాలాదూరం అవుతుందని అందరూ అనుకొంటుంటారని, సహజంగా ఇప్పుడు వారు చేసినవిధంగానే అందరూ అడ్డదారిన వచ్చి ఆ గోడదూకి లోపల ప్రవేశించడం ఆనవాయితీ అని వారు చెప్పారు.

2. యోహాను 10:1 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

క్రైస్తవుడు: కానీ మీరు వెళుతున్న నగర ప్రభువులవారు అలాచేయడాన్ని చొరబాటుగా, నిబంధనలు ఉల్లంఘించినట్టుగా పరిగణించడా?

ఆ విషయం గురించి నీవు తల బ్రద్దలు కొట్టుకోవలసిన పనిలేదని, తమకిది ఎంతో కాలంగా వస్తున్న ఆచారమేనని, గత వెయ్యేళ్లకు పైగా అలా చెయ్యడం వారికి ఎంత ఉపయోగకరంగా ఉన్నదీ చెప్పడానికి బోలెడంతమంది సాక్షులను చూపెట్టగలమని వారు క్రైస్తవుడితో అన్నారు.

క్రైస్తవుడు: అయితే అది అంతిమ పరీక్షకు నిలబడుతుందంటారా?

నిలబడుతుందనే అనుకుంటున్నాం. ఇంత కాలంగా అమలులో ఉన్న ఈ ఆచారం తప్పనిసరిగా ఆమోదించబడుతుందని, ఈ మార్గం చివర్లో పక్షపాతం లేని న్యాయాధిపతి దానిని అంగీకరిస్తాడనడంలో ఎలాంటి సందేహానికి తావుండదు. పైగా, "నీవు వెళుతున్న మార్గంలోనే మేమూ వస్తున్నాం" అంటూ వాదించారు. ఎలా చేరుకుంటే ఏమిటి? లోపలికి చేరడమే కదా ముఖ్యం. అలాంటప్పుడు ఇందులో నీకు ప్రత్యేకంగా ఒరిగిందేముంది?

క్రైస్తవుడు: ఈ మార్గపు ప్రభువులవారి నియమం ప్రకారమే నేను నడుచుకుంటాను. మీరు మీ సొంత మార్గాన్ని వెంబడిస్తున్నారు: దైవావేశము లేని మనుష్యులు కనిపెట్టిన మూర్ఖపు మార్గం మీది. ఇప్పటికే ఈ మార్గపు ప్రభువు మిమ్మల్ని దొంగలుగా తేల్చినాడు. కాబట్టి, చివరికి మీరు నిజమైన మనుష్యులుగా నిలబడతారా అన్నది అనుమానమే. ఆయన నడిపింపు లేకుండ మీ యంతట మీరు లోపలికి వచ్చారు, గనుక ఆయన కనికరం లేకుండ మీయంతట మీరే బయటికి వెళతారు.

అంతటితో వారు క్రైస్తవుడిని తన పని తాను చూసుకోమని చెప్పారు; మా సంగతి మేము చూసుకోగలమన్నారు. నీలాగే మేము కూడ ధర్మశాస్త్రాన్ని పాటించాము, కట్టడలన్నీ నెరవేర్చామన్న నిశ్చయత మాకున్నదని చెప్పారు. "నీ దిగంబరత్వాన్ని దాచుకోవడానికి ఎవరో దానం చేసిన నీ ఒంటిమీది కోటు తప్ప నీకూ మాకూ పెద్ద వ్యత్యాసమేమీ లేదు" అన్నాడు మర్యాద.

క్రైస్తవుడు: ధర్మశాస్త్రము ద్వారా, కట్టడల ద్వారా మీరు రక్షణపొందలేరు.[3] ఇక నేను ధరించిన ఈ కోటు విషయానికొస్తే, నేను వెళుతున్న రాజ్యపు ప్రభువే దీనిని నాకు ఇచ్చాడు. మీరు చెప్పినట్టే, ఇది నా దిగంబరత్వాన్ని దాచుకోవడానికే ఇవ్వబడింది. ఆయన నాపట్ల చూపిన కటాక్షానికి గురుతుగా ఈ కోటును నేను ధరిస్తాను. ఎందుకంటే, మునుపు నాకు చిరిగిన గుడ్డలు తప్ప మరేమి లేవు. ఆ ఆనంద పురానికి నేను చేరుకున్నప్పుడు ఆయనిచ్చిన ఈ కోటు ద్వారా, నా నుదుటిమీద ఉన్న ఈ మచ్చ ద్వారా ప్రభువు నన్ను గుర్తుపడతాడు. బహుశా మీరు దీన్ని గమనించి ఉండరు కానీ, ఆయనకు నమ్మకమైన సేవకులలో ఒకడు నా నుదుటిమీద ఈ గుర్తు వేశాడు. నా చేతిలో ఉన్న ఈ గ్రంథాన్ని బట్టి కూడ ప్రభువు నన్ను గుర్తుపడతాడని నాకు పూర్తి నమ్మకం

3. గలతీయులకు 2:16 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

ఉంది. ఇవన్నీ మీకు ఉన్నాయో లేదో అనుమానమే, ఎందుకంటే మీరు ద్వారమున ప్రవేశించిన వారు కాదు.

వారతనికి బదులేమీ చెప్పలేదు కాని, ఒకరి ముఖం ఒకరు చూచి నవ్వారు. అప్పుడు క్రైస్తవుడు వారిని దాటి కొంచెం ముందుకు సాగాడు. తన ఆత్మను ఉత్తేజపరచుకుంటూ, తనకు ఎదురయ్యే శోధనలను జయించడం కోసం తరచుగా తన చేతిలో ఉన్న గ్రంథాన్ని చదువుకుంటూ ఉన్నాడు.

ఇప్పుడు వాళ్లు ఇబ్బంది అనే ఒక నిటారుగా పొడవుగా ఉన్న కొండను సమీపించారు. ఆ కొండ దిగువన మరో రెండు దారులున్నాయి, వాటిలో ఒకటి కుడివైపుకి, రెండవది ఎడమవైపున ఉన్న తిన్నని ఇరుకు మార్గం వైపుకు పోతున్నాయి. వీటికి అవతలవైపున ఉన్న ఒక చల్లని సెలయేరు పారుతోంది. ఆ కొండను ఎక్కేందుకు ప్రయత్నించక ముందు క్రైస్తవుడు ఆ ఊటలోని నీళ్లు త్రాగాడు.

మర్యాద, వేషధారి ఇద్దరూ కూడ ఆ కొండ వద్దకు చేరుకున్నారు. అయితే, ఆ కొండ చాల నిటారుగా ఎత్తుగా, కష్టమైనదిగా ఉండటం, వెళ్లటానికి మరో రెండు మార్గాలు ఉండటం చూశాక (ఆ రెండు మార్గాల్లో ఒకదానిపేరు అపాయం, మరొకదాని పేరు వినాశనం అని వాళ్లకి తెలియదు), కొండ ప్రక్కన ఉన్న దారులు రెండూ చివరికి కొండకు ఆవలివైపున ఉన్న తిన్నని మార్గంలో కలుస్తాయని ఊహించుకొని, వారి కంటికి తేలికగా కనిపించిన మార్గాన్ని ఎంచుకున్నారు. మర్యాద ఒక అడవిలోనికి దారితీసే అపాయమనే దారిని ఎంచుకొని వెళ్లగా క్రూరజంతువులు అతన్ని తినేశాయి; వినాశనమనే దారివెంట వెళ్లిన వేషధారి ఒక విశాలమైన మైదానానికి చేరుకున్నాడు. ఆ మైదానంలో అనేక లోతైన గుంటలుండగా అతడు ఒక గుంటలో పడిపోయి, మళ్లీ పైకి లేవలేదు.

క్రైస్తవుడు కొండ ఎక్కుతూ, ఈ పాట పాడుకున్నాడు:

నేను కొండ శిఖరం ఎక్కాల్సిందే;
మార్గం ఎంత నిట్టనిలుగా ఉన్నా సరే,
నాకు తెలుసు, సంఘర్షణ ద్వారానే జీవానికి మార్గం ఉంటుందని,
మార్గం ఎంత దూరమైనా ఏడ్వరాదని.
కరకు రాళ్లు దారిని కఠినంగా మార్చినా,
ధైర్యం వహించు! నా హృదయమా, అలయకు, భీతిచెందకు
సులువైన మార్గం నాకు తిరోగమనమే అవుతుంది
నేను వెళ్లవలసిన మార్గం పైపైకి, మునుముందుకే ఉంటుంది!

త్వరలో అతని ప్రయాణం మందగించింది, మార్గం మరీ నిటారుగా ఉండటంతో అతడు తన చేతులమీద, మోకాళ్లమీద ముందుకు సాగాడు.

విశ్రాంతి గృహం వద్ద గ్రంథాన్ని పోగొట్టుకొనుట

కొండమీదికి సగం దూరం వెళ్లాక అక్కడ ఒక రమ్యమైన పొదరిల్లు కనబడింది. అలసిపోయిన యాత్రికులు విశ్రమించేందుకు ఆ పర్వతాధిపతే ఆ ఏర్పాట్లు చేయించాడు. విశ్రాంతికోసం క్రైస్తవుడు ఇక్కడ కూర్చున్నాడు. సిలువ యొద్ద తనకివ్వబడిన మంచి కోటును చూస్తూ మురిసిపోయాడు, తన చేతిలో ఉన్న గ్రంథాన్ని ఎంతో ఆనందంగా చదువుకోసాగాడు. ఆవిధంగా కొంతసేపు సంతోషంగా గడిపిన తర్వాత అతడు కునుకుతీశాడు, చేతిలో ఉన్న గ్రంథం జారి పడిపోయింది. త్వరలోనే అతడు గాఢనిద్రలోకి జారుకున్నాడు. అందువల్ల బాగా పొద్దుపోయే వరకు అతడు అక్కడే ఉండిపోవలసి వచ్చింది. అప్పుడతనికి ఒక స్వరం వినపడింది: "సోమరీ, చీమలయొద్దకు వెళ్లుము, వాటి నడతలు కనిపెట్టి జ్ఞానము తెచ్చుకొనుము"[4] ఉలిక్కిపడి, మెలకువ తెచ్చుకొని, త్వరపడి తన దారిన వెళ్లిపోయాడు.

కొండ శిఖరం మీద అతన్ని కలవడానికి ఇద్దరు మనుష్యులు పరుగున వచ్చారు. ఒకడు పిరికివాడు, మరొకడు అపనమ్మకం. క్రైస్తవుడు వాళ్లను చూస్తూ పెద్దగా అరిచాడు: "అయ్యలారా, మీ కేమయింది? మీరు తప్పుదారిన పరుగెత్తుతున్నారు."

తాము సీయోను పట్టణానికి బయలుదేరామని, ఆ క్రమంలో అత్యంత ప్రమాదకరమైన స్థలానికి వచ్చామని పిరికివాడు చెప్పాడు. "మేము ఎంత దూరం వెళితే, అది అంత ప్రమాదకరంగా మారుతోంది, అందుకే మేము వెనక్కి వెళ్లిపోతున్నాం" అన్నాడు.

"నిజమే" అన్నాడు అపనమ్మకం. "మాకు కొంచెం దూరంలో రెండు మూడు సింహాలను కూడ చూశాం. అవి మెలకువగా ఉన్నాయో నిద్రపోతున్నాయో తెలియదు; కానీ వాటి దగ్గరకు వెళితే మాత్రం మమ్మల్ని ముక్కలు ముక్కలుగా చీల్చిపారేయడం ఖాయం అనిపించింది."

క్రైస్తవుడు: మీరు నన్ను భయపెట్టేస్తున్నారు; కానీ సురక్షితంగా ఉండటం కోసం నేను ఎక్కడికి వెళ్లాలి? మా సొంత దేశం వెళదామంటే, అది అగ్ని గంధకాల కోసం సిద్ధంగా ఉంది; అక్కడ నేను ఖచ్చితంగా నశిస్తాను. నేను పరమ పురికి వెళ్లగలిగితే చాలు, అక్కడ క్షేమంగా ఉండగలనని నాకు తెలుసు. కాబట్టి ఎలాగైనా నేను ముందుకే వెళ్లాలి. వెనక్కి పోవడమంటే మరణమే తప్ప మరొకటి కాదు; ముందుకు వెళ్లాలంటే, మరణభయం వెంటాడుతుంది, కానీ దానికి ఆవతలవైపున నిత్యజీవమున్నది. అంచేత, నేను ముందుకే వెళతాను.

ఆవిధంగా అపనమ్మకం, పిరికివాడు ఇద్దరూ కొండ దిగువకు పరుగులు తీశారు. క్రైస్తవుడు తన దారిన వెళ్లిపోయాడు. తనకు వినపడిన మాటల గురించి ఆలోచిస్తూ, తన చంకలో ఉన్న గ్రంథం కోసం తడుముకోగా, అది కనిపించలేదు. అప్పుడతడు గొప్ప నిరుత్సాహంతో కృంగిపోయాడు. తన అమూల్యమైన వరం– కష్టకాలంలో ఆదరణ, మార్గదర్శి, పరమపురి ద్వారం

4. సామెతలు 6:6 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

వద్ద తనకు అనుమతి పత్రంగా ఇవ్వబడిన ఆ గ్రంథం ఏమయ్యింది? అది లేకుండా తాను ముందుకు సాగడం ఎలా? ఏం చెయ్యాలో అతనికి పాలుపోలేదు.

ఎట్టకేలకు అతడు విశ్రాంతి గృహంలో నిద్రపోవడం గుర్తుకొచ్చింది. అప్పటి నుండి అతడు ఆ గ్రంథాన్ని చూడలేదని అర్థమైంది. తన అజాగ్రత్తను, మార్గంలో నిద్రించడమనే తన పాపాన్ని మన్నించమని మోకాళ్లమీద పడి దేవునికి ప్రార్థించాడు. పశ్చాత్తాపం, భయం నిండిన హృదయంతో అతడు వెనుదిరిగాడు. తన గ్రంథంకోసం వెతుక్కుంటూ, నిట్టూర్పులు విడుస్తూ, ఏడుస్తూ, అది ఎప్పటికైనా దొరుకుందో లేదో అనుమానిస్తూ, ఒకవేళ దొరక్కపోతే, తనకు నిరీక్షణ ఏమైనా ఉన్నదా అని పరిపరివిధాల ఆలోచిస్తూ ఉన్నాడు.

ఒంటరితనం, అలసటతో, నీరసించిన ప్రయాణికులకు ఒకింత విశ్రాంతినిచ్చి, వారు మరల తమ ప్రయాణంలో ముందుకు సాగేందుకు దయామయుడైన ప్రభువు నిర్మించిన ఆ విశ్రాంతి గృహం కనిపించగానే అతడు పెద్దగా రోదించాడు: "అయ్యో, నేనెంత దౌర్భాగ్యుణ్ణి, అలసిపోయిన యాత్రికులు సేదదీరడం కోసం ప్రభువు నిర్మించినదాన్ని నా శరీర సుఖంకోసం ఉపయోగించుకొని, పట్టపగలు, కష్టకాలంలో నిద్రపోయానే, నేనెంత దౌర్భాగ్యుణ్ణి! వ్యర్థంగా ఎన్ని అడుగులు అదనంగా వెయ్యాల్సివచ్చింది! ఇశ్రాయేలుకు ఇలాగే జరిగింది. వారి పాపాలను బట్టి, ఎర్రసముద్రం దారిన, నలభై ఏళ్లపాటు అరణ్యంలో తిరుగులాడటం కోసం వెనక్కి పంపివేయబడ్డారు. నాకు ఆ పాపిష్టి నిద్ర పట్టకపోయివుంటే ఈపాటికి ఆనందంగా ఎంతదూరం ప్రయాణించి వుండేవాడనో! ఇప్పుడు చీకటి పడిపోతోంది, ఈ కఠినమైన కొండమీదనే ఈ రాత్రి ఉండిపోవలసి వస్తుందో ఏమో. అయ్యో, నేనసలు నిద్రపోకుండ ఉంటే ఎంత బావుండేది!"

ఈలోపు అతడు విశ్రాంతి గృహం వద్దకు చేరుకొని, తన గ్రంథం కనిపించక, అక్కడే కూర్చొని రోదించాడు. అయితే చివరికి (దేవుని ఏర్పాటును బట్టి) క్రిందికి చూడటంతో అక్కడ ఒక పీటక్రింద అతడు పోగొట్టుకున్న గ్రంథం కనబడింది. ఇప్పుడతని దుఃఖం ఆనందంగా మారింది, అతన్ని వెనక్కి నడిపించి, తాను పడవేసుకున్న అమూల్యమైన గ్రంథాన్ని చూపించినందుకు దేవునికి వందనాలు చెల్లించాడు. ఇప్పుడు ఆ గ్రంథాన్ని తన గుండెలకు హత్తుకొని, కొండమీదికి త్వరత్వరగా వెళ్లిపోయాడు.

భయభ్రాంతుడయ్యాడు

అతడు కొండపైకి చేరుకునేలోపే సూర్యాస్తమయమైంది. చీకటి అలుముకోవడంతో పాటు, తన మొండిధైర్యంతో నిద్రపోయిన కారణంగా కొనితెచ్చుకున్న అపాయాలను గుర్తుచేసుకొని, ముందు దారి ఎలావుంటుందోనని భయపడ్డాడు. "నిర్లక్ష్యంతో కూడిన నా నిద్ర పుణ్యమా అని ఇప్పుడు నేను చిమ్మ చీకటిలో నడుస్తూ, రాత్రుల్లో సంచరించే క్రూరమృగాల భయంకరమైన అరుపులు వినాల్సివస్తుంది" అనుకున్నాడు.

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

దారిలో సింహాలను చూశామని చెప్పిన పిరికివాడు, అపనమ్మకం అనేవాళ్ల మాటలు కూడ గుర్తుచేసుకున్నాడు. "ఈ మృగాలు రాత్రివేళ తమ వేటకోసం గర్జిస్తూ తిరుగుతూ ఉంటాయి కాబోలు, ఒకవేళ అవి నామీదపడి దాడిచేస్తే నన్ను నేను కాపాడుకోవడానికి చేతిలో ఏ ఆయుధమూ లేదు. వాటిని తోలివేయడం ఎలా, వాటిచేత చీల్చివేయబడకుండ తప్పించుకోవడం ఎలా?" అన్న ఆలోచనలో మునిగిపోయాడు.

తనకు దాపురించిన ఈ దుఃఖకరమైన పరిస్థితికి తనను తానే నిందించుకొంటుండగా, దూరాన అతనికి కొన్ని దీపాలు కనిపించాయి, వాటి మసక వెలుగులో ఒక గొప్ప రాజభవనం కూడ ప్రత్యక్షమైంది. అది దారికి కొంచెం వెనుక భాగంలో ఉన్న సత్రం, అందమైన భవనం. అక్కడ తనకు బస దొరుకుతుందన్న తలంపుతో తన నడక వేగాన్ని పెంచాడు. ఆ ఇంటికి దారితీస్తున్న ఇరుకు మార్గంలో ప్రవేశించి, దారికి ఇరువైపుల పండుకొని ఉన్న రెండు సింహాలను చూశాడు. అపనమ్మకం, పిరికివాడు చెప్పిన ప్రమాదాలు ఇవేనన్నమాట. వీటివల్లనే వాళ్లు వెనుదిరిగి, పరలోకపు మార్గం నుంచి వైదొలగిపోయారు. ఇప్పుడు తాను ఏం చెయ్యాలో ఆలోచించడంకోసం ఆగిపోయాడు. వాళ్లు చేసినట్లుగానే తానుకూడ వెనుదిరిగి పారిపోవాల్సి వస్తుందా ఏంటి; ముందు నుయ్యి, వెనుక గొయ్యి అన్న చందంగా తయారైంది అతని పరిస్థితి.

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

అయితే సందేహంతో, వెనక్కి తిరిగి వెళ్లిపోతాడా అన్నట్లు కనిపిస్తున్న క్రైస్తవుణ్ణి చూసిన మెలకువ అనే పేరుగల సత్రం కాపలాదారుడు అతని వైపు ఇలా కేకలు వేశాడు: "నీ విశ్వాసం బలహీనమైందా? ఎందుకు భయపడుతున్నావ్? సింహాల గురించి నువ్వేమీ భయపడకు, అవి రెండూ గొలుసులతో కట్టివేయబడి వున్నాయి. యాత్రికుల విశ్వాసాన్ని పరీక్షించి, విశ్వాసం లేనివారిని కనిపెట్టడం కోసమే వాటిని అక్కడ ఉంచారు. దారి మధ్యలోనే ఉండు, అవి నిన్ను గాయపరచవు." అప్పుడు క్రైస్తవుడు సింహాల మధ్యలోనుంచి ఆ దారిన ముందుకు సాగేందుకు

సాహసం చేశాడు. బంధించబడిన ఆ సింహాలు గర్జిస్తూ, అటూ ఇటూ కదిలాయి కానీ అతనికి ఏవిధమైన హాని చెయ్యలేదు. అతడు ఆ పర్వతపు ప్రభువుని స్తుతించి, కాపలాదారుడు నిలబడిన ద్వారంవైపు నడుచుకుంటూ వెళ్లాడు.

సుందర గృహాన్ని చేరుకొనుట

"అయ్యా, ఇదేమి ఇల్లు?" అడిగాడు క్రైస్తవుడు. "ఈ రాత్రికి నేను ఇక్కడ బసచెయ్యొచ్చా?"

కాపలాదారుడు: "యాత్రికులకు వసతి కల్పించడం కోసమే ఈ గృహాన్ని పర్వతాధికారి కట్టించాడు."

కాపలాదారుడు కూడ క్రైస్తవుని పేరు, అతడు ఎక్కడినుంచి వస్తున్నది, ఎక్కడికి వెళుతున్నది మొదలైన వివరాలన్నీ అడిగి తెలుసుకున్నాడు.

క్రైస్తవుడు: ఇప్పుడు నాపేరు క్రైస్తవుడు. అయితే, మొదట్లో నన్ను కృపారహితుడు అనేవారు. నేను

నాశనపురం నుంచి సీయోను పర్వతానికి వెళుతున్నాను. రాత్రి అయింది గనుక, ముందున్న దారి ఎలావుంటుందో నాకు తెలియదు. అంచేత, మీరు అనుమతిస్తే, ఈ రాత్రి నేను ఇక్కడ గడపాలనుకుంటున్నాను.

కాపలాదారుడు: కానీ, నీకు ఇంత ఆలస్యమైంది ఎందుకు?

క్రైస్తవుడు: నేను చాలా ముందుగానే వచ్చివుండేవాణ్ణి కాని, నేనెంత అజాగ్రత్తపరుడినంటే, కొండ ప్రక్కన ఉన్న చల్లటి పర్ణశాలలో విశ్రాంతి పొందడం కోసం కూర్చున్న నేను నిద్రపోయాను. ఒక గంటకు పైగానే నిద్రపోయివుంటాను, దానికితోడు నిద్రలో నా పవిత్ర గ్రంథాన్ని జారవిడుచుకోవడంతో మరింత ఆలస్యమైంది. కొండమీదికి చేరుకునేంత వరకు అది నాదగ్గర లేదన్న విషయమే నాకు గుర్తులేదు. అప్పుడు దానికోసం నేను మళ్లీ ఆ విశ్రాంతి గృహం దాక వెనక్కి వెళ్లవలసివచ్చింది.

కాపలాదారుడు: సరే, నేనొక యువతిని పిలుస్తాను, నీ కథ ఆమెకు నచ్చితే, ఇక్కడి నియమాల ప్రకారం, ఆమె తక్కిన యాత్రికులకు నిన్ను పరిచయం చేస్తుంది.

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

కనుక జాగరూకుడైన కావలివాడు ఒక గంటను మ్రోగించగానే అందమైన గంభీరమైన ఒక యువతి ప్రత్యక్షమైంది. ఆమె పేరు వివేకం.

కావలివాడు: ఇతడు నాశనపురం నుండి సీయోను కొండకు వెళ్లే ప్రయాణంలో ఉన్నాడు. ప్రొద్దుపోయింది గనుక ఈ రాత్రికి ఇక్కడ బసచెయ్యాలనుకుంటున్నాడు.

అతని పేరు, సరైన మార్గం తాను ఎలా కనుగొన్నాడు, దారిలో తాను చూసిన విశేషాలగురించి అడిగింది వివేకం. క్రైస్తవుడు తన అనుభవాలలో కొన్నిటిని వివరించి ఇలా అన్నాడు: "ఇక్కడ బసచెయ్యాలని నాకు ఆశగా ఉంది. ఎందుకంటే, యాత్రికుల విశ్రాంతి, భద్రత కోసం ఈ పర్వతాధికారే ఈ స్థలాన్ని నిర్మించాడని నాకు చెప్పబడింది."

ఆమె చిరునవ్వు నవ్వి, ఓ క్షణం ఆలోచించి, కన్నీటిపర్యంతమవుతూ "నా సహాయకుల్లో ఇద్దరు ముగ్గుర్ని పిలుస్తాను ఉండు" అన్నది. అప్పుడామె తలుపు దగ్గరకు వెళ్లి, సుబుద్ధి, భక్తి, ప్రేమ అనే అమ్మాయిల్ని పిలిచింది. కొద్దిసేపు సంభాషణ తర్వాత, లోపల ఉన్నవారిని కలిసేందుకు వారు అతన్ని లోనికి ఆహ్వానించారు. మర్యాదపూర్వకంగా వారికి నమస్కరించి, వారివెంట లోపల ఒక పెద్ద వసారాలోనికి వెళ్లాడు. అతడు కూర్చున్న తర్వాత ఒక చల్లని పానీయం అందించారు, రాత్రి భోజనం తయారవుతుండగా అతనితో కబుర్లు చెబుతూ గడిపారు.

భక్తి: సోదరా, క్రైస్తవుడా, అసలు నిన్ను ఈ యాత్రకు పురికొల్పింది ఏమిటి?

క్రైస్తవుడు: కొందరు యాత్రికులు నాకిచ్చిన గ్రంథాన్ని చదవడం ద్వారా నా పాపాల గురించి నేను కలవరపడ్డాను. అంతేకాదు, ఒక స్వరం నన్ను హెచ్చరించగా అది నా చెవుల్లో మారుమ్రోగుతుండెను. నా పట్టణము, నా దేశము నాశనము చేయబడుటకు నిర్ణయించబడ్డాయని ఆ స్వరం నాకు చెప్పింది. ఇది నాకు గొప్ప భారాన్ని తెచ్చిపెట్టింది. నా భారము నుండి విడుదలకోసం ప్రయత్నిస్తుండగా, ఈ మార్గాన వెళ్లి ఉపశమనం పొందమని ఒక సువార్తికుడు నాకు తెలియజేశాడు.

భక్తి: సువార్తికుడు నిన్ను చిన్నద్వారం వద్దకు వెళ్లమని సూచించాడు కదూ, అప్పుడు నీవు వివరణకర్త ఇంటివైపుకు వెళ్లావు. అవునా?

క్రైస్తవుడు: అవును, ఆ వివరణకర్త నాకు ఎన్నో అద్భుతమైన సంగతులు చూపించాడు. కనీసం ఒక ఏడాది వరకైనా అతని ఇంట ఉండగలిగేవాడినే కాని, నేను ఇంకా ముందుకు వెళ్లాలని నాకు తెలుసు. అప్పటికి ఇంకా నేను నాశనపురం నుండి వచ్చేటప్పుడు వేసుకొన్న పాత బట్టలే ధరించి, నా భారం మోసుకొనివున్నాను. అతడు నాకు సిలువయొద్దకు మార్గం చూపినాడు.

భక్తి: సిలువయొద్ద నీకు ఏమి దొరికింది?

క్రైస్తవుడు: నాకు సమాధానం లభించింది. సిలువమీద ఒకరు నా పాపాల కోసం రక్తం కార్చి మరణించడం నాకు దర్శనరూపంలో కనిపించింది. అప్పుడు నా భారం తొలగిపోయింది, గొప్ప

సంతోషం నా హృదయంలోనికి వచ్చింది. అప్పుడు నా యెదుట ప్రత్యక్షమైన ముగ్గురు మెరిసే మనుష్యులు నా నుదిటిమీద ఈ గుర్తు, నేను ధరించిన ఈ కోటును, నా చేతిలోవున్న ఈ గ్రంథపు చుట్టను నాకు ఇచ్చి అంతర్ధానమయ్యారు.

భక్తి: అయితే, దారిలో నీవు ఇంకా వేరే సంగతులు కూడా చూశావనుకుంటాను?

క్రైస్తవుడు: అవును. అయితే, ఇవి మరింత ప్రాముఖ్యమైన సంగతులు. దారిలో సోమరి, అమాయకుడు, మొండిధైర్యం అనే ముగ్గురు దారి ప్రక్కన నిద్రపోవడం కూడా చూశాను. వాళ్లని నిద్రలేపాలని ప్రయత్నించాను కాని వాళ్లు చాలా నిద్రమత్తులో ఉన్నారు. మర్యాద, వేషధారి అనేవాళ్లు గోడమీదనుంచి దూకి రావడం కూడ నేను చూశాను. నేను ఈ కొండను చేరేవరకు వాళ్లు నాతో కొంతదూరం వచ్చారు కాని, ఆ తర్వాత వాళ్లు సులువైన మార్గాలను ఎంచుకున్నారు.

"కొన్నిసార్లు నీ సొంత గ్రామం గురించి నువ్వు ఆలోచిస్తుంటావా?" అడిగింది సుబుద్ధి.

క్రైస్తవుడు: అవును, కానీ దానిగురించి ఆలోచించినప్పుడల్లా అవమానం, బాధ కలుగుతుంది. అయితే, నేను ఎక్కడినుంచి వచ్చానో ఆ ఊరికి వెళ్లదలచుకొని ఉంటే, అక్కడికి తిరిగివెళ్లిపోయేవాణ్ణి. ఎందుకంటే అలాంటి సదవకాశాలు నాకు ఎన్నో వచ్చాయి. అయితే ఇప్పుడు నేను మరింత శ్రేష్టమైన పరలోక దేశం వెళ్లాలనుకుంటున్నాను.

సుబుద్ధి: నీ పాత దేశం నీలో ఇంకా కొంత ఉందికదూ?

క్రైస్తవుడు: నాకు అవమానం కలిగించడానికి అది ఇంకాఉంది. ఒకప్పుడు నేనూ, నా దేశస్థులు ఆనందించిన పాత శరీరానుసారమైన తలంపులు కొన్ని ఇంకా నాలో ఉన్నాయి. అయితే ఇప్పుడవి నాకు సంతోషం కాదు, దుఃఖాన్ని కలిగిస్తున్నాయి. నా శరీరస్వభావాన్ని వదిలించుకొని, నాకు ఇష్టమొచ్చిన రీతిగా చెయ్యగలిగితే, నేనిక ఎన్నడూ మరో చెడ్డ ఆలోచన కలిగివుండను. అయితే, ఇప్పటికీ, "నేను మంచి చేసినా, చెడు నా వెంటనే ఉంటోంది."

సుబుద్ధి: కొన్నిసార్లు నీవు చెబుతున్న ఈ శరీరానుసారమైన సంగతులు శుద్ధిచేయబడినట్లు నీకు అనిపిస్తుంది కదూ?

క్రైస్తవుడు: నిజమే, ఆ క్షణాలు నా జీవితంలో బంగారు ఘడియలు. ఏది ఏమైనా, ఈ అనుభవాలు నేను ఆశించినంత తరచుగా సంభవించవు, నేను కోరుకున్నంత సేపు ఉండనూ ఉండవు.

సుబుద్ధి: ఆ విజయవంతమైన, సంతోషకరమైన అనుభవాలను నీవు ఏవిధంగా పొందేవాడవో నీకేమైనా గుర్తుందా?

క్రైస్తవుడు: ఓ, బాగా గుర్తుంది. నేను సిలువ యొద్ద చూసినవి, పొందినవి గుర్తుకొచ్చినప్పుడు; లేదా నేను వెళుతున్న దేశం గురించి ఆలోచించినప్పుడు; లేదా ఈ యాత్రికుని గ్రంథాన్ని చదివి

ప్రార్థన చేసుకున్నప్పుడు నా సందేహాలు, భయాలు, చింతలు, బాధలు, సమస్త చెడు అంతా మాయమైపోయినట్లు అనిపిస్తుంది. అయినా, ఇదంతా నా యంతట నేను సాధించినదేమీ కాదు గాని, నన్ను ప్రేమించి, నాకోసం తన్ను తాను అప్పగించుకొన్న వాని ఆత్మ ద్వారానే సాధించగలిగానని నాకు అనిపిస్తుంది.

సుబుద్ధి: సీయోను పర్వతానికి వెళ్లాలని అంత బలమైన కోరిక నీకు దేన్నిబట్టి కలుగుతుంది?

క్రైస్తవుడు: ఆహా, నా పాపాల కోసం తన్నుతాను అర్పించుకొని, నాకు నిత్యజీవాన్ని ప్రసాదించబోతున్నవానితో ఉండాలని నేనెంతో ఉవ్విళ్లూరుతున్నాను. ఆయన వలె ఉన్నవారితో సహవాసం చెయ్యాలని, ఈ వేదన, కష్టాలు, అతిక్రమాల నుండి శాశ్వతంగా విడుదల పొందాలని ఉంది.

"నీకు కుటుంబం ఏదైనా ఉందా?" అడిగింది ప్రేమ.

క్రైస్తవుడు: ఉంది. నాకు భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు.

ప్రేమ: మరి నీతోపాటు వాళ్లని ఎందుకు తీసుకురాలేదు?

క్రైస్తవుడు (ఏడుస్తూ): అయ్యో, అలా వస్తే ఎంత సంతోషంగా తీసుకొచ్చేవాడనో, కానీ నేనిక్కడికి రావడం వాళ్లకు ఏమాత్రం ఇష్టంలేదు.

ప్రేమ: కానీ, నువ్వు వాళ్లతో మాట్లాడి, ఆ స్థలం యొక్క పాపిష్టితనాన్ని, అక్కడే ఉండిపోవడం వల్ల కలిగే అపాయాన్ని వాళ్లకు చూపించావా? నీతో రమ్మని వాళ్లని బ్రతిమాలినావా?

క్రైస్తవుడు: నా శాయశక్తులా ప్రయత్నించాను. ఆ స్థలానికి సంభవించనైయున్న నాశనం గురించి దేవుడు నాకు బయలుపరచిన సంగతి కూడ వాళ్లకు చెప్పాను. కానీ నా మాటలు వాళ్లకు ఎగతాళిగా అనిపించాయి కాబోలు, వాళ్లు నమ్మలేదు.

ప్రేమ: కానీ, నీవు చెప్పే సందేశాన్ని వారికోసం దీవించమని దేవునికి ప్రార్థన చేశావా?

క్రైస్తవుడు: అవును. మనస్ఫూర్తిగా, హృదయపూర్వకంగా వేడుకున్నాను. ఎందుకంటే, నా భార్య, పిల్లలంటే నాకెంతో ఇష్టం.

ప్రేమ: అయితే, నీ సొంత దుఃఖము, రాబోవు నాశనం గురించి నీకున్న భయం గురించి వారికి చెప్పావా?

క్రైస్తవుడు: ఓ, ఎన్నో సార్లు, తరచూ కన్నీళ్లుపెట్టుకొని మరీ చెప్పాను.

ప్రేమ: మరి వాళ్లేమన్నారు? నీతో రాకపోవడానికి కారణం ఏమైనా చెప్పారా?

క్రైస్తవుడు: ఊహించుకొన్న కష్టాలను చూచి లోకమంతటినీ త్యజించడం మూర్ఖత్వమని నా భార్య

చెప్పింది. నా పిల్లలేమో పూర్తిగా ఇప్పటి సంతోషాలలో అనగా యౌవనకాలపు అల్పమైన సంగతుల్లో మునిగిపోయారు.

ప్రేమ: కానీ, వ్యర్థమైన నీ సొంత జీవితమే నీ ప్రోద్బలాన్ని సూన్యం చేసి నీ సాక్ష్యాన్ని నాశనం చేసిందా?

క్రైస్తవుడు: నా జీవితాన్ని నేను మెచ్చుకోలేను. ఎందుకంటే అనేక విధాలుగా నేను విఫలమైన సందర్భాలు నాకు తెలుసు; ఒక వ్యక్తి తన దైనందిన జీవితం ద్వారానే అతని మంచి వాదనలను, ఒప్పింపజేయడాన్ని రద్దుచేసుకోగలడని నాకిప్పుడు అర్థమవుతోంది. అయితే, నా అక్రమ ప్రవర్తన కారణంగా నాకుటుంబం నొచ్చుకునే సందర్భం రాకుండ నేనెంతో జాగ్రత్తపడ్డాను. నాతో రావడానికి వారు అసహ్యించుకోవడం నాకిష్టంలేదు. కానీ వాళ్లదృష్టిలో ఎటువంటి దుష్టత్వం లేని వాటిని సహా (వాళ్లకోసం) నేను ఎన్నో సంగతులను త్యజించడంలో మరీ ఖచ్చితంగా ఉంటానని తరచూ అంటుంటారు. సత్యాన్ని అంగీకరించి, నాతో రాకుండ వారిని ఆపేది నాలో ఏమైనా వారికి కనిపించిందీ అంటే అది దేవునికి వ్యతిరేకంగా పాపంచెయ్యకుండ లేదా ఎవరికీ ఏ కీడు తలపెట్టకుండ జీవించాలన్న నా అతి జాగ్రత్తే అయ్యుంటుంది.

ప్రేమ: నిజానికి, కయీను తన తమ్ముణ్ణి ద్వేషించడానికి కారణం తన క్రియలు చెడ్డవి కాగా, అతని తమ్ముడి క్రియలు నీతివంతమైనవి కావడమే.[5] ఆ కారణంగా నీ భార్య, పిల్లలు నీ విషయంలో నొచ్చుకున్నారంటే వారు నిజమైన నీతి విషయంలో గర్విష్టులని నిరూపించుకున్నారు గనుక వారి నాశనానికి నీవు ఉత్తరవాదివి కాకుండ, నీ ఆత్మను నీవు విడిపించుకున్నావు.

ఈవిధంగా వారు రాత్రి భోజనం సిద్ధమయ్యేవరకూ మాట్లాడుకుంటూ వున్నారు, అప్పుడు వారంతా లేచి భోజనశాలకు వెళ్లి తినడానికి కూర్చున్నారు. బల్లమీద మంచి పదార్థాలున్నాయి. బల్లవద్ద వారి సంభాషణ ఆ పర్వతాధికారి వైపుకు మళ్లింది: ఆయన ఏం చేశాడు; ఆ యింటిని ఆయన ఎలా కట్టించాడు; వారి మాటలను బట్టి ఆయనొక గొప్ప యుద్ధవీరుడని క్రైస్తవుడు గ్రహించాడు. మరణపు బలం కలిగినవానితో, అనగా మానవ జాతికంతటికి మరణం ప్రాప్తింపజేసిన వానితో ఆయన పోరాడి వానిని వధించాడు; అయినా, ఇది ఆయన వ్యక్తిగతంగా ఎంతో గొప్ప అపాయాన్ని, శ్రమలనూ పొంది సాధించిన విజయం.[6]

మానవజాతికి శత్రువైన వానిపై ఆయన తన రక్తాన్ని పణంగా పెట్టి ఈ విజయాన్ని సాధించాడని (ఈ సత్యాన్ని క్రైస్తవుడు ముందుగానే విశ్వసించాడు), ఈ దేశంపై ఆయనకున్న స్వచ్ఛమైన ప్రేమతోనే ఇదంతా చేశాడని వారు చెప్పారు. సిలువమీద మరణించాక ఆయన్ని మేము చూశామని, ఆయనతో మాట్లాడామని బల్లదగ్గర కూర్చున్నవారిలో కొందరు ప్రకటించారు. ఈ కథ స్వయంగా ఆయన నోటిద్వారానే విన్నామని వారి భావం: ఈ అరణ్య యాత్రకు పూనుకొన్న యాత్రికుల పట్ల ఆయనకున్న ప్రేమకు సాటిరాగల ప్రేమను ఈ విశ్వంలో మరెవరూ చూపలేరన్న మాట.

5. 1యోహాను 3:12 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8
6. హెబ్రీయులకు 2:14-15

ప్రకాశవంతమైన వాడబారని ఆ దేశంలో పాపులకు, దీనులకు సమృద్ధియైన వారసత్వాన్ని ఇచ్చేందుకై ఆయన తనకున్న సమస్త సంపదను, అధికారాన్ని వదులుకొని, తన మహిమను విడిచిపెట్టి, తనను తాను ఏ మాత్రం గౌరవంలేనివాడిగా[7] చేసుకున్నాడని వారు చెప్పారు. తాను సీయోను పర్వతాల పైన మాత్రమే ఉండేవాడు కాదని ఆయన చెప్పిన స్థిరమైన మాటలు వారు గుర్తుచేసుకున్నారు. ఒకప్పుడు బిక్షగాళ్లయిన యాత్రికుల్లో అనేకమందిని ఆయన యువరాజుల్ని చేశాడని కూడ వారు చెప్పారు.

అర్ధరాత్రి వరకు వాళ్లు అలా కూర్చొని మాట్లాడుకుంటూనే ఉన్నారు. అప్పుడు వారు ప్రార్థన చేసుకొని, తమ రక్షకునికి తమ్మును తాము అప్పగించుకొని నిద్రకు ఉపక్రమించారు. క్రైస్తవుడు ఒక పెద్ద మేడగదిలో పడుకున్నాడు. ఆ గదికి సూర్యోదయమయ్యే దిక్కున ఒక కిటికీ ఉన్నది. ఆ గది పేరు సమాధానం. తెల్లవారేదాక అతడు నిద్రపోయాడు.

వాళ్లంతా తెల్లవారు జామునే లేచారు; ఒకింత సంతోషించదగిన సంభాషణ అయిన తర్వాత, వారు క్రైస్తవుడితో చెప్పారు, ఆ స్థలానికి చెందిన కొన్ని అరుదైన సంగతులను చూపేంత వరకు అతడు వారిని వదిలి వెళ్లకూడదని.

ముందుగా వారు అతన్ని పఠనంలోనికి తీసుకెళ్లి, పురాతనమైన సంగతులను చూపించారు: కొండ యజమాని ఎవరో కాదు, వయోవృద్ధుని కుమారుడేనని, ఆయనకు నిత్యమైన వంశక్రమం ఉందని బయలుపరచే వంశావళిని అతనికి చూపించారు. ఆయన సాధించిన ఘనవిజయాల తాలూకు విషయాలన్నీ ఇక్కడున్నాయి, శాశ్వతమైన నిత్యనివాసములనిచ్చి తన సేవలో నియమించుకొన్న వందలాది సేవకుల పేర్లు అందులో ఉన్నాయి.

తర్వాత, ఆయన సేవకులు చేసిన యోగ్యమైన క్రియలలో కొన్నిటిని చదివి వినిపించారు: వారు రాజ్యములను జయించిన తీరు, నీతిని పొందిన విధానము, వాగ్దానములు పొందుకున్న విధానము, సింహముల నోళ్లను మూయించిన తీరు, అగ్నిని చల్లార్చిన విధానము, కత్తివాత పడకుండ ఎలా తప్పించుకున్నది, బలహీనతలో ఎలా బలపరచబడినది, పోరాటపటిమను కనుపరచి, అన్యుల సేనలను తిప్పికొట్టుట మొదలైన విషయాలన్నీ అతనికి చదివి వినిపించారు.[8]

తనను, తన కార్యాలనూ బహిరంగంగా అవమానించినవారిని సహా ప్రభువు ఎంత కరుణించి చేరదీయుటకు సుముఖంగా ఉంటాడో తెలిపే సంగతిని మరొక గ్రంథంలో చదివారు. ఇక్కడ కూడ గత కాలపు నీతిమంతులు జరిగించిన గొప్ప కార్యాల వివరాలున్నాయి. అవిశ్వాసులను కలవరపరచి, ఉన్నతమైన దేశానికి ప్రయాణించే నమ్మకమైన యాత్రికులకు ఆదరణ కలిగించేందుకై తప్పనిసరిగా సంభవించబోయే సంగతులను గూర్చి చెప్పబడిన ప్రవచనాలతో సహా వాటిని క్రైస్తవుడు గమనించాడు.

7. ఫిలిప్పీయులకు 2:7 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8
8. హెబ్రీయులకు 11:33-34

మరునాడు అతన్ని ఆయుధశాలకు తీసుకెళ్లారు. పవిత్రయుద్ధంలో పాల్గొనే సైనికులు ఉపయోగించే అన్నిరకాల ఆయుధాలను క్రైస్తవుడు చూశాడు. అందులో కత్తులు, డాళ్లు, శిరస్త్రాణాలు, రొమ్ముకవచాలు, మనఃపూర్వకమైన ప్రార్థనలు, ఎన్నడూ అరిగిపోని చెప్పులు మొదలైనవన్నీ ఉన్నాయి.[9] ఈ కొండను పాలించే నాయకుడు వాగ్దాన దేశానికి వెళ్లేదారిలో దుష్టుణ్ణి ఎదిరించడానికి ఇష్టపడే ప్రతి ఒక్కరికీ సరిపోయినన్ని ఆయుధాలు చేయించాడని వారు అతనికి చెప్పారు. ఆయుధ సామాగ్రి అవసరమైనవాళ్లు ఎంతమంది వున్నా సరే, అందరికీ సరిపోయినన్ని ఉన్నాయి.

వేటి సహాయంతోనైతే ప్రాచీన యాత్రికులు వీరోచిత కార్యాలు తలపెట్టినారో అటువంటి మరికొన్ని పరికరాలను కూడ వారు అతనికి చూపించారు: మోషే కర్ర; సీసెరాను వధించుటకు యాయేలు వాడిన సుత్తె, ఇనుప మేకు; మిద్యానీయుల సేనలను తరిమికొట్టుటకు గిద్యోను ఉపయోగించిన కుండలు, బూరలు, దీపాలు; ఆరువందల మంది అన్యులను సంహరించుటకు షమ్గరు ఉపయోగించిన ముల్లుగర్ర; ఫిలిష్తీయుల సైన్యమంతటినీ హతమార్చిన సంసోను ఉయోగించిన దవడ ఎముక; బాలుడైన దావీదు చేతిలో ఆయుధమై మహా బలశాలియైన గొల్యాతును మట్టికరిపించిన ఒడిసెల, రాయి; ఇంకా ఎన్నిటినో ప్రభువువారి ఆయుధాగారంలో అతనికి చూపించారు. ఆ తర్వాత వారు మరల విశ్రాంతి తీసుకున్నారు.

అప్పుడు నా కలలో క్రైస్తవుడు ఆ మరునాడు తన మార్గమున వెళ్లుటకు బయలుదేరుటకు సిద్ధపడటం చూశాను. అయితే, మరుసటి రోజు వరకు ఉండిపొమ్మని వారు అతన్ని బలవంతం చేశారు. "రేపు పగలు తేటగా ఉన్నట్లయితే, మేము నీకు మనోహరమైన పర్వతాలను చూపిస్తాం. అవి సుందరమైనవి, నీవు వెళ్లదలసిన ప్రదేశానికి మరింత సమీపంగా ఉండేవి గనుక నీ ఆత్మను ఉజ్జీవింపజేసి, అక్కడికి వెళ్లాలన్న బలమైన కోరికను పుట్టించి, నీ ప్రయాణానికి కావలసిన ధైర్యాన్ని కలిగిస్తాయి" అని అతనికి వాగ్దానం చేశారు. కనుక క్రైస్తవుడు ఆరోజు ఉండిపోవడానికి సమ్మతించాడు.

మరునాడు, మంచి ఎండవేళ, వారు అతన్ని మిద్దెమీదికి తీసుకెళ్లి, తూర్పువైపున దూరంగా చూడమని చెప్పారు. చాలా దూరాన, ఓ అద్భుతమైన పర్వత ప్రాంతాన్ని చూడగలిగాడు క్రైస్తవుడు. ఈ సుదూర ప్రాంతంలో మహా అరణ్యాలు, పచ్చని ద్రాక్షతోటలు, మెరిసే జలపాతాలు, విశాలమైన పొలాలు, అందమైన లోయలు, మైళ్లదూరంలో వ్యాపించిన పండ్లతోటలు, అద్భుతమైన పంటలు పండే మైదానాలతో చూడటానికి అత్యంత రమణీయంగా ఉంది. ఆ దేశం పేరు ఏంటి అని వారినడిగాడు. "అది ఇమ్మానుయేలు దేశం. ఈ కొండలాగే, అది యాత్రికులందరికీ చెందిన దేశం. అక్కడి కాపరులు నీకు చూపించగా, నీవు పరలోక పట్టణపు గుమ్మాన్ని చూడగలవు" అని చెప్పారు.

9. ఎఫెసీయులకు 6:14-18 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

అక్కడికి వెళ్లాలన్న కోరికను అతడు వెలిబుచ్చగా, వారు సమ్మతించారు. “అయితే ముందుగా, మనం మరొకసారి ఆయుధశాలకు వెళదాం పదండి” అన్నారు వాళ్లు. అక్కడ అతనికి ప్రయాణంలో

అవసరమయ్యే సామగ్రినంతా అతనికి తలనుండి అరికాలువరకు ధరింపజేశారు. ఆవిధంగా ధరించినవాడై అతడు తన స్నేహితులతో కలిసి గుమ్మం వరకు బయటకు నడిచాడు. ఆ దారిన యాత్రికులు ఎవరైనా వెళ్లడం చూశావా అని కాపలాదారుణ్ణి అడిగాడు.

"అవును. కొద్దిసేపటి క్రితమే ఒకరు వెళ్లడం చూశాను" అన్నాడు కావలివాడు.

"అతనెవరో తెలుసుకున్నావా?" అడిగాడు క్రైస్తవుడు.

"లేదు. అతని పేరేమిటో చెప్పమంటే, తన పేరు విశ్వాసి అని చెప్పాడు."

క్రైస్తవుడు: ఓహో, అతను నాకు తెలుసు. అతడు నాకు బాగా సన్నిహితుడైన పొరుగువాడు. అతడు మా ఊరివాడే. ఈపాటికి అతడు ఎంతదూరం వెళ్లి వుంటాడో చెప్పగలవా?

కాపలాదారుడు: బహుశా ఇప్పుడతడు కొండ దిగువకు చేరుకొని ఉంటాడు.

"మంచిది, కావలివాడా, ఇంతవరకు నీవు నాయందు చూపిన దయకు ప్రతిగా దేవుడు నీకు తోడుగా ఉండి, నిన్ను సమృద్ధిగా దీవించును గాక" అని చెప్పి, క్రైస్తవుడు తన యాత్రకు బయలుదేరాడు.

సుబుద్ధి, భక్తి, ప్రేమ, వివేకం అతనితోపాటు కొండ దిగువ వరకు తోడుగా వెళ్లారు. కొండ అంచుకు చేరేవరకు వాళ్లు మాట్లాడుకుంటూనే ఉన్నారు. అప్పుడు క్రైస్తవుడు ఇలా అన్నాడు: "కొండమీదికి ఎక్కడమే కష్టమనుకున్నాను. చూస్తుంటే, క్రిందికి దిగడమే మరింత ప్రమాదకరంగా ఉన్నట్లు అనిపిస్తోంది."

"అవును, నిజంగానే." ఒప్పుకుంది సుబుద్ధి. "ముఖ్యంగా కొంతకాలం కొండమీద ఉండి క్రిందికి దీనత్వపు లోయలోనికి వెళ్లడం, కొన్నిసార్లు కాలుజారిపడకుండ తప్పించుకోవడం మరీ కష్టంగా ఉంటుంది సుమా. ఇందుకోసమే మేము నీతోపాటు కొండ దిగువ దాక వచ్చాం." ఇప్పుడు క్రైస్తవుడు చాలా జాగ్రత్తగా నడిచాడు; అయినా ఒకటి రెండుసార్లు జారిపడక తప్పలేదు.

కొండ దిగువన క్రైస్తవుడి మంచి మిత్రులు అతనికి ఓ రొట్టె ముక్క, ద్రాక్షారసం సీసా, ఓ పెద్ద ఎండు ద్రాక్షల గుత్తిని అందించారు. వారికి వీడ్కోలు చెప్పి, అతడు ఒంటరిగా ముందుకు సాగిపోయాడు.

అధ్యాయం 4
దీనత్వము మరియు మరణపు లోయలలో

అపొల్యోను చేత దాడిచేయబడుట

దీనత్వమనే లోయలో క్రైస్తవుడికి తీవ్రమైన శోధనలు ఎదురయ్యాయి. అతడు ఎంతో దూరం వెళ్లకమునుపే మైదానంలో నుంచి అపొల్యోను అను భూతం తనవైపుగా రావడం క్రైస్తవుడు చూశాడు. వాడు కనిపించగానే క్రైస్తవుడికి భయం పట్టుకుంది, ఇప్పుడు ఏం చెయ్యాలో అతనికి అర్థం కాలేదు. త్వరపడి వెనక్కి వెళ్లిపోవడమా, లేక తనకేమీ భయం లేదన్నట్లుగా తన దారిన తాను ముందుకు సాగిపోవడమా? ఏం చెయ్యాలి? అప్పుడు తన వెనుకభాగంలో ఎటువంటి కవచం లేదని, శత్రువుకు వెన్నుచూపి పారిపోవడమంటే బాణాలతో తన వీపును చీల్చివేయుటకు అవకాశం కల్పించడమే అవుతుందని గుర్తుకొచ్చింది. ధైర్యం వహించి నేరుగా తన మార్గంలో ముందుకు సాగాలని అతడు నిర్ణయించుకున్నాడు; వెనక్కి తిరిగి పారిపోవడం కంటే ఇలా చెయ్యడం ద్వారా అతని విశ్వాసాన్ని కనపరచినట్లవుతుంది, అతని నియమాలకోసం నిలబడినట్లవుతుంది, అదే తనకు క్షేమకరంగా ఉంటుంది.

అంతలోనే అపొల్యోను అతని దగ్గరకొచ్చింది. చూడటానికి భీతిగొలిపే రాక్షసిలా ఉన్న దాని ఒంటినిండా చేపకుండే పొలుసులున్నాయి. వాటిని చూసుకొని అది ఎంతో అతిశయిస్తుంది; ఘటసర్పానికి ఉండే రెక్కలు, ఎలుగుబంటి లాంటి పాదాలు, సింహంలాంటి నోరు ఉన్నాయి; దాని కడుపులో నుంచి అగ్ని, పొగ బయటికొస్తున్నాయి. అది క్రైస్తవుడివైపు అత్యంత భయంకరంగా తేరిచూస్తూ, ఇలా అడిగింది: "పరదేశీ, నీవు ఎక్కడినుంచి వచ్చావు, ఎక్కడికి వెళుతున్నావు?

క్రైస్తవుడు: నేను నాశనపురం నుండి వచ్చాను, సీయోను పట్టణానికి వెళుతున్నాను.

అపొల్యోను: అయితే నీవూ నా ప్రజలలో ఒకడివన్న మాట. ఎందుకంటే ఆ నాశనపురం నాకు చెందినదే; నేనే దానికి రాజుని, దేవుడను. నీవు నాకు మరిన్ని సేవలు చేయవలసి ఉంది కదా, నీ రాజును విడిచి నీవు ఎందుకు పారిపోయావ్? నిన్ను ఇక్కడే ఒక్క దెబ్బకు హతమార్చగలను తెలుసా?

క్రైస్తవుడు: నిజంగానే నేను మీ రాజ్యంలోనే జన్మించాను; అయితే, మీ సేవ మరింత కఠినంగా ఉండటమే కాక, మీరిచ్చే జీతం మీద ఆధారపడి బ్రతకడం ఎవరికైనా కష్టమే. ఎందుకంటే,

పాపానికి జీతం మరణం.[1] అందుకే, నాకు అవకాశం దొరకగానే, అందరిలాగే నేను కూడ శ్రేష్టమైన జీవితాన్ని కనుగొనడం కోసం ఆ దౌర్భాగ్యపు దేశాన్ని వదిలి వచ్చాను.

అపొల్యోను: ఆ రాజ్యంలో ఏ రాజూ తన ప్రజలను ఇష్టపూర్వకంగా విడిచిపెట్టడని నువ్వు తెలుసుకోవాలి; నేను కూడ నిన్ను వదులుకోలేను. అయితే నీవు నా సేవ గురించి, జీతభత్యాల గురించి ఫిర్యాదు చేస్తున్నావు గనుక వాటిని పరిష్కరించుకోవచ్చు. నువ్వు తిరిగి వెనక్కి వెళ్లిపో. జీతం విషయంలో ఆ దేశంలో ఎంతవరకు వీలవుతుందో అంతా నీకు దక్కేలా నేను చూస్తాను.

క్రైస్తవుడు: కానీ, నేనిప్పుడు మరొకరికి– అనగా– రాజాధి రాజుకు నన్ను నేను సమర్పించుకొన్నాను– ఇక నేను వెనక్కి వెళ్లలేను.

అపొల్యోను: నిన్ను చూస్తుంటే, నాకొక సామెత గుర్తుకొస్తోంది. "పెనం మీద నుంచి పొయ్యిలోకి దూకినట్లుంది" నీ వ్యవహారం. అయితే, నీ రాజు చెప్పిన మాటలు విని, అతని సేవకు తమని

1. రోమా 6:23

తాము అప్పగించుకొన్నవాళ్లు ఇలా చెయ్యడం సర్వసాధారణమే: ఆ మార్గాన్ని కొంతకాలం చూశాక, అతనికి రాజీనామా సమర్పించి, నా అధికారం క్రిందికి రావడం మామూలే. నువ్వు కూడ అలాగే చెయ్. అంతా నీకు మేలే జరుగుతుంది.

క్రైస్తవుడు: నా ప్రభువు నా భారాన్ని తీసివేసి, నాకు శాంతిని ప్రసాదించాడు. నా విశ్వాసాన్ని ఆయనకు అర్పించి, ఆయన ఎడల విశ్వాసపాత్రుడిగా జీవిస్తానని ప్రమాణం చేశాను. ఒకవేళ నేనిప్పుడు వెనుదిరిగి పోయినట్లయితే, ఒక నమ్మకద్రోహిగా నాకు ఉరిశిక్ష పడటం ఖాయం.

అపొల్యోను: నా విషయంలో నువ్వు చేసింది అదే కదా, అయినా నేను దాన్ని మరిచిపోవడానికి సుముఖంగా ఉన్నాను. నువ్వు తిరిగివెళ్లి, నీ పూర్వపు యజమానికి విశ్వాసపాత్రుడిగా జీవించు చాలు.

క్రైస్తవుడు: నేను నీకు వాగ్దానం చేసింది నా యౌవ్వన ప్రాయంలో, నాకు శ్రేష్టమైన మార్గం గురించి తెలియనప్పుడు. కానీ ఇప్పుడు నేను సేవించే నా రాజు నన్ను మన్నించి, నీ సేవలో ఉన్నప్పుడు నేను చేసిన వాటన్నిటికి క్షమాభిక్ష పెట్టగల సమర్థుడు. అంతేకాదు, నిజం చెప్పాలంటే, ఆయన సేవ, ఆయన జీతం, ఆయన సేవకులు, ఆయన ప్రభుత్వం, ఆయన సహవాసం, నాకెంతో ఇష్టం. ఆయన దేశం నీ కంటే, నీవు చేసే ఉత్తుత్తి వాగ్దానాల కంటే ఎంతో మెరుగైనవి. ఇంతవరకూ నీవు చేసిన వాగ్దానాలలో దేనినీ నీవు నెరవేర్చలేదు. నేను ఆయన దాసుడను, ఆయననే వెంబడిస్తాను.

అపొల్యోను: అదంతా ఒట్టి భ్రమ. మరొక్కసారి ప్రశాంతంగా ఆలోచించి చూడు, నీవు ఎంచుకున్న మార్గంలో నీకు ఏమేమి ఎదురు కాబోతున్నాయో నీకే తెలుస్తుంది. నీకు తెలుసు, అతని అనుచరుల్లో చాలావరకు నిందలు, కష్టాలు, అలసట, కొరడా దెబ్బలు, రాళ్లదెబ్బలు, చెరసాల, వేదన, మరణమును అనుభవిస్తారని. ఇదంతా నన్ను, నా రాజ్యాన్ని వారు వ్యతిరేకించినందుకే అని కూడ నీకు తెలుసు. వారిలో ఎంతమంది భయంకరమైన మరణాల పాలైనారో ఒక్కసారి ఆలోచించు. ఇక నీ యజమాని తన మార్మికమైన, అదృశ్యమైన, ఉన్నత స్థలమును విడిచి వారిని విడిపించడానికి ఏనాడూ రాలేదు. అలాంటప్పుడు నాకంటే అతని సేవ ఉత్తమమైనదని ఎలా చెప్పగలవు? నా సేవకుల్లో హతసాక్షులుగా మారినవారు చాలా తక్కువ. నీ యజమాని నుంచి, అతని అధికారం నుంచి నన్ను వెంబడించినవారిని నేను నా అధికారంతోనో, మోసంతోనో ఎలాగైనా విడిపిస్తానని లోకమంతటికీ తెలుసు. ఇక నిన్ను కూడ తప్పక విడిపిస్తాను.

క్రైస్తవుడు: ఆయన తన సేవకులను కొంత కాలం కష్టాలనుండి విడిపించకపోవడానికి కారణం వారి మేలుకొరకే;[2] అది మంచితనం పట్ల వారికున్న విశ్వాసాన్ని, ప్రేమను బలపరుస్తుంది, వారి ప్రేమ ఎంత యథార్థమైనదో చూపించడానికి అదొక అవకాశాన్ని కల్పించి, వారి బహుమానాలను పెంచుకొనేలా చేస్తుంది.[3] ఇక నీవు చెప్తున్న మరణం గురించి ఆలోచిస్తే, అదంతా కేవలం

2. రోమా 8:28 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8
3. రోమా 8:18

తాత్కాలికమే. ఆయన తన సేవకులను మరణం నుండి విడిపించి వారికి పరిపూర్ణమైన జీవాన్ని ప్రసాదిస్తాడు. ఆయన సేవకులు– నశించిపోయే ఈ లోకంలో వారికి ఎదురయ్యే చిన్న చిన్న అపాయాలు, అసౌకర్యాలనుండి తక్షణమే విడుదల లభించాలని కూడ ఆశించేవారు కాదు గాని, వారు తమ ప్రభువుకోసం ఎదురుచూసేందుకు ఇష్టపడతారు. ఎందుకంటే, ఆయన తన మహిమతో, పరిశుద్ధ దూతల పరివారంతో తిరిగి వచ్చినప్పుడు, వారు అనుభవించిన శ్రమలన్నిటికి తగిన ప్రతిఫలం లభిస్తుందని వారికి బాగా తెలుసు.

అపొల్యోను: కానీ, నువ్వు ఇప్పటికే ఆయనకు నమ్మకద్రోహం చేశావుగా?

క్రైస్తవుడు: ఏ విషయంలో నేను ఆయనకు నమ్మకద్రోహం చేశాను?

అపొల్యోను: నిరాశలనే బురదగుంటలో నీవు జారి పడిపోయావు; లోకజ్ఞాని అనేవాడి సలహా మేరకు ధర్మశాస్త్రమనే వాని ఇంటికి వెళ్లేందుకు దారితొలగిపోయావు; దారిలో నిద్రపోయి నీ గ్రంథాన్ని పోగొట్టుకున్నావు; సంకెళ్లతో కట్టివేసివున్న సింహాలు కనిపించేసరికి వెనక్కి పారిపోవడానికి సిద్ధమయ్యావు; ఇక దారిలో నీవు చూచినవి, విన్నవి, నీ ప్రభువు నీకోసం చేసినవాటన్నిటి గురించి మాట్లాడేటప్పుడు లోలోపల ఒకింత గర్వంతోనే మాట్లాడుతుంటావు.

క్రైస్తవుడు: ఇదంతా సత్యమే. నీవు చెప్పకుండ వదిలేసినవి ఇంకా ఎన్నో ఉన్నాయి. కానీ, నేను సేవించే నా రాజు కరుణామయుడు, క్షమించుటకు సిద్ధమనస్సు గలవాడు.

అపొల్యోను: (భయంకరమైన ఆగ్రహంతో): ఈ రాజుకు నేను శత్రువుని. అతని చట్టాలన్నా, అతడన్నా, అతని ప్రజలన్నా నాకు అసహ్యం. నిన్ను బంధించడం కోసమే నేనిక్కడికొచ్చాను.

క్రైస్తవుడు: అపొల్యోనూ, జాగ్రత్త! నేను రాజమార్గంలో, పవిత్రమైన మార్గంలో వెళ్తున్నాను. నేను ఆయన సేవలో ఉన్నాను. కాబట్టి నీవు హద్దుమీరకుండ, జాగ్రత్తపడు.

అప్పుడు అపొల్యోను ఆ మార్గానికి అడ్డంగా దుమికి, క్రైస్తవుడితో ఇలా అన్నాడు: "ఈ విషయంలో నాకేం భయం లేదు. నీ చావు కోసం నువ్వు సిద్ధంగా ఉండు. సమస్త దుష్టశక్తుల మీద ఒట్టేసి చెబుతున్నా, నువ్వు ఒక్క అడుగు కూడ ముందుకు వెళ్లలేవు. ఇక్కడే నీ ప్రాణం తీసేస్తాను." అంటూ, క్రైస్తవుడి గుండెలమీదికి ఒక అగ్నిబాణం విసిరాడు. అయితే క్రైస్తవుడు తన డాలును ఉపయోగించి దాన్ని అడ్డుకున్నాడు. క్రైస్తవుడు తన కత్తి దూసి, యుద్ధానికి సన్నద్ధుడయ్యాడు. అపొల్యోను కోపంతో రగిలిపోతూ అతనిమీద వడగళ్లవానలా బాణాలు కురిపించాడు. తనని తాను కాపాడుకోవడానికి ఎంతగా ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. కొన్ని బాణాలు పైన, మరికొన్ని క్రింద అతన్ని తీవ్రంగా గాయపరచాయి. అప్పుడు అతడు కాస్త వెనక్కి తగ్గాడు. ఇది గమనించిన అపొల్యోను తన శక్తినంతా కూడగట్టుకొని క్రైస్తవుడి మీద దాడిచేశాడు. ఇక్కడ క్రైస్తవుడు తన మనఃపూర్వకమైన ప్రార్థనను గుర్తుచేసుకొని, ధైర్యం తెచ్చుకున్నాడు. సుమారు ఓ అరగంట సేపు వాళ్లిద్దరూ హోరాహోరీగా పోరాటం చేశారు. క్రైస్తవుడు రక్తం కోల్పోయి, అలసటచేత

దాదాపుగా అతని బలమంతా హరించుకుపోయింది. క్రైస్తవుడు నెమ్మదిగా బలహీనపడుతున్నాడని అపొల్యోను గ్రహించాడు. దీన్ని అదునుగా తీసుకొని అతడు క్రైస్తవుణ్ణి పట్టి నేలకేసి కొట్టాడు. అప్పుడు క్రైస్తవుని చేతిలోనుంచి అతని కత్తి ఎగిరిపోయింది. "ఇప్పుడు నువ్వు నా చేతికి చిక్కావు" అంటూ అపొల్యోను అతన్ని చావుదెబ్బలు కొట్టాడు.

అయితే, అపొల్యోను అతన్ని అంతం చెయ్యాలన్న ఉద్దేశంతో చివరి దెబ్బలు కొడుతుండగా దేవుని సంకల్పం కొద్ది క్రైస్తవుని చెయ్యి అతని కత్తిని తాకడంతో అతనికి నూతనోత్తేజం కలిగింది. తన శక్తినంతా కూడగట్టుకొని కత్తిని గటిగా పట్టుకొని, "నా శత్రువా, నామీద అతిశయింపవద్దు, నేను క్రిందపడినను, తిరిగి లేతును"[4] అంటూ అపొల్యోనును ఒక్క పోటు పొడిచాడు. దానితో అతడు చావుదెబ్బ తిన్నవాడిలా వెనక్కి పడిపోయాడు. తన శక్తినంతా కూడగట్టుకొని లేచి నిలబడిన క్రైస్తవుడు "మనలను ప్రేమించినవాని ద్వారా మనము వీటన్నిటిలో అత్యధిక విజయము పొందుచున్నాము"[5] అని కేకలు వేస్తూ అతనివైపు దూసుకొచ్చాడు. అపొల్యోను దీనికి తట్టుకోలేక, రెక్కలు చాచి ఎగిరిపోయాడు.

యుద్ధం ముగియడంతో క్రైస్తవుడు భారంగా ఊపిరిపీల్చుకొని, "సింహపు నోటినుండి నన్ను విడిపించి, అపొల్యోనును ఓడించడానికి నాకు సహాయం చేసినవానికి నేను కృతజ్ఞతాస్తుతులు చెల్లిస్తున్నాను" అన్నాడు.

అప్పుడు ఒక కరుణాహస్తము జీవవృక్షం నుండి స్వస్థపరచు ఆకులను తెచ్చి క్రైస్తవునికి ఇవ్వగా ఆ ఆకులను క్రైస్తవుడు తన గాయాలకు పట్టించాడు. అవి త్వరలోనే నయమైనాయి. అతడు అక్కడే కూర్చొని రొట్టెను తిని, సుబుద్ధి తనకు ఇచ్చిన ద్రాక్షరసం త్రాగాడు. సేదదీరిన క్రైస్తవుడు "నా మీదికి మరల ఏ శత్రువు దాడిచేస్తాడో ఏమో" అనుకొంటూ తన చేతిలో కత్తిని పట్టుకొని, తన ప్రయాణం తిరిగి ప్రారంభించాడు.

మరణపు లోయలో భీతిగొలిపే సన్నివేశాలు

ఈ లోయకు అవతలివైపున ఇంకా లోతైన మరొక లోయ ఉంది– అది గాఢాంధకారపు లోయ. దీనత్వపు లోయలో కంటే క్రైస్తవుడు అక్కడే ఎక్కువగా శ్రమపడ్డాడు. నా కలలో అతడు ఈ లోయ అంచుకు చేరడం, అక్కడే హడావిడిగా వెనక్కి తిరిగివస్తున్న స్వార్థప్రియుడు, విమర్శకుడు అనే ఇద్దరిని కలవడం నేను చూశాను. వారు కనాను దేశం గురించి చెడ్డవార్తలు తీసుకొచ్చినవారి సంతతికి చెందినవారు.

"మీరు ఎక్కడికెళుతున్నారు?" అడిగాడు క్రైస్తవుడు.

"వెనక్కి! వెనక్కి! మేం వెనక్కి వెళ్లిపోతున్నాం. ప్రాణం మీద ఆశవుంటే నువ్వు కూడా అదేపని చెయ్యడం మంచిది" అని అరిచారు.

4. మీకా 7:8
5. రోమా 8:37

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

క్రైస్తవుడు: ఎందుకు, మీకొచ్చిన కష్టం ఏమిటి?

'కష్టమా! నీవు ప్రయాణిస్తున్న ఇదే మార్గంలో మేము వెళుతున్నాం, మాకు ధైర్యం ఉన్నంతవరకు వెళ్లాం. నిజానికి మేము వెనక్కి తిరిగి వచ్చే అవకాశమే ఉండేది కాదు; ఇంకా కొంచెం దూరం వెళ్లివుంటే, ఈ కథ మీకు చెప్పడానికి, మిమ్మల్ని హెచ్చరించడానికి మేము ఇక్కడ ఉండేవాళ్లం కాదు."

క్రైస్తవుడు: కానీ, మీరు ఏం చూశారు?

ఎందుకు, మేము దాదాపుగా గాఢాంధకార లోయలోనికి వెళ్లినంత పనైంది. అదృష్టం కొద్ది ముందుగానే అపాయాన్ని పసిగట్టాం.

క్రైస్తవుడు: ఇంతకీ, మీరు చూసిందేమిటి?

ఏమి చూశామా? ఇంకేం చూడాలి, ఆ లోయ చాలదూ! అదొక చీకటి గొయ్యిలా వుంది. అందులో పిశాచాలు, వనదేవతలు, గోతిలో వుండే ఘటసర్పాలనూ చూశాం. భయంకరమైన శబ్దాలు కూడా విన్నాం– ఎడతెగని అరుపులు, కేకలు, శ్రమలనే ఇనుప సంకెళ్లలో బందీలైన అనేకుల ఆర్తనాదాలు వినిపించాయి. ఆ లోయపై కలవరమనే నల్లని మేఘం ఆవరించి, దాని మీద మరణ దూత ఎగురుతూ ఉంది. ఆ లోయ అత్యంత భయంకరమైనది గాను, పూర్తి అక్రమముతోను నిండివున్నది."

క్రైస్తవుడు: నేను కోరుకున్న నివాసానికి దారి ఇదేనంటే నమ్మలేక పోతున్నాను.

"నీ ఇష్టమొచ్చిన దారిన వెళ్లు బాబూ, మాకు మాత్రం అలాంటిదేమీ అక్కరలేదు. మేం వెనక్కి వెళ్లిపోతున్నాం" అన్నారు వాళ్లు.

ఆవిధంగా వారు తిరిగి వెళ్లిపోగా, క్రైస్తవుడు తన దారిన బయలుదేరి తనపై జరిగే దాడులను ఎదిరించేందుకు చేతిలో ఖడ్గాన్ని ధరించి ముందుకు సాగిపోయాడు.

ఇప్పుడతడు దారికి ఒక ప్రక్కన ఓ లోతైన గుంటను చూశాడు. శతాబ్దాలుగా గ్రుడ్డివారు ఇతర గుడ్డివాళ్లను నడిపించినది, దానిలో నుంచి ఇంతవరకు ఎవరూ బయటికి రాలేనిది ఆ గుంట; మరోవైపు మురికిగా ఉన్న బురద ఉన్నది. యుగయుగాలకు చెందిన కామాతురత గల వారందరూ పడిపోయి, గట్టిగా నిలబడుటకు వీలులేని ఊబి అది. ఒకసారి దావీదు మహారాజు ఇక్కడే పడిపోయాడు. కరుణాసంపన్నుడైన ప్రభువే గనుక అతన్ని బయటికి లాగివుండకపోతే అతడు శాశ్వతంగా అందులోనే మునిగిపోయేవాడు.

ఆ గొయ్యికీ, ఊబికి మధ్య దారి చాలా ఇరుకుగా ఉండటంతో క్రైస్తవుడు పడిపోకుండ ఉండటానికి బహు జాగ్రత్తగా ఉండవలసి వచ్చింది. ఒకరకంగా అది కత్తిమీద సాములాంటిదే. ముందుకు

సాగడం ప్రమాదకరమే కాని వెనక్కి తిరిగి వెళ్లిపోవడం మరింత అపాయకరమైనది. ముందు నుయ్యి, వెనుక గొయ్యిలా ఉంది అతని పరిస్థితి. తడివి చూస్తూ, నేలమీద ప్రాకుతూ, ఏ క్షణంలో తాను దారితప్పి మృత్యు ఒడిలోకి జారిపోతాడో తెలియని పరిస్థితిలో నెమ్మదిగా ముందుకు కదులుతున్నాడు. లోయ మధ్యలో, దారికి సమీపంగా ఉన్న నరకపు ద్వారంలో నుంచి అగ్నిజ్వాలలు, పొగ దారికి అడ్డంగా సుడులు తిరుగుతూ వస్తున్నాయి. మరోవైపు వికృతమైన శబ్దాలు, దుఃఖపూరితమైన ఆర్తనాదాలు వినిపిస్తున్నాయి, వాటి ధాటికి క్రైస్తవుని ఖడ్గం నిలువలేకపోయింది; అయినా అతని వద్ద శక్తివంతమైన మరో ఆయుధం సిద్ధంగా ఉంది: "మనఃపూర్వకమైన, బహు బలముగల ప్రార్థన."[6] గనుక అతడు ఇలా మొరపెట్టాడు, "ఓ దేవా, నిన్ను వేడుకొనుచున్నాను, నా ప్రాణమును విడిపించుము." అప్పుడు అతనికి మరి కాస్త విశ్వాసం ఉండింది.

అప్పుడప్పుడు మంటలు అతని మీదికి చెలరేగుతుండగా, అతడు కొంతదూరం ముందుకు సాగాడు. అయితే ఆ భయంకరమైన శబ్దాలు అతనికి ఇంకా వినపడుతూనే ఉన్నాయి. తనను చీల్చిచెండాడుతుందేమో లేక దారిలో మట్టిగడ్డ వలె నలిపివేస్తుందేమోననే అనుభూతి కలిగిస్తూ అతని ఎదుట అటూ ఇటూ తిరుగుతున్నట్లు ఏవో శబ్దాలు అతనికి వినపడుతున్నాయి. కొన్ని మైళ్లదూరం వెళ్లేవరకు అతన్ని వేధించాయి. అప్పుడు ఓ పిశాచాల మూక అతనివైపు వస్తున్న శబ్దం అతనికి వినపడినట్లనిపించింది. ఏం చెయ్యాలో నిర్ణయించుకోవడానికి అక్కడే ఆగిపోయాడు. ఒకవైపు, వెనక్కి వెళ్లిపోదామన్న భావన కలుగుతోంది; మరోవైపు, ఈ పాటికే లోయను సగం దాటివుంటాను కదా అనిపిస్తోంది. తాను ఇప్పటికే ఎన్నో అపాయాలను దాటి ముందుకు వచ్చాడని, ముందు కంటే వెనుక ఉండే అపాయాలే అధికమైనవని గుర్తించినవాడై, ముందుకు సాగిపోవడానికే నిశ్చయించుకున్నాడు. అప్పటికే ఆ పిశాచాలు అతనికి మరింత సమీపంగా వచ్చాయి. అయితే అవి పూర్తిగా అతనిమీదికి రాబోతుండగా అతడు పెద్దగా కేకవేశాడు, "దేవుడైన యెహోవా ఇచ్చు బలముతో నేను నడిచెదను." ఆ మాటలు విన్న పిశాచాలు వెనుకడుగు వేసి, ఏ మాత్రం ముందుకు రాలేదు.

ఒక్క విషయం రాయడం మాత్రం నేను మరువకూడదు: క్రైస్తవుడు మండుతున్న అగ్నిగుండం వద్దకు చేరుకున్నప్పుడు, అతడు ఎంత గందరగోళానికి గురైనాడంటే, తన సొంత గొంతునే అతడు గుర్తించలేక పోయాడు. ఆ గుంటను అతడు దాటివెళ్తున్న సమయంలోనే ఒక దయ్యం అతని వెనుక నిలబడి దేవునికి వ్యతిరేకంగా అతని చెవిలో అవమానకరమైన దైవదూషణ మాటలు వినిపించింది. అయితే అవి తన నోటనుండే వెలువడుతున్నాయి అనుకున్నాడు క్రైస్తవుడు. ఇది అతనినెంతో బాధించింది– దారిలో అతడు ఇంతవరకు చేసిన తప్పులన్నిటి కన్నా అధికంగా ఇదే అతన్ని ఎంతగానో క్షోభకు గురిచేసింది. ఎందుకంటే, తాను ఎంతగానో ప్రేమించిన, తనకోసం ఎంతో చేసిన ప్రభువుకు వ్యతిరేకంగా పలుకబడిన ఆ మాటలూ, ఆ తలంపులు ఇంత విద్వేషపూరితంగా, ఇంత అన్యాయంగా ఉన్నాయి. అయినా, ఆ మాటలు గురించి

6. యాకోబు 5:16 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

ఆలోచించకుండ, వాటి గుసగుసలు తాను వినకుండ ఉండలేకపోయాడు. అయితే ఈ చెడ్డమాటలు ఎక్కడి నుంచి వచ్చాయో, వాటిని వినకుండ తన చెవులను మూసుకోవడం ఎలాగో అతనికి తెలియలేదు.

ఇలాంటి దుఃఖభరితమైన స్థితిలోనే అతడు కొంతసేపు ప్రయాణించిన తరువాత, తనకు ముందుగా ఒక స్వరం తనతో ఇలా పలికినట్లు భావించాడు, "గాఢాంధకారపు లోయలో నేను సంచరించినను ఏ అపాయమునకు భయపడను. నీవు నాకు తోడైయుందువు."[7] ఇప్పుడు అతడు సంతోషంగా ఉన్నాడు: ఎందుకంటే: మొదటిగా, ఈ భయంకరమైన లోయలో తనతో పాటు దేవునికి భయపడువాడు మరొకడు ఉన్నాడని అతడు విశ్వసించాడు. రెండవదిగా, ఆ వ్యక్తితో దేవుడు తోడుగా ఉన్నాడని, లేకపోతే అలాంటి మాటలు అతడు పలుకగలిగేవాడు కాదని నమ్మాడు. అప్పుడు తనకు తాను ఇలా చెప్పుకున్నాడు, "ఒకవేళ దేవుడు అతనికి తోడుగా ఉంటే, ఆయన నాతోకూడ ఉన్నట్లే. లేకపోతే, నేను గుర్తించలేకపోయినా, ఇటువంటి స్థలంలో అలాంటి మంచి మాటలు నేను ఎన్నడూ వినగలిగేవాడిని కాదు." మూడవదిగా, త్వరలోనే అతన్ని చేరుకొని, తక్కిన మార్గమంతటిలో అతనితో చక్కని సహవాసం కలిగివుండవచ్చు ననికూడ అతడు నమ్మాడు. కాబట్టి, ముందుగా వెళుతున్న వ్యక్తిని పిలుస్తూ, వీలైనంత వేగంగా అతడు ముందుకు సాగాడు. కానీ, ఎవరూ బదులు పలుకలేదు. తన ముందు ఉన్న వ్యక్తి ఎవరైనా కాని అతనికి వినిపించిన మాటలకు అర్థం తెలిసివుండదు. లేదా అవి ఎక్కడినుంచి వచ్చాయో కూడ తెలియకపోవచ్చు. తానొక్కడే మార్గంలో ఉన్నాడని భావించాడేమో, అందుకే అతడు బదులు చెప్పలేదు.

గాఢాంధకారపు లోయలో నుంచి బయటపడుట

అయితే ఇప్పుడు తెల్లవారుతోంది. తూర్పు కొండలను చూస్తూ, క్రైస్తవుడు తనలో తాను ఇలా చెప్పుకున్నాడు, "మరణపు ఛాయలను ఆయన ఉషోదయంగా మార్చాడు." తాను వచ్చిన దారిని ఒక్కసారి వెనుదిరిగి చూసుకొని, ప్రభువు తనను ఇంతవరకూ ఎలా తీసుకొచ్చాడో ఆలోచిస్తూ ఉండిపోయాడు. "చీకటిలోని రహస్యములను ఆయన బయలుపరచుచు మరణాంధకారమును వెలుగులోనికి రప్పించును"[8] అన్న వచనాన్ని అతడు గుర్తుచేసుకొన్నాడు. తాను విడిపించబడిన అపాయాలన్నిటినీ చూసినప్పుడు అతడు ఎంతగానో చలించిపోయాడు.

ఇప్పుడు సూర్యుడు ప్రకాశిస్తున్నాడు, నిజానికి ఇది గొప్ప ఆశీర్వాదమే, ఎందుకంటే ఆ దారికి సంబంధించిన దారుణమైన భాగం ఇంకా ముందున్నది. అతని ఎదుట ఆ లోయ చివరిదాకా ఎన్నో ఉరులు, ఉచ్చులు, గుంటలు, జారుడు స్థలాలు, పెద్ద పెద్ద గోతులు, లోతైన గుంటలు ఉన్నాయి. చీకటిలో వెళుతూ వాటిని ఎవరూ తప్పించుకోలేరు, ఒకవేళ తప్పించుకోలేదంటే ఖచ్చితంగా చావును కొనితెచ్చుకొన్నట్లే. అయితే, ఇప్పుడు పట్టపగలు గనుక అతడు తన మార్గాన్ని చూడగలడు గనుక అతడు వాటన్నిటిని దాటివెళుతూ, ఇలా చెప్పుకున్నాడు, "ఆయన దీపం నా తలమీద వెలుగుతోంది, ఆయన వెలుగులో నేను చీకటి గుండా వెళతాను."

7. కీర్తనలు 23:4
8. కీర్తనలు 23:4

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

పైనుండి వస్తున్న ఈ వెలుగులో అతడు లోయ చివరికి చేరుకున్నాడు. ఇప్పుడు నా కలలో, ఆ లోయ చివర నేను వీటిని చూశాను: రక్తం, బూడిద, ఎముకలు, ఈ దారిన వెళ్లిన విశ్వాసులైన వేలాది యాత్రికుల నుజ్జునుజ్జయిన దేహాలు. ఇంత విస్తారమైన నరహత్యకు దారితీసిన కారణాలేమైయుంటాయో అని నేను ఆలోచిస్తుండగా, నాకు కొంచెం దూరంలో ఉన్న ఒక గుహను చూశాను. అందులో పోపు, అన్యుడు అను రెండు పూర్వకాలపు భూతాలు కనిపించాయి. వారి అధికారము, క్రూరత్వాలతో హతమార్చబడిన ఎంతోమంది స్త్రీ పురుషుల అస్థికలు, బూడిదలే నాయెదుట ఉన్నాయి.

ఆ దారివెంట క్రైస్తవుడు నిర్భయంగా వెళ్లినప్పుడు, అతడు ఎందుకు వేధించబడలేదో చూసి ఆశ్చర్యపోయాను. అప్పుడు తెలిసింది నాకు, అన్యుడు చనిపోయి చాలా కాలమైందని, పోప్ వృద్ధుడైపోయాడని. పోప్ యౌవనకాలంలో ప్రభుత్వంతో అతనికి ఎదురైన ఎన్నో అవాంతరాల

కారణంగా అతడు ఎంతో పిచ్చివాడై, కీళ్లు పట్టుకుపోయి, ఇప్పుడు తాను చేయగలిగిందంతా తన గుహ ఎదుట కూర్చుని, ఆ దారిన వెళుతున్న యాత్రికులను చూసి ఇకిలిస్తూ, గోళ్లు కొరుక్కుంటూ కాలం వెళ్లబుచ్చుతున్నాడని, ఇప్పుడు వారిమీదికి లంఘించడం అతనివల్ల కాదని కూడ తెలిసింది.

ఆ వృద్ధ రాక్షసుడు కనిపించి, "మీలో ఇంకా ఎక్కువమందిని కాల్చివేసేంత వరకు మీరు మీ మార్గాలను సరిచేసుకోరు కదూ" అని పలికేంతవరకు క్రైస్తవుడికి ఏమీ తోచలేదు. అయితే, క్రైస్తవుడు ఓపికతో, ముఖంలో ఎలాంటి ఆందోళన కనిపించకుండ, పోప్‌గారి వధశాల ప్రక్కగా ఎటువంటి హానిలేకుండ వెళ్లిపోయాడు.

అధ్యాయం 5
క్రైస్తవుడు మరియు విశ్వాసి

విశ్వాసికి జతకలిసిన క్రైస్తవుడు

ఇప్పుడు క్రైస్తవుడు ఒక చిన్న మట్టి దిబ్బ మీదికెక్కాడు. యాత్రికులు ముందున్న మార్గాన్ని చూడగలిగే విధంగా ఆ ఏర్పాటుచేయబడింది. అప్పుడు అతడు ఆ దారిలో విశ్వాసిని చూశాడు. అతడు పెద్దగా కేకలు వేశాడు, "ఇదిగో, నేనూ నీతో వస్తాను, ఆగు." విశ్వాసి వెనక్కి తిరిగి చూడటం అతడు గమనించాడు "ఆగు, నేను వచ్చేదాక ఆగు" అని అరిచాడు క్రైస్తవుడు. అయితే విశ్వాసి ఇలా జవాబిచ్చాడు: "లేదు, ఒక శత్రువు నన్ను వెంటాడుతున్నాడు గనుక నేను సమయం ఏమాత్రం పోగొట్టుకోవడానికి వీల్లేదు."

ఆ మాటలతో క్రైస్తవునిలో ధైర్యం కలగడంతో, తన శక్తినంతా కూడగట్టుకొని త్వరలోనే అతడు విశ్వాసిని చేరుకున్నాడు, ఉత్సాహంతో ఉప్పొంగిపోతూ అతన్ని దాటుకొని ముందుకు వెళ్లాడు. అప్పుడు క్రైస్తవుడు వెనుదిరిగి చూసి, తన సహోదరుని దాటి రాగలిగానన్న వృధా అతిశయంతో ఒక చిరునవ్వు చిందించాడు. అయితే, తన అడుగులు జాగ్రత్తగా చూచుకోని కారణంగా అతడు తొట్రిల్లి పడిపోయాడు, కాస్తంత ఆయాసంగా ఉండటంతో అతడు తక్షణమే పైకి లేవలేకపోయాడు. అప్పుడు విశ్వాసి వచ్చి అతనికి చేయూతనిచ్చి అతడు నిలబడేలా చేశాడు.

క్రైస్తవుడు: నా ప్రియ మిత్రుడా, విశ్వాసీ, నిన్ను చూడటం నాకెంతో సంతోషంగా ఉంది, ఈ అద్భుతమైన మార్గంలో మనమిద్దరం కలిసి ప్రయాణించేలా దేవుడు మన ఆత్మలను పురికొల్పినందుకు కూడ సంతోషంగా ఉంది.

విశ్వాసి: నా ప్రియ మిత్రమా, నేను మన ఊరు విడిచి వచ్చినప్పటి నుంచి నీతో సహవాసం చెయ్యాలనుకున్నాను గాని, నాకంటే నీవు బాగా తొందరగా బయలుదేరావు గనుక నేను ఇంతదూరం ఒక్కడినే రావలసి వచ్చింది.

క్రైస్తవుడు: నేను వచ్చేశాక, నాశనపురంలో నీవు ఎంతకాలం ఉన్నావు?

ఇంటి దగ్గరి కబుర్లు చెప్పిన విశ్వాసి

విశ్వాసి: ఇక ఉండలేను అనిపించినంత వరకు అక్కడే ఉన్నాను. ఎందుకంటే, ఆ ఊరు వదలి

నువ్వు వచ్చిన వెంటనే రకరకాల వదంతులు వచ్చాయి, త్వరలోనే మన పట్టణం మీదికి ఆకాశం నుండి అగ్ని దిగివచ్చి, అది కాలిపోతుందని.

క్రైస్తవుడు: అవునా? మీ పక్కింటివాళ్లు కూడ అలాగే మాట్లాడుకున్నారా?

విశ్వాసి: అవును, కొంతకాలం ఊరిలో ఏనోట విన్నా ఇదే మాట వినిపించేది.

క్రైస్తవుడు: మరి వాళ్లంతా అలా మాట్లాడుకున్నప్పుడు, రానున్న అపాయాలను తప్పించుకోవడానికి నువ్వు తప్ప ఆ స్థలాన్ని విడిచి ఎవ్వరూ రాలేదు ఎందుకని?

విశ్వాసి: ఆ సంగతి గురించి విపరీతంగా మాట్లాడుకున్నారులే. అయినా, అది సత్యమని వాళ్లు నమ్మినట్లు నాకు అనిపించలేదు. ఎందుకంటే, దాని గురించిన చర్చలు వాడిగా జరుగుతున్నప్పుడు మాటల మధ్యలో వారు నిన్ను తీవ్రంగా విమర్శించడం నేను విన్నాను. అంత హడావుడిగా, వేళకాని వేళలో అలాంటి ప్రమాదకరమైన ప్రయాణానికి సమకట్టినందుకు వాళ్లు నిన్ను చాలా విమర్శించేవారు. అయినప్పటికీ, ఆ వార్త నిజమేనని, ఆకాశం నుండి అగ్ని గంధకాలు కురిసి మన పట్టణం నాశనం చేయబడుతుందని నేను నమ్మాను– ఇప్పటికీ నమ్ముతున్నాను.

క్రైస్తవుడు: మన పొరుగువాడైన మెత్తన గురించి ఎవరైనా మాట్లాడుకోవడం నువ్వు విన్నావా?

విశ్వాసి: అవును, క్రైస్తవుడా, అతడు నిన్ను నిరాశల గుంటవరకు వెంబడించాడని, అందులో అతడు పడిపోయాడని కొందరు చెప్పుకోవడం నేను విన్నాను. ఆ సంగతి ఎవరికీ తెలియడం అతనికి ఇష్టం లేదు. అయినా, అది జరిగేవుంటుందని నాకు ఖచ్చితంగా తెలుసు. ఎందుకంటే అతనిమీద అలాంటి బురదే ఉంది.

క్రైస్తవుడు: మరి అతని పొరుగువారు అతనితో ఏమన్నారు?

విశ్వాసి: ఓహ్, అతన్ని అందరూ నిందించారు; కొందరు అతన్ని తృణీకరించి హేళనచేశారు; పైగా అతనితో ఎవరూ పెద్దగా సంబంధాలేవీ పెట్టుకున్నట్లు లేదు. ఇప్పుడు అతని పరిస్థితి ఊరు విడిచి వెళ్లకముందుకంటే ఏడింతలు అధ్వాన్నంగా మారినట్లుంది.

క్రైస్తవుడు: కానీ అతడు వదిలి వచ్చిన మార్గాన్ని వాళ్లే స్వయంగా తిరస్కరిస్తున్నప్పుడు అతనితో అంత కఠినంగా ఉండవలసిన అవసరం ఏముంది?

విశ్వాసి: అయ్యో, వాళ్లంతా "వాడిని ఉరితీయండి; వాడు నమ్మకద్రోహి; వాడు తన వృత్తిలో నమ్మకంగా లేడు" అన్నారు. నువ్వు చేసే పనులే ఇతరులు చేసినప్పుడు వారేదో తప్పుచేసినట్లు మాట్లాడటం చుస్తుంటే మానవ స్వభావంలోని ద్వంద్వ నీతి ఇదే అనిపిస్తుంది నాకు.

క్రైస్తవుడు: నువ్వు ఊరువిడిచి రాకమునుపు అతనితో మాట్లాడే అవకాశం నీకు ఎప్పుడూ రాలేదా?

విశ్వాసి: లేదు, ఒకసారి నేను అతన్ని ఓ వీధిలో కలిశాను. అయితే అతడు చేసినదాన్ని బట్టి సిగ్గుపడుతున్న వాడిలా అతడు ముఖం చాటేసి వెళ్లిపోయాడు; అంచేత నేను ఏమీ అనలేదు.

క్రైస్తవుడు: మొదట్లో అతనిమీద నాకు ఆశలుండేవి కాని, ఇప్పుడు భయమేస్తోంది వాడు ఖచ్చితంగా మన ఊరితోపాటు నాశమవుతాడని. "కుక్క తన వాంతికి తిరిగినట్టును, కడుగబడిన పంది బురదలో దొర్లుటకు మళ్లినట్టును" అను నిజమైన సామెత చొప్పున వానికి సంభవించింది.[1]

విశ్వాసి: అతని విషయంలో నాకు కూడా అదే రకమైన భయాలున్నాయి. కానీ జరుగబోయేదాన్ని ఎవరు అడ్డుకోగలరు?

క్రైస్తవుడు: మంచిది మిత్రమా విశ్వాసి, దారిలో నీకు ఏమైందో చెప్పవా.

విశ్వాసి తన శోధనలను గుర్తుచేసుకొనుట

విశ్వాసి: మీరు పడిపోయారని తెలిసిన ఆ బురదగుంటను తప్పించుకొని, ద్వారం వరకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చేరుకున్నాను. అయితే శ్రీమతి కామిని అనే తెలివైన అందగత్తెను దారిలో కలిశాను. ఆమె నన్ను సరైన మార్గంనుంచి నాశనమార్గంలోనికి దాదాపుగా దారి మళ్లించిందనే చెప్పాలి.

క్రైస్తవుడు: ఆవిడ పన్నిన వలలో పడకుండ నీవు తప్పించుకోగలిగావు మంచిదైంది. యోసేపు కూడ అలాంటి స్త్రీ సాంగత్యంలో చిక్కుపడి ఆమెనుంచి తప్పించుకున్నాడు నీకు గుర్తుంది కదా; కానీ దానివల్ల అతని ప్రాణాలకే ముప్పువాటిల్లింది.[2] దావీదు మహారాజు కూడ అదే తరహాలో శోధించబడ్డాడు. కాకపోతే అతడు "తన స్వకీయమైన దురాశచేత ఈడ్వబడి మరులుకొల్పబడిన వాడయ్యాడు."[3] ఆవిధంగా అతడు, లోయలో నీవు చూసిన పతనమనే బురదలో పడిపోయాడు. కరుణామయుడైన ప్రభువు అతన్ని పైకి లేవనెత్తిన మాట నిజమే అయినా, దాని తాలూకు ఇబ్బందులు అతని జీవితాంతం అనుభవించాల్సి వచ్చింది.

విశ్వాసి: ఆవిడ ఎంత ముఖస్తుతి మాటలు చెప్పేదో నీవు ఊహించలేవు సుమా (నీకు కూడ అదేరకమైన అనుభవం ఉంటే తప్ప). సరైన మార్గమును ఎన్నుకోవడంలో నేను చూపిన ధైర్యాన్ని, నా తెలివితేటల్ని ఆమె మెచ్చుకుంది; నా బలాన్ని, ఆరోగ్యకరమైన రూపాన్ని అభినందిస్తూ, నా గురించి ఇంకా తెలుసుకోవాలని, నేను ఎంతో మనోహరమైన వ్యక్తినని చెప్పింది. రక్షణ మార్గమంటే ఎంతో ఇష్టమున్న వ్యక్తిలా ఆమె నా గ్రంథం గురించి, జీవితం గురించి ప్రశ్నలడిగింది. ఆదాము హవ్వలకు మొదట ఉన్న పాపమెరుగని స్థితిని మరల పొందడం సాధ్యమైతే ఎంత బావుంటుందో అనికూడ పలికింది. మానవ స్వభావం గురించి తన అవగాహన, అందమైన తన రూపంతో నన్ను ఆకర్షించే ప్రయత్నం చేస్తుందేమో అన్న అనుమానం వచ్చింది. అయినా ఆమెది చక్కని వ్యక్తిత్వం, ఆమె వైఖరి ముచ్చటగా ఉండేది. ఆమె ఎంతో ఆకర్షణ గలది, ముఖ్యంగా మానవ

1. 2పేతురు 2:22 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8
2. ఆదికాండము 39:1-20
3. యాకోబు 1:14

స్వేచ్ఛ, స్వాభావిక ప్రేమను గురించి మాట్లాడినప్పుడు ఆమెతో ఏకీభవించేలా నన్ను దాదాపుగా ఒప్పించిందనే చెప్పాలి. "కొంచెం దూరమే, కొన్ని క్షణాల సుఖం కోసమే" అని కవ్వించింది. అన్ని రకాల సంతృప్తిని అందిస్తానని ఆమె నాకు వాగ్దానం చేసింది. ఆ విషయంలో ఏదైనా తప్పు జరిగితే, ప్రేమగల దేవుడు దావీదును మన్నించినట్లే నన్ను కూడ క్షమిస్తాడులే అని చెప్పింది.

క్రైస్తవుడు: మంచి మనస్సాక్షిని మాత్రం ఆమె వాగ్దానం చెయ్యలేదనుకుంటా.

విశ్వాసి: లేదు, నా మాటల భావం నీకు అర్థమైందనుకుంటాను– అన్ని రకాల శరీరసంబంధమైన, పాపపు సంతృప్తి అనే నా ఉద్దేశం.

క్రైస్తవుడు: ఎలాగైతేనేం. నువ్వు తప్పించుకున్నావు! "వేశ్య నోరు లోతైన గొయ్యి యెహోవా శాపము నొందినవాడు దానిలో పడును."[4]

విశ్వాసి: కానీ, నేనామెను పూర్తిగా తప్పించుకున్నానో లేదో నాకు తెలియదు.

క్రైస్తవుడు: అలా ఎందుకు? ఆమె దుర్మార్గానికి నువ్వు సమ్మతించలేదనే నా నమ్మకం.

విశ్వాసి: ఓహో, ఆవిడ తన హద్దులుదాటి ప్రవర్తించాలని చూసింది కాని, నేను నా దేహాన్ని అపవిత్రం చేసుకోలేదు. నాకొక పవిత్రమైన హెచ్చరిక గుర్తుకొచ్చింది: "దాని నడతలు మరణమునకు దిగుటకు దారితీయును; దాని అడుగులు పాతాళమునకు చక్కగా చేరును"[5]. అందుచేత నేను తన మోసకరమైన, కుయుక్తితో కూడిన సలహాలను వినకూడదని మనస్సులో గట్టిగా నిర్ణయించుకున్నాను. సొగసైన ఆమె అందచందాలను చూడకుండ నా కళ్లు మూసుకున్నాను, వెచ్చని ఆమె కౌగిలికి చిక్కలేదు. అంతటితో ఆమె నన్ను తిట్టుకొని, తనదారిన తాను వెళ్లిపోయింది. అయినా, అప్పటి నుండి నా మనస్సు పవిత్రంగా ఉందని చెప్పలేను. ప్రభువుకే తెలుసు, ఆమెను కలవకుండ ఉండివుంటే ఎంత బావుండేదో.

క్రైస్తవుడు: బహుశా నీవు బలవంతుడవై, ఈ గొప్ప విపత్తునుండి ఇతరులను రక్షించగలవేమో. అయితే, దారిలో నీకు వేరే శోధనలేమైనా ఎదురయ్యాయా?

విశ్వాసి: అవును, ఇబ్బందుల కొండ దిగువకు నేను చేరుకున్నప్పుడు, నాగురించి, నేను ఎక్కడికి వెళుతున్నది అడిగి తెలుసుకున్న ఒక ముసలివాణ్ణి కలుసుకున్నాను. నేను పరమపురికి వెళుతున్న యాత్రికుడనని చెప్పాను. అప్పుడు అతడు ఇలా అన్నాడు, "నిన్ను చూస్తుంటే నిజాయితీపరుడిలా ఉన్నావు. నేనిచ్చే జీతం పుచ్చుకొని, నాతో ఉండటం నీకు ఇష్టమేనా?"

అతని పేరు, అతడు ఎక్కడ ఉండేది చెప్పమని అడిగాను. తన పేరు తొలి ఆదాము, తాను మాయానగరంలో నివసిస్తానని చెప్పాడు. తన దగ్గర వున్న పని ఏమిటి, ఆ పనికి ఎంత మొత్తం చెల్లిస్తావో చెప్పమని అడిగాను. ఈలోకపు విషయాలలో తలమునకలై అనుభవించడమే పని, అతని ఆస్థినంతా నేను వారసత్వంగా దక్కించుకోవడమే నాకిచ్చే జీతమని చెప్పాడు. అతని ఇల్లు

4. సామెతలు 22:14 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8
5. సామెతలు 5:5

ఎలా ఉంటుంది, వేరే దాసులు ఇంకా ఎవరున్నారు వంటి మరి కొన్ని సంగతులు కూడా అడిగి తెలుసుకున్నాను. అతని ఇంటిలో జీవితానికి అవసరమైన సకల సౌకర్యాలు ఉన్నాయని, తన ముగ్గురు కుమార్తెలే తనకు సేవకులని చెప్పాడు. వారి పేర్లు: శరీరాశ, నేత్రాశ, జీవపు డంబము.[6] పనంతా వారికే అప్పగించబడిందని, నన్ను కూడ ఎంతో ఆనందంగా చేర్చుకోవడానికి సిద్ధంగా ఉన్నానని వివరించాడు. వారి కోర్కెలను తీర్చగలిగితే, వారిలో ఒకరు లేదా ముగ్గురూ నన్ను వివాహమాడతారట. తనతో ఎంతకాలం ఉండాలో చెప్పమని అడిగాను. తాను బ్రతికివున్నంత కాలం నేను తనతో ఉండవచ్చునట, ఆ తరువాత నేను బ్రతికినంత కాలం ఆ యింటిలోనే ఉండవచ్చు, లేదా ఆస్థిని నా యిష్టమొచ్చిన విధంగా వాడుకోవచ్చునని చెప్పాడు. అప్పుడు నేను ఈ రకమైన యాత్రలు చెయ్యనవసరం లేదు. ఇతర యాత్రికుల ప్రయాణ ఖర్చులు నేనే భరించవచ్చు. ఆ విధంగా నేనందించే ధనసాయంతో అనేకులు పరమపురికి చేరుకోగలరు.

క్రైస్తవుడు: సరే, ఇంతకీ ఆ ముసలాయన, నువ్వు ఏ నిర్ణయానికి వచ్చారు?

విశ్వాసి: మొదట అతని ప్రతిపాదన బాగానే ఉంది గనుక ఒప్పుకుందామనే అనుకున్నాను. అతడు మంచి న్యాయవంతుడుగా, చాలా హేతుబద్ధమైన వ్యక్తిగా అనిపించాడు. అయితే అప్పుడు నాకు ఓ ప్రాచీన యాత్రికుడైన అపొస్తలుడగు పౌలు మాటలు గుర్తుకొచ్చాయి: "మోసపోకుడి, దేవుడు వెక్కిరింపబడడు . . . తన శరీరేచ్ఛలను బట్టి విత్తువాడు తన శరీరమునుండి క్షయమను పంట కోయును"[7]. తరువాత, అతడు నాతో మాట్లాడుతుండగా అతని ముఖాన్ని చూస్తుంటే అతని నుదుటిమీద నాకు ఈ మాటలు కనిపించాయి: "ప్రాచీన స్వభావమును దాని క్రియలతో కూడ మీరు పరిత్యజించుడి."

క్రైస్తవుడు: అప్పుడు ఏమైంది?

విశ్వాసి: అప్పుడు నాకనిపించింది, ఈ ముసలివాడు నన్ను తన బానిసగా చేసుకోవాలనుకున్నాడని. ఒక్కసారి నేను అతని ఇంటిలో చేరానంటే ఇక నన్ను ఎవరికైనా డబ్బున్నవాళ్లకు అమ్ముకోడానికి సిద్ధంగా ఉంటాడు. కాబట్టి అలాంటి జీవితం జీవించడం కోసం నా యాత్రను విడిచిపెట్టలేనని అతనికి చెప్పాను; అది నాకు సమ్మతం కాదని, అతని యావదాస్థిని నాకిచ్చినా నేను దానికి సమ్మతించనని చెప్పాను. అంతటితో అతడు నన్ను ఓ బుద్ధిహీనుడిగా, మూఢునిగా జమకట్టి, నా జీవితాన్ని దుర్భరం చెయ్యడానికి నా వెనుక ఒకరిని పంపిస్తానన్నాడు. నేను వెళ్లిపోదామని ప్రక్కకు తిరిగానో లేదో అతడు నన్ను గట్టిగా కౌగలించుకొని, మొదట నేను తన కుమారుడినేనంటూ నా నడుము విరిగిపోయేంత గట్టిగా పట్టుకొని నన్ను వెనక్కి లాగాడు. అప్పుడు నేను "అయ్యో, నేనెంత దౌర్భాగ్యుడను"[8] అంటూ రోధించాను. ఇంతలో మరోవైపు ఓ అదృశ్యహస్తం నన్ను కొండశిఖరం పైకి లాగుతున్న అనుభూతి కలిగింది. ఆవిధంగా నేను కొండమీదికి వెళ్లిపోయాను. సగం దూరం వెళ్లానో లేదో ఒకడు నా వెనుక పక్షిరాజుకన్నా వేగంగా రావడం చూశాను. అతడు నన్ను పర్ణశాలవద్ద దాటిపోగలిగాడు.

6. 1యోహాను 2:16
7. గలతీయులకు 6:7-8
8. రోమా 7:24

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

క్రైస్తవుడు: అక్కడే, నేను విశ్రాంతికోసమని కొద్దిసేపు కూర్చొని, నిద్రపోయి నా రొమ్మున ఉన్న ఈ అమూల్యమైన గ్రంథాన్ని పోగొట్టుకున్నది.

విశ్వాసి: అరె. భలే వింతగా ఉంది కదూ? సరే, ఇక నా మిగతా కథ విను: నా వెంటపడుతున్నవాడు నన్ను దాటిపోయినవెంటనే, ఏదో బయటికి తీసి నా మీద ఒక భయంకరమైన దెబ్బ వేశాడు. నేను కోలుకున్న తరువాత అతన్ని అడిగాను, ఎందుకు అలా చేశావని. నాలో తొలి ఆదాము పట్ల రహస్యంగా ఉన్న అభిమానాన్ని బట్టి నేను నిజంగానే అతని ఇంటికి చెందినవాడను కాబట్టే అలా చేశానని చెప్పాడు. వాడు నన్ను మరలా కొట్టాడు, పూర్తిగా సొమ్మసిల్లిపోయేలా కొట్టాడు. నేను స్పృహలోనికి వచ్చి, నామీద జాలిచూపించమని అతన్ని వేడుకున్నాను. "ధర్మశాస్త్రమునకు కనికరం ఉండదు" అంటూ నన్ను మరో దెబ్బ కొట్టాడు. వాడు నన్ను చంపివుండేవాడే, సందేహం లేదు కాని, ఆ మొదటి ఆదాము నుండి నన్ను విడిపించిన వ్యక్తే మరల నాకు అండగా వచ్చి నన్ను వదిలేయమని వానిని ఆదేశించాడు.

క్రైస్తవుడు: ఆ వ్యక్తి ఎవరో నీకు తెలుసా?

విశ్వాసి: మొదట్లో నాకు తెలియలేదు. కానీ ఆయన నాకు ముందుగా వెళుతున్నప్పుడు ఆయన చేతుల్లోను, పాదాలలోను గాయపు గురుతులు కనిపించాయి. అప్పుడు తెలిసింది ఆయన మన ప్రభువని.

క్రైస్తవుడు: నీవెంట పడి నిన్ను తరిమిన వ్యక్తి మోషే గాని లేదా అతని మనుష్యుల్లో ఒకరు అయ్యుంటారు. మోషే ఎవ్వరినీ విడిచిపెట్టడు, ఎన్నడూ కనికరం చూపడు. అతని దృష్టిలో అందరూ చట్టాన్ని అతిక్రమించి దానికి జరిమానా చెల్లించవలసినవారే. అతని నిరంకుశ న్యాయం ఏమిటంటే: "పాపము చేయువాడెవడో వాడే మరణము నొందును"[9]

విశ్వాసి: ఆ సంగతి నాకు బాగా తెలుసు. నేను అతన్ని కలవడం అదే మొదటిసారి కాదు. ఒకసారి, ఇంటి దగ్గర ఉండగా, నేను అక్కడే గనుక ఉండిపోతే నాతోపాటు ఆ ఇంటిని తగలపెడతానన్నాడు.

క్రైస్తవుడు: విషయం మార్చడం లేదు గాని, మోషే నిన్ను పట్టుకుని కొట్టిన చోటుకు కొంచెం పైన ఉన్న పెద్ద ఇంటిని నువ్వు చూశావా?

విశ్వాసి: అవును. ఆ ఇంటిముందు సింహాలను కూడ చూశాను. కానీ అది మధ్యాహ్న సమయం కాబట్టి అవి నిద్రపోతున్నట్లున్నాయి. అప్పటికి పగటి సమయం ఇంకా చాలా వుంది కనుక కావలివానిని దాటి కొండ దిగువకు వెళ్లాను.

క్రైస్తవుడు: అవును. నువ్వు అటుగా వెళ్లావని కావలివాడు చెప్పాడు. ఆ సింహాలు గొలుసులతో కట్టివేయబడ్డాయి. కనీసం ఒక్క రోజయినా నువ్వు ఆ యింటివద్ద ఆగివుంటే ఎంత బావుండేదో.

9. యెహెజ్కేలు 18:4 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

వాళ్లు నిన్ను ఆనందంగా చేర్చుకొని ఉండేవారు. వారి ఆతిథ్యం, సహవాసం అద్భుతం. వాళ్లు నీకు ఎన్నో మరపురాని సంగతులు చూపించివుండేవారు. కాని, దీనత్వపు లోయలో నువ్వు ఎవరినైనా కలిసావా లేదా చెప్పవూ?

అసంతృప్తిని కలిసినప్పటి విషయాలను గుర్తుచేసుకున్న విశ్వాసి

విశ్వాసి: నిజమే, తనతోపాటు వచ్చేయమని నన్ను బలవంతపెట్టిన అసంతృప్తి అనే ఒకణ్ణి దారిలో కలిశాను. ఈ లోయకు గౌరవం లేదని చెప్పాడు. ఉన్న ఆత్మస్థైర్యాన్నంతా కోల్పోయి, నీ బంధువులు, స్నేహితుల నమ్మకాన్ని, గౌరవమంతటినీ పోగొట్టుకునే చోటు ఒకటి ఈ లోయలో ఉందని అతడు చెప్పాడు. ఆ లోయలోనికి వెళ్లివచ్చాక, మా అతిశయం, నిర్లక్ష్యం, అహంభావం, లోకమహిమలకు ఇక నాతో పనేమీ ఉండదు. "తెలివి, ఆత్మగౌరవం ఉన్నవాడెవడూ ఆ లోయలోనికి వెళ్లడు" అన్నాడతను.

క్రైస్తవుడు: అతనికి ఏమి జవాబు చెప్పావు?

విశ్వాసి: ఒక విధంగా అతడు చెప్పిన పేర్లుగలవారు కొంతవరకు నాకు సంబంధించినవాళ్లే (నిజానికి, శరీరానుసారంగా చూస్తే వాళ్లు నాకు బంధువులే), అయితే నేను యాత్రికుడిగా మారాను గనుక వాళ్లంతా నన్ను వెలివేశారు, నేను వారిని తృణీకరించాను. ఇప్పుడు వాళ్లకూ నాకూ ఏమాత్రం సంబంధం లేదని అతనికి తెలియజేశాను. అంతే కాదు, లోయ గురించిన తన అభిప్రాయం తప్పు అని కూడ చెప్పాను; ఈ లోయలో ఆహ్లాదకరంగా లేనివి ఎన్ని ఉన్నా, అది యాత్రికులకు అవసరమైన క్రమశిక్షణ నందించింది. "ఘనతకు ముందు వినయము, నాశనమునకు ముందు గర్వమూ నడుస్తాయి కాబట్టి నీవు, లోకానుసారి దృష్టిలో గొప్పదిగా ఎంచబడిన మార్గం కంటే నేను ఈ లోయగుండా వెళ్లి నిజమైన ఘనతను– సర్వజ్ఞానియైనవాడు గుర్తించిన ఘనతనే పొందుతాను" అని అతనితో అన్నాను.

క్రైస్తవుడు: ఆలోయలో నువ్వు ఎదుర్కొన్నవి ఇంకా ఏమైనా ఉన్నాయా?

శ్రీ అవమానంగారిని కలిసిన సంగతిని గుర్తుచేసుకున్న విశ్వాసి

విశ్వాసి: అవును, శ్రీ అవమానం గారిని కలిశాను. తన పేరు అవమానం అని చెప్పాడు కాని, అతనితో కొంత పరిచయం ఏర్పడ్డాక అనిపించింది– అతనికి ఆ పేరు తగినది కాదని, ఏదో కల్పితమైన పేరుతో పిలువబడుతున్నాడు అని. అతడు సిగ్గుపడటం బాగానే ఉంది కాని, అతడు సిగ్గుపడుతున్నది అతనిగురించి కాదు (అలా చేసివుంటే బావుండేది), అతడు చేసిన, లేక మాట్లాడిన ఏదైనా సంగతి గురించి కూడ కాదు; అతడు సిగ్గుపడింది నా గురించి, ఈ యాత్రా మార్గం గురించి.

క్రైస్తవుడు: ఎందుకని, అతడు నీతో ఏమన్నాడు?

విశ్వాసి: అతడు నా మతానికి అడ్డుచెప్పాడు. మతానికి సేవకుడిగా మారడం కోసం ఒకడు తన చిత్తాన్ని, జీవితాన్ని అప్పగించుకోవడం అత్యంత దయనీయమైన నీచమైన అవమానకరమైన విషయమన్నాడు; మృదువైన మనస్సాక్షి ఒక బలహీనత అని; తన స్వేచ్ఛను హరించే నియమ నిబంధనలకు బందీగా మారిపోయి, తన సొంత మాటలు, వైఖరి, ప్రవర్తన గురించి జాగ్రత్త వహించాల్సి రావడం, ఈ కాలపు ధైర్యవంతులందరూ ఇలాంటి వాటికి అలవాటుపడటం వలన నేటి సమాజంలో వారు అత్యంత హేళనకు, నవ్వులాటకు గురిఅవుతున్నారని కూడ అన్నాడు.

ఈ కాలానికి చెందిన జ్ఞానులు, ఘనులు, గొప్పవారిలో ఇలా యాత్రికులుగా మారినవారెవరూ పెద్దగా లేరని కూడ అతడు గుర్తుచేశాడు. యాత్రికులలో అధికభాగం దురదృష్టవంతులు, అమాయకులు, తక్కువ ఆదాయం పొందేవాళ్లే ఉంటారన్నాడు; ఉన్నత వర్గానికి చెందినవారిలో ఈ యాత్రా మార్గానికి అనుకూలంగా ఉన్నామని చెప్పారంటే వారికి ఏదో స్వార్థం ఉండివుంటుంది. ఏదో స్వలాభం కోసమో, స్వార్థ ప్రయోజనాలకోసమో వాళ్లు అలాంటి వాటిని వెంబడిస్తారు.

యాత్రికులు నమ్మి, ఆచరించే అనేక విషయాల గురించి సిగ్గుపడేలా చెయ్యాలని అతడు ప్రయత్నించాడు. ఒక మగాడు ఏడుస్తూ, దుఃఖిస్తూ, ఏదో ప్రసంగం విని, నిట్టూర్పులు విడుస్తూ, ఇంటికి వెళ్లడం సిగ్గుచేటు అన్నాడు. చిన్న చిన్న పొరపాట్లు చేసినందుకే పొరుగువాడిని క్షమించమని వేడుకోవడం, లేదా ఇతరులకు చేసిన అపరాధాలకు పరిహారం చెల్లించడం అవమానకరమైన విషయం అని కూడ అన్నాడు.

క్రైస్తవుడు: మరి నువ్వేమన్నావు?

విశ్వాసి: మొదట అసలు ఏం చెప్పాలో కూడ తెలియలేదు. అతను అలా మాట్లాడుతుంటే నా ముఖం సిగ్గుతో ఎరుపెక్కింది. సమయానికి ఓ మంచి జవాబు చెప్పలేకపోయినందుకు నామీద నాకే సిగ్గేసింది. కాని, దేవునికి స్తోత్రం, ఎట్టకేలకు ప్రభువువారి మాటల గురించి ఆలోచించాను: "మనుష్యులలో ఘనముగా ఎంచబడునది దేవుని దృష్టికి అసహ్యము."[10] అప్పుడు నేనన్నాను, "సిగ్గులేకుండ నీవు మగాళ్లు ఎవరు, వాళ్లు ఏం చేస్తారు అని చెప్తున్నావే గాని దేవుని గురించి నువ్వు ఏమీ చెప్పడం లేదు. తీర్పు దినాన మనుష్యులు నా గురించి ఏమనుకున్నారో చెప్పమని దేవుడు నన్ను అడుగడు; లేదా నువ్వూ, లోకము నాగురించి ఏమనుకున్నారో దాన్ని బట్టి నాకు తీర్పు తీర్చబడదు. కానీ దేవుని వాక్యం ప్రకారమే నాకు తీర్పు తీర్చబడుతుంది. లోకమంతా వ్యతిరేకించినా, దేవుడు చెప్పిందే నాకు వేదం. కనుక మెత్తని మనస్సాక్షిని కోరుకునే మనుష్యుల కోసం దేవుడు ఈ మార్గాన్ని ఎన్నుకున్నాడని, ఆయన కోసం ఈలోకం దృష్టిలో బుద్ధిహీనులుగా మారడానికి ఇష్టపడేవారే జ్ఞానవంతులని, ఈలోకంలో దేవున్ని తిరస్కరించే గొప్పవారికంటే క్రీస్తును ప్రేమించే పేదవాడే ధనవంతుడని చూశావు కదా, ఇక నన్ను విడిచి నీదారిన నీవు పో! నీవు నా

10. లూకా 16:15

రక్షణకు విరోధివి. నా ప్రభువు అంటున్నాడు, "నా గురించి, నా మాటల గురించి ఎవడైతే సిగ్గుపడతాడో, నా తండ్రి మహిమతో తిరిగివచ్చినప్పుడు అట్టివాని గురించిన నేను సిగ్గుపడతాను." నా ఆత్మకు, నా ప్రభువైన యేసు క్రీస్తుకు విరోధివైన నిన్ను నా ప్రభువుయొక్క సార్వభౌమ చిత్తానికి వ్యతిరేకంగా చేరదీస్తే, ఆయన వచ్చినప్పుడు నేను ఆయన్ని ఎలా ఎదుర్కోగలను, ఆయన దీవెనలను ఎలా ఆశించగలను?"

అయితే, అవమానం చాలా ధైర్యవంతుడు, పట్టువదలని దుర్మార్గుడని నాకు అర్థమైంది. వాడిని అంత తేలికగా వదిలించుకోలేం. వాడు నా వెంటే వస్తూ, నా నిజాయితీలేనితనం గురించి, నా తప్పుల గురించి, యాత్రికులలో ఉండే లోపాల గురించి నా చెవిలో గుసగుసలాడుతూనే ఉన్నాడు. అయితేనేం, చివరికి నేను వాడికి తెగేసి చెప్పాను, వాడిక నోర్ముసుకోవడం మంచిదని, స్వయంగా వాడే ఒక వేషధారియని, నా బలహీనతలయందే నేను అతిశయిస్తున్నానని, ఇక వాడి మాటలన్నీ వ్యర్థమని చెప్పాను. ఎట్టకేలకు వాడిని దాటి ముందుకు వచ్చేశాను. అప్పుడు నేనీ పాట పాడసాగాను.

యాత్రికుడిపై దాడిచేసేందుకు
ఎటుచూసినా శోధనలే
మూకుమ్మడిగా పైబడి
నిన్ను నాశనం చెయ్యడమే వాటి ఆశయం
ఓ యాత్రికుడా, తప్పుచేయక మెలకువగా ఉండు,
బలవంతుడైన నీ దేవునియందు నిబ్బరముగా ఉండు.

క్రైస్తవుడు: నీవు ఆ దుర్మార్గుడికి లోబడక అంత ధైర్యంగా నిలిచినందున నేను సంతోషించాను. నీవు చెప్పిన మాట నిజమే. వాని పేరు వానికి తగదు. ఎందుకంటే వాడు తెగించి వీధులలో మనలను వెంబడిస్తూ అందరి యెదుట మనము మంచిదాని గురించి సిగ్గుపడేలా చేస్తాడు. వాడు సిగ్గుమాలినవాడైతేనే కాని అలాంటి ప్రయత్నం చెయ్యడు. అయితేనేం? మనము ఇంకా వాడిని ఎదిరించాలి. వాడు అలా డంబముగా మాట్లాడినా వాడు బుద్ధిలేనివాడు. వాడు ఎవరినీ వశపరచుకోలేడు. "జ్ఞానులు ఘనతను స్వతంత్రించుకొందురు. బుద్ధిహీనులు అవమాన భరితులగుదురు"[11] అన్నాడు సొలొమోను.

విశ్వాసి: మనము భూమిమీద సత్యం కొరకు శూరులమై యుండాలని కోరుకునే ఆయన గురించి మనము సిగ్గుపడక ధైర్యంగా నిలబడునట్లు మొరపెట్టాలని నాకు అనిపిస్తోంది.

క్రైస్తవుడు: నువ్వు చెప్పింది నిజమే. అయితే, ఆ లోయలో నీవు మరి ఎవరినీ కలుసుకోలేదా?

విశ్వాసి: లేదు, మరి ఎవ్వరూ నాకు కనపడలేదు. ఆ మరణచ్ఛాయ లోయలోబడి నేను వచ్చినప్పుడు తక్కిన మార్గమంతటా సూర్యుడి వెలుగు కనిపించింది.

11. సామెతలు 3:35

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

క్రైస్తవుడు: అది నీకు మేలు! నా ప్రయాణం అంత సుఖంగా జరుగలేదు. నేను ఆ లోయలో ప్రవేశించిన కొంతసేపటి తరువాత అపొల్యోను అను ప్రచండమైన పిశాచంతో నాకు భయంకర యుద్ధం జరిగింది. అది నన్ను చంపడం ఖాయమనుకున్నాను. ముఖ్యముగా అది నన్ను క్రింద పడద్రోసి నేను ముక్కలయ్యేలా తన క్రింద అణిచివేసినప్పుడు, నా వినాశకాలం వచ్చిందనుకున్నాను. ఎందుకంటే అది నన్ను పడద్రోసినప్పుడు నా కత్తి నా చేతిలోనుండి జారిపోయింది. అంతేకాదు, ఆ దయ్యము "ఈసారి నిన్ను లోబరుచుకొన్నాను కదా అని నాతో అన్నది. అయితే నేను దేవునికి మొర్రపెట్టాను. ఆయన నా ప్రార్థన విని నా సమస్త శ్రమలలోనుండి నన్ను విడిపించాడు. ఆ తరువాత నేను మరణచ్ఛాయ లోయలో ప్రవేశించి దానిలో సుమారు సగం దూరం చీకటిలోనే ఉన్నాను. అక్కడ నేను చంపబడతానని అనేకసార్లు అనుకున్నాను. చివరికి సూర్యోదయమైంది గనుక మునుపటి కంటే చాలా నెమ్మదిగాను, నిమ్మళముగాను ప్రయాణం కొనసాగించాను.

ఆ సంభాషణ జరిగిన తర్వాత నేను నా కలలో చూచినదేమనగా, విశ్వాసి త్రోవ పక్కవైపు చూసి, తనతోపాటు వాచాలుడు అను పేరుగల మరొకడు కొంతదూరం నడిచిరావడం చూశాను. ఆ స్థలము విశాలమైనది. వారిద్దరూ నడిచేందుకు ఆ దారి సరిపోతుంది. ఆ మనుష్యునితో విశ్వాసి సంభాషించ నారంభించాడు.

విశ్వాసి: స్నేహితుడా! ఎక్కడికి వెళుతున్నావు? పరమపురికా?

వాచాలుడు: అక్కడికే వెళుతున్నాను.

విశ్వాసి: అది మంచిది, కాబట్టి నీ ఉత్తమ సహవాసం నాకు దొరుకునని సంతోషించుచున్నాను.

వాచాలుడు: మహా సంతోషంగా నేను మీకు సహవాసిగా ఉంటాను.

విశ్వాసి: అలాగైతే రా. ఉపయోగకరమైన మంచి సంగతుల గురించి మాట్లాడుతూ కాలక్షేపం చేద్దాం.

వాచాలుడు: మీతోనైనా, మరెవరితోనైనా మంచి సంగతుల గురించి మాట్లాడటం నాకెంతో యిష్టం. అంత మంచి క్రియకు సిద్ధపడిన వారిని నేను కలుసుకున్నందుకు చాలా సంతోషంగా ఉంది. ప్రయాణంలో ఉన్నప్పుడు ఇలా కాలక్షేపం చేయాలనుకునేవారు చాలా అరుదు. వ్యర్థమైన సంగతులను గురించి సంభాషించడం ఎక్కువమందికి ఇష్టం. దాని వలన నాకు చాలా బాధ కలిగింది.

విశ్వాసి: అది చాలా విచారకరమైన సంగతి. మనుష్యుల నోట ఉండగలిగింది పరలోక రాజ్యపు ప్రభువైన దేవుని సంగతులకంటే మించినది ఏముంటుంది?

వాచాలుడు: ఆహా! ఎంత మంచిమాట. మీ మాటలు నా మనస్సాక్షికి సరిపోయినవి. దేవుని సంగతులను చర్చించడం కంటే మరి ఏది మనోహరమైనది? ఏది ఉపయోగకరం? దేవుని

సంగతులు పలకడం కంటే రమ్యమైనది మరి ఏదీ లేదు కదా. వస్తువుల ఉత్పత్తి, స్థితి లయములను గురించి, వాటి మర్మములను గురించి, అద్భుతములను గురించి వింతలను గురించి, గురుతులను గురించి మాట్లాడటంలో సంతోషం కలిగినా, పరిశుద్ధ లేఖనములలోని మధుర చరిత్రలు చదువుట వలన కలిగే భాగ్యమెంతో గొప్పది.

విశ్వాసి: అది నిజమే, కాని వీటివలన ప్రయోజనం పొందడమే మన లక్ష్యంగా ఉండాలి.

వాచాలుడు: నేను చెప్పేది అదే. ఈ సంగతుల గురించి మాట్లాడటమే అత్యంత ప్రయోజనకరమైనది. తద్వారా ఇహలోక సంగతులు ఎంత వ్యర్థమైనవో, పరలోక సంగతులు ఎంత విలువైనవో మనకు తెలుస్తుంది. అది సాధారణ ప్రయోజనం. ప్రత్యేక ప్రయోజనం ఏమిటంటే వీటిద్వారానే ఒకడు నూతన జన్మ యొక్క ఆవశ్యకతను తెలుసుకుంటాడు; మన క్రియలు సరిపోయినవి కావని; క్రీస్తువారి నీతి అవసరమని, ఇలా ఎన్నో విషయాలు తెలుసుకుంటాడు. వీటితోపాటు పశ్చాత్తాపపడుట, విశ్వసించుట, ప్రార్థించుట, శ్రమపడుట అంటే ఏమిటో కూడ నేర్చుకుంటాడు. అలాగే, సువార్తవలన కలిగే గొప్ప వాగ్దానాలు, ఆదరణలు ఏవో తెలుసుకొని, సత్యాన్ని స్థాపించడానికి తప్పుడు సిద్ధాంతాలను ఖండించి, పామరులకు బోధించడానికి ఇవి ఉపయోగపడతాయి.

విశ్వాసి: ఇదంతా నిజమే; ఈ సంగతులు మీ నోట వింటుంటే చాలా ఆనందంగా ఉంది.

వాచాలుడు: అయ్యో! ఇవి తెలియకపోవడం వలనే చాలామంది విశ్వాసము యొక్క ఆవశ్యకతను, సమృద్ధియైన జీవాన్ని పొందడానికి హృదయంలో జరుగవలసిన కృపాకార్యము యొక్క అవసరాన్ని గ్రహించలేకపోతున్నారు. అంతేకాకుండ అనేకులు అజ్ఞానంతో ధర్మశాస్త్రపు క్రియలలోనే జీవిస్తున్నారు. వాటిద్వారా పరలోక రాజ్య ప్రాప్తి కలుగదని వారికి తెలియదు.

విశ్వాసి: నిజమే, కాని వీటి గురించిన పరలోకపు జ్ఞానం దేవుని వరం; మానవ ప్రయత్నం ద్వారా గాని, కేవలం వాటిగురించి మాట్లాడుకోవడం ద్వారా కాని ఏ మానవుడూ వాటిని సాధించలేడు.

వాచాలుడు: ఆ సంగతి నాకు బాగా తెలుసు. పైనుండి అనుగ్రహింపబడితేనే తప్ప మనిషికి ఏదీ దక్కదు. అంతా కృపచేతనే గాని క్రియల వలన ఏమీ పొందలేం. దీనిని సరిచూచుకోవడానికి నేను ఓ వంద లేఖనభాగాలను చూపించగలను.

విశ్వాసి: మంచిది, ఇలాంటప్పుడు మనం ఏ విషయం గురించి చర్చించుకుంటే బావుంటుందో చెప్పండి.

వాచాలుడు: నువ్వు ఏది కోరుకుంటే అది. నేను పరలోక సంగతుల గురించి మాట్లాడగలను, భూలోక సంగతుల గురించి మాట్లాడగలను, నైతిక విషయాలు, ఆధ్యాత్మిక విషయాలు, పవిత్రమైన

సంగతులు లేదా అపవిత్రమైన సంగతులు, గతానికి సంబంధించినవి లేదా రాబోవు సంగతులు విదేశాలకు చెందినవి, లేదా స్వదేశీ విషయాలు, అత్యవసర విషయాలు లేదా పరిస్థితులకు సంబంధించిన విషయాలు దేనిగురించి అయినా మాట్లాడగలను. కాకపోతే అవన్నీ ఒక ప్రయోజనకరమైన విధానంలో జరగాలి.

విశ్వాసి: (వాచాలుడి గురించి ఆశ్చర్యపోతూ, అతడు నెమ్మదిగా నడుస్తుండగా, వారికి కొన్ని అడుగుల దూరంలో నడుస్తున్న క్రైస్తవుడి ప్రక్కన చేరి ఇలా అన్నాడు): ఎంత సాహసవంతుడు, మేథావి అయిన సహచరుడు మనకు దొరికాడు! ఖచ్చితంగా ఇతడు అద్భుతమైన యాత్రికుడు కాగలడు సుమా.

క్రైస్తవుడు: (మర్యాదపూర్వకంగా నవ్వుతూ): తన గురించి తెలియని వాళ్లను వీడు తన మాయ మాటలతో ప్రక్కదారి పట్టిస్తాడు.

విశ్వాసి: అంటే, నీకు తెలుసా ఇతని గురించి?

క్రైస్తవుడు: తెలియడమా! వాడి గురించి వానికంటే నాకే ఎక్కువ తెలుసు.

విశ్వాసి: దయచేసి, అతడు ఎలాంటివాడో నాకు చెప్పవూ?

క్రైస్తవుడు: వాని పేరు వాచాలుడు. అతనిది మన ఊరే. అది చాలా పెద్ద ఊరే అయినా, అతని గురించి నీకు తెలియదంటేనే ఆశ్చర్యంగా ఉంది.

విశ్వాసి: అతను ఎవరబ్బాయి? వాళ్ల ఇల్లు ఎక్కడ?

క్రైస్తవుడు: అతడు మాటకారి అను పేరుగల వాని కుమారుడు. అతడు వదరుబోతుల వీధిలో ఉండేవాడు. ఆ వీధిలో వుండేవాళ్లందరికీ వాచాలుని పేరు బాగా తెలుసు. వాని వాగాడంబరమూ, మృదువైన మాటలు ప్రక్కనపెడితే, వాడు పెద్ద పనికిమాలినవాడు.

విశ్వాసి: అలాగా, చూడటానికి మంచివాడిలా ఉన్నాడు.

క్రైస్తవుడు: ఇంటికి దూరంగా, తెలియనివాళ్లకు అలాగే కనబడతాడు. కొంతమంది చిత్రకారులు గీసిన బొమ్మల్లా అతడు దూరంగా ఉండి చూస్తేనే బావుంటాడు.

విశ్వాసి: మరి నీ చిరునవ్వు చూస్తే, ఏదో సరదాగా అంటున్నావనుకున్నా.

క్రైస్తవుడు: వీని గురించి, లేదా మరెవరి గురించి అయినా పరిహాసమాడటం నా ఉద్దేశం కాదు. బహుశా నేను నవ్వకుండ ఉండాల్సింది, కాని నేను చిరునవ్వు నవ్వింది అతని గురించి నీకున్న గొప్ప అభిప్రాయాన్ని చూసినందుకే. ఎవరినైనా నేను తప్పుగా నిందలు మోపడం నాకు దూరమగును గాక. కానీ ఇతడు ఎలాంటివాడో నీకు చెప్తాను. ఇతడు ఎలాంటివారితోనైనా సహవాసం చెయ్యగలడు, ఎలాంటి మాటలైనా మాట్లాడగలడు. అతన్నిటికి అనుకూలంగా మార్చుకోగల

తన సామర్థ్యంపట్ల అతని కాస్తంత గర్వంకూడ ఉంది. ఊసరవెల్లిలా ఎప్పటికప్పుడు రంగులు మార్చగలడు. ఏ ఎండకా గొడుగు పట్టే రకం. నీతో మాట్లాడినంత తేలికగా త్రాగుబోతుల మధ్య కూడ మాట్లాడగలడు. పైగా ఎంత త్రాగితే అంత ఎక్కువగా మాట్లాడతాడు. అతని హృదయంలో, ఇంటిలో, లేదా అతని దైనందిన జీవితంలో స్వచ్ఛమైన భక్తికి చోటులేదు. అతని భక్తి అంతా మాటలకే పరిమితం. కేవలం వినోదం, కాలక్షేపం కోసమే భక్తిని వాడుకుంటాడు.

విశ్వాసి: అలాగా? అయితే అతని విషయంలో నేను చాలా మోసపోయానన్న మాట.

క్రైస్తవుడు: అతడు మంచి నమ్మకమైన యాత్రికుడని భావించావంటే నువ్వు మోసపోయినట్టే. ఈ సామెత గుర్తుందా: "వారు చెప్పుదురే గాని చేయరు."[12] అయితే "దేవుని రాజ్యము మాటలతో కాదు శక్తితోనే యున్నది"[13] అతడు ప్రార్థన, పశ్చాత్తాపము, విశ్వాసము, కొత్తగా జన్మించుట మొదలైన విషయాల గురించి మాట్లాడేటప్పుడు తన వ్యక్తిగత అనుభవం గురించి కాదు, ఎవరో చెప్పుకుంటున్న మాటలు విని వాటిని వల్లిస్తుంటాడు. నేను వాళ్ల ఇంటిలో ఉన్నాను, అతన్ని ఇంటా బయట గమనించాను గనుక నేను ఏం మాట్లాడుతున్నానో నాకు తెలుసు. గుడ్డులో తెల్ల సొనకు రుచిలేనట్లే, అతని ఇంటిలో క్రీస్తు భక్తికి తావుండదు. అతని జీవితంలో ప్రార్థన, మారుమనస్సుకు తగిన సూచనలేవీ ఉండవు. అతని గురించి తెలిసినవాళ్లందరికీ వాడొక మాయనిమచ్చ, నింద లాంటివాడు. వానిని బట్టే క్రీస్తునామం వాళ్ల వీధి అంతటా దూషించబడుతోంది. వీడు "బయట భక్తుడు, ఇంటిలో దయ్యం" అని ఇరుగుపొరుగు వాళ్లు అంటుంటారు. అతని కుటుంబీకులు కూడ అలాగే భావిస్తారు. విపరీతమైన కోపిష్టి, కటువుగా, మొరటుమనిషిలా ప్రవర్తిస్తాడు, అతని నాలుక తేలుకొండిలాంటిది. కోపం వస్తే ఎటువంటి శాపనార్థాలైనా పెట్టగలడు. వానితో వ్యవహారం జరపడం కంటే ఒక నేరస్తుడితో వ్యవహారం జరపడం మేలు అని అతనితో పరిచయం ఉన్నవాళ్లు అంటుంటారు. సాధ్యమైతే, నిన్ను మోసగించి, అన్యాయం చెయ్యడానికి ఎంత నీచమైన స్థాయికైనా దిగజారగలడు; అయినా సొంత భద్రతకోసం చట్టం పరిధిలోనే ఉండేందుకు ప్రయత్నిస్తాడు.

దీనికితోడు, తన కొడుకుల్ని కూడ అతని అడుగుజాడల్లోనే పెంచుతున్నాడు. ఒకవేళ వారిలో ఎవడైనా సున్నితమైన మనస్సాక్షికి లోబడితే వానిని బుద్ధిహీనుడని, పిరికిపంద అని పిలుస్తాడు. నా మట్టుకైతే, అతడు తన దుర్మార్గపు జీవితం ద్వారా అనేకులు తొట్రిల్లి పడిపోయేలా చేశాడనిపిస్తుంది, దేవుడు గనుక అడ్డగించకపోతే, వాడు అనేకుల నాశనానికి కారకుడవుతాడనటంలో ఎలాంటి సందేహం లేదు.

విశ్వాసి: క్రైస్తవుడా, నువ్వు చెప్పేది నేను తప్పక వినాల్సిందే. ఎందుకంటే, అతని గురించి నీకు తెలుసునని నువ్వు చెప్పినందుకే కాక, నువ్వు సత్యవంతుడివని కూడ నాకు తెలుసు. దురుద్దేశంతోనే నువ్వీ సంగతులు మాట్లాడుతున్నావని నేను భావించలేను. అవి సత్యమని, ఈ విషయాలు తోటి యాత్రికులకు తెలియాలన్నదే నీ ఉద్దేశమని నేను నమ్ముతాను.

12. మత్తయి 23:3 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8
13. 1కొరింథీయులకు 4:20

క్రైస్తవుడు: నీకంటే ముందుగా నాకు ఇతని గురించి తెలిసివుండకపోతే, మొదట నేనుకూడ నీలాగే ఆలోచించివుండేవాడిని. లేదా నాకు తెలిసిన సమాచారం క్రైస్తవ మతాన్ని తృణీకరించేవారినుంచి వచ్చివుంటే, అదంతా వారి అపనిందలేనని, మంచివాళ్లకూ, వారి పనులకూ వ్యతిరేకంగా ఇలాంటివి రావడం మామూలేనని భావించి వుండేవాడిని. అయితే, వీటన్నిటిలో– ఇంకా వేరే ఏ విషయాల్లోనైనా నాకు తెలిసిన విషయాలను బట్టే అతన్ని దోషిగా నిరూపించగలను. దీనికి తోడు, గొప్పగొప్పవాళ్లు సహా ఇతని గురించి సిగ్గుపడతారు; తెలిసినవాళ్లెవరైనా ఇతని ప్రస్తావనే అవమానంగా భావిస్తారు.

విశ్వాసి: మాటలకూ, చేతలకూ చాలా వ్యత్యాసం ఉందని ఇప్పుడు నాకు అర్థమవుతోంది. ఇకమీదట నేను ఈ రెండిటికీ మధ్య ఉన్న వ్యత్యాసాన్ని మరింత జాగ్రత్తగా గమనిస్తాను.

క్రైస్తవుడు: నిజంగానే అవి రెండూ పూర్తిగా వేరైన సంగతులు. ప్రాణానికీ దేహానికీ ఉన్నంత వ్యత్యాసం ఉంది. ప్రాణం లేని దేహం మృతదేహమే కాదు, దాన్ని పీనుగ అంటారు. నిజమైన భక్తికి రుజువు దాని ఫలాలే. "తండ్రియైన దేవుని యెదుట పవిత్రమును నిష్కళంకమునైన భక్తి యేదనగా దిక్కులేని పిల్లలను విధవరాండ్రను వారి యిబ్బందిలో పరామర్శించుటయు, ఇహలోక మాలిన్యము తనకంటకుండ తన్ను తాను కాపాడుకొనుటయునే."[14] దీనిగురించి వాచాలుడికి ఏమీ తెలియదు. క్రైస్తవ భక్తి గురించి వింటూ, మాట్లాడుతూ ఉండేవాడే క్రైస్తవుడు అనేది అతని ఉద్దేశం. వినుట అంటే వాక్యపు విత్తనాన్ని ఓ క్షణకాలం మనస్సులోనికి తీసుకోవడమే. దాని ఫలం అతని హృదయంలోను, జీవితంలోను నిజంగా ఉంది అనడానికి రుజువు కేవలం దానిగురించి మాట్లాడటమేనని చెప్పలేం. తీర్పుదినాన మనుష్యులు వారివారి ఫలాలను బట్టి తీర్పు తీర్చబడతారని నిశ్చయత కలిగివుందాం.

ఒకడు మనుష్యుల భాషలతోను, దేవదూతల భాషలతోను మాట్లాడినా దేవుని ప్రేమలేనివాడైతే వాడు మ్రోగెడి కంచు లేదా గణగణలాడు తాళముతో సమానమే అంటాడు పౌలు.[15] జీవము కలిగించని మాటలు మనుష్యులు పలికినా, దూతలు పలికినా పరలోక రాజ్యంలో దేవుని బిడ్డలమధ్య అవి ఎప్పటికీ వినపడవు.

విశ్వాసి: మొదట్లో అతని సహవాసం గురించి నేను మరీ అంత ఇష్టపడలేదు కాని, ఇప్పుడు నాకు అసహ్యం వేస్తోంది. వాడిని మనం వదిలించుకోవాలంటే ఏం చెయ్యాలి?

క్రైస్తవుడు: ఏమీలేదు, అతని వద్దకెళ్లి, జీవితాన్ని మార్చే నిజమైన విశ్వాసం యొక్క శక్తి గురించిన చర్చ మొదలుపెట్టి, ఈ దైవశక్తి అతని హృదయంలోను జీవితంలోను ఉన్నదా, ఉంటే అది తన ఇంటిని, రోజువారీ జీవితాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో చెప్పమని అడుగు.

విశ్వాసి: (మరల వాచాలుడి ప్రక్కన చేరి): ఏ అంశం గురించి మాట్లాడాలో అన్న నిర్ణయం నాకే విడిచిపెట్టావు గనుక నేను అడుగబోయే విషయం ఇలా ఉంటుంది: మనుష్యుల హృదయాలలోను, జీవితాలలోను ఉన్న దేవుని రక్షణార్థమైన కృప ఎలా బయటపడుతుంది?

14. యాకోబు 1:27 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8
15. 1కొరింథీయులకు 13:1

వాచాలుడు: అంటే మన సంభాషణ వస్తువుల యొక్క శక్తి గురించి సాగాలన్నమాట. ఇది చాలా మంచి విషయం. మీరు చాలా ప్రాముఖ్యమైన ప్రశ్న అడిగారు. దానికి క్లుప్తంగా జవాబు చెప్పడం నాకు సంతోషమే. మొదట హృదయంలో ఉన్న దేవుని కృప పాపానికి వ్యతిరేకంగా గట్టిగా కేకలు వేసేలా చేస్తుంది. రెండవది–

విశ్వాసి: ఒక్క నిమిషం ఆగండి. ఒక్కొక్క విషయం గురించి మనం మాట్లాడుకుందాం. నా ఉద్దేశంలో దేవుని కృప ఆత్మలో పాపాల పట్ల అసహ్యాన్ని పుట్టించడం ద్వారా బయటపడుతుంది అనిపిస్తోంది.

వాచాలుడు: మంచిది, పాపానికి వ్యతిరేకంగా గట్టిగా కేకలు వెయ్యడానికి, దాన్ని అసహ్యించుకోవడానికి తేడా ఏముంది?

విశ్వాసి: ఎందుకు లేదు, చాలా తేడా ఉంది. పాపానికి వ్యతిరేకంగా కేకలువేయడం కొందరి దృష్టిలో మంచివిధానంగా ఉంటుంది. కానీ పాపం పట్ల దైవికమైన అయిష్టత లేకపోతే ఎవరూ పాపాన్ని అసహ్యించుకోరు. వేదికలపై నుండి పాపానికి వ్యతిరేకంగా కేకలువేసే ప్రసంగీకులున్నారు. కానీ వారి హృదయాలలోను, ఇంటిలోను, వారి రహస్య జీవితంలోను వారు పాపాన్ని స్వాగతిస్తారని నాకు తెలుసు. యోసేపు మీద అబద్దపు ఆరోపణ చేసినప్పుడు అతని యజమానురాలు కూడ చాలా గొప్ప పతివ్రతలా పాపానికి వ్యతిరేకంగా పెద్దగా కేకలువేసింది, కాని యోసేపును వలలో వేసుకుని అతనితో జారత్వము చేసేందుకు విఫలయత్నం చేసింది. కొందరు పాపానికి వ్యతిరేకంగా ఎలా కేకలువేస్తారంటే, ఒక తల్లి తన ఒడిలో ఉన్న బిడ్డను గుంటడు, పంది అని పిలుస్తూనే తన రొమ్మున హత్తుకొని ఆప్యాయంగా ముద్దుపెట్టుకున్నట్టు ఉంటుంది.

వాచాలుడు: అంటే, ఉచ్చులు పన్ని ఎదుటివారిని పడగొట్టడం నీకు ఇష్టమన్నమాట.

విశ్వాసి: అయ్యో లేదండి. ఎలాంటి తిరకాసు లేకుండ మాట్లాడటమే నాకు కావలసింది. సరే, హృదయంలో దేవుని కృప ఉందని నిరూపించే రెండవ మార్గం ఏమిటో చెప్పవా?

వాచాలుడు: ఒకనికి సువార్త సత్యమును గురించిన విస్తారమైన జ్ఞానం ఉండాలి.

విశ్వాసి: ఈ గుర్తు ముందు కనబడవలసింది. అయితే, ముందు కనిపించినా, చివర్లో కనిపించినా అది కూడ అసత్యమే; ఎందుకంటే, సువార్త సత్యం గురించి, ఒక మనిషి హృదయంలో కృపాకార్యం గురించి కూడ ఒకడు తన హృదయంలో ఆ కృప లేకుండానే ఇతరులద్వారా గొప్ప జ్ఞానం సంపాదించవచ్చు. ఒకడు సమస్త జ్ఞానమూ కలిగివుండి, మర్మాలన్నీ గ్రహించగలిగినా వ్యర్థమే అంటున్నాడు పౌలు[16]. "ఈ సంగతులు మీరు ఎరుగుదురు గనుక వీటిని చేసినయెడల మీరు ధన్యులగుదురు"[17] అన్నాడు యేసయ్య. వీటిని తెలుసుకొనినయెడల మీరు ధన్యులు అనలేదు. కార్యరూపం దాల్చని తెలివితేటల చేతుల్లో ఆయన ఈ ఆశీర్వాదాన్ని పెట్టలేదు. కేవలం సత్యాన్ని తెలుసుకుంటే చాలదు, దానికి లోబడాలి. కాబట్టి నీ గురుతు వలన ఉపయోగమేమీ లేదు.

16. 1కొరింథీయులకు 13:2 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8
17. యోహాను 13:17

విస్తారమైన తెలివితేటలు కేవలం మాటలు చెప్పి, గొప్పలు చెప్పుకునేవారినే సంతోషపెడుతుంది, నమ్మకమైన, విధేయతగల హృదయం దేవున్ని సంతోషపెడుతుంది. అంటే నిజమైన జ్ఞానం లేకుండ హృదయం బాగుచేయబడుతుందని కాదు. ఎందుకంటే అది జరుగకపోతే దాన్ని నమ్మలేము. అయితే అనుభవమూ, సత్‌క్రియలు లేని జ్ఞానం వ్యర్థం. "నీ ధర్మశాస్త్రము ననుసరించుటకు నాకు బుద్ధి దయచేయుము అప్పుడు నా పూర్ణహృదయముతో నేను దాని ప్రకారము నడుచుకొందును"[18] అంటున్నాడు కీర్తనాకారుడు.

వాచాలుడు: అలాగా, నువ్వు పరిశుద్ధలేఖనాలను వాదించడం కోసమూ, ఇతరుల మాటల్లో తప్పులు వెతకడం కోసమూ చదివావన్నమాట. ఇది ఏమాత్రం క్షేమకరం కాదు.

విశ్వాసి: హృదయంలో రక్షణార్థమైన కృపకు రుజువుగా మీ వద్ద బహుశా మరొక సూచన ఉండే వుంటుంది.

వాచాలుడు: లేదు, నా దగ్గర లేదు. మనకు ఏకాభిప్రాయం కుదిరేటట్లు అనిపించడం లేదు.

విశ్వాసి: సరే, నీ దగ్గర రుజువులేమీ లేకపోతే, నీవు అనుమతిస్తే, నా దగ్గర ఉన్న రుజువులు నీకు చూపిస్తాను.

వాచాలుడు: అది నీ విజ్ఞతకే వదిలేస్తున్నా.

విశ్వాసి: ఆత్మలో జరిగే కృపాకార్యం ఎవరిలో ఉన్నదో అతనికీ, అతని గురించి తెలిసినవారికీ అది తేటగా కనిపిస్తుంది.

ఒక వ్యక్తి హృదయంలో దేవుని కృప ఉంటే అది పాపపు ఒప్పుదలను కలిగిస్తుంది, ముఖ్యంగా అవిశ్వాసమనే పాపాన్ని గురించిన ఒప్పుదల కలిగించి, అతని స్వభావం ఎంత అపవిత్రమైనదో బయలుపరుస్తుంది; అలాంటివాడు యేసుక్రీస్తు నందలి విశ్వాసం ద్వారా దేవుని కనికరమును పొందనియెడల నిత్య దండనకు గురికావడం తథ్యమని భావిస్తాడు. అతని ఒప్పుదల, బాహ్యదృష్టి అతనిలో గాఢమైన దుఃఖాన్ని పాపం పట్ల సిగ్గును కలిగిస్తాయి. అప్పుడు, పరిశుద్ధాత్మ శక్తిద్వారాను, దేవుని వాక్యం ద్వారాను అతనికి దేవుని గొర్రెపిల్లను (లోకరక్షకుడు, పాపానికి పరిపూర్ణమైన బలియర్పణ) బయలుపరచి, రక్షణకు ఆయనే ఏకైక మార్గంగా ఆయన్ని ఉన్నపళంగా అంగీకరించేలా చేస్తుంది. దీంతో అతనిలో నీతిపట్ల ఆకలిదప్పులు కలుగుతాయి, ఫలితంగా మారుమనస్సు, పశ్చాత్తాపము కలిగి పాపక్షమాపణ, రక్షణ కొరకు యేసు క్రీస్తునందు విశ్వాసముంచేలా నడిపిస్తుంది. ఇక అతని సంతోష సమాధానాలు, అతని ప్రేమ, పరిశుద్ధత, జ్ఞానవృద్ధి, క్రీస్తు సేవలో వృద్ధి మొదలైనవన్నీ అతని విశ్వాసం మీద, దాని బలం మీద ఆధారపడివుంటాయి. విశ్వాసాన్ని ఎవరైనా వినియోగిస్తున్నప్పుడే వృద్ధిచెందుతుంది. అనుమానాలను, భయాలను, స్వీయఖండనను, కలవరమును, అంతరంగిక అనుభవాలను అపార్థం చేసుకోవడాన్ని, స్వార్థపూరిత, శరీరానుసారమైన

18. కీర్తనలు 119:34

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

వక్రీకరించబడిన తర్కాన్ని, తీర్పును, ఊహల్ని అధిగమించడానికి సహాయపడతుంది. ఒక వ్యక్తిలో దేవుని కృప ఉన్నదని చెప్పడానికి ఇవన్నీ ఎదిరించలేని రుజువులుగా ఉంటాయి.

ఈ కృప తనంతట తానే ఇతరులకు రెండు రకాలుగా కనిపిస్తుంది: మొదట, క్రీస్తునందలి విశ్వాసాన్ని బహిరంగముగా ఒప్పుకొని, ఆయన నామంలో బాప్తిస్మం పొంది, ఆయనయందు విశ్వసించే ఇతరులతో కలవటం ద్వారా ఇది అందరికీ కనిపిస్తుంది. రెండవదిగా, ఆయన బోధలకు సరిపోయినవిధంగా జీవించే జీవితం ద్వారా కూడ ఇది ఇతరులకు కనిపిస్తుంది; నడిపింపు కొరకు, శక్తికొరకు ప్రతిదినం ప్రార్థనచెయ్యడం, దేవుని చిత్తమేమిటో తెలుసుకొని దానిని నెరవేర్చడం కొరకు దేవుని వాక్యాన్ని శ్రద్ధగా పఠించడం, ఆయన రక్షణార్థమైన కృపను గురించి ఇతరులకు సాక్ష్యమివ్వడం, క్రీస్తుకు, ఇతరులకు సేవచెయ్యడంలో తన సమయాన్ని, ధనాన్ని వెచ్చించడం లాంటి వివిధ రూపాల్లో కనిపిస్తుంది. దీనిద్వారా అతని కుటుంబానికీ, ఇరుగుపొరుగువారికీ తెలుస్తుంది ఇతడు దేవున్ని, మానవులను కేవలం మాటలతోనే కాదు, క్రియలతోను, సత్యముతోను ప్రేమిస్తున్నాడని. ఒక వేషధారి వీటన్నిటి గురించి మాట్లాడగలడే కాని, వాటిని కలిగివుండి చేతల్లో చూపించాలంటే అతడు ఖచ్చితంగా దేవుని బిడ్డ అయ్యుండాలి.

ఇదంతా కేవలం కృపాకార్యం గురించి, అది మనుష్యులకు కనిపించే విధానం గురించి తెలియపరచే క్లుప్తమైన వివరణ మాత్రమే. ఈ విషయంలో నీకు ఏదైనా అభ్యంతరం ఉంటే దాన్ని స్వేచ్ఛగా వ్యక్తపరచవచ్చు. లేనట్లయితే, నేను మీకు రెండవ ప్రశ్న వెయ్యవచ్చా?

వాచాలుడు: లేదు. వినడమే తప్ప, అభ్యంతరం చెప్పడం నా పనికాదు. కాబట్టి మీ రెండవ ప్రశ్న ఏమిటో అడగండి.

విశ్వాసి: అదేమిటంటే: ఈ ప్రత్యక్షతలోని మొదటి భాగాన్ని నీ హృదయంలో నీవు అనుభవించావా? అది నీ జీవితంలోను, నీ అనుదిన ప్రవర్తనలోను కనబడుతుందా? లేక నీ భక్తి అంతా కేవలం మాటలకే పరిమితమై క్రియలలోను, సత్యములోనూ కనిపించడం లేదా? వీటన్నిటికి జవాబు చెప్పాలన్న మనస్సు నీకుంటే, దయచేసి, నీకు తెలిసినంతవరకు కేవలం సత్యము, దేవున్ని సంతోషపెట్టేది, నీ మనస్సాక్షి ఆమోదించగలిగేది తప్ప మరేదీ చెప్పవద్దు; ఎందుకంటే, "ప్రభువు మెచ్చుకొనువాడే యోగ్యుడు గాని తన్ను తానే మెచ్చుకొనువాడు యోగ్యుడుకాడు."[19] నా దైనందిన జీవితమూ, నా పొరుగు వారందరూ నేను అబద్ధమాడుతున్నానని చెప్తుండగా, నేను అలాంటివాడిని, ఇలాంటివాడిని అని గొప్పలు చెప్పుకోవడం చాలా దుర్మార్గం.

వాచాలుడు: (సిగ్గుతో ముఖం ఎరుపెక్కుతోంది గాని, నెమ్మదిగా తనకు ఎదురైన ఇబ్బందికర పరిస్థితి నుంచి తేరుకొనే ప్రయత్నం చేస్తూ): నీవు అనుభవం, మనస్సాక్షి, దేవుడు అనే విషయాలలోనికి వెళ్లావు; పైగా చెప్పినది లేదా చేసినది సమర్థించుకొంటూ దేవునికి విన్నవించుకోవడం గురించి మాట్లాడుతున్నావు. ఇలాంటి ప్రశ్నలు వేస్తావని నేను ఊహించలేదు.

19. 2 కొరింథీయులకు 10:18 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

ఎందుకంటే ఇదంతా వ్యక్తిగత వ్యవహారమని నాకు తెలుసు. అలాంటి ప్రశ్నలకు జవాబు చెప్పవలసిన అవసరం నాకు లేదు, చెప్పాలన్న మనస్సు అసలే లేదు. నిన్ననీవు ఓ పరిశీలకుడిగా పరిగణించుకోవచ్చునేమో గాని, నా మీద తీర్పరిగా నిన్ను నేను తిరస్కరిస్తున్నాను. అయితే, ఇలాంటి ప్రశ్నలు నన్నెందుకు అడుగుతున్నావో దయచేసి నాకు చెప్తావా?

విశ్వాసి: ఆ చెప్తాను. ఎందుకంటే, మాటలు చెప్పడంలో నీ అత్యుత్సాహాన్ని చూశాను, పైగా నీ దగ్గర మాటలు తప్ప మరేదైనా ఉందో లేదో నాకు తెలియలేదు గనుకనే నిన్ను ఆ ప్రశ్నలు అడిగాను. అంతేగాక, సత్యం చెప్పాలంటే, నీ భక్తి కేవలం మాటలకే పరిమితమని, నీవు చెప్పేదానికీ, నీ రోజువారి జీవితం చాలా విరుద్ధంగా ఉంటుందని నీ గురించి నేను ఇదివరకే విన్నాను. క్రైస్తవుల మధ్య నీవు ఒక మచ్చగా ఉన్నావని, క్రీస్తు మతానికి నీవు అపనిందలు తెచ్చేవాడవని నాకు చెప్పారు; నీ దుర్మార్గపు విధానాల వలన ఇప్పటికే కొందరు తొట్రిల్లినారని, నీ భక్తిహీనమైన మాదిరిని బట్టి ఇంకా ఎందరో నాశనమయ్యే ప్రమాదంలో ఉన్నారని కూడ విన్నాను. పైగా నీ భక్తితోపాటు నీ సారాయి అంగళ్లు, దురాశ, అపవిత్రత, ఒట్టుపెట్టుకోవడం, అబద్దాలు, జారత్వపు సహవాసాలు కలిసే ఉంటాయని కూడ తెలిసింది. "స్త్రీలందరికీ ఆమె అవమానము తెచ్చునది" అని ఒక వ్యభిచారిణి గురించి చెప్పబడిన సామెత వలె, నీవు కూడ క్రైస్తవులందరికీ అవమానంగా దాపురించావు.

వాచాలుడు: మాటలు చెప్పడానికి, ఇతరులను ఇంత కటువుగా, అన్యాయంగా తీర్పుతీర్చడానికి నువ్వు సిద్ధమయ్యావు గనుక, నీవు ముక్కోపివి, తప్పులు ఎంచేవాడివి, ఏడుపుగొట్టు మనిషివి, క్షేమకరమైన సంభాషణలకు పనికిరాని వాడవన్న ముగింపుకు రాక తప్పడం లేదు; కాబట్టి, నీకో దండం, ఇక సెలవ్.

క్రైస్తవుడు: (సరిగ్గా వాళ్లముందుకొచ్చి ఒక్క క్షణం ఆగి, ఇప్పుడు విశ్వాసి ప్రక్కన నడుస్తాడు): నీకు ముందే చెప్పాను కదా. నీ మాటలకూ, అతని దురాశలకూ పొంతన కుదరదు. అతడు పశ్చాత్తాపపడి, క్రీస్తు తన జీవితాన్ని మార్చేలా అనుమతించడం కంటే నీ సహవాసాన్ని విడిచి, సత్యం నుంచి వైదొలగడానికే ఇష్టపడతాడు. కానీ అతడు వెళ్లిపోయాడు, పోతే పోనీ; నష్టపోయేది అతడే. అతని నుండి విడిపోయే ఇబ్బంది మనకు లేకుండ చేశాడు. అతడు మార్పు చెందివుంటే తప్ప (అనుమానమే) అతడు మనకు ఒక శాపంగాను, మన సహవాసంలో ఒక మచ్చగాను మిగిలిపోయేవాడే. దానికి తోడు, "అట్టివారికి విముఖుడవై యుండుము" అని అపొస్తలుడు చెప్తున్నాడు.[20]

విశ్వాసి: కానీ, అతనితో కొంత సంభాషణ చెయ్యగలిగినందుకు నాకు సంతోషంగా ఉంది; బహుశా ఈ విషయాల గురించి అతడు ఆలోచిస్తాడేమో. ఏది ఏమైనా, అతనితో నేను యథార్థంగాను, నిజాయితీగాను వ్యవహరించాను. అతని నాశనానికి నేను బాధ్యుణ్ణి కాదని నాకు స్పష్టంగా తెలుసు.

20. 1 తిమోతి 6:5 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

క్రైస్తవుడు: అతనితో మొహమాటం లేకుండ తేటగా మాట్లాడి నీవు మంచిపని చేశావు. ఈ రోజుల్లో ఆత్మలతో ఇంత నమ్మకంగా వ్యవహరించడం బాగా తగ్గిపోయింది. అది కొరవడటం మూలంగానే ప్రజలు క్రైస్తవవిశ్వాసాన్ని తక్కువగా చూస్తున్నారు. ఇక కేవలం మాటలకే తమ భక్తిని పరిమితం చేసి, జీవితంలో భ్రష్టుపట్టి, వ్యర్థమైన ముచ్చట్లతో కాలం వెళ్లబుచ్చే ఈ వదరుబోతు మోసగాళ్లు మారుమనస్సు పొందుతారన్న ఆశతోనో, లేక ధనసహాయం చేస్తారనో వారిని క్రైస్తవుల సహవాసంలోనికి ఆహ్వానించినప్పుడు లోకంలోని ప్రజలు విస్తుపోతారు, యథార్థవంతులు దుఃఖిస్తారు, క్రైస్తవ్యం కళంకితమవుతుంది. నీలాగే క్రైస్తవులందరూ వ్యవహరిస్తే ఎంత బావుంటుందో. అప్పుడు గాని వారు నిజంగా మారుమనస్సు పొందడమో లేక వారి అసలు రంగు బయటపడి రక్షింపబడినవారి సహవాసాన్ని విడిచి పారిపోవడమో జరుగుతుంది.

ఆవిధంగా వారు మార్గంలో చూచినవి, నేర్చుకున్నవి మొదలైన విషయాల గురించి మాట్లాడుకుంటూ తమ ప్రయాణాన్ని ప్రయోజనకరంగాను, ఆనందదాయకంగాను మలచుకుంటూ తమదారిన వెళ్లిపోయారు. లేకపోతే వారి ప్రయాణం విసుగు, అలసట పుట్టించేదే. ఎందుకంటే ఇప్పటిదాక వారు అరణ్యమార్గం గుండా కష్టపడి నడిచారు.

అధ్యాయం 6
మాయాసంత మరియు మాయపట్టణం

రానున్న కష్టాల గురించి ముందుగానే చెప్పిన సువార్తికుడు

ఇప్పుడు క్రైస్తవుడూ, విశ్వాసి ఆ అరణ్యంలో నుండి దాదాపుగా బయటపడుతున్న సమయంలో, వారి మంచి మిత్రుడైన సువార్తికుడు వారిని కలిశాడు.

పలకరింపులు అయిన తర్వాత, సువార్తికుడు ఇలా అడిగాడు: "మిమ్మల్ని చూచి చాలాకాలమైంది, ఎలా ఉన్నారు? మీ ప్రయాణంలో మీరు ఏమేమి చూశారు? వీటన్నిటిలో మీరు ఎలా మసలుకున్నారు?"

అప్పుడు వారు తమ మార్గంలో ఎదురైన అనుభవాలను అతనికి చెప్పారు. ఇప్పుడు ఈ చోటికి వారు ఏవిధంగా, ఎంత కష్టంమీద చేరుకున్నది వివరించారు.

సువార్తికుడు: దేవునికి వందనాలు. నాకు చాలా సంతోషంగా ఉంది, మీకు శ్రమలు, శోధనలు ఎదురైనందుకు కాదుగాని, మీరు విజయాలు సాధించారు, మీ లోపాలను, పొరపాట్లను అధిగమించి, ఈ యాత్రలో మీరు ముందుకు సాగినందుకు నాకు నిజంగా సంతోషంగా ఉంది. నా గురించి, మీ గురించి కూడ నాకు ఆనందంగా ఉంది. నేను నాటాను, మీరు పంట కోశారు; విత్తినవాడు, పంటను కోసినవాడు కలిసి ఆనందించే రోజు ఒకటి వస్తుంది; అయితే మనం పట్టుదలతో అలుపెరుగక ముందుకు సాగాలి. "మనము అలయక మేలుచేసితిమేని తగిన కాలమందు పంటకోతుము"[1] అంటాడు పౌలు.

మనకోసం ఒక అక్షయ కిరీటం ఎదురుచూస్తోంది: "కాబట్టి మీరు బహుమానము పొందునట్లుగా పరుగెత్తండి."[2]

మీకు తెలుసు, ఈ కిరీటాన్ని పొందడం కోసం బయలుదేరినవారు కొందరున్నారు– కొంతకాలం వారు బాగానే పరుగెత్తుతారు– మరికొందరు చాలా దూరం కొనసాగుతారు. అయినా వారు నిర్లక్ష్యంగా ఉండి, తమ కిరీటాన్ని ఇతరులు తీసుకునేలా ప్రవర్తిస్తారు. కాబట్టి ఎవడును మీ కిరీటము నపహరింప కుండునట్లు మీకు కలిగినదాన్ని గట్టిగా పట్టుకొనండి.[3] మీరు ఇప్పటికీ అపవాది "తుపాకీ దెబ్బ"ను తప్పించుకునేంత దూరంలో లేరు. "మీరు పాపముతో పోరాడుటలో

1. గలతీయులకు 6:9
2. 1కొరింథీయులకు 9:24
3. ప్రకటన 3:11

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

రక్తము కారునంతగా ఇంక దానిని ఎదిరింపలేదు."[4] దేవుని రాజ్యానికి మీ మనస్సుల్లో ఎల్లప్పుడు ప్రథమస్థానం ఇవ్వండి. అదృశ్యమైన సంగతుల గురించి నిత్యమూ విశ్వసించండి. ఇహలోకపు విషయాలలో ఏదీ మీ ఆత్మను స్వాధీనపరచుకోనివ్వకండి. సమస్తమైన దురాశలు, గర్వము నుండి మీ హృదయాలను భద్రపరచుకోండి. ఎందుకంటే, దైవ కృపచేత దానిని కాపాడుకొనక పోయినట్లయితే, "హృదయము అన్నిటికన్నా మోసకరమైనది, అది ఘోరమైన వ్యాధిగలది"[5]గా ఉంటుంది. పరలోకమందును, భూమిమీదను మీకు సమస్త అధికారము అనుగ్రహించబడింది గనుక మీ ముఖాలను చెకుముఖి రాతివలె చేసుకొని గురివైపునకే చూడండి.

క్రైస్తవుడు: సోదరా, సువార్తికుడా, మీ జ్ఞానవంతమైన సహాయకరమైన హెచ్చరికలకై మీకు చాలా ధన్యవాదాలు. జరుగబోవు సంగతులను దేవుడు మీకు బయలుపరుస్తాడని మాకు తెలుసు గనుక భవిష్యత్తులో మాకు ఏమేమి సంభవించనున్నాయో, వాటిని మేము ఎలా ఎదుర్కోగలమో దయచేసి మాకు చెప్పండి.

సువార్తికుడు: "శ్రమలద్వారా మనము దేవుని రాజ్యములో ప్రవేశించాలని"[6] మీరు దేవుని వాక్యంలో చదువుకున్నారు కదా. అపొస్తలులైన పౌలు వలె మీరు కూడ ప్రతి పట్టణములోనూ మీ కొరకు బంధకాలు శ్రమలు ఎదురుచూస్తున్నట్లు మీరు గమనిస్తారు.[7] కాబట్టి, ఏదో ఒకరూపంలో శోధనలు చుట్టుముట్టకుండ ఈ యాత్రలో మీరు ఎంతోదూరం వెళ్లలేరు. వాటిలో కొన్ని ఇప్పటికే మీకు ఎదురయ్యాయి, ఇంకా మరెన్నో త్వరలో ఎదురవుతాయి.

ఇప్పటికైతే, మీరు ఈ అరణ్యమార్గం నుండి దాదాపుగా బయటపడినట్లే. త్వరలోనే మీరొక పట్టణానికి చేరుకుంటారు, ఆ పట్టణంలో సత్యానికి శత్రువులైన వారిచేతిలో మీకు తీవ్రమైన శోధనలు ఎదురవుతాయి, వారు మిమ్మల్ని మట్టుపెట్టడానికి శతవిధాల ప్రయత్నిస్తారు. మీలో ఒకడు తన సాక్ష్యాన్ని రక్తంతో ముద్రించబోతున్నాడు. అయితే, మరణం వరకు నమ్మకంగా ఉండండి, క్రీస్తు మీకు జీవకిరీటమిస్తాడు. మీలో ఒకడు అక్కడ మరణించవలసి వస్తే, అతని మరణం క్రూరంగాను, అత్యంత బాధాకరంగాను ఉంటుంది, అయినా రెండోవాడికంటే అతడే ఎంతో అదృష్టవంతుడు. ఎందుకంటే అతడే ముందుగా పరలోక పట్టణాన్ని చేరుకుంటాడు, తక్కినవాడు తన మార్గంలో సహించవలసిన బాధలన్నిటినీ అతడు తప్పించుకుంటాడు. అయితే మీరు ఆ పట్టణం చేరుకొని, నేను మీకు చెప్పిన సంగతులు నెరవేరినప్పుడు మీ స్నేహితుడిని, మీ ప్రభువైన యేసును జ్ఞాపకం చేసుకొని, ధైర్యవంతులుగా ఉండి, "నమ్మకమైన సృష్టికర్త యగు దేవునికి మీ ఆత్మలను అప్పగించుకొనండి.[8]

అప్పుడు నా కలలో వారు అరణ్యాన్ని విడిచి ఒక పట్టణంలో ప్రవేశించడం చూశాను. ఆ పట్టణంలో ఏడాది పొడవునా కొనసాగే ఒక సంత ఉంది. ఇప్పుడు వారితో సువార్తికుడు లేడు. ఆ పట్టణం పేరు మాయ. ఆ సంతపేరు మాయసంత. ఆ పట్టణస్తులు వ్యర్థులు. డబ్బు, సుఖం,

4. హెబ్రీయులకు 12:4
5. యిర్మీయా 17:9
6. అపొస్తలుల కార్యములు 14:22
7. అపొస్తలుల కార్యములు 20:23
8. 1పేతురు 4:19

పేరుప్రఖ్యాతులు తప్ప వారికి మరో ధ్యాస ఉండదు. అది చాలా పురాతన పట్టణం. ఆ సంత ఎన్నెన్నో సంవత్సరాలుగా కొనసాగుతోంది.

సుమారు ఐదువేల సంవత్సరాల క్రితం, పరమపురికి బయలుదేరిన యాత్రికులు ఈ పట్టణం గుండా వెళ్లారు. చివరికి బయెల్జెబూబు, అపొల్యోను, సేన, అనేవాళ్లు తమ పనివారితో కలిసి, ఈ సంతను ఏర్పాటు చేశారు. యాత్రికులకు అవసరమైన ప్రతివిధమైన వినోదాన్ని అందించడానికీ, ఏడాది పొడవునా రకరకాల వ్యాపార వస్తువులు అమ్మడానికి ఏర్పాట్లు జరిగాయి. ఇప్పటికీ ఈ సంతలో నాణ్యమైన ఇళ్లు, భూములు, పత్రాలు, అబద్ధపు భద్రత, ఉల్లాస వస్త్రాలు, ఆభరణాలు, ఖరీదైన అలంకరణ వస్తువులు, బంగారం, వెండి, పురాతన వస్తువులు, ముత్యాలు, రత్నాలు, పేరుప్రఖ్యాతులు, సిరిసంపదలు, గౌరవమర్యాదలు, సుగుణాలు, ఘనత, ప్రజాదరణ, హోదాలు, బిరుదులు, నగిలీ డిగ్రీలు, పోటీలు, అవకాశాలు, ఆటలు, ఓట్లు, ఎన్నికలు, ప్రభుత్వ కార్యాలయాలు, వ్యక్తిగత పలుకుబడులు, నచ్చిన నివేదికలు, ప్రచారాలు, అబద్దాలు, కల్పనలు, మోసాలు, కృత్రిమ వ్యక్తిత్వాలు, పన్నాగాలు, కుయుక్తులు, కథలు, అందాల రాణులు, లైంగిక ఆకర్షణలు, వేశ్యలు, మానవ ప్రాణాలు, మనుష్యుల ఆత్మలు లభ్యమవుతాయి.

వీటికి తోడు, ఈ సంతలో అన్నివేళలా జూదం, గారడీ, మోసం, అపహరణలు, ఇతరుల సొమ్మును స్వాహాచేయుట, అబద్ధాలు, దొంగతనము, వంచన, వంచకులు, టక్కుటమారాలు, పోకిరీలు, అల్లరి పండుగలు, త్రాగుడు, విలాసాలు, చూచిచూడనట్లు ఊరకుండుట, మూర్ఖులు, దోపిడీ దొంగలు, వేశ్యలు, హంతకులు, వ్యభిచారులు, అన్ని రకాల అనైతిక చర్యలు జరుగుతుంటాయి. నాశనానికి నడిపించే విశాలమార్గం ద్వారానే ఈ సంతలో వ్యాపారం పుష్కలంగా జరుగుతుంటుంది. ఆ విశాలమార్గం ఈ పట్టణం గుండానే వెళుతుంది.

ఈ మాయా పట్టణంలోనే సారాయి దుకాణాలు, జూదగృహాలు, సానికొంపలు, మోసపూరిత నాటకాలు, ప్రఖ్యాత నాట్యశాలలు, సాంస్కృతిక సంఘాలు, సొగసైన మందిరాలు, సంకర క్రైస్తవులు, తెగలు, మతశాఖలమధ్య విభేదాలు, వృత్తినిపుణులైన పాస్టర్లు (ప్రజల మానసిక బలహీనతలను ఉపయోగించుకొని, దేవుని మందపైన ప్రభువులుగా నియమించుకొని, మలినమైన ఆశలతో మందను పాలిస్తూ, మందకు మాదిరిగా ఉండి, వారిని పోషించేందుకు బదులు వారిని పీడిస్తూ ఉండేవారు). ఇక్కడ ప్రఖ్యాత నకిలీ శాస్త్రవేత్తలు, బడాయి వైద్యులు, అగౌరవనీయులైన టక్కరి న్యాయవాదులు, నిజాయితీలేని రాజకీయనాయకులు, రహస్య ముద్రాపకులు, మోసగాళ్లు– అన్ని రకాల వంచకులు ఉన్నారు.

అయితే, పరలోక పట్టణానికి వెళ్లేవారెవరైనా ఈ మాయానగరాన్ని తప్పించుకోవాలనుకుంటే, అతడు తప్పనిసరిగా లోకం విడిచిపోవాల్సిందే. సమాధానాధిపతి ఈ లోకంలో ఉన్నప్పుడు, తన స్వదేశానికి ఈ పట్టణం గుండానే వెళ్లాడు. ఇప్పుడున్నట్టే అప్పుడు కూడ బయల్జెబూబే ఆ సంతకు యజమానిగా ఉండేవాడు. సమాధానాధిపతికి వాడు తన వ్యర్థమైన సరకులు ఎన్నో అమ్మాలని

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

చూశాడు. ఆఖరికి ఆయన్ని ఈ సంతకు అధికారిని చెయ్యాలని కూడ ప్రయత్నించాడు. ఆయన ఎంతో పలుకుబడి కలిగినవాడు గనుక బయెల్జెబూబు ఆయన్ని ఒకచోటనుండి మరొక చోటుకు నడిపించి, ప్రపంచంలోని రకరకాల దేశాలన్నీ చూపించి, వాటన్నిటి మీద ఆయన్ని అధికారిని చేస్తానని చెప్పాడు. అయితే, అలా చెయ్యాలంటే ఆయన తన విలువను తగ్గించుకొని అతని సంతలోని కొన్ని వ్యర్థమైన సరుకులు కొంటే చాలునని చెప్పాడు. అయితే ఆయన ఈ బేరాన్ని ఏ మాత్రం లెక్కచెయ్యక, బయెల్జెబూబు సంతలో దొరికే వస్తువులు కొనడానికి ఒక్క నయాపైసా కూడ ఖర్చుపెట్టకుండానే ఆ పట్టణాన్ని విడిచి వెళ్లిపోయాడు.

మాయా సంతలో క్రైస్తవుడూ, విశ్వాసి

ఇప్పుడు, క్రైస్తవుడూ, విశ్వాసి ఆ సంతలో ప్రవేశించిన వెంటనే వారొక విధమైన కలవరం సృష్టించారు. సంతలోనే కాదు, మొత్తం పట్టణమంతా అదే పరిస్థితి నెలకొన్నది.

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

మొదటి కారణం, అక్కడ ఉన్నవారి వస్త్రాల కంటే వీరి వస్త్రాలు ఎంత భిన్నంగా ఉన్నాయంటే అందరూ వాళ్లవైపు వింతగా చూశారు. కొందరు వాళ్లని పిచ్చివాళ్లన్నారు; కొందరు వింతైన అన్యదేశస్తులు అన్నారు; మరికొందరు వాళ్లిక్కడ అల్లర్లు సృష్టించడానికి వచ్చినవాళ్లన్నారు.

రెండవది, వాళ్ల మాటతీరు కూడ భిన్నంగా ఉంది. సహజంగా వాళ్లు మాట్లాడేది కానాను భాష గనుక, సంతలో ఉండే మిగతా వాళ్లంతా ఈ లోకస్తులు కావడంతో వారి భాష ఎక్కువమందికి అర్థం కాలేదు. ఆ సంతలో ఈ చివరి నుంచి ఆ చివరిదాక వీళ్లు వింత మనుష్యుల్లా కనిపించారు.

మూడవది, ఈ యాత్రికులు వారు అమ్మే వస్తువుల పట్ల ఏమాత్రం ఆసక్తి చూపించలేదు గనుక ఇదే వారికి ఎక్కువ చింత కలిగించే విషయమైంది. క్రైస్తవుడు, విశ్వాసి కనీసం వాటివైపు చూడాలని కూడ అనుకోలేదు. ఏదైనా కొనుమని ఎవరైనా అడిగితే వాళ్లు చెవులు మూసుకొని, "వ్యర్థమైన వాటిని చూడకుండ నా కన్నులు త్రిప్పివేయుము"[9] అంటూ వారు వేరే దేశానికి చెందివారైనట్లుగా పైకి చూసేవారు.

ఎగతాళి చేస్తూ, దొమ్మీగా పైబడిన జనం

వాళ్ల గురించి ఇంతకు మునుపే విన్న ఒకడు వారి వింత ప్రవర్తనను గమనిస్తూ, "మీరేం కొంటారోయ్?" అన్నాడు హేళనగా. అప్పుడు వాళ్లు అతనివైపు తేరిచూసి, "మేము సత్యాన్ని కొంటాం" అన్నారు. దీంతో వాళ్లని హింసించడానికి వారికి అవకాశం దొరికింది. చివరికి యాత్రికులను ద్వేషించేవారంతా గుంపుగా చేరి అక్కడ గందరగోళం సృష్టించి అల్లర్లు రేపారు.

9. కీర్తనలు 119:37

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

ఈ సంగతి పట్టణ అధికారికి తెలియడంతో అతడు వెంటనే వచ్చి, విచారించడం కోసం వారిని అదుపులోకి తీసుకున్నాడు. వారిని దర్యాప్తుచేసిన వారు కొన్ని ప్రశ్నలు అడిగారు. వారు ఎక్కడినుండి వచ్చారు, ఎక్కడికి వెళుతున్నారు, ఈ అవతారంలో మీరు మాయాసంతలో ఏం చేస్తున్నారో చెప్పమంటూ ప్రశ్నలు సంధించారు. తాము యాత్రికులమని, ఈ లోకంలో పరదేశులమని, నూతన యెరూషలేము అనే తమ సొంత పట్టణానికి, సొంత దేశానికి వెళుతున్నామని, ఈ గందరగోళానికి తమకూ ఎలాంటి సంబంధమూ లేదని, ఈ విధంగా తమను వేధిస్తూ, తమ ప్రయాణానికి ఆటంకం కలిగించడానికి కారణమేమీ లేదని చెప్పారు. "మీరేం కొంటారు?" అని ఒకడు తమను అడిగిన ప్రశ్నే ఈ అల్లరికి కారణమని, దానికి జవాబుగా మేము సత్యాన్ని కొంటామని బదులిచ్చినట్లు పరిశీలకులకు చెప్పారు; ఈ మాటలకే ఇంత గందరగోళం ఏర్పడుతుందని తాము ఊహించలేదని కూడ చెప్పారు.

అయితే పరిశీలకులు వారి మాటలు నమ్మలేదు. ఆ సంతలో గందరగోళం సృష్టించడానికే రహస్యంగా వచ్చినారని భావించి, వారిని పట్టుకొని కొట్టి, బురద పూసిన తర్వాత, సంతలో ఉన్నవారందరికీ వేడుకగా ఉండుటకు వారిని ఒక పంజరములో బంధించారు. గనుక వారు అక్కడ కొంతకాలం ఉన్నారు.

సంత అధిపతి వారి బాధలు చూచి నవ్వుకొంటుండగా, ప్రతివాడు తన తన ఇష్టప్రకారం వారిని ఎగతాళి చేశారు. అయినా ఆ మనుష్యులు శాంతము వహించి – దూషణకు ప్రతిగా దీవించుచు, చెడ్డమాటలకు మంచి మాటలు పలుకుతూ, తమకు చేయబడిన అపకారమునకు ఉపకారము చేయుచున్నందున సంతలో కొందరు ఇతరులకంటే ఎక్కువ వివేకము, తక్కువ పక్షపాతము గలవారై ఈ మనుష్యులను మీరెందుకు ఇలా అవమానపరచి బాధపెడుతున్నారని ఆ నీచులను గద్దించారు. అందుకు వారు కోపగించి, వారివైపు తిరిగి వారు పంజరములో ఉన్నవారివలె దుష్టులని ఎంచి, ఓహో! మీరు కూడ వారి జతవారు కాబోలు, అలాగైతే మీకు కూడ వారి గతే పడుతుందని బెదిరించారు. అందుకు – మాకు కనబడినంతమట్టుకు ఈ మనుష్యులు బుద్ధిగల సాధువులై యున్నారు. వారు ఎవరికిని హానిచేయనుద్దేశించలేదు. ఈ సంతలో వ్యవహారము చేయువారిలో అనేకులు పంజరములోనే కాకుండ బొండకొయ్యలోను ఉంచబడుటకు తగినవారని బదులు చెప్పారు. అంతలో యాత్రికులు మిక్కిలి సుబుద్ధిగాను శాంతముగాను ప్రవర్తించుచుండగా, చాలా మాటలు రెండువైపులను జరిగిన తరువాత వారిలో వారు దెబ్బలాడుకొని ఒకనికి ఒకడు హానిచేసుకొనిరి.

అందుచేత దీనులైన ఈ ఇద్దరు మనుష్యులు మళ్లీ విమర్శకర్తల ఎదుటికి తేబడినప్పుడు సంతలో ఈ రెండవ కలహమునకు కూడ వారే కారకులని వారిమీద నేరం మోపబడింది. కాబట్టి వారు వారిని కనికరించక కఠినముగా కొట్టించి, సంకెళ్లు వేసి మరి ఎవరును వారి పక్షముగా మాటలాడ తెగింపకుండ వారిని అటుఇటు సంత పొడుగున నడిపించారు.

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

అయినను క్రైస్తవుడు, విశ్వాసి మరి సుబుద్ధిగా ప్రవర్తించుచు తమమీద వేయబడిన అవమానమును, సిగ్గును మహా సాత్వికముతోను, ఓర్పుతోను సహించుటవలన సంతలో కొందరు వారి పక్షము వహించారు. అందువలన వారి విరోధులు మరింత ఆగ్రహించి ఆ ఇద్దరు మనుష్యులను చంపవలెనని ఉద్దేశించారు. కాబట్టి వారు పంజరమైనను, సంకెళ్లయినను వారికి చాలవని, వారుచేసిన అవమానము చేత, సంత జనులను మోసపుచ్చినందుచేత చంపబడవలెనని బెదరించారు.

అప్పుడు వారు మహా విమర్శకు తేబడు కాలము వరకు వారిని మళ్లీ పంజరములో ఉంచవలెనని అధిపతి సెలవైనది గనుక వారిని మళ్లీ ఆ పంజరములో ఉంచి బొండకొయ్యలతో వారి కాళ్లు బిగించారు.

వారు పంజరములో ఉండగా తమ నిజమైనస్నేహితుడగు సువార్తికుని వలన ముందు విన్న సంగతులను తిరిగి జ్ఞాపకమునకు తెచ్చుకొని, తమకు సంభవిస్తాయని అతడు చెప్పినవాటి వలన తమ మార్గములోను, తమకు వచ్చిన శ్రమలోను మరింత ధైర్యమును పొందారు. వారు తమలో ఎవరికి మరణము సంభవించునో వాని గతి మేలని అనుకొని ఒకనినొకడు ఓదార్చుకున్నారు. గనుక ఒక్కొక్కడు ఆ మేలును తానే పొందవలెనని మనస్సులో కోరుకొనియుండిరి. అయినప్పటికీ వారు సర్వజ్ఞాన ప్రేమలచేత,సమస్తమును ఏలు దేవుని చిత్తమునకు తమ్మును తాము అప్పగించుకొని ఆయన మనలను గూర్చి ఎట్లు సెలవిచ్చునో చూతమని సంతోషించుచు తామున్నట్లుగా శాంతముగా నుండిరి.

విమర్శకు బయటికి తెచ్చుట

అనుకూల సమయము నియమించబడినప్పుడు, ఆ మనుష్యులకు శిక్ష విధించు నిమిత్తము వారిని విమర్శకు బయటికి తెచ్చారు. న్యాయాధిపతి పేరు జస్టిస్ 'సజ్జనద్వేషి'. కొన్ని వ్యత్యాసాలు ఉండి వాటిరూపం వేరైనా, వారిమీద మోపబడిన నేరము ఒక్కటే. అదేమనగా ఈ మనుష్యులు మాయా పట్టణమునకు విరోధులు, దాని వ్యవహారమును గందరగోళము చేసి, ప్రశాంతతను చెడగొట్టినవారు. వీరు పట్టణములో కలహములను వైరములను కలుగజేశారు. వీరు అధిపతి యొక్క ఆజ్ఞలను బొత్తిగా అలక్ష్యంచేసి మిక్కిలి హానికరమైన తమ బోధకు కొందరిని త్రిప్పి వారిని తమలో కలుపుకొన్నారన్నదే ఆ నేరం.

అందుకు విశ్వాసి ఇలా బదులిచ్చాడు : తన ప్రభువు, నిర్దేశకుడు, సమస్త విశ్వమునకు సృష్టికర్త, పరిపాలకుడు అయినవాని వాక్యమునకు, చిత్తమునకు వ్యతిరేకముగా లేచిన దానినే తాను వ్యతిరేకించాను తప్ప వేరేమీ కాదని చెప్పాడు. "ఇక అల్లర్లు సృష్టించడానికొస్తే, స్వయంగా నేను శాంతిని కాంక్షించే వాడను గనుక నా అంతట నేను ఎలాంటి కలహాలు సృష్టించలేదు. ఇక మా పక్షం వహించినవారి విషయానికొస్తే, వారే స్వయంగా సత్యాన్ని, మా నిర్దోషత్వాన్ని వాటితోబాటు

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

మమ్మల్ని నేరస్తులుగా అప్పగించినవారి క్రూరత్వాన్ని, అన్యాయాన్ని గమనించారు గనుక ఇది వారి సొంత నిర్ణయం; పైగా వారు సరైన మార్గంవైపుకే తిరిగారు. మీరు మీ రాజుగురించి మాట్లాడారు కదా, అతడు మరెవరో కాదు– మంచివాళ్లందరికీ శత్రువైన బయెల్జెబూలే అయ్యుంటాడు గనుక వానినీ, వాని సమస్త దూతగణాలను నేను తిరస్కరిస్తున్నాను" అని చెప్పాడు.

అప్పుడు ఎవరైనా మన ప్రభువైన బయెల్జెబూలు పక్షముగా ఈ ఖైదీయైన విశ్వాసిమీద ఏ దోషమునైన చెప్పగలిగినట్టయితే వారు ఇప్పుడే బయలుదేరి వచ్చి తమ సాక్ష్యమును చెప్పవలసిందిగా మనవిచేయబడింది. కాబట్టి మత్సరుడు, మూఢభక్తి, మాయావి అను ముగ్గురు సాక్షులు బయలుదేరి వచ్చారు. అప్పుడు – ఎదుటనున్న ఈ ఖైదీని మీరు ఎరుగుదురా! మన ప్రభువైన రాజుగారి పక్షముగా మీరు వీనిమీద చెప్పగల సాక్ష్యము ఏమిటి? అని అడుగగా– **మత్సరుడు** ఎదుట నిలువబడి, ఇలా చెప్పాడు: మహాప్రభూ! నేను చాలాకాలము నుండి ఈ మనుష్యుని ఎరుగుదును. కోర్టువారి ఎదుట నేను ప్రమాణము చేసి చెప్పునదేమనగా–"

న్యాయాధిపతి: "ఒక క్షణం ఆగు! గుమస్తా, ఇతనిచేత ప్రమాణము చేయించు.

మత్సరుడు: మహా ప్రభూ! ఇతని పేరును బట్టి మంచివాడని అనుకోవచ్చు కాని, మన దేశమంతట వీడే మహా దుష్టుడు. వీడు అధికారినైన, జనులనైన, చట్టాన్ని గాని, ఆచారాన్ని గాని దేనినీ గౌరవించడు, సరికదా, ఇతరులమీద అతని భక్తిహీనమైన ఆలోచనలు రుద్దుతాడు. పైగా వాటికి విశ్వాసము, పవిత్రతా నియమాలని పేరుపెట్టాడు. క్రైస్తవ్యానికీ, ఈ మాయా పట్టణపు ఆచారాలకు ఏ మాత్రం పొంతన కుదరదని, అవి పరస్పర విరుద్ధమైనవి, వాటిని కలపడం ఎవరివల్లా కాదని ఇతడు చెప్పడం నేను విన్నాను. అలాంటి ప్రకటనలు చెయ్యడం ద్వారా వీడు మన మెచ్చదగిన విధానాలన్నిటిని తూలనాడటమే కాక వాటిని పాటించే మనల్ని కూడ ఖండిస్తున్నాడు. వీడి గురించి ఇంకా ఎన్నయినా చెప్పగలను, కానీ కోర్టువారికి శ్రమ కలిగించడం నాకు ఇష్టంలేదు. దీనికి సాక్షులుగా వేరేవాళ్లు కూడ ఉన్నారు. అవసరమైతే, మిగతావాళ్లు చెప్పిన తరువాత నా సాక్ష్యాన్ని ఇంకా విపులంగా, ఏదీ విడువకుండ చెప్పగలను.

అప్పుడు న్యాయమూర్తి మూఢభక్తి అనేవాణ్ణి పిలిచి, "బోనులో ఉన్న ఇతన్ని చూశావా? ఈ పట్టణ ప్రభువు, రాజుగారి పక్షాన ఇతనికి విరోధంగా ఏమైన చెప్పగలవా?" అప్పుడు వారు అతనిచేత ప్రమాణం చేయించారు.

మూఢభక్తి: మహా ప్రభూ! ఇతనితో నాకు అంతగా పరిచయం లేదు, పరిచయం కలిగివుండాలన్న కోరిక కూడ లేదు. ఏది ఏమైనా, ఈ విషయం నాకు బాగా తెలుసు. వీడు చాలా ఇబ్బందులు సృష్టిస్తాడని. ఆ మధ్య ఒకరోజు నాతో మాట్లాడుతూ, మన మతం దేవుని వద్దనుంచి వచ్చింది కాదని, దాన్ని అనుసరించడం ద్వారా ఎవరూ దేవుణ్ణి సంతోషపెట్టలేరని అన్నాడు. అంటే, మనం పూజించేది వ్యర్థమేనని, మనమింకా మన పాపంలోనే ఉన్నామని, చివరికి శిక్షకు పాత్రులమవుతామన్నదే వీడి మాటలకు అర్థం.

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

తర్వాత, మాయావి చేత ప్రమాణం చేయించి తనకు తెలిసిన విషయాలు చెప్పమన్నారు.

మాయావి: మహా ప్రభూ! గౌరవ న్యాయమూర్తులందరికీ నమస్కారం. వీడు నాకు చాలాకాలం నుంచి తెలుసు. ఇతగాడి నోట చెప్పనలవి కాని మాటలు నేను విన్నాను. ఘనతవహించిన మన బయెల్జెబూలు మహారాజుకు వ్యతిరేకంగా ఇతడు దేవదూషణలు చేస్తూ, వారి గౌరవ మిత్రులు, ప్రభువులైన శ్రీ ప్రాచీన పురుషుడు, శ్రీ ఐహికానందం, శ్రీ విలాసవంతం, శ్రీ డంబాచారి, శ్రీ కామాతురుడు, శ్రీ అత్యాశాపరుడు తదితర ప్రభువులందరికీ వ్యతిరేకంగా దుర్భాషలాడటం నా చెవులార విన్నాను. ఇక్కడ ఉన్నవారు తనవంటివారైతే, ఈ పురజనులలో ఒక్కరుకూడ ఈ పట్టణంలో నివాసముండరని చెప్పడం కూడ విన్నాను. అంతేకాదు యువరానర్, న్యాయమూర్తులైన మీగురించి కూడ చెడుగా మాట్లాడటానికితడు భయపడలేదు. మీరు భక్తిహీనులైన దుర్మార్గులట. అలాంటి దూషణకరమైన మాటలతో ఈ పట్టణ పుర ప్రముఖులందరి పైన బురద చల్లే ప్రయత్నం చేశాడు.

మాయావి తన సాక్ష్యాన్ని ముగించిన మీదట న్యాయమూర్తి సజ్జన ద్వేషి బోనులో నిలబడ్డ నిందితుడితో ఇలా మాట్లాడాడు: "ఓరీ దేశదిమ్మరీ, స్వపక్షమును విడిచిన దుర్మార్గుడా, దేశద్రోహి, దుర్బోధకుడా, నీకు వ్యతిరేకంగా ఈ విశ్వసనీయ పౌరులు చెప్పిన సాక్ష్యం నీవు విన్నావా?"

విశ్వాసి: జడ్జిగారూ, నా తరపున నేను కొన్ని మాటలు చెప్పుకోవచ్చునా?

న్యాయమూర్తి: దుర్మార్గుడా, నీకు మరణమే తగిన శిక్ష. ఇక్కడే నిన్ను రాళ్లతో కొట్టి చంపాలి. కాని, ప్రజలందరూ మా సాత్వికమును, నీ పట్ల మా న్యాయబుద్ధిని చూడగలిగేందుకు గాను నికృష్టుడవైన నీకు మాట్లాడే అవకాశం కల్పిస్తున్నాను. నీగురించి నీవు ఏమి చెప్పుకుంటావో చూస్తాం.

విశ్వాసి: మత్సరుడు చెప్పిన దానికి సమాధానంగా నేనొక మాట చెప్పాలనుకుంటున్నాను. నేను ఇంతకుముందు చెప్పినది– అనగా దేవుని వాక్యానికి వ్యతిరేకమైన చట్టాలు, నియమాలు, ఆచారాలు, ప్రజలు ఎవరైనా సరే వారు క్రైస్తవ్యానికి బద్ధవ్యతిరేకులే. ఒకవేళ నా మాటల్లో ఏమైనా పొరపాటు ఉంటే నేను ఒప్పుకోవడానికి సిద్ధంగా ఉన్నాను. నేను ఎక్కడ పొరబాటుగా మాట్లాడానో చూపండి. అప్పుడు నా మాటలు ఉపసంహరించుకొని, క్షమాపణలు కోరుకుంటాను.

ఇక మూఢభక్తి నామీద చేసిన ఆరోపణల విషయానికొస్తే, నేను చెప్పిన మాటలు ఇవే: దేవుని ఆరాధించే విషయంలో దైవికమైన విశ్వాసం ఉండాలి. అయితే, దేవుని దివ్యచిత్తము మనకు బయలుపరచబడకుండ దైవిక విశ్వాసమనేది కలుగదు. కాబట్టి దేవుని ఆరాధనలో దైవ చిత్తానికి సంబంధించిన దైవ ప్రత్యక్షతకు కలుపబడినది ఏదైనా సరే, అది మానవ విశ్వాసమే అవుతుంది గనుక అలాంటి విశ్వాసంతో నిత్యజీవాన్ని పొందలేము."

మాయావిగారు చెప్పినదానికొస్తే, నేను పలికానని అతడు చెప్పిన పదాలు నేను ఉపయోగించలేదని మీకు విన్నవించుకుంటున్నాను. అయితే, ఒకమాట మాత్రం నేను అన్నాను,

దానికి ఇప్పటికీ కట్టుబడివుంటాను. అదేమిటంటే, ఈ పట్టణపు రాజు, అతని అల్లరిమూక మిత్రులందరూ ఈ నగరంలో ఉండటం కంటే నరకంలో ఉండటానికి తగినవారు. అదే గనుక నమ్మకద్రోహం, దేవదూషణ అయితే, మీ ఇష్టం వచ్చినట్లు చెయ్యండి. నేను మీ దయాదాక్షిణ్యాలమీదనే ఆధారపడివున్నాను.

న్యాయమూర్తి సజ్జనద్వేషి: న్యాయసభ పంచాయితీ పెద్దలారా, ఎవరి మూలంగా ఈ పట్టణంలో ఇంత పెద్ద అల్లరి చెలరేగిందో ఇతన్ని మీరు చూశారు, ఇతనికి వ్యతిరేకంగా ఈ యోగ్యులైన పెద్దమనుష్యులు చెప్పిన సాక్ష్యాలు విన్నారు. అతని ప్రత్యుత్తరమూ, అతని ఒప్పుకోలు మాటలు కూడ మీరు విన్నారు. ఇకవాడికి దండన విధించడమో, లేక అతని ప్రాణాలు కాపాడటమో మీ చేతుల్లో ఉంది. అయితే చట్ట ప్రకారం ఏమిచెయ్యాలో నేను మీకు ఉపదేశిస్తాను.

మన ప్రభువులవారి మహాసేవకుడైన ఫరో దినాలలో చెయ్యబడిన ఒక చట్టం ఉంది. తనకు విరుద్ధమైన మతాన్ని అవలంభించేవారు విస్తరించకుండ, తమకంటే బలవంతులు కాకుండ నివారించడానికి వీలుగా వారి మగబిడ్డలను నదిలో విసరివేయమని చెప్పేదే ఆ చట్టం.[10] మన మహారాజుగారి సేవకులలో మరొకడైన నెబుకద్నెజరు కాలంలో కూడ ఒక చట్టం చేయబడింది. ఎవరైతే తన బంగారు ప్రతిమ ఎదుట మోకరించి నమస్కరించరో వారిని అగ్నిగుండంలో వేయించమని అతడు ఆదేశించాడు.[11] దర్యావేషు దినాలలో అతనిని తప్ప మరొక దేవతను పూజించేవారిని సింహాల గుహలో త్రోసివేయమని మరొక ఆజ్ఞ జారీచేయబడింది.[12] ఇప్పుడీ తిరుగుబాటుదారుడు ఆ చట్టాల సారాంశాన్నంతటినీ అతడి తలంపులలోనే (ఆ తలంపే రాకూడదు) కాక మాటలలోను, క్రియలలోను అతిక్రమించాడు గనుక ఇతడి నేరాన్ని ఏమాత్రం సహించడానికి వీల్లేదు.

ఏ నేరమూ లేకపోయినా, ఎటువంటి విపత్తు సంభవించకుండ నివారించడానికే ఫరో చట్టం చెయ్యబడింది; అయితే ఇక్కడ అందరికీ తెలిసిన బహిరంగ నేరం ఉంది. ఇక రెండు, మూడు చట్టాలకొస్తే, వీడు మన మతాన్ని వ్యతిరేకించడం మీరు చూశారు, విన్నారు. నేరాన్ని అతడే స్వయంగా ఒప్పుకున్నాడు గనుక అతడు మరణశిక్షకు అర్హుడే.

అంతటితో పంచాయితీ సభ్యులు ఆ గదిలోనుంచి బయటికి వెళ్లిపోయారు. వారి పేర్లు: సర్వశ్రీ అంధుడు, పనికిమాలినవాడు, అసూయ, శరీరాశ, జారుడు, అహంభావి, మేధావి, శత్రుత్వం, దగాకోరు, క్రూరుడు, యూదా, మొండివాడు. వారు గదిలో ఉండగా వారివారి అభిప్రాయాలు వెలిబుచ్చారు. తీర్పు విషయంలో పంచాయితీ వారు ఒక నిర్ణయానికి వచ్చి, నిందితుడికి మరణశిక్షను సిఫారసు చేశారు.

10. నిర్గమ కాండము 1:22
11. దానియేలు 3:6
12. దానియేలు 6:7

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

విశ్వాసికి మరణదండన

జడ్జిగారు తీర్పును విని, వారి సిఫారసును అంగీకరించి అతనికి ఉరిశిక్ష విధించేందుకు ఒక తేది నిర్ణయించాడు. ఆవిధంగా విశ్వాసి తన నమ్మకాలకు కట్టుబడి, తన సాక్ష్యాన్ని స్వరక్తంతో ముద్రించుకొన్నవాడై, ఉరికంబం మీద మరణించాడు.

అప్పుడు నేను ఆ గుంపు వెనుక ఒక బంగారు రథమూ, కొన్ని అశ్వాలు విశ్వాసి కొరకు ఎదురుచూస్తూ నిలబడి ఉండటం చూశాను. (అతని విరోధులు అతనికి చేయవలసిన కీడు అంతా చేసిన తర్వాత) అతన్ని ఆ రథంలోకి ఎక్కించుకొని అత్యంత సమీప మార్గమైన మేఘాలమీదుగా పరలోక పట్టణానికి తీసుకెళ్లారు. అతడు పరలోకపు ద్వారం వద్దకు చేరుకున్నప్పుడు ఒక బూర ఊదిన శబ్దం నాకు వినపడినట్లుంది.

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

క్రైస్తవుడు చెఱసాలలో వేయబడి, విడుదల పొందుట

క్రైస్తవుడి విషయానికొస్తే అతనికి కొంత విశ్రాంతి లభించింది. అతన్ని మరల చెఱసాలలోని పంపించి, అక్కడే కొంతకాలం బందీగా ఉంచారు. అప్పుడు ప్రభువు చిత్తానుసారంగా, ఎట్టకేలకు అతడు విడుదల చేయబడ్డాడు. ఈ పాట పాడుకుంటూ అతడు తన దారిన వెళ్లిపోయాడు:

విశ్వాసీ, నీ యోగ్యమైన పేరును సార్థకం చేసుకున్నావు.
ఎవరి సన్నిధిని ఉన్నావో ఆయనకు "విశ్వాస"పాత్రుడివయ్యావు.
నీకున్న విశ్వాసం లేని సుఖానుభవమును ప్రేమించువారు
విశ్రాంతి దొరుకుతుందన్న ఆశలేక భయంతో కేకలువేస్తున్నారు.
కీర్తించు విశ్వాసీ, కీర్తించు! ఇప్పుడు నీ నామం అజరామరం
వారు నిన్ను హతమార్చినా, నీవింకా జీవించే ఉన్నావు!

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

అధ్యాయం
7
మనోహర పర్వతాలకు ప్రయాణం

నిరీక్షణని కలుసుకొనుట

క్రైస్తవుడు ఆ పట్టణం విడిచి ఎంతోదూరం వెళ్లకముందే, నిరీక్షణ అనేవాడు కలిసాడు. ఇతడు ఈ మధ్యనే యాత్రికుడయ్యాడు. తాను మాయాపట్టణానికి చెందినవాడని, సంతలోని క్రూరులు తనను, విశ్వాసిని ఎంత అన్యాయంగా, క్రూరంగా హింసించింది కళ్లార చూశానని, విశ్వాసి

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

మరణదండనకు సాక్షిగా నిలిచానని క్రైస్తవునికి చెప్పాడు. శ్రమలలో క్రైస్తవుడూ, విశ్వాసి ప్రవర్తించిన తీరును గమనించానని, అదే "ఈ లోకాన్ని, దాని మార్గాలను విడిచి, యాత్రికుడి జీవితాన్ని విశ్వసించే విధంగా నన్ను మార్చివేసింది" అని చెప్పాడు.

మార్గం చివరివరకూ ఇద్దరూ ఒకరికొకరు మంచి సహచరులుగా ఉంటామని ఒక ఒడంబడిక చేసుకున్నారు. సమయం వచ్చినప్పుడు తన మాదిరిని అనుసరించేందుకు సిద్ధంగా ఉన్నవారు ఆ సంతలో ఇంకా చాలామంది ఉన్నారని నిరీక్షణ క్రైస్తవుడికి చెప్పాడు. అప్పుడు అనిపించింది క్రైస్తవుడికి తాను అనుభవించిన శ్రమలూ, విశ్వాసి పొందిన దుర్మరణం వ్యర్థం కాలేదని.

వేషధారులను కలుసుకొనుట

వారు ఎంతోదూరం పోకముందే దారిలో జిత్తులమారి అనే వ్యక్తి కలిశాడు. తాను సుభాషిణీ నగరానికి చెందినవాడనని, పరలోకపట్టణానికి వెళుతున్నానని తెలియజేశాడు. అయితే వాడు తన పేరేమిటో వాళ్లకు చెప్పలేదు.

క్రైస్తవుడు: మీది సుభాషిణీ నగరమా! మీ ఊళ్లో మంచి పౌరులు ఎక్కువమంది ఉన్నారా?

జిత్తులమారి: అవునండీ, అది మంచి పట్టణం.

క్రైస్తవుడు: నా పేరు క్రైస్తవుడు, ఇతడు నా మిత్రుడు నిరీక్షణ. నీ పేరేంటి?

జిత్తులమారి: నేను మీకు కొత్తవాణ్ణి, మీరు నాకు కొత్త; ఒకవేళ మీరు నా మార్గంలోనే వెళుతున్నట్టయితే, మీతో నేను ఆనందంగా సహవాసం చేస్తాను.

క్రైస్తవుడు: ఈ సుభాషిణీ నగరం గురించి నేను ఇంతకు ముందు విన్నాను; అది చాలా సంపన్నమైన ఊరు అని గుర్తుంది.

జిత్తులమారి: నిజమే, అక్కడ నాకు చాలామంది ధనికులైన బంధువులున్నారు.

క్రైస్తవుడు: అక్కడున్న మీ బంధువులు పేర్లు కొన్ని చెప్తారా?

జిత్తులమారి: ఆ ఊళ్లో దాదాపుగా అందరూ మాకు బంధువులే. వారిలో ప్రముఖులు శ్రీ మార్పులరావు, శ్రీ సమయానుసారి, శ్రీ సుభాషణరావులు కాగా వీరి పూర్వికుల నుండే ఈ ఊరికి ఆ పేరు వచ్చింది. శ్రీ మృదుకర్, శ్రీ ఇరుముఖం, శ్రీ సర్వారాయుడు, అతిపెద్ద సంఘానికి పాస్టరుగా పనిచేస్తున్న రెవ.కపటం గారు స్వయాన మా అమ్మకు తమ్ముడు, నాకు మేనమామ. నిజం చెప్పాలంటే నేను గొప్ప వంశానికి చెందినవాడను. మా ముత్తాత పడవలు నడిపేవాడే అయినా, మాకున్న ఆస్థినంతా ఆ వృత్తిద్వారా సంపాయించిందే కావడం విశేషం.

క్రైస్తవుడు: మీకు పెళ్లయిందా?

జిత్తులమారి: అయింది. నా భార్య చాలా ప్రజాదరణ కలిగిన మనిషి, సంస్కృతి సాంప్రదాయాలకు పెట్టింది పేరు అయిన శ్రీమతి టక్కులాడి గారి కుమార్తె. వారిది చాలా గౌరవనీయమైన కుటుంబం; పైగా ప్రజలతో ఆమె ఎంత చక్కగా కలిసిపోతుందంటే, సంపన్నులనైనా, సామాన్యులనైనా, ధనికులైనా దరిద్రులైనా, రాజైనా, పేదయినా వారిని అర్థంచేసుకోవడం ఆమెకు వెన్నతో పెట్టిన విద్య. నిష్టగల మతానికి మా మతం రెండువిషయాల్లో కాస్త భిన్నంగా ఉంటుందనే మాట సత్యమే. మొదటిది, మేము ప్రవాహానికి వ్యతిరేకంగా ఎన్నడూ ఈదటానికి ప్రయత్నించం. "రోము నగరంలో ఉన్నప్పుడు రోమావారిలాగే ప్రవర్తించండి" అన్న ఆ వచనాన్ని (?) మేము పాటిస్తాం. రెండవదిగా, సంస్కృతి, పేరుపొందిన వ్యవహార శైలితో కూడిన మతం పట్ల మేము ఎంతో ఆసక్తి కనబరుస్తాము. మతం వెండి చెప్పులు ధరించి సూర్యకాంతిలో నడుస్తుండగా ప్రజలు చప్పట్లు కొడుతున్నప్పుడు మేము దాని అనుచరులమని చెప్పుకోవడానికి సంతోషిస్తాం. అయితే అదే మతం చింపిరిగుడ్డలు ధరించి, విద్య, డబ్బు లేకుండ, ఉన్నత వర్గం ప్రజలకు ఆమోదయోగ్యంగా లేనప్పుడు దాని నుంచి ఎలా తప్పుకోవాలో మాకు తెలుసు.

అప్పుడు క్రైస్తవుడు ప్రక్కకు జరిగి, నిరీక్షణతో చిన్నగా ఇలా అన్నాడు, "వీడు సుభాషిణీ నగరానికి చెందిన జిత్తులమారి అయ్యుంటాడని నాకు అనిపిస్తోంది. అతడే గనుక అయితే, ఈ దేశం మొత్తంలో కెల్ల మహాగొప్ప మాయగాడు మన ప్రక్కన ఉన్నట్టే."

"అతన్నే అడుగు. తన పేరు తాను చెప్పుకోవడానికి అతడు సిగ్గుపడకూడదు" అన్నాడు నిరీక్షణ్.

అప్పుడు క్రైస్తవుడు అతని వద్దకు వెళ్లి, "అయ్యా, మీ పేరు జిత్తులమారి కదా? అందరూ మిమ్మల్ని సుభాషిణీ నగర్ మాయగాడు అంటారు కదూ?"

జిత్తులమారి: అది నా అసలు పేరు కాదు. నేనంటే గిట్టనివాళ్లు నన్ను అలా పిలుస్తారు. అది నన్ను నిందిస్తూ పలికిన మాట. నేను ఎక్కడికి వెళ్లినా అవి భరించాల్సిందే. నా కంటే ముందున్న మంచివాళ్లు కూడ ఆ నిందలు భరించారు.

క్రైస్తవుడు: కానీ వారు అలాంటి పేరుతో నిన్ను ఎందుకు పిలిచారు?

జిత్తులమారి: నేను మీకు ఇంతకు ముందే చెప్పినట్టు, నేనంటే వాళ్లకు ఇష్టం లేదు. నేను చేసినవాటిలో నా మిత్రులకు నచ్చనిది ఏదైనా ఉన్నదీ అంటే అది నా ముందుచూపే. వారికంటే ముందుగా నేను భవిష్యత్తు గురించి తెలుసుకొని దానికి తగ్గట్టు నిర్ణయం తీసుకొనడంలో ఎల్లప్పుడు ముందుంటాను. నా అదృష్టం కొద్ది ఆవిధంగా నేను జీవితంలో అనేకమైన మేళ్లు పొందాను. అదృష్టం నన్ను వరిస్తుంటే, అది నాకు ఆశీర్వాదంగా భావిస్తాను, ఇక నన్ను చెడ్డపేరుతో పిలిచే అసూయపరులు శిక్ష అనుభవిస్తారు.

క్రైస్తవుడు: నేను విన్నది మీ గురించే అనుకున్నాను. ఇప్పుడైతే మీరు ఒప్పుకున్నా లేకపోయినా ఆ పేరు మీకే సరిగ్గా సరిపోతుందనిపిస్తోంది.

జిత్తులమారి: సరే, నువ్వు అలా భావిస్తే నేనేం చెయ్యలేను. ఏదిఏమైనా, ఇప్పటికీ నన్ను మీ సహచరుడిగా అంగీకరిస్తే, నా సహవాసం మీకు ఆమోదయోగ్యంగా ఉంటుందని మాత్రం చెప్పగలను.

క్రైస్తవుడు: నువ్వు మాతో వచ్చేపనయితే, ప్రవాహానికి ఎదురీదవలసి వస్తుంది. కానీ అలా చెయ్యడం నువ్వు చెప్పినట్లు మీ పాలసీకి వ్యతిరేకం కదా. నువ్వు మా మతాన్ని కూడ స్వీకరించవలసి వస్తుంది. అది మీ దృష్టికి వెండి చెప్పులు ధరించి, సూర్యకాంతిలో కవాతు చేస్తూ, ప్రజల చప్పట్లు మారు మ్రోగుతున్నప్పుడు ఎలాగో మురికి గుడ్డలు ధరించినప్పుడు కూడ దాన్ని మీరు స్వీకరించాల్సిందే. స్వేచ్ఛగా ఉండి ఆనందించినప్పటిలాగే సంకెళ్లతో బంధింపబడినప్పుడు కూడ మీరు దానిని అనుసరించాలి.

జిత్తులమారి: నీ నమ్మకాలను నా మీద రుద్దకూడదు లేదా నా విశ్వాసం మీద నీవు పెత్తనం చెలాయించకూడదు. నా సొంత చిత్తానికి, నిర్ణయానికి నన్ను విడిచిపెట్టి, మీతో ప్రయాణించనివ్వు.

క్రైస్తవుడు: అది అసాధ్యం. ఎందుకంటే, "సమ్మతింపకుండ ఇద్దరు కూడి నడతురా?"[1] అవినీతికి నీతికి దుర్నీతితో ఏమి సాంగత్యము? వెలుగునకు చీకటితో ఏమి పొత్తు? క్రీస్తునకు బెలియాలుతో ఏమి సంబంధము? అవిశ్వాసితో విశ్వాసికి పాలెక్కడిది?"[2]

జిత్తులమారి: అలాగైతే, నా పాత నియమాలను నేను ఎన్నడూ విడిచిపెట్టను. ఎందుకంటే అవి నిరపాయమైనవి, లాభకరమైనవి. నేను మీతో రావడం కుదరదంటే, ఎప్పటిలాగే ఒంటరిగానే వెళతాను. మీరు రాకముందు ఎలా వచ్చానో అలాగే వెళతాను. నన్ను తన మూసలోనికి మార్చకుండనే నాతో సహవాసం చెయ్యడానికి ఇష్టపడేవారు ఈలోపు ఎవరో ఒకరు ఈ దారిన రాకపోరు కదా.

అంతటితో జిత్తులమారి వెనుకకు తగ్గాడు. యాత్రికులు వెనక్కి చూడగా ముగ్గురు మనుష్యులు అతని వెంట రావడం చూశారు. అతడు వారికి నమస్కారం చెయ్యగా, వారు కూడ స్నేహపూర్వకంగా అభివాదం చేశారు. వారికి పాత పరిచయం ఉంది. ఆ ముగ్గురి పేర్లు భూమయ్య, ధనప్రియం, పొదుపరి. ఒకప్పుడు వారు జిత్తులమారితో కలిసి చదువుకున్నారు. వీళ్లందరూ కలిసి దురాశా దేశంలోని ప్రేమలాభం అనే ఊళ్లో లోభి అనే పంతులుగారి దగ్గర బడికి వెళ్లారు. ఈ పంతులు గారు తన విద్యార్థులకు ముఖస్తుతి, అబద్ధం, మోసం, హింస లేదా భక్తి ముసుగు ధరించడం ద్వారా ఏవిధంగా సంపాదించాలో నేర్పించాడు; ఆ నలుగురు ప్రబుద్ధులు తమ గురువుగారి విద్యను ఎంత బాగా నేర్చుకున్నారంటే, ఎవరికి వారే ఒక పాఠశాలలో బోధించగలిగేంతగా నేర్చుకున్నారు. వారు ఒకరినొకరు పలకరించుకొని అభివాదాలు చేసుకున్న తరువాత, ధనప్రియం

1. ఆమోసు 3:3 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8
2. 2కొరింథీయులకు 6:14-15

అడిగాడు, "అక్కడ దారిలో మనకు ముందుగా వెళుతున్నారే, వాళ్లెవరు?" అని.

జిత్తులమారి: వాళ్లు తమకు తోచినవిధంగా యాత్రకు వెళుతున్న దూరదేశస్తులు.

ధనప్రియుం: అయ్యో! అందరం కలిసి తోడుగా వెళ్లేవాళ్లమే, వారు ఎందుకు ఆగలేదు? మనమందరం కూడ యాత్రకే కదా వెళుతున్నాం.

జిత్తులమారి: నిజమే మనం కూడ యాత్రలకే వెళుతున్నాం. కానీ ఈ మనుష్యులు చాలా సంకుచిత భావాలు కలిగిన కఠిన మనస్కులు. వారు తమ సిద్ధాంతాలను ఎంత అతిగా ప్రేమిస్తూ, ఇతరుల అభిప్రాయాలను ఎంత చులకనగా చూస్తారంటే, వారు మన సహవాసాన్నే లెక్కచేయరు. ఒకడు ఎంత భక్తిపరుడైనా కాని, వాడు అన్నివిషయాల్లో వారితో ఏకీభవించకపోతే మాత్రం అతనితో కలవడానికి వారు ససేమిరా ఇష్టపడరు.

పొదుపరి: అది దారుణం; అయితే చాలా భక్తిగా, మహా నిష్టగా ఉండేవాళ్ల గురించి మనం అప్పుడప్పుడు చదువుతుంటాం కదా, వారి నిష్ట వల్ల ఇతరులను నిందించడం తప్ప తమ్మును తాముగాని, తమతో ఏకీభవించేవారిని గాని విమర్శించుకోరు. ఇంతకీ వారు నీలో కనుగొన్న దోషం ఏమిటి?

జిత్తులమారి: నేను సమయానుకూలంగా ప్రవర్తించడం వారికి నచ్చలేదు. ఎటువంటి వ్యతిరేకత ఉన్నా, ఎలాంటి వాతావరణమైనా వారు తమ ప్రయాణంలో ముందుకు సాగిపోవడమే వారి విధి అన్నట్టు వారు తలబిరుసుతనంతో వెళ్లారు. ఒక్క క్షణం కూడ వెనుకా ముందు ఆలోచించకుండ దేవునికోసం అందరినీ ప్రమాదంలో నెట్టడానికి ముందుంటారు. నేనేమో నా ఆస్థిని, నా జీవితాన్ని, నా భద్రతనూ కాపాడుకోవడం కోసం జాగ్రత్తగా ఉంటూ పరిస్థితులను అనుకూలంగా మార్చుకోవడానికి, లక్ష్యాన్ని చేరుకోవడానికి ప్రయత్నిస్తాను. వాళ్లేమో మనష్యులంతా వ్యతిరేకించినా తాము పట్టిన కుందేటికి మూడే కాళ్లు అన్నట్లు వ్యవహరిస్తుంటారు. అయితే నేను మాత్రం పరిస్థితులన్నీ అనుకూలంగా ఉండి, నేను సురక్షితంగా ఉంటాను అనుకున్నప్పుడే భక్తి విషయం ఆలోచిస్తాను. వాళ్లేమో చిరిగిన దుస్తులూ, తిరస్కారం ఎదురైనప్పుడు కూడ భక్తిని అనుసరిస్తామంటారు, నేనేమో భక్తి అనేది వెండి చెప్పులు ధరించి ఎండలో నడుస్తూ, ప్రజల ప్రశంశలు పొందుకునేదిగా ఉండాలని ఆశిస్తాను.

భూమయ్య: నువ్వు సరిగ్గా చెప్పావు జిత్తులమారీ. తనకు కలిగినదాన్ని కాపాడుకునే స్వేచ్ఛ కలిగివుండి, భక్తివలన కలిగే అదృశ్యమైన వాగ్దానం కోసం ఉన్నది పోగొట్టుకునేవాడు నా దృష్టిలో మతపరమైన మూర్ఖుడే అనిపిస్తుంది. దేవుడు మనకిచ్చిన తెలివి తేటల్ని మనం ఉపయోగించుకోవాలి. పాముల వలె మనం వివేకంగా ఉందాం. తెలివి గలవాళ్లు ఎండగా ఉన్నప్పుడే గడ్డి మోపులు కడతారు గాని వర్షం కురిసేటప్పుడు కాదు. పనిచెయ్యడానికి ఏది

మంచి సమయమో మనమే తెలుసుకోవాలని ఆయన ఆశిస్తాడు. నామట్టుకైతే, ఏది నాకు దేవుని ఆశీర్వాదాలను కలిగిస్తుందో అదే నిజమైన భక్తి; ఎందుకంటే శ్రేష్టమైన ఈవులనిచ్చిన దేవుడు వాటిని తనకోసం కాపాడుకోవద్దు అంటాడని బుద్ధి ఉన్నవాడెవడైనా ఊహిస్తాడా? అబ్రాహాము, సొలొమోను ధనవంతులయ్యారు, చాలా భక్తిగా జీవించారు. భక్తుడైన యోబు ఇలా అన్నాడు "ఒకడు సర్వశక్తుని యొద్దకు వచ్చినట్లయితే అతడు బంగారాన్ని మంటిలో పారవేస్తాడు" అంతేగాని మనకు ముందుగా వెళుతున్న ఇద్దరు పెద్దమనుష్యుల్లాగా బంగారాన్ని మట్టితో సమానంగా జమకట్టేవాడు కాదు.

పొదుపరి: ఈ విషయంలో మనమందరం ఏకీభవిస్తున్నాం గనుక దీనిపై ఇక తదుపరి చర్చ అనవసరం అనుకుంటాను.

ధనప్రియం: అంతే. ఇక దీని గురించి మాటలు అనవసరం. మన దృక్పథాన్ని రుజువు చెయ్యడానికి మనకు లేఖనాలు, హేతుబద్ధత రెండూ ఉన్నాయి గనుక లేఖనాలను గాని, హేతుబద్ధతను గాని అనుసరించనివాడికి నిజమైన స్వేచ్ఛ గురించి తెలియదు, అతని భద్రత గురించిన పట్టింపూ ఉండదు.

జిత్తులమారి: మీకు తెలుసు కదా, మనమంతా యాత్రకు బయలుదేరాం. కాబట్టి, మన సంభాషణను వేరేవైపు మార్చడం కోసం నేనీ ప్రశ్న వేయవచ్చా?

ఉదాహరణకు, ఒక వ్యక్తి – వ్యాపారస్తుడు గాని లేదా సేవకుడు గాని– అతడు గతంలో అంతగా ప్రాముఖ్యమైనవిగా లేక యోగ్యమైనవిగా ఎంచని వాటి విషయంలో ఇప్పుడు మరింత భక్తిని కనపరుస్తూ, తద్వారా అతడు అభివృద్ధిలోనికి వచ్చే అవకాశం ఉందని గమనించినట్లయితే, అతడు తన నైతిక ప్రమాణాలను దిగజార్చుకోకుండ, తన గుణశీలాన్ని చౌకబారుగా చేసుకోకుండ ఈ అవకాశాన్ని తనకు అనుకూలంగా మార్చుకుంటాడా లేదా చెప్పండి. అతడు ఇలా చేసినా ఇంకా నీతిమంతుడుగా, నిజాయితీపరుడుగా ఉండలేడా?

ధనప్రియం: నీ భావమేమిటో నాకు తెలుసు. తక్కినవారు అనుమతిస్తే, ఈ ప్రశ్నకు నేను జవాబు చెప్తాను. మొదట, ఒక సేవకుడి విషయమై ఆలోచిద్దాం: ఒక మంచి సేవకుడున్నాడు. అతనికి ఆదాయం తక్కువ. అయితే తనకోసం, తన కుటుంబం కోసం ఈ లోకపు వస్తువులను మరికాస్త సంపాయించాలని ఆశించాడనుకుందాం. తన సంఘస్తులకు సంతోషం కలిగించే విధంగా అతడు తన నియమాలను, పద్ధతులను కొంచెం మార్పులు చేయగలిగితే ఇవన్నీ పొందగలిగే అవకాశం ఉన్నట్లు అతడు గమనించాడు. మరింత కష్టపడి పనిచేస్తూ, తన గురించి, తన సంఘం గురించి మరింత గొప్పగా ప్రచారం చేయించుకొని, అవకాశం దొరికిన ప్రతిసారి మరింత ఆసక్తితో ప్రసంగాలు చేస్తూ, తన ఉద్దేశానికి తగ్గట్టు లేఖనాలు ఎంచుకొని, వాటిని తనకు అనుకూలంగా మార్చుకొంటూ, తన సంఘ ఆదాయాన్ని పెంచుకోవడం కోసం దశమభాగాలు, దేవునికి ఇవ్వడం

అనే అంశాలపై గట్టి ప్రసంగాలు సిద్ధంచేసుకొని, ఎక్కువ జీతం పొందగలిగే స్థాయిని తనకు కల్పించుకొని తద్వారా, తన సామాజికవర్గంలో, తన డినామినేషన్‌లో గౌరవమర్యాదలు పెంచుకునే అవకాశం ఉందని భావించాడు అనుకుందాం. ఈ అవకాశాన్ని అతడు ఉపయోగించుకోకూడదు అనడానికి నాకు కారణమేమీ కనిపించడం లేదు. నిజానికి అతడు ఉపయోగించుకొని తీరాలి.

మొదటిగా, సంపాదించాలన్న అతని ఆశ సహజమైనది, చట్టబద్ధమైనది, పైగా అది పొందగలిగే అవకాశం దైవానుగ్రహం వల్ల అతని ఎదుట ఉంచబడింది. అతని మనస్సాక్షి విషయంలో ఎలాంటి ప్రశ్నలూ వేయకుండా ఉండగలిగితే అలాంటి అవకాశాలకు కొదువే ఉండదు.

రెండవది, తన కోరిక అతన్ని మరింత శ్రద్ధ, ఆసక్తిగల ప్రసంగికుణ్ణి చేస్తుంది, తన ప్రతిభకు మెరుగుపెట్టుకునేలా చేస్తుంది, తద్వారా అతడు మంచి మనిషిగా తయారవుతాడు పైగా అది ఖచ్చితంగా దేవుని చిత్తమే అయ్యుంటుంది.

మూడవది, తన నియమాల విషయంలో కాస్త రాజీపడి తమకు సేవచెయ్యాలని ఆశించే తన ప్రజల కోరికను అతడు మన్నించే విషయానికొస్తే, అది మెచ్చదగిన పనే అనిపిస్తోంది నాకు; అది మనకు ఏమి చూపుతుందంటే, అతడు తనను తాను ఉపేక్షించుకునే తత్వమూ, చక్కని వ్యక్తిత్వమూ గలవాడని, తన వృత్తికి అతడు అన్నివిధాల యోగ్యుడని చూపుతుంది.

కాబట్టి నేను చెప్పదలచుకున్నదేమంటే, చిన్న బాధ్యత, తక్కువ జీతం కలిగిన ఒక సేవకుడు, ఎక్కువ జీతంతో కూడిన పెద్ద బాధ్యతను చేపడితే అది దురాశగా ముద్రవేయకూడదు. అతడు తన సేవలను మెరుగుపరచాడు గనుక తన పిలుపుకు తగినట్లు జాగ్రత్తగా నడుచుకునేవానిగాను, మేలుచేయడానికై అతని ముందున్న అవకాశాలను అతడు చక్కగా వినియోగించుకునేవానిగాను పరిగణించబడాలి.

ఇక నీ ప్రశ్నలోని రెండవ భాగమైన వ్యాపారస్తుని గురించి చూద్దా: ఏదైనా ఒక చిరువ్యాపారి, లేక తక్కువ ఆదాయం పొందే పనివాడు భక్తిపరునిగా మారడం ద్వారా అతని పరిస్థితిలో మార్పు వస్తే– ధనవంతురాలిని పెళ్లాడి, ఎక్కువమంది కష్టమర్లను సంపాదించడమో లేదా మెరుగైన ఉద్యోగం పొందడమో జరిగితే– అది ఎందుకు న్యాయం కాదో నాకు అర్థం కావడంలేదు. అది న్యాయబద్ధమని చెప్పడానికి నేను చూపించే కారణాలివి: భక్తిపరుడుగా మారడం, ఏవిధంగానైనా అదొక సుగుణం. సంపన్నురాలిని భార్యగా చేసుకోవడం లేదా మంచి ఉద్యోగం, వ్యాపారం లేదా మెరుగైన జీతం సంపాయించడం చట్టవ్యతిరేకం కాదు. అంతేకాకుండ, భక్తిపరుడిగా మారినందుచేత వీటిని పొందినవాడు తనే స్వయంగా మంచివాడిగా మారతాడు. అదే అతనికి జరిగే అతిపెద్ద మేలు. కాబట్టి భక్తిపరునిగా మారినందువల్ల కలిగే ఫలితం– మంచి జీవితం, మంచి భార్య, మరింత డబ్బు, ఎక్కువమంది వినియోగదారులు, లేదా మెరుగైన జీతాలు, లేదా ఎక్కువ వ్యాపారం. కాబట్టి, వీటన్నిటినీ పొందడంకోసం భక్తిపరుడుగా మారాలనుకోవడం సదుద్దేశమే.

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

ధనప్రియం ఇచ్చిన ఈ జవాబును అందరూ ఎంతో ఉత్సాహంగా స్వీకరించారు. ఇది తప్పు అని దీన్ని విజయవంతంగా ఎవరూ కొట్టివేయలేరని కూడ వారు భావించారు. కాబట్టి వారు క్రైస్తవుని వద్దకు, విశ్వాసి వద్దకు వెళ్లి, ఈ ప్రశ్నను వారికి వెయ్యాలని నిర్ణయించుకున్నారు. ఎందుకంటే వాళ్లిద్దరూ జిత్తులమారిని అతని అభిప్రాయాలను త్రోసిపుచ్చారు. క్రైస్తవుణ్ణి, విశ్వాసినీ పిలిచి ఆగమని చెప్పారు. వారిని సమీపిస్తుండగా వాళ్లంతా ఒక నిర్ణయానికి వచ్చారు. అంతకు మునుపు జరిగిన చర్చలో వారిరువురు జిత్తులమారి పట్ల కనుపరిచిన వైఖరిని బట్టి ఈసారి ప్రశ్న భూమయ్యచేత అడిగించాలని తీర్మానించుకున్నారు.

ఒకరినొకరు పలకరించుకొని, పరిచయాలు చేసుకొని, ప్రయాణం, వాతావరణం మొదలైనవాటికి సంబంధించిన కబుర్లు చెప్పుకున్న తరువాత, భూమయ్య క్రైస్తవునికి ఆ ప్రశ్న వేశాడు.

క్రైస్తవుడు: దానిదేముంది, పిల్లవాణ్ణి అడిగినా చెప్తాడు ఆ ప్రశ్నకు జవాబు. లాభం కోసం భక్తుడిగా మారడం తప్పు అని ఎవరైనా తెలుసుకోవాల్సిందే! రొట్టెలు, చేపలకోసం ప్రభువును వెంబడించడం తప్పయితే, లోకాశలను అనుభవించడం కోసం ఆయనను, ఆయన భక్తిని ఉపయోగించుకోవడం అంతకంటే దారుణం.

వేషధారులైన పరిసయ్యులు అలాంటివారే: దీర్ఘ ప్రార్థనలు చెయ్యడం వాళ్ల పద్ధతి, కానీ విధవరాళ్ల ఇళ్లను సొంతంచేసుకోవడం వారి లక్ష్యం. వారు మహా దండనకు పాత్రులని యేసు చెప్పాడు.

నమ్మకద్రోహియైన యూదా కూడ ఆ కోవకు చెందినవాడే. తన చేతిలో ఉన్న డబ్బు సంచికోసమే అతడు భక్తిపరుడయ్యాడు. అతడు దొంగ, అపవాది, నాశన పుత్రుడు అని పిలువబడ్డాడు, తన సొంత స్థలానికే అనగా అపవిత్రాత్మలన్నీ వెళ్లే నరకానికే వెళ్లాడని అతని గురించి వ్రాయబడింది.

మోసగాడైన సీమోను కూడ ఇటువంటి విశ్వాసం గలవాడే. తన సొంత ప్రయోజనం, పేరు ప్రఖ్యాతుల కోసం వినియోగించుకోవడం కోసం పరిశుద్ధాత్మ శక్తిని తనకివ్వమని అపొస్తలులకు లంచమివ్వజూశాడు. అయితే అతని హృదయం దుష్టమైనదని, అతడు చేదైన పైత్యములోను దుర్నీతి బంధకములలోను ఉన్నాడని పేతురు చెప్పాడు.

ఇలాంటి ఆలోచనలన్నిటికీ కర్త సాతానుడే. కష్టం వచ్చినప్పుడు అక్కరకొస్తుందన్న ఆశతో తమ ఆస్థిలో కొంతభాగాన్ని దాచుకునేలా చేసి, సంఘం నిధులతో – ఇతరుల కష్టార్జితంతో బ్రతికేస్తూ క్రైస్తవులను మోసగిస్తూ, భక్తిని అడ్డుపెట్టుకొని ప్రయోజనం పొందమని అననీయ సప్పీరాలకు నేర్పింది వాడే. అయితే దేవుడు వాళ్లని మొత్తినందున ప్రాణాలే పోగొట్టుకున్నారు.

కాబట్టి, లోకాన్ని సంపాదించుకోవడం కోసం భక్తిని చేపట్టేవాడు దొంగ, అబద్ధికుడు, దోచుకొనువాడు, మోసగాడు, ఇస్కరియోతు యూదా, లోకం కోసం భక్తిని తీసి ప్రక్కనపెట్టేవాడు,

ముప్పయి వెండి నాణేలకోసం ప్రభువును అమ్ముకున్న యూదాలాంటివాడు. వారి బోధ వింటానికి హాయిగా ఉంటుందిగాని అది దయ్యపు బోధ గనుక అది సత్యమని నీవు దాన్ని స్వీకరించావంటే, నీ క్రియలను బట్టే నీ బహుమానం ఆధారపడివుంటుంది.

అంతటితో ఆ నలుగురు ఒకరి ముఖం ఒకరు చూస్తూ నిలబడ్డారు. నిరీక్షణ్ "ఆమేన్" అన్నాడు. క్రైస్తవుడూ, నిరీక్షణ్ ముందుకు సాగిపోగా, జిత్తులమారి అతని సహచరులు వెనకబడిపోయారు. తక్కినవాళ్లకంటే వారు కొంతదూరం ముందుకు వెళ్లాక, క్రైస్తవుడు నిరీక్షణ్‌తో ఇలా అన్నాడు, "వీళ్లు మనుష్యుల యెదుటనే నిలవలేకపోతే, దేవుని యెదుట నిలువగలమని ఎలా అనుకుంటున్నారు? మంటి ఘటములతోనే వ్యవహారం కుదరక నోరు పెగలకపోతే, దహించు అగ్ని జ్వాలలతో గద్ధించబడినప్పుడు వాళ్లు ఏంచేస్తారు?"

సౌఖ్యపు మైదానాన్ని దాటిపోవుట

క్రైస్తవుడు, నిరీక్షణ్ సౌఖ్యం అనే అందమైన మైదానం వరకు వెళ్లారు. అక్కడ వారు స్వేచ్ఛగా, సంతృప్తితో నడిచారు. ఆ మైదానం ఇరుకైనది గనుక త్వరలోనే దాన్ని దాటివెళ్లగలిగారు. మైదానానికి దూరంగా లాభదాయకం అనే ఒక చిన్న కొండ ఉంది. ఆ కొండలో ఒక వెండి గని ఉండటంతో దాని ప్రత్యేకతను బట్టి ఆగి చూద్దామని కొందరు దారితొలగి ఆగిపోవడం జరిగింది. అయితే వారు ఆ గుంటకు మరీ దగ్గరగా వెళ్లి తిరిగి రాలేదు. వారు నిలబడిన చోటు జారిపోవడంతో గుంటలో పడిపోయారు. కొందరు చనిపోగా మిగిలినవారు జీవితాంతం అవిటివాళ్లుగా మిగిలిపోయారు.

దేమా అను వానిని కలుసుకొనుట

ఆ దారికి కాస్త దూరంలో గుంటకు ఎదురుగా దేమా అనేవాడు నిలబడి రండి, వెండి గనిని చూడండి అంటూ ఆ దారిన వెళ్లేవారిని పిలుస్తున్నాడు. క్రైస్తవుడితోను, నిరీక్షణ్‌తోను దేమా ఇలా చెప్పాడు, "మిత్రులారా, ఇటు తిరిగి రండి, నేను మీకొకటి చూపిస్తాను."

క్రైస్తవుడు: దారి తొలగి రావలసినంత ప్రాముఖ్యమైనది నీవు ఏమి చూపిస్తావ్?

దేమా: ఇక్కడ ఒక వెండి గని ఉంది. సిరిసంపదల కోసం ప్రజలు ఇందులో త్రవ్వకాలు చేపడుతున్నారు. ఒక్కసారి వచ్చారంటే, కొద్ది ప్రయత్నంతోనే గొప్ప సంపద మీ సొంతం అవుతుంది.

"పద, వెళ్లి చూద్దాం" అన్నాడు నిరీక్షణ

క్రైస్తవుడు: నేను రాను. ఈ స్థలం గురించి, ఇక్కడ ప్రాణాలు పోగొట్టుకున్న అనేకమంది గురించి నేను విన్నాను. దానికితోడు, ఆ నిధి దొరికినవారికి ఒక ఉరిగా మారుతుంది; అది ఒక మనిషి శరీరాన్ని మనస్సును విషపూరితం చేసి, చీకటిమయం చేసి, క్షీణత కలుగజేసే వ్యాధిలా మారుతుంది.

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

అప్పుడు క్రైస్తవుడు దేమాను పిలిచి, "ఈ స్థలం అపాయకరమైంది కాదా? యాత్రికులలో అనేకుల నాశనానికి, అంతానికి కారణం ఇదే కదూ?" అని అడిగాడు.

"లేదు, నిర్లక్ష్యంగా ఉండేవారికి తప్ప, ఇది మరీ అపాయకరమైనదేం కాదు." అన్నాడు దేమా.

"అటువైపు ఒక్క అడుగు కూడ వెయ్యకుండ, మనం వెళుతున్న దారిలోనే తిన్నగా వెళ్దాం పద" అన్నాడు క్రైస్తవుడు నిరీక్షణతో.

నిరీక్షణ: ఒకవేళ జిత్తులమారి కూడ ఇదే దారిన వస్తే, మనకు ఇచ్చినట్లు అతనికి కూడ ఇదే ఆహ్వానం ఇచ్చారంటే, అతడు తప్పకుండ దాన్ని చూడటానికి వెళతాడు.

క్రైస్తవుడు: అనుమానమే లేదు. ఎందుకంటే, అతని నియమాలే అతన్ని ఆ మార్గంలో నడిపిస్తాయి; బహుశా అతడు అక్కడే చనిపోవచ్చు కూడ.

దేమా మరల పిలిచాడు, "ఒక్కసారయినా వచ్చి చూడరా మీరు?"

క్రైస్తవుడు: దేమా, నీవు క్రీస్తు ఉద్దేశాలకు విరోధివి. మంచి మార్గాన్ని విడిచి పోయినందుకు దేవుని మంచి న్యాయమూర్తులలో ఒకరిచేత ఇప్పటికే నిందించబడ్డావు. ఇప్పుడు మమ్మల్ని కూడ అదే శిక్షావిధికి గురిచెయ్యాలని చూస్తున్నావు. మేము ప్రక్కకు తొలగినట్లయితే, ఈ సంగతి మా ప్రభువు, మా మహారాజుకు తెలిసిపోతుంది గనుక ఒకరోజున మేము ఆయన ఎదుట నిర్భయంగా నిలబడాలనుకున్నప్పుడు మమ్మల్ని అవమానపరుస్తాడు.

క్రైస్తవుడూ, నిరీక్షణలు త్వరలోనే దేమా స్వరం వినబడనంత దూరం వెళ్లిపోయారు.

ఈలోపు జిత్తులమారీ, అతని మిత్రులు కొండమీదికి చేరుకొని, దేమా నుంచి తొలి ఆహ్వానం అందగానే వారు వెండి గనిని చూసేందుకు వెళ్లారు. అయితే వారు ఆ గనికి చాలా సమీపంగా వెళ్లి లోపల పడిపోయారో, లేక వెండిని తవ్వితీయాలని లోనికి దిగి ఊపిరాడక మరణించారో తెలియదు; కాని ఒకటి మాత్రం గమనించాను. ఆ మార్గంలో వారు మరల ఎన్నడూ కనిపించలేదు.

ఉప్పు స్థంభాన్ని చూచుట

మరల, ఆ మైదానానికి దూరంగా ప్రధాన రహదారికి సమీపంలో ఒక పురాతన స్మారక స్థంభం నిలబడి ఉంది. అది చాలా వింతగా ఉంది. అది ఒక స్థంభం ఆకారంలో ఉంది కాని, దానికి ఓ స్త్రీ ముఖం ఉంది. క్రైస్తవుడూ, నిరీక్షణ ఇక్కడ చాలాసేపు నిలబడి దాన్నే చూస్తూ దాని భావమేమిటో తెలుసుకొనేందుకు ప్రయత్నిస్తున్నారు. ఎట్టకేలకు దానిమీద ఏవో మాటలు వ్రాయబడి వుండటం నిరీక్షణ చూశాడు కాని అతడు విద్యావంతుడు కాకపోవడంతో ఆ మాటల అర్థం గ్రహించలేకపోయాడు. అతడు క్రైస్తవుడిని పిలిచి ఆ మాటలు చూపించగా, చివరికి ఆ హీబ్రూ

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

పదాల భావాన్ని గ్రహించాడు క్రైస్తవుడు: "లోతు భార్యను జ్ఞాపకము చేసుకొనుడి". ప్రాణాలు అరిచేతిలో పెట్టుకొని పారిపోతూ, కాలిపోతున్న సొదొమ పట్టణం వైపు దురాశతో వెనక్కి తిరిగి చూసినందుకు ప్రతిఫలంగా ఉప్పుస్థంభంగా మారిపోయిన లోతు భార్య యొక్క స్థూపం ఇదేనన్న నిర్ధారణకు వచ్చారు.

క్రైస్తవుడు: ఆహా, సోదరా నిరీక్షణ, లాభసాటి కొండను చూసేందుకు దేమా ఇచ్చిన ఆహ్వానం తరువాత, ఈ సమయంలో మనకు ఇదో మంచి జ్ఞాపికగా పనిచేస్తుంది. అతడు కోరినట్లు, నీవు మొగ్గుచూపినట్లు మనం వెళ్లినట్లయితే, మనం కూడ, ఈ స్త్రీలాగే భావి తరాలకు వేడుకగా మిగిలిపోయే వాళ్లమేమో ఎవరికి తెలుసు?

నిరీక్షణ: క్షమించాలి, నేను చాలా బుద్ధిహీనంగా ప్రవర్తించాను. ఇప్పుడు నాకు అనిపిస్తోంది, ఏమవుతుందో చూడాలన్న ఉబలాటంతో వెనక్కి చూసిన ఆమె వలే నేను కూడ ప్రవర్తించాను కదా, నా పాపానికీ, ఆమె పాపానికి వ్యత్యాసం ఏముంది చెప్పండి. ఆమె కేవలం వెనక్కి తిరిగి చూసింది, నేనేమో వెళ్లి అక్కడ ఏముందో చూడాలని ఆశించాను. ఇలాంటి నీచమైన ఆలోచన నా మనస్సులో ప్రవేశించినందుకు నేను సిగ్గుపడాలి, ఆ గొప్ప కృప సదా పూజించబడాలి.

క్రైస్తవుడు: రానున్న కాలంలో మనకు మేలు కలిగేవిధంగా ఇక్కడ మనం చూసేవాటిని జాగ్రత్తగా గమనిద్దాం. ఈ స్త్రీ యెహోవా దూత మాటకు విధేయత చూపడం ద్వారా ఒక తీర్పును తప్పించుకుంది గాని, వెనక్కి తిరిగి చూసి మరొక తీర్పుకు గురైంది.

నిరీక్షణ: సత్యమే. ఆమె మనకు ఒక హెచ్చరికగాను, ఉదాహరణగాను ఉంటుంది. ఆమె చేసిన పాపాన్ని మనం విసర్జించాలి అనేది ఒక హెచ్చరిక కాగా, ఆ హెచ్చరికను పెడచెవిన పెట్టినవారికి ఎదురయ్యే తీర్పు ఎలావుంటుందో దానికి ఉదాహరణగాను ఉంటుంది.

సంతోషపు నది ప్రక్కన నడచుట

త్వరలోనే వారు ఒక స్పటికపు నదివద్దకు వచ్చారు. అపొస్తలుడైన యోహాను దీనినే "జీవజలముల నది"[3] అన్నాడు. ఇప్పుడు వారు వెళ్తున్న మార్గం ఆ నది ఒడ్డున ఉంది, ఆ మార్గాన వారు ఆనందంగా నడుచుకొంటూ వెళ్తున్నారు. వారి ఆత్మలకు సేదదీర్చే ఆ నది నీటిని త్రాగేందుకు ఆగారు. ఆ నదికి ఇరువైపుల రుచికరమైన పండ్లను కాచే పచ్చని చెట్లతో కళకళలాడుతోంది. ఆ చెట్ల ఆకులు మంచి ఔషధంగా పనిచేస్తాయి. ఆ చెట్ల ఫలాలతో వారు తమ ఆకలిని తీర్చుకున్నారు, ఆ దేశంలో ప్రయాణించేవారికి సోకే వ్యాధులను నివారించడానికి వీలుగా ఆ చెట్ల ఆకులను తిన్నారు. నదికి ఇరువైపుల ఏడాది పొడవునా పచ్చగా ఉండే మైదానం అందమైన పుష్పాలతో అలంకరించబడివుంది. ఈ మైదానంలో వారు కాసేపు విశ్రమించి పూర్తి భద్రతలో నిద్రపోయారు. వారికి మెలకువ వచ్చినప్పుడు మరికొన్ని ఫలాలు తిని నదిలో నీళ్లు

3. ప్రకటన 22:1-2

త్రాగి మరల నిద్రపోయారు. ఈవిధంగా వారు అనేక దినాలు, రాత్రులు గడిపారు. వారు పాటలు పాడి దేవుని మంచితనంలో ఆనందించారు.

ముందుకు సాగిపోవాలన్న తలంపు వారికి కలిగినప్పుడు (ఇంకా వారి ప్రయాణం ముగించలేదు కాబట్టి,) తిని త్రాగి, ఆ స్థలాన్ని విడిచి వెళ్లారు.

మైదానం ప్రక్కన ఉన్న దారిలో వెళ్లుట

వారు అలా కొద్దిసేపు ప్రయాణించేలోపే ఆ నది, ప్రధాన రహదారి రెండూ విడిపోయేసరికి వారు కొంత బాధపడ్డారు. ఎందుకంటే, నది ప్రక్కనే ఉన్న దారి నునుపుగా చదునుగా ఉంది. ఇప్పుడు దారి బాగా కరుకుగా ఉండటంతో ప్రయాణం వల్ల వారి పాదాలు బాగా నొప్పిపెడుతున్నాయి. వారికి కొంచెం దూరంలో, దారికి ఎడం ప్రక్కన ఒక పచ్చికబయలు, కంచెకు అవతలివైపు దారికి నడిపించే ఒక నిలువు ద్వారం ఉన్నాయి. ఆ ద్వారం మీద ఈ మాటలు వ్రాయబడివున్నాయి: "వెలిదారి మైదానం". వారు ఆ ద్వారం వద్దకు వచ్చినప్పుడు, "ఈ మైదానం మన దారి ప్రక్కనే ఉంది గనుక మనం అటువైపు వెళదాం పద" అన్నాడు క్రైస్తవుడు. ద్వారం వద్దకు వెళ్లి చూశాడు. కంచెకు అవతలివైపున ఒక నున్నటి మార్గం ఉన్నట్లు అతడు చూశాడు. "నేను కోరుకున్నట్లే ఉంది" అన్నాడు క్రైస్తవుడు: "ఇదిగో హాయిగా వెళ్లే మార్గం. నిరీక్షణ, రా మనం అటువైపు వెళదాం."

నిరీక్షణ: ఒకవేళ ఈ మార్గం మనల్ని ప్రక్కదారి పట్టిస్తేనో?

క్రైస్తవుడు: అలా జరిగే అవకాశం లేదు. అది ప్రధాన రహదారి ప్రక్కనే వెళుతోంది చూశావా?

ఆవిధంగా నిరీక్షణ తన తోటి ప్రయాణికుడిచేత ఒప్పించబడినవాడై, ఆ కంచెమీదుగా క్రైస్తవుడి వెంట వెళ్లాడు. మైదానంలో నడుస్తుండగా వారి పాదాలకు హాయిగా అనిపించింది. వారికి ముందు కొంతదూరంలో ఆత్మస్థైర్యం అనే ఒక వ్యర్థుడు నడుస్తున్నాడు. క్రైస్తవుడు అతన్ని పిలిచి, ఈ దారి ఎటువెళుతుందో అడిగి తెలుసుకున్నాడు.

"పరమపురి ద్వారం వద్దకు" అని కేకవేసి చెప్పాడు.

"నేను చెప్పలేదా? దీన్ని బట్టి మనం చేస్తున్నది మంచిపనే అనిపిస్తోంది" అన్నాడు క్రైస్తవుడు. ఆవిధంగా వారు ఆత్మస్థైర్యంని వెంబడించారు. అయితే అంతలోనే రాత్రి కావడంతో చీకటిలో వారికి ఆత్మస్థైర్యం కనిపించలేదు. అతడు దారిలో సరిగ్గా చూచుకోకపోవడంతో ఒక లోతైన గుంటలో పడిపోయాడు. ఆ మైదానానికి యజమానియైన వాడు దారి తప్పిన ప్రయాణికులను పట్టుకునేందుకు ఏర్పాటుచేసిన గుంట అది. అతడు పడిపోవడం క్రైస్తవుడూ, నిరీక్షణ ఇద్దరూ విన్నారు గనుక ఏమైందో తెలుసుకునే ప్రయత్నం చేశారు. కానీ జవాబేమీ రాలేదు. వారికి కేవలం ఒక మూలుగు మాత్రమే వినపడింది.

"ఇప్పుడు మనం ఎక్కడున్నాం?" అడిగాడు నిరీక్షణ. తన తోటివానిని దారి మళ్లించినందుకు బాధపడుతూ క్రైస్తవుడు మౌనం వహించాడు. ఉరుములు మెరుపులతో వర్షం మొదలైంది, పల్లపు ప్రాంతం నీటిమయమైంది. అప్పుడు నిరీక్షణ బాధగా ఇలా అన్నాడు "అయ్యో మన దారిన మనం వెళ్లివుంటే ఎంత బావుండేది!"

క్రైస్తవుడు: ఈ దారి మనల్ని మార్గం నుంచి తప్పిస్తుందని ఎవరనుకున్నారు?

నిరీక్షణ: నేను దీనిగురించి మొదట్లోనే భయపడ్డాను. అందుకే నీకు మృదువుగా హెచ్చరించాను కూడ. నేను కాస్త నిర్మొహమాటంగా మాట్లాడి ఉండాల్సింది, కానీ నీవు నాకంటే పెద్దవాడివి.

క్రైస్తవుడు: మంచి సోదరా, కోపం తెచ్చుకోవద్దు. నిన్ను దారితప్పించి, గొప్ప ప్రమాదంలో ఇరికించినందుకు చాలా బాధపడుతున్నాను. దయచేసి నన్ను క్షమించు; ఇలా చెయ్యడంలో నాకు ఎలాంటి దురుద్దేశమూ లేదు.

నిరీక్షణ: సహోదరుడా, బాధపడకు, నిన్ను నేను క్షమిస్తాను. ఒకవిధంగా ఇది మన మేలుకోసమే ఇలా జరిగిందేమో.

క్రైస్తవుడు: నాతో ఒక దయగల సోదరుడు ఉన్నందుకు నేను నిజంగా ఆనందిస్తున్నాను. అయితే మనం ఊరకనే నిలబడివుండకూడదు. మరల మన దారిలోనికి వెళ్లేందుకు ప్రయత్నం చేద్దాం.

నిరీక్షణ: మంచిది సోదరా, అయితే ముందుగా నన్ను వెళ్లనివ్వు.

క్రైస్తవుడు: లేదు, దయచేసి నన్ను ముందు వెళ్లనివ్వు, ఒకవేళ ఏదైనా అపాయం ఎదురైతే, ముందుగా దాన్ని నేనే ఎదుర్కొంటాను, ఎందుకంటే మన ప్రస్తుత దుస్థితికి కారణం నేనే కదా.

నిరీక్షణ: లేదు లేదు. సోదరా, నీవు మొదట వెళ్లడానికి వీల్లేదు. నీ మనస్సు కలతచెంది ఉన్నది గనుక ఇప్పుడు మరల తప్పు దారిన నడిపించే అవకాశం ఉంటుంది.

అప్పుడు వారికి ఓ స్వరం వినపడింది, "మార్గములలో నిలిచి చూడుడి, పురాతన మార్గములనుగూర్చి విచారించుడి, మేలు కలుగు మార్గమేది అని యడిగి అందులో నడుచుకొనుడి, అప్పుడు మీకు నెమ్మది కలుగును."[4] అయితే అప్పటికే నీరు బాగా నిండిపోవడంతో ఎటువెళ్లాలన్నా ఎంతో ప్రమాదకరంగా ఉంది పరిస్థితి. అప్పుడు వారికీ సామెత గుర్తుకొచ్చింది. "దారితప్పటం అంటూ జరిగాక, సరైన మార్గంలోకి తిరిగి రావడం కంటే దారి తప్పిపోవడమే చాలా తేలిక." అయినా సరే, వారు తిరిగి ద్వారంవైపు వెళ్లారు కాని రాత్రి బాగా చీకటిగా ఉండటమే కాక నీరు చాలా ఎక్కువగా చేరడంతో వారు దాదాపుగా మునిగిపోయినంత పనైంది.

అంచేత ఆ రాత్రి వారు తిరిగి గుమ్మం వద్దకు చేరలేకపోయారు. ఎట్టకేలకు ఓ ఎత్తైన స్థలంలో ఉన్న ఒక చిన్న ఆశ్రయం వద్దకు చేరుకొని, తెల్లవారే వరకు అక్కడే కూర్చున్నారు. అయితే బాగా అలసిపోయినవారై, వెంటనే నిద్రలోకి జారుకున్నారు.

4. యిర్మీయా 6:16

వారు పడుకొన్న స్థలానికి సమీపంలోనే ఒక పాత మేడ ఉంది. దానిపేరు అనుమానపు మేడ. అది నిరాశాభూతం అనేవాడికి చెందినది. ఇప్పుడు వారు నిద్రపోతున్నది అతని స్థలంలోనే. తన అలవాటు ప్రకారం ఆ రాక్షసుడు పెందలకడనే లేచి ఎప్పటిలాగే వర్షం కురిశాక తన మైదానాలు, కంచెలు ఎలావున్నాయో పరీక్షించడం కోసం బయలుదేరి వచ్చినప్పుడు క్రైస్తవుడు, నిరీక్షణ్ నిద్రపోతూ కనిపించారు. కరుకు స్వరంతో వారిని మేల్కొలిపి, వారు ఎక్కడివారు, ఇక్కడ తన స్థలంలో ఏం చేస్తున్నారో చెప్పమంటూ ఆదేశించాడు. తాము యాత్రికులమని, దారితప్పి ఇటువచ్చామని వారు అతనితో చెప్పారు.

నిరాశా రాక్షసుడి చేతిలో బందీలగుట

అప్పుడా రాక్షసుడు ఇలా అన్నాడు, "ఈ రాత్రి మీరు నా ప్రదేశంలో అక్రమంగా చొరబడ్డారు; కాబట్టి మీరు నాతో రావాలి." వారు బలవంతంగా వెళ్లవలసివచ్చింది, ఎందుకంటే వాడు వారికంటే అధిక బలవంతుడు. వారు చేసింది పొరపాటే గనుక వారి తరపున మాట్లాడేందుకు ఏమీలేదు. ఆ రాక్షసుడు వారిని తరుముతూ తన మేడలోనికి తీసుకెళ్లి ఒక కటిక చీకటికొట్టులో పెట్టాడు. అదొక నీచమైన కంపుకొట్టే స్థలం. బుధవారం నుంచి శనివారం రాత్రివరకు వారు అక్కడే అన్నపానాలు లేకుండ, ఎలాంటి వెలుతురు గాని ఆదరించే నాధుడు గాని లేకుండ గడిపారు. స్నేహితులకు, తెలిసినవారికి దూరంగా ఎంతో దయనీయమైన స్థితిలో వారు చిక్కుకుపోయారు. ఇప్పుడు క్రైస్తవుడి దుఃఖం రెట్టింపు అయింది. ఎందుకంటే అతని తెలిసీతెలియని, తొందరపాటు నిర్ణయం వల్లనే వారికి ఇన్ని కష్టాలు వచ్చాయి.

నిరాశా రాక్షసుడికి విషాదం అనే పేరుగల ఒక భార్య ఉంది. కాబట్టి అతడు రాత్రి పడుకోబోయే ముందు, ఆ రోజు జరిగిన సంగతులన్నీ తన భార్యతో చెప్పాడు. ఇద్దరు యాత్రికులు తన ప్రదేశంలోకి చొరబడి వచ్చినందుకుగాను వారిని తెచ్చి చీకటికొట్టులో బంధించానని చెప్పి, వారిని ఏం చెయ్యాలో ఒక సలహా ఇమ్మని తన భార్యను సలహా అడిగాడు. వారు ఎవరు, ఎక్కడినుంచి వచ్చారు, ఎక్కడికి వెళ్తున్నారు ఇత్యాది విషయాలన్నీ విన్న తరువాత, రేపు ఉదయాన్నే నిద్రలేచి, వారిని నిర్దాక్షిణ్యంగా కొట్టమని ఆమె చెప్పింది. మరుసటి రోజు నిద్రలేవగానే వాడు తన ముళ్లతో కూడిన దుడ్డుకర్రను తీసుకొని చీకటికొట్టు వద్దకు వెళ్లాడు. ముందుగా వాళ్లిద్దర్నీ కుక్కలకన్నా హీనంగా అవమానకరమైన పదాలతో దూషించాడు. (ఒక్క కఠినమైన మాటకూడ వారు బదులు మాట్లాడలేదు). ఆ తర్వాత వాడు వారిమీద పడి దారుణంగా కొట్టాడు. అడ్డుకోవడానికి గాని, దెబ్బలు తగలకుండ తప్పించుకునేందుకు గాని వారు నిస్సహాయులుగా ఉండిపోయారు. అంతటితో వారిని చీకటిలోనే వదిలేసి, తమమీద తాము జాలిపడి దుఃఖంతో రోధించేలా చేసి వెళ్లిపోయాడు. ఆ రోజంతా వారు నిట్టూర్పులతోను, మూల్గులతోను గడిపారు.

మరునాడు రాత్రి విషాదం తన భర్తకు మరో సలహా ఇచ్చింది. వారు తమంతట తాము ఆత్మహత్యకు పాల్పడేలా వారిని ప్రోత్సహించమని చెప్పింది. అంచేత, తెల్లవారినప్పుడు, వాడు

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

చాలా వికారపు మనోభావంతో వెళ్లి ఆ యాత్రికులకు ఇలా చెప్పాడు: "ఇక్కడినుంచి మీరు ఎప్పటికీ సజీవంగా బయటికి వెళ్లలేరు గనుక (తినడానికి గాని, త్రాగడానికి గాని నేను మీకు ఏమీ ఇవ్వను కాబట్టి మీ బాధలనుంచి తప్పించుకోవాలనుకుంటే కత్తితోనో, తాడుతోనో, లేక విషంతోనో మీ చేతులార మీ ప్రాణాలు తీసుకోవడం తప్ప మరో మార్గం లేదు) మీ శ్రమలనుంచి బయటపడే దగ్గరి మార్గాన్ని ఎంచుకోవడమే మంచిది కాదంటారా? ఇప్పుడు మీ జీవితాలకు మిగిలింది విపరీతమైన కష్టాలు తప్ప ఏమీలేదని కళ్లముందు కనబడుతోంది గనుక ఇంకా మీరు బ్రతకాలనుకోవడం ఎందుకు?" అయినా సరే, తమను పోనివ్వమని వారు అతన్ని బ్రతిమాలారు.

అది విని వాడు పరుగున వారిమీదికి వచ్చి, చావగొట్టి ఉండేవాడే కాని, విపరీతమైన కోపంతో వానికి కొద్దిసేపు ఒక చెయ్యి పనిచెయ్యలేదు. అంచేత వారిని వదిలేసి తాను చెప్పిన విషయం గురించి ఆలోచించమని చెప్పి వెళ్లిపోయాడు. అప్పుడు ఖైదీలిద్దరూ ఒకచోట చేరి, వాని సలహా పాటించడం మంచిదా కాదా చర్చించుకున్నారు.

క్రైస్తవుడు: సోదరా నిరీక్షణ ఇప్పుడు మనం ఏం చేద్దాం? ఇప్పుడు మన జీవితం అత్యంత హీనమైన పరిస్థితిలో ఉంది. నామట్టుకైతే, ఇప్పుడు ఏం చెయ్యాలో పాలుపోవడం లేదు. కొంతకాలం ఇలాగే బ్రతికి ఆకలితో చచ్చిపోవడమా, లేక ఈ దుర్మార్గుడి చేతిలో చావుదెబ్బలు తిని మరణించడమా లేక ఇప్పుడే చనిపోయి దీనినుంచి తప్పించుకోవడమా ఏది మంచిదో అర్థంకావడం లేదు. ఈ చీకటి కొట్టుకంటే సమాధిపాలు కావడమే ఖచ్చితంగా మంచిదనిపిస్తోంది.

నిరీక్షణ: మన ప్రస్తుత పరిస్థితి మాత్రం భరించలేనిదిగానే ఉంది గనుక బ్రతికినంత కాలం –కొన్నిరోజులైనా, ఎక్కువకాలమైనా ఇక్కడే గడపడం కంటే మరణమే ఎంతో మంచిది. అయితే మనము వెళ్తున్న దేశపు ప్రభువు చెప్పిన మాటను ఒకసారి ఆలోచనచేద్దాం: "నరహత్య చేయకూడదు". వేరొక వ్యక్తిని చంపడం మాత్రమే నిషిద్ధం కాదు; మనల్ని మనం చంపుకోవడం కూడ అంతకన్నా నిషిద్ధమే.మరొకరిని చంపేవాడు అతని శరీరాన్ని మాత్రమే చంపుతాడు గాని తనను తాను చంపుకునేవాడు శరీరాన్ని ఆత్మను కూడ చంపుకుంటాడు. ఇక సమాధిలో నీకు లభించబోయే శాంతి గురించి మాట్లాడుతున్నావు కాని నరహంతకులందరూ వెళ్లే నరకం గురించి నువ్వు మరిచిపోయావా? "ఏ నరహంతకుని యందును నిత్యజీవము ఉండదు" అని నీకు తెలుసు. ధర్మశాస్త్రమంతా ఈ నిరాశా రాక్షసుడి చేతుల్లో లేదన్న సంగతి మరొకసారి గుర్తుచేసుకుందాం. ఇతని చేతికి చిక్కిన ఇతరులు తప్పించుకొనే ఉంటారని నాకు అనిపిస్తోంది. ఈ లోకమును సృష్టించిన దేవుడు ఈ రాక్షసుణ్ణి చంపేస్తాడేమో ఎవరికి తెలుసు, లేదా ఏదో ఒక సమయంలో వాడు మనల్ని లోపల బంధించడం మరిచిపోతాడేమో, లేదా కొద్దిసేపట్లో అతనికి మరోసారి ఆవేశం వచ్చి అతని అవయవాలు పనిచేయకుండ పోతాయేమో? ఒకవేళ అలాగే జరిగితే మాత్రం నామట్టుకు నేను వాడి కబంధహస్తాలనుంచి తప్పించుకోవడానికి నా

శాయశక్తులా ప్రయత్నిస్తాను. ఇంతకు ముందు ఆ పని చేయకపోవడానికి నా పిరికితనమే కారణం. ఏది ఏమైనా, సోదరా, మనము ఓర్పుతోను, సహనముతోను క్రీస్తు యేసు మంచి సైనికులవలె ఈ కష్టాలను కనీసం కొంతకాలమైనా సహించుదాం.[5] మనము సంతోషంగా విడుదలపొందే సమయం వస్తుంది. అంచేత, మన ప్రాణాలు మనమే తీసుకోవద్దు.

ఆ మాటలతో నిరీక్షణ తన స్నేహితుని మనస్సును కుదుటపడేలా చేశాడు. ఆవిధంగా వారు మరొకరోజంతా ఆ దయనీయమైన స్థితిలోనే చీకటిలో గడిపారు.

వారు తన సలహాను పాటించారో లేదో చూడాలని సాయంత్రం కల్లా ఆ రాక్షసుడు మరల వచ్చాడు. వారు సజీవంగానే ఉండటం చూశాడు, కానీ వారు అన్నపానాలు లేక దెబ్బలు తగిలి ఎంతో దారుణంగా బాధపడుతూ కొనప్రాణంతో ఉన్నారని గమనించాడు. వాళ్లింకా బ్రతికి ఉండటం చూసి అత్యంత భయంకరమైన కోపోద్రేకంతో వారిమీదికి విరుచుకుపడ్డాడు: "మీరు నా సలహాను పెడచెవిన పెట్టారు! ఇకమీదట మీకు ఈ లోకంలో ఎందుకు పుట్టామా అనిపిస్తుంది చూడండి."

ఈ దారుణమైన మాటలు విని వారు భయంతో వణికిపోయారు, క్రైస్తవుడైతే స్పృహతప్పి పడిపోయాడు. అతడు మరల స్పృహ వచ్చినప్పుడు, గతంలో వారు ఆత్మహత్య చేసుకోవడం గురించి మాట్లాడుకున్న సంభాషణ గుర్తుచేసుకున్నాడు. ఇప్పుడు క్రైస్తవుడు దానికే మొగ్గుచూపుతున్నాడు. అయితే నిరీక్షణ మరొకసారి విన్నపం చేశాడు: "నా సోదరా, నీవు అపొల్యోను ఎదురైనప్పుడు ఎంత పరాక్రమంతో పోరాడావో గుర్తుచేసుకో. వాడు నిన్ను ఓడించలేకపోయాడు, అంతేకాదు, మరణపు లోయలో నీవు చూచినది గాని, విన్నవి గాని ఏదీ నిన్ను ఓడించలేకపోయాయి. ఇప్పటికే నీవు ఎన్ని కష్టాలు, బాధలు, వింతైన సంగతులను తట్టుకొని వచ్చావో! ఇప్పుడు చూశావా, స్వభావరీత్యా ఎంతో బలహీనుణ్ణి, నీకంటే తక్కువ అనుభవం కలవాణ్ణి అయినా నేనుకూడ నీతోపాటు చీకటికొట్టులో ఉండి, నీతో సమానంగా ఒకే శిక్షను అనుభవిస్తూ బాధపడుతున్నాను. ఈ రాక్షసుడు నన్ను గాయపరచి, నా నోటికి అన్నపానాలు దక్కకుండా చేశాడు. నీతోపాటు ఈ చీకటిలో నేను కూడ దుఃఖిస్తున్నాను. అయితే మనం ఇంకొంత సహనం కలిగివుందాం. మాయాసంతలో నువ్వెంత ధైర్యంగా బలంగా ఉన్నావో గుర్తుచేసుకో. బంధకాలైనా, ఇనుప సంకెళ్లయినా, లేదా దారుణ మరణమైనా నిన్ను కృంగదీయలేకపోయాయి. అలాంటప్పుడు (కనీసం క్రైస్తవులకు తగ్గవిధంగా ప్రవర్తించలేకపోయామన్న అపవాదు రాకుండా అయినా) మనకు చేతనైనంత సహనం చూపుదాం. విడుదల త్వరలోనే వస్తుంది."

ఆ రాత్రి రాక్షసుడి భార్య బందీలగురించి వాకబు చేసింది. వారు అతని సలహా పాటించారో లేదో తెలుసుకోవాలనుకుంది. "లేదు. వాళ్లు బాగా బలిసిన దుర్మార్గులు. తమ ప్రాణాలు తీసుకునేకంటే అన్ని ఇబ్బందులూ భరించడానికే తీర్మానించుకున్నారు."

5. 2తిమోతి 2:3 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

అందుకామె ఇలా బదులిచ్చింది: రేపు వాళ్లని మన మేడ పెరట్లోకి తీసుకెళ్లి నీవు హతమార్చినవారి ఎముకలు, పుర్రెలు చూపించి, తక్కినవాళ్లకు పట్టిన గతే వారికీ పడుతుందని, ఈ వారం అయిపోయేలోపు వారిని ముక్కలుగా చీరేస్తానని నమ్మించు."

అంచేత, తెల్లారినప్పుడు వారిని తీసుకొని మేడ పెరట్లోకి వెళ్లి అతడు గతంలో హతమార్చినవారి అస్థిపంజరాలను చూపించాడు. "వాళ్లంతా ఒకప్పుడు మీలాంటి యాత్రికులే. వాళ్లు నా స్థలంలోనికి అక్రమంగా జొరబడినందున వాళ్లను చీల్చిపారేయడం మంచిదనిపించింది. గనుక మీరు నా ఆవరణలో ఇంకా బ్రతికి ఉన్నారంటే పదిరోజుల్లో మిమ్మల్నికూడ అలాగే చేస్తాను. ఇక మీరు చీకటి కొట్టులోనికి వెళ్లి ఈ విషయం ఆలోచించండి, పోండి" అన్నాడు. అంతటితో వాళ్లని ఆ చెరసాల వరకు వాళ్లని కొట్టుకుంటూ వచ్చాడు. అక్కడ వారు ఆ శనివారం రోజంతా హేయమైన పరిస్థితిలోనే ఉండిపోయారు.

ఆ రాత్రి రాక్షసుడు తన భార్యతో మాట్లాడుతూ, ఈ ఖైదీలు ఇంకా సజీవంగా ఎలా ఉన్నారో నాకు అర్థమే కావడంలేదన్నాడు. దెబ్బలచేతగాని, బెదిరించడం ద్వారా గాని లేక తమంతట తాము ప్రాణాలు తీసుకునేలా చెయ్యడంగాని తన వల్ల కాలేదు.

అప్పుడు విషాదం ఇలా అన్నది: "ఎవరో ఒకరు వచ్చి తమని విడిపిస్తారేమో నన్న ఆశతో వాళ్లు బ్రతుకుతున్నారేమోనని నాకు భయంగా ఉంది; లేకపోతే తప్పించుకొని వెళ్లడానికి వీలుగావాళ్ల దగ్గర తాళాలు పగులగొట్టే పరికరాలేవైనా ఉన్నాయో ఏమో."

"అది నిజమే" అన్నాడతను. "ఉదయాన్నే వాళ్ల దగ్గర అంతా సోదా చేస్తాను."

అనుమానపు మేడ నుంచి తప్పించుకొనుట

శనివారం రాత్రి మధ్యరాత్రి సమయానికి క్రైస్తవుడూ, నిరీక్షణ ప్రార్థించడం మొదలుపెట్టి, దాదాపు తెల్లవారుజాము వరకు కొనసాగించారు. అప్పుడు క్రైస్తవుడు అకస్మాత్తుగా ఆశ్చర్యంతో పెద్దగా ఇలా అన్నాడు, "ఎంత బుద్ధిహీనుణ్ణి! మహిమ రాజమార్గంలో స్వేచ్ఛగా నడుచుకొని వెళ్లవలసిన నేను ఈ మురికి కూపంలో ఉండిపోయానంటే నేను ఎంత బుద్ధిలేనివాణ్ణి! అనుమానపు మేడలోని ఏ గదినైనా తెరువగల వాగ్దానమనే తాళం నా రొమ్మున ఉంది."

నిరీక్షణ: అది నిశ్చయంగా శుభవార్తే సోదరా. నీ తాళం బయటికి తీసి ప్రయత్నించు.

అప్పుడు క్రైస్తవుడు వాగ్దానపు తాళపుచెవి తీసి చెరసాల తలుపు తాళంలో పెట్టిచూశాడు. గడి ఊడిపోయి తలుపు తెరుచుకుంది. వారు మేడలోనికి నడుచుకుంటూ వెళ్లారు. పెరట్లోకి వెళ్లే ద్వారం వద్దకు చేరుకున్నారు. తాళపుచెవి సహాయంతో ఆ తలుపు కూడ తెరచుకుంది. ఇప్పుడు వాళ్లు బయటికి వెళ్లే దారికి వేసిన బలమైన ఇనుప ద్వారం వద్దకు వచ్చారు. ఆ ద్వారానికి వేసిన తాళం ఎంతో గట్టిది అయినా తప్పించుకోవడానికి దాన్ని తెరచారు. అయితే దాన్ని తెరిచేటప్పుడు

అది ఎంత భయంకరమైన కీచుమంటూ శబ్దం చేసిందంటే ఆ గోలకి రాక్షసుడు తన పడకమీదనుండి దిగ్గున లేచి ఖైదీలను పట్టుకునేందు ప్రయత్నించాడు. అప్పుడు అతనికి మూర్ఛరోగం రావడంతో అతని అవయవాలు పనిచేయడం మానేశాయి. ఖైదీలు రాజుగారి మార్గంలోనికి పరుగున వెళ్లారు. అంతటితో వారు నిరాశ రాక్షసుడి పరిధిని దాటి సురక్షితంగా వెళ్లిపోయారు.

అధ్యాయం 8
మనోహర పర్వతాల దగ్గర

నిరీక్షణని కలుసుకొనుట

క్రైస్తవుడు నిరీక్షణ్ కలిసి ఎట్టకేలకు మనోహర పర్వతాలను చేరుకొని, అద్భుతమైన ఆ ప్రదేశాన్ని చూసేందుకు పైకి వెళ్లారు. ఎటుచూసినా పండ్లతోటలూ, ద్రాక్షవనాలు, పూదోటలతో కళకళలాడుతూ ఉన్న ఆ దృశ్యం వారి జీవితంలో అంతవరకూ ఎన్నడూ చూడనంత రమణీయంగా ఉంది.

కాపరులతో పరిచయం పెంచుకొనుట

అక్కడున్న ఒక ఊట వద్ద మంచినీళ్లు త్రాగి, ముఖాలు కడుక్కొని, దారివెంట దొరికిన ఫలాలను కడుపార తిన్నారు. మార్గానికి సమీపంగా ఉన్న కొండలమీద కాపరులు తమ మందలను మేపుతున్నారు. వారు ఆ కాపరులలో ఒకరి వద్దకు వెళ్లి, "ఈ పర్వతాల యజమాని ఎవరు, ఈ గొర్రెలు ఎవరివి?" అని అడిగారు.

కాపరి: ఈ పర్వతాలు ఇమ్మానుయేలు దేశంలో ఉన్నాయి; అవి ఆయన పురమునకు సమీపంగానే ఉన్నాయి; ఈ గొర్రెలు కూడ ఆయనవే.

క్రైస్తవుడు: పరమ పురానికి మార్గం ఇదేనా?

కాపరి: అవునయ్యా, మీరు సరైన మార్గంలోనే ఉన్నారు.

క్రైస్తవుడు: పుర ద్వారానికి ఇక్కడినుండి ఎంతదూరం ఉంటుంది?

కాపరి: విశ్వాసులకు తప్ప ఇంకెవరికైనా చాలా దూరం ఉంటుంది.

క్రైస్తవుడు: ఈ మార్గం సురక్షితమైనదేనా లేక అపాయాలతో కూడుకొన్నదా?

కాపరి: నిజమైన వారికి ఇది సురక్షితమైనదే. "అయితే తిరుగుబాటు చేయువారు తొట్రిల్లతారు"[1]

క్రైస్తవుడు: ఈ స్థలంలో యాత్రికులకు ఆశ్రయం ఉన్నదా?

కాపరి: ఓ, చాలినంత ఉంది. ఎందుకంటే, "కొత్తవారికి ఆతిథ్యము చేయ మరువకుడి"[2] అని మా ప్రభువు మాకు ఆదేశాలిచ్చాడు గనుక మీరు ఎక్కడికి వెళ్లినా మీకు స్వాగతం లభిస్తుంది.

1. హోషెయ 14:9 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8
2. హోషెయ 13:2

అప్పుడు కాపరులు వారిని ఈ ప్రశ్నలడిగారు: "మీరు ఎక్కడినుండి వచ్చారు? ఈ మార్గాన ఎలా వచ్చారు? ఇంతవరకు మీరు ఏవిధంగా కొనసాగారు? మీకు తెలుసా, పరమపురికి బయలుదేరినవారిలో ఈ కొండలమీద కనిపించేవారు చాలా తక్కువమంది ఉంటారు."

ఈ శిష్యుల జవాబులు విన్న తరువాత, వీరు నిజమైన యాత్రికులేనన్న నమ్మకం కలగడంతో కాపరులు వారిని సాదరంగా ఆహ్వానించి, కొండలమీద ఉన్న ప్రజలతో పరిచయం చేసుకొనేందుకు వీలుగా మరికొంతసేపు అక్కడే ఉండమని అడిగారు. "మా ఆనందం కోసం, మీరు బలపడటం కోసం ఆ పనిచెయ్యండి" అన్నారు కాపరులు. అందుకా యాత్రికులు ఒప్పుకున్నారు.

కాపరుల పేర్లు జ్ఞానము, అనుభవము, మెలకువ, యథార్థత. వారు యాత్రికులను తమ గుడారాలలోనికి ఆహ్వానించి తమకు కలిగినంతలో శ్రేష్టమైనది ఇచ్చారు. కాపరుల కుటుంబాలతో కలిసి క్రైస్తవుడూ, నిరీక్షణ ఎంతో ఆనందించారు, వారు అందించిన మంచి పదార్థాలను తిని తృప్తిచెందారు. మెలకువగారి కుటుంబంతో కలిసి రాత్రి భోజనం ఆరగించారు. భోజనాల అనంతరం వారిని కలిసేందుకు ఇరుగుపొరుగువారు వచ్చి, వారి ప్రయాణ విశేషాల గురించి అడిగితెలుసుకున్నారు. బాగా పొద్దుపోయేవరకు మాట్లాడుకొని, ఆ తర్వాత నిద్రకుపక్రమించారు. క్రైస్తవుడికి తన భార్య, పిల్లలు కలలో కనిపించారు. ఒక బలమైన మార్గదర్శితో కలిసి వాళ్లంతా యాత్రకు బయలుదేరినట్లు కలలో చూశాననుకున్నాడు.

మరునాడు ఉదయాన హాయిగా నిద్రలేచారు. కొండలమీద సూర్యుడు ప్రకాశిస్తున్నాడు. అల్పాహారం వారికోసం ఎదురుచూస్తోంది. అల్పాహారం తిన్నాక, ఇతర కాపరులు వచ్చి వాళ్లని పర్యటనకు తీసుకెళ్లారు.

కాపరుల హెచ్చరిక

చుట్టూ కనిపిస్తున్న దివ్యమైన సుందర దృశ్యాన్ని తిలకిస్తూ ఒక దారి వెంట నడుస్తూ వెళ్తుండగా, వారు దోషపు కొండ అంచుకు చేరుకున్నారు. క్రిందికి చూడమని వారికి చెప్పాడు తెలివి. నిటారుగా ఉన్న ఆ కొండ అడుగుభాగాన కొండ అంచుకు మరీ దగ్గరగా వెళ్లేందుకు సాహసించి క్రిందపడిపోయినవారి విరిగిన ఎముకలు, శరీరాలు కనిపించాయి.

"దీని భావమేమిటి?" అడిగాడు క్రైస్తవుడు.

తెలివి: పునరుత్థానం గురించి హుమెనైను, ఫిలేతు అనువారి అబద్ధ బోధలు విని విశ్వాసాన్ని కోల్పోయిన ప్రజలగురించి మీరు విన్నారు కదా?[3] అక్కడున్నది వాళ్లే. ప్రమాదపు హెచ్చరికలను పెడచెవినపెట్టి, ఎక్కలేనంత ఎత్తుకు ఎక్కేవారికి గుణపాఠం నేర్పించడం కోసమే వారు భూస్థాపనకు నోచుకోకుండ అలాగే మిగిలిపోయారు.

3. 2తిమోతి 2:17-18

తర్వాత వారా యాత్రికులను మరో కొండ పైభాగానికి తీసుకెళ్లారు. హెచ్చరిక శిఖరం అనే పేరుగల ఆ కొండమీదికి వారిని నడిపించి, ఒక రకమైన దుర్భిణీ అద్దాలను ఇచ్చి, వారు ఎక్కడినుంచి వచ్చారో ఆ దిశగా దూరంగా చూడమని చెప్పారు. ఎంతోమంది గుడ్డివారు సమాధులమధ్యలో తిరుగాడుతూ దారితెలియక ఇబ్బందిపడుతూ కనిపించినట్టు చెప్పారు. "అది దేనిని సూచిస్తుంది?" అడిగాడు క్రైస్తవుడు.

మీరు ఈ పర్వతాలను సమీపించడానికి ముందు, దారికి ఎడం ప్రక్కన మైదాన ప్రాంతానికి నడిపించే ఒక చిన్న ద్వారం ఉంది మీరు చూశారా?

"అవును చూశాం" వాళ్లిద్దరూ బదులు పలికారు.

తెలివి: ఆ ద్వారం నుండి నేరుగా అనుమానపు మేడవద్దకు నడిపించే దారి ఒకటుంది. దాని యజమాని నిరాశా రాక్షసుడు. సమాధుల మధ్య మీరు చూసిన ఈ మనుష్యులు ఆ ద్వారంవద్దకు చేరుకునేంతవరకూ తీర్థయాత్రలకు వచ్చినవాళ్లే. అక్కడినుండి మార్గం కరకుగా ఉండటంతో, ఆ దారి వదిలి ప్రక్కన కనిపిస్తున్న మైదానంలోనికి వెళ్లాలని నిర్ణయించుకున్నారు. అక్కడ వారు నిరాశ రాక్షసుడి చేతికి చిక్కి అనుమానపు మేడలో బంధించబడ్డారు. అక్కడ వారు కొంతకాలం ఒక చీకటికొట్టులో వేయబడ్డారు. ఆ తర్వాత రాక్షసుడు వారి కళ్లను ఊడబెరికి, సమాధుల మధ్యకు తీసుకెళ్లి విడిచిపెట్టడంతో వారు దారితెలియక తిరుగుతూ ఉన్నారు. "వివేక మార్గము విడిచి తిరుగువాడు ప్రేతల గుంపులో కాపురముండును"[4] అని జ్ఞానియైనవాడు చెప్పిన సామెత నెరవేరునట్లు ఇలాగు జరిగింది. కన్నీటి పర్యంతమవుతూ క్రైస్తవుడూ, నిరీక్షణ్ ఒకరినొకరు చూచుకున్నారు కానీ ఏమీ మాట్లాడలేదు.

తర్వాత వారు కొండ ప్రక్కన ఉన్న ఒక తలుపు దగ్గరకు వెళ్లారు. ఒక కాపరి తలుపులు తెరువగా ఆ గుహ చాలా చీకటిగా ఉండి పొగతో నిండిపోవడం చూశారు. కాలుతున్న గంధకం వాసన రావడం వారు గమనించారు. అగ్నివంటి గర్జించే శబ్దంతో పాటు వేదనలు అనుభవిస్తున్న మనుష్యుల కేకలు కూడ వారికి వినిపించాయి.

"ఇదేమిటి?" అడిగాడు క్రైస్తవుడు.

తెలివి: ఇది నరకానికి దగ్గరి దారి. తన జ్యేష్ఠత్వపు హక్కును అమ్ముకున్న ఏశావు; తన యజమానిని అమ్ముకున్న యూదా; సువార్తను దూషించిన అలక్సెండ్రు; అబద్ధాలాడి మోసపుచ్చిన అననీయ సప్పీరాలాంటి వేషధారులు ఎంచుకునే మార్గమిది.

నిరీక్షణ: వీళ్లందరూ యాత్రికుల మాదిరిగానే వేషం ధరించారనుకుంటాను?

తెలివి: అవును. చాలాకాలం వరకు మార్గంలోనే కొనసాగారు కూడాను.

నిరీక్షణ: ఈ వేషధారులు మహిమ మార్గంలో ఎంతదూరం వచ్చివుంటారు?

4. సామెతలు 21:16

తెలివి: కొందరు ఎక్కువదూరమే రాగా, మరికొందరు ఇంతదూరం రాలేకపోయారు.

అప్పుడు క్రైస్తవుడు "గొప్ప శక్తి కోసం మనం ప్రార్థనచెయ్యాలి" అని చెప్పగా నిరీక్షణ ఆ మాటలతో ఏకీభవించాడు.

తెలివి: అవును మీకు ఎంతైనా అవసరమే.

అప్పటికే యాత్రికులలో తమ ప్రయాణాన్ని తిరిగి ఆరంభించాలన్న కోరిక కలిగింది. అందుచేత వాళ్ళందరూ కలిసి పర్వతాల చివరివరకు నడిచివెళ్లారు. ఇక్కడ వాళ్లు ఒక ఉన్నత శిఖరం పైకి చేరుకున్నారు. దానిపేరు నిర్మలం.

తెలివి: ఇప్పుడు మీకు పరమపురి ద్వారాలు చూపిస్తాం రండి. ఈ అద్దాల సహాయంతో మీరా ద్వారాన్ని చూడగలరు. (ఆ అద్దాల పేరు విశ్వాసపు-నేత్రం). మీ దారి నడిపించే దిశగా తూర్పువైపు సుదూరంగా చూడండి!

ఆ కళ్లద్దాల సాయంతో చూచిన యాత్రికులు దూరంగా ఉన్న దిగంతం వైపున ఒక ప్రకాశవంతమైన గుమ్మాన్ని వీక్షించారు. అయితే వారు అంతకుమునుపు ఆ గుహలో చూచిన దృశ్యాన్ని గుర్తుచేసుకొని ఇప్పటికీ కాస్త వణుకుతూనే ఉన్నారు. గనుక తేటగా చూడగలిగేలా వారు ఆ అద్దాలను స్థిరంగా పట్టుకోలేకపోతున్నారు. క్రైస్తవుడూ, నిరీక్షణ బయలుదేరి వెళుతుండగా, కాపరులలో ఒకడు మార్గం రేఖాచిత్రాన్ని వారికి అందించాడు. "మోసగాడి విషయంలో జాగ్రత్త" అన్నాడు మరొకడు. "మోహింపజేసే భూభాగంలో మీరు నిద్రపోతారేమో జాగ్రత్త సుమా" అన్నాడు మూడోవాడు. నాలుగోవాడు వారికి విజయం సిద్ధించాలని కోరుకున్నాడు. అంతటితో వారు ఆనందంగా తమ దారిన వెళ్లిపోయారు.

అధ్యాయం
9

అహంకారమనే లోతట్టు దేశంలో

అజ్ఞానం అనే యౌవనస్తుడిని కలుసుకొనుట

ఇప్పుడు యాత్రికులు కొండప్రాంతం దిగువన పట్టణం వైపుగా ప్రయాణించడం నేను చూశాను. ఈ కొండలకు కొంచెం దిగువ భాగాన దారికి ఎడం వైపున అంహకారమను వెనుకబడిన దేశం ఉంది. అక్కడినుండి ప్రధాన రహదారికి నడిపించే ఒక అడ్డదారి ఉంది. ఈ రెండు దారులు కలిసేచోట వారు అహంకారమనే గ్రామం నుండి వస్తున్న అజ్ఞానం అనే పేరుగల సిగ్గులేని ఒక యువకుణ్ణి కలిశారు. అతడు ఎక్కడినుండి వస్తున్నాడు, ఎక్కడికి వెళుతున్నాడు మొదలైన విషయాలు అడిగి తెలుసుకున్నాడు క్రైస్తవుడు.

అజ్ఞానం: అయ్యా, నేను ఎడం వైపున ఉన్న ఆ దేశంలో జన్మించాను. ఇప్పుడు నేను పరమ పురికి వెళుతున్నాను.

క్రైస్తవుడు: అయితే, ఆ ద్వారంలోపల ఎలా ప్రవేశించాలనుకుంటున్నావ్? ఎందుకంటే అక్కడ నీకు కాస్త ఇబ్బంది ఎదురయ్యే అవకాశం ఉంది.

అజ్ఞానం: అయ్యా, నాకు ప్రభువు చిత్తం ఏమిటో తెలుసు. నేను మంచి జీవితం జీవించాను. నేను ప్రతి ఒక్కరికి వారి వారి వంతుచొప్పున చెల్లిస్తాను. నేను ప్రార్థనచేస్తాను, ఉపవాసముంటాను, మా సంఘానికి దశమభాగాలు చెల్లిస్తాను, దానధర్మాలు చేస్తుంటాను. మా దేశాన్ని విడిచి నేను వెళ్లదలచుకున్న దేశానికి బయలుదేరాను.

క్రైస్తవుడు: కానీ మార్గం ఆరంభమైన చోట నీవు ద్వారం గుండా రాలేదు. నువ్వీ వంకర మార్గంలో వచ్చావు. గనుక నీ గురించి నీవు ఏమనుకుంటున్నావో గాని నాకు మాత్రం ఇలా అనిపిస్తోంది, చివరి లెక్కలు చూసే రోజు వచ్చినప్పుడు నీకు పట్టణంలో ప్రవేశించే అనుమతి లభించదు సరికదా, నీవు దొంగగాను, దోపిడీదారునిగాను లెక్కించబడతావేమో.

అజ్ఞానం: చూడండీ, మీరెవరో నాకు అస్సలు తెలియదు. మీ మతాన్ని మీరు పాటించండి చాలు. నా మతాన్ని నేను పాటిస్తాను. ఇక మీరు మాట్లాడుతున్న ద్వారం విషయానికి వస్తే అది మా ఊరుకి చాలా దూరంగా ఉంటుంది. దానికి దారి తెలిసిన వాళ్లు మా ప్రాంతంలో ఎవరైనా

ఉన్నట్టు మాకు తెలియదు. ఒక వేళ వాళ్లకి తెలిసినా తెలియక పోయినా వచ్చే నష్టమేమీలేదు ఎందుకంటే మీరు చూస్తున్నట్లు మా ఊరునుంచి చక్కని ఆహ్లాదకరమైన పచ్చని మార్గం వుంది. అది ఇక్కడికి వచ్చేందుకు ఉన్న దగ్గరిదారి.

ఆ యవ్వనస్తుడు తన అహంకారం విషయంలో చాలా తెలివైనవాడుగా ఉన్నట్టు క్రైస్తవుడు గమనించినప్పుడు నిరీక్షణ్‌ను పిలిచి అతని చెవిలో ఇలా గుసగుసలాడాడు; "తన దృష్టికి జ్ఞానిననుకొనువానిని చూచితివా? వానిని గుణపరచుటకంటే మూర్ఖుని గుణపరచుట సులువు.[1] బుద్ధిహీనుడు తన ప్రవర్తనను గుర్చి అధైర్యపడి తాను బుద్ధిహీనుడని అందరికి తెలియచేయును[2]." నీకు ఏమనిపిస్తుంది? అతనితో ఇంకా మాట్లాడదామా లేక మనం చెప్పిన మాటలు ఆలోచించుకొమ్మని చెప్పి తన పాటికి తనను వదిలి వెళ్లిపోదామా?

నిరీక్షణ: అతనితో అన్నీ ఒకే సారి చెప్పడం మంచిదికాదేమో అనిపిస్తుంది నాకు. తర్వాత వెళ్లి అతనితో మాట్లాడవచ్చు.

దయ్యములచేత బంధింపబడిన వానిని గమనించుట

ఆ విధంగా వారు అజ్ఞానంను వదిలేసి ముందుకు సాగిపోయారు. అతన్ని దాటి కొంతదూరం వెళ్లిన తరువాత వారొక చీకటి దారిలో ప్రవేశించారు. ఆ దారిలో ఒకప్పుడు దురాత్మ వదిలివెళ్లిన ఒక వ్యక్తిని కలిసారు. విశ్రాంతికొరకు వెదుకుతూ వెళ్లిన ఆ దురాత్మ మరలా తిరిగి తనకంటే దుర్మార్గమైన ఏడు దురాత్మలతో తిరిగి వచ్చింది. ఈ ఎనిమిది ఆత్మలు కలిసి అన్ని రకాల దురలవాట్లతో అతన్ని బంధించి కొండ ప్రక్కన ఉన్న చీకటి ద్వారం వైపు తీసుకెళుతున్నాయి. అతన్ని చూసిన యాత్రికులు వణికిపోయారు. దయ్యాలు ఆ మనిషిని ఈడ్చుకు పోతుండగా అతన్ని గుర్తు పట్టగలనేమో అని క్రైస్తవుడు అతని వైపు చూశాడు. ఆ మనిషి ముఖం కిందికి దించుకొని ఉన్నాడు గనుక ఖచ్చితంగా ఎవరైనది చెప్పలేకపోయాడు కాని అతడు భక్తిహీనత అనే పట్టణానికి చెందిన దారితొలగిన వ్యక్తే అయ్యుంటాడని క్రైస్తవుడు భావించాడు.

శ్రీ అల్పవిశ్వాసిని దాటి పోవుట

వారు శ్రీ అల్ప విశ్వాసిని దాటిపోయారు. ఇతని శత్రువులైన అపరాధం, అపనమ్మకం, అధైర్యం అనే వాళ్లు అతన్ని పూర్తిగా జయించి అనాధగా వదిలేసి సరైన ఆదరణలేకుండా చేయడమే కాక ధైర్యంకూడా కోల్పోయేలా చేశారు. అందువలన వారు అతన్ని పరలోక పట్టణంలో ప్రవేశించకుండా చేయగలిగారన్న ఆనందంకంటే అతడు తనకు జరిగిన నష్టం గురించి దుఃఖపడుతూ దారిలో అందరికీ చెప్పుకొంటూ వస్తున్నాడు.

క్రైస్తవుడు: శత్రువుచేతిలో ఓడిపోయినవారి గురించి విన్నప్పుడు మనకు కూడా ఒక శత్రువు ఎదురైతే బాగుండునని ఆశించడంగానీ, ఇతరులకంటే మనం బాగుగా ప్రవర్తించి ఉండే వాళ్లమని

1. సామెతలు 26:12 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8
2. ప్రసంగి 10:3

గొప్పలు చెప్పుకోవడం గానీ లేదా మన మగతనం గురించి ఉప్పొంగిపోవడం కానీ ఎన్నడూ చేయకూడదు. అటువంటి వైఖరి కలిగిన వ్యక్తులు పరీక్ష ఎదురైనప్పుడు సహజంగా ఇంతకంటే దయనీయంగా మారటం జరుగుతుంది. యేసుతో ఈ మాటలు చెప్పేటప్పుడు పేతురు తన మనస్సులో ఎంతగా గర్వించాడో గుర్తుందా?: "ప్రభువా! నీతోకూడా చెరలోనికి మరణమునకునూ వెళ్లుటకు సిద్ధంగా ఉన్నాను... .నేను నీతోకూడా చావవలసి వచ్చినను నిన్ను ఎరుగనని చెప్పనే చెప్పననెను[3]". అయినా తన సంగతేమిటో అతనికి తెలియదు; ఎందుకంటే అతడు ప్రభువును ఎరుగనని ముమ్మారు పలికాడు. అదీను ప్రభువుతో కలిసి శ్రమపడవలసిన సమయంలో– యేసుకు మరింత బాధకలిగించే పరిస్థితిలో అతడు ప్రభువును ఎరుగనన్నాడు.

ఒకడు తన సొంత సామర్థ్యంమీద ఆధారపడక "దేవుని సర్వాంగకవచమును ధరించుట మంచిది." ఎందుకంటే గొప్ప నిపుణుడైన అపోస్తలుడు ఇలా చెప్పాడు: "ఇవన్నియు కాక విశ్వాసమను డాలు పట్టుకొనుడి దానితో మీరు దుష్టుని అగ్ని బాణములన్నిటిని ఆర్పుటకు శక్తిమంతులవుదురు."[4] అంతేకాకుండా మనము రాజుగారి రక్షణను కోరుకోవడంకూడా మంచిది. అవును ఆయనే స్వయంగా మనతో రావాలని కోరుకోవడం మంచిది. గాడాంధకారపు లోయలో సహా ఆనందించేలా ఆయన సన్నిధి దావీదుకు సహాయపడింది.ఆయన మనతో వస్తే చాలు పదివేలమంది విరోధులు మనకు ఎదురైనా భయములేదు. అయితే ఆయన లేకుండ మనము ఏమీ చెయ్యలేము.[5]

ఈ పోరాటంలో నేను చాలాకాలం నుంచే ఉన్నాను కాని, దేవుని దయవల్ల ఇంకా బ్రతికే వున్నాను. అయితే నా విశ్వాసంతో నేను సాధించిన విజయాల గురించి నేను అతిశయించలేను. ఇప్పటికీ మనం అన్ని అపాయాలనుండి బయటపడ్డామని చెప్పలేను కానీ, ఇప్పుడు ఎదుర్కొన్నటువంటి దాడులకు ఇకమీదట గురికాకుండ ఉంటే ఎంతో సంతోషిస్తాను.

మోసగాడిని వెంబడించుట

ఆవిధంగా క్రైస్తవుడూ, నిరీక్షణ్ ముందుకు సాగిపోగా అజ్ఞాని వారిని అనుసరించాడు. రెండు దారులూ విడిపోయేచోటుకు వారు వచ్చారు. రెండు దారులూ తిన్నగానే ఉన్నట్టు అనిపించాయి, కాబట్టి ఏ దారిన వెళ్లాలో వారికి తెలియలేదు. ఏ దారిన వెళ్లాలో నిర్ణయించుకునేందుకు ప్రయత్నిస్తూ వారు దారులు విడిపోయే చోట నిలబడివుండగా, తెల్లని అంగీ ధరించిన ఒక మనిషి వారి వద్దకు వచ్చి ఇక్కడ మీరెందుకు నిలబడ్డారు అని ప్రశ్నించాడు. తాము పరమపురికి వెళుతున్నామని, అయితే ఈ రెంటిలో ఏది సరైన దారో తెలియక ఇబ్బందిపడుతున్నామని అతనికి బదులిచ్చారు. "నన్ను వెంబడించండి, నేనుకూడ అక్కడికే వెళుతున్నాను" అన్నాడు ఆ మనిషి.

అందుచేత వారు ఆ తెల్ల అంగీ ధరించిన మనిషిని వెంబడించారు. కొంతసేపటికి దారి మళ్లుతున్నట్టు గమనించారు. మొదట్లో క్రమేణా ప్రక్కకు మళ్లినా, చివరికి అది సీయోను పట్టణానికి

3. లూకా 22:33, మార్కు 14:31
4. ఎఫెసీయులకు 6:10–16
5. యోహాను 15:5

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

పూర్తి వ్యతిరేక దిశకు వెళ్లసాగింది, అయినా వారు అతన్నే వెంబడిస్తున్నారు. అంతకంతకూ వారు ఒక వలలో చిక్కుబడి ఇద్దరూ తమంతట తాముగా బయటికి రాలేని పరిస్థితిలో ఉన్నారు. అప్పుడు వారిని నడిపిస్తున్న వారి మార్గదర్శి వెనుక భాగంలో అతని తెల్లని అంగీ జారిపోవడంతో అతడో నల్లని పిశాచమని గుర్తించారు.

"ఇప్పుడు తెలిసింది నేను చేసిన పొరపాటు. మోసగాడి గురించి జాగ్రత్తపడమని కాపరులు మనకు చెప్పారు. 'తన పొరుగువానితో ఇచ్చకములాడువాడు వాని పట్టుకొనుటకు వలవేయువాడు[6]' అని జ్ఞానులు చెప్పిన మాట ప్రకారమే మనకు జరిగింది" అన్నాడు క్రైస్తవుడు.

నిరీక్షణ్: మనం చదవడం మరిచిపోయాం కానీ, ఆ కాపరులు మనకు దారి గురించిన వివరాలు కూడ ఇచ్చారు; ఫలితంగా బలాత్కారుల మార్గము నుండి[7] మనలను మనము కాపాడుకోలేకపోయాం.

సరైన మార్గమునకు తిరిగి నడిపించబడుట

వారు ఆ వలలోనే రోధిస్తూ ఉండిపోయారు. ఎట్టకేలకు వారివైపుగా ఒక ప్రకాశించే వ్యక్తి రావడం గమనించారు. ఆయన చేతిలో ఒక చిన్న కొరడా పట్టుకొని వచ్చాడు. వారు ఎక్కడి నుండి వచ్చింది, ఇక్కడ ఏం చేస్తున్నది అడిగి తెలుసుకున్నాడు.

తాము సీయోనుకు వెళుతున్న యాత్రికులమని, తెల్ల అంగీ ధరించి తాను కూడ సీయోను వెళుతున్నానని చెప్పిన ఒక నల్లవాని చేతిలో మోసపోయి దారితప్పి ఇలా వచ్చామని చెప్పారు.

ప్రకాశించుచున్న ఆ వ్యక్తి ఇలా చెప్పాడు: "వాడు మోసగాడు, వెలుగుదూత వేషము ధరించుకొన్న అబద్ధ ప్రవక్త"[8]. గనుక ఆ వలను ఆయన చింపివేసి వారిని విడిపించాడు. "నేను మిమ్ములను మార్గములోనికి నడిపించులాగున మీరు నన్ను వెంబడించండి" అన్నాడు. మోసగాడిని వెంబడిస్తూ, వారు వదిలివచ్చిన మార్గములోనికి తిరిగి వారిని ఆయన తీసుకెళ్లాడు. "గతరాత్రి మీరు ఎక్కడ బసచేశారు?" అని వారినడిగాడు.

"మనోహర పర్వతాలపైన ఉండే కాపరులతో" ఉన్నామని వారు బదులిచ్చారు. అలాగైతే, మార్గమునకు సంబంధించిన వివరాలు ఆ కాపరులు మీకు చెప్పలేదా అని అడిగాడు. "చెప్పారు" అని జవాబిచ్చారు.

"మరి ఆ దారి మలుపుల వద్దకు చేరినప్పుడు మీరు ఆ వివరాలు చదువుకోలేదా?" ప్రశ్నించాడాయన.

"లేదు. మేం మరిచిపోయాం."

"మోసగాడి విషయమై జాగ్రత్త వహించమని ఆ కాపరులు మీతో చెప్పలేదా?"

6. సామెతలు 29:5
7. కీర్తనలు 17:4
8. 2కొరింథీయులకు 11:13-15

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

"చెప్పారు. కానీ తెల్లని దుస్తులు ధరించిన ఈ మృదుభాషియే మోసగాడని మేము ఊహించలేకపోయాం" అంటూ బదులిచ్చారు.

ఆయన వైపు చూచినపుడు తన కొరడా ఎత్తి వారిని కొట్టబోతున్నాడా అన్నట్టు కనిపించగా వారు సిగ్గుతో తలదించుకొని చేసిన తప్పుకు పశ్చాత్తాపంతో ఏడ్చారు. అప్పుడాయన ఇలా అన్నాడు, "నేను ప్రేమించువారినందరిని గద్దించి శిక్షించుచున్నాను గనుక నీవు ఆసక్తి కలిగి మారుమనస్సు పొందుము"[9] అంతటితో వారికి వీడ్కోలు పలికి, కాపరులు చెప్పిన ఇతర సూచనలు జాగ్రత్తగా పాటించమని చెప్పి వెళ్లిపోయాడు. ఆయన చూపిన దయను బట్టి వారాయనకు కృతజ్ఞతలు చెప్పి, సరైన మార్గంలో పాటలు పాడుకొంటూ నెమ్మదిగా వెళ్లిపోయారు.

కొంతసేపటి తర్వాత, వారిని కలిసేందుకు వస్తున్న ఒక వ్యక్తిని వారు చూశారు. అప్పుడు క్రైస్తవుడన్నాడు, "అదిగో, సీయోనుకు తన వెన్నుచూపిస్తూ, ఇటువైపుగా ఒకడు వస్తున్నాడు చూడు."

నిరీక్షణ్: అప్రమత్తంగా ఉండి మనల్ని మనం కాపాడుకుందాం. వాడు కూడా మోసగాడే అయ్యుండవచ్చు.

నాస్థికుడిని కలుసుకొనుట

అతడు వారిని సమీపిస్తూ వచ్చి ఎట్టకేలకు వారిని కలుసుకున్నాడు. అతని పేరు నాస్థికుడు. మీరు ఎక్కడికి వెళుతున్నారు? అని వారిని అడిగాడు.

క్రైస్తవుడు: మేము సీయోను పర్వతానికి వెళుతున్నాం.

నాస్థికుడు పెద్దగా నవ్వాడు.

క్రైస్తవుడు: అలా నవ్వడంలో నీ ఉద్దేశం ఏంటి?

నాస్థికుడు: మీరెంత అమాయకులో చూసి నవ్వుతున్నాను. ఇంత ప్రయాసతో కూడిన ప్రయాణం ఇంత శ్రమపడి ఇన్ని బాధలు అనుభవించి చేసినందువల్ల మీకు ఒరిగేదేముంది – ఇక్కట్లూ ఇబ్బందులు తప్ప.

క్రైస్తవుడు: మేము ఆహ్వానించబడమని నీవనుకుంటున్నావా?

నాస్థికుడు: ఆహ్వానించబడేది ఎక్కడికి? మీరు కలలు కంటున్న స్థలం ఈ ప్రపంచం మొత్తంమీద ఎక్కడా లేదు.

క్రైస్తవుడు: కానీ రాబోయే ప్రపంచంలో ఉంది.

నాస్థికుడు: మా దేశంలో ఉన్నప్పుడు మీరు చెప్తున్న పట్టణం గురించి విన్నాను గనుక దాన్ని చూద్దామని వెళ్లాను. ఈ ఇరవైయేళ్లుగా ఆ పట్టణం కోసం వెతుకుతున్నాను కాని, ఇంతవరకూ నాకు మార్గంలో మీలాంటి బుద్ధిహీనులు తప్ప మరేమీ కనిపించలేదు.

9. ప్రకటన 3:19 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

క్రైస్తవుడు: మేము వినడం మాత్రమే కాదు, ఆ వాక్యాన్ని విశ్వసించాము, ఇప్పుడు మాలోనే అందుకు సాక్ష్యం ఉంది.[10] కాపరులు మాకు చూపించిన విధంగా ఆ ద్వారాన్ని మేము విశ్వాసపు నేత్రంతో చూశాం.

నాస్థికుడు: ఇంటి దగ్గర ఉన్నప్పుడు నేను కూడా అలాగే నమ్మాను. ఆ కథను నేను నమ్మివుండకపోతే ఇంతవరకూ వచ్చేవాడినే కాదు. మీకంటే ఎక్కువదూరమే వెళ్లివచ్చాను గనుక అలాంటి స్థలమేదైనా ఉండివుంటే నేను తప్పక చూసివుండేవాణ్ణి. అయితే అంతదూరం వెళ్లి, ఏమీ కనిపించకపోవడంతో, తిరిగి నేను వచ్చిన చోటుకే వెళ్లిపోతున్నాను. ఎండమావిలాంటి ఈ వాస్తవం కోసం ఏవేవి వదులుకొని వచ్చానో వాటిని మరల అనుభవించడానికే తిరిగి వెళ్తున్నాను.

క్రైస్తవుడు (నిరీక్షణతో): ఇతడు చెప్తున్నది నిజమేనంటావా?

నిరీక్షణ: సహోదరుడా జాగ్రత్త సుమా, ఇతడు ఆ మోసగాళ్లలో ఒకడు. మార్గంలో భక్తిహీనుల మాటలు విన్నందుకు మనం ఇప్పటికే ఎంత మూల్యం చెల్లించుకున్నామో గుర్తుందా? ఏమిటీ? సీయోను పర్వతం అంటూ ఏమీ లేదా? సువార్తికుడు మనకు చెప్పిన మాటలు గుర్తులేవా? వివరణకర్త చెప్పినమాటలు ఏమయ్యాయి? సుందర ప్రదేశం వద్ద సేవకులు, కాపరులు చెప్పిన మాటలు మరచిపోయావా? మనం దేవుని వాక్యాన్ని నమ్మినప్పుడు మనలో సమాధానం కలుగలేదా? కొరడా చేతపట్టుకొని ఉన్న మనిషి మరలా మనల్ని కలిసేలోపు ముందుకు సాగిపోదాం పద. ఇప్పుడు మనం విశ్వాసంతోనే నడవాలి.[11] నీ చెవిలో నేనిప్పుడు పలుకబోయేమాటలు నీవు ఇంతకుమునుపే నాకు నేర్పించి ఉండవలసింది: " నా కుమారుడా, తెలివిపుట్టించు మాటలను నీవు మీరగోరితివా? ఉపదేశము వినుట ఇక మానుకొనుము"[12]. అతని మాటలను వినక తృణీకరించి ఆత్మను కాపాడే మాటలను నమ్ముదాం.

క్రైస్తవుడు: సోదరా, మన విశ్వాస పునాదిని అనుమానించినందుకు నేను ఈ ప్రశ్న నిన్ను అడగలేను కానీ ఇతని వాదనలకు నీ జవాబేంటో తెలుసుకుందామనే అలా అడిగాను. ఇక ఇతని విషయానికి వస్తే, ఇతడు ఈ యుగసంబంధమైన దేవతచేత గుడ్డివాడయ్యాడని నాకు తెలుసు. మన విశ్వాసం అసంపూర్ణంగా ఉన్నప్పుడు మనం సత్యాన్ని నమ్ముతాము అదేమనగా "ఏ అబద్ధమునూ" సత్యసంబంధమైనది కాదు.[13]

నిరీక్షణ: ఇప్పుడు నేను దేవుని మహిమ నిరీక్షణయందు ఆనందిస్తున్నాను. ఆ విధంగా వారు తమను చూచి నవ్వుకుంటూ వెళ్లిన నాస్థికుడ్ని విడిచి తమదారిన తాము వెళ్లిపోయారు.

నిద్రపోవాలని శోధించబడ్డ నిరీక్షణ

క్రైస్తవుడు నిరీక్షణ కలిసి ప్రయాణం చేస్తూ నిద్రమత్తు కలిగించే వాతావరణం ఉన్న మంత్ర భూమి అనే ఒక ప్రదేశానికి చేరుకున్నారు. నిరీక్షణకు బాగా నిద్రమత్తు రావడంతో క్రైస్తవునితో

10. యోహాను 5:10; రోమా 8:16
11. 2కొరింథీయులకు 5:7 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8
12. సామెతలు 19:27
13. 1యోహాను 2:21

ఇలా అన్నాడు, "కళ్లు మూతలుపడేంతగా నాకు నిద్రముంచుకొస్తుంది; కనుక ఇక్కడ కొద్దిసేపు ఆగి ఒక కునుకు తీద్దాం."

క్రైస్తవుడు: వద్దు అలా ఎప్పటికీ చేయకూడదు! మనకు అసలు మెలకువే రాదేమో.

నిరీక్షణ: ఎందుకు వద్దు, పనివాడికి నిద్ర ఎంతో మేలు చేస్తుంది.

క్రైస్తవుడు: "మత్తు కలిగించే ప్రదేశంలో నిద్రపోకుండా జాగ్రత్తపడండి" అని చెప్పిన కాపరి మాటలు నీకు గుర్తులేవా? అందుచేత "మనము ఇతరుల వలే నిద్రపోక మెలకువగా ఉండి మత్తులముకాక యుందము."[14]

నిరీక్షణ: నా బలహీనతను గుర్తించాను, ఇది నాకు గుర్తుచేసినందుకు ధన్యవాదాలు. నేను ఒంటరిగా ఉండివుంటే ఇక్కడ నిద్రపోయి ప్రమాదం కొనితెచ్చుకొనే వాడిని. జ్ఞాని చెప్పిన ఈ మాటలు నిజమని ఇప్పుడు నాకు అర్థం అవుతుంది: "ఒంటిగాడై యుండుటకంటే ఇద్దరు కూడి యుండుట మేలు".[15] మార్గమంతటిలో నీ సహవాసం ఎంతో ఆశీర్వాదకరంగా ఉంది. నీకు గొప్ప బహుమానం లభిస్తుంది.

నిరీక్షణ తన అనుభవాలను పంచుకొనుట

క్రైస్తవుడు: నిద్రమత్తు రాకుండ నివారించేందుకు మనం ఏదైనా విషయం గురించి మాట్లాడుకుందాం.

నిరీక్షణ: బాగుంది ఇది చాలా మంచి ఆలోచన.

క్రైస్తవుడు: అయితే నిన్ను ఒక ప్రశ్న అడుగుతాను: యాత్రికునిగా మారాలన్న ఆలోచన నీకు ఎలా వచ్చింది?

నిరీక్షణ: చాలా కాలం వరకు మాయాసంతలో జరిగే విషయాలపట్ల నేను ఆసక్తి చూపించాను కాని ఇప్పుడు నాకనిపిస్తుంది నేను మారి ఉండకపోతే అది నా ఆత్మను నరకాగ్నిపాలు చేసి ఉండేది అని.

క్రైస్తవుడు: నీకు ఆసక్తి కలిగించిన విషయాలు ఏవి?

నిరీక్షణ: ఈ లోకసంబంధమైన సిరిసంపదలు, అంతే కాకుండా ఆత్మను నాశనం చేసే త్రాగుడు అల్లరితోకూడిన ఆటపాటలు, ఒట్టుపెట్టుకొనుట, అబద్ధమాడుట, వ్యభిచారం వంటి లైంగిక చర్యలలోకూడా ఆనందించడానికి ఇష్టపడేవాడిని. అయితే ఎట్టకేలకు సత్యం తెలుసుకున్నాను. మాయా సంతలో మీరు, సహోదరుడు విశ్వాసి పలికిన మాటలు వినడం ద్వారా వీటి అంతం మరణమే[16] అని, అవిధేయులైనవారి మీదికి దేవుని ఉగ్రత వస్తుందని తెలుసుకున్నాను.[17]

క్రైస్తవుడు: మరి ఈ కొత్త నమ్మకానికి నీవు వెంటనే సమర్పించుకున్నావా?

14. 1థెస్సలోనీకయులకు 5:6
15. ప్రసంగి 4:9 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8
16. రోమా 6:21-23
17. ఎఫెసీయులకు 5:6

నిరీక్షణ: లేదు మొదట్లో నా జీవితంలోని పాపపు స్థితిని గుర్తించడానికి గానీ, అలాంటి జీవితం ద్వారా కలిగే నాశనాన్ని చూడటానికి గానీ నేను ఇష్టపడలేదు. సత్యంచేత నా మనస్సు కలవరపడటం ఆరంభమైనప్పుడు వెలుగును చూడకుండా కళ్లుమూసుకునేందుకే ప్రయత్నించాను.

క్రైస్తవుడు: అయితే దేవుని ఆత్మ నీకు సత్యాన్ని బయలుపరచి దాన్ని ఎదుర్కొనేలా దేవుడు నీ జీవితంలో పనిచేస్తున్నాడని చివరికి నీవు ఎలా గ్రహించగలిగావు?

నిరీక్షణ: మొదట్లో దేవుడే నా జీవితంలో పనిచేస్తున్నాడనే సంగతి నాకు అసలు తెలియనే తెలియదు. దైవసత్యంతో ఒక పాపి మనస్సాక్షిని గుచ్చుకొనేలా చేసి పరలోకపు వెలుగుతో అతన్ని మనస్సును వెలిగింపచేసి అతని పాపాలను చూడగలిగేలా చేసి ఆ పాపం విషయంలో అపరాధభావం కలిగించడం ద్వారానే ఒక పాపిని మారుమనస్సుకు నడిపించే కార్యాన్ని దేవుడు ఆరంభిస్తాడన్న సంగతి నాకు తెలియదు. ఆ తరువాత నా దోషాలు గుర్తించగలిగినప్పటికీ చెడిపోయిన నా మనస్సు, నా శరీరాశల కారణంగా పాపమంటే నాకు ఇంకా విలువైనదిగానే ఉండేది. దానిని వదులుకునేందుకు నేను సుముఖంగా లేను. నా పాత స్నేహాలతో తెగతెంపులు చేసుకొనేందుకు ఇష్టపడలేదు. వారి సహవాసం, స్నేహం నాకు ఎంతో ప్రియంగా ఉండేవి. అయినప్పటికీ ఎన్నో గంటలసేపు పాపపు ఒప్పుదలచేత, మనస్సాక్షి చేస్తున్న నేరారోపణ చేత బాధించబడిన ఆ సమయం ఎంతో వేదనతో కూడినదై కొన్నిసార్లు గుండెలుపగిలేలా చేసేది.

క్రైస్తవుడు: అయితే కొన్నిసార్లు ఇలాంటి ఇబ్బందులేవీ లేనట్లు నీకు అనిపించలేదా?

నిరీక్షణ్: నిజమే కానీ అవి మరలా మరింత భారభరితంగా తిరిగి నా మీద విరుచుకుపడేవి.

క్రైస్తవుడు: నీ పాపాలను మరలా నీకు గుర్తుచేసింది ఏమైయుంటుంది?

నిరీక్షణ్: చాలానే ఉన్నాయి. వీధుల్లోకి వెళ్లినప్పుడు, మంచివాళ్లను కలుసుకోవడం, ఎవరైనా బైబిల్ చదవడం లేక మాట్లాడటం విన్నప్పుడు, బాధకలిగినప్పుడు, లేక ఒంట్లో బాగాలేనప్పుడు, స్నేహితుడికో, ఇరుగుపొరుగు వారికో రోగం వచ్చినప్పుడు, సమాధి కార్యక్రమాన్ని గుర్తుచేస్తూ గుడిగంటలు మ్రోగినప్పుడు, ఏదైనా ప్రమాదం గురించి లేదా ఆకస్మిక మరణం గురించి విన్నప్పుడు, చావు గురించి ఆలోచించినప్పుడు, మరి ముఖ్యంగా తీర్పు సమయంలో దేవుని ఎదుట నిలబడాలన్న తలంపు వచ్చినప్పుడు, నా పాపాలు బాగా గుర్తుకువచ్చేవి.

క్రైస్తవుడు: ఏ సమయంలోనైనా ఈ అపరాధ భావాన్ని తేలికగా ప్రక్కన పడేయగలిగావా?

నిరీక్షణ: లేదు, నిజానికి అలా చేయాలని ప్రయత్నించినప్పుడు పాపం నామీద మరింత పట్టు సాధించడం నేను గమనించాను. ఇప్పటికీ, నా పాత పాపాలవైపు మళ్లాలని ఆలోచించినప్పుడు నా మనస్సు మరింత కుంగిపోతుంది. ఎందుకంటే నా మనస్సు మారింది కనుక ఆ తలంపే అసహ్యంగా ఉంటుంది.

క్రైస్తవుడు: మరి అప్పుడు ఏంచేశావు?

నిరీక్షణ: నా మార్గాలను సరిచేసుకోవడం మొదలుపెట్టాను. ఎందుకంటే శిక్షను తప్పించుకోడానికి, శాంతిని పొందడానికి అదొక్కటే మార్గం అనుకొన్నాను.

క్రైస్తవుడు: ఏ విధంగా నీ పరిస్థితి మెరుగైంది?

నిరీక్షణ: నా దృష్టిలో పాపాలుగా అనిపించినవాటిని విడిచిపెట్టడమే కాక నా పాపపు సహవాసాన్ని కూడ విడిచి ప్రతిరోజు ప్రార్థించడం, బైబిల్ చదవడం, గుడికి వెళ్లడం, దానధర్మాలు చేయడం, నా విధులన్నీ సక్రమంగా నిర్వర్తించడం, సత్యాన్ని పలకడం వంటి మంచిపనులు చేపట్టాను. ఇవే కాక మరెన్నో ఇతర నియమాలు జాగ్రత్తగా పాటించాను.

క్రైస్తవుడు: అప్పుడు నీవు బాగుపడ్డావని నీకనిపించిందా?

నిరీక్షణ: అవును. కొంతకాలం–నా మనస్సాక్షి నన్ను మరలా ఇబ్బంది పెట్టడం మొదలయ్యేంత వరకు అలాగే అనిపించింది.

క్రైస్తవుడు: నీవు మంచి నైతికపరమైన జీవితం జీవిస్తున్నావు కదా, అలాంటప్పుడు మరలా నీకు ఇబ్బందులు ఎలా వచ్చాయి?

నిరీక్షణ: అంతా సవ్యంగా ఉందన్న విషయాన్ని అనుమానించేందుకు చాలా విషయాలు దోహదపడ్డాయి. ఉదాహరణకు: 'మనం చేసిన నీతి క్రియలచేత కాదు మనం రక్షణపొందేది'[18] 'మన నీతి క్రియలన్నియు మురికి గుడ్డలవంటివి',[19] 'ధర్మశాస్త్ర సంబంధమైన క్రియలద్వారా ఏ శరీరియు నీతిమంతుడుగా తీర్చబడడు',[20] మరియు 'విశ్వాస సంబంధమైనది కానిదేదో అది పాపము'[21] 'కాబట్టి విశ్వాసమూలమున మనము నీతిమంతులముగా తీర్చబడి మన ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా దేవునితో సమాధానము కలిగియుందము.'[22] 'ఒకడు క్రొత్తగా జన్మించితేనే కానీ అతడు దేవుని రాజ్యమును చూడలేడు.'[23] ఎంతో తేటగా సూటిగా ఉన్న ఈ సత్యవాక్కులను బట్టి నేను ఈ విధంగా తర్కించేవాడిని: ఒకడు నీతిక్రియలచేత గానీ ధర్మశాస్త్ర సంబంధమైన క్రియలచేతగాని నీతిమంతునిగా తీర్చబడకపోతే నేను రక్షణ పొందలేదన్నమాట. నా నీతి క్రియలన్నీ మురికి గుడ్డలే. ఒకవేళ విశ్వాససంబంధమైనదంతా పాపమే అయితే నా క్రియలన్నీ పాపసంబంధమైనవే ఎందుకంటే నాలో నిజమైన విశ్వాసం లేదు. నిజమైన విశ్వాసమే గనుక నాలో ఉంటే నేను నీతిమంతునిగా తీర్చబడి ఉండేవాడిని నా మనస్సులో సమాధానం ఉండేది. కాబట్టి నేను దేవుని మూలముగా పుట్టినవాడనై యుండను. దేవుని మూలముగా జన్మించినవాడను కాదంటే నేను దేవుని రాజ్యాన్ని ఎన్నటికీ చూడలేను. పైగా నా క్రియలన్నీ నీతియుక్తమైనవై దేవునిచేత అంగీకరించబడినవైనా నేను మంచిజీవితం జీవించాలని తీర్మానించుకొనక మునుపు చేసిన పాపాలకు అవి ఏమాత్రం పరిహారం చెల్లించలేవు. అలాంటప్పుడు నా పాత లెక్కలు

18. తీతుకు 3:5
19. యెషయా 64:6
20. గలతీయులకు 2:16
21. రోమా 14:23
22. రోమా 5:1
23. యోహాను 3:3

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

సరిచూడబడలేదు గనుక దేవునికి మరింత రుణపడినవాడనవుతాను.న్యాయమూర్తి యెదుట నేను నిలబడినప్పుడు నేను చెల్లించవలసిన రుణం విస్తారమైనదిగా ఉంటుంది.

క్రైస్తవుడు: చాలా మంచి అన్వయమే కాని ఇంకా ఏంజరిగిందో వివరించు.

నిరీక్షణ: నాలో ఈ సంస్కరణ జరిగిన అనంతరం నన్ను బాధించిన మరొక విషయం ఏమిటంటే నేను చేసిన సత్క్రియలలో చాలా ఉత్తమమైన వాటిని జాగ్రత్తగా పరిశీలించాను. మంచితోపాటు చెడుకూడా కలిసి ఉండటం నేను చూశాను– చెడు ఉద్దేశాలు, స్వార్థం, గర్వం మొదలైనవి అందులో కనిపించాయి. కాబట్టి నేను ఎన్ని ప్రయత్నాలు చేసినా, నామీద నాకు ఎంత మంచి అభిప్రాయం కుదిరినా, నా గతజీవితమంతా నిరపరాధమైన జీవితమే అయినా సరే, ఇప్పటికీ నేను నరకానికి పంపబడుటకు తగినంత పాపం చేస్తూనే ఉన్నాను అన్న ముగింపుకు రావలసి వచ్చింది.

క్రైస్తవుడు: మరి దాని సంగతి ఏంచేశావ్?

నిరీక్షణ: చేయడమా? నా ఈ సమస్యను తీసుకొని విశ్వాసి దగ్గరకు వెళ్లేంతవరకు ఏంచేయాలో పాలుపోలేదు (అతడూ నేను మంచి మిత్రులం). అతడేమన్నాడంటే ఏ పాపము ఎరుగని పరిపూర్ణుడైన ఒక వ్యక్తి యొక్క నీతిని నేను పొందనంత వరకు నా సొంతనీతి గాని, లోకంలో ఉన్నవారి మొత్తం నీతి గాని నన్ను రక్షించలేదు అని చెప్పాడు.

క్రైస్తవుడు: అతడు చెప్తున్నది సత్యమేనని నీవు నమ్మావా?

నిరీక్షణ: ఆ నమ్మాను. కాని నా విషయంలో నేను పూర్తి నమ్మకంతో సంతోషంగా ఉన్నప్పుడు అతడు ఈ మాటలు చెప్పి ఉన్నట్లయితే అతన్ని ఓ పిచ్చివానిగా జమకట్టి ఉండేవాడ్ని. అయితే నాలో ఉన్న దుర్నీతిని నేను ఎంత మంచిచేసినా విడువని నా పాపాన్ని చూసిన తరువాత అతడు చెప్పింది నిజమే అని ఒప్పుకోక తప్పలేదు.

క్రైస్తవుడు: అయితే అతడు చెప్పినప్పుడు అటువంటి వ్యక్తిని కనుగొనవచ్చునని నీవు నమ్మావా?

నిరీక్షణ: మొదట్లో ఆ ఆలోచన చాలా విపరీతంగానే ఉందనిపించింది. కాని అతనితో మరికొంత చర్చించిన మీదట, అతని విశ్వాసం, సాహసోపేతమైన మనస్తత్వం గమనించాక అతణ్ణి పూర్తిగా నమ్మాను.

క్రైస్తవుడు: అసలు ఈ మనిషి ఎవరో అతన్ని ఎక్కడ కనుగొనవచ్చో అడిగి తెలుసుకున్నావా?

నిరీక్షణ: తెలుసుకున్నాను. ఆ మనిషి పేరు క్రీస్తు అనబడిన యేసు అని, ఆయన ఇప్పుడు దేవుని కుడిపార్శ్వమున కూర్చొని ఉన్నాడని అతడు చెప్పాడు.[24]. ఆయన యందు విశ్వాసముంచి శిలువపై మరణించి నా కోసం ఆయన చేసిన కార్యాన్ని నమ్మడం ద్వారా నేను నీతిమంతునిగా

24. హెబ్రీయులకు 10:12 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

తీర్చబడాలనికూడా చెప్పాడు. దేవుని యెదుట మరొక వ్యక్తిని నీతిమంతునిగా తీర్చడానికి ఆయన నీతి ఎలా పనికొస్తుంది అని నేనతనిని అడిగాను. అప్పుడతడు అన్నాడు, అయన చనిపోయింది ఆయన కోసంకాదు నా పాపాలకు పరిహారం చెల్లిండానికి దేవునికి నేను అచ్చిఉన్న రుణమంతటిని తీర్చడానికి చనిపోయాడని ఆయన నాకోసం చేసినదంతటిని దేవుడు అంగీకరించాడని ఆయన యందు ఆయన చేసిన కార్యమందు నేను విశ్వాసముంచినప్పుడు ఆయన నీతి నాకు ఆపాదించబడుతుందని చెప్పాడు.

క్రైస్తవుడు: దాని గురించి నీకు ఏమనిపించింది?

నిరీక్షణ: యేసు నీతిమంతుడని, ఆయన లోకపాపముల కోసం మరణించాడని నేను విశ్వసించాను; అయినప్పటికీ నాలాంటి భయంకరమైన పాపికి ఆయన నీతిని ఆపాదిస్తాడంటే నమ్మలేక పోయాను, అలాంటివాళ్లను దేవుని యెదుట నేరస్తులుగా నిలబెడతాడని అలా చేయడం సబబేనని కూడా భావించాను.

క్రైస్తవుడు: మరి ఈ విషయం విన్నప్పుడు విశ్వాసి ఏమన్నాడు?

నిరీక్షణ: 'ఆయన యొద్దకు వెళ్లి ఎందుకు చూడకూడదు?' అన్నాడు. అది కేవలం దురభిమానమే అవుతుంది అన్నాను. 'లేదు ఆయన యొద్దకు రమ్మని నిన్ను ఆహ్వానిస్తున్నాడు'[25] అని చెప్పాడు. ఆ తరువాత స్వయంగా యేసు పలికిన ఆ మాటలు ఉన్న గ్రంథాన్ని నాకిచ్చాడు; ఆ గ్రంథంలోని ప్రతి సున్నా ప్రతి పొల్లు భూమి ఆకాశాలకన్నా స్థిరంగా ఉంటాయనికూడా చెప్పాడు.[26] నేను క్రీస్తు దగ్గరకు వచ్చిన తరువాత ఏంచేయాలని అతన్ని అడిగాను. తన్ను తాను బయలుపరచుకొమ్మని నా పూర్ణ హృదయంతోను, నా పూర్ణ మనస్సుతోను తండ్రిని వేడుకోమని చెప్పాడు. నేను వేడుకొనేటప్పుడు ఏమి పలకాలి అని అతన్ని అడిగాను. అతడు అన్నాడు, 'ఆయన యొద్దకు వచ్చువారందరికి పాపక్షమాపణ, క్షమాభిక్ష అందిస్తూ ఏడాది పొడవునా ఆయన తన కరుణాపీఠం మీద కూర్చొని ఉండటం గమనిస్తావు. నీవు కేవలం ఈ మాటలు (హృదయ పూర్వకంగా) పలుకు: 'దేవా పాపినైన నన్ను కరుణించు, నా పాపపు స్థితిని గుర్తించి నా పాపాలన్నిటిని నీ సన్నిధిలో ఒప్పుకొంటున్నాను. యేసు క్రీస్తును తెలిసికొని ఆయనను నమ్మునట్లుగా నాకు సహాయము చేయుము. ఎందుకంటే ఆయన నీతి కనికరం లేకుండ, ఆ నీతి యందు నమ్మకముంచి ఆయన అందించే కనికరాన్ని నేను స్వీకరించనంత వరకు నేను శాశ్వతంగా నశించిపోయినవాడనే అని భావిస్తున్నాను. దేవా నీవు కరుణగల దేవుడవని నీకుమారుడైన యేసుక్రీస్తు వారిని ఈ లోకరక్షకుడిగా నీవు నియమించావని నాలాంటి నీచమైన పాపిపై ఆయన మంచితనమును కనికరమును కుమ్మరించుటకు నీవు ఇష్టపడుతున్నావని నేను విన్నాను. నిజంగానే నేనొక నిస్సహాయుడను, నీచుడనైన పాపిని. ప్రభూ, నా పాపాలను పరిహరించి నీ నీతిని నాకు ఆపాదించు. నా ఆత్మను రక్షించి నీకృపకు మహిమ కలుగచేసుకో, యేసునామంలో ప్రార్థిస్తున్నాను ఆమేన్.'

25. మత్తయి 11:28 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8
26. మత్తయి 24:35

క్రైస్తవుడు: మరి అతను చెప్పిన ప్రకారం నీవు చేశావా?

నిరీక్షణ: అవును, పదే పదే చేశాను.

క్రైస్తవుడు: ఆ తరువాత నీకు శోధనలేమీ కలుగలేదా?

నిరీక్షణ: కనీసం ఓ వంద సార్లయినా శోధన వచ్చింది. అయితే విశ్వాసి చెప్పిన మాటలు సత్యమని నమ్మటం కొనసాగించాను. ఒకవేళ నేను ఈ విశ్వాసాన్ని విడిచిపెడితే తప్పక చనిపోతాననుకొన్నాను. అలా ప్రార్థిస్తూ ఉండినా కూడా చనిపోతాననుకొన్నాను. అదే జరిగితే నేను కృపా సింహాసనం వద్దనే చనిపోతాను. అప్పుడు ఈ గ్రంథంలోని మాటలు నాకు గుర్తుకొచ్చాయి: 'అది (దర్శనము) తప్పక జరుగును, అది ఆలస్యముగా వచ్చినను దానికొరకు కనిపెట్టుము.'[27] 'యెహోవా కొరకు ఎదురు చూచువారు నూతన బలము పొందుదురు'[28] 'ప్రభువు నామమున ప్రార్థన చేయువారందరును రక్షణ పొందుదురు.'[29] గనుక తండ్రి తన కుమారుడ్ని నాకు బయలుపరచేంత వరకు నేను ప్రార్థిస్తూనే ఉన్నాను.

క్రైస్తవుడు: ఆయన నీకు ఎలా బయలుపరచాడు?

నిరీక్షణ: నేను ఆయన్ని శరీర సంబంధమైన కళ్లతో చూడలేదు కాని నా మనో నేత్రాలతో చూడగలిగాను. ఒకరోజు నేను చాలా విచారంగా, గతంలో ఎన్నడూ లేనంత విచారంగా ఉన్నాను. నా దుర్మార్గపు స్వభావాన్ని బట్టి, విస్తారమైన నా పాపాలను బట్టి, నిస్సహాయమైన నా స్థితిని బట్టి విచారిస్తూ ఉన్నాను. నిత్యమైన గాఢాంధకారంలో శాశ్వతమైన శిక్షకు తప్ప మరెందుకు అర్హుడను కాను అనుకొంటుండగా అకస్మాత్తుగా ప్రభువు నా వైపు చూస్తూ 'ప్రభువైన యేసుక్రీస్తు నందు విశ్వాసముంచుము అప్పుడు నీవు రక్షణ పొందెదవు[30].' అనే మాటలు పలుకుతున్నట్లు నాకు అనిపించింది.

అందుకు నేను 'ప్రభూ నేను ఎంతో గొప్ప పాపిని కదా'[31] అని బదులిచ్చాను దానికి జవాబుగా ప్రభువు 'నాకృప నీకు చాలును' అన్నాడు. అయితే ప్రభూ విశ్వసించడమంటే ఏమిటి? అని నేనడిగాను. 'నా యొద్దకు వచ్చువాడు ఏమాత్రమును ఆకలిగొనడు, నా యందు విశ్వాసముంచువాడు ఎప్పుడును దప్పిగొనడు'[32] అన్నాడు ప్రభువు. అప్పుడు నాకనిపించింది ఆయన యొద్దకు రావడము, విశ్వసించడము ఒక్కటేనని. కొంతవరకు నేను ఆయన యొద్దకు వచ్చానని నాకు తెలుసు. అంటే నాలో కొంత విశ్వాసముందని, లేనట్లయితే నేను ఎప్పటికీ వచ్చిఉండే వాడిని కాదని ఇది రుజువు చేసింది. అయినా నేనింకా దేని కోసమో ఆకలిదప్పులు కలిగి ఉన్నాను. ఇది నాకు ఎలా అర్థం అవుతుంది?

అప్పుడు నాకు అపొస్తలుడైన పౌలు మాటలు నాకు వినిపించాయి, 'వారు . . .దేవుని నీతికి లోబడలేదు'[33] క్రీస్తు నీతిగల దేవుడని, యూదులవలె నేను కూడా ఆయనకు లోబడలేదని నాకు

27. హబక్కూకు 2:3
28. యెషయా 40:31
29. అపొస్తలుల కార్యములు 2:21
30. అపొస్తలుల కార్యములు 2:21
31. 2కొరింథీయులకు 12:9
32. యోహాను 6:35
33. రోమా 10:3

తెలుసు. నేను నిజంగా లోబడి ఉంటే దేవుడు నన్ను ఇప్పటికే అంగీకరించి ఉండేవాడు. ఎందుకంటే ఆయన వాక్యం ఇలా సెలవిస్తుంది కదా: 'నా యొద్దకు వచ్చు వానిని నేను ఎంత మాత్రమును త్రోసివేయను'[34] అని నాలో నేను తర్కించుకొంటూ ఉన్నాను. అప్పుడు ఈ అద్భుతమైన లేఖనాలు నా మనస్సులో మెదిలాయి: 'పనిచేయక, భక్తిహీనుని నీతిమంతునిగా తీర్చువానియందు విశ్వాసముంచువానికి వాని విశ్వాసము నీతిగా ఎంచబడును'.[35] 'పాపులను రక్షించుటకు క్రీస్తు యేసు లోకమునకు వచ్చెను'.[36] 'విశ్వసించు ప్రతివానికి నీతి కలుగుటకై క్రీస్తు ధర్మశాస్త్రమునకు సమాప్తియై యున్నాడు'.[37] 'ఆయన మన అపరాధముల నిమిత్తము అప్పగింపబడి, మనము నీతిమంతులముగా తీర్చబడుటకై లేపబడెను'.[38] 'మనలను ప్రేమించుచు తన రక్తము వలన మన పాపములనుండి మనలను విడిపించినవానికి మహిమయు ప్రభావము యుగయుగములకు కలుగును గాక!'[39]

ఇప్పుడు నాకు తేటగా అర్థమైంది, 'దేవునికిని నరులకును మధ్యవర్తి క్రీస్తే'[40] అని, 'తన ద్వారా దేవుని వద్దకు వచ్చువారి పక్షమున, విజ్ఞాపన చేయుటకు నిరంతరము జీవించుచున్నాడు గనుక వారిని సంపూర్ణముగా రక్షించుటకు శక్తి మంతుడైయున్నాడని'[41] అప్పుడు నేను యేసు క్రీస్తువారి అనంతమైన ప్రేమను, అవధులులేని కరుణను, రక్షించగల ఆయన గొప్ప శక్తిని నమ్మాను, అప్పుడు ఆయన ప్రేమ, సమాధానము నా ఆత్మలో ఒక నదిలా పొంగి ప్రవహించాయి. స్వయంగా ఆయన నీతిమంతుడే కాక, పాపులందరిలోకెల్ల అధములను సైతం దేవుని ఎదుట నీతిమంతులనుగా నిలబెట్టగలడని కూడ గ్రహించాను. అందువలన ఇక సొంత ప్రయత్నాలన్నిటిని విడిచి, ఆయనయందు పూర్తిగా నమ్మకముంచాను. అప్పుడాయన నన్ను హిమమువలె కడిగి శుద్ధిచేసి, ఆ ప్రియునియందు నన్ను అంగీకరించి, "సమస్త జ్ఞానమునకు మించిన సమాధానాన్ని, దేవుని ప్రేమావరమైన మధుర శాంతిని" నాకు అనుగ్రహించాడు.

క్రైస్తవుడు: అది నిజంగా నీ ఆత్మకు క్రీస్తువారి ప్రత్యక్షతే సుమా. అయితే దీనివల్ల నీ ఆత్మలోను, జీవితంలోను ఎలాంటి ప్రభావం కలిగింది?

నిరీక్షణ: నా హృదయం సంతోష సమాధానాలతోను, యేసయ్య పట్ల– ఆయన మాటలు, ఆయన మార్గాలు, ఆయన ప్రజలపట్ల ప్రేమతోను పొంగిపొర్లినది. సర్వలోకమూ తన నీతితో ప్రమేయం లేకుండ శిక్షావిధిలో ఉన్నదని, తండ్రియైన దేవుడు పూర్తి న్యాయవంతుడైయుండి కూడ, నమ్మిన భక్తిహీనుడైన పాపిని సహా న్యాయబద్ధంగా నీతిమంతునిగా తీర్చగలడని చూడగలిగేలా ఆయన నా మనోనేత్రాలను తెరిచాడు. ఇప్పుడు నా గతజీవితం గురించి నేను ఎంతగానో సిగ్గుపడుతున్నాను, నా అజ్ఞానాన్ని చూచి పూర్తిగా ఆశ్చర్యపోతున్నాను. ఎందుకంటే, యేసు క్రీస్తు ప్రభువునందు బయలుపరచబడిన దైవప్రేమ యొక్క అసమానమైన సౌందర్యాన్ని ఇంతవరకూ నేను చూడలేదు. అప్పుడు నాకనిపించింది, నాకే గనుక వెయ్యి జన్మలుంటే, వాటన్నిటినీ నా ప్రభువైన యేసుక్రీస్తువారికి, ఆయన సేవకే సంతోషంగా సమర్పించగలిగిఉండేవాడిని.

34. యోహాను 6:37
35. రోమా 4:5
36. 1తిమోతి 1:15
37. రోమా 10:4
38. రోమా 3:24
39. ప్రకటన 1:5
40. 1తిమోతి 2:5
41. హెబ్రీయులకు 7:25

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

అధ్యాయం 10
అజ్ఞానంతో సంభాషణ

ఈ సమయానికి అజ్ఞానం అనే యువకుడు పరమపురి మార్గంలో ప్రయాణిస్తున్న క్రైస్తవుడిని, నిరీక్షణలను చేరుకున్నాడు. "యౌవనస్తుడా, రా, ఇంత వెనుకబడి పోయావెందుకు?"

అజ్ఞానం: నాలా ఆలోచించేవాళ్లు తోడుగా ఉంటే తప్ప నేను చాలావరకు ఒంటరిగానే నడవటం నాకిష్టం.

లోతైన ప్రశ్నలు

క్రైస్తవుడు: అజ్ఞానం ఎలా ఉన్నావ్? నీ ఆత్మ సంగతులు ఎలా ఉన్నాయి?

అజ్ఞానం: చాలా బాగానే ఉందనుకుంటున్నాను. మార్గంలో నా మనస్సునిండా మంచి తలంపులతో నిండిపోవడంతో నాకు ఎంతో ఆదరణగా ఉన్నది.

క్రైస్తవుడు: మాతో కొన్ని తలంపులు పంచుకొంటావా? నీవు ఏమి ఆలోచిస్తున్నావ్?

అజ్ఞానం: నేను తరచుగా దేవుని గురించి, పరలోకం గురించే ఆలోచిస్తుంటాను.

క్రైస్తవుడు: అందరూ అలాగే ఆలోచిస్తారు కదా.

అజ్ఞానం: కాని నా తలంపులలో దేవుణ్ణి, పరలోకాన్ని ఎంతగానో ఆశిస్తాను.

క్రైస్తవుడు: వాటిని ఎన్నడునూ చూడనివాళ్లు అలాగే చేస్తారు. పవిత్రమైన సామెత ఒకటుంది...'సోమరి ఆశపడును గాని వాని ప్రాణమున కేమియు దొరకదు.'[1]

అజ్ఞానం: కాని నేనయితే వాటికోసం అన్నీ వదులుకున్నాను.

క్రైస్తవుడు: అలా అనుకుంటూనే పొరపాటు చేసే అవకాశం ఉంది. సమస్తాన్ని వదులుకోవడం అనేది చాలా మంది ఊహించేదానికంటే ఎంతో కష్టం. దేవునికోసం పరలోకంకోసం సమస్తాన్ని విడిచిపెట్టానని దేన్నిబట్టి నీకు అలా అనిపిస్తుంది?

అజ్ఞానం: అలా అని నా మనస్సే నాకు చెప్తుంది.

1. సామెతలు 13:14

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

క్రైస్తవుడు: కాని నీ మనస్సు నమ్మదగినదేనా? తన మనస్సును నమ్ముకొనువాడు బుద్ధిహీనుడు'[2] అని బైబిల్ చెప్తుంది కదా.

అజ్ఞానం: అది బుద్ధిహీనుడి గురించి చెప్పబడిన మాట. నేనేమీ బుద్ధిహీనుడ్ని కాదు. నా మనస్సు తెలివైనది, మంచిది.

క్రైస్తవుడు: ఆ సంగతి నీకెలా తెలుసు? నీ మనస్సును పరీక్షించుకొనే సాధనం నీదగ్గర ఏముంది?

అజ్ఞానం: పరలోకం చేరతానన్న ఆశ నామనస్సును ఆదరిస్తుంది.

క్రైస్తవుడు: బహుశా అది తన మోసపూరిత స్వభావాన్ని బట్టే అలా జరుగుతుందేమో? యిర్మియా ప్రవక్త ఇలా చెప్పాడు 'హృదయం అన్నిటికంటే మోసకరమైనది, అది ఘోరమైన వ్యాధి కలది, దాని గ్రహించగలవాడెవడు?'[3] ఎటువంటి ఆశకు తావులేనప్పుడు సహా ఒకని హృదయం అతనికి ఆశను పుట్టించవచ్చు.

అజ్ఞానం: కాని నా మనస్సు నా జీవితం రెండూ ఏకీభవిస్తున్నాయి గనుక నా ఆశ స్థిరమైనది.

క్రైస్తవుడు: నీ మనస్సు నీ జీవితం ఏకీభవిస్తున్నాయని చెప్పడానికి ఏమి రుజువులున్నాయి?

అజ్ఞానం: నా హృదయం అలా చెప్తుంది.

క్రైస్తవుడు: నీ హృదయం అలా చెప్తుందా! దేవుని వాక్యము ఇచ్చే సాక్ష్యము తప్ప మరే ఇతర సాక్ష్యము చెల్లదు.

అజ్ఞానం: కాని మంచి తలంపులు వచ్చేది మంచి మనస్సుకే కదా? దేవుని ఆజ్ఞలను పాటించేదే మంచి జీవితం కాదా?

క్రైస్తవుడు: అవును వాస్తవమే కానీ, వీటన్నిటినీ కలిగివుండటం వేరు, వాటిని కలిగి ఉన్నాని అనుకోవడం వేరు.

అజ్ఞానం: దయచేసి నాకు ఈ విషయం చెప్పండి, బైబిల్ ప్రకారం మంచి తలంపులు ఏవి? మంచి జీవితమంటే ఎలా ఉంటుంది?

క్రైస్తవుడు: మంచి ఆలోచనలు అనేవి వివిధ రకాలున్నాయి. మనమీద మనకు సదభిప్రాయం కలిగి ఉండటం, దేవుని గురించిన తలంపులు, మానవాళి పట్ల మంచి తలంపులు కలిగి ఉండటం.

అజ్ఞానం: మనల్ని మనం గౌరవించుకొనే మంచి తలంపులంటే ఎలా ఉంటాయి?

క్రైస్తవుడు: దేవుని వాక్యానుసారమైన తలంపులు.

అజ్ఞానం: మన గురించిన తలంపులు దేవుని వాక్యంతో ఎప్పుడు ఏకీభవిస్తాయి?

2. సామెతలు 28:26 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8
3. యిర్మీయా 17:9

క్రైస్తవుడు: దేవుని వాక్యం మన మీద వెలువరించే తీర్పునే మనకు మనంగా విధించుకున్నప్పుడు. **ఉదా:** ప్రకృతి స్వభావము కలిగిన వారి గురించి దేవుని వాక్యం ఇలా చెప్తుంది.'నీతిమంతుడు లేడు, ఒక్కడునూ లేడు, మేలు చేయువాడెవడును లేడు ఒక్కడైనను లేడు.'[4]

అజ్ఞానం: నా హృదయం చెడ్డది అంటే నేనెప్పటికి నమ్మలేను. దేవుని గురించిన మంచి తలంపులంటే ఏవి?

క్రైస్తవుడు: మన గురించి నేను చెప్పిన విధంగానే: దేవుని గురించిన మన తలంపులు, ఆయన గురించి దేవుని వాక్యం ఏమి చెబుతుందో దానితో ఏకీభవించేవే మంచి తలంపులు. మన గురించి మనకు తెలిసినదాని కంటే ఆయనకే బాగా తెలుసునని మనలో మనకు ఏ పాపము కనపడనప్పటికీ ఆయన చూడగలడని మనం ఆలోచించినప్పుడు మనకు దేవుని గురించిన సరైన తలంపులు ఉన్నాయని చెప్పవచ్చు.

అజ్ఞానం: నేను చూడగలిగినదానికంటే దేవుడు ఎక్కువ చూడలేడని లేదా నా సొంత ప్రతిభను ఆధారం చేసుకొని దేవును యొద్దకు వచ్చే సాహసం చేయడానికి నేనేమైనా మూర్ఖుణ్ణి అనుకొన్నావా?

క్రైస్తవుడు: మరి ఈ విషయంలో నీవు ఏమనుకొంటున్నావ్?

అజ్ఞానం: నీతిమంతునిగా తీర్చబడటం కోసం నేను క్రీస్తునందు విశ్వాసం ఉంచాలని భావిస్తున్నాను.

క్రైస్తవుడు: నీకు ఆయన అవసరం ఉన్నదని గుర్తించలేని వాడివి క్రీస్తును విశ్వసించగలనని ఎలా ఊహించగలవ్? నీవు నీ సహజ పాపాలను గాని వాస్తవానికి నువ్వు చేసిన పాపాలను గాని చూడలేవు గాని రక్షకుని అవసరమే నీకు లేదన్నట్టుగా నువ్వు భావిస్తున్నావ్ అలాంటప్పుడు నీవు క్రీస్తును ఎలా నమ్మగలవ్?

అజ్ఞానం: నేను బాగానే నమ్ముతున్నాను. క్రీస్తు పాపుల కొరకు చనిపోయాడని ఆయన ధర్మశాస్త్రానికి నేను చూపే విధేయతను బట్టి నా శాపము నుంచి ఆయన కనికరము చేత నేను దేవుని ఎదుట నీతిమంతునిగా తీర్చబడతానని నమ్ముతాను. నా మత సంబంధమైన విధులను తండ్రి దృష్టికి అనుకూలమైనవిగా చేసి, ఆయన యోగ్యతను బట్టి, నేను ఆయన కుమారునికి చూపించే విధేయతను బట్టి నన్ను నీతిమంతునిగా తీర్చునని నేను నమ్ముతాను.

తప్పుడు విశ్వాసానికి నిజమైన విశ్వాసానికి గల వ్యత్యాసం

క్రైస్తవుడు: నీ విశ్వాసపు ఒప్పుకోలునకు ఈ విధంగా జవాబు చెప్పనివ్వు: మొదటిగా, నీవొక విపరీతమైన విశ్వాసం కలిగి ఉన్నావు. ఎందుకంటే అలాంటి విశ్వాసం గురించి బైబిల్లో ఎక్కడా వ్రాయబడలేదు. తరువాత, నీ విశ్వాసం తప్పుడు విశ్వాసం. ఎందుకంటే అది క్రీస్తు నీతిని స్వీకరించకుండానే ఆయన నీతి చేత నీతిమంతునిగా తీర్చబడాలని కోరుతుంది. నీ ఊహాజనితమైన నీతిని పట్టుకొని నీవు వ్రేలాడినంత వరకు ఆయన నీతిని నీవు తృణీకరిస్తూనే ఉంటావు. పైగా నీ

4. రోమా 3:10-12 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

నీతికి ఆధారమైన క్రీస్తు మరణాన్ని నీ విశ్వాసం అంగీకరించదు. దానికి బదులుగా నీవు ఆయనను ఒక మాదిరిగాను, నీ విశ్వాసాన్ని సమర్థించే వానిగాను పరిగణిస్తావు. ఇది లేఖనాల ఆధారం లేకుండా శరీరానుసారమైన మనస్సులో నుంచి పుట్టినదే. కాబట్టి నీ విశ్వాసం మోసకరమైనది, అది నిన్ను తీర్పు దినాన దేవుని ఉగ్రత కిందనే విడిచి పెడుతుంది. నీతిమంతునిగా తీర్చే నిజమైన విశ్వాసం ఆత్మ యొక్క నిజమైన పతనావస్తను గుర్తించేలా చేసి రక్షణ కొరకై క్రీస్తువద్దకు, ఆయన శిలువ యొద్దకు, ఆయన నీతి యొద్దకు పరిగెత్తేలా చేస్తుంది. ప్రజలు తన ధర్మశాస్త్రానికి చూపే విధేయతను ఆధారం చేసికొని వారిని అంగీకరించేందుకు ఆయన నీతి కేవలం ఒక మాదిరికరమైనదే కాదు. పాపులకు రావలసిన ఈ మరణం ఆయన భరించి ఆయన యందు విశ్వాసముంచిన వారిని నిర్దోషులుగాను విడుదల చేసి ఆయన నీతిని పొంది నీతిమంతులుగా తీర్చబడతారు. నిజమైన విశ్వాసం అంగీకరించే నీతి ఇదే. ఈ నీతి లేని ప్రతి ఆత్మ తీర్పుకు గురి అవుతుంది.

అజ్ఞానం: ఏమిటీ? మా ప్రమేయంలేకుండ క్రీస్తు తనంతట తానుగా చేసిన కార్యాన్ని మేము నమ్మాలా? ఈ దురభిమాన గర్వం మా శరీర కోరికలన్నిటిని ప్రోత్సహించి దేవుని ఆజ్ఞలను ఉల్లంఘించి మా ఇష్టానుసారంగా జీవించేలా చేస్తుంది. మేము చేసేదానితో సంబంధం లేకుండా క్రీస్తు మాకోసం చేసిన దాని ఆధారంగా మేము శాశ్వతంగా నీతిమంతులముగా తీర్చబడినప్పుడు ఇక మేమెలా జీవిస్తేమాత్రం ఏమవుతుంది?

క్రైస్తవుడు: నీకు సరైన పేరే పెట్టారనిపిస్తుంది. నువ్వు చెప్పిన సమాధానాన్ని బట్టే నువ్వు ఎంత అమాయకుడివో తెలిసిపోతుంది. నీతిమంతుడిగా తీర్చే విశ్వాసం అంటే ఏమిటి? దానియందు విశ్వాసం ఉంచటం ద్వారా ఆత్మకు కలిగే భద్రత ఏమిటి అనే విషయం నీకు తెలియదన్న సంగతి స్పష్టమవుతుంది. అవును, ఆత్మను రక్షించే విశ్వాసం యొక్క ఫలితాలేమిటో కూడా నీకు తెలియదు. ఆ విశ్వాసం ఒకని హృదయాన్ని మార్చి క్రీస్తు నందు దానిని దేవుని కొరకు గెలవడం ద్వారా ఆ వ్యక్తి దేవుని వాక్యాన్ని ఆయన నామాన్ని ఆయన మార్గాలను ఆయన సేవను ఆయన ప్రజలను ప్రేమించేలా చేస్తుంది.ఆ విధంగా విశ్వాసము ప్రేమ ఈ లోకంలో అత్యంత బలమైన ఎంతో కాలం నిలచి ఉండే సుగుణాలుగా నిలుస్తాయి. వాస్తవానికి అవి మానవ జీవితంలో కనిపించే దైవస్వభావం.

నిరీక్షణ: అతనికి ఎప్పుడైనా క్రీస్తు బయలుపరచబడ్డాడేమో అడిగి చూడు.

అజ్ఞానం: ఏమిటీ? మీరు ప్రత్యేకమైన ప్రత్యక్షతలను నమ్ముతారా? మీరు, మీ లాంటి వారు ఈ విషయాలపై మాట్లాడేదంతా కేవలం మతి తప్పిన మాటలే అని నాకనిపిస్తుంది.

నిరీక్షణ: లేదు నాయనా, దేవుని యందు క్రీస్తు ఎంతగా దాగి ఉన్నాడంటే తండ్రియైన దేవుడు ఆయనను బయలుపరిస్తే తప్ప ప్రకృతి సంబంధియైన మానవుడికి ఆయన గురించి ఏమియు తెలియదు.

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

అజ్ఞానం: అది మీ విశ్వాసం, కాని నేను మాత్రం నమ్మను. ఏది ఏమైనా మీకు కలిగినన్ని వింత ప్రత్యక్షతలు నాకు లేకపోయినా నా విశ్వాసం నీ అంత మంచి విశ్వాసమే అని నా అభిప్రాయం.

క్రైస్తవుడు: ఇంత గంభీరమైన విషయాన్ని ఇంత నిర్లక్ష్యంగా మాట్లాడకుడదు. తండ్రి బయలుపరిస్తేనే తప్ప ఎవడును యేసుక్రీస్తును ఎరుగడని నేను కూడా ఘంటాపథంగా చెప్పగలను.[5] క్రీస్తును పట్టుకొని ఉండే విశ్వాసం గురించి కూడా నేను అంతే గట్టిగా చెప్పగలను. నిజమైన విశ్వాసం అనేది దేవుని మహాశక్తి చేతనే పొందవలసి ఉంటుంది. కానీ ప్రియుడా, నీవైతే దాని విషయంలో పూర్తిగా అభాగ్యుడవనే చెప్పాలి. ప్రియమైన అజ్ఞానం, ఇప్పటికైనా మేలుకొని నీ దౌర్భాగ్యతను నీ మీదికి రానున్న శిక్షను చూచి రక్షణ కొరకై యేసు క్రీస్తు దగ్గరకు పారిపో. ఆయన నీతి ద్వారానే నీ మీదికి రానున్న ఉగ్రతనుంచి తప్పించుకోగలవు.

అజ్ఞానం వెనుకబడి పోవుట

అజ్ఞానం: వెళ్లిపోండి, మీరు నాకంటే చాలా వేగంగా నడుస్తున్నారు. నేను మీతో రాలేను. కావాలంటే మీరు వెళ్లిపోండి, నేనుతర్వాత వస్తాను.

అప్పుడు క్రైస్తవుడు, నిరీక్షణ ఒకరితో ఒకరు మాట్లాడుకుంటూ అజ్ఞానాన్ని వెనుక విడిచి ముందుకు సాగిపోయారు.

నిరీక్షణ: అయ్యో ఇలాంటి వాళ్లు మన పట్టణంలో ఎంతోమంది ఉన్నారు కుటుంబాలు కుటుంబాలే ఇతని వంటి స్థితిలోనే ఉన్నాయి; అవును వీధులకు వీధులే తమను తాము యాత్రికులుగా పిలుచుకునేవాళ్లున్నారు. యాత్రికులందరూ దాటి వెళ్లే మన ఊరిలోనే ఇంతమంది ఉంటే ఇక వీని ఊర్లో అలాంటి వాళ్లు ఎంత మంది ఉంటారో ఊహించగలవా?

క్రైస్తవుడు: అందుకే వాక్యం ఇలా సెలవిస్తుంది. 'వారు చూడకుండునట్లు వారి మనో నేత్రములకు గుడ్డితనము కలుగచేసెను' కాని అలాంటి వాళ్లను చూస్తే నీకు ఏమనిపిస్తుంది? వారిలో ఎప్పుడైనా పాపపు ఒప్పుదల, భవిష్యత్తును గురించిన భయం కలుగుతాయంటావా? ఇప్పుడు వారున్న స్థితి అపాయకర మైనదని వారు ఎప్పటికైనా ఊహించగలరంటావా?

నిరీక్షణ: నువ్వు నాకంటే పెద్దవాడివి. ఆ ప్రశ్నకు నాకంటే నీవే బాగా సమాధానం చెప్పగలవు.

క్రైస్తవుడు: బహుశా వారిలో కూడా అప్పుడప్పుడు పాపమును గూర్చిన ఒప్పుదల, భవిష్యత్తును గురించిన భయం కలుగవచ్చేమో కానీ అలాంటి భయం వారికి మేలు చేస్తుందని ఎరుగరు. కాబట్టి ఆ భయాన్ని తొక్కిపట్టడం కోసం శాయశక్తులా ప్రయత్నించి దాన్ని వారి మనస్సులో నుంచి తొలగించుకొని వారి అనుభూతులపై పట్టు సాధించామని తమను తాము పొగుడుకుంటుంటారు.

5. మత్తయి 11:27 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

నిరీక్షణ: భయమనేది ఒక వ్యక్తిని దేవుని ప్రణాళిక చొప్పున యాత్రకు ఉపక్రమించేలా చేస్తుందని నేను కూడా నమ్ముతాను.

క్రైస్తవుడు: అది సరైన భయమైతే నువ్వు చెప్పినదానిలో ఎలాంటి సందేహం లేదు. దేవుని వాక్యం ఇలా సెలవిస్తుంది: 'యెహోవాయందు భయభక్తులు గలిగియుండుటయే జ్ఞానమునకు మూలము.[6]'

నిరీక్షణ: సరైన భయం అని ఎలా నిర్ధారించగలం?

క్రైస్తవుడు: నిజమైన లేక నీతివంతమైన భయాన్ని మూడు విధాలుగా గుర్తించవచ్చు: అది పాపం విషయంలో లోతైన ఒప్పుదల కలిగిస్తుంది; పశ్చాత్తాపానికి క్రీస్తునందలి రక్షణార్థమైన విశ్వాసానికి నడిపిస్తుంది. దేవుని పట్ల ఆయన వాక్యము ఆయన మార్గాల పట్ల పవిత్రమైన భక్తిని కలుగచేసి హృదయాన్ని మృదువుగా ఉంచి ఒకని జీవితాన్ని క్రీస్తునకు దూరం కాకుండా, పరిశుద్ధాత్మను దుఃఖపరచకుండ, క్రీస్తు నామానికి అవమానం కలిగించకుండ లేక శత్రువు తనమీద నేరారోపణ చేయకుండ కాపాడుతుంది.

నిరీక్షణ: బాగా చెప్పావు. నీవు సత్యమే చెప్పావని నా నమ్మకం. ఇప్పుడు మనం ఈ మంత్రభూమిని పూర్తిగా దాటేశాం కదా?

క్రైస్తవుడు: ఏం ఈ సంభాషణను ఇక ఆపేద్దామనిపిస్తుందా?

నిరీక్షణ: అయ్యో లేదు లేదు. ఇప్పుడు మనం ఎక్కడ ఉన్నామో తెలుసుకోవాలన్నదే నా ఉద్దేశం.

క్రైస్తవుడు: మనం ఇంకా రెండు మైళ్లు దూరం వెళ్లాలి. అయితే మన సంభాషణ ఇంకా కొనసాగిద్దాం. ఇలాంటి పాపపు ఒప్పుదల కలిగించి భయాన్ని పుట్టించే అనుభవాలు వారి మేలుకోసమే అన్న సంగతి మన అజ్ఞానానికి తెలియదు; అందుకే వాళ్లు ఆ భయాలను తొలగించుకోడానికి ప్రయత్నిస్తారు.

నిరీక్షణ: వాటిని ఎలా తొలగించుకొంటారు?

క్రైస్తవుడు: ఇలాంటి భయాలు అపవాది మూలంగానే కలుగుతాయని (నిజానికి ఇవి దేవుని వలనే కలుగుతాయి) భావించటం వల్ల వారి మనస్సు ఎక్కడ చలించిపోతుందోనన్న భయంతో వాటిని చెడ్డవిగా భావించి అడ్డగిస్తారు. అలాంటి భయాలు విశ్వాసాన్ని చిన్నచూపు చూస్తాయని కూడా భావిస్తారు. (వాళ్లకు ఉన్నది ఊహలే తప్ప విశ్వాసం కాదు) అలాంటి వాళ్ల హృదయాలను కఠినపరచు కొంటారు. భయమనేది ఒక బలహీనతగాను, భయపడటం తప్పు అని భావిస్తారు. కాబట్టి వారిలో కలిగే ఒప్పుదల ఎంత యథార్థమైనది అయినప్పటికీ వారిలో అనవసరమైన ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకొంటారు. భయమనేది వారి సంతోషాన్ని, దయనీయమైన వారి స్వనీతిని పాడుచేస్తుందని భావిస్తారు; కనుక వారి శక్తినంతా కూడగట్టుకొని దాన్ని అడ్డగిస్తారు.

6. సామెతలు 9:10 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

నిరీక్షణ: ఆ విషయం నాకు కూడా కొంతవరకు తెలుసు. ఎందుకంటే ఒప్పుదలకు అర్థం తెలియకముందు నేనూ అలాగే భావించాను.

విశ్వాసములో వెనుకబడుటను గురించి చర్చించుట

క్రైస్తవుడు: ఓ పదేళ్ల క్రితం మీ ఊళ్లో తాత్కాలికుడు అనే మనిషి ఉండేవాడు, అతని గురించి నీకు తెలుసా?

నిరీక్షణ: ఎందుకు తెలియదు? అతడు నిజాయితీ అనే పట్టణానికి నాలుగు మైళ్ల దూరంలో ఉండే కృపారహితం అనే పట్టణంలో నివశించాడు. వెనుదిరుగు వాళ్ల ఇంటిప్రక్కనే ఉండేవాడనుకుంటాను.

క్రైస్తవుడు: అవును! ఒకసారి అతడు 'వెనుదిరుగు' వాళ్ల ఇంటిలోనే ఉన్నాడు. ఒకప్పుడు తాత్కాలికుడు దేవునితో సరైన సంబంధం గురించి ఎంతో చింతకలిగి వుండేవాడు. అప్పుడే తన పాపాల గురించి, పాపము వలన వచ్చు జీతం[7] గురించి అతడు కొంత జ్ఞానం సంపాదించాడనుకొంటాను.

నిరీక్షణ: నీ మాటలతో నేను ఏకీభవిస్తాను. అతడు మా ఇంటికి కేవలం మూడుమైళ్ల దూరంలోనే ఉండేవాడు. అతడు తరచూ కన్నీటిపర్యంతమవుతూ నా సలహాకోసం మా యింటికి వస్తుండేవాడు. అతనిమీద నాకు ఎంతో జాలి కలిగేది. అతడు నిజమైన విశ్వాసాన్నిపొంది క్రైస్తవుడిగా మారతాడని ఆశించేవాణ్ణి. కానీ ఇప్పుడు చూస్తున్నాం కదా, "ప్రభువా! ప్రభువా!" అని పిలిచే ప్రతివాడు పరలోకరాజ్యంలో చేరడని.

క్రైస్తవుడు: తాను యాత్రకు వెళ్లేందుకు సంకల్పించుకున్నానని ఒకసారి నాతో చెప్పాడు. అయితే, అకస్మాత్తుగా అతడు స్వీయరక్షణ అనేవాడితో పరిచయం ఏర్పరచుకొని, అక్కడినుంచి నాకు అపరిచితుడిగా మారిపోయాడు.

నిరీక్షణ: ఈ ఆకస్మిక మార్పుకు కారణమేంటి, చాలామంది ఇలా విశ్వాసంలో దిగజారిపోతారెందుకు?

క్రైస్తవుడు: అది చాలా మంచి ప్రశ్న. అందుకు కారణం ఏమైయుంటుందని నీకనిపిస్తోంది?

నిరీక్షణ: నా ఆలోచన ప్రకారం దానికి నాలుగు కారణాలున్నాయి:

మొదట, అలాంటివారి మనస్సాక్షి జాగృతం చేయబడినప్పటికీ వారి మనస్సులు మారవు. కాబట్టి వారి మనస్సులోనుంచి అపరాధభావం తొలగిపోగానే, సహజంగా వారు మరల తమ శరీరానుసారమైన పాత జీవితానికి మరలుతారు. వారిలో ఉండే అపరాధభావన వల్ల నరకమంటే భయపడతారు, ఆ నరకభయం మూలంగా వారిలో పరలోకం పట్ల ఆసక్తి కలుగుతుంది. అయితే ఆ అపరాధభావం పోగానే నరకం గురించిన భయం మటుమాయమవుతుంది, పరలోకం పట్ల

7. రోమా 6:23 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

వారి ఆసక్తి తగ్గిపోతుంది. ఆవిధంగా వారు అశాశ్వతమైన తమ లోకాశలవైపు పాతజీవితానికి తిరిగివెళతారు.

రెండవది, మనుష్యుల భయం వారిని బందీలుగా చేస్తుంది, "భయపడుట వలన మనుష్యులకు ఉరి వచ్చును"[8] నరకాగ్ని జ్వాలలు వారి చెవుల్లో మారుమ్రోగినంత కాలం పరలోకం గురించి చింతకలిగివుంటారు. అయితే ఆ భయం తొలగిపోగానే, వారి మనస్సు మారుతుంది; ఎలాగంటే, సమస్తం పోగొట్టుకునే పరిస్థితి తెచ్చుకోవడం లేదా అనివార్యమైన ఇబ్బందులు సృష్టించుకోవడం కన్నా కాస్త తెలివిగా ఆలోచించడం మంచిది అనుకుంటారు. కాబట్టి ఇలాంటి తలంపులను రానివ్వకుండ ఉండటం కోసం వారు లోకానుసారంగా ప్రవర్తించేందుకు మరల వెనక్కిపోతారు.

మూడవది, వారు గర్విష్టులు. క్రైస్తవమతం అల్పులకు, తిరస్కారానికి గురైనవాళ్లకే తగినది అని భావించేలా ఈ లోకపు గర్విష్టులు వారిని రెచ్చగొడతారు. ఫలితంగా వారు తమ అపరాధభావం తొలగిపోయి, నరకపు బాధలు మరిచిపోగానే తిరిగి వారి పాత మార్గంలో వెళ్లిపోతారు.

తర్వాత, ఈ అపరాధము, శిక్ష అనేవి వారికి భరించరానివిగా ఉంటాయి గనుక, వాటిని మరిచిపోయినట్టు నటించేందుకు ప్రయత్నిస్తారు. వారే గనుక నిజంగా తమ అపరాధాన్ని, భవిష్యత్తులో ఎదుర్కోబోయే శ్రమను యథార్థంగా ఎదుర్కొన్నట్లయితే అవి వారిని పాపక్షమాపణకు, సంతోషకరమైన విడుదలకు క్రీస్తు దగ్గరకు పరుగెత్తేలా చేసేవి. కానీ వారు తమ అపరాధం, శిక్షల గురించిన ఆలోచనలను తిరస్కరించడం ద్వారా దేవుని ఉగ్రత అనే భావాన్ని వదిలించు కుంటారు, సత్యానికి విరోధంగా తమ హృదయాలను మరింత కఠినపరచు కుంటారు.

క్రైస్తవుడు: ఇది సత్యానికి చాలా సమీపంగా ఉంది. ఏదిఏమైనా, వారి ప్రవర్తన వెనుక వారి మొండితనం ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. మొదట్లో వారు పశ్చాత్తాప పడినట్లు కనిపిస్తారు కానీ వారు న్యాయమూర్తి ఎదుట ఏడ్చే నేరస్తుని లాంటివారు. అతడు ఏడ్చేది తాను నేరం చేసినందుకు కాదు, పట్టుబడినందుకూ, ఫలితంగా శిక్ష అనుభవించవలసి వచ్చినందుకు. వాడికి స్వేచ్ఛనిస్తే, మరల ఓ దొంగగానో, నరహంతకుడిగానో మిగిలిపోతాడు. అదే అతని మనస్సు మారితే అతడు ఒక మంచి పౌరుడు కాగలడు.

నిరీక్షణ: వారు విశ్వాసంలో దిగజారిపోవడానికి కారణమేమిటో నేను చూపించాను. ఇప్పుడు నీవు వారు తమ విశ్వాసంలో ఎలా దిగజారిపోతారో చూపించు.

క్రైస్తవుడు: అది ఇలా ఉంటుంది: ముందుగా వారు దేవుని గురించి, మరణం రానున్న తీర్పు గురించిన వారి జ్ఞాపకాలను తొలగించుకోడానికి ప్రయత్నిస్తారు. ఆ తరువాత వ్యక్తిగత ప్రార్థన, శరీరాశలను తొలగించుకోవడం తమ ప్రవర్తనను బాగుగా చూసుకోవడం, పాపం చేసినందుకు చింతించడం లాంటి క్రమశిక్షణ విషయంలో నెమ్మదిగా దిగజారిపోతారు. తరువాత సహృదయులైన క్రైస్తవుల సహవాసాన్ని తిరస్కరిస్తారు. ఆ తరువాత దేవుని వాక్యాన్ని వినడం, చదవడం, కూటాలకు

8. సామెతలు 29:25 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

హాజరు కావడం వంటి బహిరంగ విధులను నిర్లక్ష్యం చేస్తారు. తరువాత క్రైస్తవులలో తప్పులు వెదకడం, భక్తుల జీవితాలలో (వారి బలహీనతలు ఏవో కనిపెట్టామని భావించడం) పొరపాట్లను వెతికి పట్టుకోవడం, శిష్యులకున్న మంచి పేరును చెడగొట్టి వారిపై బురద చల్లడం ఆరంభిస్తారు. నెమ్మదిగా లోకానుసారమైన దురలవాట్లు, చెడ్డమనస్సు కలిగిన వారితో సహవాసం చేయడం ఆరంభిస్తారు. రహస్యంగా శరీరానుసారమైన జారత్వపు అలవాట్లను పాటిస్తారు; నిజమైన విశ్వాసులుగా పిలువబడే వారిలో అలాంటి వాటి కోసం ప్రయత్నిస్తారు. తద్వారా వారే మాకు ఆదర్శం అని చెప్పుకుంటారు. దీని తరువాత వారు బహిరంగంగా పాపంతో ఆటలాడుకొంటారు. అటుతరువాత కఠినపరచబడిన వారై వారి నిజస్వరూపమైన దుష్టత్వాన్ని బయటపెట్టుకొంటారు. ఇక ఏదైనా కృపాసహితమైన అద్భుతం జరిగితే తప్ప వారి దయనీయమైన జీవితంలో కృంగిపోయి వారి మోసపు మార్గంలోనే నశించిపోవడం ఆరంభిస్తారు.

అధ్యాయం 11
దేవుని పట్టణానికి సమీపాన

బ్యూలా దేశంలో ఆనందంగా బసచేయుట

ఇప్పుడు నా కలలో యాత్రికులు మంత్రభూమిని దాటి బ్యూలాదేశంలో ప్రవేశించడం చూశాను. అక్కడ గాలి ఎంతో మధురంగా సత్తువనిచ్చేదిగా ఉంది. ఈ దేశంలో వారు కొంతసేపు విశ్రమించి సంతోషంగా గడిపారు. ఇక్కడ వారు పక్షుల కిల కిలా రావాలు విని ప్రతిచోట పువ్వులు వికసించటం చూశారు. ఆ దేశంలో వారు ఒక తాబేలు స్వరం కూడా విన్నారు. ఈ ప్రశాంతమైన దేశంలో ఏడాది పొడవునా సూర్యుడు ప్రకాశించాడు. ఇది గాఢాంధకారపు లోయకు బహుదూరంలో, నిరాశా రాక్షసుడికి అందనంత దూరంలో ఉంది. ఈ ప్రకాశవంతమైన భూమిలో సందేహపు మేడ ఉంటుందన్న ఊహకూడా ఎవరికీ రాదు. ఇక్కడ యాత్రికులు పవిత్రనగరానికి కనుచూపు మేరలోనే ఉన్నారు. ఈ ప్రాంతంలో ఆ నిత్యపట్టణానికి చెందిన వారిని కూడా కలిసారు. ఎందుకంటే బ్యూలాదేశంలో సామాన్యులతో పాటు దేవదూతలు కూడా కలిసి తిరిగేవారు. ఎందుకంటే ఇది పరలోకపు సరిహద్దులోనే ఉంది. ఈ దేశంలో వధూవరుల ప్రమాణాలు కూడా పునరుద్ధరించబడ్డాయి. ఇక్కడ వారికి ఏమేలూ కొదువలేదు. యాత్రికులు తమ ప్రయాణంలో ఆశించినవన్నీ సమృద్ధిగా ఉన్నాయి. పట్టణంలోనుంచి వారికి కొన్ని స్వరాలు వినిపించాయి, 'సీయోను కుమార్తెలతో ఇలాగు చెప్పుడి ఇదిగో నీ రాజు వచ్చుచున్నాడు, ఆయన చేతిలో ఆయన బహుమానము ఉన్నది.' ఆ దేశపు నివాసులందరు యాత్రికులను 'పరిశుద్ధ జనము, ప్రభువు చేత విమోచింపబడిన వారు అని పిలిచారు.' ఆ దేశంలో సంచరిస్తుండగా ఇంతకుమునుపెన్నడూ ఎరుగని సంతోషాన్ని అనుభవించారు. వారు వెళుతున్న రాజ్యాన్ని సమీపిస్తుండగా ఆపట్టణం వారికి మరింత తేటగా కనిపించింది. ఆ పట్టణం ముత్యాలతోను, రత్నాలతోను కట్టబడినదై దాని వీధులు సువర్ణ మయముగా ఉన్నాయి. ఆ పట్టణపు సహజమహిమను బట్టి దాని మీద ప్రసరించే సూర్యకిరణాలను బట్టి క్రైస్తవుడు ఒకింత అస్వస్థతకు గురయ్యాడు. నిరీక్షణ కూడా ఒకవిధమైన అసంతృప్తికి గురయ్యాడు. అందుచేత కొన్ని దినాలు ఆగిపోయి వారి హృదయవేదనను బట్టి రోధిస్తూ ఉండిపోయారు. 'మీరు నా ప్రియుని చూచిన ఎడల ప్రేమతో విరహ వేదన అనుభవిస్తున్నానని చెప్పండి.' అన్నారు.

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

అయితే వారు మరింత కృపను పొంది తమ మార్గంలో ముందుకు వెళ్లగలిగారు. వారు వెలుగు ద్వారాల వద్దకు సమీపిస్తుండగా పూలతోటలు, ద్రాక్షావనాలు, అందమైన వనాలు కనిపించాయి. వీటి గుమ్మాలు రాజమార్గం వైపు తెరచి ఉన్నాయి. ఒక గుమ్మంలో నిలబడిన తోటమాలిని ఇలా అడిగారు 'ఈ ద్రాక్షావనాలు, అందమైన తోటలు ఎవరివి?' ఇవి రాజుగారివి. ఆయన తన ఆనందంకోసం యాత్రికుల సుఖంకోసం ఆయనే నాటించాడని బదులిచ్చాడు తోటమాలి. అప్పుడు ఆ తోటమాలి వారిని ద్రాక్షావనంలోకి ఆహ్వానించి రుచికరమైన ద్రాక్షలను తినమని చెప్పాడు. రాజుగారి విరామ స్థలాలను కూడా వారికి చూపించాడు. అక్కడ వారు ఆగి కొంతసేపు నిద్రించారు.

నిద్రలోకూడా వారు చాలా మాట్లాడుతూనే ఉన్నారు. అలా ఎందుకు జరుగుతుంది అని నేను తోటమాలిని అడుగగా అతడు ఇలా బదులిచ్చాడు. యాత్రికులు తమ నిద్రలో అంతగా మాట్లాడటం చూసి ఆశ్చర్యపోతున్నావా? వారు సంతోషంగా ఉన్నారు. ఈ ద్రాక్షపండ్లు అలాంటివి. వాటిని తిన్నవారు సంతృప్తి చెంది నిద్రలో కూడా మాట్లాడేలా చేస్తాయి.

వారు మేల్కొన్న తరువాత పరలోక పట్టణానికి వెళ్లేందుకు వారు సిద్ధంగా ఉన్నట్టు నా కలలో చూశాను. ఏది ఏమైనా శుద్ధమైన బంగారంతో[1] కట్టబడిన ఆ పట్టణం మీద సూర్యకాంతి ప్రతిబింబించినప్పుడు వారు తమ సహజ నేత్రాలతో నేరుగా దానిని చూడలేకపోయారు. దానిని చూసేందుకే తయారు చేయబడిన అద్దాలను ఉపయోగించవలసి వచ్చింది. వారలా ముందుకుసాగి వెళుతుండగా బంగారపు వస్త్రాలను ధరించి దేదీప్యమానంగా వెలుగొందుతున్న ముఖాలు కలిగిన ఇద్దరు వ్యక్తులను కలిసారు.

మీరు ఎక్కడినుంచి వస్తున్నారు మార్గంలో ఎక్కడ విశ్రమించారు, ఎలాంటి ఆశీర్వాదాలు, ఆనందాలు, అనుభవించారు దారిలో ఎలాంటి కష్టాలు ఎదురయ్యాయి మొదలైన వివరాలు చెప్పమని యాత్రికులను అడిగారు. క్రైస్తవుడు, నిరీక్షణ తమ అనుభవాలను వారికి వివరించారు. అప్పుడు ప్రకాశిస్తున్నవారు ఇలా చెప్పారు 'మీరు జయించవలసిన మరో రెండు కష్టాలు ఉన్నాయి. ఆ తరువాత మీరు పట్టణంలో ప్రవేశిస్తారు.'

తమతో పాటు రమ్మని క్రైస్తవుడు ఆ ఇద్దరిని ఆహ్వానించాడు. మేము రాగలము కాని మీరు మీ సొంత విశ్వాసంతోనే ముందుకు వెళ్లాలి అన్నారు వారు. అప్పుడు నా కలలో వారందరు కలిసి గుమ్మం కనిపించే వరకు నడిచి వెళ్లడం చూశాను.

మరణపు నదిని దాటుట

వారికీ గుమ్మానికి మధ్య ఒక చల్లని లోతైన నది ఒకటి ఉంది. దానికి వంతెన లేదు. ఆ నదిని చూడటంతో యాత్రికుల ముఖాలు పాలిపోయి మౌనంగా నిలబడి పోయారు. ఆ ఇద్దరు వారిని చూచి 'మీరు ఈ నదిని దాటి వెళ్లవలసిందే లేదంటే ఎప్పటికీ గుమ్మాన్ని చేరలేరు.

1. ప్రకటన 21:18 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

'మరో మార్గంలేదా?' అడిగారు వాళ్లు.

'ఉంది కానీ భూమికి పునాదులు వేసినప్పటి నుండి కేవలం హనోకు, ఏలియా అనే ఇద్దరు మాత్రమే ఆ మార్గాన వెళ్లేందుకు అనుమతించబడ్డారు తప్ప క్రీస్తు మరలా వచ్చే వరకు మరెవరికీ అనుమతిలేదు.'

ఇక చేసేదేమీ లేక ముందుకు వెళ్లడానికి సమ్మతించారు. నీళ్లలో ప్రవేశించగానే క్రైస్తవుడు మునిగిపోసాగాడు. తన మంచి మిత్రుడైన నిరీక్షణ్‌ను చూసి ఇలా కేక వేశాడు 'నేను అగాధ జలములలో మునిగిపోతున్నాను ప్రవాహములు నా మీదుగా పొర్లి ప్రవహిస్తున్నాయి. ఆయన అలలు నా తలమీద కొట్టబడుతున్నాయి.'

'ధైర్యంగా ఉండు, నేను నది అడుగు భాగాన చేరాను అంతా బాగానే ఉంది' అన్నాడు నిరీక్షణ.

అప్పుడు క్రైస్తవుడు 'అయ్యో మిత్రమా! మరణపు దుఃఖములు నన్ను ఆవరించియున్నవి ఇక నేనెప్పటికీ ఆ ఆనంద దేశాన్ని చూడలేను' అన్నాడు. అప్పుడొక భయంకరమైన భీతి, చీకటి క్రైస్తవుడిని ఆవరించడంతో తన ముందు ఏముందో అతడు చూడలేక పోయాడు, తన చుట్టూ ఏమి జరుగుతుందో చాలా వరకు గమనించలేకపోయాడు. తన యాత్రాజీవితంలో అతడు అనుభవించిన మేళ్లను అతడు గుర్తుచేసుకోలేక పోయాడు వాటిని సరిగ్గా వివరించలేక పోయాడు. అయితే అతడు పలికిన మాటల ద్వారా తెలిసిన విషయం ఏమిటంటే అందమైన ఆ గుమ్మాన్ని చేరక మునుపే ఈ నదిలో చనిపోతానేమోనని బాగా భయపడ్డాడు. తాను యాత్రికుడుగా మారక మునుపు, ఆ తరువాత అతడు చేసిన పాపాల విషయమై అతడు చింతిస్తున్నాడని తన చుట్టూ ఉన్నవారు గ్రహించారు. అంతే కాకుండ తన అపస్మారక స్థితిలో కలవరించడం చూసిన వారు అతడు దురాత్మలను, దయ్యాలను కలలో చూస్తున్నాడని కూడా ఊహించారు.

అందుచేత తన మిత్రుడి తల నీటికి పైగా ఉండేటట్లు చేయటానికి నిరీక్షణ అన్ని విధాల ప్రయత్నించాడు. కొన్నిసార్లు ఓ క్షణం పాటు కిందికి వెళ్లేవాడు. మరుక్షణం సగం చచ్చినవాని వలే పైకి తేలేవాడు. నిరీక్షణ్ అతన్ని ఆదరించేందుకు ప్రయత్నిస్తూ, 'సోదరా నాకు గుమ్మం కనిపిస్తోంది, మనల్ని స్వీకరించటానికి పరిశుద్ధులంతా నిలబడి ఉండటం నేను చూస్తున్నాను.' అన్నాడు.

అయితే క్రైస్తవుడు 'నీకోసమే, వాళ్లు ఎదురు చూస్తున్నది నీ కోసమే, నిన్ను కలిసినప్పటి నుంచి చూస్తున్నాను నీవు ఎంతో నిరీక్షణ కలవాడవు' అన్నాడు.

'నీవు కూడా నిరీక్షణతోనే ఉన్నావు' అంటూ నిరీక్షణ బదులు చెప్తున్నాడు.

'అయ్యో లేదు సోదరా, నేను సరైన వాడనైతే క్రీస్తు యేసు వచ్చి ఇప్పుడు నన్ను కాపాడేవాడు.

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

కానీ నా పాపాలను బట్టి ఆయన నన్ను ఈ ఉరిలోనికి తెచ్చి విడిచిపెట్టాడు.' అన్నది క్రైస్తవుని జవాబు.

అప్పుడు నిరీక్షణ ఇలా అన్నాడు "సోదరా, దుష్టులగురించి చెప్పబడిన మాటలను నీవు పూర్తిగా మర్చిపోయావు. 'మరణమందు వారికి యాతనలు లేవు, వారు పుష్టిగా ఉన్నారు ఇతరులకు కలుగు ఇబ్బందులు వారికి కలుగవు ఇతరులకు పుట్టునట్లు వారికి తెగులు పుట్టదు.'[2] ఈ నీటిలో నీవు అనుభవిస్తున్న ఇబ్బందులు, యాతనలు దేవుడు నిన్ను మరిచి పోయాడనడానికి సూచనలు కావు. అవి నీకు సంభవించడానికి కారణం గతంలో ఆయన మంచితనం ద్వారా నీవు పొందినవాటిని నీకు గుర్తుచేసి, ఇప్పుడు నీ ఇబ్బందిలో కూడా ఆయనను నమ్మవచ్చునని నీకు చెప్పడానికే."

'ధైర్యముగా ఉండుము! యేసుక్రీస్తు నిన్ను సంపూర్ణునిగా చేయును' అన్న నిరీక్షణ్ మాటలతో క్రైస్తవుడు ఒక క్షణం ఆలోచనలో పడ్డాడు.

అప్పుడు క్రైస్తవుడు గొంతెత్తి ఇలా పలికాడు, "ఆహా నేను ఆయనను మరలా చూస్తున్నాను, 'నీవు జలములలోబడి దాటునప్పుడు... అవి నీ మీద పొర్లిపారవు"[3] అని చెప్తున్నాడు. అప్పుడు వాళ్లిద్దరు ధైర్యం తెచ్చుకొన్నారు. ఆ తరువాత శత్రువు బండరాయిలా నిలిచిపోయాడు. క్రైస్తవుడు త్వరలోనే గట్టి నేలమీద నిలబడ్డాడు. తక్కిన నది అంతా లోతులేకుండా ఉంది.

అవతలి తీరానికి చేరుకొని, ఒడ్డుమీద తమ కోసం ప్రకాశిస్తున్న ఆ ఇద్దరు వ్యక్తులు ఎదురు చూడడం గమనించారు. యాత్రికులు నీటిలోనుండి బయటికి వచ్చిన తరువాత ఆ ఇద్దరు దేవదూతలు వారికి నమస్కరించి, "మేము రక్షణయను స్వాస్థ్యము పొందబోవు వారికి పరిచారము చేయుటకై పంపబడిన సేవకులైన ఆత్మలము"[4] అన్నారు.

ఇప్పుడు వారందరు కలిసి గుమ్మం వైపు కదిలారు. ఆ పట్టణం ఒక గొప్ప కొండమీద కట్టబడినదైనప్పటికీ యాత్రికులు సునాయాసంగా ఆ కొండను ఎక్కారు. దేవదూతలు ఇరువురు వారిని చేయిపట్టి నడిపించడమే కాక మృతతుల్యమైన వారి దుస్తులు ఆ నదిలో విడిచి పెట్టబడటంతో వారు కొండను తేలికగా ఎక్కగలిగారు. ఆ పట్టణం భూమి మీద ఉండే మేఘాలకంటే ఉన్నతమైన పునాదులపై ఉన్నప్పటికీ వారు చాలా వేగంగా కొండమీదికి ఎక్కారు. ఒకరితో ఒకరు సంభాషించుకొంటూ గాలిలో తేలిపోతూ క్షేమంగా నదిని దాటినందుకు, అద్భుతమైన సహచరులు తోడుగా ఉన్నందుకు వారు ఎంతో ఆనందించారు.

వారి సంభాషణ అంతా ఆ స్థలం యొక్క మహిమ గురించే. ప్రకాశించేవారు దానిని చెప్పశక్యము కానిది అన్నారు. "అక్కడ పరలోకపు యెరూషలేము అనబడే సీయోను పర్వతమున్నది, వేవేలకొలది దేవదూతలున్నారు, సంపూర్ణ సిద్ధిపొందిన నీతిమంతుల ఆత్మలున్నాయి.[5] ఇప్పుడు మీరు వెళ్తున్నది దేవుని పరదైశునకు. అక్కడ మీరు జీవవృక్షమును చూసి, నిత్యమూ కాపుకాసే ఆ చెట్టు ఫలాలను

2. కీర్తనలు 73:4-5 4. హెబ్రీయులకు 1:14 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8
3. యెషయా 43:2 5. హెబ్రీయులకు 12:22-23

భుజిస్తారు. మీరు అక్కడికి వచ్చినప్పుడు తెల్లని అంగీలు ధరించి, ప్రతిరోజూ, నిత్యత్వమంతటా మహారాజుతో మాట్లాడుతూ ఉంటారు. అక్కడ మీరు భూమిమీద చూచిన దుఃఖాలు, వ్యాధులు, బాధలు, మరణాలను ఇక ఎన్నడూ చూడరు. ఎందుకటే "మొదటి సంగతులు గతించిపోయినవి"[6] అని ఆ దేవదూతలు వారికి చెప్పారు.

"పరిశుద్ధ పట్టణంలో మేము ఏం చెయ్యాలి?" అని యాత్రికులు అడిగారు.

"అక్కడ మీరు మీ శ్రమ అంతటికీ బహుమతులు పొందాలి, మీ దుఃఖాలన్నీ పోయి ఆనందాలను పొందాలి. మీరు విత్తినదానిని కోయాలి– అనగా మీ ప్రార్థనకు, కన్నీళ్లకు, మార్గంలో రాజుకోసం మీరు పొందిన శ్రమలకు ఫలాలు పొందాలి.[7] మీ శరీరపు పాపస్థితిని బట్టి ఎన్నో సమస్యలు ఎదురైనప్పటికీ లోకంలో ఎంతో నమ్మకంగా మీరు సేవచెయ్యాలని ఆశించినవానిని స్తుతి స్తోత్రములతో సేవించాలి. మీరు మహిమ కిరీటాలు ధరిస్తారు, దేవుని సన్నిధిని, ఆయన సౌందర్యాన్ని అనుభవిస్తారు. ఆయన ఉన్నట్టుగానే ఆయనను చూస్తారు.[8] అక్కడ మీ స్నేహితులను కలుస్తారు, మీకంటే ముందుగా ఆ సంతోషస్థితికి చేరుకున్నవారిని, లోకంలో మీ మాటలు నమ్మి, మీ మాదిరిని అనుసరించిన వారిని, మీరు చూపిన ప్రభావాన్ని బట్టి మహిమలోకంలోనికి వచ్చినవారిని అందర్నీ కలుస్తారు. అక్కడ మీరు మహిమ వస్త్రములు ధరించి, మహిమరాజుతో బంగారు రథాలలో స్వారీచేస్తారు. "

"బూరధ్వనితో యేసు క్రీస్తు భూమిమీదికి తిరిగివచ్చునప్పుడు మీరు ఆకాశపు మేఘారూఢులై ఆయనతో పాటు వస్తారు. జనములకు తీర్పు తీరుస్తూ ఆయన తన మహిమ సింహాసనంపై కూర్చుని దేవదూతలైనా, మనుష్యులైనా, అతిక్రమము చేయువారందరిపై తీర్పును వెలువరిస్తున్నప్పుడు[9] మీరు కూడ ఆయనతోపాటు కూర్చొని, తీర్పులో మీ స్వరము కూడ వినిపించే అవకాశం పొందుతారు, ఎందుకంటే వారు మీకు కూడ శత్రువులే. మరియు ఆయన తిరిగి తన పట్టణానికి వచ్చునప్పుడు మీరు కూడ బూరధ్వనితో ఆయనతో కలిసి వచ్చి, ప్రభువుతో సదాకాలము జీవిస్తారు."

వారు గుమ్మానికి దగ్గరైనప్పుడు, వారిని పరలోకపు సైన్య సమూహములు కలిశాయి. వారిని పరిచయం చేస్తూ ప్రకాశించే దేవదూతలు ఇలా చెప్పారు. "వీరు లోకంలో ఉండగా ప్రభువును ప్రేమించి, ఆయన సేవకొరకు సమస్తమును విడిచిపెట్టినవారు. వారిని తీసుకురమ్మని ప్రభువు మమ్మల్ని పంపించాడు. వారిని ఇంతవరకు నడిపించాము, ఇకవారు లోనికివెళ్లి రాజును చూడటమే తరువాయి." ఆ పరలోక సమూహము సంతోషకరమైన హల్లెలూయ చెపుతూ, "గొఱ్ఱెపిల్ల పెండ్లి విందుకు పిలువబడినవారు ధన్యులు"[10] అని పలికారు. పరలోక సంగీతంతో యాత్రికులను ఆహ్వానించేందుకు రాజుగారి అనేకమంది బూరలు ఊదువారు వచ్చారు. అప్పుడు వారందరూ కలిసి గుమ్మం వద్దకు నడిచివెళ్లారు.

6. ప్రకటన 21:1-4
7. మత్తయి 5:12; 1కొరింథీయులకు 3:8; ప్రకటన 22:12
8. యోహాను 3:2
9. మత్తయి 25:31-41; యూదా 14-15
10. ప్రకటన 19:9

పట్టణంలోనికి తీసుకెళ్లే గుమ్మంవద్దకు వారు వచ్చినప్పుడు దానిమీద సువర్ణాక్షరాలతో ఈ మాటలు వ్రాయబడివుండటం చూశారు: **"జీవవృక్షమునకు హక్కుగలవారై, గుమ్ములగుండ ఆ పట్టణములోని ప్రవేశించునట్లు తమ వస్త్రములను ఉదుకుకొనువారు ధన్యులు."**[11]

పరలోక పట్టణంలో ప్రవేశించుట

యాత్రికులు తమ అనుమతి పత్రాలను ద్వారపాలకునికి అందించగా వారు లోనికి ప్రవేశించుటకు అనుమతించబడ్డారు. బంగారంలా తెల్లగా మెరిసే కొత్త బట్టలు వారికి ఇవ్వబడినాయి. దేవుని స్తుతించి మహిమపరుచడానికి సితారలు, కిరీటాలను వారికి ఇచ్చారు. అప్పుడు పరలోకపు గంటలన్నీ ఆనందంతో మారు మ్రోగాయి. వారిలో ఒకడు ఇలా అన్నాడు "మీ ప్రభువు ఆనందంలో ప్రవేశించుడి, అప్పుడు అక్కడున్న గొప్ప సమూహమంతా కలిసి గంభీరమైన స్వరములతో 'సింహాసనాసీనుడై యున్న వానికిని గొఱ్ఱెపిల్లకును స్తోత్రమును ఘనతయు మహిమయు ప్రభావమును యుగయుగములు కలుగును గాక!"[12] అంటూ కీర్తించారు.

వారిని లోనికి అనుమతిస్తూ ద్వారము తెరుచుకొంటుండగా పరలోకంలోని మహిమను నేను క్షణమాత్రం చూడగలిగాను. ఆ పట్టణమంతా సూర్యునివలే ప్రకాశించింది. వీధులన్నీ బంగారముతో కప్పబడి ఉన్నాయి. ఆ బంగారు వీధుల్లో నడిచిన వారి వస్త్రాలు నేను ఇంతకు మునుపు చూడనంత దివ్యంగా వెలిగిపోతున్నాయి. కొందరు రాజులవలే కిరీటాలు ధరించారు, కొందరు తమ చేతుల్లో సితారలు లేక తాటి ఆకులు పట్టుకొని ఉన్నారు. మరికొందరు అందమైన రెక్కలు కలిగి ఉన్నారు. వారు ఎగురుటకు ఇష్టపడినప్పుడు మాత్రమే అవి కనిపిస్తున్నాయి. "సర్వశక్తిగల దేవుడైన యెహోవా పరిశుద్ధుడు, పరిశుద్ధుడు" అని వారు దేవుని స్తుతించడం ఆరంభించగానే ఆ గుమ్మం మూసివేయబడింది.

అజ్ఞానికి ప్రవేశం నిరాకరించబడుట

ఈ విషయాలన్నిటినీ నేను తేరి చూస్తుండగా నా కలలో అజ్ఞాని నది వద్దకు రావడం నేను చూశాను. అతడు త్వరలోనే ఎటువంటి ఇబ్బందీ లేకుండా తక్కిన ఇద్దరు అనుభవించిన కష్టాలేవీ లేకుండానే నదిని దాటేశాడు. ఎలాగంటే అక్కడ వ్యర్థ నిరీక్షణ అనేవాడు అతనికి సహాయం చేసి తన పడవలో నది ఒడ్డుకు చేర్చాడు. అప్పుడతడు కొండను ఎక్కిరావడం చూశాను. కానీ అతడు ఒంటరిగా ఉన్నాడు. గుమ్మం దగ్గర అతన్ని కలిసేందుకు ఎవరూ లేరు. గుమ్మం మీద ఉన్న ఒక సూచనను చదివి తలుపు తట్టడం ఆరంభించాడు. అప్పుడు లోపల నుండి ఒక స్వరం ఇలా అడగటం నేను విన్నాను, "ఎవరు నువ్వు? ఎక్కడ నుంచి వచ్చావు? నీకు ఏం కావాలి?" అందుకు జవాబుగా అతడు "ప్రభూ నీ సన్నిధిలో నేను తిని త్రాగాను, మా వీధుల్లో నీవు మాకు బోధించావు" అన్నాడు. లోపల ఉన్న ద్వారపాలకుడు అనుమతి పత్రం చూపించమన్నప్పుడు అజ్ఞాని మౌనం

11. ప్రకటన 22:14 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8
12. ప్రకటన 5:13

వహించాడు. "నీకు అనుమతి పత్రం లేదా?" అని ఆడిగిన ద్వారపాలకుని ప్రశ్నకు అజ్ఞాని జవాబు చెప్పలేక పోయాడు.

అప్పుడు రాజుచేత ఆదేశించబడినవారై ప్రకాశించే ఇద్దరు బయటికి వచ్చి అజ్ఞాని కాళ్లు, చేతులు కట్టివేసి గాలిలో అతన్ని తీసుకువెళ్లి మనోహర పర్వతాలకు ప్రక్కన ఉన్న ఒక చీకటి ద్వారం దగ్గర విడిచి ఆ తలుపు మూసివేశారు.అతన్ని పరమపురిలోనికి ఎందుకు అనుమతించలేదు అని నేను దేవదూతల్ని అడుగగా వారు ఇలా చెప్పారు, "అతని పేరు జీవగ్రంథములో వ్రాయబడినట్లు కనబడలేదు.[13] మరియు తన అనుమతి పత్రం లేదు[14]." అప్పుడు నాకు తెలిసింది నాశనపురం నుండి ఉన్నట్టే పరలోకద్వారాల నుంచి కూడా నరకానికి మార్గం ఉందని.

అప్పుడు నాకు మెలుకువ రాగా, నేను చూచినదంతా ఒక కల అని నాకు అర్థమైంది.

13. ప్రకటన 20:15 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8
14. 1యోహాను 5:10

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

రెండవ భాగము

క్రిస్టియానా ప్రయాణం

ఉచిత పంపిణీకి మాత్రమే
For Free Distribution Only

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

అధ్యాయం 12
క్రిస్టియానా క్రైస్తవుడిని అనుసరించుట

యాత్రికుడైన క్రైస్తవుడి గురించి, ఈ లోకపు అరణ్యముగుండా పరలోక పట్టణానికి అతడు చేపట్టిన ప్రమాదకరమైన ప్రయాణం గురించి నీకు చెప్పిన కొద్దిసేపటి తరువాత అతని కుటుంబం గురించి–అతని భార్యయైన క్రిస్టియానా, అతని నలుగురు కుమారుల గురించి నేనొక కలగన్నాను. క్రైస్తవుని యాత్రాజీవితానికి సంబంధించిన పిలుపును ఆమె ఎంత బలంగా వ్యతిరేకించింది, కలత చెందిన అతని ఆత్మను మనోదుఃఖముగా ఎంచినందుకు అతడు ఇల్లు వదిలి వెళ్లడానికి ముందు ఆమె అతని పట్ల ఎంత మొరటుగా ప్రవర్తించింది నాకు బాగా గుర్తుంది.

ఓ అపరిచిత సందర్శకుడు ఒక లేఖను తెచ్చుట

ఇప్పుడు నా కలలో క్రైస్తవుడు వెళ్లిపోయిన తరువాత క్రిస్టియానా తన పాపపు స్థితిని గురించి, తన భర్తతో తను వ్యవహరించిన తీరు గురించి బాధపడటం నేను చూశాను. ఒకరోజు ఉదయాన్నే తన కుటుంబంతో కలిసి ప్రార్థనచేసి (ధ్యానసముద్రలో ఉండి) ఇల్లు ఊడ్చుకుంటూ ఉండగా ఎవరో తలుపు తట్టిన శబ్దం వినపడింది. అందుకు జవాబుగా ఆమె "నీవు దేవుని పేరిట వచ్చినవాడవైతే లోపలికిరా" అని పిలిచింది.

ఆమేన్! అనే శబ్దం ప్రతిధ్వనిస్తుండగా ఒక కొత్తవ్యక్తి గదిలోకి ప్రవేశించాడు. "ఈ ఇంటికి సమాధానం కలుగు గాక! నా పేరు రహస్యం" అని తనను తాను పరిచయం చేసుకొన్నాడు. "క్రైస్తవుడు వెళ్లిన పట్టణంలోనే నేను నివసిస్తుంటాను. నీవు కూడా అక్కడికి వెళ్లాలని అశిస్తున్నట్టు మా ఊరిలో వాళ్లంతా చెప్పుకొంటున్నారు. నీ భర్త విషయంలో నీవు ప్రవర్తించిన తీరు గురించి, అతని మంచి జీవితానికి నీవు ఎంతగా వ్యతిరేకమయ్యావో, నిత్యమార్గం గురించి నీ పిల్లలకు తెలియకుండ చేసిన విధానం గురించి నీవు బాధపడుతున్నావని కూడా తెలిసింది. కరుణామయుడైన క్రీస్తు క్షమించడానికి సిద్ధమనస్సుగల దేవుడని నేరములకు క్షమాభిక్ష పెట్టడంలో ఆయన ఎంతో ఆనందిస్తాడని నీకు చెప్పడానికే నన్ను ఇక్కడకు పంపించాడు. తన ఇంటిలోనికి తన బల్లవద్దకు రమ్మని ఆయన నిన్ను ఆహ్వానిస్తున్నాడు. నీకు నీ కుటుంబానికి నీ స్నేహితులకు తన రాజ్యంలోని మంచి సంగతులన్నీ అనుగ్రహిస్తానని వాగ్దానం చేస్తున్నాడు. క్రిస్టియానా, అక్కడ వేలాది మంది సహచరులతో నీ భర్త నీకోసం ఎదురు చూస్తున్నాడు. నీవు అక్కడికి చేరుకొన్నప్పుడు చెప్పశక్యంకాని సంతోషంతో వారందరు ఆనందిస్తారు".

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

ఇది విన్న క్రిస్టియానా ఎంతగానో చలించిపోయింది.

ఈ కొత్త సందర్శకుడు మరో విషయంకూడా చెప్పాడు, "నీ భర్తగారి రాజునుంచి నీకు వచ్చిన ఉత్తరం ఇదిగో". ఆమె ఆశ్చర్యపోయింది. ఇది నిజంగా వాస్తవమేనా? ఆమె ఉత్తరం తెరిచి చూసినప్పుడు అది సువర్ణాక్షరాలతో రాయబడి ఉండటం చూసింది. శ్రేష్ఠమైన అత్తరు వాసన ఆమె గుర్తించింది ఆ ఉత్తరం చదవడం ద్వారా తనకొక విషయం అర్థమైంది. తన భర్త చేసినట్టుగానే ఆమెకూడా ఆ పట్టణానికి వెళ్లి అక్కడ నివసించాలన్నది రాజుగారి కోరిక అని గ్రహించింది.

ఆ తలంపుతో ఎంతగానో చలించిన ఆమె ఇలా వేడుకొంది, " అయ్యా! నన్ను నా పిల్లలను అద్భుతమైన ఈ రాజుగారు దగ్గరకు తీసుకెళతావా? నా భర్తయైన క్రైస్తవునితో కలిసి నిత్యత్వమంతా ఆయనకు సేవ చేసుకొనే భాగ్యం మాకు కల్పిస్తావా?"

అందుకు ఆ సందర్శకుడు ఇలా చెప్పాడు: "క్రిస్టియానా, తీపికి ముందు చేదు అనుభవం ఎదురవుతుంది. కనుక ఆ పరమపురికి చేరాలంటే నీ భర్తవలే నీవుకూడా ఎన్నో శ్రమలు[1] అనుభవించవలసి ఉంటుంది. కాబట్టి క్రైస్తవుడిలాగే నీవు కూడా అక్కడ ఆ మైదానంలో ఉన్న దిడ్డిగుమ్మం వద్దకు వెళ్లు. దేవుని పట్టణానికి వెళ్లే మార్గాన్ని చూపించడానికి ఆ ద్వారం తెరుచుకొంటుంది. నీవు అక్కడికి త్వరగా వెళ్లాలని నేను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. మీరు పట్టణపు ద్వారాన్ని చేరే వరకు ఈ ఉత్తరాన్ని నీ దగ్గర ఉంచుకొని దానిని మీ పిల్లలకు చదివి వినిపించాలని కూడా గుర్తుంచుకో. ఈ మట్టి దేహంలో ఉన్నంత కాలం ఈ యాత్రా గృహంలో నీవు పాడుకొనే పాటల్లో ఇది ఒకటి. పైగా ఆ పట్టణపు ద్వారం దగ్గర దీనినే అనుమతి పత్రంగా చూపించాలి."

అందుచేత క్రిస్టియానా తన కుమారులను పిలిచి వారితో ఈ మాటలు చెప్పింది: "నా ప్రియమైన పిల్లలారా, మీకు తెలుసు కదా, మీ నాన్నగారి మరణం గురించిన భారం ఈ మధ్య నామీద అధికమవుతుంది. ఆయన సంతోషంగా ఉన్నాడో లేదో అన్న సందేహం కాదుగాని మీరు చూస్తున్నట్టుగా మన పరిస్థితి దయనీయంగా తయారైనందుకు నేను ఎంతగానో చింతిస్తున్నాను. అంతేకాకుండా మీ నాన్న ఎంతో దిగులుగా ఉన్న సమయంలో అతని పట్ల నేను వ్యవహరించిన తీరు నా మనస్సాక్షిమీద ఎంతో భారంగా ఉంది. ఎందుకంటే నా మనస్సును, మిమ్మల్నికూడా ఆయనికి వ్యతిరేకంగా మార్చి శ్రేష్ఠమైన జీవితపు అన్వేషణలో ఆయనతోపాటు వెళ్లేందుకు నేను పూర్తిగా తిరస్కరించాను.

"రాత్రి నాకు వచ్చిన కల, ఈ ఉదయాన ఈయన పలికిన ప్రోత్సాహకరమైన మాటలు లేకపోతే ఈ తలంపులు నన్ను హతమార్చి ఉండేవి. పిల్లలారా, రండి, సిద్ధపడండి. మీ నాన్న ఉండే పట్టణానికి వెళ్లే దారిని చూపే గుమ్మంవద్దకు వెళదాం అన్నీ సర్దుకోండి. మరల మీ నాన్నను చూచి, ఆయనతోను, వారి సహచరులతోను ఆ దేశంలో సమాధానంతో జీవించగలిగేలా మనం త్వరగా అక్కడికి వెళదాం పదండి."

1. అపొస్తలుల కార్యములు 14:22 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

ఆ పిల్లలు ఆనందంతో కన్నీరు పెట్టుకున్నారు. ఆ సందర్శకుడు వీడ్కోలు పలుకగా, వారు తమ ప్రయాణానికి ఏర్పాట్లు చేసుకోవడం ఆరంభించారు.

ప్రయాణం ఆరంభించుట

క్రిస్టియానాని వెళ్లకుండ చెయ్యాలని, ఇరుగు పొరుగువాళ్లంతా ప్రయత్నించారు. అలా వెళ్లడం మూర్ఖత్వమని, ఒక ఆడమనిషి– అందునా చిన్నపిల్లలతో అటువంటి ప్రయాణానికి సమకట్టడం అత్యంత ప్రమాదకరమని వారు భావించారు. తన యాత్రలో ఆమె భర్త అనుభవించిన ఇబ్బందులను ఆమెకు గుర్తుచేశారు. అంతేకాకుండ అతడు బలమైన పురుషుడు కాగా ఆమె ఓ నలుగురు పిల్లలను కాపాడవలసిన బలహీనమైన స్త్రీ. అయితే, ఆమెకొక పక్కింటి స్నేహితురాలు ఉంది. ఆమె పేరు కరుణ. ఆవిడ చేస్తున్నది మంచి పనే అని తలంచినది ఆమె ఒక్కతే. క్రిస్టియానా చేస్తున్న పని మంచిదని భావించడమే కాదు, ఆమెను ఎంతగా అభిమానించి ప్రేమించిందంటే, తనతో కూడ వెళ్లి, ఆమె కష్టసుఖాలలో పాలుపంచుకోవాలనికూడ కరుణ నిర్ణయించుకుంది.

ఇప్పుడు నా కలలో క్రిస్టియానా తన నలుగురు పిల్లలతో బయలుదేరడం నేను చూశాను. మాథ్యూ, శామ్యూల్, జోసెఫ్, జేమ్స్ అనే అబ్బాయిలతోపాటు కరుణ కూడ తోడుగా వెళుతోంది. తనకు తోడుగా మంచి సహచరురాలు ఉన్నందుకే కాక, ఆ యవ్వనస్తురాలు ప్రభువును వెదకి, యాత్రామార్గాన్ని వెంబడించేలా ఒప్పింపజేయడంలో తాను సఫలీకృతమైనందుకు కూడ క్రిస్టియానాకు ఆనందంగా ఉంది. ఆవిధంగా వారు కలిసి వెళుతున్నారు, ఇంతలో కరుణ ఏడవసాగింది.

క్రిస్టియానా: ఎందుకు తల్లీ ఏడుస్తున్నావ్?

కరుణ: అయ్యో, మా పాపపు నగరంలోనే ఉండిపోయిన నా బంధువుల దీనస్థితిని గుర్తించినవారు ఏడ్వకుండ ఎవరుండగలరు? నన్ను మరింత బాధపెట్టే సంగతి ఏమంటే, వారికి ఉపదేశించేవారు గాని, రాబోయే నాశనం గురించి హెచ్చరించేవారు గాని వారికి ఎవ్వరూ లేకపోవడమే.

క్రిస్టియానా: గొప్ప ప్రేమ, గాఢమైన భావోద్రేకాలు కలిసి యాత్రికులవుతాయి; నాకోసం నా భర్త చేసినవిధంగా నీవు నీ స్నేహితులకు, ప్రియులకు చేస్తున్నావు. ఆయన విన్నపాన్ని నేను పెడచెవిన పెట్టినందుకు, సరైన నిర్ణయం చేయగలిగిన వ్యక్తిగా ఆయన్ని గుర్తించనందుకు ఆయన ఏడ్చాడు. అయితే ఆయన ప్రభువు, మన ప్రభువును మనకోసం తన కన్నీటిని ప్రోగుచేశాడు. ఇప్పుడు నీవు నేను, నా బిడ్డలు కలిసి ఆయన కార్చిన కన్నీటికి ఫలితాన్ని అనుభవిస్తున్నాం. కరుణా, నీవు కార్చిన ఈ కన్నీరు వ్యర్థం కాదని, అవి మీ వాళ్లలో అనేకుల రక్షణకు దారితీస్తాయని నా ఆశ. వాక్యం ఇలా సెలవిస్తోంది: "కన్నీళ్లు విడుచుచు విత్తువారు సంతోషగానముతో పంట కోసెదరు, పిడికెడు విత్తనములు చేత పట్టుకొని యేడ్చుచు పోవు విత్తువాడు సంతోషగానము చేయుచు పనలు మోసికొనివచ్చును."[2]

2. కీర్తనలు 126:5 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

అప్పుడు కరుణ ఈ కవితను వల్లించింది:
మహోన్నతుడే నాకు మార్గము చూపనీ
ధన్యకరమైన తన చిత్తమైతే
ఆయన ద్వారం వద్దకు, తన బాహువులలోనికి,
తన పరిశుద్ధ పర్వతంవరకు నన్ను నడిపించనీ.

నాకేమైనా సంభవించనీ,
తన ఉచితమైన కృపనుండి, పరిశుద్ధ మార్గాలనుండి
దారి తప్పకుండ, ప్రక్కకు తొలగకుండ
ఆయన నన్ను సదా కాపాడనీ.

నేను విడిచి వచ్చిన నా వాళ్లని
ఆయన సమకూర్చనీ:
దేవా, వారు తమ పూర్ణహృదయంతో, పూర్ణ మనస్సుతో
నీ సొత్తుగా మారేలా చేయవా.

నిరాశ రొంపి గుండా

జాగ్రత్తగా, ప్రార్థనాపూర్వకంగా ఉండినందున వారు నిరాశ రొంపిని దాటి దిడ్డిగుమ్మం వరకు వెళ్లే మార్గం చేరుకున్నారు.

ఈ మాటలు క్రిస్టియానకు గుర్తురాగా వాటిని ఆమె ఇతరులకు వినిపించింది: "ప్రభువు ఆమెకు తెలియజేయించిన మాటలు సిద్ధించును గనుక నమ్మిన ఆమె ధన్యురాలనెను"[3]

అప్పుడు కరుణ క్రిస్టియానతో ఇలా చెప్పింది: "ప్రవేశద్వారం వద్ద ప్రేమపూర్వక ఆహ్వానం లభిస్తుందని నీవు ఆశించినంతగా నేను ఆశించేంత మంచి ఆధారం నాకు ఉండివుంటే, ఏ నిరాశల రొంపికూడ నన్ను నిరాశపరచలేదు."

"బాగా చెప్పావు. నీ బలహీనత నీకు తెలుసు, నా బలహీనత నాకు తెలుసు" అన్నది క్రిస్టియాన.

నిరీక్షణ ద్వారం వద్ద స్వాగతం

ద్వారం వద్ద క్రిస్టియాన తలుపు తట్టసాగింది. ఎలాంటి ప్రతిస్పందన లేదు. ఆమె మరల మరల తట్టింది; అయినా వారికి ఏమీ వినపడలేదు, ఒక అశుభసూచకంగా కుక్క మొరగడం తప్ప వారికేమీ వినపడలేదు. ఏం చెయ్యాలో పాలుపోక, వారు అక్కడే కలవరంతో నిలిచిపోయారు. ఇక వదిలేసి, ద్వారం వద్దనుండి వెళ్లిపోదామనిపించింది కాని, ఆ విషయం ద్వారపాలకునికి తెలుస్తుందేమో, అలాగైతే అతడు ఎన్నడూ లోనికి రానివ్వడేమో అనుకున్నారు. మరోవైపు ఇంకొకసారి

3. లూకా 1:45 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

తలుపుతడితే కుక్క బయటికి వస్తుందేమో? ఏదిఏమైనా తలుపుమీద గట్టిగా తట్టడానికి క్రిస్టియానా ధైర్యం కూడగట్టుకొంది. అప్పుడు ద్వారపాలకుని స్వరం ఇలా వినిపించింది "ఎవరది?" ఇప్పుడు కుక్క మొరగడం ఆగిపోయింది. ద్వారపాలకుడు తలుపు తెరిచాడు.

క్రిస్టియానా అతనికి నమస్కారం చేసి "ఈ పరిశుద్ధ ద్వారం మీద గట్టిగా తట్టినందుకు ప్రభువులవారు మా మీద కోపగించవద్దు"

"మీరెక్కడనుండి వస్తున్నారు? మీకు ఏం కావాలి?" అడిగాడు ద్వారపాలకుడు.

క్రిస్టియానా: మేము క్రైస్తవుడి పూర్వపు నగరమైన నాశనపురం నుండి వస్తున్నాము. ఇప్పుడు మేము అతడు ఉంటున్న నూతన యెరూషలేము అనే పట్టణానికి వెళ్లాలనుకుంటున్నాం. నేను అతని భార్యను, వీళ్లు అతని కుమారులు.

క్రైస్తవుడి భార్య ఇప్పుడు యాత్రికురాలైందా? కొంతకాలం క్రితం అతని జీవితాన్ని అసహ్యించుకొన్న ఆవిడేనా? అడిగాడు ద్వారపాలకుడు.

క్రిస్టియానా: అవును. మా నలుగురు పిల్లలుకూడాను యాత్రికులయ్యారు.

అప్పుడు వారిని గుమ్మంలోనుండి తీసుకెళుతు "చిన్నబిడ్డలను నాయొద్దకు రానియ్యుడి" అన్నాడు. ద్వారం మూసివేసి మేడగదిలో ఉన్న ఒక వ్యక్తిని పిలిచి సంతోషకరమైన సంగీతం వినిపించమని కోరాడు. అప్పుడు ఆ సంగీతకారుడు శ్రావ్యమైన సంగీతం వినిపించాడు.[4]

ఈ సమయంలో పాపం కరుణ బయటనే నిలబడి ఏడుస్తూ, తాను విడిచిపెట్టబడినట్టు భావించింది. అయితే క్రిస్టియానా తనకు తన పిల్లలకు లోనికి ప్రవేశం దొరికిన తరువాత కరుణ పక్షంగా విన్నపం చేసింది.

క్రిస్టియానా: ప్రభూ! నాకు మంచి స్నేహితురాలు, నాతోటి ప్రయాణికురాలు బయట నిలబడి ఉంది. ఆహ్వానం లేకుండ వచ్చినందుకు తనను లోనికి రానివ్వరేమోనన్న సందేహంతో దిగులుపడుతూ బయటనే ఉండిపోయింది. నాకు మాత్రం రాజువారి వద్దనుంచి ఆహ్వానం ఉంది.

కరుణ చాలా అసహనంగా ఉంది. ప్రతి క్షణం ఒక గడియలా ఉండటంతో తనకు తెలియకుండానే తనవైపున క్రిస్టియానా చేస్తున్న విన్నపానికి అంతరాయం కలిగించింది. తలుపుపై ఎంత గట్టిగా తట్టిందంటే ఆ శబ్దానికి క్రిస్టియానా భయపడిపోయింది. అప్పుడు ద్వారపాలకుడు ఎవరక్కడ? అని అడిగాడు.

"ఆమె నా స్నేహితురాలు" అంటూ బదులిచ్చింది క్రిస్టియానా.

ద్వారపాలకుడు తలుపు తెరిచేలోపు కరుణ స్పృహతప్పి పడిపోయింది. అప్పుడతడు ఆమెను తన చేతుల్లోకి తీసుకొని "చిన్నదానా పైకి లే."

4. లూకా 15:7 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

"అయ్యో, నాకు చాలా బలహీనంగా ఉంది. నాలో ప్రాణం లేనట్టుగా అనిపిస్తుంది" అంటూ ఆమె నీరసంగా మాట్లాడింది.

"నా ప్రాణము నాలో మూర్ఛిల్లగా నేను యెహోవాను జ్ఞాపకము చేసికొంటిని."[5] అని ఒకడు అన్నాడు. అని ఆ ద్వారపాలకుడు చెప్పాడు. యవనస్తురాలా భయపడకు నీవు సరైన స్థలానికే వచ్చావు; లేచి నిలబడి నువ్వు ఎందుకు వచ్చావో చెప్పు. అన్నాడు ద్వారపాలకుడు.

కరుణ: నా స్నేహితురాలి మాట తప్ప నాకు ఆహ్వానం లేదు. ఆమెకైతే రాజుగారి వద్దనుండి ఆహ్వానం రాగా నేను కేవలం ఆమె మాటమేరకు వచ్చాను. కనుక నన్ను లోనికి రానివ్వరేమో అని భయంగా ఉంది.

ద్వారపాలకుడు: నీవు ఈ స్థలానికి రావాలని ఆమె యధార్థంగా కోరుకుందా? ఇక్కడకి రావాలని నీవుకూడా మనస్ఫూర్తిగా ఆశించావా?

కరుణ: అవును. మీరు చూస్తున్నారుగా నేను ఇక్కడిదాకా వచ్చాను. కనికరము, పాపక్షమాపణలకు ఏమాత్రం అవకాశం ఉన్నా వాటిని దయచేసి నాకు అనుగ్రహించండి.

"ప్రభువు దగ్గరకు ఏ విధంగా వచ్చినా ఆయనయందు విశ్వాసం ఉంచేవారందరి కొరకు నేను ప్రార్థనచేస్తాను" అంటూ అతడు ఆమె చేయి పట్టుకొని నెమ్మదిగా లోనికి నడిపించాడు.

లోపలికి తాను ప్రవేశించడం గమనించిన ఆమె ఆత్మ ఒక్కసారిగా వికసించింది.

ఇప్పుడు క్రిస్టియానా, కరుణ మిగతా పిల్లలందరు లోనికి స్వీకరించబడటంతో వారందరు తమ పాపాల గురించి చింతిస్తున్నామని ఒప్పుకొన్నారు. పాపక్షమాపణ ఉపదేశం చేయమని వారు ప్రభువును కోరగా వారికి పాపక్షమాపణ అనుగ్రహించబడింది. ద్వారపాలకుడు మాట్లాడిన ప్రేమపూర్వకమైన మాటలనుబట్టి వారు ఎంతగానో సంతోషించారు. వారిని మేడమీదికి తీసుకెళ్లి వారు దేనిద్వారా రక్షణ పొందారో దానికి కారణమైన శిలువను చూపిస్తూ, ముందుకు సాగేకొలది అదిఇంకా స్పష్టంగా కనిపిస్తుందనికూడా చెప్పాడు. ఆ తరువాత వారిని క్రింద ఉన్న వేసవి గృహంలో విడిచిపెట్టి వెళ్లినతరువాత వారు తమలో తాము కొద్దిసేపు మాట్లాడుకొన్నారు.

క్రిస్టియానా: మనం ఇక్కడి వరకు వచ్చామంటే ఎంత సంతోషంగా ఉందో.

కరుణ: నీకు సంతోషంగా ఉండివుండవచ్చు. నాకైతే సంతోషంతో గంతులు వేయాలనిపిస్తుంది.

క్రిస్టియానా: ఒక సమయంలో మనం ద్వారమ ముందు నిలబడినప్పుడు నేను ఎంత తట్టినా కుక్క మొరగడం తప్ప ఏమీ వినబడనప్పుడు మనం ప్రయాస అంతా వ్యర్థమైపోయింది అనిపించింది.

5. యోనా 2:7 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

కరుణ: అవును నాకుకూడా అలానే అనిపించింది. అయితే నాకు ఎక్కడలేని భయంవేసింది ఎప్పుడంటే నిన్ను పిల్లల్ని లోపలికి తీసుకెళ్లి నన్ను బయట విడిచిపెట్టినప్పుడు. ప్రవచనం ప్రకారమే నాకు ఇలా జరిగిందని భావించాను: "ఇద్దరు స్త్రీలు తిరుగలి విసరుచుందురు, ఒకతె తీసికొని పోబడును, ఒకతె విడిచిపెట్టబడును."[6] "అయ్యో నాకు శ్రమ నేను నశించితిని" అని ఏడవకుండా ఉండడమే నాకు కష్టమనిపించింది. ఇక మీదట తలుపు కొడదామంటే భయమేసింది. అప్పుడు తలుపు మీద రాసి ఉన్న మాటలు చూసి నాకు నేను ఇలా చెప్పుకున్నాను "నేను తలుపు తట్టనైనా తట్టాలి, లేదా మరణించాలి". అందుచేత నా శక్తినంతా కూడగట్టుకొని వీలైనంత గట్టిగా తట్టడానికి ప్రయత్నించాను. అప్పుడు నేను స్పృహతప్పి పడిపోయాను.

క్రిస్టియానా: నివు తలుపు తట్టిన శబ్ధం ఎంత పెద్దగా వినిపించిదంటే అది విని నాకు గంతులేయాలనిపించింది. నీవు దేవుని రాజ్యాన్ని బలవంతముగా ఆక్రమించుకొంటావేమో అనిపించింది[7].

కరుణ: నా పరిస్థితుల్లో ఉన్నవాళ్లు ఎవరైనా అలా చేయకుండా ఎలా ఉండగలరు? ఎక్కడో దూరంగా ఒక భయంకరమైన కుక్క ఉంది పైగా తలుపు మూసివేయబడింది. నాలాంటి భయస్తులైన వారు తమ శక్తికొలది తలుపు కొట్టకుండా ఉండగలరా? అయితే నా మొరటుతనం చూసి ప్రభువు ఏమన్నాడో చెప్పండి. నా మీద ఆయన ఆగ్రహించాడు కదా?

క్రిస్టియానా: లేదు. నీవు తలుపు తట్టిన విధానం చూసి ఆయన ఆశ్చర్యపోయినట్లున్నాడు. ఆయన కన్నులు ప్రకాశవంతంగా వెలుగుతూ ఎంతో హాయిగా నవ్వుకున్నాడు. నీవు చేసిన పనికి ఆయన సంతోషించాడనే నేను అనుకుంటున్నాను. అందుకు విరుద్ధంగా ఆయన ముఖంలో ఎలాంటి భావన కనిపించలేదు. అయితే అటువంటి కుక్కను అక్కడ ఎందుకు ఉంచాడు అన్నదే నాకు అర్థంకావటంలేదు. ఈ కుక్క సంగతి నాకు ముందే తెలిసిఉంటే ఈ ద్వారం వద్దకు రావడానికే నేను సందేహించి ఉండేదాన్ని. కాని మనం అంతా ఇక్కడ ఉన్నాం అంతేచాలు.

కరుణ: నువ్వు ఏమీ అనుకోకపోతే ఆ దుర్మార్గురాలైన కుక్కను అక్కడ ఎందుకు ఉంచాడో ఆయన్ని అడగాలని ఉంది. అలా అడిగినందుకు ఆయన మరోలా భావించడు కదా?

"నిజమే దాన్ని గొలుసులతో కట్టివేయమనికూడా చెప్పండి లేకపోతే అది మనల్ని ఎక్కడ కరుస్తుందోనని భయమేసింది" అన్నాడు ఒక అబ్బాయి.

ఎట్టకేలకు ద్వారపాలకుడు లోనికి ప్రవేశించగానే కరుణ అతని ముందు మోకరించి "ప్రభువు నా పట్ల చూపిన అనుగ్రహానికి నా కృతజ్ఞతలు" అని చెప్పింది.

"నీకు సమాధానం కలుగు గాక! లేచి నిలబడు" అన్నాడు. అయితే ఆమె అతని ఎదుట మోకాళ్లమీదనే ఉండి "యెహోవా, నేను నీతో వాదించునప్పుడు నీవు నీతిమంతుడవుగా

6. మత్తయి 24:41 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8
7. మత్తయి 11:12

కనబడుదువు; అయినను న్యాయము విధించుటనుగూర్చి నేను నీతో మాట్లాడుదును;[8] నీ పెరట్లో అటువంటి క్రూరమైన కుక్కను ఎందుకు ఉంచావు? పిరికి వారైన స్త్రీలను, పిల్లలను ద్వారం దగ్గర వాడు భయపెడుతున్నాడు."

ద్వారపాలకుడు: ఆ కుక్క యజమాని వేరొకరు ఉన్నాడు. వేరేవాళ్ల స్థలంలో ఉన్న కంచెకు అవతల ఉంటాడు. దూరంగ కనిపిస్తున్న ఆ మేడకు సంబంధించిన వాడు అతను. అయితే ఇక్కడ ప్రహరీగోడ వరకు అతడు రాగలడు. అతడు అనేక మంది యధార్థవంతులైన యాత్రికులను తన నీచమైన అరుపులతో భయపెట్టడం వలన వారు మరింత ధృడనిశ్చయంతో ముందుకు సాగేలా చేయగలిగాడు. అతని యజమాని అలా వదిలిపెట్టడం వలన మా ఇరువురిలో ఎవరికీ ప్రయోజనం లేదు. ఈ ద్వారం వద్దకు వచ్చే యాత్రికులను భయపెట్టడమే అతని ఉద్దేశం. కొన్ని సార్లు ఆ కుక్క నా అనుచరుల్లో చాలా మందిని బాధపెట్టినప్పటికీ వానిపట్ల ప్రస్తుతం నేను ఓర్పు కలిగి ఉన్నాను. అయితే నా యాత్రికులకు నేను సమయానుకూలంగా సహాయం చేస్తుంటాను. ద్వారం వద్దకు వచ్చేవారు సహజంగా నేను సహాయం చేస్తాననే విశ్వాసంతోనే వస్తుంటారు. దేవునితో సమాధానం లేని జీవితం జీవించినవారు పొందబోయే శిక్షనుంచి తప్పించుకోడానికి వీలుగా వారు కొన్ని ప్రమాదాలను ఎదుర్కోవాలన్నది ఇక్కడి నియమం. బిక్షగాళ్లు సహితం తమ ఆకలి బాధ తీర్చుకోడానికి భయంకరమైన కుక్కల ద్వారా ఎదురయ్యే ప్రమాదాలను తట్టుకొని ఎవరో ఒకరు తమమీద దయచూపిస్తారని ఆశతో ఇల్లిల్లు తిరుగుతుంటారు. అలాంటప్పుడు రక్షణకోసం నిజంగా అన్వేషించేవారిని ఈ చిన్న ద్వారం నుంచి నా దగ్గరకు రాకుండా ఎక్కడో ప్రక్కింటి వారి స్థలంలో కట్టేసి ఉన్న కుక్క ఆపగలదా?

కరుణ: ప్రభూ, నేను అజ్ఞానినని ఒప్పుకుంటున్నాను. తెలివిలేకుండ నేను మాట్లాడాను. నీవు సమస్తము చక్కగా చేస్తావని ఒప్పుకుంటున్నాను.

అప్పుడు క్రిస్టియానా తమ ప్రయాణం గురించి మాట్లాడుతూ ముందున్న మార్గం గురించి వాకబు చేసింది.

ద్వారపాలకుడు వారికి వేడి వేడిగా భోజనం వడ్డించి దారిని చూపించే ఒక పటాన్ని ఇచ్చి వారికి వీడ్కోలు చెప్పాడు. మరొకసారి వారు మరలా ప్రయాణమై బయలుదేరారు వాతావరణం ఆహ్లాదకరంగా ఉంది. క్రైస్తవుడి ప్రయాణంలో తన మార్గానికి ఒకవైపు గోడ కట్టబడి ఉండటం నీకు గుర్తుంది కదా. గోడకి అవతలవైపు అరచేకుక్క యజమానికి చెందిన పండ్లతోట ఒకటుంది. ఆ తోటలోని కొన్ని చెట్లకొమ్మలు గోడమీదుగా ఇవతలకి కనిపిస్తున్నాయి. ఆ చెట్టు ఫలాలు బాగా పండిఉన్నట్టు గమనించిన క్రిస్టియానా వాళ్ల పిల్లలు వాటిని చూసి ఎంతగానో ఆకర్షితులై వాటిలో కొన్ని కోసుకొని తిన్నారు. మరునాడు వారు ఒక సత్రం దగ్గర ఆగినప్పుడు వారు అనారోగ్యం పాలయ్యారు. పెద్దవాడైన మత్తయి వైద్యుణ్ని కలవాల్సి వచ్చింది. వారు పండ్లు కోసుకొంటున్నప్పుడు

8. యిర్మీయా 12:1-2 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

వాళ్ల అమ్మ మందలించినా పట్టించుకోకుండా వాటిని కోసుకొని తిన్నారు. "పిల్లలూ, ఆ పండు మనకి చెందినది కాదు గనుక మిరు అపరాధం చేస్తున్నారు. వేరొకరికి చెందినదానిని మీరు తీసుకొంటున్నారు. కనుక మీరు చేస్తున్నది 'తప్పు' అని ఆమె చెప్పింది. ఏదిఏమైనా ఆ పండ్ల తోట శత్రువుకు చెందినదని గోడ ప్రక్కన ఆ చెట్టును కావాలనే నాటారని యాత్రికులను ఆకర్షించటమే వారి ఉద్ధేశమని ఆమెకు తెలియదు.

దాడినుంచి విడుదల

ద్వారపాలకుని ఇల్లు దాటి ఎంతో దూరం పోకమునుపే ఇద్దరు దుర్మార్గులు ఆ స్త్రీలపై దాడి చేశారు. వారి అరుపులు ద్వారపాలకుడికి వినిపించకపోయి ఉంటే వారిని లోపరచుకొని ఉండేవాళ్లు. అప్పుడు ద్వారపాలకుడు పంపించిన ఒక వ్యక్తి పరుగున అక్కడికి చేరుకొన్నాడు. భయంకరమైన ఆ పోరాటాన్ని, పక్కనే నిలబడి ఏడుస్తున్న పిల్లలను చూచిన అతడు ఆ దుర్మార్గులతో ఇలా అన్నాడు: "ద్రోహులారా, అక్కడ మీరు ఏంచేస్తున్నారు? నా ప్రభువుకు చెందిన వారిని బలవంతంగా పాపములోనికి లాగుతున్నారా?" వారిని పట్టుకోడానికి అతడు పరుగున వెళ్లాడు కాని వారు గోడమీదుగా దూకి తప్పించుకొన్నారు. దెబ్బలు ఏమైనా తగిలాయా? అని ఆ స్త్రీలను పరామర్శించాడు.

క్రిస్టియానా: లేదు. దెబ్బలేమీ తగల్లేదు గాని మేము బాగా భయపడిపోయాము. రాజమార్గంలో ఇలాంటిది జరుగుతుందని మేము ఊహించలేకపోయాము.

సహాయకుడు: ద్వారపాలకుని దగ్గర మీరున్నప్పుడు మీకు తోడుగా ఒక మార్గదర్శిని పంపించమని అడగకపోవడం చూసి నేను ఆశ్చర్యపోయాను. మీరు బలహీనులైన స్త్రీలని, మార్గంలో ప్రమాదాలు ఎదురవుతాయని నాకు తెలుసు. మీరు గనుక ప్రభువును అడిగివుంటే ఆయన సంతోషంగా మీకొక మార్గదర్శిని ఇచ్చివుండేవాడు. అప్పుడు మీరు ఈ కష్టాన్ని తప్పించుకొని ఉండేవారు.

క్రిస్టియానా: అయ్యో, నువ్వెంత దయగలవాడివి. మేము మా ప్రస్తుత దీవెనలను చూసి ఉప్పొంగిపోతూ రాబోయే ప్రమాదాల గురించి మరచిపోయాం. పైగా రాజుగారి భవనానికి సమీపంలోనే ఇటువంటి వారు పొంచిఉంటారని ఎవరు ఊహించగలరు? మార్గదర్శికోసం మేము అడిగి ఉంటే బాగుండేదే కాని మా అవసరాల గురించి మార్గంలో ఎదురయ్యే ప్రమాదాల గురించి ప్రభువుకు బాగా తెలుసు కదా, ఆయన మాతో పాటు ఎవరినైనా ఎందుకు పంపలేదో అర్థం కావడం లేదు.

సహాయకుడు: అడగని వాటిని అనుగ్రహించడం అన్ని వేళలా మంచిది కాదు. కొందరు అలాంటి బహుమానాలను అంతగా మెచ్చుకోరు, వాటి నిజమైన విలువను గ్రహించరు. అయితే ఒక దాని అవసరం ఎదురైనప్పుడు దానికోసం అడిగి ఉచితంగా దానిని పొందినప్పుడు మాత్రమే దానిని

సరిగా అభినందించగలరు. ఇచ్చినవాడు పుచ్చుకొన్న వానికి ఎంతో ప్రియముగా ఉంటాడు. మీరు అడగకుండానే ప్రభువు మీకు ఒక మార్గదర్శిని అనుగ్రహించి ఉంటే మీ అనాలోచిత ధోరణిని మీరు గుర్తించగలిగే వారుకాదు. మీ యొక్క అవసరాన్ని, మీ విశ్వాసలేమిని కనుగొనగలిగే వారు కాదు. ఇప్పుడు మీకు మరింత ముందుచూపు, మరింత జాగ్రత్త అలవడ్డాయి గనుక మీకు అవరమయినవి అడగాలన్న విషయం ఇప్పుడు మీరు నేర్చుకొన్నారు.

క్రిష్టియానా: అలాగైతే మేము వెనక్కి వెళ్లి మా బుద్ధిహీనతను ఒప్పుకొని మాకొక మార్గదర్శిని పంపించమని ద్వారపాలకుని అడగమంటావా?

సహాయకుడు: లేదు. దారిపొడవునా మీరు ఒప్పుకొని ప్రార్థనచేసే అవకాశాలు మీకు లభిస్తాయి. అయితే ఒకటి గుర్తుంచుకోండి: యాత్రికులకు అవసరమైనవి అన్నీ అందించగలిగేంత సమృద్ధిగా రాజు దగ్గర ఉన్నాయని; అయినా వారికోసం ఏమి చేయవలెనో ఆయనను అడగవలసి ఉంటుంది.[9] అయితే ఆయనను అడగగలిగేంత గొప్పది కాకపోతే ఆయనను అవమానపరచినట్లే అవుతుంది.

ఇది చెప్పిన తరువాత తను తిరిగి తనచోటుకి వెళ్లిపోగా యాత్రికులు తమదారిన తాము వెళ్లిపోయారు.

కరుణ: ఎంత దారణం! అన్నీ ప్రమాదాలను అధిగమించామని ఇకమీదట మనకు ఎలాంటి కష్టం వాటిల్లదని భావించాను.

క్రిష్టియానా: నీకు తెలియకపోవడంలో తప్పేమీ లేదు. కాని నాకు తెలిసి ఉండాలి కదా. మార్గం గురించి నా భర్త చెప్పిన వివరాలనుబట్టి నేను మరింత జాగ్రత్తపడి ఉండాల్సింది.

కరుణ: మంచిదేలే మన ఈ నిర్లక్ష్యాన్ని బట్టి మనలో ఉన్న లోటుపాట్లు ఏమిటో అర్థమైంది. ప్రభువు మనపట్ల తన కృపామహదైశ్వర్యాలను బయలుపరచాడు; మనమెంత నిర్లక్ష్యంగా ఉన్నా ఆయన కృపచేత మనము అడగకుండానే మనవెంట వచ్చి మనపట్ల తన అనుగ్రహాన్ని చూపాడు. ఆయన మంచితనం చేత మనల్ని కాపాడుతూ అన్ని ప్రమాదాలనుంచి విడిపిస్తూ వచ్చాడు.

9. యెహెజ్కేలు 36:37 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

అధ్యాయం
13
వివరణకర్త ఇంటివద్ద

వారి సంభాషణ మరికొంచెంసేపు కొనసాగిన తరువాత వారు వివరణకర్త ఇంటిని సమీపించారు. క్రైస్తవుడు చెప్పిన వివరాలనుబట్టి వారు ఆ స్థలాన్ని గుర్తుపట్టారు. వారు తలుపు దగ్గరకి వచ్చినప్పుడు లోపలినుండి సంభాషణ వారికి వినబడింది. వారిలో ఒకరు క్రిస్టియానా పేరు ప్రస్తావిస్తున్నారు. అక్కడ నివసిస్తున్నవారు క్రిస్టియానా గురించి విన్నారు ఆమె తన పిల్లలతో కలిసి నాశనపురాన్ని విడిచి పరమపురికి బయలుదేరిన తన భర్తను వెంబడిస్తూ ఇప్పటికే చిన్న గుమ్మాన్ని దాటి వచ్చిందని విన్నారు. అయితే ఆమె ఇప్పుడు వాళ్ల తలుపు దగ్గరే నిలబడి ఉందన్న సంగతి వారికి తెలియదు.

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

ఇప్పుడు క్రిస్టియానా తలుపు తట్టింది. అమాయకం అనే ఒక అమ్మాయి తలుపు దగ్గరకు వచ్చింది. "మీరు ఎవరితో మాట్లాడాలి అనుకొంటున్నారు?" అని అడిగింది.

క్రిస్టియానా: ఇది యాత్రికులకు ఒక ప్రత్యేకమైన స్థలం అని మాకు అర్థమైంది. పైగా ఇప్పుడు చీకటి పడుతుంది. వీలైతే ఈరాత్రికి మేము ఇక్కడ బస చేయాలనుకొంటున్నాము.

అమాయకం: నీ పేరేమిటి?

క్రిస్టియానా: నా పేరు క్రిస్టియానా. కొన్నాళ్ల క్రితం ఈ మార్గంలో వచ్చిన క్రైస్తవుడు అనే యాత్రికుని భార్యను నేను. వీళ్లు మా నలుగురు పిల్లలు. ఈ అమ్మాయి నా స్నేహితురాలు, మాపొరుగింటి అమ్మాయి. ఆ మంచి దేశానికి నాతోపాటు ప్రయాణం చేస్తుంది.

అప్పుడు అమాయకం పరుగున ఇంటిలోనికి వెళ్లి "తలుపు దగ్గర ఎవరున్నారో తెలుసా? క్రిస్టియానా, ఆమె పిల్లలు, ఆమె స్నేహితురాలైన ఒక అమ్మాయి వచ్చారు."

వాళ్లందరూ ఆశ్చర్యపోయినా ఎంతో సంతోషంగా వెళ్లి ఈసంగతి తమ యజమానికి చెప్పారు. ఆయన తలుపు దగ్గరకు వచ్చాడు. వచ్చినవారికి తనను తాను పరిచయం చేసుకొని క్రిస్టియానాను ఇలా అడిగాడు "క్రైస్తవుడు యాత్రాజీవితం ఆరంభించినప్పుడు విడిచి వచ్చిన క్రిస్టియానావి నీవేనా?"

క్రిస్టియానా: అవును, ఆమెనే. ఎవరైతే తన భర్త కష్టాలను పట్టించుకోకుండా ఒంటరిగా అతన్ని యాత్రకు పోనిచ్చిందో ఆ కఠినాత్మురాలిని నేనే. ఇదిగో ఈ నలుగురు అతని పిల్లలు. అయితే ఇప్పుడు నేనుకూడా ఇదే సరైన మార్గమని ఒప్పింపబడినదాననై యాత్రాజీవితాన్ని చేపట్టాను.

వివరణకర్త: తన కుమారుడితో "నీవు వెళ్లి నాతోటలో పనిచేయుమని" చెప్పిన వాని గురించి రాయబడిన మాట నెరవేరింది. ఆ కుమారుడు "నేను వెళ్లను" అని తన తండ్రితో చెప్పి తరువాత పశ్చాత్తాపపడి వెళ్లినాడు.[1]

క్రిస్టియానా: నిజమే! ఆ ఉపమాన భావానికి నేను నిజమైన తార్కాణంగా ఉంటే ఎంత బాగుంటుంది. చివరికి నేను దేవుని ఎదుట సమాధానంతో నిందారహితంగా నిలబడే కృపను ఆయన నాకు అనుగ్రహించును గాక!

వివరణకర్త: కానీ బయట ఎందుకు నిలబడ్డావు? లోనికిరా! మీరు యాత్రికులయ్యారన్న సంగతి విని ఇప్పుడే మీ గురించి మాట్లాడుకుంటున్నాం. మీరందరు లోపలికి రండి. వారిని లోపలికి తీసుకెళ్లి గదిలో కూర్చోమని చెప్పాడు.

అప్పుడు ఆ వివరణకర్త ఇంటిలో ఉంటున్నవాళ్లందరు వచ్చి వారు తమతో ఉన్నందుకు సంతోషంగా ఉందని చెప్పారు. వారు ముఖ్యంగా ఆ అబ్బాయిలను చూసి బాగా ముచ్చట పడ్డారు.

1. మత్తయి 21:29 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

వస్తురూపక పాఠాలు

కొద్దిసేపటి తరువాత అప్పటికి ఇంకా భోజనం సిద్ధం కాకపోవడంతో వివరణకర్త వారిని ముఖ్యమైన గదుల్లోకి తీసుకువెళ్లి కొన్నేళ్ల క్రితం క్రైస్తవుడు చూసిన వస్తువులను వారికి చూపించాడు. బోనులో ఉన్న మనిషిని, ఒక పీడకల కన్న వ్యక్తిని, శత్రువులను ఛేదించుకొని వెళ్లిన మనిషిని మరియు క్రైస్తవుడికి ఎంతో ప్రయోజనకరంగా ఉన్న సంగతులన్నిటినీ వారు చూశారు.

వారు చూసిన వాటి గురించి ఆలోచించుకొన్న తరువాత వివరణకర్త వారిని మరొక గదిలోనికి తీసుకెళ్లాడు. అక్కడ ఒకడు దుమ్ము రేపుతూ చెత్తను విసిరివేస్తూ ఉన్నాడు. వాడికి అది తప్ప మరో పని ఏమీ లేనట్టుంది. అతనికి పైగా ఒక దేవదూత నిలబడి ఒక నిత్యజీవపు కిరీటాన్ని ఇవ్వచూస్తున్నాడు కానీ అతనికి ఇవేమీ పట్టడం లేదు. అతడు కేవలం కిందికే చూస్తున్నాడు. నేల మీద చెత్తను చెదరగొడుతూ అవిశ్రాంతంగా పనిచేస్తున్నాడు.

క్రిస్టియానా: దీని భావమేమిటో నాకు అర్థమయింది అనుకుంటాను. నిత్యత్వపు సంగతులకు సమయంలేని ఈ లోకస్తుడు ఇతడే కదా?

వివరణకర్త: నువ్వన్నది నిజమే అతని చేతిలో ఉన్న వస్తువు అతని శరీరానుసారమైన మనస్సును తెలియచేస్తుంది. అతడు చనిపోక ముందు లోకానికి చెందిన చెత్తను వీలైనంత వరకు పోగుచేయడమే పనిగా పెట్టుకున్నాడు. నిత్యత్వపు సంగతుల గురించి ఆలోచించేందుకు అతనికి సమయమే లేదు. చాలా మందికి పరలోకం అంటే ఓ కట్టుకథ లాంటిది. నశించిపోయే ఈ లోకానికి చెందిన వస్తువులే అతనికి అత్యంత విలువైనవి.

మీరు చూస్తున్నారు కదా, అతడు కిందికి తప్ప ఎటూ చూడలేదు. భూలోక సంబంధమైనవి మనుష్యుల మనస్సులను చెరపట్టి దేవుని ప్రేమ పట్ల, రానున్న లోకపు వాస్తవాల పట్ల వారి హృదయాలను మూసివేసేందుకు వాటికున్న శక్తిని చూపిస్తుంది. "దేవుని స్వరూపియైయున్న క్రీస్తు మహిమను కనుపరచు సువార్త ప్రకాశము వారికి ప్రకాశింపకుండు నిమిత్తము, ఈ యుగసంబంధమైన దేవత అవిశ్వాసులైనవారి మనోనేత్రములకు గ్రుడ్డితనము కలుగచేసెను."[2]

క్రిస్టియానా: అయ్యో నన్ను దీని బారినుండి తప్పించండి.

వివరణకర్త: ఆ ప్రార్థనను ఇంతవరకు ఎవరు ఉపయోగించలేదు గనుక అది దాదాపుగా తుప్పుపట్టిపోయింది. "పేదరికమునైనను, ఐశ్వర్యమునైనను, నాకు దయచేయకుము"[3] అనేది పదివేలమందిలో ఏ ఒక్కరో ప్రార్థన చేస్తున్నారు. "పేదరికము వద్దు ఐశ్వర్యమును నాకు దయచేయుము" అన్నదే ఈనాడు అనేకులు చేస్తున్న ప్రార్థన.

"అయ్యో, అది ఎంతైనా నిజమే" అన్నది క్రిస్టియానా.

2. 2కొరింథీయులకు 4:4 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8
3. సామెతలు 30:8

ఇప్పుడు వివరణకర్త వారిని ఆ భవనంలోని అందమైన గదిలోకి తీసుకెళ్లి "ఇక్కడ మీకు మంచి పాఠం ఏదైనా దొరుకుతుందేమో చుట్టూ చూడండి" అని చెప్పాడు.

వారు ఎంత చూసినా ఏమీ కనుగొనలేకపోయారు. గోడమీద ఓ పెద్ద సాలెపురుగు తప్ప ముఖ్యమైనది ఏదీ లేదు. అయితే వారు దానిని పట్టించుకోలేదు.

"నాకేమీ కనిపించలేదు" అన్నది కరుణ. అయితే క్రిస్టియానా మౌనంగా ఉంది.

"దగ్గరగా చూడండి" అంటూ వివరణకర్త సలహా ఇచ్చాడు.

కరుణ మరలా చూసి "ఆ గోడ మీద వేలాడుతున్న మురికి సాలె పురుగు తప్ప నాకేమీ కనిపించలేదు కానీ దానికి ఏమి అర్థం ఉంటుందో నాకు తెలియదు."

వివరణకర్త: "బల్లిని చేతితో నీవు పట్టుకొనగలవు అయినను రాజుల గృహములలో అది యుండును."[4] ఈ సాలీడు – చూడటానికి అసహ్యంగా ఉండే విషపురుగు. విశ్వాసంతో రాజు ఇంటిలో ఉండే అందమైన వస్తువులను తాకగలదు. కనుక దానిని సాలీడుగా కాక సీతకోక చిలుకలా చూస్తారు. అలాగే ఈ విశాలమైన అందమైన శుభ్రమైన గదిలో ఒక విషపురుగు ఉన్నట్టే అందమైన హృదయంలో తనకు తెలియకుండానే అసహ్యమైన సాలీడు లాంటి విషపురుగును ఎంతోకాలం కలిగి ఉండవచ్చు. పాపం ఎంత రహస్యంగా చొరబడుతుందో దాని స్వభావాన్ని ఇది చూపిస్తుంది.

ఇంత విలువైన సత్యాలు వారి మనస్సులపై ఎంతో స్పష్టంగా మరచిపోలేని రీతిలో ముద్రించబడేలా చేసిన ఈ అద్భుతమైన వ్యక్తిని బట్టి వారందరు ఎంతగానో సంతోషించారు. వారి కళ్లలో ఆనంద బాష్పాలు రాలుతుండగా ఒకరినొకరు చూసుకుంటూ వివరణకర్తకు నమస్కరించారు.

ఆ తరువాత వారికి మరొక గదిని చూపించాడు. ఆ గదిలో ఒక పిల్లలకోడి ఉంది. ఒక కోడి పిల్ల నీరు త్రాగడానికి గిన్నె వద్దకు వెళ్లింది.

"ఆ కోడిపిల్ల ఏంచేస్తుందో చూడండి. అది తన కళ్లను పరలోకం వైపు ఎత్తి చూస్తుంది. మనం పొందే ప్రతి దానివిషయమై కృతజ్ఞత నిండిన హృదయాలతో మనం కూడా అలాగే చేయాలి. ఎందుకంటే ఆత్మ సంబంధమైనవి అయినా భౌతిక సంబంధమైనవి అయినా అన్నిటికీ దేవుడే మూలం" అన్నాడు వివరణకర్త.

అప్పుడతడు కోడి అరుపు వినమని వారిని కోరాడు. అది నాలుగు రకాలుగా పిలుస్తున్నట్టు వారు గమనించారు. మామూలుగా అరిచే ఒక కోడి అరుపు అప్పుడప్పుడు ఒక ప్రత్యేకమైన పిలుపు, ప్రేమతో కూడిన పిలుపు, ప్రమాదాన్ని సూచించే కేక ఇవన్నీ దాని స్వరంలో వినపడుతున్నాయి.

4. సామెతలు 30:28 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

వివరణకర్త: ఇప్పుడు ఈ కోడిని మీ ప్రభువుతోను, కోడిపిల్లల్ని తన విధేయులైన అనుచరులతోను పోల్చి చూడండి. ఆయన అందరికీ వినిపించే సాధారణ స్వరమైన సువార్త ద్వారా ఒక వాగ్దానం చేస్తున్నాడు. పరిశుద్ధాత్మ ద్వారా అందించే ప్రత్యేకమైన పిలుపుతో ఎల్లప్పుడు శాశ్వతంగా ఉండే వరాన్ని అనుగ్రహిస్తాడు. ఆయన ప్రేమతో కూడిన నెమ్మదినిచ్చే పిలుపుకూడా వినిపిస్తాడు. ఆ పిలుపు ఆయనకు లోబడినవారికే వినిపిస్తుంది. తన అనుచరులను ప్రమాదంనుండి తప్పించే హెచ్చరిక స్వరంకూడా ఆయనకు ఉన్నది.

క్రిస్టియానా: మీకు చాలా వందనాలు. మమ్మల్ని ఇంకా చూడనివ్వండి.

కనుక అతడు వారిని ఒక వధశాలకు తీసుకెళ్లాడు. అక్కడ కొందరు ఒక గొర్రెను చంపుతున్నారు. ఆ గొర్రె కేకలు వేయకుండా వారికి లోబడి ఓపికతో బాధలు అనుభవిస్తున్నట్టు వారు గమనించారు.

అప్పుడు వివరణకర్త వారికి ఈ విధంగా వివరించాడు: "బాధలు కలిగినప్పుడు ఓపికతో సహించడం, అన్యాయము ఎదురైనప్పుడు సణుగుకొనకుండ భరించడం వంటివి ఈ గొర్రెను చూసి మీరు నేర్చుకోవాలి. క్రీస్తు మంచి గొర్రెల కాపరి. ఆయన మిమ్ములను తన గొర్రెలుగా పిలుస్తున్నాడు."

దీని తరువాత అతడు వారికి తన పూలతోటను చూపించాడు. "ఇక్కడ మీరు అనేక పుష్పాలను చూస్తున్నారు. అవి పరిమాణంలోను ఆకారంలోను రంగులోను అందంలోను ఒకదానికొకటి భిన్నంగా ఉన్నాయి. కొన్ని వేరే వాటికంటే ఎక్కువ విలువైనవి; అయినప్పటికీ అవన్నీ ఒకే తోటలో కలిసి పెరుగుతున్నాయి. తోటమాలి వాటిని ఎక్కడ ఉంచితే అక్కడ ఉంటున్నాయి. ఇతరులతో గొడవ పడకుండా వాటి వాటి సువాసనలు వెదజల్లుతున్నాయి."

తరువాత వారిని గోధుమ పొలంలోనికి తీసుకెళ్లాడు. అయితే గోధుమలు అప్పటికే కోయబడి గడ్డి మాత్రమే మిగిలి ఉంది. "ఇప్పుడు నేను ఈ పంటను ఏంచేయాలి? ఈ నేలను బాగా దున్ని ఎరువులు వేశాను" అయితే దీనిని ఏమి చేయమంటారో చెప్పండి.

"ఈ చెత్త దేనికీ పనికిరాదు. కేవలం దాన్ని దున్నివేయడమో లేక కాల్చివేయడమో తప్ప ఏమీ చేయలేము" అని బదులిచ్చింది క్రిస్టియానా.

వివరణకర్త: చూశారా, మీరు కోరుకొనేది ఫలమే కనుక అది లేకపోతే మొక్కను అగ్నిలో వేయడానికి లేక మనుష్యుల పాదాల కింద తొక్కివేయడానికి మాత్రమే పనికి వచ్చేదిగా దానిని పరిగణిస్తారు. అయితే ఈ విషయంలో మీకు మీరు శిక్షను కొనితెచ్చుకొనకుండా జాగ్రత్తపడండి, ఎందుకంటే "ఆయన తన కళ్లమును బాగుగా శుభ్రము చేసి గోధుమలను కొట్టులో పోసి ఆరని అగ్నితో పొట్టును కాల్చివేయును"[5] అని వ్రాయబడియున్నది.

5. మత్తయి 3:12 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

వారు పొలమునుంచి ఇంటికి వస్తుండగా పెరటి కంచెమీద ఒక చిన్న పక్షి నోటిలో పెద్ద సాలె పురుగును పట్టుకొని ఉండటం చూశాను.

"అది చూడండి" అంటూ అతడు ఆ పక్షిని చూపించాడు.

"అంత అందమైన మధురమైన స్వరం కలిగి, అందరు ఎంతగానో ఇష్టపడే ఆ పక్షినోట ఇంత హీనమైన పురుగును చూడటం ఎంతదారుణం కదా" అన్నది క్రిస్టియానా. అది చిన్న చిన్న విత్తనాలు లేదా రొట్టె ముక్కలు తిని బతుకుతుందనుకొన్నాను. కాని అది ఇలాంటి ఆహారం కూడా ఇష్టంగా తింటుందని ఊహించలేకపోయాను. దాని గురించి ఒకప్పుడు ఎంతో గొప్పగా ఊహించుకొన్నాను.

వివరణకర్త: ఈ చిన్న పక్షి కొందరు నామకార్థ క్రైస్తవులకు సూచన. కొందరు పైకి చాలా గర్వంగా అందంగా ఉండే ఈ పక్షిలా కనిపిస్తారు. వారు చాలా ఉన్నతమైన వ్యక్తులతో సహవాసం చేస్తుంటారు. పైకి చాలా సంస్కారవంతులుగా కనిపిస్తారు. ఆదివారం ప్రభువు మందిరంలో ఉండటానికి వారు ఇష్టపడతారు. కోకిల స్వరాలతో పాటలుపాడతారు. అయితే వారు ఒంటరిగా ఉన్నప్పుడు, లేదా దుష్ట సాంగత్యంచేస్తున్నప్పుడు వారు పాపపు సాలె పురుగులను మింగివేయగలరు, దోషమును మంచినీరులా తాగగలరు.

సామెతలు వినపడుట

వారు ఇంటిలోనికి వచ్చి భోజనం కోసం ఎదురు చూస్తుండగా క్రిస్టియానా మరింత ఉపదేశం పొందాలని అశించగా వివరణకర్త వారితో సామెతల రూపంలో మాట్లాడాడు.

"పంది ఎంత లావుగా ఉంటే అంత చక్కగా బురదలో దొర్లటానికి ఇష్టపడుతుంది; ఎద్దు ఎంత పెద్దదైతే అంత ధైర్యంగా వధశాలకు వెళ్తుంది; ఒకడు ఎంత విజయం సాధించి ఐశ్వర్యవంతుడైతే అంత ఎక్కువగా దుష్టత్వం జరిగించే అవకాశం ఉంటుంది. ఒక చిన్న రంధ్రం పడితే పెద్ద ఓడ అయినా మునిగిపోతుంది. ఒక పాపం ఓ జీవితాన్నే నాశనం చేస్తుంది. తన స్నేహితుని మరచువాడు కృతజ్ఞత లేని వాడు. కాని తన రక్షకుని మరచువాడు తనకు తానే నిర్ధయుడుగా ఉంటాడు. పాపంలో జీవిస్తూ సంతోషం కోసం వెతికే వాడు. తన పొలంలో ముళ్లపొదలు నాటి తన కొట్లలో గోధుమలను నింపాలని చూసేవాడితో సమానం.ఎంతో ఆయాసకరమైన ఈ జీవితమే విలువైనదిగా భావిస్తే పరిపూర్ణమైన లోకంలో పరిపూర్ణమైన నిత్యజీవం ఇంకెంత విలువైనది అవుతుంది! మనుషుల మంచితనాన్ని మెచ్చుకోటానికి మనమెంతో అలవాటుపడిపోయాం. కాని మనలో ఎంత మంది దేవుని మంచి తనాన్ని చూసి ఎల్లప్పుడు మహిమపరుస్తారు? బల్లమీద ఏదోఒకటి విడువకుండ మనం భోజనం ముగించడం చాలా అరుదు. కాబట్టి లోకం అంతా ఉపయోగించే లేక అవసరమయ్యే యోగ్యత నీతి క్రీస్తునందు ఉన్నాయి."

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

వివరణకర్త తన సామెతలు ముగించిన తరువాత అతడు తన అతిథులను మరలా తోటలోనికి తీసుకెళ్లి కేవలం దొల్లగా ఉన్న ఒక చెట్టును చూపించాడు. అయితే అది పచ్చని ఆకులతో సజీవంగానే ఉంది.

"దీనర్థం ఏంటి?" అని అడిగింది కరుణ.

వివరణకర్త: బయటికి బాగా కనిపిస్తున్న ఈ చెట్టు దేవుని తోటలో ఉన్నవారికి సూచనగా ఉంది. వారు క్రైస్తవ జీవితాన్ని బాహ్యంగా ప్రదర్శిస్తూ, అంతరంగంలో దేవుని కార్యాలపట్ల ఏమాత్రం ఆసక్తి చూపరు. యేసు వారిగురించి ఇలా చెప్పాడు: "ఈ ప్రజలు తమ పెదవులతో నన్ను ఘనపరచుదురు గాని వారి హృదయము నాకు దూరముగా ఉన్నది"[6]

అప్పుడు రాత్రిభోజనానికి రమ్మని పిలుపు వచ్చింది. గనుక అందరూ లోనికి వెళ్లి కూర్చున్నారు. వివరణకర్త భోజనం కొరకు కృతజ్ఞతలు చెల్లించగా అందరూ భోంచేయడం ప్రారంభించారు. ఒకరు నాట్యం చెయ్యగా మరొకరు చక్కని పాట పాడారు.

సాక్ష్యాలు చెప్పుట

సంగీతం ఆగిపోయాక, వివరణకర్త క్రిస్టియానాను అడిగాడు, తనను యాత్రికురాలిగా మారేలా నడిపించిన పరిస్థితులు ఏవని.

క్రిస్టియానా: మొదట్లో, నా భర్తను కోల్పోయినందుకు బాగా దుఃఖించాను. నా భర్త అనుభవించిన కష్టాలు, శోధనల గురించి, ఆయన ఇంటిలో ఉన్నప్పుడు ప్రతిరోజూ నేను ప్రవర్తించిన తీరు గురించి, చివరికి తనతో వెళ్లడానికి నిరాకరించడం గురించి ఆలోచించకుండ ఉండలేకపోయాను. అప్పుడు నాలో అపరాధభావన చోటుచేసుకుంది. ఆయన్ని అంత అమర్యాదకరంగా చూచినందుకు మాత్రమే కాక, నా కోసం చనిపోయిన యేసు క్రీస్తును తృణీకరించినందుకు దేవుని యెదుట కూడ నేను దోషిగా నిలబడ్డాను. అప్పుడు నా భర్త గురించి నేనొక కలగన్నాను– ఆ కలలో ఆయన సంతోషస్థితిలో ఉండటం చూశాను, రాజుగారి యొద్దనుంచి ఒక వ్యక్తి ఉత్తరం తీసుకొచ్చినట్టు, నన్నుకూడ ఆ అందమైన దేశానికి రమ్మని ఆహ్వానిస్తున్నట్లు నేను భావించాను. ఆ పిలుపు దేవుని వద్దనుంచే వచ్చిందని నిర్ధారించుకున్నాను. గనుక భూసంబంధమైన నా ఆస్థిపాస్తులన్నీ అమ్మివేసి ఇక్కడికి బయలుదేరి వచ్చాను. అయితే నా పిల్లల్ని అక్కడే వదిలేసి రాలేదు. వారు నాతో రావడానికి ఇష్టపడ్డ బంగారు కొండలు.

"నీ ఆరంభం బావుంది" అన్నాడు వివరణకర్త. ఆ తరువాత కరుణవైపు తిరిగి, "ఈ మార్గంలో వచ్చేలా నిన్ను కదిలించింది ఏమిటి?" అని అడిగాడు.

కరుణ సిగ్గుతో మౌనం వహించి, కొద్దిసేపు ఏమీ మాట్లాడలేదు. "భయపడకు, నమ్మిక ఉంచి, నీ మనస్సులో ఉన్నది ఏదో అదే మాట్లాడు" అన్నాడు.

6. మత్తయి 15:8 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

కరుణ: నిజం చెప్పాలంటే, నా అనుభవరాహిత్యం వల్ల నేను మౌనంగా ఉండటమే మంచిదనిపిస్తోంది. పైగా ఒక యాత్రికురాలిగా ఉండేందుకు నేను తగిన దానిని కాదేమో అన్న భయం నాలో ఉంది. నా స్నేహితురాలు క్రిస్టియానా చెప్పినట్లు కలలు, దర్శనాల గురించి నేనేమీ చెప్పలేను; పోనీ, ప్రియమైనవారిని కోల్పోవడం అంటే ఏమిటో కూడ నాకు తెలియదు. లేదా సన్నిహితులు చెప్పే ఆలోచనను పెడచెవిన పెట్టడం గురించి బాధపడే అవకాశం కూడ నాకులేదు.

వివరణకర్త: అలాంటప్పుడు, నీవిలా చెయ్యడానికి నిన్ను పురికొల్పినదేమిటి తల్లీ.

కరుణ: ఈ నా స్నేహితురాలు మా ఊరు విడిచి రావడానికి సర్దుకొంటుండగా, మరో స్త్రీతో కలిసి నేను ఈమెను కలవడం జరిగింది. ఆమె చేస్తున్నదంతా చూచి, ఆవిధంగా సర్ధుకోవడంలో అర్థం ఏమిటని ఆమెను ప్రశ్నించాం. తన భర్తవద్దకు రమ్మని తనకు ఆహ్వానం వచ్చిందని చెప్పింది. ఒక కలలో తన భర్తను ఎలా చూసింది ఆ వివరాలన్నీ తెలియజేసింది. తన భర్త ఒక అద్భుతమైన స్థలంలో ఉన్నాడని, అద్భుతమైన వ్యక్తుల మధ్య నివాసం చేస్తూ, కిరీటం ధరించి, సితార వాయిస్తూ, రాజుగారి బల్లమీద భోజనం చేస్తూ మధురమైన పరలోకపు గానాలను ఆలపిస్తూ రాజును కీర్తించడం మొదలైనవన్నీ తాను ఎలా చూసింది అన్నీ వివరించింది. ఆమె ఈ కథను చెప్తుండగా, నాలో నా హృదయం మండుతోంది. అప్పుడు నాలో నేను ఇలా చెప్పుకున్నాను: "ఇదే గనుక నిజమైతే, నా తల్లిని, నా తండ్రిని, నా మాతృభూమిని విడిచిపెడతాను. క్రిస్టియానా గనుక నన్ను తన సహచరిగా అంగీకరించినట్లయితే, నేను ఆమెతోకూడ వెళతాను." గనుక ఈ విషయం గురించి నేను మరికొంత సమాచారం సేకరించాను. ఆమె కథనుంచి నేను విన్నదాని ప్రకారం మా పట్టణంలో ఏమాత్రం భద్రత లేదని తెలుసుకొన్నాను కనుక ఆమెతోపాటు నన్ను రానిస్తుందో లేదో అడిగి తెలుసుకున్నాను. ఎంతో భారమైన హృదయంతో బయలుదేరాను. అయితే ఇక్కడికి రావడం ఇష్టంలేక కాదుగాని నాకు అత్యంత సన్నిహితులైన స్నేహితులను, బంధువుల్ని విడిచి వస్తున్నందుకే బాధగా ఉంది. ఇప్పుడైతే నాహృదయపూర్వకంగానే ఇక్కడిదాకా వచ్చాను. వీలైతే క్రిస్టియానాతో కలిసి ఆమె భర్త ఉండే చోటికి ఆయన రాజు వద్దకు వెళ్లాలని ఉంది.

వివరణకర్త: నీ ఆరంభం మెచ్చదగినదే. నీవు విశ్వసించి సత్యాన్ని గొప్పదిగా ఎంచావు. నీవు నయోమి పట్ల ఆమె ప్రభువు పట్ల ఉన్న ప్రేమతో తన తండ్రిని, తల్లిని, తన స్వదేశాన్ని విడిచి ఒక కొత్త దేశానికి వెళ్లి తనకు తెలియని ప్రజల మధ్య జీవించడానికి వెళ్లిన రూతులాంటి దానివి.[7] ఇప్పుడు నీవు ప్రభువు సంరక్షణలోనికి వచ్చావు గనుక ఆయన నిన్ను సమృద్ధిగా దీవించి నీకు బహుమానం దయచేస్తాడు.

భోజనాలు చేయడం అయిపోయాక నిద్రకు ఏర్పాట్లు చేయబడ్డాయి. ఆ స్త్రీలు ఒకే గదిలో వేరు వేరు మంచాలపై పడుకోగా అబ్బాయిలు మరో గదిలో ఒక్కో మంచం మీద ఇద్దరిద్దరుగా పడుకున్నారు.

7. రూతు 1:16-17; 2:12

అయితే కరుణకు కొన్ని గంటలపాటు నిద్రపట్టలేదు. ఆమె చాలా ఆనందంగా ఉంది. తనకున్న సందేహాలు, భయాలన్నీ తొలగిపోయాయి. తన పట్ల ఇంత అద్భుతమైన దయను చూపించినందుకు తన హృదయంలో దేవునికి స్తుతులు చెల్లిస్తూ, ఎంతోసేపు ఆయనను కీర్తిస్తూ ఉండింది.

బయలుదేరుట

ఉదయాన్నే సూర్యోదయంతో పాటు నిద్రలేచి ప్రయాణానికి ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే వివరణకర్త వారిని మరికొంత కాలం ఉండమని అడిగాడు. తద్వారా మార్గంలో తమ ప్రయాణానికి పూర్తిగా సిద్ధపడగలరని చెప్పాడు.

తనకు ఇవ్వబడిన ఆదేశాల ప్రకారం అమాయకం వారిని తీసుకెళ్లి తోటలో ఉన్న కొలనులో వారికి స్నానాలు చేయించి కొత్తవి తెల్లని సన్నపునార దుస్తులు వారికి తొడిగించాడు. ఆవిధంగా కొత్త దుస్తుల్లో ఆస్త్రీలు ఎంతో అందంగా కనిపించారు. ఒకరివైపు ఒకరు ఎంతో ఆశ్చర్యంగా చూసుకున్నారు. ఎందుకంటే ప్రతిఒక్కరు తమ ఎదుటివారిలోని మహిమను మాత్రమే చూసి తమకంటే ఇతరులను యోగ్యమైనవారిగా ఎంచుకొన్నారు.[8] "నువ్వు నాకంటే అందంగా ఉన్నావు." అని ఒకరు అనగా "నువ్వు నాకంటే ఇంకా అందంగా ఉన్నావు" అన్నది మరొకామె. పిల్లలు కూడా తమ కొత్త అవతారం చూసి ఆశ్చర్యంతో నిలబడిపోయారు.

అప్పుడు వివరణకర్త వారందరిని ముద్రి వేయబడుటకు పిలిచాడు. ఇది పునర్జన్మ[10] సంబంధమైన నీటిలో కడుగబడిన వారికి వేసే ముద్ర. కాబట్టి అతడు వారిని ముద్రించి, వారు వెళ్లినచోటల్లా గుర్తించబడుటకు వీలుగా వారిమీద తన గుర్తును వేశాడు. వారినొసళ్ల మీద వేయబడిన గుర్తు వారి అందాన్ని మరింత ఇనుమడింపజేసింది.

అప్పుడు వివరణకర్త తన సేవకులలో గొప్పమనస్సు అనే వానిని పిలిచి ఒక కత్తి, శిరస్త్రాణం, డాలు తీసుకొని ఈ కొత్త యాత్రికులను సుందరం అనబడే ఇంటికి తోడ్కొని వెళ్లమని చెప్పాడు. వారు తమ తదుపరి విడిది అక్కడనే చేస్తారు. అప్పుడు వారికి వీడ్కోలు పలికి అతడు అతని కుటుంబంలో పనిచేసే సేవకులందరు తమ ప్రయాణం శుభంగా జరగాలని దీవించి పంపారు.

8. ఫిలిప్పీయులకు 2:3
9. ఎఫెసీయులకు 1:13
10. తీతుకు 3:5

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

అధ్యాయం 14
గొప్పమనస్సు నడిపింపు

ఉచిత క్షమాభిక్ష గురించి వివరించుట

గొప్పమనస్సు ముందు వెళుతుండగా యాత్రికులు త్వరలోనే ఒకచోటికి చేరుకున్నారు. క్రైస్తవుడి వీపు మీద ఉన్న బరువు జారిపడి సమాధిలోనికి దొర్లిపోయిన స్థలం ఇదే. ఇక్కడ వారు కొద్దిసేపు ఆగి దేవుని ఆరాధించారు.

క్రిస్టియానా: ఇప్పుడు నాకు ద్వారం దగ్గర మనకు చెప్పిన మాటలు గుర్తుకొస్తున్నాయి. అదేమనగా మనకు మాటచేతను క్రియచేతను క్షమాపణ లభించాలని. మాటచేత అనగా వాగ్దానంచేత అని – మనమిక నేరస్తులుగా పరిగణించబడమనే వాగ్దానాన్ని నమ్ముతాం. ఎందుకంటే మనపాపాల నిమిత్తం మరొకరు నేరస్తునిగా చేయబడ్డాడు అని నేను గ్రహించాను. అయితే క్రియలచేత క్షమాపణ పొందడమేలాగో నాకు అర్థం కాలేదు.

గొప్పమనస్సు: క్రియలచేత క్షమాపణ అనగా నీకోసం ఇతరులు చేసిన క్రియలమూలంగా పొందే క్షమాపణ. వేరొకరు మీ కొరకు జీవించి మీకు అవసరమైన క్రియలు చేశాడు. మీ అపరాధాలన్నిటికీ రావలసిన శిక్షను సహించాడు. తద్వారా మీరు ఇప్పుడే ఇక్కడే స్వతంత్రులు కాగలరు. కాబట్టి నీవు, కరుణ ఈ అబ్బాయిలు పొందిన క్షమాభిక్ష మిమ్మల్ని ద్వారం దగ్గర లోనికి పోనిచ్చిన వ్యక్తిద్వారానే పొందారు. ఆయన దానిని రెండు విధాలుగా సంపాదించాడు: మీ నీతికి అవసరమైనదంతా ఆయన చేసి మీ పాపములన్నిటినుండి మిమ్ములను కడిగి పవిత్రపరచడానికి ఆయన తన రక్తాన్ని చిందించాడు.

క్రిస్టియానా: అయితే ఆయన నీతిని మాకు ఇచ్చినట్లయితే ఆయనకు ఏం మిగులుతుంది?

గొప్పమనస్సు: అదొక మహాసముద్రం లాంటిది. అందులో నుంచి ఎంత నీరు వాడుకున్నా భూమికి కావలసినదాని కంటే ఇంకా ఎక్కువనీరే అందులో మిగిలి ఉంటుంది. ఆయనకు, లోకమంతటికీ అవసరమైన దానికంటే మించిన నీతి క్రీస్తు కలిగి ఉన్నాడు కాబట్టి ఆయన వద్దకు విశ్వాసంతో వచ్చేవారందరికి అది ఉచితంగా లభిస్తుంది.

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

అయితే ఒక పాపి పాక్షమాపణ పొందాలంటే దేవునికి ఒక వెల చెల్లించాలి. అతని పాపాలను కప్పివేయగలిగినది అతనికి అవసరం. ఒక నేరస్తుడు విడుదల పొందాలంటే అతడు చెల్లించవలసిన అపరాధ రుసుము చెల్లించబడాలి. అతడు విడుదల పొందిన తరువాత అవసరమైన దుస్తులు తదితర వస్తువులు అతనికి కావాలి. కాబట్టి మనం దేవుని యెదుట అపరాధులమయినప్పటికీ యేసు మన శిక్షను భరించాడు గనుక దేవుని యెదుట, మనషుల యెదుట మనలను నీతిమంతులుగా చేయగలిగే నీతి మనకు అందుబాటులో ఉంది. ఎందుకంటే విశ్వాసం ద్వారా మనము క్రీస్తుతో ఐక్యపరచబడినందున మనకు ఆయన నీతి లభించింది. ఈ కారణం చేత నీతి గల దేవుడు ఈలోకానికి తీర్పు తీర్చడానికి వచ్చినప్పుడు నీకు శిక్షవిధించడు.

క్రిస్టియానా: అది అద్భుతం. ఇప్పుడు నాకు అర్థమైంది–మనము మాట చేత, క్రియచేత ఎలా క్షమాపణ పొందుతామో. కరుణ, ఈ సంగతి మనం ఎల్లప్పుడు మనస్సులో పెట్టుకొనేందుకు ప్రయత్నించాలి. ప్రియమైన పిల్లలారా, మీరు కూడా దీనిని తప్పక గుర్తుంచుకోవాలి. క్రైస్తవుడి వీపు మీద ఉన్న బరువు పడిపోయేలా చేసింది ఏమిటో అతడు అంత సంతోషంగా ఎలా మారాడో ఇప్పుడు నాకు అర్థమవుతోంది.

గొప్పమనస్సు: అవును. దీనియందలి విశ్వాసమే తనవీపు మీద ఉన్న భారాన్ని కట్టిఉంచిన తాళ్లను తెంచివేసింది. వాటిని మరేవిధంగాను తెంచలేకపోయారు. ఈ సుగుణానికి రుజువు చూపించేందుకే అతడు తన బరువును మోసుకొంటూ బలవంతంగా సిలువ వద్దకు రావలసి వచ్చింది.

క్రిస్టియానా: అవునా! అందుకే ఇది నాలోనేను ఆనందించేలా చేసింది. ద్వారంలోపల నాకు ప్రవేశం లభించినప్పుడు నా హృదయం తేలికపడినప్పటికీ ఇప్పుడు నేను అంతకంటే పదంతలు సంతోషంగా ఉన్నాను. నేను అనుభవించిన దానిచేత ఒప్పించబడుతున్నాను. అది తక్కువే అయినా ఇప్పటికి నేను అనుభవించింది కొంచెమే అయినా ఈ ప్రపంచంలో అత్యంత బరువును మోసే వ్యక్తి ఇక్కడ ఉండి నావలే విశ్వసించినట్లయితే అతని హృదయం సంతోషంతో గంతులు వేస్తుంది.

గొప్పమనస్సు: పాపభారం నుంచి ఉపశమనంతోపాటు, దీనిని చూచి స్వీకరించడం వలన హృదయానికి ఆదరణ లభించటమే కాదు శిలువ ద్వారాను, తన జీవితము మరణాల ద్వారా దీనిని మనకోసం సంపాదించి పెట్టిన వాని ద్వారా మనలో ఒక విధమైన గట్టి మృదువైన ఆప్యాయతను కలిగించింది.

క్రిస్టియానా: అది సత్యమే కాని, ఆయన నాకోసం రక్తం చిందించవలసి వచ్చిందని వింటుంటే నా హృదయం బ్రద్దలవుతోంది. ఓ ప్రేమామయుడా! ఓ కీర్తనీయుడా! నా సమస్తము నీకు అర్పించదగినవాడవే– నా ప్రాణాత్మ దేహాలను, నా సర్వమును నీకే అర్పించాలి. ఎందుకంటే

నాకున్న విలువకంటే నీవు పదివేల రెట్లు మూల్యం చెల్లించావు. అందుకే నా భర్త కన్నీటిపర్యంతమయ్యాడంటే ఆశ్చర్యం లేదు. తనతోపాటు నేనుకూడా వెళ్లాలని ఆయన ఆశించిన సంగతి నాకు తెలుసు. కానీ నేనెంతో దుర్మార్గురాలిని గనుక ఆయనను ఒంటరిగా పోనిచ్చాను. అయ్యో కరుణా మీ అమ్మ, నాన్నలు కూడా ఇక్కడ ఉంటే ఎంతబాగుండేది. శ్రీమతి భయభీతి, శృంగారవతి అమ్మగారు కూడా ఇక్కడ ఉంటే ఎంతబాగుండేది! ఖచ్చితంగా వారి హృదయాలు మారతాయి. ఎవరైనా యాత్రికులుగా మారడానికి భయంగాని, వ్యామోహంగాని ఏది అడ్డురాదు.

గొప్పమనస్సు: నీవు ఎంతో ఆప్యాయంగా మాట్లాడుతున్నావు. ఈ భావన నీకు ఎల్లప్పుడూ ఉంటుంది అనుకుంటున్నావా? నీవు పొందిన ఈ ప్రత్యక్షత అందరికీ బయలుపరచబడదని గుర్తుంచుకో, నీ రక్షకుడు రక్తం చిందించడాన్ని చూసిన వారందరికి కూడా ఈ ప్రత్యక్షత కలుగదు. ఆయన ప్రక్కనే నిలబడి ఆయన గుండెల్లోనించి రక్తం కారుతుంటే చూచి రోధించాల్సింది పోయి నవ్వుతూ హేళన చేసిన వాళ్లు కొందరు ఉన్నారు. కాబట్టి మీకు కలిగినది కుమార్తెలారా, ఓ ప్రత్యేకమైన దైవకృపచేతనే మీ జీవితంలో ఈ అవకాశం లభించింది.

నిద్రిస్తున్న ముగ్గురిని ఉరితీయుట

ఇప్పుడు నాకలలో క్రైస్తవుడు దారిన పోతుండగా నిద్రపోతున్న అమాయకుడు, సోమరి, దురభిమాని అనే వారిని చూసిన స్థలానికి వారు చేరుకొన్నారు. ఆ ముగ్గురు ఉరితీయబడిన స్థలాన్నికూడా గొప్పమనస్సు వారికి చూపించాడు.

కరుణ: ఆ ముగ్గురు ఎవరు? వాళ్లనెందుకు అలా ఉరితీసారు?

గొప్పమనస్సు: వారు ముగ్గురు యాత్రకువెళ్లే ఉద్ధేశం లేకుండానే దారిన వెళుతున్న యాత్రికుల మనస్సులను పాడుచేసి వారి సంకల్పాన్ని చెడగొట్టేందుకు కంకణం కట్టుకున్న దుర్మార్గులు.

కరుణ: వాళ్ల మాటలు వినడానికి, వాళ్ల ప్రచారం నమ్మడానికి ఎవరైనా దొరికారా?

గొప్పమనస్సు: అవును. వారు అనేకులను దారిమళ్లించారు. మందగమనం, చిరుగాలి, నిర్దయుడు, వ్యామోహం, నిద్రబోతు, మందమతి అనే ఓ అమ్మాయి అనే వాళ్లకు మాయమాటలు చెప్పి వారి మార్గం తప్పించడం నాకు గుర్తుంది. పరలోక దేశం గురించి ఒక చెడ్డవార్త పుట్టించారు. దాని గురించి అతిగా చెప్పబడిందని, మన ప్రభువు కఠినాత్ముడని చెప్పి అనేకులను నమ్మించారు. విశ్వాసపాత్రులైన ఆయన సేవకులను కూడా ఇతరుల విషయాల్లో జోక్యంచేసుకొనే వారని చాడీకోరులని విమర్శించేవారు. పైగా జీవాహారాన్ని పొట్టు అని, క్రైస్తవులు అనుభవించే ఆదరణ కేవలం భ్రమ అని, క్రైస్తవ సేవని లాభంలేని శ్రమ అని పిలిచేవారు.

క్రిస్టియానా: వాళ్లు అలాంటి వాళ్లయితే నేను వాళ్లగురించి నేను దుఃఖపడను. వాళ్లకు తగిన శాస్తి జరిగింది. పైగా దారిప్రక్కనే వాళ్లను ఉరితీయడం మంచిదయింది. ఇతరులకు ఒక

హెచ్చరికగా ఉంటుంది. అమాయకుడు, సోమరి, దురభిమానితో పాటు వాళ్ల మాటలు విని దారి తప్పిన వారి పేర్లుకూడా ఇక్కడ ఒకరాయి మీద చెక్కబడి ఉంటే ఈ దారిని వెళ్లే ప్రయాణికులకు ఒక హెచ్చరికగా ఉంటుంది.

గొప్పమనస్సు: ఆ పని ఎప్పుడో చేశారు. మీరు కొంచెం దగ్గరగా వెళ్లి చూస్తే అది మీకు కనిపిస్తుంది.

క్రిస్టియానా ఆ గోడదగ్గరకు వెళ్లి ఈ దుర్మార్గులు చేసిన పనులు వారు అనుసరించిన పద్ధతులు వారి మాటలు విని దారితప్పివారి పేర్లు చదివింది.

కష్టాలకొండమీదికి యాత్రికులను తెచ్చుట

వారు అలా వెళుతూ కష్టాలకొండ దగ్గరకు చేరుకున్నారు. క్రైస్తవుడు అటుగా వెళ్లినప్పుడు ఏమి జరిగిందో ఆ సంగతులన్నీ వివరించాడు గొప్పమనస్సు. అతడు వారిని నీటి ఊటవద్దకు తీసుకెళ్లాడు కాని యాత్రికులకు అసహ్యం కలిగేలా ఆ నీరు మురికి చేయబడింది. ఆ నీరు త్రాగే ముందు ఒక పాత్రలోనికి నింపి మురికి అంతా అడుక్కి చేరేవరకు ఆగవలసి వచ్చింది. ఆ తరువాత రెండు అడ్డదారులు చూపించాడు. ఒకటి కుడివైపున, మరొకటి దారికి ఎడమవైపున వెళ్లేదారులవి. లాంఛనం, వేషధారణ అనేవాళ్లు ఈ దారుల్లోనే వెళ్లి చివరికి నశించిపోయారు. మీరు చూస్తున్నట్టుగా ఆ దారులకు అడ్డంగా గుంటలు తవ్వి గొలుసులు కట్టినా, కొందరు ఈ కొండను ఎక్కడానికి బదులు ఈ దారుల్లోకి వెళ్లడానికే సాహసం చేస్తున్నారు.

క్రిస్టియానా: వారికి ఆలోచనలేదు ఈ కొండను కష్టపడి ఎక్కలేనంత సోమరులు వారు. "సోమరి మార్గము ముళ్లకంచె, యదార్థవంతుల త్రోవ రాజమార్గము"[1] అన్న సామెత వీరి విషయంలో నెరవేరింది.

యాత్రికులు కొండ ఎక్కుతుండగా దాహంతో గొంతు ఎండిపోతున్న క్రిస్టియానా ఇలా అంది: ఇది ఖచ్చితంగా ఆయాసకరమైన ప్రయాణమే. తమ ఆత్మలకంటే సుఖాన్ని ప్రేమించేవారు మరో మార్గం చూసుకోవడంలో ఆశ్చర్యంలేదు!

"కొద్దిసేపు నేను కూర్చోవలసిందే" అన్నది కరుణ.

చిన్నపిల్లవాడు ఏడవటం మొదలుపెట్టాడు.

యువరాజు పర్ణశాలవద్దకు యాత్రికులను నడిపించుట

కరుణ: అలసినవారికి విశ్రాంతి ఎంత హాయిగా ఉంటుంది. యాత్రికులకు ఇటువంటి స్థలాన్ని అందించిన యువరాజు ఎంత మంచివాడో! ఈ మంచి పర్ణశాల గురించి నేను విన్నాను. ఇప్పుడు మనం నిద్రపోకుండా జాగ్రత్తపడాలి. ఈ స్థలంలో నిద్రపోవాలన్న శోధన ఎంత అధికంగా

1. సామెతలు 15:19 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

ఉంటుందో అలా చేయడం వలన క్రైస్తవుడు ఇక్కడ ఉన్నప్పుడు ఎంత మూల్యం చెల్లించాల్సి వచ్చిందో నేను విన్నాను.

గొప్పమనస్సు: అబ్బాయిలూ, మీరెలా ఉన్నారు? యాత్రగురించి ఇప్పుడు మీరు ఏమనుకొంటున్నారు?

జేమ్స్: మీరు నా చేయి పట్టుకొన్నప్పుడు నాకు చాలా భయంవేసింది. నాకు నిజమైన అవసరం ఉన్నప్పుడు మీరు సహాయం చేసినందుకు వందనాలు. మా అమ్మచెప్పిన మాటలు ఇప్పుడు నాకు గుర్తొస్తున్నాయి. "పరలోకమార్గం నిచ్చెన ఎక్కినట్టు ఉంటుందని, నరకానికి దారి కొండదిగినట్లు ఉంటుంది" అని ఆమె అంటూ ఉండేది. అయితే నేను పరలోకానికి నిచ్చెన అయినా ఎక్కుతాను గాని మరణానికి దారితీసే కొండదిగి వెళ్లను.

కరుణ: కాని కొండదిగువకు వెళ్లడమే తేలిక.

జేమ్స్: అయినా నాకనిపిస్తుంది కొండదిగడమే అత్యంత కష్టమనిపించే రోజు ఒకటి వస్తుందని.

ఆమె ప్రశ్నకు నువ్వు సరైన సమాధానం చెప్పావు బాబూ అన్నాడు మార్గదర్శి.

కరుణ నవ్వింది కాని ఆ అబ్బాయి సిగ్గుపడ్డాడు.

క్రిస్టియానా: రండి కాస్త విశ్రాంతి తీసుకుంటూ ఏదో ఒకటి తిందాం. నా దగ్గర కొన్ని దానిమ్మ పండ్లు, కొంత తేనె, కొంచెం ద్రాక్షారసం ఉన్నాయి. మనం వివరణకర్త ఇంటినుండి వస్తుండగా ఇవన్నీ ఆయనే నాచేతిలో పెట్టాడు.

కరుణ: నిన్ను పక్కకు పిలిచినప్పుడు ఆయన నీకు ఏదో ఇచ్చాడు అనుకున్నాను.

క్రిస్టియానా: అవును కరుణ, నాకున్నది ఏదైనా మీతో ఆనందంగా పంచుకొంటాను. నీవు మీ ఇంటిని, బంధువులందరిని విడిచి ఎంతో ఇష్టంగా నాకు తోడుగా రావడానికి బయలుదేరినప్పుడే నేను నీకు ఈ మాట చెప్పాను.

అందరూ కలిసి వాటిని హృదయపూర్వకంగా తిన్నారు. అయితే గొప్పమనస్సు వద్దు అన్నాడు. "మీరు చాలా దూరప్రయాణం చేస్తున్నారు గనుక మీకు చాలా శక్తి అవసరం. ప్రస్తుతం నేను ఇంటికి తిరిగి వెళుతున్నాను గనుక నేను తినడానికి అక్కడ చాలా ఉంటుంది. నిజానికి మీతో బయలుదేరక ముందే కడుపునిండా తిన్నాను కనుక ఇప్పుడు ఏమీ తినాలనిపించడం లేదు."

వాళ్లందరూ తిని కొద్దిసేపు మాట్లాడుకున్న తరువాత, మార్గదర్శి ఇలా చెప్పాడు, "మీరు విశ్రాంతి తీసుకొని బయలుదేరడానికి సిద్ధంగా ఉంటే వెళదాం పదండి." ఆ విధంగా వాళ్లు లేచి కొండ ఎక్కడం ప్రారంభించారు. పిల్లలు అందరికంటే ముందు వెళుతున్నారు. అయితే క్రిస్టియానా తన ద్రాక్షారసం సీసా మరచిపోయింది గనుక దానికోసం చిన్నవాణ్ని వెనక్కి పంపింది.

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

కరుణ: ఇక్కడ ఏదో ఒకటి పోగొట్టుకోవలసిందేనేమో. క్రైస్తవుడు తన గ్రంధాన్ని పోగొట్టుకోగా ఇప్పుడు క్రిస్టియానా తన సీసాని మరచిపోయి వదిలేసింది. దీనికి కారణం ఏమైయుంటుందండి?

గొప్పమనస్సు: అలసటే దీనికి కారణం అనుకుంటాను. కొందరు మెలకువగా ఉండవలసిన సమయంలో నిద్రిస్తారు, గుర్తుపెట్టుకోవలసినప్పుడు మరచిపోతారు. ప్రతివ్యక్తిలో ఒక విధమైన బలహీనత వుంటుంది. యాత్రికులు ఎంత గొప్ప ఆనందంలో ఉన్నప్పటికీ వారు పొందినవాటి విషయంలో మెలకువ కలిగి గుర్తుపెట్టుకొని ఉండాలి. ఇది చేయడంలో వారు విఫలమైతే తరచుగా వారి ఆనందం కన్నీటితో ముగుస్తుంది. వారి సూర్యోదయం మబ్బులమాటున దాగిపోతుంది. క్రైస్తవుడికి జరిగినదే జరుగుతుంది.

అపనమ్మిక, పిరికితనం క్రైస్తవుడ్ని కలిసి దారిలో సింహాలు ఉన్నాయి గనుక వెనక్కి వెళ్లిపొమ్మని బలవంతపెట్టిన స్థలానికి వారు చేరుకున్నప్పుడు అక్కడ ఒక వేదిక కట్టబడి దానిప్రక్కన అంచులమీద ఈ క్రింది మాటలు చెక్కి వుండడం చూశారు. **"ఎవరైనా భయంచేత గాని, అపనమ్మికచేత గాని ముందుకు వెళ్లడానికి నిరాకరించినా, ఇతరులను వెనక్కి పొమ్మని బలవంతపెట్టినా అట్టి వారిని శిక్షించుటకే ఈ వేదిక నిర్మించడమైనది."**

సింహాలను దాటి యాత్రికులను ముందుకు నడిపించుట

సింహాలు కనిపించేంత వరకు వారు ముందుకు సాగివెళ్లారు. ఇక్కడ అందరికంటే ముందు వెళుతున్న పిల్లలు వెనక్కి తగ్గారు. మార్గదర్శి వాళ్లను చూసి నవ్వాడు. "ఏమైంది పిల్లలూ? ఏ ప్రమాదం కనిపించనప్పుడు ముందుకు వెళ్లడం మీకిష్టం. సింహాలు కనిపించగానే మా వెనక్కి వచ్చి నిలబడతారు" అన్నాడు.

ఇప్పుడు వారు సింహాలను సమీపిస్తుండగా గొప్పమనస్సు తన కత్తినిదూసి ఆడవాళ్లను, పిల్లలను కాపాడుతూ క్షేమంగా ముందుకు తీసుకెళ్లడానికి ప్రయత్నించాడు. సరిగ్గా అప్పుడే ఒక భయంకరమైన రాక్షసుడులాంటి వ్యక్తి చేతిలో దుడ్డు కర్రతో వారికి ఎదురుగా నిలబడ్డాడు. అతని పేరు రక్తపిపాసి. గతంలో యాత్రికులను హతమార్చిన కారణంగా అలా పిలిచేవారు. "ఇక్కడికి రావడంలో నీ ఉద్దేశమేమిటి?" అని అతడు మార్గదర్శిని అడిగాడు.

గొప్పమనస్సు: ఈ ఆడవాళ్లు, పిల్లలు యాత్రికులు గనుక వారు ఇదే మార్గంలో వెళ్లాలి. నీవు, ఆ సింహాలు ఇంకా ఎన్ని అడ్డొచ్చినా వాళ్లు ఈ దారినే వెళ్లాలి.

రక్తపిపాసి: ఇది వాళ్ల దారి కాదు. ఇలాంటి వాళ్లని అడ్డగించడానికి ఇక్కడ నేను ఉన్నాను గనుక వారు ఈ దారిలో వెళ్లలేరు.

ఈ సింహాలు రాక్షసుడు ఉంటున్న కారణంగా ఈ దారిలో ఎక్కువ మంది ప్రయాణించడం లేదు గనుక దారి అంతటా పిచ్చి మొక్కలు పెరిగాయి. ఇదంతా గమనించిన క్రిస్టియానా వారికి

ఒక లేఖనాన్ని గుర్తుచేసింది. "అనాతు కుమారుడైన షమ్గరు దినములలో యాయేరు దినములలో రాజమార్గములు ఎడారులాయెను ప్రయాణస్తులు చుట్టుత్రోవలోనే నడిచిరి. ఇశ్రాయేలీయుల అధిపతులు లేకపోయిరి దెబోరా అను నేను రాకమునుపు ఇశ్రాయేలులో నేను తల్లిగా ఉండక మునుపు వారు లేకపోయిరి."[2]

అప్పుడు రక్తపిపాసి సింహాల మీద ప్రమాణం చేసి వారు వెళ్లకూడదని బెదిరించాడు. ఇక్కడ మీకు దారిలేదు అని చెప్పాడు.

రాక్షసుడిపై దాడి

గొప్పమనస్సు ఆ రాక్షసుడిపై దాడి చేసి వానిని వెనక్కి నెట్టాడు. అప్పుడు రక్తపిపాసి నా సొంత ప్రదేశంలోనే నన్ను చంపుతావా? అంటూ కేకలు వేశాడు.

గొప్పమనస్సు: ఇది రాజుగారి మార్గం. నీవు నీ సింహాలు దురాక్రమణ దారులుగా దీనిని ఆక్రమించుకొన్నారు. మీరు ఇక్కడివారు కాదు. నీవు నీ సింహాలు ఎన్ని అడ్డువచ్చినా ఈ స్త్రీలు పిల్లలు ఇదే దారిని వెళ్తారు.

అంతటితో అతడు ఆ రాక్షసుడిని ఎంత భయంకరమైన దెబ్బ కొట్టాడంటే ఆ దెబ్బతో వాడు రక్తం కక్కుతూ మోకాళ్లపైబడి ఒక చేయి తెగిపడిపోయింది. ఆ రాక్షసుడి వికృతమైన అరుపులకు యాత్రికులు భయపడ్డారు కాని వాడు నేలమీద పడి ఉండటం చూసి ఆనందించారు. ఇక సింహాలైతే గొలుసులతో బంధించబడి ఉన్నాయి గనుక అవి ఎలాంటి హాని చేయలేకపోయాయి. ఆ విధంగా రక్తపిపాసి మరణించాక గొప్పమనస్సు ఇలా అన్నాడు: "సింహాల నుంచి మీకు ఎలాంటి ఆపాయం ఉండదు గనుక నన్ను వెంబడించండి." స్త్రీలు భయంతో వణికిపోయినా పిల్లల ముఖాలు పాలిపోయినా ఎలాంటి గాయం లేకుండా వారు అక్కడనుండి వెళ్లిపోయారు.

2. న్యాయాధిపతులు 5:6-7

అధ్యాయం 15
కావలివాని సత్రం

ఇప్పుడు వారు కావలివాని సత్రానికి చేరువగా వస్తున్నారు. చీకటి పడుతోంది గనుక రాత్రివేళ ఆ గ్రామంలో దారిలో ఉండటం సురక్షితం కాదు గనుక వారు వేగంగా నడుస్తున్నారు. సత్రం తలుపు దగ్గరికి వచ్చినప్పుడు మార్గదర్శి తలుపు తట్టాడు. "ఎవరక్కడ?" అంటూ కావలి వాడు మేడమీద కిటికీలోంచి అరిచాడు. "నేనే" అని మార్గదర్శి బదులివ్వడంతో కావలివాడు అతని స్వరాన్ని గుర్తించాడు. గతంలో అతడు తరచుగా యాత్రికులకు తోడుగా సత్రం వద్దకు వస్తుండేవాడు.

కావలివాడు కిందికి దిగి వచ్చి తలుపుతెరిచి చూడగా మార్గదర్శి వెనక స్త్రీలు, పిల్లలు నిలబడి ఉండటంతో కావలివానికి మార్గదర్శి ఒక్కడే కనిపించాడు. "ఏం గొప్పమనస్సు, ఇంత అర్ధరాత్రి వేళ ఇక్కడ ఏంచేస్తున్నావు?" అని ప్రశ్నించాడు.

గొప్పమనస్సు: ఇదిగో, ఈ యాత్రికులను తీసుకొచ్చాను. ప్రభువు ఉపదేశానుసారం వీళ్లు ఈ రాత్రి ఇక్కడే బసచేయాలి. దారిలో రాక్షసుడు చేతిలో దుడ్డుకర్ర పట్టుకొని సింహాల తరుపున మాతో పోరాడి అడ్డగించకుండా ఉంటే మేము ఇంకా ముందుగానే ఇక్కడికి వచ్చి ఉండేవాళ్లం. అయితే చాలా సుదీర్ఘమైన కఠినపోరాటం తరువాత నేను వాడిని వధించగలిగాను.

కావలివాడు: నీవు లోనికి వెళ్లి ఉదయం వరకు బస చేస్తావా?

గొప్పమనస్సు: లేదు. ఉండాలనే ఉంది కాని ఈ రాత్రికి నేను తప్పక తిరిగి వెళ్లిపోవాలి.

క్రిస్టియానా: అయ్యో అలాగైతే ఇప్పుడు మేము ఏం చేయాలో నాకు పాలుపోవడం లేదు. నీవు మా పట్ల ఎంతో నమ్మకంగా ఉండి ఇంతవరకు తీసుకువచ్చావ్. మా తరపున ధైర్యంగా పోరాడావు. నేను ఎన్నటికీ మరచిపోలేని విధంగా నాకు ఎన్నో సలహాలు ఇచ్చావు.

కరుణ: గొప్ప మనస్సుగారు, మీరు మా ప్రయాణం చివరి వరకు మాతోనే ఉంటేనే బాగుండు అనిపిస్తుంది. మీలాంటి బలమైన స్నేహితుడు మార్గదర్శి తోడు లేకుండ మావంటి బలహీనులైన మహిళలు ఇలాంటి శ్రమతో కూడిన అపాయకరమైన మార్గంలో ఎలా కొనసాగగలరు?

జేమ్స్: మీరు దయచేసి మాతో వచ్చి మాకు సహాయం చేయండి. మేము చాలా బలహీనులం. మీరు చాలా బలవంతులు పైగా ఈ మార్గం చాలా కొత్తది సుదీర్ఘమైనది.

గొప్పమనస్సు: నేను నాప్రభువు ఆజ్ఞను పాటించాలి. చివరి వరకు మీతో వెళ్లమని ఆయన నాకు ఈ పని అప్పగిస్తే నేను ఆనందంగా తిరిగి వచ్చి మీకు సేవలు చేస్తాను. అయితే మీరు ఆయనతో ఉన్నప్పుడు ఈ విషయం అడగటం మరచిపోయారు. ఆయనే స్వయంగా నన్ను ఇక్కడి వరకు పంపించారు. అప్పుడే మీరు ఆయన్ని ప్రాధేయపడి ఉండాల్సింది. నన్ను మీతో చివరి వరకు పంపించమని అడిగినట్లయితే ఆయన మీ మనవిని అంగీకరించి ఉండేవాడు. ఏదిఏమైనా ఇప్పుడు నేను వెళ్లవలసిందే. కాబట్టి క్రిస్టియానా, కరుణ, ధైర్యవంతులైన పిల్లలారా, నేను వెళ్లొస్తాను.

ఆ సత్రం యజమాని, క్రిస్టియానాని తన దేశం గురించి బంధువుల గురించి అడిగినప్పుడు ఆమె ఇలా చెప్పింది. "నేను నాశనపురమునకు చెందినదానను. నేనొక విధవరాలిని; నా భర్త పేరు యాత్రికుడైన క్రైస్తవుడు."

"మంచిది, మంచిది అతను నీభర్తా?" అడిగాడు సత్రం యజమాని.

"అవును, ఇదిగో వీళ్లు ఆయన పిల్లలు" అని చెబుతూ కరుణను చూపించి "ఆమె నా స్నేహితురాలు, మా పక్కింటి వ్యక్తి" అని పరిచయం చేసింది.

అప్పుడు సత్రం యజమాని గంటకొట్టగానే సాత్వీకం అనే ఒక సేవకురాలు బయటకు వచ్చింది. "నీవు వెళ్లి మనవాళ్లందరికి చెప్పు క్రైస్తవుడి భార్య క్రిస్టియానా, ఆమె పిల్లలు, స్నేహితురాలు సీయోను పట్టణానికి వెళుతూ ఇక్కడికి వచ్చారని"

ఆ వార్త చెప్పడానికి ఆమె పరుగున వెళ్లి ఆనందంతో కూడిన ఒకవిధమైన కలకలం సృష్టించింది. వాళ్లందరు తలుపు దగ్గరకు వచ్చారు. వారిలో ఒకరు "క్రిస్టియానా, మిమ్మల్ని చూస్తుంటే చాలా సంతోషంగా ఉంది." అనగా మరొకరు "ఈ సత్రంలోనికి మీ అందరికి స్వాగతం" అన్నారు. ఆ ఇంటి యజమానురాలైన వివేకం "మీరందరు లోపలికి రండి, మీరు ఖచ్చితంగా ఇక్కడ ఆహ్వానితులే."

వాళ్లందరు కలిసి ఒక పెద్ద గదిలోనికి వెళ్లారు. అక్కడ ఇంటి యజమాని యాత్రికులను పలకరించాడు. వారు కొద్దిసేపు మాట్లాడుకున్న తరువాత "ఇప్పటికే బాగా ఆలస్యం అయినందున, ప్రయాణ బడలిక చేత మేం బాగా అలసి ఉన్నందున మేమిక త్వరగా విశ్రాంతి తీసుకోవడం మంచిదేమో" అన్నది క్రిస్టియానా.

రోజంతా ప్రయాణం చేసినందుకే కాక గొప్పమనస్సుకు రాక్షసుడికి మధ్య జరిగిన భీకర పోరాటాన్ని కళ్లారా చూసినందువలన కూడా వారు బాగా అలిసిపోయారు.

"నిజమే మీరు బాగా అలసిపోయారు కాని ముందుగా మీరు తినడానికి ఏదైనా వడ్డించనివ్వండి. మీరు వస్తున్నారని తెలిసి మీకోసం వేటమాంసం తయారు చేయించాను. మీరు ఇంకా పెందలకడనే వస్తారని ఎదురు చూశాము" అని చెప్పింది వివేకం. వాళ్లందరు భోంచేసి ప్రార్థన చేసుకున్న తరువాత ఒక పాట పాడుకొని ఎవరి గదిలోనికి వాళ్లు విశ్రాంతి కోసం వెళ్లిపోయారు.

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

క్రిస్టియానా: మనం కొంచెం ధైర్యం చేసి నా భర్త ఇక్కడికి వచ్చినప్పుడు ఉపయోగించిన గదిని మనకు ఇవ్వమని అడిగి ఉంటే బాగుండేది.

ఆ విషయం తెలిసిన ఇంటి యజమాని వారికి అదే గదిని కేటాయించగా ఆ స్త్రీలు క్రైస్తవుడి గదిలో నిద్రపోయారు. వారు నిద్రకు ఉపక్రమించక ముందు క్రిస్టియాన, కరుణ కొద్దిసేపు మాట్లాడుకున్నారు.

క్రిస్టియానా: మా వారు యాత్రాజీవితం ఆరంభించినప్పుడు నేను కూడా ఆయన అడుగుజాడల్లో నడుస్తానని కలలోకూడా ఊహించలేదు.

కరుణ: అంతేకాదు ఆయన బసచేసిన చోటనే నీవుకూడా ఆగి ఆయన పడుకున్న మంచంమీదనే నీవు కూడా ఇలా విశ్రమిస్తావన్న ఆలోచనకూడా నీకు వచ్చిఉండదనుకుంటా.

క్రిస్టియానా: పైగా అన్నీ సవ్యంగా జరిగితే ఒక దినాన ఆయన్ని మహిమలో కలిసి ముఖాముఖి ఆయనతో పాటు ప్రభువుని రారాజును ఆయన పరిశుద్ధ సౌందర్యంలో ఆరాధించగలనని కూడా ఎన్నడూ తలంచలేదు.

కరుణ: నీకు వినిపిస్తుందా శ్రావ్యమైన సంగీతం?

క్రిస్టియానా: మనం ఇక్కడికి వచ్చినామన్న ఆనందంతో బహుశా వాళ్లు పాటలు పాడుకుంటున్నారేమో.

కరుణ: అద్భుతం! మనం వచ్చిన ఆనందంతో ఈ రాత్రి ఈ ఇంటిలో, ఇక్కడ ఉన్నవారి హృదయాలలోనే కాక పరలోకంలో కూడా సంగీతం వినబడుతుంది (లూకా 15:10).

కరుణ యొక్క స్వప్నం

అప్పుడు వాళ్లు నిద్రపోయారు. మరునాడు ఉదయాన కరుణ మెలకువగా ఉన్నప్పుడు క్రిస్టియానా ఇలా అడిగింది: "రాత్రి నువ్వు నవ్వుతున్నావెందుకు? కలగంటున్నావా ఏంటి?"

కరుణ: రాత్రి నాకొక కలవచ్చింది. ఆ కలలో నేను ఒంటరిగా ఒక ఏకాంత ప్రదేశంలో కూర్చున్నాను, నా హృదయ కాఠిన్యాన్ని బట్టి మూల్గుతున్నాను. నేను చెప్పే మాటలు వినడానికి త్వరలోనే నా చుట్టూ అనేకమంది గుమికూడారు. అక్కడ వాళ్లంతా వింటూ నిలబడ్డారని భావించిన నేను దుఃఖపడుతూ ఉన్నాను. వారిలో కొందరు నవ్వారు, మరికొందరు నేనొక బుద్ధిహీనురాలినని నిందిస్తూ తలలు ఊపుతున్నారు, ఇంకొందరు నన్ను కదిలించి ప్రక్కకు తోశారు.

అప్పుడు నేను పైకి చూడగా రెక్కలున్న ఒకరు నావైపు రావడం గమనించాను. అతడు నాయొద్దకు వచ్చి, "కరుణా, నీకు ఏమైంది?" అని అడిగినట్లు అనిపించింది. నా ఫిర్యాదు విన్నప్పుడు అతడు ఇలా అన్నాడు "నీకు సమాధానము కలుగును గాక!" ఈ మాటలు చెప్పి

అతడు నా కన్నీళ్లు తుడిచి, నాకు ఊదారంగు, బంగారపు వస్త్రాలను ధరింపజేశాడు. నా మెడలో ఒక బంగారు గొలుసు వేసి, నా చెవులకు పోగులు, నా తలమీద తళతళ మెరిసే కిరీటం పెట్టాడు. తరువాత నా చేయి పట్టుకొని, "కరుణా, నాతో రా" అన్నాడు. అలా మేము పైకి వెళ్ళి, వెళ్లి చివరకు ముత్యాల గుమ్మం దాక చేరుకున్నాం. అతడు తలుపు తట్టగా ద్వారం తెరుచుకుంది, మేము లోపల ప్రవేశించాం. అతని వెంట నేను వెళుతూ, చివరికి ఒక సింహాసనం వద్దకు చేరుకున్నాం. మహోత్సాహంతో ఆ సింహాసనం మీద కూర్చున్న ఒకరు "కుమారీ, నీకు స్వాగతం!" అన్నారు. ఆ స్థలం ఎంతో ప్రకాశమానంగా, దేదీప్యంగా వెలుగుతోంది; అక్కడ నీ భర్త కనిపించాడనుకుంటాను. అప్పుడు నేను మేల్కొన్నాను. కానీ, రాత్రి నేను నవ్వేనా?

క్రిస్టియానా: నవ్వేవు. నీకు వచ్చిన కల అలాంటిది కాబట్టి తప్పకుండ నవ్వి ఉంటావు. అది అద్భుతమైన స్వప్నమనే చెప్పాలి. దానిలో మొదటి భాగం ఇప్పటికే నెరవేరింది; కాబట్టి తక్కిన భాగం కూడ నిజమవుతుందని నీవు ఆశించవచ్చు. నిన్ను తన సేవకు పిలిచిన ఉద్దేశాన్ని ప్రభువు కలద్వారా నీకు చూపిస్తున్నాడన్న మాట. "దేవుడు ఒక్కమారే పలుకును రెండుమారులు పలుకును అయితే మనుష్యులు అది కనిపెట్టరు. మంచముమీద కునుకు సమయమున గాఢనిద్ర పట్టునప్పుడు కలలో రాత్రి కలుగు స్వప్నములలో."[1] పడక మీద ఉన్నప్పుడు మనము దేవునితో మాట్లాడేందుకు మెలకువగా ఉండనవసరం లేదు. మనము నిద్రిస్తున్నప్పుడు సహా ఆయన మనలను దర్శించి, ఆయన స్వరమును మనకు వినిపించగలడు; మనము మెలకువగా ఉన్నప్పటి వలె నిద్రిస్తున్నప్పుడు కూడ ఆయన మన హృదయాలతో మాటలతోనైనా, సామెతలద్వారానైనా, లేదా సూచనలు, గురుతుల ద్వారానైనా మాట్లాడగలడు.

కరుణ: ఇక్కడ కొంతకాలం ఉండమని వారు మనల్ని అడిగితే, దానికి మనం సంతోషంగా ఒప్పుకుందాం. ఈ చెలికత్తెలతో నేను కాస్త పరిచయం చేసుకోవాలనుకుంటున్నాను. వారి ముఖాలు ఎంతో ప్రియమైనవిగా అందంగా కనిపిస్తున్నాయి.

క్రిస్టియానా: వాళ్లేమంటారో చూద్దాం.

వారు లేచి సిద్ధపడి క్రిందికి వెళ్లారు. చెలికత్తెలు వారికోసం ఎదురు చూస్తున్నారు. రాత్రి బాగా నిద్రపట్టింది లేనిదీ, చక్కగా విశ్రాంతి తీసుకొన్నారా లేదా అడిగి తెలుసుకున్నారు. "నాకు చాలా బాగ నిద్రపట్టింది నా జీవితంలో ఇంత హాయిగా విశ్రాంతి తీసుకొన్న రోజు ఇదే" అని చెప్పింది కరుణ.

భక్తి: మీరందరూ మాతోపాటు అనేక దినాలు గడపాలని మేమంతా అనుకుంటున్నాం.

వివేకం: మీరు గనుక ఉండటానికి ఇష్టపడితే ఈ ఇంటిలో మీకు కావలసినవన్నీ అందించబడతాయి.

"అవును మేమంతా మనస్ఫూర్తిగా సేవలు చేస్తాం" అని చెప్పింది ప్రేమ.

1. యోబు 33:14-15

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

క్రిస్టియానా కొడుకులను ప్రశ్నించుట

ఆ విధంగా వారు అక్కడ ఉండడానికి మనస్ఫూర్తిగా ఒప్పుకొని, ఒకనెల రోజులపాటు ఉండిపోయారు. క్రిస్టియానా తన పిల్లలను ఎలా పెంచిందో తెలుసుకునేందుకు వీలుగా వారిని ప్రశ్నించడానికి తన అనుమతి కోరింది వివేకం. అందుకు క్రిస్టియానా సంతోషంగా అనుమతించింది.

అప్పుడు చిన్నవాడైన జేమ్స్‌తో ఆరంభించింది.

వివేకం: జేమ్స్ నిన్ను ఎవరు సృష్టించారో చెప్పగలవా?

జేమ్స్: ఆ. దేవుడే నన్ను సృష్టించాడు. తండ్రి, కుమార, పరిశుద్ధాత్మ దేవుడు నన్ను సృష్టించాడు.

వివేకం: చాలా బాగా చెప్పావు. మరి నిన్ను రక్షించేది ఎవరో చెప్పగలవా?

జేమ్స్: దేవుడే– తండ్రి, కుమార, పరిశుద్ధాత్మ.

వివేకం: కాని తండ్రియైన దేవుడు నిన్ను ఎలా రక్షిస్తాడు?

జేమ్స్: తన దైవకృపచేత.

వివేకం: కుమారుడైన దేవుడు ఎలా రక్షిస్తాడు?

జేమ్స్: ఆయన జీవము, మరణముల ద్వారా ఆయన రక్తము, ఆయన నీతి చేత.

వివేకం: మరి పరిశుద్ధాత్మ దేవుడు నిన్ను ఎలా రక్షిస్తాడు?

జేమ్స్: నన్ను వెలిగించి నూతనపరచి భద్రపరచుట ద్వారా.

అప్పుడు వివేకం క్రిస్టియానాతో ఇలా అంది "నీ పిల్లల్ని పెంచిన తీరును బట్టి నిన్ను తప్పక అభినందించాల్సిందే. చిన్నవాడే ఈ ప్రశ్నలకు ఇంత చక్కగా జవాబు ఇచ్చాడు గనుక ఇక తక్కిన పిల్లల్ని మేము అడగాల్సిన అవసరం లేదనుకుంటాను."

తరువాత ఆమె జోసఫ్ వెపు తిరిగి "జోసఫ్ నేను నిన్ను కొన్ని ప్రశ్నలు అడగవచ్చా?"

జోసఫ్: ఓ, సంతోషంగా అడగవచ్చు.

వివేకం: మనిషి ఎవరు?

జోసఫ్: జేమ్స్ చెప్పినట్టు దేవునిచేత సృష్టించబడి ఆలోచించగలిగిన ప్రాణి.

వివేకం: "రక్షింపబడుట" అనే మాటకు అర్థం ఏమిటి?

జోసఫ్: పాపము ద్వారా మానవుడు తనను తాను శిక్షావిధికి, చెరకు, క్షయతకు, దుఃఖానికి, మరణానికి లోను చేసుకున్నాడు.

వివేకం: త్రిత్వముచేత రక్షింపబడ్డాడు అంటే ఏమిటి?

జోసఫ్: పాపము అంత భయంకరమైన, బలమైన నిరంకుశ శక్తి గనుక పాపియైన మానవుణ్ని దాని బంధకాలనుంచి విడిపించడానికి తండ్రి, కుమార, పరిశుద్ధాత్మ మొత్తం దైవత్వమంతా జోక్యం చేసుకోవలసి వచ్చింది. దేవుడు ఎంతో ప్రేమగల బలవంతుడు గనుక మనిషిని తన భయంకరమైన పాపపు స్థితి నుండి రక్షించడానికి ఆయన సమస్త జ్ఞానాన్ని శక్తిని నైపుణ్యాన్ని వినియోగించడానికి ఇష్టపడ్డాడు.

వివేకం: మనుషులను రక్షించడంలో దేవుని ప్రణాళిక ఏమిటి?

జోసఫ్: తన నామాన్ని మహిమపరచుకొనుట, తన కృపను, కనికరమును న్యాయమును బయలు పరచి మనుషులకు నిత్యజీవాన్ని ఆనందాన్ని అనుగ్రహించుట.

వివేకం: రక్షింపబడినవారు ఎవరు?

జోసఫ్: క్రీస్తును తమ సొంత రక్షకునిగా అంగీకరించినవారు, వారి పాపములు క్షమించబడినాయని ఎరిగి పరిశుద్ధాత్మద్వారా జన్మించి దేవుని మార్గాలను, దేవుని చిత్తాన్ని జరిగించుటకు తమను తాము అప్పగించుకున్నవారు.

వివేకం: చాలా బాగుంది! జోసఫ్, మీ అమ్మ నీకు చాలా బాగా నేర్పించింది, ఆమె నేర్పించినవన్నీ నీవు చక్కగా గుర్తుంచుకున్నావు.

"శామ్యూల్, నిన్ను కొన్ని ప్రశ్నలు అడిగితే నీకు ఏమీ ఇబ్బంది లేదుగా?" అన్నది శామ్యూల్‌తో వివేకం.

శామ్యూల్: అదేమీ లేదు.

వివేకం: పరలోకం అంటే ఏమిటి?

శామ్యూల్: దేవుడు అక్కడ నివాసం ఉంటాడు గనుక అది పరిపూర్ణమైన సంతోషంతో ఉండే స్థలం.

వివేకం: నరకం అంటే ఏమిటి?

శామ్యూల్: పాపము, అపవాది, మరణముల కారణంగా కలిగే యాతనతోకూడిన స్థలం.

వివేకం: నీవు పరలోకం ఎందుకు వెళ్లానుకుంటున్నావు?

శామ్యూల్: నా ప్రభువైన క్రీస్తుయేసును చూడాలని ఆయనను సదాకాలము సేవించాలని రక్షింపబడిన వారితోకలిసి సేవచేయాలని, దేవున్ని చూసి ఆయన నామాన్ని మహిమ పరచాలని.

వివేకం: చాలా తెలివైన పిల్లవాడు. చెప్పిన పాఠాలన్నీ నేర్చుకున్నవాడు శామ్యూల్.

అప్పుడామె అందరిలోకి పెద్దవాడైన, ఒక విధంగా యువకుడైన మాథ్యూ వైపు తిరిగి, "నిన్ను కూడా నేను కొన్ని ప్రశ్నలు అడగవచ్చా?" అని అడిగింది.

మాథ్యూ: అవును. నేను ఇష్టపడుతున్నాను.

వివేకం: దేవునికంటే ముందు ఏదైనా ఉనికిలో ఉన్నదా?

మాథ్యూ: లేదు. దేవుడు నిత్యుడు ఆయనే ఆదియందు సమస్తమును సృష్టించాడు. ఆరుదినములలో ఆయన భూమ్యాకాశములను, సముద్రములను వాటియందున్న సమస్తమును సృజించాడు.

వివేకం: బైబిల్ గురించి నీవు ఏమనుకుంటున్నావు?

మాథ్యూ: అది దేవుని పరిశుద్ధ వాక్యము.

వివేకం: బైబిల్‌లో నీకు అర్థంకానిది ఏమైనా ఉందా?

మాథ్యూ: దేవుడు నాకంటే జ్ఞానవంతుడు. అయితే నేను తెలుసుకోవలసిన దానిని–అనగా నాకు మేలు కలిగించి, దేవున్ని మహిమపరచే దానిని గ్రహించగలిగేలా దేవుడు సహాయం చేయాలన్నదే నాప్రార్థన.

వివేకం: మృతులపునరుత్థానం గురించి నీవు ఏమి విశ్వసిస్తున్నావు?

మాథ్యూ: ఇప్పుడు మనం కలిగి ఉన్న దేహాలే మరలా పునరుద్ధరించబడి అక్షయతను ధరిస్తాయని నేను నమ్ముతాను. అయితే ఇది బైబిల్‌లో ఉన్న నాకు అర్థంకాని విషయాలలో ఒకటి. అయినా దేవుడు వాగ్దానం చేశాడు గనుక ఆయన వాగ్దానం నెరవేర్చే దేవుడు అని నాకు తెలుసు గనుక నేను దానిని నమ్ముతాను.

అప్పుడు వివేకం పిల్లలతో ఇలా అన్నది. "మీరు చాలా విషయాలు నేర్చుకున్నారు అయినా మీ అమ్మ మీకు ఎన్నో సంగతులు నేర్పించగలదు కాబట్టి మీరు ఆమె మాట వినాలి అలాగే పెద్దలైన యాత్రికులు చెప్పేవాటియందు లక్ష్యముంచాలి ఎందుకంటే వారు తమకున్న విశేషమైన అనుభవంతో చిన్నవారి ఆత్మీయ వెలిగింపుకోసం మాట్లాడతారు. అయితే ముఖ్యంగా మీరు లేఖనాల అధ్యయనంలో ఎక్కువ సమయం గడపండి. మీరు నన్ను ఏ ప్రశ్నలైనా అడగవచ్చు. దైవికమైన క్షేమాభివృద్ధిని కలిగించే ప్రశ్నలు అడిగితే వాటికి జవాబు చెప్పడానికి, మీరు ఇక్కడ ఉన్నంతకాలం నాకు చేతనైనంత వరకు మీకు నేర్పించడానికి నేను సంతోషంగా ఒప్పుకుంటాను."

కరుణకు తగినవాడు

యాత్రికులు ఆ సత్రంలో ఓ వారం రోజులు గడిపిన తరువాత ఒక రోజు కరుణను దర్శించడానికి ఒక వ్యక్తి వచ్చాడు. అతడు సంపన్నుడైన యువకుడు. చూడ్డానికి మంచి భక్తిపరుడిలా ఉన్నాడు కాని లోకపు విషయాలపట్ల తీవ్రమైన ఆసక్తి కలిగినవాడు. అతడు కరుణను చూడడానికి చాలాసార్లు వచ్చాడు తనను పెండ్లిచేసుకోమని ప్రతిపాదన చేశాడు. కరుణ చాలా అందమైన ఆకర్షణీయమైన యువతి. కానీ తీరికలేకుండ ఎప్పుడు ఏదో ఒక పనిచేస్తూ ఉంటుంది. ఆమె తనకోసమో ఇతరుల కోసమో అవీ ఇవీ సర్దుతూ ఉంటుంది. కనుక ఆమె మంచి గృహిణిగా ఉండగలదని ఆ యువకుడు భావించాడు. ఇప్పుడు కరుణ అక్కడ ఉన్నవారిని కలిసి అతని గురించి వాకబు చేసింది. ఎందుకంటే అతని గురించి ఆమె కంటే వాళ్లకే ఎక్కువ తెలుసు. అతడు ఆకర్షణీయమైన ఆసక్తి శక్తి సామర్థ్యాలు కలిగిన భక్తిగల యువకుడు. అయితే ఆత్మీయ జీవితానికి, దానిశక్తికి సంబంధించి పెద్దగా తెలియదని వారు చెప్పారు.[2]

కరుణ: అలాగైతే నేనతన్ని ప్రోత్సహించను. ఎందుకంటే నా ఆత్మీయజీవితాన్ని గాని నా క్రైస్తవసేవను గాని ఎవరూ అడ్డగించడం నాకిష్టంలేదు.

వివేకం: నువ్వు అకస్మాత్తుగా అతనితో తెగతెంపులు చేసుకోవల్సిన అవసరం లేదు పేదలకు నువ్వుచేసే సేవను చూసి అతడే చల్లబడిపోతాడు.

ఈసారి ఆ యువకుడు వచ్చినప్పుడు కరుణ పేదవారికి ఏవో తయారు చేస్తూ పనిలో నిమగ్నమై ఉండిపోయింది.

"చూస్తుంటే నువ్వు ఎప్పుడూ ఏదో ఒకటి చేస్తూవుంటావా?" అన్నాడతను.

"అవును. నాకోసమో లేక ఇతరులకోసమో నేను ఏదో ఒకటి చేస్తుంటాను" అన్నది కరుణ.

"రోజుకు ఎంత సంపాదిస్తావు?"

"సత్క్రియలయందు ధనవంతురాలినగుటకు, రాబోవు కాలమునందు నాకొరకు మంచి పునాది వేసుకొనుటకు మరియు నిత్యజీవమును కాపాడుకొనుటకు నేను ఈ పనులు చేస్తుంటాను"[3]

"నువ్వు తయారు చేస్తున్న ఈ బట్టలన్నిటినీ ఏంచేస్తావు?"

"దిగంబరులకు వీటిని ధరింపచేస్తాను."

అప్పుడు అతడు ముఖం చిన్నబుచ్చుకొని మౌనం వహించాడు. అతడు ఆమె దగ్గరకు మరలా రాలేదు. అక్కడికి ఎందుకు వెళ్లడం లేదని తన స్నేహితులు అడిగినప్పుడు కరుణ చాలా అందమైన అమ్మాయే కాని కొన్ని పరిస్థితులు ఆమెకు ఆటంకంగా ఉన్నాయి అని చెప్పాడు.

2. 2తిమోతి 3:5 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8
3. 1తిమోతి 6:17-19

అతడు మరలా రాకపోయే సరికి వివేకం కరుణతో ఇలా అంది "నీ భక్తి విషయంలో నీవు యధార్థంగా ఉన్నప్పుడు అతడు నిన్ను వదిలేస్తాడని నేను చెప్పలేదా? ఇప్పుడతడు నీ గురించి చెడుగా మాట్లాడడం విని నీవు ఆశ్చర్యపోవద్దు. నీ మీద అతనికున్న ప్రేమను, ఒకప్పటి తన భక్తి పట్ల ఉండే ఆసక్తిని ప్రక్కపెట్టి అతడు నీగురించి దుష్ప్రచారం చేస్తాడు. అతనితో నీవు ఎప్పటికీ సుఖంగా ఉండలేవు. మీ ఇద్దరి మనస్తత్వాలు పూర్తిగా భిన్నమైనవి."

కరుణ: నా స్నేహితులు నా ప్రమాణాలను అడ్డగించి ఉండకపోతే ఇప్పటికే నాకు పెళ్లి అయిఉండేది. నా వ్యక్తిత్వం విషయంలో ఎవరు ఎలాంటి పొరపాటు చూపించలేరు కాని నా ఆదర్శాలే వాళ్లకు నచ్చలేదు కాబట్టి మేము ఏకీభవించలేకపోయాం.

వివేకం: ఈ రోజుల్లో నిత్యత్వానికి సంబంధించిన విషయాలు ఎవరినీ పెద్దగా ఆకర్షించలేకపోతున్నాయి. అనేక మందికి క్రైస్తవ్యమంటే కేవలం ఓ ఆచారమో లేక ఒక పేరుకు మించి ఏమీకాదు.

కరుణ: నా మతసంబంధమైన నమ్మకాలను బట్టి ఎవరూ నన్ను ఇష్టపడకపోతే నేను ఇలాగే ఒక వృద్ధసేవకురాలిగా చనిపోతాను. క్రీస్తుపట్ల నాభక్తి, ఆయన సేవయే నా భర్త స్థానాన్ని ఆక్రమిస్తాయి. నాజీవిత విధానాన్ని ఎల్లప్పుడు వ్యతిరేకిస్తూ ఉండే ఒక క్రైస్తవేతరుడితో జీవించేకంటే నేను ఇలాగే ఆనందంగా ఉంటాను. నాకు సమృద్ధి అనే ఒక అక్క ఉండేది. ఆమె ఇలాంటి మోసపూరిత గర్విష్టి, అహంభావి అయిన యువకుల్లో ఒకడ్ని పెళ్లి చేసుకుంది. కాని అతనితో కాపురం చేయలేకపోయింది. ఆమె క్రైస్తవురాలిగా మారడాన్ని అతడు తీవ్రంగా వ్యతిరేకించాడు, చివరికి ఆమెను ఇంటినుండి తరిమేసాడు. ఆ తరువాత ఆమె ఆరోగ్యం పాడైపోయి చనిపోయింది.

వివేకం: అయినా అతడు క్రైస్తవుడిననే చెప్పుకుంటాడు కదూ?

కరుణ: అవును, చెప్పుకోవడమే తప్ప, నిజమైన క్రైస్తవ్యాన్ని కలిగివున్నవాడు కాదు. అలాంటివాళ్లు లోకంలో చాలామందే ఉన్నారు, వాళ్లు ఎంత విద్యావంతులైనా, ఎంత ధనవంతులైనా నాకేంటి, వారిలో నాకెవ్వరూ అక్కర్లేదు.

వివేకంను ప్రశ్నించుట

ఇప్పుడు మాథ్యూ వివేకాన్ని కొన్ని ప్రశ్నలడగాలని ముందుకొచ్చాడు.

మాథ్యూ: మంచి ఔషధం తరచూ చేదుగా ఉంటుంది ఎందుకని?

వివేకం: జీవితం అలాగే ఉంటుంది మరి. జీవితంలో శ్రేష్టమైనవి తరచుగా అనంగీకారయుతమైన వాటికి మించినవై ఉంటాయి. దేవుని వాక్యం పాపులకు చేదుగా ఉంటుంది, కానీ దాన్ని స్వీకరించినప్పుడు అది రక్షణనిస్తుంది.

మాథ్యూ: అగ్నిజ్వాలలు, నిప్పు రవ్వలు పైకి ఎగిసిపడటం, సూర్య కిరణాలు క్రిందికి దిగిరావడం చూచి మనం ఏం నేర్చుకోవచ్చు?

వివేకం: ప్రార్థనలు సింహాసనం వద్దకు ఎక్కిపోవాలి, వెలుగు జీవము నీతిసూర్యుడి నుండి దిగిరావాలి. లోక రక్షకుడు తన కృప, ప్రేమలతో మనుష్యుల వద్దకు దిగివస్తాడు.

మాథ్యూ: మేఘాలు సముద్రం నుంచి నీటిని గైకొని, భూమిమీద వర్షించడంలో ఉన్న భావమేమిటి?

వివేకం: వాక్య సేవకులు తమ సందేశాలను దేవుని యొద్దనుండి స్వీకరించి, వాటిని ప్రజలపై ఉచితంగా కురిపించాలి. యేసు తన అపొస్తలులను బయటికి పంపినప్పుడు ఆయన ఇలా చెప్పాడు, "ఉచితముగా పొందితిరి, ఉచితముగా ఇయ్యుడి"[4]

మాథ్యూ: వాన కురిసేటప్పుడు మేఘాల మాటున సూర్యుడు ప్రకాశించడం వలన మనకు ఇంద్రధనస్సు ఎందుకు ఏర్పడుతుంది?

వివేకం: తుపాను నిమ్మళించిన మీదట, దుఃఖమనే మేఘాల చాటునుండి కల్వరి ద్వారా దేవుని కృపా నిబంధన సూర్యకాంతిని ప్రసరింప చేయగలదని; దేవుడు తన వాగ్దానాలను ఎన్నడూ మరువడని గుర్తుచేయడానికి.

మాథ్యూ: సేదదీర్చే నీటిఊటలు భూమిలోనుంచి, కొన్నిసార్లు ఎత్తైన కొండలమీద నుంచి ఎందుకొస్తాయి?

వివేకం: జీవజలము నలుగగొట్టబడిన క్రీస్తు శరీరము ద్వారానే ప్రవహిస్తాయని, కొన్నిసార్లు ఉన్నతమైన వ్యక్తుల ద్వారా కూడ ప్రవహిస్తాయని చూపడానికి.

మాథ్యూ: కొవ్వొత్తిలోని ఒత్తి, దారం వెలుగునివ్వడానికి కాలిపోతాయెందుకు, ఒత్తిమీద ఉండే మంట దేనిని సూచిస్తుంది?

వివేకం: హృదయంలో దేవుని కృపలేని యెడల జీవితంలో నిజమైన వెలుగు ఉండదని, నిజమైన ప్రేమ వెలుగును అందించడానికి ఒక క్రైస్తవుడి దేహమూ, హృదయమూ కరిగిపోవాలని సూచిస్తుంది.

మాథ్యూ: గూడబాతు తన ముక్కుతో తన గుండెను ఎందుకు చీల్చుకుంటుంది?

వివేకం: తన సొంత రక్తంతో తన పిల్లల ఆకలితీర్చడానికి. క్రీస్తు తన ప్రజలను ఎంతగా ప్రేమించాడో తెలియచేయడానికి, వారిని రక్షించడానికి తన రక్తాన్ని అర్పించాడు అని ఇది సూచిస్తుంది.

మాథ్యూ: కోడి కూత మనకు ఏం తెలియజేస్తుంది?

వివేకం: పేతురు క్రీస్తుని ఎరుగనని చెప్పినప్పుడు అతనిలో ఉన్న నమ్మకద్రోహాన్ని అతని యదార్థమైన

4. మత్తయి 10:8 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

పశ్చాత్తాపాన్ని అది మనకు గుర్తుచేయాలి. ఓ కొత్త దినం వస్తుందని కూడా ఇది ప్రకటన చేయాలి. తీర్పుదినము లేదా నిత్యత్వపు వేకువను సూచించేదే ఆ కూత.

నెలరోజులపాటు సత్రంలో వారు బస చేయవలసిన కాలం త్వరలో ముగియనుండటంతో వారు వెళ్లిపోవలసిన అవసరం ఉందని సత్రంలో వారికి సూచించారు.

జోసఫ్ తన తల్లితో ఇలా అన్నాడు, "అమ్మా, మన ప్రయాణంలో మార్గదర్శిగా ఉండటానికి గొప్పమనస్సును పంపించమని వివరణకర్తను అడగటం నీవు మరచిపోవద్దు."

"నేను దాదాపుగా ఆ విషయమే మర్చిపోయాను" అంటూ తన కొడుకువైపు మెచ్చుకోలుగా చూసింది. వెంటనే ఆమె ఒక విన్నపం వ్రాసి దానిని తన మిత్రుడైన వివరణకర్త వద్దకు పంపించమని సత్రం యజమానిని కోరింది. అది చదివిన వివరణకర్త వెంటనే ఈ సందేశం పంపాడు: "తక్షణమే నేను అతన్ని పంపిస్తున్నాను."

ఇప్పుడు ఆ సత్రం యజమాని ఇంట్లో ఉన్నవారందరిని పిలిచి ఇంత మంచి అతిథులను తమ వద్దకు పంపినందుకు రాజుకు కృతజ్ఞతలు చెప్పి ఆయనను ఆరాధించమన్నాడు. తరువాత వారితో ఇలా అన్నాడు "యాత్రికులకు తమ ప్రయాణంలో సహాయకరంగా ఉండే వాటిని చూపించడం మా సాంప్రదాయం."

వస్తురూపక పాఠాలు

ఇప్పుడు వారు యాత్రికులను ఒక గదిలోనికి తీసుకెళ్లి హవ్వ ఏ నిషిద్ధ ఫలాన్ని తిని తన భర్తకు కూడా అందించడం మూలంగా వారిరువురు పరదైసు నుంచి త్రోసివేయబడ్డారో ఆ పండును వారికి చూపించారు. దాని గురించి క్రిస్టియానా ఏమనుకుంటుందో చెప్పమని వారామెను అడిగారు. "అది ఆహారమో, విషమో ఏదైనది నాకు తెలియదు" అని చెప్పింది క్రిస్టియానా. దాని గురించి వివరించినప్పుడు ఇంత చిన్న విషయంలో లొంగిపోయినందుకు మానవజాతి మొత్తం భ్రష్టుపట్టి శిక్షావిధికి లోనవడం చూసి ఆమె ఆశ్చర్యపోయింది.

ఆ తరువాత వారిని ఒక గదిలోనికి తీసుకెళ్లి యాకోబు నిచ్చెన[5] చిత్రాన్ని చూపించారు. దాని మీదనుంచి దేవదూతలు క్రిందికి దిగుతూ ఎక్కుతూ ఉన్నారు. "ఈ నిచ్చెన క్రీస్తు మానవాళికి ప్రవేశం కల్పించిన పరలోకపు మార్గానికి సూచన" అన్నది వివేకం.

ఆ చిత్రం నుంచి వారు ప్రక్కకు వెళ్లబోతుండగా "అప్పుడే వెళ్లకండి ఇది ఎంతో అద్భుతమైన చిత్రం కనుక మరికొన్ని క్షణాలు ఇక్కడే ఉండండి" అన్నాడు జేమ్స్. అందుచేత వారు కొద్దిసేపు నిలబడి దాన్ని చూస్తూ ఉండిపోయారు.

5. ఆదికాండము 28:12 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

"దీనిని చూసి ఆశ్చర్యపోకండి" అంటూ వివేకం వారితో ఇలా చెప్పింది. "మీరు ఆకాశము తెరువబడుటయు, దేవుని దూతలు మనుష్యకుమారునిపైగా ఎక్కుటయును, దిగుటయును చూతురని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను."[6]

అక్కడ నుంచి వారిని ఒక బంగారపు లంగరు గోడకు తగిలించి ఉన్న గదివద్దకు నడిపించారు. దానిని క్రిందికి దించమని మార్గదర్శి క్రిస్టియానాకు చెప్పాడు. "దానిని నీవు తీసుకోవచ్చు ఎందుకంటే తెరలోపల[7] నీవు దానిని దృఢముగా పట్టుకొని ఉండుట అవసరము. మరియు అల్లకల్లోలమైన వాతావరణంలో నిబ్బరముగా నిలబడాలి."

ఆ తరువాత వారు ఓ ఎత్తయిన కొండమీద అబ్రహాము తన కుమారుడైన ఇస్సాకును బలి అర్పించే సన్నివేశాన్ని చూపించాడు. ఆ సన్నివేశాన్ని తదేకంగా చూస్తూ క్రిస్టియానా తన చేతులు పైకెత్తి బిగ్గరగా ఇలా అన్నది "ఆహా, తన సృష్టికర్త మీదున్న ప్రేమతో తనను తాను ఉపేక్షించుకున్న అబ్రహాము ఎంతగొప్ప మనిషి!"

సరిగ్గా అప్పుడే ఎవరో తలుపు తట్టిన శబ్ధం అయింది. సత్రం యజమాని తలుపు తెరచి చూడగా అక్కడ గొప్పమనస్సు నిలబడి ఉన్నాడు. అతన్ని చూడడంతో వారి మనస్సులు సంతోషంతో గంతులు వేశాయి.

క్రిస్టియానాకు, కరుణకు చెరొక మూట ఇచ్చి వారితో ఇలా అన్నాడు: "మా యజమాని అయిన వివరణకర్త మీకు చెరొక సీసా తియ్యని ద్రాక్షారసం, ఎండబెట్టిన జొన్నలు, దారిలో తినడానికి రుచికరమైన పండ్లను ఇచ్చి పంపించాడు; పిల్లలకు కొన్ని అత్తిపండ్లు, ఎండుద్రాక్షలు కూడా పంపించాడు."

ఆ తరువాత గొప్పమనస్సు వారిని నడిపిస్తుండగా వారికి వీడ్కోలు చెప్పి బయలుదేరాడు. కొండదిగువ వరకు వివేకం, దైవభక్తి వారికి తోడుగా వెళ్లారు.

గుమ్మం దగ్గర క్రిస్టియానా ఆ సత్రం యజమానిని ఈ మధ్య కాలంలో ఇటువైపుగా ఎవరైనా వెళ్లారా? అని అడిగింది.

లేదు, కొంతకాలం క్రితం ఒకడు ఇటువైపుగా వెళుతు దారిలో ఓ పెద్ద దొంగతనం జరిగిందని చెప్పాడు. అయితే ఆ దొంగలు పట్టుబడ్డారని త్వరలోనే వారు చేసిన నేరాలకు శిక్ష విధించబడుతుందని చెప్పాడు.

ఇది విన్న క్రిస్టియానా, కరుణ భయంతో వణికిపోయారు అయితే మాథ్యూ "గొప్పమనస్సు మనకు తోడుగా ఉన్నాడు కదా, భయపడ్డం ఎందుకమ్మా?" అన్నాడు.

అప్పుడు సత్రం యజామానికి క్రిస్టియానా మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు చెప్పి తమ అభినందనలకు సూచనగా అతడు చేసిన ప్రతి విధమైన ఉపకారాలకు బదులుగా అతని చేతిలో ఓ బంగారు

6. యోహాను 1:51 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8
7. హెబ్రీయులకు 6:19

నాణెం ఉంచింది. అతడు ఎంతో హుందాగా శిరసు వంచి, "దేవుని ఆశీర్వాదాలు మీకు తోడుగా ఉండును గాక! అబ్బాయిలూ మీరు యవనేచ్ఛలనుండి పారిపోయి,[8] దైవభక్తిని ప్రేమను వెంటాడుదురు గాక! మీరు ప్రభువును సంతోషపరచి మీ తల్లికి మరియు సరైన మార్గాన్ని ప్రేమించే వారందరికి ఆనందం కలుగజేయుదురు గాక!" అని పలికాడు.

వారు కొండ దిగువకు చేరుకున్న తరువాత దైవభక్తి తాను చేయతలపెట్టిన ఒక విషయాన్ని అకస్మాత్తుగా గుర్తుచేసుకుంది. "అయ్యో నేను క్రిస్టియానాకు ఇవ్వదలచినది మరచిపోయాను" అంటూ దానికోసం ఆమె వెనక్కి పరుగున వెళ్లింది. ఆమె కోసం వాళ్లంతా ఎదురు చూస్తూ నిలబడ్డారు.

ఆమె వెళ్లిన తరువాత ఆ దారిలో కొంత దూరాన ఉన్న పొదలో నుంచి చక్కని సంగీతం క్రిస్టియానా చెవులకు సోకింది. అవి ఈ క్రింది మాటలు అయి ఉంటే బాగుంటుందని తలంచింది:

నా జీవితమంతా నీ అనుగ్రహం
ఎంతో సత్యముగా నాకు చూపితివి
నా నివాసము నీ గృహమునందే
శాశ్వతముగా ఉండునని

ఆ మాటలు జాగ్రత్తగా వింటుండగా దూరం నుంచి ఆమెకు మరొక స్వరం వినబడింది. మొదట పలికిన వానికి జవాబు చెబుతున్నట్లుగా ఇలా అన్నది:

ఎందుకు అలా అంటున్నావు? మన దేవుడైన యెహోవా దయామయుడు
ఆయన కటాక్షము సదా నిశ్చయము;
ఆయన సత్యము ఎల్లవేళలా స్థిరముగా నిలిచెను.
సదాకాలము నిలిచి ఉండును.

ఆ వింతైన మధుర గానం ఏ పక్షులనోట వెలువడింది అని క్రిస్టియానా అడిగింది.

అవి మా ఇంటి పక్కనే ఉండే పక్షులు. అవి వసంతకాలంలో పూలు వికసించి వెచ్చని సూర్యకాంతి వెదజల్లబడేటప్పుడు తప్ప వేరే సమయంలో కూయడం అరుదు. అప్పుడు అవి రోజంతా పాటలు పాడుతూనే ఉంటాయి. వాటి పాటలు వినడానికి నేను తరచుగా అడవిలోకి వెళుతుంటాను. వాటిని మా ఇంటిలో కూడా పెంచుకొన్నాము. ముఖ్యంగా ఎవరైనా విచారంగా ఉన్నప్పుడు అవి చక్కని తోడుగా ఉంటాయి. వాటి మధుర స్వరంతో అవి అడవులను పొదలను ఆకర్షణీయంగా మారుస్తాయి.

ఇంతలో దైవభక్తి తిరిగి వచ్చి క్రిస్టియానాతో ఇలా చెప్పింది. "ఇదిగో మీరు మాఇంట్లో చూసిన, విన్న వాటి చిత్రాన్ని మీకోసం తీసుకొచ్చాను. మీ క్షేమం, ఆదరణలకోసం ఎప్పుడైనా చూడాలనిపించినా లేదా ఏదైనా ప్రాముఖ్యమైన విషయాన్ని మననం చేసుకోవాలనిపించినా ఇది మీకు ఉపయోగపడుతుంది."

8. 2తిమోతి 2:22 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

అధ్యాయం 16
గొప్పమనస్సుతో ప్రయాణం

వినయమనే లోయగుండా ప్రయాణించుట

ఇప్పుడు వారు కొండదిగి వినయపు లోయవైపు వెళుతున్నారు. అది చాలా నిటారుగా ఉండే కొండ. పైగా ఆ దారి జారుతూ ఉంది అయితే వారు చాలా జాగ్రత్తగా క్షేమంగా ఆ లోయను చేరుకొన్నారు. లోయలోనికి వెళ్లిన తరువాత దైవభక్తి క్రిస్టియానాతో ఇలా అంది. "ఈ లోయలోనే నీ భర్త అపోల్యోను అను ఒక రాక్షసితో యుద్ధం చేసి హతమార్చాడు. నీవు దాని గురించి విన్నావని నాకు తెలుసు. అయితే ధైర్యంగా ఉండు నువ్వు భయపడాల్సింది ఏమీలేదు; ఈ గొప్పమనస్సు నీతో ఉన్నంత కాలం నీవు ఏమనిషి లేదా దెయ్యం గురించి భయపడాల్సిన అవసరం లేదు."

యాత్రికులను మార్గదర్శికి అప్పగించిన మీదట వివేకం, దైవభక్తి ఇంటికి వెళ్లిపోగా యాత్రికులు గొప్పమనస్సు వెంట లోయలో ముందుకు సాగిపోయారు.

గొప్పమనస్సు: మనం ఈ లోయనుచూసి భయపడాల్సిన అవసరంలేదు. మనకు మనంగా చేసుకుంటే తప్ప మనల్ని నిజంగా గాయపరచేది ఏదీ లేదు. క్రైస్తవుడు ఇక్కడ అపొల్యోను చేతులలో బాధ అనుభవించాడన్నది వాస్తవమే కానీ అతడు కొండమీద నుంచి వచ్చేటప్పుడు చాలాసార్లు జారి పడటం వల్లనే అపొల్యోను దాడికి ఉపక్రమించాడు. కిందికి దిగి వచ్చేటప్పుడు జారి పడినవారు ఇక్కడ పోరాటాలు ఎదుర్కోవలసిందే. ఎందుకంటే అవి ఎల్లప్పుడు సంభవిస్తుంటాయి. ఈ కొట్లాటల కారణంగానే ఈ లోయకు చెడ్డపేరు వచ్చింది. ఈ చెడ్డ పోరాటాల గురించి విన్నవారు ఇక్కడ దుష్ట పిశాచాలు, దురాత్మలు వెంటాడతాయని ఊహించుకొంటుంటారు. అయితే వాస్తవానికి ఈ కష్టాలన్నీ యాత్రికుల ప్రవర్తనా ఫలితమే. నిజానికి ఈ లోయ ఒక ప్రశాంతమైన ఫలవంతమైన దేశం. అయితే అవమానాలకు సర్దుకుపోవడం ఎలాగో తెలియని యాత్రికులు తప్పుడు అనుభూతులకు లోనవుతుంటారు. అప్పుడు సాతానుడు వారి భావావేశాలను ఆసరాచేసుకొని, పాతాళం నుంచి తన భూతాలను పంపిస్తుంటాడు (హిన్నోము లోయకు బాగా దిగువ ప్రాంతంలో ఉండే దేశం). కనుక అవి ఈ అపరిపక్వ శిష్యులపై దాడిచేస్తాయి.

అప్పుడే జేమ్స్ ఇలా అన్నాడు, "అమ్మా, అదిగో అక్కడ చూడు, ఒక స్థంబం మీద ఏవో మాటలు రాసి ఉన్నాయి; అది ఏమిటో చూద్దాం పదండి."

వారు అక్కడికి వెళ్లి ఈ మాటలు రాసి వుండటం కనుగొన్నారు: "ఇక్కడికి రావడానికి ముందు క్రైస్తవుడు జారిపడుట, అతడు చేసిన పోరాటం, అతని తర్వాత వచ్చినవారికి ఓ హెచ్చరికగా ఉండును గాక."

సమాధానపు లోయలో

"నిజమే, కాని క్రైస్తవుడు గొప్ప విజయం సాధించాడు. ఇక్కడ అనేక యుద్ధాలు జరిగాయి, ఎన్నో దుఃఖాలు కలిగాయి వాస్తవమే, కానీ ఈ ప్రదేశం ఎంత అందంగా ఉందో చూడండి. ఈ లోయ నిండా ప్రధానంగా పచ్చని మైదానాలు, అందమైన పూదోటలే ఉంటాయి. వాటిలో జలపాతాలతో పాటు రోధించే చెట్లు కూడ పెరుగుతాయి. ఇక్కడ కూడ పండ్లతోటలు, పశువుల గుంపులు, గొర్రెల మందలు ఉన్నాయి. ఎంతోమంది దీనులు ఇక్కడ ఇళ్లు కట్టుకొని, సంతృప్తిగా ఉంటున్నారు. ఉద్యోగస్తులలో చాలామందికి ఆస్తులున్నాయి. ఎత్తైన ప్రదేశాల్లో ఉండటానికి అలవాటుపడ్డవారికే ఇక్కడ కష్టాలు అధికంగా ఉంటాయి. 'దేవుడు అహంకారులను ఎదిరించి దీనులకు కృప అనుగ్రహించును."[1]

వారు అలా మాట్లాడుకుంటూ వెళుతుండగా, ఎవరో పాటలు పాడటం వారికి వినిపించింది. వెనక్కి తిరిగి చూస్తే, కాళ్లకు చెప్పులు లేని ఒక పిల్లవాడు గొర్రెల మందను కాసుకొంటూ ఓ రాతిమీద కూర్చుని ఉన్నాడు. అతని పాటలోని మాటలు వారు పట్టుకోగలిగారు:

క్రింద ఉన్నవాడికి పడిపోతాననే భయం అక్కరలేదు;
దీనుడిలో అహంకారం లేదు:
దీనుడైన వానికి సదాకాలం
దేవుడే మార్గదర్శిగా ఉండును.

గొప్పమనస్సు: అతడు ఏమంటున్నాడో విన్నారా? విలాసాలతో జీవించే అనేకుల కంటే ఈ సామాన్య గ్రామీణ బాలుడు ఆనందంగా జీవిస్తున్నాడని నేను ధైర్యంగా చెప్పగలను. ఈ లోయ అనేకులకు సంతుష్టి సహితమైన దేశంగా ఉంటుంది. ఒకప్పుడు మా ప్రభువు ఈ లోయలోనే జీవించి శాంతిని గురించి గొప్పసందేశాలు ఇక్కడనుండే బోధించాడు. ఇక్కడ లోకపు రణగొణ ధ్వనులు, హడావిడి ఏమీ లేకుండా జీవించవచ్చు. ఈనాడు ప్రపంచమంతా కుంభకోణాలతో, నరాలు తెగిపోయే గందరగోళంతో నిండిపోయింది. కేవలము దీనత్వపు లోయమాత్రమే నెమ్మదిగా ఏకాంతాన్ని కల్పించి ధ్యానించడానికి, సృష్టికర్తతో సహవాసం చెయ్యడానికి అనుకూలమైన వాతావరణం కలిగిస్తుంది. దురదృష్టవశాత్తు క్రైస్తవుడు ఇక్కడ అపొల్యోను ఎదుర్కొనవలసి వచ్చినప్పటికీ కొందరు ఈ లోయలో ఎంతగానో దీవించబడ్డారు. మరికొందరు అమూల్యమైన ముత్యమును కనుగొన్నారు.

1. యాకోబు 4:6; 1పేతురు 5:5

శామ్యూల్: మా నాన్నగారు అపొల్యోనుతో పోరాడింది ఎక్కడ?

గొప్పమనస్సు: అదిగో ఆ మతిమరుపు చెట్టువెనక ఉన్న దారిలో కనిపించే ఓ ఇరుకైన స్థలంలో వారిపోరాటం జరిగింది. ఈ లోయలో అదే అతిపెద్ద శోధన కలిగించే స్థలం. రాజుగారి ఇతర సేవకులు అక్కడ భయంకరమైన పరీక్షలకు గరి అయ్యారు. యాత్రికులు తాముపొందిన అనుగ్రహాన్ని మరిచిపోయేది లేక తమగురించి తాము ఎంతో అయోగ్యులుగా ఎంచుకొనే స్థలం కూడా ఇదే. ఇక్కడ వారికి ఎంతో కఠినమైన పోరాటాలు ఎదురవుతాయి.

కరుణ: తక్కిన ప్రదేశాలవలే నాకు ఇక్కడ కూడా బాగానే అనిపిస్తుంది. ఈ స్థలం నా ఆత్మకు చక్కగా సరిపోయినట్లుంది. కర్మాగారాల శబ్దాలు, వాహనాల రద్దీ లేనిచోట ఉండటమే నాకిష్టం. ఇక్కడ జీవితానికి అర్థం ఏమిటో అని ఎవరైనా ఆలోచించవచ్చు అంతేకాక తనకు తాను ఇలాంటి ప్రశ్నలుకూడా వేసుకోవచ్చు: నేనవరిని? ఏమైయున్నాను? నేనెక్కడనుండి వచ్చాను? ఇక్కడ నేను ఎందుకు ఉన్నాను? నేనేమి సాధించాను? నేను ఎక్కడికి వెళుతున్నాను?

గొప్పమనస్సు: అవును అది నిజమే. ఈ లోయగుండా నేను అనేకసార్లు వెళ్లాను. ఇక్కడ ఉన్నప్పటికంటే ఎక్కువైన ఆనందం ఎక్కడా అనుభవించలేకపోయాను. నేను తోడుగా వచ్చిన అనేకమంది యాత్రికులుకూడా ఇదే సాక్ష్యం చెప్పారు. బహుశా మనప్రభువు, యజమాని తనకి ఇష్టమైన దీవెనలు మనకు అనుగ్రహించేందుకు మనల్ని సిద్ధపరచడం కోసం ఈ లోయగుండా మనల్ని నడిపిస్తాడనుకుంటాను. ఆయన తన ప్రవక్త ద్వారా ఇలా చెప్పాడు. "ఎవడు దీనుడై నలిగిన హృదయము గలవాడై నా మాటవిని వణకుచుండునో వానినే నేను దృష్టించుచున్నాను."[2] మరియు మన రక్షకుడు తన భూలోక పరిచర్య ఆరంభంలో ఇలా చెప్పాడు: "ఆత్మవిషయమై దీనులైనవారు ధన్యులు; పరలోకరాజ్యము వారిది."[3]

ఇప్పుడు వారు క్రైస్తవుడు అపొల్యోనుతో పోరాడిన చోటుకు చేరుకున్నారు. అక్కడ ఈ క్రింది కావ్యం వ్రాయబడిన ఒక స్మారకం నిలబడి ఉంది.

ఇక్కడ ఒక కఠినమైన పోరాటం జరిగింది,
ఎంతో వింతైనది అయినా ఎంతో సత్యమిది;
క్రైస్తవుడు అపొల్యోను ఒకరినొకరు
లోబరుచుకొన ప్రయత్నించిరి.

ధైర్యంగా పోరాడిన మనిషి
పిశాచమును పారద్రోలాడు
అందుకు సాక్ష్యార్థమై
నేను నిలిచి ఉన్నాను.

2. యెషయా 66:2 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8
3. మత్తయి 5:3

మరణచ్ఛాయ లోయలో

ఈ యుద్ధభూమిని వారు దాటి వెళ్లినతరువాత దిగువలోయ సరిహద్దులోనికి చేరుకొన్నారు. దీనినే మరణచ్ఛాయలోయ అంటారు. ఇది తక్కిన లోయకంటే చాలా పొడవైనది. ఈ ప్రాంతంలో చాలావరకు దురాత్మలే నివాసం ఉంటాయని ఎందరో సాక్ష్యం ఇచ్చారు. అయితే ఈ స్త్రీలు, పిల్లలు చాలా మంది ఇతరులకంటే చక్కగా ఈ లోయగుండా వెళ్లగలిగారు అందుకు కారణం వారికి మార్గదర్శిగా గొప్పమనస్సు ఉండటమే కాక మార్గమంతటా వారికి పగటి వెలుగు తోడుగా ఉన్నది.

అయినప్పటికీ ఆ లోయలో వారికి చనిపోయినవారి ఆర్తనాదాలు, ఎంతో విపరీతమైన చిత్రహింసలు అనుభవిస్తున్నవారి మూలుగులు వినిపించినట్లు భావించారు. ఈ భయంకరమైన శబ్దాలు పిల్లల్ని వణికించగా స్త్రీల ముఖాలు భయంతో తెల్లబారిపోయాయి. అయితే వారి మార్గదర్శి ఆదరణ కలిగించే మాటలు చెప్పి వారికి ధైర్యం చెప్పాడు.

కొంచెము దూరము వెళ్లిన తరువాత నేల కంపించిపోతున్నట్టుగా వారు భావించారు. బోలుగా ఉన్న నేలమీద నిలబడినట్లుగా అనిపించింది. అంతేకాకుండా పాములు బుసకొట్టినట్టు కొన్నిరకాల శబ్దాలుకూడా వినబడ్డాయి. కానీ అక్కడ వారికి ఏమీ కనిపించలేదు. అప్పుడు పిల్లలో ఒకరు ఇలా అన్నారు: "మనమింకా ఈ భయంకరమైన లోయ చివరికి చేరుకోలేదా?" అయితే మార్గదర్శి వారికి ధైర్యవచనాలు చెప్పి అడుగులు జాగ్రత్తగా వేయాలని లేకపోతే ఏదో ఒక ఉరిలో చిక్కుకుంటామని చెప్పాడు.

ఇప్పుడు చిన్నవాడైన జేమ్స్ అనారోగ్యం పాలయ్యాడు. దానికి కారణం భయమే అయ్యుంటుంది. తల్లి అతనికి కొంత ద్రాక్షారసం, కొన్ని మాత్రలు ఇచ్చింది. సౌందర్యమనే రాజభవనం దగ్గర వైద్యులు ఆమెకు ఇచ్చిన మందులు ఇవి. వీటితో అతని ఆరోగ్యం కాస్త కుదుటపడింది.

ఆవిధంగా వారు లోయ మధ్యలోనికి చేరుకొన్నారు. అప్పుడు క్రిస్టియానాకు ముందున్న మార్గంలో ఏదో కనిపించినట్లు అనిపించింది. "అలాంటి ఆకారం కలిగిన దాన్ని నేను ఇంతకుముందు ఎన్నడూ చూడలేదు" అన్నది ఆమె.

"అమ్మా అదేమిటి?" జోసఫ్ అడిగాడు.
"నాకు తెలుయదు బాబూ, అది చాలా దారుణంగా ఉంది"
"కానీ చూడ్డానికి అది ఎలా ఉంది?"

"నేను దానిని వర్ణించలేను. నేను గతంలో చూసినవాటిలో ఏదీ దానిలా లేదు. ఇప్పుడది మనకి దగ్గరగా వస్తుంది. చాలా దగ్గరకు వచ్చింది."

"సరే సరే" మీలో ఎక్కువగా భయపడేవాళ్లు "నా వెనక్కి రండి" అన్నాడు గొప్పమనస్సు. అంధకార భూతం వారిమీదికి వస్తుండగా గొప్పమనస్సు దానిని ఎదిరించడానికి ముందడుగు వేయగా అప్పుడే అది అదృశ్యం అయిపోయింది ఆ తరువాత అది ఎవరికీ కనిపించలేదు. అప్పుడు వారు "అపవాదిని ఎదిరించుడి అప్పుడు వాడు మీ యొద్దనుండి పారిపోవును"[4] అనే వాక్యం గుర్తు చేసుకున్నారు.

కాస్త తేరుకున్న తరువాత ముందుకు సాగిపోయారు. అయితే వారు కొంచెం దూరం వెళ్లారో లేదో అంతలోనే కరుణ వెనక్కి తిరిగి చూడగా సింహం ఆకారంలో ఉన్న ఒకటి వారి వెనుకనే దొంగచాటుగా రావడం కనిపించింది. వాళ్లందరు వెనక్కి తిరిగి చూశారు. అది గర్జిస్తూ వారివైపు వేగంగా వచ్చింది. దాని కఠోరమైన స్వరం ఆ లోయ అంతటా ప్రతిధ్వనించడంతో యాత్రికుల వెన్నులో వణుకు పుట్టింది. వాళ్ల గుండెల్లో భయం చోటుచేసుకుంది. అప్పుడు గొప్పమనస్సు యాత్రికులందరిని తన ముందు నిలబెట్టుకున్నాడు. సింహం తన వేగాన్ని మరింత పెంచగా గొప్పమనస్సు దానితో పోరాటానికి తలపడ్డాడు. అయితే మార్గదర్శి తనను ఎదిరించి చావుదెబ్బ కొట్టగలడని గ్రహించినప్పుడు అది నక్కినట్లు పక్కకు తిరిగి గుర్రు మంటూ పొదల్లోకి జారుకుంది.

ఇప్పుడు మార్గదర్శి వారికి ముందుగా నడుస్తూ వెళ్తుండగా మార్గం మధ్యలో వారికి ఒక పెద్దగుంట కనిపించింది. వారు దాన్ని దాటేందుకు సిద్ధపడేలోపు దట్టమైన పొగమంచు వారిని కప్పి మార్గం పూర్తిగా కనపడకుండా చేసింది. "అయ్యో ఇప్పుడు మనం ఏం చేయాలి?" అంటూ వారు మెల్లగా అడిగారు.

"భయపడకండి, ఊరకనే నిలబడి దీని అంతం కూడ చూడండి" అన్నాడు గొప్ప మనస్సు.

వారి మార్గం పూర్తిగా కప్పివేయబడింది గనుక వారు నిలిచిపోయారు. అప్పుడు వారికి ఎక్కువ శబ్దాలు, శత్రువులు దూకుడుగా రావడం వినపడుతున్నట్లు భావించారు. ఆ గుంటలో నుండి అగ్ని, పొగ పైకి వస్తున్నట్లు తేలికగానే గ్రహించారు.

క్రిస్టియానా: నా భర్త ఎటువంటి పరిస్థితుల గుండా వెళ్లాడో నాకు ఇప్పుడు అర్థమవుతోంది. ఈ స్థలం గురించి నేను ఎంతో విన్నాను కాని, అది ఇలా ఉంటుందని ఊహించలేకపోయాను. పాపం ఎలా భరించాడో ఏమో! ఒక్కడే రాత్రివేళ ఒంటరిగా ఈ లోయగుండా వెళ్లాడు. పిశాచాలు మాత్రం ఆయన గురించే ఆలోచిస్తూ, ఆయన్ని చీల్చిచెండాడబోతున్నట్లు కనిపించాయట. దానిగురించి చాలామంది చెప్పారు. కానీ ఎవరైనా స్వయంగా ఇక్కడికి వస్తే తప్ప ఈ మరణచ్ఛాయ లోయ ఎలావుంటుందో ఎవరూ ఊహించలేరు.

గొప్పమనస్సు: ఇది సముద్రపు దిగంతాలలో ఉండి, పర్వతాల అడుగుభాగానికి చేరుతున్నట్లు ఉంటుంది. భూమి నిన్ను శాశ్వతంగా బంధించివేసిందా అనిపిస్తుంది. "వెలుగు లేకయే చీకటిలో నడచువాడు యెహోవా నామమును ఆశ్రయించి తన దేవుని నమ్ముకొనవలెను."[5] నామట్టుకైతే

4. యాకోబు 4:7 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8
5. యెషయా 50:10

నేను ఈ లోయగుండా అనేకసార్లు వెళ్లాను, ఇప్పటికంటే మరింత గొప్ప అపాయాన్ని ఎదుర్కొన్నాను కాని నేనింకా సజీవంగానే ఉన్నాను. అయినా నేను అతిశయించను. ఎందుకంటే నన్ను కాపాడుకొనేది నేను కాదు. ఏది ఏమైనా, మనకు పూర్తి విడుదల లభిస్తుందని నా విశ్వాసం. అంధకారాన్ని వెలుగుగా మార్చి దయ్యాలన్నిటినీ నరకంలోనికి పంపివేయగలవాని వెలుగును మనం కోరుకుందాం.

కాబట్టి వారు దేవునికి మొరపెట్టగా పొగమంచు విడిపోయింది. ఇప్పుడు ఆ గొయ్యి దారిలో కేవలం ఒక లోతైన గుంట మాత్రమేనని వారు కనుగొన్నారు. కనుక దానిని తేలికగా దాటిపోయారు.

అంతలోనే వారికి కొన్ని అసహ్యకరమైన వాసనలు రావడం గమనించారు. అప్పుడు కరుణ క్రిస్టియానాతో ఇలా అన్నది: "ఇక్కడ మనకు గుమ్మం ఇంటివద్ద, లేక వివరణకర్త ఇంటిలో లేదా చివరిసారిగా మనం బసచేసిన భవనంలో ఉన్నంత హాయిగా లేదు."

"అయ్యో, దీన్ని దాటివెళ్లేందుకు ఇది మరీ అంత చెడ్డదేం కాదు. ఒకవేళ ఎవరైనా ఇక్కడే శాశ్వతంగా ఉండవలసి వస్తే ఎలావుంటుందో ఆలోచించండి? నాకు తెలిసినంతవరకు, మనం దీనిని దాటి మనకు సిద్ధపరచిన గృహానికి వెళ్లడంలో కనిపించే కారణం ఒక్కటే– అది మనం ఎటువంటి భయంకరమైన పరిస్థితినుండి రక్షణపొందామో తెలుసుకొని, మన నిత్యగృహంలో అత్యధికంగా ఆనందించగలుగుటకే" అన్నాడు శామ్యూల్.

గొప్పమనస్సు: చాలా చక్కగా చెప్పావు శామ్యూల్.

నేను ఇక్కడనుంచి వెళ్లిన తరువాత వెలుగు మంచి మార్గాలకు నా జీవితంలో అధికమైన విలువను ఇస్తాను అన్నాడు ఆ అబ్బాయి.

త్వరలోనే మనము బయటికి వెళ్లిపోతాము చెప్పాడు మార్గదర్శి.

జోసఫ్: మనము ఈ లోయ చివరి వరకు వెళ్లలేమా?

మార్గదర్శి: అడుగులు జాగ్రత్తగా వేయండి త్వరలోనే మనము ఉచ్చులలో చిక్కుకుపోతాము.

వారు ఆ స్థలానికి వచ్చినప్పుడు అక్కడ ఒక వ్యక్తి దేహం నలుగగొట్టబడి చీల్చివేయబడి ఒక గుంటలో పడవేయబడి ఉండటం చూశారు.

మార్గదర్శి: అతని పేరు నిర్లక్ష్యం అతడు చాలా కాలం నుంచి అక్కడే ఉన్నాడు. అతనితో కూడా ఉన్న జాగ్రత్తపరుడు అనే వ్యక్తి తప్పించుకున్నాడు. లోయలోని ఈ ప్రాంతంలో ఎంత మంది తమ ప్రాణాలు కోల్పోతారో నేను ఊహించలేను. కొంత మంది మూర్ఖంగా అనాలోచితంగా ఎటువంటి మార్గదర్శి తోడులేకుండ ఆ దూరప్రాంతానికి బయలుదేరే సాహసం చేస్తారు. ఆ మంచి క్రైస్తవుడు ఈ స్థలాన్ని ఎలా దాటాడో ఆశ్చర్యం వేస్తుంది. అతడు ఖచ్చితంగా దేవునికి ప్రియమైనవాడు. అతనికి గుండె ధైర్యం ఎక్కువ. లేదంటే ఇక్కడి వరకు రాగలిగేవాడు కాదు.

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

సమ్మెట రాక్షసునితో పోరాటం

ఇప్పుడు వారు లోయచివరికి చేరుకున్నారు. క్రైస్తవుడు, గతంలో పోప్, అన్యుడు నివసించే గుహను చూసింది ఇక్కడే. గుహలో నుంచి సమ్మెట రాక్షసుడు బయటికొచ్చాడు. ఇతడు తన వంకర మాటలతో యువ యాత్రికులను అడ్డగిస్తుంటాడు. గొప్పమనస్సును అతడు పేరుపెట్టి పిలిచి, "ఇలాంటి పనులు చెయ్యకుండ నిన్ను ఎన్నిసార్లు అడ్డగించాల్సి వచ్చింది?" అన్నాడు.

"ఎలాంటి పనులు?" అడిగాడు గొప్పమనస్సు.

"ఎలాంటి పనులా! ఎలాంటి పనులో నీకు తెలుసు. అయితే నీ వ్యాపారం అంతు చూస్తాను నేను."

"సరే గాని ఒక్క క్షణం ఆగు. మనం పోరాడే ముందు, దీని భావమేమిటో అర్థంచేసుకుందాం" అన్నాడు గొప్పమనస్సు.

స్త్రీలు, పిల్లలు నోట మాటరాక అలాగే నిలుచున్నారు.

"ఈ దేశాన్ని నీవు అత్యంత దారుణంగా దోపిడీ చేస్తున్నావు" అన్నాడు రాక్షసుడు.

"అది నీవు ఎప్పుడూ వేసే నింద కదా, కానీ అసలు వివరాలు తెలియజేయి బాబూ."

"నీవు అత్యంత నీచమైన అపహరణలకు పాల్పడుతున్నావు. స్త్రీలను, పిల్లలను ప్రోగుచేసి, వాళ్లందరినీ ఒక వింతైన దేశానికి తరలిస్తున్నావు. తద్వారా నా యజమాని రాజ్యాన్ని బలహీనపరుస్తున్నావు" అంటూ సమ్మెట బదులిచ్చాడు.

గొప్పమనస్సు ఇలా ప్రత్యుత్తరమిచ్చాడు: "నేను ఆకాశమందలి దేవుని సేవకుడను; పాపులను పశ్చాత్తాపపడేలా ఒప్పించడమే నా వ్యాపారం. పురుషులను, స్త్రీలను, పిల్లలను చీకటినుండి వెలుగునకు, సాతానుని అధికారము నుండి దేవునివైపుకు మళ్లించడం కోసం నా శాయశక్తులా పనిచేస్తాను. అలా చెయ్యడాన్ని నీవు అపహరణగా భావిస్తే అది నీ ఇష్టం. నిన్ను ఎదుర్కోవడానికి నేను సిద్ధమే."

అప్పుడు రాక్షసుడు చేతిలో ఒక దుడ్డుకర్ర పట్టుకొని మార్గదర్శి వద్దకు రాగా మార్గదర్శి తన కత్తిని దూసి అతన్ని ఎదుర్కోడానికి ముందుకు వెళ్లాడు. వారివురు తీవ్రమైన పోరాటం చేసారు. ఆ రాక్షసుడు దుడ్డుకర్రతో గొప్పమనస్సు నెత్తిమీద కొట్టి కూలిపోయేలా చేశాడు. స్త్రీలు, పిల్లలు కేకలు వేసారు. గొప్పమనస్సు పైకిలేచి తన కత్తిని రాక్షసుడి భుజం మీద పొడిచి తీవ్రంగా గాయపరచాడు. ఇద్దరు పూర్తిగా అలసిపోయే వరకు ఓ గంటసేపు పోరాడారు. ఇద్దరు దారికి ఇరువైపుల కూలబడి విశ్రాంతి తీసుకున్నారు. ఇప్పుడు మార్గదర్శి తన హృదయంలో ప్రార్థన చేయసాగాడు. స్త్రీలు, పిల్లలు ఏడుస్తూనే ఉన్నారు.

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

వారివురు పైకి లేచి మరలా పోరాటం మొదలుపెట్టారు. ఇప్పుడు గొప్పమనస్సు రాక్షసుడి కడుపులో పొడిచి అతన్ని కూలగొట్టాడు. అయితే అతడు కిందపడినవాని మీద దాడిచేసే వాడు కాదు. అతడు పైకి లేచిందాకా వేచి ఉన్నాడు. గొప్పమనస్సు ప్రక్కకు తప్పించుకోక పోయి ఉంటే రాక్షసుడు కొట్టిన దెబ్బలకు అతని తల పగిలి ఉండేది. ఇప్పుడు గొప్పమనస్సు ఆ రాక్షసుడ్ని ఎలాగైనా వదిలించుకోవాలని నిశ్చయించుకున్నాడు. తన ఎడమచేయి చాచి రాక్షసుడి తదుపరి దెబ్బను కాచుకొని రాక్షసుడిని ఐదవ ప్రక్కటెముక కింద గట్టిగా పొడిచాడు. బాగా నీరసించిపోయిన ఆ రాక్షసుడు తనచేతిలోని దుడ్డుకర్రను సైతం పట్టుకోలేక పోయాడు. అప్పుడు గొప్పమనస్సు అతని తలను ఛేదించాడు. యాత్రికులు ఆనందంతో దేవుడు అనుగ్రహించిన విజయాన్ని బట్టి ఆయనను స్తుతించారు. అక్కడ ఒక స్థూపాన్ని నిలిపి దానిపైన రాక్షసుడి తలను వేలాడదీసి ఆ సంఘటన జ్ఞాపకార్థంగా కొన్ని మాటలు రాసారు.

ఆ తరువాత ప్రక్కనే ఉన్న ఒక చిన్న కొండను ఎక్కారు. యాత్రికులు దూరంగా ఉన్న మార్గాన్ని చూడగలిగే విధంగా ఈ ఏర్పాటు చేయబడింది. క్రైస్తవుడు మొట్టమొదట విశ్వాసిని చూసింది ఈ స్థలంలోనే. విశ్రాంతి కోసం వారు అక్కడ కూర్చున్నారు. మరణచ్ఛాయ లోయనుండి సమ్మెట రాక్షసుడి చేతిలో నుండి విడుదల పొందినందుకు సంతోషిస్తూ వారికి ఎదురైన కష్టాలన్నిటి గురించి మాట్లాడుకుంటూ భోజనపానీయాలు చేసారు.

క్రిస్టియానా: గొప్పమనస్సుగారూ పోరాటంలో మీకు దెబ్బలు తగలలేదా?

గొప్పమనస్సు: ఒంటిమీద ఓ చిన్న గాయం తప్ప మరేమీ లేదు. పైగా అది నా మేలు కోసమే జరిగింది.[6]

అది నా ప్రభువు పట్ల ఆయన అనుచరుల పట్ల నా ప్రేమకు గుర్తుగా ఉంటుంది. దేవుని కృపచొప్పున అది నా బహుమానాన్ని అధికం చేస్తుంది.

క్రిస్టియానా: కానీ, ఆ రాక్షసుడు దుడ్డుకర్రతో వస్తున్నప్పుడు నీకు భయం వేయలేదా?

గొప్పమనస్సు: కొంతవరకు భయపడ్డాను. కాని అది నా స్వశక్తి మీద ఆధారపడకుండ సర్వశక్తుని మీదనే పూర్తిగా ఆధారపడేందుకు నేను పొందిన తర్ఫీదులో భాగము.

క్రిస్టియానా: అయితే తొలిదెబ్బతోనే అతడు నిన్ను కుప్పకూలేలా చేసాడు కదా అలా ఎందుకు జరిగింది?

గొప్పమనస్సు: అంతకంటే మరణం వరకు కుప్పకూలినా చివరికి విజయం సాధించిన క్రీస్తును జ్ఞాపకం చేసుకున్నాను.

మాథ్యూ: మీరంతా ఏమనుకుంటున్నారో నాకు తెలియదు కాని నేను మాత్రం దేవుడు మన పట్ల అద్భుతమైన కృపను చూపించాడని భావిస్తున్నాను. ఈ లోయనుండి మనలను బయటకి

6. 2కొరింథీయులకు 4:17; రోమా 8:28 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

తీసుకురావడంలోను మన శత్రువు బలం నుండి విడిపించడంలోను దేవుని మంచితనాన్ని మనం అనుభవించాం. ఆయన మనకు తన ప్రేమ, జ్ఞానము, కృప, శక్తికి సంబంధించిన అంతగొప్ప రుజువులు చూపించాక ఆయన్ని ఎందుకు నమ్మకూడదో నాకు అర్థం కావడంలేదు.

ముసలివాడైన నిజాయితిని మేలుకొల్పుట

అప్పుడు వారు పైకిలేచి తమదారిన వెళ్లిపోయారు. త్వరలోనే వారొక పెద్ద సింధూరపు చెట్టు వద్దకు చేరుకున్నారు. ఆ చెట్టుక్రింద గాఢనిద్రలో ఉన్న ఒక ముసలి యాత్రికుని చూశారు. అతని దుస్తులు, చేతి కర్రను బట్టి అతడు యాత్రికుడేనని గుర్తించారు. గొప్పమనస్సు అతన్ని నిద్రలేపాడు. మొదట అతడు భయపడ్డాడు. అందుచేత, "ఎవర్నువ్? నీకు ఏం కావాలి? నువ్వు ఏం పనిమీద వచ్చావ్?" అని ప్రశ్నించాడు.

గొప్పమనస్సు: అయ్యా, కాస్త కుదుటపడు. మేమంతా నీకు మిత్రులమే. (ఆ వృద్ధుని పేరు నిజాయితీ.) నా పేరు గొప్పమనస్సు; పరలోక దేశానికి పయనమై వెళుతున్న ఈ యాత్రికులకు నేను మార్గదర్శిని.

నిజాయితీ: మీరు నన్ను క్షమించాలి. మీరంతా కొంతకాలం క్రితం అల్పవిశ్వాసం అనేవాడి సొమ్మంతా దోచుకున్న ముఠాకు చెందినవారేమో అని భయపడ్డాను; కాని మీరంతా నిజాయితీపరులని ఇప్పుడు తెలుసుకున్నాను.

గొప్పమనస్సు: సరేగాని, మేము దొంగలమే అయ్యుంటే నీవు ఏం చేసేవాడివి?

నిజాయితీ: ఏం చేసి ఉండేవాడనా? నాకు ఊపిరి ఉన్నంతవరకు ఒక పులిలా పోరాడేవాణ్ణి. ఇంతకు మునుపు అలాగే చేశాను. పైగా మీరు నాపై గెలిచివుండేవాళ్లు కాదు. ఎందుకంటే ఒక యాత్రికుడు తనకు తానుగా లొంగిపోతే తప్ప అతడు ఎన్నటికీ ఓడిపోడు.

గొప్పమనస్సు: భలే చెప్పావు సోదరా. నీవొక మంచి సైనికుడవని నాకిప్పుడు అర్థమైంది.

నిజాయితీ: దీనిద్వారా, ఒక నిజమైన యాత్రికుడు ఎవరో మీకు తెలిసివుంటుంది. మనల్ని ఓడించడం చాలా తేలికని మిగతావాళ్లంతా భావిస్తుంటారు.

గొప్పమనస్సు: సరే, ఇప్పుడు మనము ఇలా కలుసుకున్నాం గనుక మీ పేరేమిటో తెలుసుకోవచ్చా?

నిజాయితీ: నా పేరు నిజాయితీ. బుద్ధిహీనమనే పట్టణం నుండి వచ్చాను. అది నాశనపురానికి అవతల పదిమైళ్ల దూరంలో ఉంటుంది. నా స్వభావం నా పేరుకు తగినట్టు ఉండాలన్నదే నాకోరిక.

గొప్పమనస్సు: నీ గురించి నేను విన్నాను. ఎందుకంటే, ఆ పట్టణం నాశనపురం కంటే దారుణమైనది గనుక అక్కడినుండి ఏ యాత్రికుడైనా వస్తాడా అని ఆలోచిస్తుండేవాడిని.

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

నిజాయితీ: నిజమే, సూర్యుడికి దూరంగా ఉండే కొండ అవతల ప్రాంతంలో మేము ఉండేవాళ్లం. కాబట్టి చాలా చలిగా, వెలుగుకు దూరంగా ఉంటుంది మా పట్టణం. మా పౌరులలో చాలామంది మంచుకొండలో గడ్డకట్టిన మనిషిలా ఉంటారు. అయితే అక్కడకూడ నీతిసూర్యుడు నామీద ప్రకాశించినట్లు నీమీద ప్రకాశించినప్పుడు దాన్ని బ్రద్దలు చేసుకొని, దేవునికొరకు బయటికి వచ్చేస్తావు.

గొప్పమనస్సు: నేను దానిని విశ్వసిస్తాను. ఎందుకంటే అది సత్యమని నాకు తెలుసు.

అప్పుడు ఆ వృద్ధుడు అందరికి నమస్కరించి ప్రేమతోకూడిన ముద్దుపెట్టుకొని ఒక్కొక్కరి పేర్లు అడిగి తెలుసుకున్నాడు. అతడు క్రిస్టియానాతో ఇలా చెప్పాడు: నీ భర్త గురించి నేను విన్నాను. అతడు ధైర్యవంతుడైన మంచి మనిషి. పెద్దవాడైన మాథ్యూని చూసి "ప్రభువుని వెంబడించడానికి తన సంప్రదాయ స్థానాన్ని విడిచి వచ్చిన ఆ పాతకాలపు మత్తయిలాగా జీవించు" అన్నాడు. ప్రార్థనాపరుడు, విశ్వాసవీరుడైన సమూయేలు ప్రవక్తవలే ఉండుమని సామ్యుల్‌ని హెచ్చరించాడు. జోసఫ్‌ని చూసి "పోతిఫరు ఇంటిలో పవిత్రంగా జీవిస్తూ శోధననుండి పారిపోయిన యోసేపువలే ఉండు."[7] చిన్నవాడైన జేమ్స్‌ని చూసి "మన ప్రభువు సోదరుడు, నీతిమంతుడు అయిన యాకోబువలే ఉండు" అని చెప్పాడు.

తరువాత వారు కరుణ గురించి శ్రేష్టమైన జీవితాన్ని అన్వేషిస్తూ తన ఇంటిని తన బంధువులను తన సమస్తాన్ని విడిచి క్రిస్టియానాను వెంబడించిన తీరు గురించి నిజాయితీకి వివరించారు. అతడు ఆమెతో ఇలా అన్నాడు "నీ పేరు కరుణ గనుక కనికరంతోనే జీవిస్తూ పరలోకదేశంలో కరుణ జలదార వద్దకు చేరుకునేదాకా మార్గంలో ఎదురయ్యే కష్టాలన్నిటికీ తట్టుకొని జీవించాలి."

భయస్తుడి గురించి సంభాషణ

వారు కలిసి నడుస్తూ ఉండగా నిజాయితీకి వాళ్ల ఊరివాడైన భయస్తుని గురించి తెలుసా అని మార్గదర్శి అడిగాడు.

"చాలాబాగా తెలుసు. అతడు మంచి జీవితం కలిగినవాడులా పైకి కనిపిస్తాడు: అయినా నాకు తెలిసిన వారందరిలోకల్లా అతడు అత్యంత కఠినమైన యాత్రికుడు" అన్నాడు నిజాయితీ.

గొప్పమనస్సు: నీవు అతని గురించి ఇంత ఖచ్చితంగా చెప్పగలిగావంటే నీకు అతడు తెలిసే ఉంటుంది.

నిజాయితీ: తెలియడమేంటి! ఐదేళ్లు నేను అతనితో చాలా సన్నిహితంగా మెలిగాను. మరణం తరువాత ఏంజరుగుతుంది? అని ఆలోచించటం మొదలుపెట్టాక కొంత కాలం అతడు మా ఇంట్లోనే ఉన్నాడు.

గొప్పమనస్సు: నేనుకూడా మా యజమాని ఇంటినుంచి ఈ మార్గం చివరి వరకు అతనికి మార్గదర్శిగా ఉన్నాను.

నిజాయితీ: అయితే అతడు చాలా ఇబ్బందికరమైన వ్యక్తి అని నీకు తెలిసే ఉంటుంది.

గొప్పమనస్సు: అవును, అలాగే తెలుసుకున్నాను. అయితే దేవుని దయవలన అతన్ని భరించగలిగాను. నావంటి పిలుపు కలిగినవారికి తరచుగా అటువంటి వారికి నాయకత్వం వహించే బాధ్యత అప్పగించబడుతుంది.

నిజాయితీ: అలాగైతే అతని గురించి నీ నడిపింపులో అతడు ప్రవర్తించిన విధానం గురించి కొన్ని విషయాలు చెప్పండి.

గొప్పమనస్సు: అతడు పాపభీతి గలవాడే గానీ చాలా భయస్తుడు. అతడు చేరవలసిన లక్ష్యాన్ని చేరలేనేమోనని భయపడుతుంటాడు. తనకున్న దానిలో ఏమాత్రం వ్యతిరేకత కనిపించినా అది అతన్ని భయపెట్టేది. నిరాశ అనే గుంట దగ్గర దుఃఖిస్తూ దాదాపు ఓ నెలకుపైగా అక్కడే గడిపాడని అతని గురించి విన్నాను. తనకు పరిచయమైనవారు చాలామంది దానిని దాటివెళ్లినా, వారిలో కొందరు అతనికి సహాయం చేస్తామని చెప్పినా అతడు ముందుకు సాగేందుకు సాహసించలేదు అలాగని వెనక్కికూడా వెళ్లిపోడు. నేను పరమపురికి చేరనైనా చేరతాను, లేదా ఈ ప్రయత్నంలో చావనైనా చస్తాను అంటూ ఉండేవాడు. అయినప్పటికీ ఏ చిన్న అవరోధం ఎదురైనా కుంగిపోయేవాడు తన దారిలో ఎవరైనా నిలిపే ప్రతి గడ్డిపరకను చూసి తొట్రిల్లేవాడు.

అతడు బురదగుంట నుండి ఎలా బయటపడ్డాడో నాకు తెలియదు కాని ఒకరోజు సాహసించి తాను మునిగిపోతానేమో అన్న భయంతో ఎలాగోలా బయటపడ్డాడు. అయితే తాను బయటపడ్డాననన్నది సత్యమని నమ్మడం అతనికి చాలా కష్టమైంది. అతడు మనసులో ఇంకా ఆ బురదగుంటను మోస్తూనే ఉన్నాడనుకుంటా. అతడు చిన్నగుమ్మం వద్దకు వచ్చినప్పుడు తలుపు తట్టడానికే భయపడ్డాడు. అక్కడ చాలాకాలం పచార్లుచేస్తూ ఉండిపోయాడు. యాత్రికులను లోపలికి ప్రవేశపెట్టేందుకు ద్వారం తెరువబడినప్పుడు నేను వెళ్లుటకు తగినవాడను కాదు అంటూ ప్రక్కకు తప్పుకొని ఇతరులను పోనిచ్చేవాడు. లోనికి పోవాలని ఆశపడుతూనే భయంతో వణికిపోతూ అక్కడే నిలబడిపోయాడు.

ఎట్టకేలకు అక్కడ తగిలించి ఉన్న సుత్తె తీసుకొని తలుపుమీద మెల్లిగా తట్టాడు. తలుపు తెరువబడినప్పుడు వెనక్కి వెళ్లిపోయాడు. ద్వారపాలకుడు బయటికి వచ్చి లోనికి రావాలనుకుంటున్నావా? అని అతన్ని అడిగాడట. ఆరాధించడానికి అతడు మోకాళ్లమీద పడిపోయాడు. అప్పుడు ద్వారపాలకుడు అతని చేయిపట్టి పైకిలేపి "నీకు సమాధానము అగుగాక! నీకు స్వాగతం! లోనికి రా" అని చెప్పి లోపలికి తీసుకెళ్లాడట; అప్పటికీ అతడు భయపడుతూనే

ఉన్నాడు. తాను ద్వారపాలకుడ్ని మోసగించానని, అతని మంచితనాన్ని తమ ప్రయోజనం కోసం వాడుకుంటున్నానని బాధపడ్డాడట. అతని ఆకారం గురించి తెలివి అనుభవం లేకపోవడం గురించి సిగ్గుపడేవాడు.

అతడు ద్వారం విడిచి బయలుదేరినప్పుడు మా యజమానుడైన వివరణకర్తకు రాస్తూ అతన్ని చేర్చుకొని అవసరమైన అన్ని వసతులు కల్పించి జాగ్రత్తగా చూసుకొనమని చెప్పి ఇచ్చిపంపిన ఉత్తరం అతని చేతిలో ఉంచుకొనికూడా అతను రాత్రంతా బయట చలిలోనే పడుకొనేవాడు. ఆ పరిస్థితుల్లో తాను చేయవలసిన పని ఏమిటో అని ఇతరులతో చర్చిస్తూ ఉండేవాడు. ఒకరోజు నేను కిటికీలోనుంచి చూడగా అతడు భవనం వైపు తేరిచూస్తూ ఉన్నాడు. అప్పుడు నేను బయటికి వెళ్లి లోనికి వస్తావా? అని అడిగాను. అతని కళ్లనిండా నీళ్లు తిరుగుతుండగా ఓ క్షణం సేపు ఏమీ మాట్లాడలేదు. తరువాత నన్ను ఇలా అడిగాడు "నేను మీ ఇంటిలో ఉండడానికి తగినవాడనని నీవు అనుకుంటున్నావా?" అతడు కోరుకుంటున్నదేమిటో నేను చూసి మా యజమాని దగ్గరకు వెళ్లి ఈ విషయం చెప్పాను. అతన్ని తీసుకురమ్మని మా యజమాని నన్ను బయటికి పంపాడు గాని అతన్ని లోపల ప్రవేశపెట్టడానికి ఎంతగానో ఒప్పించాల్సి వచ్చింది. వివరణకర్త ఇంటిలో ఉండగా అతడు కొంత ధైర్యం పొందాడు కానీ అతని భయాల్ని ఎప్పటికీ జయించలేకపోయాడు. పరమపురి ద్వారం వరకు నేను అతనికి తోడుగా వెళ్లవలసి వచ్చింది.

సుందరగృహము వద్ద నేనతన్ని అక్కడ ఉన్న సేవకురాళ్లకు పరిచయం చేసినప్పుడు అతడు ఎంతగానో సిగ్గుపడ్డాడు. ఒంటరిగా ఉండాలని కోరుకున్నాడు. ఏదిఏమైనా ఆ స్థలం అతనికి బాగా నచ్చిందని ఆ తరువాత చెప్పాడు. వివరణకర్త ఇంటి గురించికూడా ఇదే విషయం చెప్పాడు. అతడు దీనత్వపు లోయలోకి వెళ్లినప్పుడు అందరితో వెళ్లినట్లే అతనితో కూడా వెళ్లాను. తనకు ఆదరణ, సమాధానం దొరికితే చాలు ఎంత దీనస్థితినైనా పట్టించుకునేవాడు కాదు. అతనికి ఆ లోయకు ఏదో సామరస్యం ఉన్నట్లు అనిపించేది. ఎందుకంటే అతడు దీనత్వపులోయలో ఉన్నప్పటికంటే శ్రేష్ఠంగా మరి ఎక్కడా ప్రవర్తించడం నేను చూడలేదు.

అయితే అతడు మరణచ్ఛాయలోయలోనికి వచ్చినప్పుడు భయంతో చనిపోతాడేమో అనుకున్నాను. అయినా అతడు తను చెప్పినట్టే వెనుతిరిగిపోలేదు. అయితే ఇలా మొరపెట్టాడు. "అయ్యో పిశాచాలు! ఈ పిశాచాలు నన్ను పట్టుకుంటాయి." అతని అరుపులు ఎలా ఉండేవంటే భూతాలు వచ్చి తనను పట్టుకొని వెళ్లమని ఆహ్వానిస్తున్నట్లు లేదా వాటిని ప్రోత్సహిస్తున్నట్లు అనిపించేది. భయస్తుని నిమిత్తం ప్రభువు ఆ లోయలో ఉన్న దురాత్మలను అదుపుచేసి ఉంటాడు. లేకపోతే అతడు ప్రయాణిస్తున్నంతసేపు ఉన్నంత నిశ్శబ్దంగా గతంలో ఎన్నడూ నేను చూడలేదు.

అయితే అతడు మాయా సంతలోనికి వచ్చినప్పుడు చాలా భిన్నంగా ప్రవర్తించాడు. అక్కడ ఉన్న వారి అవివేకమైన పనులు చూసి అతని కోపం రగిలిపోయేది. అతని కోపం కారణంగా తన భయాలన్నీ మరచిపోయినట్లుగా ఉండేవాడు. అక్కడ ఉన్నవారందరితోను ధైర్యంగా

పోరాడగలడు అన్నట్టు కనిపించేవాడు. వారి అహంభావాన్ని చూసి అతడు పలికిన మాటలతో వారు మా ఇద్దరికి మరణశిక్ష లేదా దేశబహిష్కరణ విధిస్తారేమో అన్నంత భయంవేసింది.

అలాగే మంత్రభూమికి వచ్చినప్పుడు అతని వ్యవహారం చాలా ఆశ్చర్యాన్ని కలిగించింది. అతడు ఎల్లప్పుడు చాలా మెలకువగా ఉండేవాడు. అయితే వంతెనలేని చల్లని నదివద్దకు చేరుకున్నప్పుడు అతడు విపరీతమైన నిరాశావాదిగా మారాడు. అతడు అన్నాడు, "ఇక నా కలలన్నిటికీ అంతం ఇదే ఈ నదిలో నేను శాశ్వతంగా మునిగిపోతాను ఏముఖాన్ని చూడ్డానికి ఇన్ని మైళ్ల దూరం వచ్చానో ఆ ముఖాన్ని ఇక నేను ఎన్నటికీ చూడలేను."

అయినప్పటికీ ఆ నది ఎంతలోతుగా ఉన్నదో భయస్తుడు అంతసురక్షితంగా ఆ నదిని దాటిరావడం ఆశ్చర్యం కలిగిస్తుంది. అతడు ద్వారం వద్దకు వెళుతుండగా అతనికి వీడ్కోలు పలికి, పైన అతనికి చక్కని స్వాగతం లభించాలని శుభాకాంక్షలు తెలిపాను. "నేను పొందుతాను, అది నాకు తెలుసు" అన్నాడు. ఆ తరువాత మేమిద్దరం విడిపోయాం. ఇక ఎన్నడూ అతన్ని చూడలేదు.

నిజాయితీ: అయితే ఇవన్నీ చూస్తుంటే అతడు నిజమైన విశ్వాసి అని రుజువు అవుతుందన్నమాట.

గొప్పమనస్సు: అవును. ఆవిషయంలో నాకెన్నడూ సందేహం లేదు. అతడు యధార్థత, చక్కని క్రైస్తవ లక్షణాలు కలిగిన మనిషి. అయితే జీవితపు వాస్తవాలు అతని ఆత్మను ఎల్లప్పుడు దీనస్థితిలో ఉండేలా చేశాయి. అతడు తనకు తాను భారంగాను ఇతరులకు ఇబ్బందికరంగాను ఉండేవాడు. ఇతరుల పట్లకంటే పాపం విషయంలోనే సున్నితంగా ఉండేవాడు. అంతేకాక ఇతరులను బాధపెట్టడం కానీ గాయపరచడం గాని చేయకుండా జాగ్రత్తపడేవాడు. ఇతరులను బాధపెట్టకుండా ఉండేందుకు తరచుగా అతడు చట్టబద్ధంగా తనకు చెందవలసిన వాటిని కూడా ఉపేక్షించేవాడు[8] మరియు ఇతరులను తనకంటే యోగ్యులనుగా ఎంచేవాడు[9].

నిజాయితీ: అయితే అలాంటి మంచివాళ్లు ఎల్లప్పుడు ఇంత దీనస్థితిలో ఎందుకు ఉంటారు?

గొప్పమనస్సు: దానికి రెండు కారణాలు ఉన్నాయి. ఒకటి, అది దేవుని చిత్తము. రెండవది, జీవితమనే వాయిధ్యంపై విచారపు స్వరాలు పలికించడం దేవునికి అవసరం. కొందరు నాట్యమాడుతుండగా మరికొందరు దుఃఖించాలి. మానవ జీవితమనే ఈ గొప్ప వీణకు కొన్ని మంద్రస్వరాన్ని పలికించే తీగెలు లేకపోతే అది అసంపూర్ణంగా మిగిలిపోతుంది. అయితే కేవలం మంద్రస్వరమే చక్కని సంగీతాన్ని అందించలేదు. ఆ భయస్తుడు తన జీవితంలో ఇతరులు ఏమనుకుంటారు అనే దానితో నిమిత్తంలేకుండా ఎక్కువభాగం మంద్రస్థాయిలోనే స్వరాలను పలికించేవాడు. అయితే నా మట్టుకు నేను ఏవృత్తి అయినా భారముతో కూడిన మనస్సుతో ఆరంభం కాకపోతే దాన్ని నేను లెక్కచేయను. ఏదేమైనా ఒకడు తాను ఒప్పుకునే దానిని

8. రోమా 14:12 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8
9. ఫిలిప్పీయులకు 2:3

సంపాదించుకున్న తరువాత ఆ భారం కొనసాగకూడదు. జీవితాంతం మంద్రస్వరాలనే పలికించేవాడు శృతి తప్పి సమతుల్యత పోగొట్టుకున్న వాడే అని నా ఉద్దేశం.

అయితే కొందరు యాత్రికులు అలవాటుగా వారి నిరాధారమైన భయాలకు లోబడి నిరాశాజనకమైన వారి ఊహలకు విలువిచ్చి దేవుని చిత్తంతోను పరలోకపు స్వరసమ్మేళనంతో శృతి కలపలేక అపశృతులు పలికిస్తుంటారు. దేవుని కృప చాలునని నమ్మేందుకు తిరస్కరిస్తారు. ఆ విధంగా వారు తమకు, తమ తోటివారికి భారంగా తయారవుతారు.

నిజాయితీ: భయస్తుడు సింహాలకు లేదా ఆకతాయిలకు లేదా భౌతికశ్రమలకు భయపడని పౌరుషముగల క్రైస్తవుడని నాకనిపిస్తుంది. అతన్ని బాగా భయపెట్టింది పాపము, అపరాధము, మరణము నరకయాతనలే. అతని సమస్యంతా బయటి శత్రువులతో కాదుగాని అంతరంగ శత్రువులే. మాయా సంతలోని ఆకతాయిలు అతని నీతియుక్తమైన కోపాన్ని రేకెత్తించారే కానీ అతని భయాలను కాదు. తద్వారా సింహంలా ధైర్యంవంతుడ్ని చేసారు. అయితే మరణచ్ఛాయలోయలో దురాత్మలు అతన్ని భయపెట్టాయి. అతడు భయపడేది నిజంగా అతనికే.

అతడు క్రీస్తుని అంగీకరించటం ద్వారా దేవుని వాగ్ధానాలన్నిటికీ అర్హుడయ్యాడని నమ్మటమే అతనికి కష్టంగా అనిపించింది. కాబట్టి దేవుని చేత అతడు అంగీకరించబడడేమో అని భయపడ్డాడు. అతడు నిస్సందేహంగా మతపరమైన చట్టబద్ధతను విశ్వసించాడని చెప్పవచ్చు. అంటే దేవుని చేత తగినంతగా అంగీకరించబడాలంటే మనము ధర్మశాస్త్రానికి లోబడాలని నమ్మడం.

గొప్పమనస్సు: నిజమే కానీ సత్యమేమిటంటే మనం దేవుని ధర్మశాస్త్రానికి విధేయత చూపకముందు మనకు తగినంత దేవుని కృపకావాలి. ఈ కృప క్రీస్తు సిలువ యందలి విశ్వాసము ద్వారానే తప్ప నీతిక్రియల[10] వలన లభించదు. మన విశ్వాసము ద్వారా పరిశుద్ధాత్ముడు కార్యము జరిగించుచుండగా మనము "సత్‌క్రియలు చేయుటకై క్రీస్తుయేసు నందు సృజింపబడి యున్నాము."[11] సత్‌క్రియలనేవి కృపకు లక్ష్యము మరియు ఫలితమేగానీ దానికి కారణం కాదు. భయానికి విరుగుడు కృపే; మనం విశ్వాసంతో ప్రార్థించినట్లయితే తగినంత కృపను పొందుతాము.

క్రిస్టియానా: భయస్తుడి గురించిన ఈ చర్చ నాకు చాలా సహాయకరంగా ఉంది. ఏ ఇతర క్రైస్తవులు నాలా ఉండరని భావించేదాన్ని అయితే ఈ మంచి వ్యక్తి నాలాంటి ఆత్మను కలిగినవాడే ఆనిపిస్తుంది. నాకు కూడా అతనిలాంటి కొన్ని భయాలున్నాయి. కానీ అవి తరచుగా వ్యక్తపరచబడేవి కావు.

కరుణ: భయస్తుడి లాంటి తత్వం నాలోకూడా కొంత ఉందని నేను ఒప్పుకోవాల్సిందే.

గొప్పమనస్సు: సరే ఇప్పుడు మనకు నిరాధారమైన భయాలను జయించడం ఎలాగో అర్థమయింది అనుకుంటాను.

10. తీతుకు 3:5 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8
11. ఎఫెసీయులకు 2:10

మొండివాని గురించిన సంభాషణ

ఇప్పుడు నిజాయితీ తనకు తెలిసిన మరో వ్యక్తి గురించి చెప్పడం మొదలుపెట్టాడు. అతని పేరు మొండి. "ఇతనికి యాత్రికుడి గురించిన అవగాహన లేకపోయినా ఓ యాత్రికుడిలా ప్రయాణం చేస్తూఉండేవాడు." అని చెప్పాడు నిజాయితీ.

గొప్పమనస్సు: ఎందుకని? అతడు ఆ విషయమై నీతో మాట్లాడాడా?

నిజాయితీ: అవును, చాలా ఎక్కువగానే మాట్లాడాడు.

గొప్పమనస్సు: అతడు ఎలాంటి నియమాలను కలిగి ఉండేవాడు?

నిజాయితీ: బైబిల్‌లోని వ్యక్తుల సుగుణాలతో పాటు దుర్గుణాలను కూడా ఒకడు పాటించాలన్నది అతని అభిప్రాయం. దేవుని హృదయానుసారుడైన దావీదు మరొకడి భార్యతో సన్నిహిత సంబంధం కలిగి ఉన్నాడని అతడు అంటుండేవాడు. సొలోమోనుకు అనేకమంది భార్యలు ఉన్నారని; అబ్రహాము తన భార్య దాసియైన హాగరును భార్యగా స్వీకరించాడని; యాకోబు మోసం చేసి తన తండ్రి ఆస్థిని దక్కించుకున్నాడని; ఇశ్రాయేలీయులు ఐగుప్తును విడిచి వచ్చేటప్పుడు తమ ఐగుప్తు పొరుగువారి నుంచి ఆభరణాలు అప్పుతీసుకున్నారని; తన ఇంటిలో గూఢచారులు ఎవరూ లేరని రాహాబు అబద్దమాడిందని; శిష్యులు తమ ప్రభువు మాటమేరకు వేరొకని గాడిదను తీసుకెళ్లారని, అందువలన తానుకూడా అవి చేయవచ్చని అంటాడు. తన దృష్టిలో అవసరమైనది, సరైనది అనిపించిన దేనినైనా చేయవచ్చునని అతడి నమ్మకం.

గొప్పమనస్సు: అది ఖచ్చితంగా నీచమైన గర్హించదగిన ఆలోచన. మరియు అది అత్యంత అనుచితమైన ప్రమాదకర అభిప్రాయం. అతడు ప్రస్తావించిన వాటిలో కొన్ని ఆయా పరిస్థితులను బట్టి చెడ్డవేమీ కావు. బైబిల్‌లోని వ్యక్తులు పాపం చేసారన్నది సత్యమే. అయితే వారి కథనంతా చదివిన వారు ఎవరైనా ఈ పొరపాట్లు దేవుని వాక్యంలో నమోదు చేయబడింది మనకు హెచ్చరికలుగా ఉండేందుకే తప్ప మనము అనుసరించడానికి మాదిరిగా ఉండడానికి కాదని గుర్తిస్తారు. ఈ చెడు కార్యాలను పాటించేవాడు శిక్షింపబడడు అనుకుంటే వాడు నిజంగా మూర్ఖుడే. అతడు కామంచేత ఎంతగా గుడ్డివాడయ్యాడంటే దేవుని వాక్యం చదివినప్పుడు దాని అర్థాన్నికూడా గమనించలేడు. ఒకవేళ చూసినా సత్యాన్ని చూడకుండా అతడు కళ్లుమూసుకుంటాడు. ఎవరో కొంతమంది మంచి యాత్రికులు గాలికికొట్టుకొని పోబడి బురదలో చిక్కుకొని మరలా పవిత్రమైన జీవితానికి పునరుద్ధరించబడ్డారు కాబట్టి తాను కూడా బురదలో దొర్లుతూ దేవుని ఎదుట తోటివారి ఎదుట శుభ్రంగా ఉండగలనని బుద్ధి ఉన్నవాడెవడు ఊహించుకోలేడు. ఇటువంటి అభిప్రాయం కలిగిన ఏ వ్యక్తిలోనైనా దేవుని ప్రేమ ఉంటుందంటే నేను నమ్మలేను.

నిజాయితీ: దుర్మార్గాన్ని మనస్సాక్షికి వ్యతిరేకంగా నాలుగు గోడల మధ్య జరిగించే కంటే నీ ఇష్టానుసారంగా నిస్సిగ్గుగా జరిగించడమే మంచిదని మొండి చెబుతుంటాడు.

గొప్పమనస్సు: అది ఎలా ఉంటుందంటే నీకు ఇష్టం లేకుండా బురదలోకి తోయబడడం కంటే నువ్వే ఇష్టపూర్వకంగా బురదను ఎంచుకొని దానిలో నడవడం మంచిది అన్నట్టు ఉంటుంది. చెత్తకుప్పను ఇంటి వెనుక దాచుకునే కంటే ఇంటిముందే పెట్టుకోవడం మంచిదన్నమాట. ఆ వాదనలో పసలేదని ఎవరికైనా ఇట్టే తెలిసిపోతుంది.

నిజాయితీ: అవును, కానీ ఈ మనిషి లాంటి మనస్సు కలిగి ఉన్న నామకార్ధ క్రైస్తవులు చాలా మందే ఉన్నారు కానీ వాళ్లందరికీ ఇతనిలా మనస్సులో మాటచెప్పే నోరు లేదు.

అధ్యాయం 17
గాయు, నాసోను ఇంటివద్ద

గాయు ఇంటికి స్వాగతం

యాత్రికులు బాగా అలసిపోతుండటంతో క్రిస్టియానా తనకూ, తన పిల్లలకూ ఎక్కడైనా బస దొరికితే బావుంటుందని ఆశించింది.

"కొంచెం దూరంలో, ప్రఖ్యాత శిష్యుడైన గాయునకు చెందిన మంచి స్థలం ఒకటుంది" అని చెప్పాడు నిజాయితీ.

కాబట్టి వారందరూ అక్కడికి వెళ్లాలని నిశ్చయించుకున్నారు. ఆ స్థలానికి చేరుకుని, దాని యజమాని కొరకు వాకబు చేశారు. అతడు తక్షణమే వచ్చి, వారిని సంతోషంగా చేర్చుకున్నాడు. రాత్రి పడుకొనేందుకు అవసరమైన గదులు కావాలని వారు అడుగగా, వారు నిద్రపోదగిన గదులు వారికి చూపించాడు.

అప్పుడు గొప్పమనస్సు ఇలా చెప్పాడు, "గాయు గారూ, వీళ్లందరూ చాలా దూరప్రాంతం నుంచి వచ్చారు, పైగా మధ్యాహ్నం నుండి ఇంతవరకు ఏమీ తినలేదు. ఏదిఏమైనా, మీ ఇంటిలో ఉన్నదానితోనే వారు తృప్తిచెందగలరు."

గాయు: మంచిది! బాగా పొద్దుపోయింది, గనుక నేను ఇప్పుడు బయటికి వెళ్లి ఏమీ కొనలేను కానీ, మా దగ్గర చాలినంత ఉంది, ఉన్నదానిలో శ్రేష్ఠమైనదే మీకు వడ్డిస్తాము.

క్రిస్టియానా: అదే మేము సంతోషంగా స్వీకరిస్తాం. మేము కేవలం సామాన్యులం గనుక మాకు విలాసాలు అక్కరలేదు.

గాయు: యాత్రికులకు మేము ఎల్లప్పుడూ శ్రేష్ఠమైనదే ఇస్తాము. ఇక్కడ మీ అందరికీ సాదర స్వాగతం పలుకుతున్నాం. మా దగ్గర గది ఉన్నది అంతేచాలు, మీరు ఎంతకాలం ఉన్నా మాకు అభ్యంతరం లేదు.

అప్పుడతడు లోనికి వెళ్లి, ఎనిమిది మందికోసం భోజనం సిద్ధం చెయ్యమని రుచి అనే వంటమనిషిని కోరాడు. తరువాత అతిథులను పరిచయం చేసుకోవడం కోసం వారితో తీరికగా

మాట్లాడేందుకు సమావేశపు గదిలోనికి ఆహ్వానించాడు. "గొప్పమనస్సు గారూ, వీళ్లగురించి నాకు పరిచయం చేస్తారా? నాకు తెలిసినవాళ్లు మీరు, ఈ నిజాయితీయే" అన్నాడు గాయు.

గొప్పమనస్సు: నా ఎడం ప్రక్కన కూర్చున్న వీరు క్రిస్టియానా, గతంలో సుప్రసిద్ధ యాత్రికుడగు క్రైస్తవుని సతీమణి. ఆమెతో ఉన్న ఈ యువతి కరుణ. క్రిస్టియానాకు మంచి మిత్రురాలు, తోటి ప్రయాణికురాలు. ఈ కుర్రాళ్లు క్రైస్తవుడి కుమారులు. వీరందరూ నాశనపురానికి చెందినవారు.

గాయు (క్రిస్టియానా వైపు చూసి మాట్లాడుతూ): నువ్వు క్రైస్తవుని భార్యవా? నీ భర్త నాకు తెలుసు. వాళ్ల నాన్నగారు, అతని తాతగారు కూడ నాకు తెలుసు. ఆ కుటుంబం నుండి ఎందరో బలమైన క్రైస్తవులు వచ్చారు; వారి పూర్వికుల స్వస్థలం అంతియొకయ. నీ భర్త వాళ్లగురించి చెప్పడం బహుశా మీరు వినేవుంటారు. వారు చాలా యోగ్యమైన వ్యక్తులు. వారిలో అనేకులు క్రీస్తుకార్యముల కొరకు తమ ప్రాణాలర్పించారు. ఆ కుటుంబంలో పెద్దవాడైన స్తెఫను తన విశ్వాసాన్ని బట్టి రాళ్లతో కొట్టబడ్డాడు. అదే తరంలో వారికి దూరపు బంధువైన యాకోబు ఖడ్గంతో వధించబడ్డాడు.

సింహాలకు ఆహారంగా వేయబడిన ఇగ్నేషియస్ కూడ ఉన్నాడు; బ్రతికి ఉండగానే తన మాంసమంతా కోసివేయబడిన రొమానస్; మంటల్లో వీరోచితంగా మరణించిన పాలికార్ప్ లాంటివాళ్లు ఎంతోమంది ఉన్నారు. క్రీస్తుపట్ల వారికున్న స్వామిభక్తిని బట్టి గాయాలపాలై, మరణించినవారి పేర్లన్నీ చెప్పడం దాదాపుగా అసాధ్యమే అవుతుంది. నీ భర్త తన తదనంతరం అతని విశ్వాసాన్ని కొనసాగింపజేయడానికి, లోకంలో మంచిపేరు సంపాదించుకోవడానికి నలుగురు కొడుకులను విడిచివెళ్లినందుకు నాకు ఎంతో సంతోషంగా ఉంది.

గొప్పమనస్సు: నాకు కూడ సంతోషంగానే ఉంది సోదరా గాయు. ఈ కుర్రాళ్లు ఎంతో మంచి భవిష్యత్తు ఉన్నవాళ్లు. వారికాలంలో తమ తండ్రిగారి యోగ్యమైన పేరును నిలబెట్టి, అతని క్రైస్తవ ఆదర్శాలకోసం పాటుపడతారు.

గాయు: నేను చూడాలనుకునేది కూడ అదే. ఫలితంగా క్రైస్తవుడి పేరు, అతని కుటుంబమూ కొనసాగి, అతని ఆదర్శభావాలు నిలిచివుండాలన్నదే నాకోరిక.

భోజనాలయ్యాక, స్త్రీలు, పిల్లలు నిద్రపోయారు. కానీ పురుషులు కూర్చొని, తెల్లవారే వరకు మాట్లాడుకొన్నారు.

గజదొంగతో పోరాడుట

ఉదయాన అల్పాహారం తిన్న తరువాత గాయు ఇలా అన్నాడు, "ఇప్పుడు మీరంతా ఇక్కడ ఉన్నారు గనుక, గొప్పమనస్సు తన ఆయుధాలను ఉపయోగించడంలో నేర్పరి కాబట్టి, మీకు ఇష్టమైతే, మనం పొలాల్లోకి వెళ్లి ఏదైనా మేలు చెయ్యగలమేమో చూద్దాం."

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

నిజాయితీ: గాయూ, నీ మనస్సులో ఏముందో చెప్పవా?

గాయు: ఇక్కడికి ఒక మైలు దూరంలో ఒక కరడుగట్టిన గజదొంగ ఓ గుహలో నివాసముంటున్నాడు. అతడు పహారా అనే పేరుతో చెలామణి అవుతున్నాడు గాని అతని అసలు పేరు సంహారకుడు. మహారాజు మార్గంలో వెళ్లే యాత్రికులను అతడు నిత్యం వేధిస్తుంటాడు. అతడు ఓ దొంగల ముఠా నాయకుడు. అతని అడ్డా ఎక్కడో నాకు తెలుసు. ఈ దేశం నుంచి మనము అతని పీడ వదిలించగలిగితే బావుంటుంది. మీకు ఒకింత సాహసం చెయ్యాలని ఉంటే, నాతో రండి, మనం వెళ్లి అతడు దాగివుండే స్థలాన్ని వెతుకుదాం.

పిల్లలతో సహా, వాళ్లందరూ సమ్మతించి వెళ్లారు. గొప్పమనస్సు తన ఖడ్గాన్ని, శిరస్త్రాణాన్ని, డాలును ధరించగా, తక్కినవాళ్లు బల్లెములు, దుడ్డుకర్రలు పట్టుకొని బయలుదేరారు. పొలం చివరివైపు బాగా పెరిగిన కలుపు మొక్కల్లో గుండా వెళ్లి, వారు గుహ ఎదుటికి చేరుకున్నారు. లోపల గొప్పమనస్సుకు తెలిసిన ఒక వ్యక్తి ఉన్నట్టు గుర్తుపట్టారు. అతని పేరు బలహీనం. రాజమార్గంలో వెళుతుండగా అతన్ని చూశాడు. డబ్బు, నగలకోసం వెతుకుతున్న సంహారకుడు అనే గజదొంగ చేతికి అతడు చిక్కాడు.

గొప్పమనస్సును, అతని సహచరులను చూచిన వెంటనే గజదొంగ ఇలా అడిగాడు, "మీరెవరు? ఇక్కడ మీకు ఏం కావాలి?"

గొప్పమనస్సు: మాకు నువ్వే కావాలి. ఆ మనిషిని విడిచిపెట్టి, నీ గుహలోనుంచి బయటికి రా.

సంహారకుడు: మీరు నా స్థలానికి ఎందుకొచ్చారు?

గొప్పమనస్సు: నీవు వధించిన యాత్రికుల రక్తానికి ప్రతిగా నీమీద ప్రతీకారం తీర్చుకోవడానికి, ఇతరులకు నీవు కలిగించిన కష్టాలకు తగిన శాస్తి చెయ్యడానికే వచ్చాం.

వారు రెట్టించిన ఉత్సాహంతో వానిమీదికి వెళ్లారు. సంహారకుడు తన బలమంతా కూడగట్టుకొని గొప్పమనస్సును వెనక్కి నెట్టివేయడానికి ప్రయత్నించాడు. తర్వాత, ఒక దయ్యంలా అరుస్తూ గొప్ప మనస్సు తలమీద ఇనుప గొట్టంతో గట్టిగా కొట్టాడు. అయితే గొప్పమనస్సు తన బలమైన ఎడం చేతితో ఆ గొట్టాన్ని పట్టుకొని తన ఖడ్గంతో సంహారకుడి మెడను తెగనరికాడు. రక్తం ఓడుతూ అతడు క్రింద పడిపోయాడు. చావుదెబ్బ తగలడంతో అతడిని గుహలోనే విడిచి వెళ్లిపోయారు.

బలహీనుని విడిపించుట

వారు బలహీనుని గాయు సత్రం వద్దకు తెచ్చి, దొంగచేతిలో అతడు ఎలా చిక్కాడో వివరించమని అడిగారు.

బలహీనం: మీరు చూశారుగా, నేను బలవంతుణ్ణి కాదు. నా జీవితంలో ఒకప్పుడు మరణం నా తలుపు రోజూ తట్టుతుండేది. నేను ప్రభువు స్వరానికి విధేయత చూపి, యాత్రికుని మార్గం చేపట్టేవరకు నా ఆరోగ్యం ఎప్పటికీ కుదుటపడదు అనుకున్నాను. అందుచేత నేను దేవుని పిలుపుకు విధేయత చూపి, ఇంటిని విడిచి బయలుదేరగా నా ఆరోగ్యం మరల బాగుపడింది గనుక నేను రాజుగారికి, మానవాళికి మంచి సేవ చెయ్యగలిగేంత శక్తిని పుంజుకున్నాను. అనిశ్చితి అనే పట్టణం నుండి నేను బయలుదేరి ఇక్కడిదాక వచ్చాను. మా నాన్నగారు, నేను అక్కడే జన్మించాం. వేరు వేరు సమయాల్లో వేరువేరు వ్యక్తులు మార్గంలో నాకు సాయపడ్డారు. మహారాజు సేవకుల్లో ఒకరు నన్ను కష్టాల కొండమీదికి మోసుకెళ్లాడు. నిజానికి, యాత్రికుల నుండి నేను చాలా సహాయమే పొందాను. అయితే, అందరూ నా ప్రయాణం శీఘ్రంగా జరగాలని ఆశించి నన్ను ప్రోత్సహించారు కాని, నా అంత నెమ్మదిగా ప్రయాణించడానికి ఎవరూ ఇష్టపడలేదు. దాడి అనే వీధికి చేరుకున్నప్పుడు ఈ దొంగ బయటికొచ్చి, నన్ను బలవంతంగా అతని ముందు నడిపిస్తూ తన గుహవద్దకు తీసుకొచ్చాడు. నేను పారిపోవడమో లేదా ఎదిరించడమో చెయ్యలేకపోయాను గనుక అతడు చెప్పినట్టు చేశాను. నా సంరక్షకుడి చేతికి నన్ను నేను అప్పగించుకొని, ఈ బందిపోటు దొంగచేతిలో నన్ను చావనివ్వడని విశ్వసించాను; ఈ దుష్టుడికి నేను ఇష్టపూర్వకంగా లోబడటం లేదని ఆయన చూడగలడు. అందువలన చివరికి నేను ఎలాగైనా ప్రాణాలతో బయటపడతానన్న నమ్మకం కుదిరింది. ఏ యాత్రికుడైనా బలాత్కారుల చేతికి చిక్కినపుడు అతడు తన హృదయాన్ని మనస్సును ప్రభువుమీద లగ్నం చేసినప్పుడు అతడు చావడని, తన శత్రువు చేతిలో తాను భరించగలిగిన దానికంటే ఎక్కువ శ్రమనొందడని నేను విన్నాను. నేను దోపిడీకి గురవుతాననుకున్నాను, అలాగే దోచుకొనబడ్డాను. అయితే నేను పొగొట్టుకునేందుకు నా వద్ద ఎక్కువేమీ లేదు. పైగా నా ప్రాణాలు కాపాడినందుకు దేవునికీ, ఆయన సేవకులైన మీకు నేను వందనస్తుడను. తక్కిన ఇబ్బందులు ఎదురవుతాయని నాకు తెలుసు; కాని, మంచి మార్గంలో కొనసాగాలని తీర్మానించుకున్నాను. పరుగెత్తగలిగినప్పుడు పరుగెత్తాలని, పరుగెత్తలేనప్పుడు నడవాలని, నడవలేనప్పుడు పాకుతూ వెళ్లాలని తీర్మానించుకున్నాను; ఎలాగైనా సరే సీయోను వైపు చూస్తూ ముందుకు సాగాలన్నదే నా ధ్యేయం. నా ప్రయాణం సుదీర్ఘంగా, శ్రమతోకూడినది కావచ్చు, నా మనస్సు, దేహము బలహీనమైనవి కావచ్చు; అయినా మార్గం చివరిలో, వంతెన లేని నదికి అవతల ఉన్న ఆ అందమైన పట్టణం మీద నా హృదయం లగ్నం చెయ్యబడింది.

గాయు: నా సహోదరుడా, సంతోషంగా ఉండు. మా ఇంటికి స్వాగతం. ఇక్కడ నీవు హాయిగా ఉండవచ్చు.

బలహీనం: ఇది నేను ఊహించని నాకు తగని అనుగ్రహం. కారుమేఘాలను చీల్చుకొని సూర్యుడు ప్రకాశించునట్లుగా ఉంది. సంహారకుడనే దొంగ నన్ను పట్టుకొని తన గుహకు తీసుకెళ్లి నాజేబులు ఖాళీ చేసినప్పుడు నేను ప్రాణాలతో బయటపడతానని వాడు ఊహించి ఉండడు.

గొప్పమనస్సు: తన ప్రాణం పోగొట్టుకోవాలని కూడా అతడు ఆశించి ఉండడు.

సరిగ్గా అప్పుడే ఒకడు పరుగెత్తుకుంటూ తలుపు దగ్గరకు వచ్చి ఇలా కేకలు వేశాడు: "ఇక్కడికి రెండు మైళ్ల దూరంలో అధర్మం అనే ఒక యాత్రికుడు పిడుగుపాటుతో అకస్మాత్తుగా చనిపోయాడు."

"అయ్యో! అతడు చనిపోయాడా?" అని పెద్దగా అరిచాడు బలహీనం. "ఈరోజు బందిపోటు దొంగ నన్ను పట్టుకున్నప్పుడు అతడు నాతోనే ఉన్నాడు. అయితే అతడు పారిపోయి తప్పించుకున్నాడు. అతడు మరణించడానికే తప్పించుకోగా నేను సజీవంగా ఉండటానికి ఖైదీగా కొనిపోబడ్డాను అనిపిస్తోంది."

మాథ్యూ కరుణల వివాహం

ఇదే సమయానికి మాథ్యూ, కరుణ వివాహం చేసుకున్నారు; అలాగే గాయు తన కుమార్తె ఫీబిని మాథ్యూ తమ్ముడైన జేమ్స్‌కు ఇచ్చి వివాహం చేసాడు.

దీని తరువాత యాత్రికులు గాయుతో మరో పదిరోజులు గడిపారు. వారు వెళ్లడానికి సిద్ధమైనప్పుడు గాయు వారికి విందు చేసాడు. కాని దానికి ఖర్చు ఎంత అయిందో వారికి చెప్పలేదు. తన ఇంటిలో ఉన్నందుకు ఎంత ఖర్చు అయిందో చెప్పమని గొప్పమనస్సు అడిగినప్పుడు యాత్రికులు తన ఇంటిలో ఎంత కాలం ఉన్నా దానికి డబ్బు వసూలు చేయడం తనకు అలవాటు లేదని గాయు చెప్పాడు. "వాళ్లు ఎప్పుడొచ్చినా నాకు సంతోషమే. కొన్నిసార్లు నెలలు తరబడి వారికి ఉచితంగా బస కల్పిస్తాను. ఇక నాకు రావలసిన సొమ్ము గురించి మంచి సమరయుడు వచ్చేదాకా ఎదురు చూస్తాను. ఎందుకంటే నేను వచ్చి మరలా చెల్లించెదను అని ఆయన వాగ్దానం చేశాడు.[1]"

ఈ మాటలు గొప్పమనస్సుకు ఒక వాక్యాన్ని గుర్తుచేసాయి. "ప్రియుడా, వారు పరదేసులైనను సహోదరులుగా ఉన్న వారికి నీవు చేసినదెల్ల విశ్వాసికి తగినట్టుగా చేయుచున్నావు. వారు నీ ప్రేమనుగూర్చి సంఘము ఎదుట సాక్ష్యమిచ్చిరి. వారు అన్యజనుల వలన ఏమియు తీసుకొనక ఆయన నామము నిమిత్తము బయలు దేరిరి గనుక దేవునికి తగినట్టుగా నీవు వారిని సాగనంపిన ఎడల నీకు యుక్తముగా ఉండును."[2]

వారు గాయు ఇంటిని విడిచి వెళ్తున్నప్పుడు బలహీనం వారితో పాటు వెళ్లడానికి సంశయిస్తున్నట్లు తలుపు దగ్గరే నిలబడిపోయాడు.

గొప్పమనస్సు: సహోదరుడా బలహీనం, నువ్వుకుడా మాతోపాటు రా. మిగతా వాళ్లలాగే నీకు కూడా నేను మార్గదర్శిగా సంరక్షకుడిగా ఉంటాను.

బలహీనం: అది నిజమే కాని నేను రావటం వలన మీ ప్రయాణం మందగిస్తుంది. మీ సంతోషానికి ఆటంకంగా మారుతానేమో కదా? మీరంతా చాలా సంతోషంగా హుషారుగా ఉన్నారు. నేను

1. లూకా 10:35 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8
2. 3యోహాను 5-6

బలహీనుడను పైగా నాకున్న ఆనందమూ అంతంత మాత్రమే. కాబట్టి నేను మీ వెనుక రావడమే మంచిది కాదంటారా? మీ హృదయంలో దేవుని ఆనందం ఉంది కనుక మీరు వేగంగా వెళుతూ ప్రభువు నందు ఆనందిస్తారు కదా? ఇక నేనైతే మీ వేగాన్ని లేదా మీ ఉత్సాహాన్ని చూసి నొచ్చుకొనే అవసరం రాదు. ఒక బలహీనమైన వ్యక్తి ఎంత సున్నితమైన మనస్తత్వం కలిగిన ఉంటాడో మీకు తెలియదు."

గొప్పమనస్సు: అయితే సహోదరుడా, మేము ధైర్యముచెడిన వారిని ధైర్యపరచుటకు, బలహీనులకు ఊతమివ్వాలని అందరి ఎడల దీర్ఘశాంతము గలవారమై[3] ఉండాలని తర్ఫీదు పొందాము. నీవు అలసినప్పుడు మేము నీ కోసం వేచిఉంటాము, నీకు సహాయం చేస్తాము. న్యాయబద్దంగా మాకు చెందవలసిన దానిని ఉపేక్షిస్తాము అది అభిప్రాయమైనా, ఉద్ధేశమైనా, ప్రవర్తన లేదా మాటలైనా నీకోసం వాటన్నిటినీ వదులుకుంటాం.[4]

యాత్రికులతో కలిసిన కుంటయ్య

వారి సంభాషణ జరుగుతున్నప్పుడు కుంటయ్య అనే ఒక కుంటి వ్యక్తి ఊతకర్రల సాయంతో వాళ్లను చేరుకున్నాడు. "ఏం కుంటయ్య ఎలా ఉన్నావ్?" అంటూ బలహీనం తనదైన శైలిలో అడిగాడు. నాకు సరిపోయిన సహచరుడు– అనగా నావంటి అవిటివాడు లేడని ఇప్పుడే వీరితో మాట్లాడుతున్నాను. నీవు సరైన సమయానికి వచ్చావు. నువ్వే నాకు సరైనజోడీవి. మనిద్దరం ఒకరికొకరు సహాయకరంగా ఉండగలమని నా ఆశ.

కుంటయ్య: నీకు తోడుగా రావడం నాకు సంతోషమే. నేను నీకు ఏవిధంగానైనా సహాయ పడగలిగితే చాలు సోదరా బలహీనం. కావాలంటే నా ఊతకర్రల్లో ఒకటి నువ్వు వాడుకోవచ్చు.

బలహీనం: లేదు, లేదు! నీ మంచితనానికి కృతజ్ఞతలు. నేను అవిటివాడ్ని కాదుగాని బలహీనుడ్ని. ఏదేమైనా దారిలో కుక్కలు ఎదురయితే నీ ఊతకర్ర ఉపయోగపడుతుందిలే.

ఇప్పుడు వారు ఈవిధంగా ప్రయాణిస్తున్నారు: గొప్పమనస్సు, నిజాయితీ ముందువరుసలో వెళ్తుండగా వారి వెనుక క్రిస్టియానా ఆమె నలుగురు కొడుకులు, కరుణ, ఫీబి; చివరిలో బలహీనం, మరియు కుంటయ్యలు ఉన్నారు.

ఆడంబరం అనే ఊరులో నాసోను ఇంటికి చేరుట

వారు మాయానగరం అనే పట్టణంలో ప్రవేశించే సమయానికి బాగా చీకటి పడింది. ఆ రాత్రికి ఎక్కడ ఉండాలో వారికి అర్థం కాలేదు. చివరికి గొప్పమనస్సు ఇలా అన్నాడు: " మీకు తెలుసు కదా నేను తరచుగా యాత్రికులను ఈ పట్టణం మీదుగా తీసుకెళుతుంటాను కనుక ఇక్కడ నాకు తెలిసిన వాళ్లు కొంతమంది ఉన్నారు. నాసోను అనే పేరు గల వృద్ధ భక్తుడు ఒకాయన ఉన్నాడు. మన మార్గంలో ఆయన ఇల్లు ఎంతో దూరంలో లేదు. మీకు ఇష్టమైతే

3. 1థెస్సలోనీకయులకు 5:14 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8
4. రోమా 14:1, 1కొరింథీ 8:9-13; 9:22

అక్కడికి వెళదాం." ఈమాటలు విని వాళ్లందరు సంతోషించి వెంటనే ఒప్పుకొన్నారు. అప్పుడు బాగా చీకటిగా ఉంది కానీ నాసోను ఇంటికి వెళ్లేదారి గొప్పమనస్సుకు తెలుసు.

అతని గుమ్మం వద్దకు వారు చేరుకున్నప్పుడు గొప్పమనస్సు లోపల ఉన్న వాళ్లను పిలిచాడు.

లోపల ఉన్న ముసలాయన అతని స్వరం గుర్తుపట్టి వచ్చి తలుపు తీసాడు. "లోపలికి రండి. ఎలా ఉన్నావు సోదరా గొప్పమనస్సు? నిన్ను చూడ్డం సంతోషంగా ఉంది."

లోపల గొప్పమనస్సు అందరిని పరిచయం చేసాక వాళ్లంతా కింద కూర్చున్నారు. "ఈరోజు మీరు ఎంత దూరం ప్రయాణించారు?" అడిగాడు నాసోను.

"గాయు ఇంటి వద్దనుంచి వచ్చాము" జవాబిచ్చాడు గొప్పమనస్సు.

"అంటే ఒకరోజు ప్రయాణం చేసారన్నమాట" అన్నాడు ముసలాయన. మీరు బాగా అలసిపోయారని నాకు తెలుసు. మీరు నిద్రపోవడానికి తగిన స్థలం ఏర్పాటు చేసి మీకు తినడానికి ఏమైనా ఇస్తాను. మీకు ఏది కావాలన్నా అడగండి, మాకు సాధ్యమైనంత వరకు వాటిని అందించడానికి ప్రయత్నిస్తాను.

నిజాయితీ: కొంతసేపటి క్రితం మాకున్న గొప్పకోరిక సౌకర్యవంతమైన ఒక ఇల్లు, మంచి సహవాసం. ఇప్పుడు మాకు ఆ రెండు లభించాయి అనుకుంటాను.

నాసోను: ఇంటి వరకు మీకు దొరికినట్టే కాని సహవాసం విషయానికొస్తే అది ముందు ముందు తెలుస్తుంది.

తరువాత అతడు ఎవరెవరి గదులు వారికి చూపించి ఓ పెద్ద విందుశాలకు తీసుకెళ్లాడు. అక్కడ వారు కొంత అల్పాహారం తీసుకున్నారు. వారు బల్ల దగ్గర కూర్చొని ఉండగా ఈ ఊళ్లో శిష్యులు ఎవరైనా ఉన్నారా? అని నిజాయితీ అడిగాడు.

నాసోను: కొంతమంది ఉన్నారు. అందర్నీ లెక్కిస్తే ఎక్కువమందే ఉంటారు కాని అవిశ్వాసులందరితో పోల్చిచూస్తే వారి సంఖ్య తక్కువే.

నిజాయితీ: ఈ రాత్రి వాళ్లలో కొంతమందిని మేము చూడవచ్చా? యాత్రికులు విశ్వాసులను కలుసుకోవడం అనేది తుఫాను వచ్చిన రాత్రి సముద్ర ప్రయాణికులకు చంద్రుడు, నక్షత్రాలు కనిపించినట్టు ఉంటుంది.

యాత్రికులను దర్శించుటకు పొరుగువారిని ఆహ్వానించుట

అప్పుడు ఆ పెద్దాయన తన కుమార్తె అయిన కృపను పిలిచాడు. "కృపా నువ్వు వెళ్లి నా స్నేహితులైన పశ్చాత్తాపం, పరిశుద్ధం, భక్తవత్సలం, సత్యానందం, ప్రాయశ్చిత్తం అనే వాళ్లను కలిసి ఈరోజు సాయంత్రం చాలా దూరప్రాంతం నుండి కొందరు స్నేహితులు మా ఇంటికి

వచ్చారని, వాళ్లు మిమ్మల్ని చూడాలనుకుంటున్నారని చెప్పి పిలుచుకొని రా." కృప వెళ్లింది, కొంత సేపటికి వాళ్లందరు వచ్చారు.

"మిత్రులారా, ఈ యాత్రికులు సీనాయి పర్వతం వద్దకు వెళ్లేందుకు దూరప్రాంతం నుండి బయలుదేరి వచ్చారు. ఇక్కడ ఉన్న గొప్పమనస్సు మీ అందరికి తెలుసు అనుకుంటాను. ఆయన ఇంతకు మునుపు కూడా ఇక్కడికి వచ్చాడు. వీళ్లందరికీ అతడు మార్గదర్శి. నేను గొప్పమనస్సుకు స్నేహితుడ్ని గనుక ఈ రాత్రి వాళ్లు ఇక్కడ ఆగారు. దారిలో మిమ్మల్ని కలిసి ఓ చిన్న క్రైస్తవ సమావేశం కలిగి ఉండాలని కోరుకున్నారు. ఈ పొడుగైన తెల్లజుట్టు గల పెద్దాయన పేరు నిజాయితీ. చాలా సంవత్సరాలనుండి ఈయన యాత్రికుడిగా ఉన్నాడు. క్రిస్టియానా వైపు చూపిస్తూ ఈమె ఎవరనుకుంటున్నారు? ప్రఖ్యాత యాత్రికుడైన క్రైస్తవుడి భార్య. అతడు తన సహచరుడైన విశ్వాసితో ఈ పట్టణానికి వచ్చినప్పుడు మన ఊరివాళ్లు అతనితో ఎంతో దుర్మార్గంగా ప్రవర్తించారు."

వారందరు సంతోషించారు. వారిలో ఒకరు అన్నారు: "కృప వచ్చి మమ్మల్ని పిలిచినప్పుడు ఇంత రాత్రి వేళ క్రిస్టియానాని చూస్తామని మేము ఎవరమూ ఊహించలేదు. ఎంత ఆశ్చర్యం!" వారందరు కూర్చున్న తరువాత ఆ పట్టణ ప్రజల నైతిక ఆధ్యాత్మిక స్థితి ఎలా ఉన్నది చెప్పమని పశ్చాత్తాపాన్ని అడిగాడు నిజాయితీ.

పశ్చాత్తాపం: ఒకప్పటి కంటే బాగానే ఉంది కాని లోకంలో ఇదే మంచి స్థలమని మాత్రం చెప్పలేను. ఇక్కడ ప్రతి ఒక్కరు డబ్బు సంపాదించడానికి లేదా ఏదో ఒక సుఖాన్ని అనుభవించడానికి ఎంతగా తొందరపడుతుంటారంటే క్రైస్తవులు సహా తమ హృదయాలను మనస్సులను మంచి క్రమంలో పెట్టుకోవడం కష్టమవుతుంది. ఇక్కడ ఎంతో ప్రార్థనాపూర్వకంగా మహా జాగ్రత్తగా ఉంటే తప్ప తిన్ననిదైన ఇరుకు మార్గం నుండి ప్రక్కకు త్రోసివేయబడడమో లేదా మనస్సులో జరిగే యుద్ధంలో శత్రువుకి అవకాశం ఇచ్చినవారమో అవుతాం.

నిజాయితీ: మరి మీ పొరుగువారి వైఖరి, మనస్తత్వం ఎలా ఉంటుంది?

పశ్చాత్తాపం: గతంలో కంటే వారు ఇప్పుడు చాలా నెమ్మదస్తులు మర్యాదస్తులుగా మారిపోయారు. క్రైస్తవుడు, విశ్వాసి అనే వారి పట్ల వారు ఎంత క్రూరంగా హింసాత్మకంగా ప్రవర్తించారో మీకు తెలుసు. ఇప్పుడు వారు మరింత నాగరికులు అయ్యారు. విశ్వాసి రక్తాపరాధం వారిమీద ఉందని వారు భావిస్తున్నారని నా ఉద్దేశం. అతన్ని చంపినప్పటి నుంచి వారు ఇంతవరకు క్రైస్తవుల్లో ఎవరినీ కాల్చడం గానీ, మరణ దండన విధించడం కానీ చేయలేదు. అది జరుగక మునుపు మేము వీధుల్లో నడవాలన్నా భయపడిన రోజులు ఉన్నాయి. ఇప్పుడు ఈ పట్టణంలో ఎక్కడికి వెళ్లినా సురక్షితంగానే ఉంటున్నాం. అప్పట్లో "క్రైస్తవుడు" అనే పేరు ప్రజలకు నిందార్హమైనదిగా ఉండేది. ఇప్పుడు నగరంలో కొన్ని ప్రాంతాల్లో క్రైస్తవుడిగా ఉండటమంటే గౌరవప్రదంగా భావించబడుతుంది.

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

అప్పుడు పశ్చాత్తాపం ఇలా అడిగాడు: "యాత్రికులారా మీరు ఏమనుకుంటున్నారు? ఈ ఊరి వాళ్ల వైఖరి మీ పట్ల ఎలా ఉంది?"

నిజాయితీ: అశాశ్వతమైన మానవాళి అంతటికి జరిగినట్లే మాకు జరుగుతుంది. కొన్నిసార్లు మేము ఉప్పొంగినా మరికొన్ని సార్లు కుంగిపోతాము. శిఖరాగ్రాన ఉంటాము అంతలోనే లోయలోకి వెళతాము. కొన్నిసార్లు మా మార్గం సంతోషంగా తేలికగా ఉంటుంది. సూర్యకాంతి ఆనందాలతో నిండిఉంటుంది. అంతలోనే మేఘాల మాటున అంధకారంలో చిక్కుకుపోయి మా మార్గం కఠినంగాను సుదీర్ఘంగాను ఉంటుంది. మేము ఒకే విధంగా ఎక్కువసేపు ఉండలేము. గాలులు ఎల్లప్పుడు మాకు అనుకూలంగా వీచవు. కొన్నిసార్లు మేము మేఘాలలో తేలినట్టు అనిపిస్తుంది. మాకు పోరాటాలు విజయాలు ఉన్నాయి. శత్రువులను, మిత్రులను కలుస్తాము మా పరీక్షలు, మా జయాలు, కష్టాలు, శ్రమలు మాకున్నాయి. అయినా ప్రతి పరిస్థితుల్లో మేము విశ్వసించగలిగితే చాలు దేవుని కృప మాకు చాలునని యధార్థంగా చెప్పగలం.

పరిశుద్ధం: నా అనుభవం, అవగాహనను బట్టి చూస్తే ఒక యాత్రికునికి తప్పనిసరిగా ఉండవలసినవి రెండున్నాయి. ఒకటి ధైర్యము, రెండవది మచ్చలేని జీవితం. ఒక వ్యక్తికి ధైర్యం లేకపోతే తన పిలుపులో పట్టుదలతో కొనసాగలేడు. ఇక అతడు తన జీవితంలో ఓడిపోతే యాత్రికుని మార్గం తొలగి తిరుగుతాడు.

గొప్పమనస్సు: నిజమే, ఒకడు దేవుని వాక్యము, ఆత్మచేత నడిపించబడకపోతే వానికి ధైర్యము పవిత్రత రెండూ ఉండవు.

భక్తపత్సలం: ఈ విమర్శ అవసరం లేదనుకుంటాను. అయితే క్రైస్తవ జీవితంలో ప్రవేశించేవారు ఈ లోకంలో యాత్రికులుగాను, పరదేసులుగాను ఉండేదానికి బదులు నిజమైన యాత్రాజీవితమంటే తెలియనివారుగా జీవిస్తున్నారు[5].

సత్యం: అవును, అనేకులు క్రీస్తు యొక్క నీతివస్త్రములు ధరించి నిందారహితముగా జీవించడానికి బదులు దేవుని దృష్టిలో మురికి గుడ్డలవంటి[6] తమ స్వనీతిని ధరిస్తున్నారు. వారు తమ సొంత మానవ కల్పితమైన నియమాలను పాటిస్తూనే తమ గొప్ప అజ్ఞానంతో లోకం ఎదుట తమ గొప్పతనాన్ని చాటుకునేందుకు రుజువుగా వారి స్వనీతిని బాహాటంగా ప్రదర్శిస్తున్నారు.

అర్ధరాత్రి వరకు వారు అలా మాట్లాడుకుంటూనే ఉన్నారు. ఆ తరువాత విశ్రమించటానికి ఎవరి గదుల్లోకి వాళ్లు వెళ్లారు. మరునాడు భక్తవత్సలం గారి ఇంట్లో విందు సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఆ విధంగా మాయ అనే పట్టణంలోని అనేక మంది క్రైస్తవులకు యాత్రికులు పరిచయం అయ్యారు. నాసోను ఇంటిని కేంద్రంగా చేసుకొని ఆ పట్టణంలో అనేక మాసాలు ఉన్నారు.

5. హెబ్రీయులకు 11:13 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8
6. యెషయా 64:6

రెండు పెళ్లిళ్లు

వారు నాసోను ఇంటిలో బసచేస్తున్న సమయంలో సామ్యూల్, జోసఫ్‌లకు సరియైన సహచరులు లభించారు. కృప, మార్త అనే నాసోను కుమార్తెలతో వారికి నిశ్చితార్థం అయ్యింది. సామ్యూల్‌కి కృపతోను, జోసఫ్‌కి మార్తతోను వివాహం నిశ్చయమైంది. వారు ఆ పట్టణాన్ని విడువక మునుపు ఈ యువతి యువకులకు నాసోను ఇంటిలో వివాహం అయ్యింది. ఆ వివాహానికి పట్టణంలో ఉన్న యాత్రికుల స్నేహితులందరు హాజరయ్యారు. క్రిస్టియానా తన ఆనందాన్ని దుఃఖాన్ని ఆపుకోలేకపోయింది. తన కొడుకులందరికి తగిన జీవిత భాగస్వాములు దొరికినందుకు ఆమె సంతోషించింది.

యాత్రికులు తమ మార్గంలో వెళ్లవలసిన సమయం వచ్చినప్పుడు వారి మిత్రులను రమ్మని కబురు చేసారు. ఒకరినొకరు అభినందించుకొని భక్తిపూర్వకమైన మాటలు చెప్పుకొన్న తరువాత మంచి కాపరికి తమను తాము అప్పగించుకున్నారు. ప్రయాణంలో తమకు అవసరమయ్యే కొన్ని వస్తువులను వారి మిత్రులు అందించి వారితో పాటు పట్టణం పొలిమేరల వరకు వెళ్లి వారికి వీడ్కోలు పలికి తిరిగి వచ్చారు.

అధ్యాయం
18

మనోహర పర్వతాల వద్ద క్రిస్టియానా

దారిలో సుఖించుట

ఇప్పుడు యాత్రికులు అందమైన పచ్చనిలోయలో స్ఫటికపు నది వద్దకు చేరుకోవడం నేను చూశాను. ఒకప్పుడు క్రైస్తవుడు, విశ్వాసి అనేక దినాలు ఇక్కడే గడిపారు. నది చాలా తేటగా ప్రవహిస్తోంది, మైదానాలు పచ్చగా ఉన్నాయి. ఆ నది ఒడ్డున ఉన్న చెట్ల ఆకులు మంచి ఔషధ గుణాలు కలిగినవి. ఇక్కడ అలసిన యాత్రికులు సురక్షితంగా నిద్రపోవచ్చు.

ఆ మైదానాలలో చిన్నపిల్లలతో వచ్చిన స్త్రీలకోసం కొన్ని గదులు ఏర్పాటు చేయబడినవి. అక్కడ ఎంతో కనికరము కలిగిన ఒక బలమైన సంరక్షకుడు కూడా ఉన్నాడు.[1]

క్రిస్టియానా అది చూసినప్పుడు తన నలుగురు కోడళ్లను పిలిచి దేవుడు వారికి బిడ్డలను అనుగ్రహించినప్పుడు వారిని ఈ సంరక్షకుడి భద్రతకు అప్పగించుమని హెచ్చరిక చేసింది. "వారిలో ఎవరైనా దారితప్పినా కనిపించకుండా పోయినా ఈయన వారిని క్షేమంగా తీసుకురాగలడు. తన సంరక్షణకు అప్పగించబడిన వారు నశించడానికి ముందు ఈయన వారికోసం ప్రాణం అర్పిస్తాడు."

ఈ చక్కని వాతావరణంలో బలహీనం, కుంటయ్యలకు కావలసిన బలం పుంజుకున్నారు. పెద్దవారైన నిజాయితీకి ప్రాణం తెప్పరిల్లినట్లయింది. నిజానికి వాళ్లందరు శారీరకంగానే కాక మానసికంగాను ఆత్మీయంగాను మెరుగుపడ్డారు.

అయితే ఆ పచ్చనిలోయలోనే వారు నిలువలేక పోయారు గనుక మనోహర పర్వతాల వైపు ప్రయాణం కొనసాగించారు.

నిరాశా రాక్షసుడితో పోరాటం

దారిలో వారు నిరాశా రాక్షసుడి ప్రాంగణం ఉన్న మైదానంలోకి నడిపించే దిగుడు మెట్ల వద్దకు చేరుకున్నారు. ఇప్పుడు ఏంచేయాలో ఆలోచిస్తూ అక్కడ కూర్చుండిపోయారు. ముందుకు వెళ్లి సందేహాల మేడను కూల్చివేసి నిరాశా రాక్షసుడ్ని చంపేద్దామని కొందరు సలహా ఇచ్చారు. తక్కిన వాళ్లు "లేదు మనము రాజమార్గాన్ని విడిచి మరొకరి స్థలంలోకి వెళ్లే హక్కు మనకు లేదు.

1. యెషయా 40:11 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

సందేహాల మేడలో కొందరు యాత్రికులు ఇప్పుడు బాధపడుతున్నప్పటికీ దాని గురించి మనం చేయగలిగింది ఏమీ లేదు" అన్నారు. మరొకడు "మనం ఈ మెట్లను విరగ్గొట్టి, దారిమళ్లించే మైదానం, నిరాశా రాక్షసుడి గురించి ఇక్కడొక హెచ్చరిక సూచన ఏర్పాటు చేద్దాం" అన్నాడు.

గొప్పమనస్సు: ఈ ఆస్థి అంతా రాజుగారికి చెందినదే ఈ మేడ, మైదానం ఒకప్పుడు రాజుగారి సేవకుడికి చెందినవి. అతడు రాజమార్గపు జీవితంలో ఉన్న యాత్రికులకు, పరదేసులకు ఇక్కడ ఆతిధ్యం ఇస్తుండేవాడు. నిరాశా రాక్షసుడు అప్పట్లో అడవిలో ఒక గుహలో నివాసం ఉండేవాడు. మేడలో ఉన్న మంచి మనిషిని అతడు భయపెట్టి అక్కడ నుంచి పారిపోయేలా చేసాడు. అప్పుడు రాక్షసుడు వచ్చి అతని ఆస్థిని స్వాధీనం చేసుకున్నాడు. అప్పటి నుంచి అనేక సంవత్సరాలుగా వాడు ఎంతో మంది యాత్రికులను బంధించి చంపుతూ వచ్చాడు. ఇప్పుడు మనకి విశ్వాసము, ధైర్యము గనుక ఉంటే వాడి విషయంలో మనము ఏదైనా చేయగలం. పాపాన్ని జయించి మంచి విశ్వాస పోరాటం పోరాడి కీడును జయించమని నాకు ఆదేశాలు ఉన్నాయి. ఒకవేళ ఈ నిరాశా రాక్షసుడితో కాక ఆ మంచిపోరాటం నేను ఎవరితో పోరాడాలి? వీడి నాశనకరమైన వ్యాపారాన్ని మనం అంతం చేయాలి. నాతో ఎవరు వస్తారు?

"నేను వస్తాను" అన్నాడు నిజాయితీ అనే పెద్దాయన. "మేం కూడా వస్తాం" అంటూ క్రిస్టియానా నలుగురు కొడుకుల తరుపున మాథ్యూ చెప్పాడు. వీళ్లంతా బలమైన యువకులు.

అంచేత వాళ్లు బలహీనం, కుంటయ్యలను, ఆడవాళ్లకు తోడుగా ఉంచి సందేహాల మేడకు దారితీసే దిగుడు మెట్ల దగ్గరకి వెళ్లారు. గొప్పమనస్సు ఒక రాయితీసుకొని ద్వారం మీద కొట్టాడు.

వృద్ధ రాక్షసుడు తన భార్యయైన దుఃఖంతో కలిసి తలుపు దగ్గరకు వచ్చాడు. "ఎవరక్కడ?" అంటూ గర్జించాడు. "నిరాశా రాక్షసుడికి ఈవిధంగా నిద్రాభంగం కలిగించే ధైర్యం చేసింది ఎవడు? మీకు ఏంకావాలి?"

గొప్పమనస్సు ఇలా బదులిచ్చాడు. "నేను, మహారాజు సేవకుడనైన గొప్పమనస్సును. రాజుగారి యాత్రికులను పరమపురికి తీసుకేళ్లే వారిలో నేనొకడిని నాతో పాటు నమ్మకస్తులైన శిలువ సైనికులు ఉన్నారు. మాకు నువ్వు కావాలి తలుపు తెరువు, నీవు లెక్క అప్పగించాలి."

నిరాశా రాక్షసుడు ఎవరికీ దేనికీ భయపడలేదు. తనలో తాను ఇలా అనుకున్నాడు: "నేను దేవదూతలను జయించాను, మనుష్యులలో గొప్పవాళ్లపై విజయం సాధించాను. అలాంటప్పుడు ఈ గొప్పమనస్సు అనేవాడు కొద్దిమంది బలహీనుల్ని వెంటతెచ్చుకొని నన్ను ఈ విధంగా ధిక్కరిస్తాడా? వాళ్లు ఎంత పెద్ద తప్పుచేసారో వాళ్లకు చూపిస్తాను." కాబట్టి వాడు తన ఇనుప శిరస్త్రాణం, చెప్పులు ధరించి ఇత్తడి దట్టి వేసుకొని చేతిలో ఓ పెద్ద దుడ్డుకర్రతో బయటికి వచ్చాడు. ఇప్పుడు ఈ దేశదిమ్మరులకు ఏంకావాలో చెప్పండి అంటూ గర్జించాడు.

"నీ తల" అంటూ గొప్పమనస్సు తన ఖడ్గాన్ని అతని వైపు విసిరాడు. రాక్షసుడు తన చేతిలోని దుడ్డుకర్రతో దానిని విసిరి కొట్టాడు. అయితే అతనితో ఉన్నవారిలో ఒకడు వెంటనే ఆ కత్తిని తీసుకొని గొప్పమనస్సుకు అందించాడు. రాక్షసుడి భార్యయైన దుఃఖం ఓ ఇనుప గొట్టం తీసుకొని వేగంగా వచ్చి గొప్పమనస్సుని కొట్టింది. అయితే నిజాయితీ ఆమెను పట్టుకొని ఒక్కదెబ్బతో నేలకూల్చాడు. అప్పటికే కుర్రవాళ్లంతా రాక్షసుడి మీద నలువైపుల నుంచి రాళ్లు విసురుతున్నారు. వాడు తన చేతిలో ఉన్న దుడ్డుకర్రను వేగంగా విసురుతూ చాలా సేపు పోరాడాడు. కొంతసేపటి తరువాత అతన్ని పడగొట్టి గొప్పమనస్సు తన ఖడ్గాన్ని ఉపయోగించి రాక్షసుడి తలను ఛేదించాడు.

అధైర్యం, భయస్తులకు స్వేచ్ఛ

ఆ తరువాత వారు మేడలో ప్రవేశించి లోపల ఎవరైనా ఉన్నారేమో చూసారు. అక్కడ వారికి కళేబరాలు, మానవ ఎముకల మధ్య దాదాపుగా ఆకలితో శుష్కించి ఉన్న అధైర్యం అతని కుమార్తె భయస్తురాలు నిలబడి ఉన్నారు. ఆ వెనుక పెరట్లో ఎక్కడ చూసినా పూర్వపు యాత్రికుల ఆస్థిపంజరాలు, సమాధులతో నిండిఉంది.

మార్గంలో తమ కోసం ఎదురుచూస్తున్న వారి మిత్రులకు నిరాశా రాక్షసుడు చనిపోయాడని నిశ్చయిత కలిగించడం కోసం వారు రాక్షసుడి పుర్రెను పట్టుకొచ్చారు. ఈ విజయాన్ని వేడుకగా చేసుకుంటూ అందరూ సంగీతంతో నాట్యమాడుతుండగా, పచ్చని లోయనుండి స్త్రీలు తీసుకొచ్చిన ద్రాక్షారసం మరియు ఆహారం భుజిస్తూ అధైర్యం, భయస్తురాలు సేదదీరారు.

మనోహర పర్వతాలకు స్వాగతం

ఈ విజయాన్ని బట్టి ఆనందించిన తరువాత వారందరు కలసి మనోహర పర్వతాలవైపుకు వెళ్లారు. గొప్పమనస్సు వెనుక చాలా మంది వెంబడించటం చూసిన కాపరులు "ఇంతమంది యాత్రికులను ఎక్కడనుంచి తెస్తున్నావు గొప్పమనస్సు?" అని అడిగారు. (కాపరులకు అతడు బాగా పరిచయస్తుడే)

గొప్పమనస్సు: వారిలో కొందరు మా ఇంటి దగ్గరకు రాగా ఇతరులు దారిలో కలిసారు.

కాపరి: వారందరిని స్వాగతిస్తున్నాం. మా దగ్గర బలవంతులకు, బలహీనులకు తగినంత వసతి ఉన్నది. మా రాజు తన అనుచరులలో అల్పులైనవారికి[2] చేసే సేవగురించే ఎక్కువగా పట్టించుకుంటాడు కాబట్టి మా ఆతిథ్యం స్వీకరించడానికి అవిటితనం అడ్డుకాదు.

కాబట్టి కాపరులు వారిని రాజభవనం ద్వారం వద్దకు తీసుకెళ్లి "మీ అందరు లోపలికి రండి. ముందుగా బలహీనులను, అవిటివారిని రానివ్వండి అన్నారు."

వారందరు ఒక పొడవైన భోజనపు బల్లదగ్గర కూర్చునప్పుడు ఇంటి యజమానురాలు ఇలా అన్నది: "ఎవరికైతే శారీరక పరిస్థితిని బట్టి నిర్దిష్టమైన ఆహారం కావాలో అలాంటివారికి మేము

2. మత్తయి 25:40 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

ప్రత్యేకమైన వంటకాలు చేస్తాము. మీకు ఏం కావాలో చెప్పండి వీలైనంతవరకు మేము వాటిని మీకు అందచేస్తాము." కాబట్టి వారికి తేలికగా జీర్ణమయ్యే ఆహారంతో విందుచేసారు.

భోజనాలు అయిన తరువాత ఎవరికి కేటాయించబడిన విశ్రాంతి గదుల్లోనికి వారు వెళ్లి నిద్రపోయారు. అధైర్యం ఒక మంచి కలగన్నాడు. ఆ కలలో ఎంతో విశ్వాసము దేవుని మంచితనము కలిగిన ఒక దీనుడు తనకు ఎదురుగా ఉన్న పర్వతాలను తొలగిపొమ్మని ఆదేశించగా ఆ పర్వతాలు అతని ఎదుట గడ్డిపోచవలే వణికిపోవడం అతడు గమనించాడు. మరునాడు గొప్పమనస్సు ఈ కల భావాన్ని అతనికి వివరించాడు. ఇవి కష్టాల పర్వతాలని, తగినంత విశ్వాసంతో దేవుని చిత్తంలో స్థిరంగా నిలచినప్పుడు అవి అతని ఎదుటనుండి అదృశ్యమవుతాయని చెప్పాడు.

వినోద స్థలాలను దర్శించుట

మరునాడు ఆసక్తి కరమైన ప్రదేశాలను చూపించటానికి కాపరులు వారిని తీసుకెళ్లారు. ముందుగా వారు అమాయక పర్వతానికి వెళ్లారు. అక్కడ వారు మురికి బట్టలు ధరించిన ఇద్దరు వ్యక్తులు తెల్లని వస్త్రాలు ధరించిన ఒక పెద్ద మనిషి మీద బురద చల్లటం చూశారు. వారిద్దరి పేర్లు అసూయ, ద్వేషం. వారు తమతోటి వారిని పరిశుభ్రతను అసహ్యించుకొని వారిమీదికి నిత్యం బురద చల్లుతూ ఉంటారు. అయితే అది పూర్తిగా పక్కకు పడిపోవడంతో ఆ మనిషి పరిపూర్ణమైన తెల్లని వస్త్రాలతోనే కనిపించాడు.

"అతని పేరు దైవభక్తి. అతని మీద చేయబడిన నిందలన్నిటి విషయంలో అతడు నిర్దోషి. అతన్ని నిందించేవారంతా తమ మాదిరికరమైన జీవితం వెలుగులో వారు చెడుగా కనిపిస్తున్నారు కాబట్టి అతన్ని ద్వేషిస్తుంటారు. అయినా అతడు బదులు పలుకడు లేదా తనపైకి విసరబడే మురికిని పక్కకు తోసివేయడానికి ప్రయత్నించడు. వాటంతట అవే కిందపడుతుంటాయి. మంచివాళ్లకు నానాటికీ మిత్రులు తోడవుతుండగా బురద చల్లేవారు మాత్రం అందరి దృష్టికి నీచంగా కనిపిస్తుంటారు" అంటూ వివరించాడు జ్ఞాని అనే కాపరి.

ఆ తరువాత వారు ప్రేమ పర్వతానికి వెళ్లి ఒక పెద్ద తానులోనుంచి బట్టలు కత్తిరిస్తున్న దర్జీని చూసారు. తన ప్రక్కన నిలబడిన పేదవారికి అతడు బట్టలు తయారు చేస్తున్నాడు.

"దీని భావం ఏంటి?" అడిగింది కరుణ.

"పేదలకు దానం చేసేవాడు ప్రభువుకు అప్పిచ్చువాడని, అతనికి ఏకొదువ ఉండదని దీని భావం. ఆ తానులో నుంచి అతడు ఎంత కత్తిరిస్తున్నా బట్ట తరిగిపోకుండటం మీరు చూశారు కదా! తన ఇంటిలో కొద్ది ఆహారం కలిగి ఉన్న ఒక విధవరాలు ముందుగా ప్రవక్తకు ఒక రొట్టెను తయారు చేసి ఇచ్చిన తరువాత తనకు కావలసినంత ఆహారం దొరికింది. ఆమె, తన కుమారుడు, ప్రవక్త తిన్న తరువాత కూడా అనేక దినాల వరకు ఆ ఆహారం తరిగి పోలేదు[3]" అని చెప్పాడు కాపరి.

3. 1రాజులు 17:12-16

మరొకచోట బాగా అలంకరించుకొని ఉన్న ఇద్దరు తెల్లవారు ఒక ఇతియోపియుని తెల్లగా మార్చడానికి ప్రయత్నిస్తున్నారు. అయితే వారు అతని ఎంత కడిగితే అంత నల్లగా మెరుస్తున్నాడు. దాని అర్థం ఏమిటని వారు కాపరిని అడిగారు.

"వీరు అత్యాసక్తి కలిగిన మతగురువులు. ఒక పాపిని తమ సంఘానికి అనుకూలంగా మార్చుకోడానికి శుద్ధి చేస్తున్నారు. అయితే ఆ ఇతియోపియుడిలాగే ఏ దుర్మార్గుడిని మార్చలేము. అతనికి ఒక మంచి పేరు పెట్టడానికి లేదా అతన్ని శుభ్రపరచడానికి వారు ఎంత ప్రయత్నించినా అతడు మరింత అసహ్యంగా తయారవుతున్నాడు. పరిసయ్యులు, తక్కిన వేషధారులందరు కూడా ఈ కోవకు చెందినవారే. ఇతియోపియుడు తెల్లగా మారాలంటే అతడు తిరిగి జన్మించాలి. ఏదిఏమైనా, అతన్ని శుభ్రం చేస్తున్నవారి కంటే అతడు అంతరంగంలో తెల్లనివాడై ఉండవచ్చు. ఇలాంటి విషయాల్లో మనం ఒక నిర్ణయానికి రాకూడదు. ఎందుకంటే ఒక వ్యక్తి అంతరంగంలోకి మనం చూడలేము. "మనుష్యులు పైరూపమును లక్ష్యపెట్టుదురు, గాని యెహోవా హృదయమును లక్ష్యపెట్టును.""[4]

ఇప్పుడు కరుణ ఆ కొండమీద ఉన్న ఒక రంధ్రాన్ని చూడాలి అనుకొంది. నరకానికి అడ్డదారిగా పిలువబడే ఈ రంధ్రాన్ని క్రైస్తవుడు గతంలో చూశాడు. అప్పుడు వారు కొండప్రక్కన ఉన్న ద్వారం వద్దకు వెళ్లి దాన్ని తెరిచారు వారికి కొన్ని స్వరాలు వినిపించాయి. అందులో ఒకడు ఇలా అంటున్నాడు "జీవమార్గము, శాంతి మార్గము నుండి మమ్మల్ని దూరంగా ఉంచిన మా తండ్రి శాపగ్రస్తుడగును." మరొకడు "నా ప్రాణమును కాపాడుకొనుటకు నేను మ్రుకలుగా చీల్చబడితిని ఇప్పుడు నా ఆత్మను పోగొట్టుకున్నాను" అంటుండగా మరొకడు "నేను మరలా జీవించగలిగితే ఇక్కడికి రాకుండా నన్ను నేను ఎంతగా ఉపేక్షించుకుంటానో!" అంటూ కేకలు వేస్తున్నారు.

అప్పుడు వారు ఉన్న చోటు మూల్గుతూ వణికిపోతున్నదా అనిపించింది. భయంతో ముఖం తెల్లబారిన కరుణ దాని నుంచి తొలగిపోయి "ఈ స్థలమునుండి విడిపించబడిన వారు ధన్యులు" అన్నది.

అంతటితో వారు సంగీతములతోను, తినుబండారములతో వారిని రంజింపచేసిన ప్రదేశానికి తిరిగి వెళ్లారు. తరువాత అందరూ పడుకున్నారు.

వారు కాపరులను, మనోహర పర్వతాలను విడిచి బయలుదేరే సమయానికి బాగా తెల్లవారింది.

సత్యపరాక్రమశాలిని కలుసుకొనుట

త్వరలోనే యాత్రికులు అల్పవిశ్వాసి దోచుకొనబడిన స్థలానికి చేరుకున్నారు. అక్కడ ముఖం అంతా రక్తం కారుతూ చేతిలో కత్తి పట్టుకొని ఒకడు నిలబడి ఉన్నాడు. యాత్రికులతో అతడు ఇలా అన్నాడు "నేను ఒక యాత్రికుడ్ని; నాపేరు సత్యపరాక్రమశాలి. ఇక్కడ ముగ్గురు వ్యక్తులు

4. 1సమూయేలు 16:7 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

కాపుకాచి నన్ను పట్టుకోవడానికి పొడవైన కత్తులు ధరించి బయటికి వచ్చారు. వారిలో ఒకడు 'ఆగు, మేము నిన్నొక ప్రశ్న అడగాలి' అన్నాడు. అప్పుడు నేను ఏమిటది అని ప్రశ్నించగా 'నువ్వు మాతో వస్తావా? లేదా ఎక్కడి నుంచి వచ్చావో అక్కడికి తిరిగి వెళతావా? లేక ఉన్నపళంగా చచ్చిపోతావా?' అన్నాడు.

"అందుకు నేను ఇలా జవాబిచ్చాను: అనేక సంవత్సరాలుగా నేను యేసును వెంబడిస్తున్నాను. ఇప్పుడు నేను వెనక్కి వెళ్లలేను. నేను ఎక్కడ నుంచి వచ్చానో అక్కడ కాదు ప్రభువు నన్ను ఉండమన్నది. పైగా మీరు ఒక విషయం తెలుసుకోవాలి: అనేక సంవత్సరాలుగా క్రీస్తు అనుచరుడైనవాడు దొంగలముఠాతో ఎన్నటికీ కలవలేడు. ఇక ఉన్నపళంగా చావడమనేది ఎలా ఉంటుందో చూద్దాం. మీరు నాకిచ్చిన వాటిలో ఏదో ఒకటి నిర్ణయించుకునే అవకాశం నాకు ఇచ్చారంటే అది మీ నాశనానికే. నాకు కావలసినంత శక్తి ఉంది. నేను నాప్రాణాన్ని యాత్రామార్గాన్ని ప్రేమిస్తాను కనుక వాటిని అంత తేలికగా వదులుకోను. ప్రభువే నన్ను ఈ మార్గంలో ఉంచాడు కనుక కడదాకా ఇందులో ఉండాలన్నది నా ఉద్దేశం."

"అప్పుడు ఆ ముగ్గురు– క్రూరుడు, అనాలోచితుడు, అధికప్రసంగి కత్తులుదూసి నామీదికి వచ్చారు. నా కత్తిదూసి నేనుకూడా వారితో పోరాడాను. మూడు గంటలసేపు మేము హోరాహోరీగా పోరాడాక మీరు చూస్తున్నట్టుగా వారి పరాక్రమానికి గుర్తుగా నన్ను ఇలా గాయపరచారు వారు కూడా గాయపడ్డారు. వెంటనే నా ప్రాణాలు తీయడం సాధ్యం కాదని ఎరిగినవారై పారిపోయారు. బహుశా మీరు రావడం చూసి ఉంటారు ఎందుకంటే నేను మిమ్మల్ని చూడక ముందే పారిపోయారు."

గొప్పమనస్సు: అయితే నీవు ఒక్కడివే ముగ్గురితో ఎంతో కష్టపడి పోరాడావు.

పరాక్రమశాలి: నిజమే కాని ఒక వ్యక్తి వైపు సత్యం ఉందని తెలిసినప్పుడు దేన్నైనా పట్టించుకోవాల్సిన అవసరం ఏముంటుంది? "నాతో యుద్ధము చేయుటకు దండు దిగినను నాహృదయము భయపడదు"[5] అని ఎవరో అన్నారు కదా. ఒక వ్యక్తి ఒక సైన్యంతో పోరాడాడని, సంసోను అనేవాడు గాడిద దవడ ఎముకతో వేయి మందిని వధించాడని[6] మరొక చోట చదివాను.

గొప్పమనస్సు: సహాయం కోసం నువ్వు ఎందుకు అరవలేదు?

పరాక్రమశాలి: నా మొరను వినగలిగిన నా రాజుకే నేను మొరపెట్టాను. తగురీతిగా ఆయన అదృశ్య సహాయాన్ని నాకు అందించాడు.

గొప్పమనస్సు: నీవు నిశ్చయముగా యోగ్యముగా ప్రవర్తించావు. నీవద్ద ఎలాంటి కత్తి ఉన్నది?

పరాక్రమశాలి: అది రెండువైపులా కోయగలిగిన రెండంచులు గల ఖడ్గము[7]. ఒక సైనికుని చేతిలో ఇది ఉండి దానిని ఉపయోగించటం తెలిసి ఉంటే అతడు భయపడాల్సిన పనిలేదు. అది

5. కీర్తనలు 27:3
6. న్యాయాధిపతులు 15:15
7. హెబ్రీయులకు 4:17

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

ఎప్పటికీ దాని పదును కోల్పోదు. అది మాంసమును, ఎముకలను, ప్రాణాత్మలను కోయగలదు.

గొప్పమనస్సు: కానీ నీవు చాలా సేపు పోరాడావు. అయినా అలసిపొలేదంటే ఆశ్చర్యంగా ఉంది.

పరాక్రమశాలి: అలసిపోయాను కాని నేను ప్రభువు మీద వేచిఉన్నాను. ఆయన నాశక్తిని నూతన పరచాడు నాముఖం నుండి రక్తంకారే వరకు నేను పోరాడాను. నాబలము ధైర్యమంతా కూడగట్టుకొని పోరాడాను.

గొప్పమనస్సు: నీవు నిశ్చయముగా చక్కగా ప్రవర్తించావు. నీవు పాపముతో పోరాడుటలో రక్తము కారునంతగా దానిని ఎదిరించావు[8]. నీవు మాతో ఉండి మాలో ఒకడివి కావచ్చు. మేము నీకు నిజమైన సహచరులముగా ఉండగలము.

అప్పుడు వారు అతన్ని తీసుకెళ్లి గాయాలు కడిగి తినడానికి ఇచ్చారు. వారందరు కలిసి వెళ్లారు. గొప్పమనస్సుకు పరాక్రమశాలి బాగా నచ్చాడు గనుక అతని గతం గురించి భవిష్యత్తు పట్ల అతని నిరీక్షణ గురించి అడిగి తెలుసుకున్నాడు. ప్రతి విషయంలో అతడు సత్యవంతుడుగా నిరూపించుకున్నాడు.

8. హెబ్రీయులకు 12:4

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

అధ్యాయం 19
మంత్రభూమిపైన

వర్ణన

ఇంతలో వారు మంత్రభూమికి చేరుకున్నారు. అక్కడ గాలి మత్తు ఎక్కించేదిగా ఉంటుంది. కొన్ని చోట్ల దారినిండా ముండ్లపొదలు పెరిగాయి అక్కడక్కడా మరలుకొలిపే పర్ణశాలలు ఉన్నాయి. అక్కడ కూర్చున్న వ్యక్తి నిద్రలోకి జారుకుంటాడు. కొందరు చెప్పినట్లు అక్కడ ఒకసారి నిద్రపోయినవాడు ఇలోకంలో మరలా తిరిగి లేవడట. ఈ అడవిలో వారు ఒకొక్కరుగా దాటివెళ్లారు. గొప్పమనస్సు దారిచూపిస్తుండగా వెనుక భాగంలో సత్యపరాక్రమశాలి నడిచాడు. గొప్పమనస్సు వెనుక బలహీనం, అతని వెనుక నిరాశావాది నడిచాడు. ప్రతివాడు కత్తిచేత పట్టుకొని ముందుకు నడిచారు.

వారు కొంచెం ముందుకు సాగేలోపు ఒకవిధమైన పొగమంచు, చీకటి వారిని కమ్ముకున్నాయి. అందువలన వారు ఒకరినొకరు చూడలేకపోయారు. కొంతసేపు వారి స్వరాలను బట్టి ఒకరితో ఒకరు సంబంధం కలిగి ఉన్నారు కాని బలహీనులైన స్త్రీ, పురుషులకు అది చాలా కష్టంగా ఉంది. అయినప్పటికీ తమ మార్గదర్శి పలికిన ప్రోత్సాహకరమైన మాటలు వారిని అతికష్టం మీద ముందుకు సాగేలా చేశాయి.

అక్కడ నేలకూడా ఎంతో మృదువుగా ఉండటంతో నడవడం చాలా ఆయాసకరంగా మారింది. ఆ ప్రాంతం అంతటిలోకూడా తినడానికి అనువైన స్థలం ఒక్కటికూడా లేదు. కొన్ని గంటలపాటు చీకటిలో ముళ్లపొదలలో తచ్చాడుతూ వెళుతుండగా పళ్లుకొరుకుట నిట్టూర్పులు విడచుట మొదలైన శబ్దాలు వినిపించసాగాయి. ఒకడు పొదల్లో జారిపడగా మరొకడు బురదలో కూరుకుపోయాడు మరికొందరు తమ పాదరక్షలు పోగొట్టుకున్నారు. ఒకడు నేను పడిపోయాను అని కేకలు పెట్టగా మరొకడు "ఎక్కడున్నావ్?" అని అరిచాడు. మరొక పేలవమైన స్వరం "నేను పొదల్లో చిక్కుకుపోయాను బయటికి రాలేకపోతున్నాను" అంటూ వినిపించింది.

అంతలో వారొక అందమైన పచ్చని పర్ణశాలకు చేరుకున్నారు. దానిలో కూర్చోడానికి పడుకోడానికి ఏర్పాట్లు చేయబడి ఉన్నాయి. బల్లలూ మెత్తటి పరుపుకూడా ఉంది. అక్కడ ఆగి విశ్రమించడానికి అది ఆహ్వానిస్తున్నప్పటికీ అందరూ వేగంగా నడుస్తూ అలసిపోయి ఉన్నప్పటికీ

వారిలో ఎవరూ అక్కడ కొద్దిసేపు ఆగి విశ్రాంతి తీసుకుందామని అడగలేదు. ఇటువంటి స్థలాల గురించి వారు ముందుగానే హెచ్చరిక పొందారు కాబట్టి ఈ ఆహ్లాదకరమైన పర్ణశాల పరలోకంవైపు ప్రయాణిస్తున్న యాత్రికులపైన ఎటువంటి ప్రభావం చూపలేకపోయింది. వారు శోధనలకు లొంగేవారు కాదు.

నా కలలో నేను చూస్తుండగా వారు ఈ ప్రమాదకరమైన ప్రాంతంలో ప్రయాణిస్తూ వేరు వేరు దారులున్న ఒక చోటికి చేరుకున్నారు. ప్రధాన రహదారి నుండి అటుఇటు దారితీసే అడ్డదారులతో ముఖ్యంగా చీకటి పొగమంచు నిండిఉండటంతో పరిస్థితి మరింత కష్టంగా మారింది. ఈ దేశంలో ఎవరైనా దారితప్పారంటే వారు అడవిలో చిక్కుబడి ఎప్పటికీ తమ మార్గాన్ని కనుగొనలేరు.

అయితే గొప్పమనస్సు తన జేబులో ఎల్లప్పుడు ఒక పటాన్ని తీసుకెళ్లేవాడు. అందులో పరమపురికి వెళ్లేదారితో పాటు ప్రక్కకు తీసుకెళ్లే దారులు కూడా ఉంటాయి. అంతే కాకుండా కఠిక చీకటిలో కూడా ఆ పటాన్ని చూడగలిగే వెలుగు అతనికి లభ్యమవుతుంది. అయినప్పటికీ అతడు జాగ్రత్తగా ఉండకపోతే తప్పు మార్గంలో వెళ్లి లోతైన బురదలో కూరుకుపోయేవారు. వారికి ముందుగా ఆ స్పష్టమైన నున్నని మార్గానికి చివర ఒక గుంట ఉంది దాని నిండా మెత్తటి మట్టి ఉండి దాని లోతు ఎంతో ఎవరికీ తెలియదు.

నిద్రపోతున్న ఇద్దరిని చూచుట

వారు దారిప్రక్కన ఉన్న మరొక పర్ణశాల వద్దకు చేరుకున్నారు. అక్కడ నిర్లక్ష్యము, ఆత్మస్థైర్యము అనే ఇద్దరు గాఢనిద్రలో ఉన్నారు. వీళ్లిద్దరూ ప్రయాణబడలిక చేత ఈ సౌకర్యవంతమైన పర్ణశాలలో కూర్చొని ఒక క్షణం విశ్రాంతి తీసుకుందామనుకొని నిద్రపోయారు. యాత్రికులు అక్కడ ఆగి ఏంచేద్దాము అని ఆలోచించుకున్నారు, వాళ్లని నిద్రలేపేందుకు ప్రయత్నించడమా లేక వారి మానాన వారిని వదిలి వెళ్లిపోవడమా. తమ మట్టుకు తాము అక్కడ ఒక్క క్షణం కూడా ఆ పర్ణశాలలోని తాత్కాలిక సుఖాలకోసం నిలబడకూడదని నిర్ణయించుకొని నిద్రపోతున్న వారిని లేపడానికి ప్రయత్నించారు.

వారు వెళ్లి ఆ మనుషులతో మాట్లాడారు కాని ఎలాంటి ప్రతిస్పందన లేదు. అప్పుడు మార్గదర్శి వారిని గట్టిగా కదిలించి మేల్కొనమని బిగ్గరగా పిలిచాడు. వారిలో ఒకడు "నాకు డబ్బు అందగానే నీ బాకీ తీరుస్తాను." అంటూ అరిచాడు. రెండవవాడు 'నాచేతిలో కత్తి ఉన్నంత వరకు నేనుపోరాడతాను'. అంటూ కలవరించాడు. అది చూసిన యువకులు నవ్వుకున్నారు.

"దాని అర్థం ఏమిటి?" అని క్రిస్టియానా అడిగింది.

గొప్పమనస్సు: వాళ్లు నిద్రలో మాట్లాడుకుంటున్నారు. వాళ్లని పిలిచినా, తట్టినా కొట్టినా వాళ్లకి ఏంచేసినా వాళ్లు ఈ విధంగానే జవాబిస్తారు. సామెతలు గ్రంథంలో త్రాగుబోతు తడబడుతూ

మాట్లాడినట్లు "నన్ను కొట్టినను నాకు నొప్పి కలుగలేదు. నా మీద దెబ్బలుపడినను నాకు తెలియలేదు నేనెప్పుడు నిద్రమేల్కొందును? మరలా దాని వెదకుదును"[1] అని అంటుంటారు. మనుషులు నిద్రలో మాట్లాడుతున్నప్పుడు వారి మాటలకు పొంతన ఉండదని మీకు తెలుసు వాళ్లు ఏదైనా మాట్లాడతారు. వాళ్ల మాటలు విశ్వాసము చేతగాని హేతువు చేతగాని నడపించబడవు. యాకోబు చెప్పినట్లు వీళ్లిద్దరూ 'ద్విమనస్కులై' ఉంటారు[2] లేదంటే వారు ఇక్కడ కూర్చోవాలని ఎప్పటికీ అనుకుని ఉండేవారు కాదు. ఆలోచనలేని వాళ్లు తీర్థయాత్రలకు బయలుదేరినప్పుడు సహజంగా ఇలాగే చేస్తుంటారు. ఈ మంత్రభూమి యాత్రికుల శత్రువుకు చెందిన చివరి ప్రదేశాలలో ఒకటి. మీరు చుస్తున్నట్టుగా ఇది దాదాపు మనమార్గంలో చివరిలో ఉంది. పైగా ఇది శత్రువుకు బాగా అనుకూలంగా ఉండే ప్రదేశం. ఎందుకంటే యాత్రికులు సహజంగా వారి ప్రయాణం చివరికి వచ్చేసరికి బాగా అలసిపోయి ఉంటారు. కాబట్టి ఈ మంత్రభూమి బ్యూలా దేశానికి సమీపంలో, పరుగు ముగించబోయే చోటుకు దగ్గరలో ఏర్పాటు చేయబడి ఉంది. అందుచేత యాత్రికులమైన మనం జాగ్రత్తగా ఉండాలి. లేదంటే మీరు చూస్తున్నట్టుగా ఎవరూ లేపలేని విధంగా వీళ్లు ఎలా నిద్రపోయారో అలాగే మనకు సంభవించవచ్చు.

అప్పుడు యాత్రికులు తమ దారిలో వెలుగు కావాలని కోరుకున్నారు. కనుక గొప్పమనస్సు తన లాంతరు వెలిగించగా ఆ మంత్రభూమిలో చీకటి ఎంతగా అలుముకున్నా ఆ వెలుగులో వారు నడుచుకుంటూ వెళ్లిపోయారు.

యాత్రికులు విపరీతంగా అలసిపోయారు. అప్పుడువారు తమ ప్రయాణాన్ని మరింత సుఖమయం చేయగల వానికి మొరపెట్టుకున్నారు. అంతలో పొగమంచును పారద్రోలిన ఒక గాలి వీచింది. ఇప్పుడు వారు ఒకరినొకరు బాగా చూసుకోగలిగి మరింత సులభంగా దారిలో నడవగలిగారు.

నిలకడ అనే వానిని కలుసుకొనుట

వారు దాదాపుగా మంత్రభూమిని దాటే సమయంలో ఒక గంభీరమైన స్వరం చాలా దూరం నుంచి వినబడింది. అతడు చాలా బాధలో ఉన్నట్టుగా గ్రహించారు. మరికొంత దూరం వెళ్లాక ఒక వ్యక్తి మోకాళ్లపై ఉండి తన చేతులు ఆకాశంవైపు ఎత్తి పైనున్న వానిని ఎంతగానో ప్రతిమాలుతూ ఉండటం చూశారు. వారు అతని దగ్గరకు వెళ్లారు కాని అతడు ఏం మాట్లాడుతున్నాడో అర్థం చేసుకోలేక పోయారు. అతనికి భంగం కలిగించకుండ నెమ్మదిగా నడుచుకుంటూ వెళ్లారు. అతడు ప్రార్థించటం ముగించాక పైకి లేచి పరమపురం వైపు పరుగుతీయసాగాడు.

గొప్పమనస్సు అతన్ని పిలిచి, "మిత్రమా, ఆగు నీవుకూడా ఆ గొప్ప పట్టణానికి వెళుతుంటే మేం కూడా నీకు తోడుగా వస్తాం" అన్నాడు. అతడు ఆగినందున వారతన్ని చేరుకున్నారు. నిజాయితీ అతన్ని చూచిన వెంటనే "ఇతను నాకు తెలుసు, వీళ్లదికూడా మాదేశమే" అన్నాడు.

1. సామెతలు 23:29-35 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8
2. యాకోబు 1:8

"అయితే ఇతనెవరో చెప్పండి?" అన్నాడు పరాక్రమశాలి.

"ఇతడు నిజమైన యాత్రికుడు, నాకు పాతమిత్రుడైన నిలకడ"

అప్పుడు నిలకడ ఇలా అన్నాడు "ఫాదర్ నిజాయితీగారా, మీరు ఇక్కడ ఉన్నారా?"

"అవును, నువ్వు ఇక్కడ ఉండటం ఎంత నిశ్చయమో నేను అంతే నిశ్చయంగా ఇక్కడ ఉన్నాను"

"ఈదారిలో నిన్ను కనుగొన్నందుకు నాకు నిజంగా చాలా సంతోషంగా ఉంది" అన్నాడు నిలకడ.

"నిన్ను చూడ్డం నాకు కూడా సంతోషంగా ఉంది మరి ముఖ్యంగా మోకాళ్లమీద నిన్ను చూచి ఎంతో సంతోషించాను"

"ఏమిటీ నన్ను మోకాళ్ల మీద ఉన్నప్పుడు చూసావా?"

"అవును చూసాను. అది నా హృదయానికి ఎంతో ఆనందం కలిగించింది."

"అయితే నన్ను అలా చూసినప్పుడు నీకు ఏమనిపించింది?" అడిగాడు నిలకడ.

"ఏమని ఆలోచించమంటావు? ఇక్కడ మహిమ మార్గంలో వెళుతున్న నిజమైన యధార్థవంతుడైన క్రైస్తవుడున్నాడు కనుక ఇతని సహచర్యం మాక్కూడా కావాలి అనిపించింది."

"నీవు నిజంగా అలా ఆలోచించి ఉంటే నేను ఎంత ధన్యుడను" అన్నాడు నిలకడ. "అయితే ఒకవేళ నేను అలా లేకుండ వేషధారిగా ఉంటే దానికి నేనే జవాబు చెప్పాలి."

"అది నిజమే, నీ గురించి నీవు భయపడుతున్న తీరును చూస్తుంటే నీ అంతరంగంలో నీవు నమ్మకమైన వాడివే అన్న నా విశ్వాసం బలపడుతుంది. మరియు యాత్రికుల యువరాజు నీ ఆత్మను చూచి సంతోషిస్తున్నాడు. ఎందుకంటే 'నిత్యము భయము కలిగి ప్రవర్తించువాడు ధన్యుడు'[3] అని నిజాయితీ చెప్పాడు.

పరాక్రమశాలి: అయితే సోదరా నిన్ను మోకరింపచేసినదేమిటో మాకు చెప్పవా? నీవు ప్రార్థిస్తున్నది విడుదల కోసమా లేక ఓ ప్రత్యేకమైన ఆశీర్వాదం కోసమా?

నిలకడ: నాకు జరిగినదేమిటో చెప్పనివ్వండి. మీకు తెలుసు కదా ఇది మంత్రభూమి. నేను ఈ దారిన వస్తుండగా ఇది ఎంత ప్రమాదకరమైన ప్రదేశమో, ఇక్కడిదాకా వచ్చిన యాత్రికులు అనేకమంది ఇక్కడ ఆపివేయబడి చివరికి నాశనం చేయబడ్డారు కదా అని ఆలోచించుకుంటూ వచ్చాను. ఇక్కడ మనుషులు ఎలా మరణిస్తారో కూడా ఆలోచించాను. ఇక్కడ వారు గాయాలతోనో లేక తీవ్రమైన వ్యాధితోనే చనిపోరు; ఇక్కడ వారికి సంభవించే మరణం బాధాకరమైంది కాదు. నిద్రలోనే వారు వెళ్లిపోతారు. ఆ చివరి ఒంటరి ప్రయాణం సుఖవ్యామోహాలతో ఆరంభిస్తారు.

3. సామెతలు 28:14 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

"పర్ణశాలలో నిద్రపోతున్న ఆ ఇద్దరినీ నీవు చూసావా?" మధ్యలో కలుగజేసుకొని అడిగాడు నిజాయితీ.

నిలకడ విడుదల

నిలకడ: అవును అది చాలా దారుణం. వారికి చాలా ధైర్యం ఉంది లేదా మితిమీరిన ఆత్మ స్థయిర్యం ఉండి ఉంటుంది. వాళ్లని లేపటానికి నేను ప్రయత్నించలేదు ఎందుకంటే దానివల్ల ప్రయోజనం ఉండదని నాకు తెలుసు. వారి నిద్ర ఆత్మ సంబంధమైనది, అంతిమమైనది. అయితే నా కథ చెప్పనివ్వండి. నేను అలా నడుచుకుంటూ వస్తూ ఈ మర్మయుక్తమైన నిద్రగురించి ఆలోచిస్తూ మనుషులు దానికి ఎంత తేలికగా లోబడిపోతారో ఆలోచిస్తూ ఉండగా, ఓ అందమైన దుస్తులు ధరించిన ఆకర్షణీయమైన వ్యక్తి నా వద్దకు వచ్చి నాకు మూడు ఇస్తానని వాగ్ధానం చేసింది: ఆమె దేహం, డబ్బుసంచి, మరియు ఆమెపడక. ఇప్పుడు నేను బాగా అలసిపోయి నిద్రముఖంతో ఉండటమే గాక కఠిక పేదవాడిని అన్నది సత్యం. అయితే నేను ఆమెను అసహ్యించుకున్నాను. ఆమె చిరునవ్వు చిందించి నా తిరస్కారాన్ని ఏమాత్రం పట్టించుకోలేదు. ఇక నేను కోపపడడం ఆరంభించాను. అయితే ఆమెకు అవేమీ పట్టలేదు. నేను ఆమెకు లొంగినట్టయితే నన్ను ధనవంతుడ్ని చేసి సంతోషపరుస్తానని చెప్పింది. పైగా నేను పేరు ప్రఖ్యాతులుకూడా సంపాదిస్తానని చెప్పింది. "నేను ఈ లోకానికి యజమానురాలిని ఎంతో మంది పురుషులు నా ద్వారా సుఖసంతోషాలు, పేరు ప్రఖ్యాతులు పొందారు" అని చెప్పింది. నీ పేరేమిటి అని నేను ఆమెను అడుగగా, నాపేరు శ్రీమతి బూటకం అని చెప్పింది. ఆ మాట వినడంతో ఆమెను వదిలేయాలి అనిపించింది. అయినప్పటికీ ఎన్నో మాయమాటలతో నన్ను ఆకర్షిస్తూ నావెంట పడింది. అప్పుడు నేను మోకరించి సర్వలోకానికి న్యాయాధిపతియైన వానికి మొరపెట్టి ఆమెను, ఆమె భక్తిహీనమైన ఆకర్షణలను నాకు దూరం చేయమని వేడుకొన్నాను. అంతటితో ఆస్త్రీ వెళ్లిపోయింది. బహుశా మీరు రావడం ఆమె విని ఉంటుంది. మీరు వింటుండగా దేవుడు నాకనుగ్రహించిన గొప్ప విడుదలను బట్టి ఆయనకు వందనాలు చెల్లిస్తున్నాను.

నిజాయితీ: నిస్సందేహంగా ఆవిడ పన్నాగాలు దుష్టమైనవే. ఆమె నీ యాత్రను లేదా నీ జీవితాన్ని నాశనం చేయాలనుకుంది. అయితే, నీవు ఆమె లక్షణాల గురించి చెబుతుంటే నేను కూడా ఆమెను చూసానేమో అనిపిస్తుంది. లేదా ఆమె గురించి చదివి ఉంటాను. శ్రీమతి బూటకం! చాలా పొడవుగా ఆకర్షణీయంగా ఒకింత నల్లటి రంగులో ఉంటుంది ఆమేనా?

నిలకడ: అవును. అయితే ఆమె వస్తున్నప్పుడు చీకటిగా ఉంది, కానీ ఆమె అలాగే కనిపించింది.

నిజాయితీ: ఆమె స్వరం మత్తెక్కించేదిగాను, ప్రతి వాక్యం చివర్లో విజయగర్వంతో నవ్వుతుంది కదూ?

నిలకడ: అవును సరిగ్గా చెప్పావు. ఆమె అచ్చం అలాగే ఉంటుంది.

నిజాయితీ: ఆమె నడుముకు ఒక పెద్ద డబ్బు సంచి ఉంటుంది, ఆమె వేళ్లు ఎప్పుడూ ఆ డబ్బును లెక్కిస్తూ ఉంటాయి కదా?

నిలకడ: నిజమే. ఇప్పుడామె నీ ఎదుట నిలుచున్నా, అంతకంటే చక్కగా వర్ణించి ఉండేవాడివి కాదేమో.

నిజాయితీ: ఆమె చిత్రాన్ని గీసినవాడు మంచి చిత్రకారుడే.

గొప్పమనస్సు: ఈ స్త్రీ సాతానుడి సేవకురాలు. ఆవిడ చేసే చేతబడి కారణంగానే ఈ ప్రాంతం మంత్రభూమిగా మారింది. ఆమె ఒడిలోగానీ, భుజంమీదగాని తలవాల్చినవాడు వధ్యశిలమీద శిరస్సు పెట్టి భయంకరమైన గొడ్డలివేటు కోసం ఎదురుచూసేవానితో సమానం; మరియు ఆవిడ సౌందర్యాన్ని గాని, ఆమె మార్గాలను గాని మెచ్చుకునేవాడు దేవునికి శత్రువుగా లెక్కించబడతాడు. యాత్రికుల శత్రువులను పోషిస్తూ, వారిని బలపరచేది ఆవిడే.

అవును, అనేకులను యాత్రాజీవితం నుండి వైదొలగిపోయేలా డబ్బుతో కొన్నది ఆమే. ఆవిడ విపరీతమైన టక్కరి, వశీకరణ విద్యతో లోబరుచుకోగలిగిన వ్యక్తి. తాను, తన కుమార్తెలు ఎల్లప్పుడూ బాగా పలుకుబడి ఉన్న యాత్రికుల వెంటపడుతుంటారు. ఈ లోకపు ఆకర్షణలను అభినందిస్తూనో, ఆశిస్తూనో ఉంటారు. ఆవిడ ధైర్యవంతురాలైన సిగ్గుమాలిన కఠినాత్మురాలు. ధనవంతులను అభినందిస్తూ పేదవారిని చూచి అవమానకరంగా హేళనచేస్తుంది. ఎవడైనా తెలివిగా డబ్బు సంపాదించేవాడైతే అతని గురించి ఇంటింటా తిరిగి మంచి మాటలు చెప్తుంది. విందులు, వినోదాలంటే ఆవిడకు మక్కువ. ఆవిడ ఓ దేవత అయినట్లు, అనేక స్థలాల్లో ఎంతోమంది తనను పూజిస్తున్నట్లు ప్రచారం చేసుకుంది. విచ్చలవిడిగా జూదమాడే ప్రదేశాలు ఆమెకు చాలానే ఉన్నాయి. తన లాభాలు, సంపాదనలో తనతో సాటిరాగలవారు ఎవ్వరూ లేరని విర్రవీగుతూ ఉంటుంది. ఆమెను ప్రేమించి సేవించిన వారిని తరతరాలు ధనవంతులను చేస్తానని వాగ్దానం చేస్తుంది. తన దాతృత్వం ద్వారా లాభం వస్తుందనుకుంటే ఆవిడ డబ్బు విషయంలో చాలా ఉదారంగా ఉంటుంది. అందరూ ఆమె వెంట పడాలని, ఆమెగురించి బాగా మాట్లాడాలని, పురుషుల రొమ్మున ఆనుకోవాలని ఆమె ఎంతగానో కోరుకుంటుంది. తన వస్తువులను మెచ్చుకోవడంలో ఆమె ఎప్పుడూ అలసిపోదు. తన సలహా పాటించినవారికి కిరీటాలు, సామ్రాజ్యాలు దక్కుతాయని వాగ్దానం చేస్తుంది. ఆమె అనేకులను తన ఆధీనంలోనికి తెచ్చుకొని, అనేక వేలమందిని నరక పాత్రులను చేసింది.

"ఆహా, ఆమెను ఎదిరించి ఆవిడ అధికారం నుండి విడుదలపొందిన నేను ఎంత ధన్యుడనో! నన్ను ఎక్కడికి నడిపించి ఉండేదో?" అడిగాడు నిలకడ.

గొప్పమనస్సు: ఇంకెక్కడికి? దేవుడికే తెలియాలి. అయితే ఆమె సలహాలు పాటించేవారు "శోధనలోను, ఉరిలోను, అవివేకయుక్తములును హానికరములునైన అనేక దురాశలలోను పడుదురు. అట్టివి మనుష్యులను నష్టములోను నాశనములోను ముంచివేయును."[4] అబ్షాలోమును తన తండ్రికి విరోధముగాను, యెరోబామును తన రాజుకు వ్యతిరేకముగాను మార్చింది ఆవిడే. యూదా తన ప్రభువును అమ్ముకునేలా చేసింది, దేమాను దైవభక్తి గల జీవితాన్ని వదులుకునేలా బలవంతపెట్టింది కూడా ఆమే. ఏకైక రక్షకుని తృణీకరించేలా లక్షలాదిమందిని పురికొల్పడంలో ఆమే విజయం సాధిస్తుంది. రాజుకు, ప్రజలకు మధ్య, తల్లిదండ్రులకూ పిల్లలకు, ఇరుగుపొరుగువారి మధ్య, భార్యాభర్తల మధ్య, ఒక వ్యక్తి తనకు తానుగా, అతని శరీరానికి ఆత్మకు మధ్య విభజన ఏర్పడేలా చేయగలదు. కాబట్టి, నా ప్రియమైన నిలకడా, నీవు ఎంతో మంచిపని చేశావు. నీ పేరుకు తగ్గట్టు జీవించు. కీడుకు వ్యతిరేకంగా నీవు చేయగలిగినదంతా చేసి, స్థిరంగా నిలబడి నీ శత్రువులు పారిపోవడం చూస్తూ ఉండు. విజయం నీదే.

యాత్రికులు పాటలు పాడుకొంటూ వెళ్లిపోవుట

ఇప్పుడు యాత్రికులు సంతోషంగా ఉన్నారు, అయితే అప్రమత్తంగా ఉన్నారు. అయితే చాలాసేపు వారు కలిసి ఈ పాట పాడుకున్నారు:

యాత్రికుని తరచుగా కష్టాలు చుట్టుముడతాయి,
అతడు పడిపోవాలని శత్రువులు కోరుకుంటారు.
బలమైన శోధనలు, పాపాలు వెంటాడుతుంటాయి
నిశ్చయముగా వాటన్నిటిని అతడు జయించలేడు!

అయితే మోకాళ్లపై బడి దేవుని సహాయాన్ని కోరువానిని
దేవుడు విడిపిస్తాడు
శోధకుని తరిమేసి, యాత్రికుని ప్రోత్సహించి
అతని అత్యవసర విన్నపాలకు ఉత్తరమిస్తాడు.

4. 1తిమోతి 6:9

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

అధ్యాయం 20
బ్యూలాదేశము

బ్యూలాదేశం సంతోషాలు

ఇప్పుడు పరలోక యాత్రికులు ఎక్కడైతే సూర్యుడు నిత్యమూ ప్రకాశిస్తూ ఉంటాడో ఆ బ్యూలాదేశములో ఉన్నారు. ఇక్కడ వారు కొంత సమయం తీసుకొని విశ్రమించి తమకు అవసరమైన వాటిని భుజించారు. పండ్ల తోటలు, ద్రాక్షతోటలు విస్తారమైనవన్నీ వారు వెళుతున్న దేశపు రాజుకు చెందినవి. కాబట్టి వారికి కనిపించిన వాటిలో తమకు అవసరమైనవాటన్నిటినీ ఉపయోగించుకొనే స్వేచ్ఛ ఉందని భావించారు. త్వరలోనే ఈ అద్భుతమైన వాతావరణంలో వారు సేదదీరినందున ఇక వారికి ఎలాంటి విశ్రాంతి అవసరం లేదు.

గంటలు మోగుతున్నాయి, ఉదయం నుండి సాయంకాలము వరకు శ్రావ్యమైన సంగీతం వినబడుతుంది. ఆనందంతో నిండిన ఈ యాత్రికులకు ఇక ఏమాత్రం నిద్రపట్టలేదు. అయినప్పటికీ వారికి నిద్రమత్తుగానీ అలసట గానీ కలుగలేదు. వారు పూర్తి ఉల్లాసంగా సమృద్ధియైన జీవంతో తొణికిసలాడుతున్నారు.

వీధుల్లో వెళుతున్న వారు మాట్లాడుకుంటున్న మాటలు: "మన పట్టణానికి మరింతమంది యాత్రికులు వచ్చారట. ఈ రోజు చాలామంది నదిని దాటి వెళ్లి బంగారపు గుమ్మంలో ప్రవేశించారట." అప్పుడొకరు పెద్ద స్వరంతో ఇలా ప్రకటించారు "ప్రకాశించే వారి సేన ఇప్పుడే ప్రవేశించింది కాబట్టి త్వరలోనే ఇక్కడికి అనేక మంది యాత్రికులు రాబోతున్నారని, వచ్చినవారికి సపర్యలు చేసి వారి దుఃఖములన్నిటినుండి ఆదరించడానికి దేవదూతలు వచ్చారు."

తరువాత మన యాత్రికులు లేచి ఆ వీధుల్లో నడుచుకుంటూ శ్రావ్యమైన సంగీతాన్ని విని ఆనందిస్తూ వెళ్లారు. పరలోకపు దర్శనాలు చూసి వారి కన్నులు సంతోషంతో ఎంతగా మెరిసిపోయాయో, వారి చెవులు పరలోకపు సంగీతంతో అంతగా నిండిపోయాయి. ఇక్కడ సమస్తం ఆహ్లాదకరంగా ఉంది. శరీరానికి మనస్సుకు లేదా ఆత్మకు ఇబ్బంది కలిగించేది ఏదీ లేదు. వారు వెళ్లవలసిన నదిలోని నీళ్లు మాత్రమే రుచికి కాస్త చేదుగా ఉంటాయి కానీ, అది దిగి వచ్చిన తరువాత మధురంగా మారాయి. ఆ నదిని దాటేటప్పుడు కొందరికి ఎంత ఉన్నతంగా కనిపించిందో, ఇతరులకు ఎంత దిగువస్థాయిలో కనిపించింది అనే విషయం గురించి ప్రజలు

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

మాట్లాడుకుంటున్నారు. కొంత మందికైతే అందులో నీళ్లే లేవనిపించిందట. మరికొందరికి అది పొంగి ప్రవహిస్తున్నట్లు అనిపించింది.

అక్కడ పూర్వకాలానికి చెందిన ఘనులైన యాత్రికుల పేర్లు వ్రాయబడి ఉన్నట్టు వారు కనుగొన్నారు. వారు చేసిన గొప్ప కార్యాల గురించికూడా నమోదు చేయబడింది.

ఈ స్థలంలో చిన్న పిల్లలు తోటలోనికి వెళ్లి పూలు సేకరించి ఎంతో ప్రేమగా యాత్రికులకు అందించడం ఆనవాయితీ. ఆ తోటల్లో అన్ని రకాల సుగంధాలు, పరిమళాలు పండించబడతాయి. వాటిని గదులలో సువాసన వెదజల్లడానికి, నదిని దాటివెళ్లిన తరువాత వారి దేహాలకు సుగంధ ద్రవ్యాలు పూయడానికి ఉపయోగిస్తారు.

పరమపురికి రమ్మని క్రిస్టియానాకు పిలుపు

ఇప్పుడు వాళ్లు ఈ స్థలంలో కొంతసేపు వేచి ఉండగా ఆ పట్టణంలో ఒక వదంతి వ్యాపించింది. యాత్రికుడైన క్రైస్తవుడి భార్య క్రిస్టియానాకు పరమపురినుండి ఒక ముఖ్యమైన సందేశం వచ్చిందని అందరూ చెప్పుకుంటున్నారు. కనుక ఆమె ఎక్కడుందో కనుగొనమని పరిశీలకుల్ని పంపగా వారు ఆమె ఉంటున్న ఇంటిని కనిపెట్టి ఆ సందేశాన్ని ఒక ఉత్తరంలో ఆమెకు అందజేశారు. అందులోని సమాచారం ఇలా ఉంది: "అమ్మా నీకు శుభములు, రాజుగారి యొద్దనుండి నీకొక వార్తను తెచ్చాను. ప్రభువు నిన్ను రమ్మని పురమాయించినాడు. పది రోజులలోపు నీవు అమర్త్యతను ధరించి ఆయన సన్నిధిలో కనబడవలెను." వార్తాహరుడు ఈ ఉత్తరాన్ని చదివినప్పుడు అతడు నిజమైన దూత అని చెప్పడానికి గుర్తుగా ఒక వస్తువునిచ్చి త్వరగా సిద్ధపడి బయలుదేరి రమ్మని చెప్పాడు. అతడు ఇచ్చిన గురుతు ఒక బాణం. అది ప్రేమతో పదును పెట్టబడి మృదువుగా తన హృదయంలో గుచ్చబడింది. తద్వారా నియామక కాలంలో ఆమె వెళ్లిపోడానికి సిద్ధమైంది.

తన సమయం వచ్చిందని, ఆ బృందంలో తానే తొలిగా నదిని దాటవలసి ఉందని క్రిస్టియానా గుర్తించినప్పుడు తన మార్గదర్శి అయిన గొప్పమనస్సును పిలిచి ఈ వార్తను తెలియచేసింది. అతడు ఈ వార్తను విన్నందుకు సంతోషంగా ఉందని, అదే సందేశం తనకు వచ్చినా అంతే సంతోషంగా ఉండేవాడినని చెప్పాడు. తరువాత తన ప్రయాణానికి ఎలా సిద్ధపడాలో చెప్పమని అతన్ని సలహా అడిగింది. తన నిష్క్రమణకు సంబంధించిన ప్రతి వివరాన్ని తెలియచేసి ఇలా చెప్పాడు: "సజీవులమై ఉన్న మేము నదిదాకా వచ్చి నీకు వీడ్కోలు పలుకుతాము."

క్రిస్టియానా వీడ్కోలు సందేశం

అప్పుడామె తన పిల్లలను పిలిపించి వారిని దీవించింది. వారి నొసళ్లపై వేయబడిన గుర్తును ఇప్పటికీ హాయిగా చదువగలుగుతున్నానని, వారు ఇంకనూ ఈమార్గంలో ఉన్నందుకు ఈ చివరి గడియలో తన ప్రక్కన ఉన్నందుకు సంతోషంగా ఉందని వారికి చెప్పింది; ముఖ్యంగా వారు

తమ వస్త్రాలను ఇంత తెల్లగా ఉంచుకున్నందుకు ఆమె ఆనందించింది. ఆ తరువాత తనకున్న దానిలో పేదలకు దానం చేసి, తన కొడుకులు, కుమార్తెలు వారి పిలుపువచ్చినప్పుడు సిద్ధంగా ఉండుమని హెచ్చరించింది.

తన పిల్లలతోను, మార్గదర్శితోను ఈ మాటలు పలికిన తర్వాత, సత్యపరాక్రమశాలిని పిలిపించింది. "అయ్యా, మీరు ఎల్లప్పుడూ సత్యవంతుడవుగా కనుపరచుకున్నారు. మరణము వరకు నమ్మకముగా ఉండండి, అప్పుడు నా రాజు మీకు జీవకిరీటమిస్తాడు.[1] దయచేసి మీరు నా బిడ్డలను జాగ్రత్తగా చూచుకుంటారా? ఒకవేళ ఎప్పుడైనా వారు బలహీనపడితే, దయచేసి వారితో మీరు ఆదరణకరంగా మాట్లాడతారా? నా కుమార్తెలు, కుమారులు, వారి భార్యలు ఇంతవరకు నమ్మకంగా జీవించారు, గనుక వాగ్దానపు నెరవేర్పు వారికి బహుమానము అవుతుంది."

నిలకడ గారికి ఈ మాటలు చెప్పి ఒక ఉంగరం ఇచ్చింది: "మీ ప్రయాసము ప్రభువునందు వ్యర్థముకాదని యెరిగి, స్థిరులును, కదలనివారును, ప్రభువు కార్యాభివృద్ధియందు ఎప్పటికిని ఆసక్తులునై యుండుడి"[2]

తర్వాత నిజాయితీగారిని పిలిచి, ఆయన లోనికి వచ్చినప్పుడు అక్కడ నిలిచివున్నవారితో ఇలా చెప్పింది: "ఇదిగో ఇతడు నిజముగా ఇశ్రాయేలీయుడు, ఇతనియందు ఏ కపటమును లేదు."[3]

అతడు ఆమెతో ఇలా అన్నాడు: "నీవు సీయోనుకు బయలుదేరిన రోజు నిర్మలమైనదిగా ఉండును గాక. ఆరిన నేలమీద నీవు నదిని దాటవలెనన్నది ప్రార్థన చేస్తాను."

''ఎండయినా, వానయినా నేను మాత్రం నా ప్రభువు నియమించిన రోజున వెళ్లాలనుకుంటున్నాను. నా ప్రయాణంలో వాతావరణం ఎలా ఉన్నా అంతమునకు చేరిన తర్వాత, ఆగి విశ్రమించి తడిసిన బట్టలు పూర్తిగా ఆరబెట్టుకొనే సమయం ఉంటుందని భావిస్తున్నాను" అంటూ ఆమె బదులు పలికింది.

తర్వాత కుంటయ్య గారు ఆమెను చూసేందుకు రాగా, ఆమె అతనితో ఇలా అన్నది, "ఇంతవరకు నీ ప్రయాణం కష్టంగా సాగింది, కానీ దానివల్ల కలిగే విశ్రాంతి ఎంతో మధురంగా ఉంటుంది. మెలకువగా సిద్ధపాటుతో ఉండు. నీవు అనుకొనని గడియలో దూత రావచ్చునేమో."

అతని తర్వాత వచ్చిన వైరాగ్యం, అతని కుమార్తె భయస్తురాలితో క్రిస్టియానా ఇలా చెప్పింది. "సందేహపు వేడ నుండి, నిరాశా రాక్షసుడి నుండి నీకు లభించిన విడుదలను నీవు కృతజ్ఞతాపూర్వకంగా సదాకాలము గుర్తుంచుకోవాలి సుమా. ఆ గొప్ప అనుగ్రహం వల్లనే ఈనాడు నీవు పరలోకపు సరిహద్దు ప్రాంతంలోకి రాగలిగావు. మెలకువగా ఉండి సమస్త భయాలను పారద్రోలు. మత్తు వదలి, అంతము వరకు నిరీక్షణతో జీవించు."

1. ప్రకటన 2:10 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8
2. 1కొరింథీయులకు 15:58
3. యోహాను 1:47

అటు తర్వాత బలహీనం గారితో ఇలా అన్నది: "నీవు సమాధానముతో రాజును చూచి, పరలోకపు వెలుగులో సదాకాలము జీవించునట్లు క్రూరుడైన గజదొంగ చేతిలో నుండి నీవు తప్పించబడినావు. నేను నీకు చెప్పగలిగే మాట ఒకటే. దేవుడు నీకోసం తన దూతను పంపక మునుపు నీ భయాలను, దేవుని మంచితనాన్ని సందేహించే నీ బుద్ధిని మార్చుకో. లేదంటే ఆయన ఎదుట నిలిచినప్పుడు నీవు సిగ్గుతో తలదించుకోవలసి వస్తుంది."

క్రిస్టియానా నదిని దాటుట

క్రిస్టియానా తన దారిన వెళ్లవలసిన రోజు రానే వచ్చింది. ఆ మార్మిక నదిని దాటే సన్నివేశాన్ని చూసేందుకు తరలివచ్చిన ప్రజలతో రహదారి క్రిక్కిరిసిపోయింది. అవతలి తీరం గురించిన దర్శనం వారికి కలుగగా, నది అవతల ఉన్న తీరమంతా క్రిస్టియానాను పట్టణ ద్వారం వద్దకు సాగనంపడానికి పైనుండి దిగివచ్చిన గుర్రాలు, రథాలు, ఓ గొప్ప సమూహంతో నిండిపోయి ఉండటం అక్కడ చేరినవారంతా చూడగలిగారు. అప్పుడు ఆమె ముందుకు వచ్చి అక్కడి వరకు తన వెంట వచ్చినవారికి వీడ్కోలు పలుకుతూ నదిలో ప్రవేశించింది. ఆమె నోట వారికి వినిపించిన చివరి మాటలు "ప్రభూ, నేను నీయొద్దకు వస్తున్నాను. నీవు నా యెడల చూపిన కృప అంతటిని బట్టి నిన్ను స్తుతించి సదా కాలము నీతో ఉండుటకై నేను వచ్చేస్తున్నాను."

ఇప్పుడు ఆమె వెళ్లిపోయింది గనుక ఆమె పిల్లలు, స్నేహితులు ఒంటరితనంతో నది వద్దనుంచి ఏడ్చుకుంటూ వెనుదిరిగారు. అయితే ఈ మార్గపు కష్టాలనుంచి స్వేచ్ఛ పొంది తన రాజుతోను తన భర్తతోను ఈ భూమిమీద ఉన్నదాని కంటే శ్రేష్ఠమైన గృహంలోనికి వెళ్లిందన్న ఆనందం కూడా వారిలో కలిగింది. మరికొందరు ఆనంద బాష్పాలు రాలుతుండగా చిరునవ్వుతో ఎవరి ఇళ్లకు వారు వెళ్లిపోయారు. ఎందుకంటే నది అవతలి వైపున క్రిస్టియానా కోసం ఎదురుచూస్తుండిన వారు ఆమెను తీసుకొని కనుమరుగై పోయారు.

ఇతర యాత్రికులకు పిలుపు

కొంతకాలం తరువాత పట్టణంలోకి మరొక సందేశం వచ్చింది. ఈ సారి ఆ సందేశం కుంటయ్య కొరకు వచ్చింది. వచ్చిన దూత అతడితో ఇలా చెప్పాడు "నీవు ఇంతకాలం ఊతకర్రలతో సహా ఎవరినైతే ప్రేమించి వెంబడించావో ఆయన వద్దనుండి నీకోసం వచ్చాను. ఈష్టరు మరునాడు ఆయన భోజనపు బల్లవద్ద ఆయనతోపాటు భుజించడానికి నిన్ను రమ్మని చెప్పడానికి నేను వచ్చాను. కనుక నీ ప్రయాణం కొరకు సిద్ధపడు." తన సందేశం సత్యమైనదని చెప్పడానికి గురుతుగా అతనికి ఒక మాట చెప్పాడు. "వెండితాడు విడిపోవును, బంగారు గిన్నె పగిలిపోవును."[4] ఆ దూత వెళ్లిపోయిన తరువాత తన వీలునామా రాయడం కోసం సత్యపరాక్రమశాలిని పిలిపించాడు. తన వద్ద ఇతరులకు ఇవ్వడానికి ఊతకర్రలు, శుభాకాంక్షలు తప్ప మరేమీ లేవు గనుక అతని వీలునామా ఇలా ఉంది "ఈ ఊత కర్రలు నా అడుగుజాడల్లో నడువవలసిన

4. ప్రసంగి 12:6 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

నాకుమారునికి చెందును. అతడు నాకంటే మెరుగైన యాత్రికుడుగా రుజువుపరచుకోవాలన్న నూరు శుభాశీస్సులతో ఈ వీలునామా రాస్తున్నాను." మార్గంలో తనకు ఎంతో ప్రోత్సాహము సహాయము అందించిన గొప్పమనస్సుకు అతని నడిపింపు అనుగ్రహాలను బట్టి కృతజ్ఞతలు చెప్పి తన నిష్క్రమణకై సిద్ధపడసాగాడు. అతడు నది ఒడ్డునకు వచ్చినప్పుడు "నన్ను పరమపురికి తీసుకెళ్లేందుకు నది అవతల గుర్రాలు, రథాలు నాకోసం ఎదురుచూస్తూ ఉన్నాయి గనుక ఈ ఊతకర్రలతో నాకిక పనిలేదు. అక్కడ నాకు పరిపూర్ణమైన దేహం ఉంటుంది" అన్నాడు. అతని చివరి పలుకులుగా "ప్రాణమా, స్వాగతం!" అంటూ వెళ్లిపోయాడు.

అతని తరువాత, బలహీనంకు వార్త వచ్చింది. తలుపు దగ్గర పోస్టుమ్యాన్ హారన్ కొట్టాడు. బలహీనం అతన్ని లోనికి ఆహ్వానించినప్పుడు అతడు ఇలా చెప్పాడు "నీ యజమానుడు నిన్ను రమ్మన్నాడని చెప్పడానికే నేను వచ్చాను. కొద్దికాలంలోనే నీవు ఆయనను మహిమలో కలుసుకోవాలి. నా సందేశం సత్యమైనదని తెలుసుకొనడానికి గుర్తుగా దీనిని తీసుకో. "కిటికీలో గుండా చూచువారు కానలేకయుందురు."[5] తరువాత బలహీనం తన స్నేహితులను పిలిచి ఈ విషయం వారికి చెప్పాడు: "నా తదనంతరం ఎవరికైనా ఏదైనా విడిచి వెళ్లేందుకు నా వద్దఏమీ లేదు గనుక వీలునామా రాయాలన్న తలంపు నాకు లేదు; ఇక నా బలహీనమైన శరీరము, మనస్సు విషయానికి వస్తే ఖచ్చితంగా వాటిని విడిచి వెళతాను ఎందుకంటే నేను వెళుతున్న స్థలంలో వాటి వలన ఎలాంటి ఉపయోగం ఉండదు. అయితే నిరుపేదలైన యాత్రికులకు సహా వాటిని ఇవ్వగలిగేంత విలువైవి కూడా కాదు. కనుక నా ఈ బలహీనమైన భౌతిక కాయాన్ని నది ఒడ్డున ఎవరికీ తెలియని, అక్కడికి వెళ్లేందుకు ఎవరూ ఇష్టపడని ఒక ప్రదేశంలో పూడ్చిపెట్టమని పరాక్రమంగారిని అడుగుతాను. అయితే ఒక విషయం గుర్తుంచుకోండి, నేను మాత్రం అక్కడ ఉండను. "ఎందుకంటే భూమి మీద మన గుడారమైన ఈ నివాసము శిధిలమైనప్పుడు చేతి పని కాక దేవుని చేత కట్టబడినదియు నిత్యమైనదియునైన నివాసము పరలోకమందు మనకున్నదని ఎరుగుదును."[6] సమయం ఆసన్నమైనప్పుడు అతడు ఏమాత్రం వణకకుండ నిర్భయంగా నదిలో ప్రవేశించాడు. అతని చివరి పలుకులు "మంచి విశ్వాసమును సహనమును కలిగి యుండుడి." అతడు నది అవతలివైపుకు వెళ్లిపోయాడు.

అనేక రోజుల తరువాత వైరాగ్యంగారి కొరకు కబురు వచ్చింది. ఒక పోస్టుమ్యాన్ ఈ సందేశం తీసుకొచ్చాడు. "భయపడుతున్నవాడా, వచ్చే ప్రభువు దినం లోపు నీవు రాజు ఎదుట హాజరు కావలెనని నిన్ను ఆదేశించటమైనది. నీ సమస్త బాధలు చింతలనుండి నీకు విముక్తి లభిస్తున్నందుకు నీవు ఆనందంతో కేకలు వేయవచ్చు. నా ఈ సందేశము సత్యమైనది, దానికి రుజువుగా ఈ మాటలు విను "మిడుత బరువుగా ఉండును, బుడ్డబుడుసరకాయ పగులును"[7]

వైరాగ్యంగారి కుమార్తె భయస్తురాలు లోపలికి వచ్చి ఈ సందేశం విన్నప్పుడు తన సమయంకూడా ఆసన్నమైందని గుర్తించింది. ఎందుకంటే తన తండ్రి మరణాన్ని చూసి తాను బ్రతుకలేదు.

5. ప్రసంగి 12:3
6. 2కొరింథీ 5:1
7. ప్రసంగి 12:5

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

అందుచేత తాను కూడా వస్తానని తన తండ్రితో చెప్పింది. అప్పుడు వైరాగ్యం తన స్నేహితులతో ఇలా చెప్పాడు, "నేనూ, నా కుమార్తె మీకు ఎంత కష్టం కలిగించామో మీ అందరికీ తెలుసు. మా ఇద్దరి వీలునామా ఏమిటంటే, మేము వెడలిపోయిన రోజు నుంచి ఇకమీదట మా వైరాగ్యమూ, అనవసర భయాలు ఎవరికీ చెందకూడదు; మా మరణానంతరం అవి ఇతరులకు సంభవించడానికి ప్రయత్నిస్తాయని మాకు తెలుసు. నిజం చెప్పాలంటే, మేము యాత్రికులముగా మారినప్పటినుండి మాతో వస్తున్న పిశాచాలవి. అప్పటినుండి వాటిని వదిలించుకోవడం మా వల్ల కాలేదు. అవి ఇతర యాత్రికుల జీవితాల్లో చోటు సంపాదించడం కోసం తిరుగుతుంటాయని మాకు తెలుసు. అయితే, ఈ సందేశం చదివేవారికి లేదా వినేవారందరికీ మేము చెప్పేదేమనగా, "వాటిని రానీయకుండ తలుపులు మూసేయండి, ఎన్నటికీ లోనికి రానివ్వకండి!" ఇక వారు వెళ్లవలసిన సమయం వచ్చినప్పుడు, వారిరువురు కలిసి నది ఒడ్డునకు చేరుకున్నారు. వైరాగ్యం పలికిన చివరి మాటలు ఇలా ఉన్నాయి: "భయంకరమైన రాత్రీ, సెలవ్! అమూల్యమైన పగటికి స్వాగతం!" అతని కుమార్తె పాటలు పాడుతూ నదిలోనికి వెళ్లింది కాని, ఆమె పలికిన మాటలు ఎవరికీ అర్థం కాలేదు.

వైరాగ్యమూ, అతని కుమార్తె వెళ్లిపోయిన కొంతకాలానికి నిజాయితీ కోసం వెతుక్కుంటూ పట్టణంలోనికి ఒక పోస్టుమ్యాన్ వచ్చాడు. అతడు నివసిస్తున్న ఇంటిని కనుగొని, ఈ విషయం తెలియజేశాడు: "ఏడు రోజుల తర్వాత నీవు ప్రభువు ఎదుట, తన తండ్రి యింటియందు హాజరుకావలెనని నీకు ఆజ్ఞాపించడమైనది. ఈ సందేశము సత్యమని తెలుసుకొనుటకు గుర్తుగా ఈ మాటలు స్వీకరించు. "సంగీతము చేయు స్త్రీలు, నాదము చేయువారందరును నిశ్శబ్దముగా ఉంచబడుదురు"[8] అప్పుడు నిజాయితీగారు తన స్నేహితులను పిలిచి ఈ మాటలు చెప్పాడు, "నేను మరణించబోతున్నాను కాని, నేను ఎలాంటి వీలునామా రాయను. నా నిజాయితీ నాతోనే వస్తుంది. నా వెనుక వచ్చేవారికి ఈ మాట చెప్పనివ్వండి." అతడు వెళ్లవలసిన రోజు వచ్చినప్పుడు, కొన్నిచోట్ల నది పొంగిప్రవహిస్తోంది. అయితే నిజాయితీగారు తన జీవితకాలంలో మంచి మనస్సాక్షి అనే వ్యక్తిని నదివద్దకు వచ్చి తనకు సహాయం చెయ్యమని అడిగాడు గనుక అతడు వచ్చి సహాయం చేశాడు. నిజాయితీ పలికిన చివరి మాటలు ఇవి: "కృప రాజ్యమేలును!" ఆవిధంగా అతడు ఈ లోకాన్ని విడిచివెళ్లాడు.

ఇది జరిగిన తరువాత, నిజాయితీ వద్దకు వచ్చిన వార్తాహరుడే సత్యపరాక్రమశాలి కోసం కూడ ఆదేశాలు తెచ్చాడన్న వదంతులు వినిపించాయి. అతనికివ్వబడిన గుర్తు: "ధారయొద్ద కుండ పగిలిపోవును."[9] విషయం అర్థమయ్యాక, అతడు తన స్నేహితులను పిలిపించి, వారికి ఇలా చెప్పాడు, "నేను నదిని దాటి నా తండ్రి ఇంటికి వెళుతున్నాను. ఇకమీదట మీరు నా ముఖం చూడరు. నేను ఈ మార్గంలో చాలాకాలం నుండి వున్నాను, ఎన్నో కష్టాలు అనుభవించాను; అయితే నేను అనుభవించిన ఏ కష్టం గురించి గాని, కీడుపట్ల నా ఉద్దేశం గురించి లేదా దాన్ని

8. ప్రసంగి 12:4 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8
9. ప్రసంగి 12:6

నేను ఎదిరించిన విధానం గురించిగాని ఇప్పుడు నేను బాధపడటం లేదు. నా అడుగు జాడల్లో నడవబోతున్నవానికి నా ఖడ్గాన్ని; వాటిని సంపాదించుకొనేవానికి నా ధైర్యాన్ని, నైపుణ్యాన్ని ఇస్తాను. నా ఒంటిమీద ఉన్న ఈ గుర్తులు, మచ్చలను నా ప్రభువు సేవలో నేను పొందిన బాధలకు సాక్షిగా నాతోనే తీసుకెళతాను. నాకు ముందుగా వెళ్లినవాడు చెప్పినరీతిగా, "నేనిప్పుడే ప్రాణార్పణముగా పోయబడుచున్నాను, నేను వెడలిపోవు కాలము సమీపమై యున్నది. మంచి పోరాటము పోరాడితిని, నా పరుగు కడముట్టించితిని, విశ్వాసము కాపాడుకొంటిని. ఇకమీదట నా కొరకు నీతి కిరీటముంచబడియున్నది. ఆ దినమందు నీతిగల న్యాయాధిపతియైన ప్రభువు అది నాకును, నాకు మాత్రమే కాకుండ తన ప్రత్యక్షతను అపేక్షించు వారికందరికిని అనుగ్రహించును." [10]

అతని రోజు వచ్చినప్పుడు నదివరకు అనేకమంది అతనికి తోడుగా వెళ్లారు. అతడు నీటిలోనికి దిగిన తర్వాత అతడు ఈ మాటలు పలికాడు, "ఓ మరణమా, నీ ముల్లెక్కడ?" లోతైన నీటిలోనికి వెళ్లి ఇలా కేకవేశాడు, "ఓ మరణమా, నీ విజయమెక్కడ?" అతడు ఆవలివైపుకు సమీపిస్తుండగా అతని నోట ఈ మాటలు వినిపించాయి: "మన ప్రభువైన యేసు క్రీస్తు మూలముగా మనకు జయము అనుగ్రహించుచున్న దేవునికి స్తోత్రము కలుగును గాక."[11] ఆవిధంగా అతడు నదిని దాటిపోగా, అవతలివైపున ఉన్న బూరలన్నీ అతని కోసం మ్రోగినాయి.

చివరిగా నిలకడ గారికి (మంత్రభూమిలో మోకాళ్లమీద కనిపించిన మనిషికి) ఓ సందేశం వచ్చింది. జీవితంలో ఒక మార్పు కొరకు అతడు సిద్ధపడాలని, తన ప్రభువుకు అతడు దూరంగా జీవించడం ఆయనకు ఏమాత్రం ఇష్టం లేదనేది ఆ సందేశంలోని సారాంశం. అది నిలకడగారిని గాఢమైన ధ్యానముద్రలోకి నడిపించింది. "ఈ సందేశం సత్యమా కాదా అని నీవు సందేహించనక్కరలేదు. నీకు ఆనవాలు ఇదే" అన్నాడు ఆ సందేశకుడు: "బావియొద్ద చక్రము పడిపోవును"[12]

తర్వాత, నిలకడగారు గొప్పమనస్సును పిలిపించి, అతనితో ఇలా అన్నాడు, "గొప్పమనస్సు గారూ, నా యాత్రా జీవితంలో ఎక్కువకాలం మీ సహచర్యంలో గడిపే అదృష్టం నాకు దక్కలేదు. అయితే, నేను మిమ్మల్ని కలిసినప్పటి నుండి మీరు నాకు ఎంతగానో సహాయకరంగా ఉన్నారు. నిజమైన, నమ్మదగిన ఓ మార్గదర్శికి నా అభినందలు తెలియజేస్తున్నాను. నేను ఇల్లువిడిచి వచ్చినప్పుడు నా భార్యను, ఐదుగురు పిల్లలను వదిలి వచ్చాను. మీరు తిరిగి వెళ్లినప్పుడు (మీరు ఇంకా అనేకమంది యాత్రికులకు తోడుగా రావాలి గనుక మీ యజమాని ఇంటికి తిరిగి వెళతావని భావిస్తున్నాను) నా శుభాభినందనలు నా కుటుంబానికి అందజేయమని మిమ్మల్ని బ్రతిమాలుతున్నాను. మార్గంలో నాకు ఏమి జరిగిందో చెప్పండి. ఇక్కడివరకు సురక్షితంగా చేరానని, ధన్యకరమైన జీవితాన్ని అనుభవించడానికి నేను వెళ్లిపోయానని వారికి తెలియజేయండి. అలాగే, క్రైస్తవుడి గురించి, అతని భార్యయైన క్రిస్టియానా గురించి, ఆమె తన పిల్లలతో కలిసి

10. 2తిమోతి 4:6-8 "...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8
11. 1కొరింథీ 15:54-57
12. ప్రసంగి 12:6

తన భర్త నడిచిన దారిని ఎలా వెంబడించింది, ఎంత సంతోషకరమైన ముగింపును చూసింది, ఆమె ఎక్కడికి వెళ్లింది మొదలైన విషయాలు కూడ వాళ్లకు చెప్పండి. నా కుటుంబానికి ఇచ్చేందుకు నా ప్రేమ, నా ప్రార్థనలు, నా కన్నీళ్లు తప్ప నా దగ్గర మరేమీ లేవు. ఒకరోజున వారు కూడ ఈ రక్షణను అనుభవిస్తారేమో నన్న ఆశతో ఎదురు చూస్తుంటానని వారికి చెప్పండి."

ఈవిధంగా నిలకడ తన పనులన్నీ చక్కబెట్టుకున్న తరువాత, అతడు వెళ్లవలసిన సమయం ఆసన్నమైనప్పుడు అతడు కూడ నదివద్దకు చేరుకున్నాడు. ఆ సమయంలో నది చాలా ప్రశాంతంగా ఉంది. గనుక నిలకడగారు నీటిలోనికి ప్రవేశించి కొద్దిసేపు నిలబడి, ఒడ్డుమీద చేరివచ్చిన తన సహచరులతో మాట్లాడాడు: "ఈ నది అనేకులకు భయానకంగా ఉండేది. అవును, దీనిగురించి ఆలోచించినప్పుడు నాకూ భయమేసింది. అయితే ఇప్పుడు నేను ఎంతో తేలికగా నిలబడ్డాను. ఇశ్రాయేలు ప్రజలు యొర్దానును దాటినప్పుడు, నిబంధన మందసమును మోసిన యాజకులు నిలిచిన చోట నా పాదాలు స్థిరంగా నిలిచాయి. నిజంగానే ఈ నీరు నోటికి చేదుగాను, దేహానికి చల్లగాను ఉన్నాయి; అయినా సరే, నేను ఎక్కడికి వెళుతున్నానో దానిగురించిన తలంపు, నది అవతల నాకోసం ఎదురుచూస్తున్న నా సంరక్షణా సిబ్బంది గురించిన తలంపు నా గుండెల్లో కణకణ మండే నిప్పువలె అనిపిస్తోంది.

"ఇప్పుడు నా ప్రయాణం అంతానికి చేరుకున్నానని నాకు తెలుస్తోంది; నా కష్ట దినాలు సమాప్తమైనవి. తలపై ముళ్ల కిరీటం ధరించి, నాకోసం తన ముఖంపై ఉమ్మివేయబడిన వాని శిరమును నేను చూడబోతున్నాను. ఇప్పటిదాకా నేను విన్నమాటలు, విశ్వాసం ద్వారానే జీవించాను, అయితే ఇప్పుడు నేను కన్నులార చూస్తూ బ్రతికే చోటుకు వెళుతున్నాను. ఎవరి సాహచర్యమంటే నేను ఆనందిస్తానో ఆయనతో నేను ఉండబోతున్నాను. ఆయన గురించి ఎవరైనా మాట్లాడుతుంటే వినడం నాకెంతో ఇష్టం. కాలమనే ఇసుక తిన్నెలపై ఆయన పాద ముద్రలు నాకు ఎక్కడ కనిపిస్తే అక్కడ నడిచేందుకు నేను ఎంతో సంతోషించేవాణ్ణి. ఆయన నామం నాకు అమూల్యమైన ధననిధితో సమానం– అన్ని సుగంధాలకన్నా మధురమైనది ఆయన నామం. ఆయన స్వరాన్ని వినడమంటే నాకు ఎంతో ఆనందం. ఆయన ముఖం భూమ్యాకాశాలలో ఉన్న సమస్త సౌందర్యాన్ని మించినది. ఆయన వాక్యము నా ఆత్మకు ఆహారం, నా తప్పటడుగులకు విరుగుడు. ఆయన నా అపరాధములకు నన్ను దూరముగా ఉంచి, నన్ను తన హస్తాలతో గట్టిగా పట్టుకున్నాడు. అవును, నా అడుగులను తన మార్గంలో స్థిరపరచి బలపరిచాడు."

చివరి వాక్యం ముగిస్తుండగా అతని ముఖవర్చస్సు మారిపోయింది. అతని దృఢమైన దేహం వంగిపోయింది, "ప్రభూ, నీ యొద్దకు వస్తున్నాను, నన్ను స్వీకరించుము" అని పలికిన తర్వాత అతడు వెళ్లిపోయాడు, ఒడ్డున నిలిచినవారు అతన్ని ఇక చూడలేకపోయారు.

నిత్య పురమునకు ఆహ్వానించబడిన విశ్వాసులు

అయితే నది ఆవలివైపు ఆకాశంనిండా గుర్రాలు, రథాలు బూరలు ఊదేవారు గాయకులు సంగీత విద్వాంసులు అమరులైన వేలాదిమంది నిలచి నిత్యపురము యొక్క గుమ్ములలో ప్రవేశిస్తున్న విశ్వాసులకు స్వాగతం పలుకుతున్న ఆ దృశ్యం ఎంత దివ్యంగా ఉన్నదో!

ఆ సంగీతం ఆగిపోతుండగా ఆ సన్నివేశపు మహిమ కనుమరుగవుతుండగా నేను నా కలలోనుండి మేల్కొన్నాను.

యాత్రికుని ప్రయాణం

జాన్ బన్యన్

బైబిల్ కాకుండ, అంత తరచుగా ముద్రించబడి, విస్తృతంగా పంపిణీ చేయబడుతున్న గ్రంథాలలో జాన్ బన్యన్‌గారి 'యాత్రికుని ప్రయాణం' తప్ప మరొకటి లేదు. పాత గిన్నెలకు అతుకులు వేసుకొని జీవనం సాగించే జాన్ బన్యన్ పేరు ప్రపంచమంతటా ప్రఖ్యాతిగాంచింది అంటే, అది ఈ పుస్తకం చలువే. అతడు 1628–1688 మధ్యకాలంలో జీవించాడు. ఒక లోతైన పాపపు ఒప్పుదల అనంతరం, ఈ మొరటు పనివాడిని ప్రభువు తన పాదాల చెంతకు రప్పించుకొని, యేసుక్రీస్తు రక్తంలో దొరికే పాప క్షమాపణా శక్తిని అనుభవింపచేశాడు.

ప్రభువు కృపచేత తన జీవితంలో జరిగిన అద్భుతంనుండి ఇంకా తేరుకోని జాన్ బన్యన్, తాను కనుగొన్న మధ్యవర్తి గురించి ఇతరులతో మాట్లాడాలని బలవంతం చెయ్యబడ్డాడు. దేవుని వాక్యంలో నుంచి తమతో ఒక ఆదరణ వాక్యం పంచుకోమని త్వరలోనే తన స్నేహితులు బ్రతిమాలడం మొదలైంది. వారి విన్నపాన్ని ఎంతో భయంతో వణకుతో మన్నించాడు. జాన్ బన్యన్ తన సేవకుడిగా ఉండాలన్న పిలుపును మరింత బలంగా నిర్ధారించడానికి దేవుడు ఎంతో ఆనందించాడు. చివరికి అతడు ఓ బ్యాప్టిస్ట్ సంఘంలో సేవకుడయ్యాడు. ఇంగ్లాండు దేశాన్ని 2వ చార్లెస్ (1660–1685) పరిపాలిస్తున్న కాలంలో అత్యంత గౌరవనీయులైన జాన్‌బన్యన్ అరెస్టయ్యాడు. చట్టవ్యతిరేకంగా సమావేశాలు నిర్వహించడమే కాక, చర్చ్ ఆఫ్ ఇంగ్లాండువారి జాతీయ ఆరాధనా క్రమంతో ఏకీభవించనందుకు అతన్ని నిర్బంధంలోకి తీసుకోవలసి వచ్చింది. ఈ సంఘం అంత నీచమైన స్థాయికి దిగజారడమే కాక, పూర్తిగా రోమన్‌క్యాథలిక్ సాంప్రదాయాలతో నిండిపోవడంతో, వాటి ప్రకారం నడుచుకోలేకపోయిన అనేకమంది భక్తిగల సేవకులు తమ పదవులనుంచి తొలగించబడ్డారు. ఆంగ్లికన్ చర్చి అధికారానికి లోబడేందుకు జాన్‌బన్యన్ తిరస్కరించి, తన సొంత కూటాలు ఏర్పాటుచేసుకుంటున్న కారణంగా అతడు 1660లో చెఱసాలపాలై బెడ్‌ఫోర్డ్‌నందున్న జైలులోనే 12 సంవత్సరాలు గడిపాడు. తన విశ్వాసాన్ని బట్టి బాధలు అనుభవించడానికి సిద్ధంగా ఉన్నాడు గనుక, ఈ జైలుశిక్షను అడ్డగించకుండ, దేవునివాక్య ధ్యానంలో సమయం గడిపాడు. మునుపెన్నడూ లేనంతగా ఈ సమయంలోనే అతడు దేవుని వాక్యాన్ని మరింత తేటగా గ్రహించగలిగాడు. అయితే, తన భార్యాబిడ్డలతో కలిగిన ఎడబాటునే తట్టుకోలేకపోయాడు. "నా కాళ్లనుంచి మాంసపు కండలు కోస్తున్నంత బాధగా ఉంది" అంటూ తన ఆవేదనను వ్యక్తపరచేవాడు. ప్రత్యేకించి, తన కారణంగానే వాళ్లు దుర్భర దారిద్ర్యాన్ని, అధికారుల ఆగ్రహాన్ని చవిచూడాల్సివచ్చిందని తెలిసినప్పుడు అతని గుండె పగిలినంత పనైంది. తన భార్యాబిడ్డలతో కలిగిన ఎడబాటు కాక, తన ప్రియమైన సంఘంతో కలిగిన ఎడబాటు కూడ అతనికి అధికమైన దుఃఖం కలిగించింది. తన సంఘ సభ్యులను అతడు తన ఆత్మీయ బిడ్డల్లా భావించాడు. అతడు "తన సింహాల గుహ"గా పిలుచుకునే చెరసాలలో ఉన్నప్పుడు, తాను ఇప్పటికీ ప్రయోజనకారిగా ఉంటూ, తన సంఘ సభ్యులకోసం ఏదైనా రాయలన్న కోరిక

మనస్సులో మెదిలింది. అతడు కలం పట్టినప్పుడు ఒక క్రైస్తవుడు నిత్యత్వానికి సమకట్టిన ప్రయాణం గురించి ఆలోచించి, తన సొంత ఆలోచనా ప్రవాహంలో ముందుకు సాగిపోతూ ఒక క్రైస్తవుని పరలోకపు యాత్ర గురించి అలంకారరూపంలో రాశాడు. దాని ఫలితమే ఇప్పుడు మనందరికి తెలిసి ఇప్పటివరకూ రాయబడిన అలంకార గ్రంథాలలో అత్యంత ప్రఖ్యాతిగాంచిన యాత్రికుని ప్రయాణం. అయితే, దేవుని కృపచేత అంధకారంలోనుండి బయటికి పిలువబడి, నిత్య సీయోనునకు ప్రయాణమై వెళుతున్న బాటసారులందరికీ అదొక ఆదరణ కలిగించే గ్రంథంగా కూడ మరింత పేరు ప్రఖ్యాతులు పొందింది. క్రైస్తవుడి మార్గంలో పాఠకులు తమ సొంత అనుభవాలను గుర్తిస్తారు. అందుకే ఈ గ్రంథమంటే దేవుని బిడ్డలకు అప్పటినుంచి అంత ప్రగాఢమైన అభిమానం. నిజమైన క్రైస్తవుడికి సీయోను దారి ఇప్పటికీ సరిగ్గా బన్యన్ తన పుస్తకంలో వివరించినట్లే ఉంటుంది. ఇప్పటికీ వారు తమ తండ్రి రాజ్యంలో ప్రవేశించాలంటే శ్రమలమార్గంలో వెళ్లాల్సిందే. అంతేకాదు, ఈ పుస్తకంలో బన్యన్ ప్రస్తావించిన క్రైస్తవుని దేవుడూ, ఇతర యాత్రికుల దేవుడు ఇప్పటికీ ఏకరీతిగా ఉన్నాడు. పశ్చాత్తాపమనే ఇరుకు ద్వారం గుండా, క్రీస్తునందలి విశ్వాసం ద్వారానే ఆయన తనవారినందరినీ ఆ పరలోక పట్టణానికి చేరుస్తాడు.

జాన్ బన్యన్ రాసిన యాత్రికుని ప్రయాణం గురించి ఇప్పటికే ఎంతో రాయబడింది. ఈ పుస్తకంలో క్రైస్తవుడు అనే వ్యక్తి కీలకం. ఇది కూడ సరైనదే. ఎందుకంటే బన్యన్‌గారి పుస్తకం నిండా ప్రధానంగా అతని సంగతులే ఉంటాయి. అయితే, క్రైస్తవుడి తరువాత, బన్యన్ తన పుస్తకంలో అనేక పాత్రలకు చోటిచ్చాడు. అవికూడ ఎన్నో పాఠాలు, హెచ్చరికలు, ఆదరణలతో కూడినవిగా ఉంటాయి. ముఖ్యంగా అవన్నీ బైబిల్‌లోని పాత్రలే.

వివిధ రకాల వ్యక్తుల్ని, వారి గుణగణాలను వివరించడంలో బన్యన్‌ది అందెవేసిన చెయ్యి. ఆ వ్యక్తిని గూర్చిన వర్ణనలోనే వారు చేస్తున్న పనులకు మూలమైన వారి అంతరంగ స్థితిని మన కళ్లముందు ఆవిష్కరిస్తాడు. అసలు తన పాత్రలకు పెట్టిన పేర్లు వింటేనే వాళ్ల స్థంగతేమిటో మనకు అర్థమవుతుంది. దేవుని కృపచేత నూతన పురుషునిగా మారిన అనేకమందిని మనం కలుసుకుంటాం. పరిశుద్ధాత్ముని ద్వారా వారి గుణం నూతనపరచబడి, కొత్తగా రూపొందించబడి, ఆయన కార్యం చేయడం జరుగుతుంది. మరికొంతమందిని కూడా మనం కలుసుకుంటాం. వారు నిజంగా సాతానుడి చేత రూపించబడి, వారి దుష్టస్వభావం చేత నడిపించబడేవారైయుంటారు.

యాత్రికుని ప్రయాణం లోని ఈ రెండు రకాల పాత్రల్ని వివరించే పనిని స్వయంగా నేనే చేపట్టాను. అందులోనుంచే **యాత్రికుని ప్రయాణంలోని పాత్రలు** అన్న శీర్షిక రూపుదిద్దుకుంది. దీనికో చక్కని ముగింపు నివ్వడం కోసం "పరలోక పట్టణం" వివరణతో ఈ శీర్షికను ముగించాను. అందరికీ సుపరిచితుడైన క్రైస్తవునితో పాటు, యాత్రికుని ప్రయాణంలోని ఇతర పాత్రలు కూడ ఈ కొత్త పుస్తకం ద్వారా మరింత సజీవంగా మనముందుకు రావాలని, తద్వారా ఓ క్రైస్తవుడి పరలోక యాత్రను గూర్చిన బన్యన్‌గారి గ్రంథం మరింత సులభంగా అర్థం కావాలన్నది నా ఆశ. అన్నిటికంటే ముఖ్యంగా, మనలో ప్రతి ఒక్కరం వ్యక్తిగతంగా ఈ నాశనపురం నుండి ఆ పరమపురికి యాత్రను చేపట్టేలా ప్రభువు కృప చూపును గాక!

రెవ. సి. హ్యారింగ్

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

యాత్రికుని ప్రయాణంలోని పాత్రలు

సువార్తికుడు జాన్ గిఫర్డ్

జాన్ బన్యన్‌గారి యాత్రికుని ప్రయాణంలోని పాత్రలు ఒకవైపు బన్యన్ సృష్టించినవే అయినా, మరోవైపు వారు పూర్తిగా బైబిల్ వ్యక్తులు. బన్యన్ జీవితాన్ని అధ్యయనం చేసినప్పుడు, యాత్రికుని ప్రయాణంలోని పాత్రలన్నీ అతని జీవితంలో ప్రముఖపాత్ర వహించిన వ్యక్తులవే అని కూడ మనం గుర్తిస్తాం. ఆవిధంగా వారు కేవలం బైబిల్ వ్యక్తులే కాదు, రక్తమాంసాలు కలిగిన మనుష్యులు కూడాను.

క్రైస్తవుని జీవితంలో అత్యంత ప్రాముఖ్యమైన తొలివ్యక్తి సువార్తికుడు. క్రైస్తవుడు నాశనపురాన్ని విడిచి వెళ్తుండగా ఎంతో నిస్పృహలో ఉన్నప్పుడు, తనను సీయోను మార్గంలో వెళ్లమని చెప్పిన సువార్తికుడిని అతడు ఎలా కలిసింది మనకు తెలుసు. క్రైస్తవుడి గురించి ఇప్పటికే చాలా సంగతులు చెప్పడం, రాయడం జరిగింది. అయితే క్రైస్తవుని జీవితంలో అంత పెద్ద పాత్ర పోషించిన సువార్తికుడు అను పేరుగల అసలు వ్యక్తి ఎవరు? "సువార్తికుని పని చేయుము" అని 2 తిమోతి 4:5లో అపొస్తలుడైన పౌలు తన ఆత్మీయ కుమారునికి చేసిన ఉపదేశంలోని దైవసేవకుడే ఆవ్యక్తి. ఈ పేరు వెనుక ఉన్న అసలు వ్యక్తి బెడ్‌ఫోర్డ్ సేవకుడైన జాన్ గిఫర్డ్. ఇతని గురించి బన్యన్ రచనలలో తెలుసుకోవచ్చు. బన్యన్ ఎల్లప్పుడూ ఎంతో గౌరవంగా ప్రేమపూర్వకంగా రాసే ఈ జాన్ గిఫర్డ్ ఎవరు? తన యాత్రికుని ప్రయాణంలో సువార్తికునికి ఇంత ప్రాముఖ్యమైన స్థానం ఇచ్చినప్పుడు అతని మనస్సులో ఉన్నది కూడ ఈ వ్యక్తే కావడం విశేషం.

1648వ సం., జూన్ మొదటి తేదీన, కెంట్ జిల్లాలోని మెయిడ్‌స్టన్ దగ్గర రాయలిస్టులకు, క్రోమ్‌వెల్ దళాలకు మధ్య భీకరమైన పోరు జరిగింది. 1వ ఛార్లెస్ రాజుకు చెందిన రోమా దళాలకు విరోధంగా, ప్రార్థనలు చేస్తూ, పాటలు పాడే ప్యూరిటన్లు దండెత్తిన ఈ యుద్ధంలో క్రోమ్‌వెల్‌కి పరిపూర్ణ విజయం లభించింది. క్రోమ్‌వెల్ బందీలలో ఒక రాయలిస్టు ఉన్నాడు. అతడు మెయిడ్‌స్టన్ గందరగోళంలో ప్రధాన పాత్ర వహించిన మేజర్ జాన్ గిఫర్డ్. ఇతడు త్వరలోనే ప్యూరిటన్ సంఘానికి ప్రముఖవ్యక్తిగా మారనున్నాడు. అతడు చేయవలసిన గొప్ప కార్యం ఒకటి దేవుని దగ్గర సిద్ధంగాఉంది.

యుద్ధం ముగిసిన మరునాడు, ఉరికంబం మీద తన చావుకోసం ఎదురుచూడటం తప్ప జాన్ గిఫర్డ్‌కి మరో ఆలోచన లేదు. అతనికి మరణదండన విధించబోయే ముందురోజు రాత్రి అతన్ని దర్శించడానికి తన సహోదరిని అనుమతించారు. తీవ్రంగా అలసిపోయిన సైనికులు ఆ రాత్రి కావలి కాస్తూ నిద్రపోవడం వల్ల, అతనికి స్వేచ్ఛను ప్రసాదించే అవకాశం ఆమెకు కల్పించారు.

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

లండన్ నుంచి తప్పించుకుపోయి, కెంట్ జిల్లాలోని బెడ్‌ఫోర్డ్‌లో తన స్నేహితుల వద్ద గోప్యంగా ఉండే వరకు, అతడు అక్కడే కొంతకాలం నగర శివార్లలోని పొదల్లో దాగిఉన్నాడు.

జాన్ గిఫర్డ్ సైనికుడిగా మారకముందు వైద్యవిద్య చదువుకున్నాడు గనుక డాక్టర్ పట్టా ఉంది. ఒక వైద్యుడిగా కంటే ఓ సైనికుడి మొరటైన పాపపు జీవితమే అతన్ని బాగా ఆకట్టుకుంది.

అయితే, బెడ్‌ఫోర్డ్‌లో ఉండగా తన జీవనోపాధికోసం మరొకసారి వైద్యుడి అవతారం ఎత్తాడు. ఆవిధంగా జాన్ గిఫర్డ్ బెడ్‌ఫోర్డ్ గ్రామ వైద్యుడయ్యాడు. సైనికుడిగా ఉన్నప్పుడు గిఫర్డ్ ఒక లోకస్తుడిగా, ఎలాంటి కట్టుబాట్లులేని వ్యక్తిగా ఉండేవాడు, ఇప్పుడు డాక్టరుగా మారినా అతనిలో పెద్దగా మార్పేమీ లేదు. బరితెగించిన భక్తిహీనుడిగా అతడు ఎంత నీచంగా తయారయ్యాడంటే, ఆ ఊరి పరువు తీసేశాడు. ముఖ్యంగా అతన్ని ఒక దుష్టుడిగా జమకట్టిన ప్యూరిటన్ల మధ్య ఎంతగానో తిరస్కారానికి గురయ్యాడు. త్రాగుడు, జూదం వల్ల జాన్ గిఫర్డ్ పరిస్థితి ఎంతగా దిగజారిందంటే, ఎంతో గౌరవనీయుడైన బెడ్‌ఫోర్డ్ గ్రామ వైద్యుడు ఇప్పుడు వీధుల్లో బిచ్చమెత్తుకుంటూ తిరుగుతున్నాడు. అపవాదితోను, పాపంతోను నిబంధన చేసుకున్నవాడిగాను, ఆ నిబంధనను ఎట్టి పరిస్థితిలోనూ మీరనని ప్రమాణం చేసుకున్న వ్యక్తిగా అతన్ని అందరూ నీచంగా చూసేవారు. అయితే, చాలామంది భావించినట్లు జాన్ గిఫర్డ్ అంత సంతృప్తిగా ఏమీ జీవించలేదు. తానొక పనికిమాలినవాడుగా, అందరిచేత వెలివేయబడినవాడిగా ఊహించుకొని, ఈ దుర్భరమైన పరిస్థితినుంచి విముక్తి పొందడం కోసం తన జీవితాన్ని అంతంచేసుకోవాలన్న తలంపుతో తిరుగుతూ వుండేవాడు.

అదుగో అప్పుడే ప్రభువు తన ప్రేమగల హస్తాన్ని అతనిపై వుంచి, అతనిలో బలమైన మార్పును కలిగించాడు. జాన్ గిఫర్డ్ ఇంకా వీధుల్లో చిరిగిన చొక్కాలు ధరించి అడుక్కుంటూనే ఉన్నాడు, కానీ త్రాగుడుకోసం వ్యర్థంచేయడానికి అవసరమైన డబ్బుకోసం కాదు. అతడు పరిశుద్ధులతో మాట్లాడుతూ, ''రక్షణపొందుటకు నేను ఏమి చెయ్యాలి?'' చెప్పమంటూ వారిని ప్రాధేయపడుతుండేవాడు. ఈ విధంగా కొన్ని వారాలు గడిచిపోయాయి. జాన్ గిఫర్డ్ ఆత్మ ఇప్పుడు లోతైన, బరువైన ఒప్పుదల క్రింద ఉన్నది. అయితే చివరికి, స్వయంగా తానే చెప్పుకొచ్చాడు: "క్రీస్తురక్తంలో పాపక్షమాపణను ప్రభువు నా ఆత్మకు ఎంత శక్తివంతంగా బయలుపరిచాడంటే, అప్పటినుంచి, నాజీవితాంతం, నాకు లభించిన పాపక్షమాపణను నేను ఎన్నడూ సందేహించలేదు. ఆయన కరుణగల ముఖకాంతిలో నేను నడుచుకుంటూ వచ్చాను."

జాన్ గిఫర్డ్ మారుమనస్సు అనుభవం ఎంత బలంగా ఉండి, ఎంత స్పష్టంగా నూతన జీవితపు ఫలాలను ఫలించిందంటే, అతని జీవితంలో జరిగిన అద్భుతం గురించి ఆ ఊరివాళ్లంతా గొప్పగా చెప్పుకున్నారు. జాన్ గిఫర్డ్‌తో సహవాసం చెయ్యకండని తమ పిల్లలకు చెప్పిన తల్లిదండ్రులే స్వయంగా ఇప్పుడు వారి పిల్లల నోటనే వింటున్నారు– జాన్ గిఫర్డ్ జీవితంలో జరిగిన విషయాల గురించి. అతడా సంగతిని దాచిపెట్టకుండ, ఎంత ప్రేమగా, కన్నీటి పర్యంతమవుతూ చెప్పింది

పిల్లలే తమ తల్లిదండ్రులకు తెలియజేస్తున్నారు. ప్రభువు అతనికి ఇచ్చిన తలాంతులు త్వరలోనే అందరికీ కనిపించసాగాయి. ఒకప్పుడు గ్రామానికే అవమానంగా దాపురించాడనుకొన్న జాన్ గిఫర్డ్ ఇప్పుడు బెడ్‌ఫోర్డ్‌లోని ఖండితమైన ప్యూరిటన్ సహవాసంలో సేవకుడిగా మారాడు. ఆవిధంగా అతడు జాన్ బన్యన్‌ని కలిశాడు. జాన్ బన్యన్ ఆత్మలో జరుగుతున్న పోరాటాల నేపథ్యంలో రెవ.జాన్ గిఫర్డ్‌తో జాన్‌బన్యన్‌కి సంబంధం ఏర్పడేలా దేవుడు పరిస్థితులను సమకూర్చాడు. తన ఆత్మకథలో జాన్‌బన్యన్ మారుమనస్సు అనుభవం గురించి ఇలా రాసుకున్నాడు. ఒకానొక దినాన దేవుడు తన మంచి ఏర్పాటులో నన్ను వ్యాపారరీత్యా బెడ్‌ఫోర్డ్‌కు తీసుకొచ్చాడు. ఇక్కడొక పట్టణవీధిలో ముగ్గురు నలుగురు ఆడవాళ్లు ఆరుబయట ఎండలో కూర్చుని దేవుని సంగతుల గురించి మాట్లాడుకోవడం నేను చూశాను. వారు నూతన జన్మ అనుభవం గురించి, వారి హృదయాల్లో దేవుడు జరిగించిన కార్యం గురించి, తమ దీనస్థితిని వారు ఎలా కనుగొన్నది ఇత్యాది విషయాల గురించి వారు మాట్లాడుకుంటున్నారు.

దేవుడు తన అపారమైన ప్రేమతో యేసుక్రీస్తు నందు వారి ఆత్మలను ఎలా దర్శించింది, ఏ మాటలు వాగ్దానాలు ద్వారా వారు పురికొలుపబడి ఆదరణపొంది అపవాది పన్నాగాలకు వ్యతిరేకంగా బలపరచబడి స్థిరపరచబడ్డారో వివరించాడు. కలతచెందిన బన్యన్‌కి దేవుని ఏర్పాటులో నిజమైన ప్రభువు బిడ్డలతో సహవాసం కుదిరింది. ఈ పరిశుద్ధుల వద్ద తన హృదయాన్ని కుమ్మరించి వారితో మనస్సు విప్పి మాట్లాడాలని తాను బలవంతపెట్టబడినట్లు ఆ తర్వాత రాసుకున్నాడు. 'ఈ సమయానికి బెడ్‌ఫోర్డు వాస్తవ్యులైన వీరితో నా మనస్సు విప్పి మాట్లాడటం ఆరంభించి, నా పరిస్థితిని వారికి వివరించాను. ఇదంతా వాళ్లు విని, నాగురించి రెవ. గిఫర్డ్ గారితో మాట్లాడారు. ఆ తరువాత ఆయనే స్వయంగా నన్ను తన ఇంటికి ఆహ్వానించి, నాతో మాట్లాడి, అనేక సంగతులు తెలిపారు. ఒక ఆత్మతో దేవుడు ఎలా వ్యవహరిస్తాడో తెలుపుతూ, గిఫర్డ్‌గారు, ఇంకా అనేకులు నాతో మాట్లాడారు.'

ఈవిధంగా జాన్ బన్యన్‌కి గిఫర్డ్‌గారితో పరిచయం ఏర్పడింది. అప్పటినుంచి క్రమం తప్పకుండ ఈ దైవజనుడు ఏర్పాటు చేసే ఆరాధనకు హాజరవుతూ వచ్చాడు. అదే అతనికి ఓ ఆశీర్వాదంగా మారింది. గిఫర్డ్‌గారి హితబోధలు లేకపోతే (మానవరీత్యా చెప్పాలంటే) బన్యన్ ఆ తరువాత కాలంలో అందరికీ తెలిసిన జాన్‌బన్యన్ కాగలిగేవాడే కాదంటారు కొందరు. ఆత్మీయంగా చూస్తే, ఒక దేవుని బిడ్డ తన తొలిదినాల్లో ఎలా పెంచబడ్డాడు అనేది చాలా ప్రాముఖ్యమని దీనిద్వారా మనకు తెలుస్తోంది.

అయితే, మరోసారి రెవ.గిఫర్డ్‌గారి గురించి, ఆయన బోధల గురించి జాన్ బన్యన్ మాటల్లోనే విందాం: 'ఈ సమయంలో నేను దైవభక్తిగల రెవ. గిఫర్డ్‌గారి బోధలు వింటూ వారి శిష్యుడిగా మారాను. దేవుని కృపవల్ల వారి బోధలు నా విశ్వాసజీవితానికి ఎంతో దీవెనకరంగా ఉండినాయి. వీరు తన కర్తవ్యాన్ని గౌరవప్రదమైనదిగా ఎంచి, దేవుని ప్రజలు స్వభావసిద్ధంగా వేటినైతే మనస్సులో

దాచుకునేందుకు ఇష్టపడతారో ఆ అసత్యపు, అనారోగ్యపు అవశేషాల నుండి వారిని విడిపించడానికి కష్టపడి పనిచేశారు. మన గురించి ఎదుటివారు వ్యక్తపరచే అభిప్రాయాన్ని సత్యంగా పరిగిణించడమో లేక దానిని నమ్మడమో చేయకూడదని గట్టిగా చెప్పేవారు. అసలైన సత్యం గురించి మనల్ని ఒప్పింపజేసి, తన పరిశుద్ధ వాక్యములోనుండి తన పరిశుద్ధాత్మ ద్వారా మనకు నిశ్చయతను అనుగ్రహించుమని దేవుని యెదుట మనము అధికంగా మొఱ్ఱపెట్టవలెనని చెప్పేవారు.'

ఎంతోమంది దేవుని బిడ్డల విషయంలో జరిగినట్టే, బన్యన్‌గారి విషయంలోను జరిగింది. మొట్టమొదట ఎవరి బోధనలైతే తమ మారుమనస్సు, విమోచనకు ఆశీర్వాదకరంగా ఉంటాయో ఆ సేవకులకు తమ హృదయాల్లో ఎల్లప్పుడూ ప్రత్యేకస్థానం ఉంటుంది. బన్యన్‌గారికి మరపురాని మనిషిగా ఉండిపోయింది జాన్ గిఫర్డ్. బన్యన్ తన యాత్రికుని ప్రయాణంలో 'సువార్తికుడు' అనే పాత్రను కల్పించినప్పుడు అతని మనస్సులో ఉన్నది ఈ సేవకుడే. స్వయంగా జాన్ గిఫర్డ్ కూడ శక్తివంతమైన రీతిలో 'నాశన పురము'ను విడిచి సిలువవేయబడిన క్రీస్తునందు రక్షణకు నడిపించబడినాడు. అప్పట్లో వీరి సేవే బన్యన్‌ని క్రీస్తునందలి విమోచన వద్దకు తీసుకురావడంలో సాధనంగా మారింది. నాశనపురమును గురించిన వర్ణన, దానిలో ఉన్న సమస్తము చాలావరకు బెడ్‌ఫోర్డ్ పట్టణంలాగే ఉంటుంది. ఇక్కడకూడ యాత్రికుని ప్రయాణంలో ఉన్నది కేవలం ఊహాత్మకమైన సంగతులేకాదని తెలుస్తోంది. మురికి బట్టలు ధరించి వీపుమీద విపరీతమైన భారంతో ఏడ్చిన వ్యక్తి బన్యనే. తనను ఆదరించి, విమోచనమార్గం వైపు దారిచూపిన సువార్తికుడు జాన్ గిఫర్డ్. బన్యన్‌గారి యాత్రికుని ప్రయాణంలోని పాత్రలన్నీ నిజజీవితానికి చెందినవి, ముఖ్యంగా బెడ్‌ఫోర్డ్ పట్టణ జీవితానికి చెందినవి. బెడ్‌ఫోర్డ్ అన్ని రకాల ప్రజలకు నిలయంగా ఉండేది. పరిశుద్ధులకూ, భక్తిహీనులకూ, ధర్మశాస్త్రానుసారులకు, సువార్తికులకు, వేషధారులకు, నిజమైన విశ్వాసులకు అది నివాసంగా ఉండేది. అందుచేత బన్యన్‌కి తన పుస్తకంలో అన్నీ ఊహించి రాయవలసిన అవసరం రాలేదు, కాని నిజజీవితంలో నుంచే కల్పిత పాత్రలను సృష్టించాడు.

బరువును మోస్తున్న మనిషి

ఫలితంగా, అదేపనిగా యాత్రికుని ప్రయాణం చదువుతుంటే, ఆ పాత్రలను నిజజీవితం నుంచి తీసుకోబడినవే అనిపిస్తుంది మనకు. అవి కేవలం నిజమైన పాత్రలే కాదు; వారు బన్యన్ బెడ్‌ఫోర్డ్‌లో కలిసిన మనుష్యులే అయ్యుంటారు. తన భుజాలమీద బరువును మోస్తున్న వ్యక్తి చైతన్యవంతుడై, కలవరపడిన జాన్ బన్యన్ కాగా, సువార్తికుడిగా తన వద్దకు వచ్చిన మనిషి జాన్ గిఫర్డ్. కలతచెంది నిరాశలో మునిగి ఉన్న ఇనుపసామాన్లకు అతుకులు వేసుకునే వానితో మాట్లాడమని నలుగురు దైవభక్తిగల స్త్రీలచేత పంపబడినది ఈ జాన్ గిఫర్డే. నాశనపురపు ద్వారం వద్ద ఉన్న క్రైస్తవుడిని ఈ సువార్తికుడు కలిసినప్పుడు అతన్ని ఇలా అడిగాడు: "నీవు ఏడుస్తున్నావు ఎందుకు?' క్రైస్తవుడు అతనికి ఇలా జవాబిచ్చాడు: 'అయ్యా, నాకు మరణశిక్ష విధించబడిందని, ఆ తర్వాత తీర్పుకు వెళ్లాలని నా చేతిలో ఉన్న ఈ పుస్తకం ద్వారా నేను గ్రహించాను. అయితే

నాకు మొదటి పని చెయ్యాలని లేదు, రెండవ పని చెయ్యలేను." అప్పుడు సువార్తికుడు ఆ బరువుమోస్తున్న వ్యక్తికి ఇలా బదులు చెప్పాడు. "ఈ జీవితంలో ఎన్నో కీడులు చుట్టుముట్టి ఉండగా, నీకు మొదటి పని చెయ్యాలని ఎందుకు లేదు?" ఈ ప్రశ్న క్రైస్తవుడు తన హృదయాన్ని తెరచి మాట్లాడేలా చేసింది. అందుకే ఇలా జవాబు చెప్పాడు, "ఎందుకంటే నా వీపుమీద ఉన్న ఈ భారం నన్ను సమాధికంటే దిగువకు ముంచివేస్తుందని, నేను తోఫెతులో పడిపోతానని భయంగా ఉంది." ఇదే క్రైస్తవుని అవసరం. తన విశ్రాంతితో కూడిన పాపపు జీవితం నుండి మేల్కొని, మరణము, నిత్యత్వము అనేవాటి విలువను గుర్తించగలిగే మార్గం బైబిల్ పఠనమే. దేవుని పరిశుద్ధత, నిత్యత్వము, అతని అనేక పాపములు అతని వీపు మీద బరువుగా ఉన్నాయి. అందువలన "రక్షింపబడుటకు నేనేమి చేయాలి" అని అతడు ఏడ్చేలా చేసింది ఆ అనుభవం. క్రైస్తవుడి జీవితంలో సమస్తం మారిపోయింది. ఒకప్పటి ఎంతో నిర్లక్ష్యంతో, ఇతరులను హేళనచేసే వ్యక్తి ఇప్పుడు బైబిల్ చదవడం ద్వారా లోతైన ఒప్పుదలతో చింతించే పాపిగా మారాడు. మరణము, తీర్పు సింహాసనం గురించిన తలంపు దేవుని పట్టుకోవాలన్న ఆతృత కలిగించాయని బన్యన్ రచనలను బట్టి మనం గ్రహించవచ్చు. దానిమూలంగా అతడు తరచుగా ఏకాంత ప్రదేశానికి వెళ్లి దేవుని సన్నిధిలో తన మనస్సు కుమ్మరించేవాడు. నలుదిశలా చూసినా ఎటుపోవాలో తెలియలేదని తన యాత్రికుని ప్రయాణంలో రాసుకున్నాడు బన్యన్. ఈ కొద్దిమాటలతో మేల్కొల్పబడిన పాపియొక్క అవసరత గురించి బన్యన్ రాసాడు. అటువంటి వ్యక్తి జీవితంలో సమస్తం ఎంతో భిన్నంగా మారిపోతుంది. మన ఆత్మీయ మరణము, గుడ్డితనము, నిర్లక్ష్యముఅనే స్థితినుండి మనం ఎప్పుడైనా మేల్కొల్పబడి ఉంటే క్రైస్తవుడి అవసరమేమిటో మనకు కూడా కొద్దో గొప్పో అర్థమవుతుంది. మురికి గుడ్డలు ధరించి వీపుమీద బరువైన మూటను మోస్తూ ఒకసారి బైబిల్‌లో నుంచి చదివి మరోసారి రహస్యంగా ఏడుస్తూ ఇంకోసారి పొలంలోపడి నడుస్తూ "రక్షింపబడుటకు నేనేమి చేయవలెను?" అని హృదయపూర్వకంగా ఆక్రోశించే వ్యక్తి మనకు కొత్తవాడుగా అనిపించడు.

మరణము, నిత్యత్వము, మన అపరాధభావము, క్రీస్తున్యాయపీఠము మన ఆత్మమీద బరువుగా ఉన్నప్పుడు గతంలో జీవించినట్టే సుఖంగా జీవించలేం. క్రైస్తవుడి ఇంటివారు మార్పును గమనించారు కాని అతనికి ఏం జరిగిందో గ్రహించలేక పోయారు. అతన్ని ఎగతాళిచేసి తనలో ఉన్న తలంపులను బలవంతంగా తొలగించాలని ప్రయత్నించారు. ఒక వ్యక్తి గతంలో చేసినట్టు నవ్వలేకుండా, బ్రతకలేకుండా, నాట్యమాడలేకుండా, దుస్తులు ధరించి మాట్లాడలేకుండా ఉన్నప్పుడు అది నలుగురికి తెలిసిపోతుంది. అయితే ఆ వ్యక్తి ఉద్దేశపూర్వకంగానే, ఒక బరువైన భారంతో తను వంగిపోతున్నట్టు అందరికీ తెలియాలని ఇలా ప్రవర్తిస్తాడని దీనిభావం కాదు. అయితే తద్భిన్నంగా అతనిహృదయంమీద మనస్సులో ఎంత విపరీతమైన బరువు ఉందో ఎదుటి వారికి కనిపించకుండా దాచుకునేందుకే ప్రయత్నిస్తాడు.

తన వీపుమీద బరువైన మూటను మోస్తూ వెళుతున్న క్రైస్తవుడి అనే వ్యక్తిని సువార్తికుడు కలిసి ఇంత దయనీయంగా కనిపిస్తున్నావు ఎందుకు? అని అడుగగా "ఈ గ్రంధం చదవటం ద్వారా నాకు మరణ దండన విధించబడిందని ఆ తరువాత నేను దేవుని న్యాయపీఠం ఎదుట నిలబడాలని తెలిసింది" అని బదులిచ్చాడు. అందుకు సువార్తికుడు ఇలా అన్నాడు "ఒకవేళ అదే నీ పరిస్థితి అయితే ఊరికే నిలబడ్డావెందుకు? రానున్న ఉగ్రతనుండి తప్పించుకుని ఎందుకు పారిపోవడం లేదు? ఈ నగరం నుంచి ఏదైనా ఒక సురక్షిత ప్రాంతానికి ఎందుకు పారిపొవడం లేదు?" దానికి జవాబుగా క్రైస్తవుడు "నేను ఎక్కడికి పారిపోగలను? ఎటువెళ్లాలో నాకు తెలియదు" అన్నాడు.

ప్రకాశమానమైన వెలుగు

ఇక్కడ మనం ఏంచేయాలో పాలుపోని ఒక వ్యక్తిని కలుస్తున్నాం. అపరాధంతో నిండిన తన తలను దాచుకోవడానికి ఎటుపోవాలో తెలియని పాపిని కలుస్తాం. ఇక్కడే సువార్తికుడి పాత్రను అతడు నిర్వర్తించిన కార్యాన్ని ఎంతో మధురంగా వెలుగులోకి తీసుకురాబడింది. బరువైన మూటను మోస్తున్న క్రైస్తవుడికి ఆరుబయట మైదానాలను చూపించి "అదిగో అక్కడ దూరంగా ఒక చిన్న గుమ్మం ఉంది నీకు కనిపిస్తుందా? అని అడిగాడు. సువార్తికుడు చూపించిన దిశగా క్రైస్తవుడు చూసి 'లేదు' అన్నాడు. సువార్తికుడు చూసినదాన్ని అతడు చూడలేకపోయాడు. పాపముచేత అపరాధంతో నిండిన వాని జీవితంలో ఇది ఎంత సత్యం. విశ్వాసులు చూడగలిగేది అతడు చూడలేడు, క్రీస్తునందు విమోచనా రక్షణను వారిలా చూడలేడు అటువంటి వ్యక్తి ప్రభువు దగ్గర క్షమాపణ దొరుకుతుందన్న అద్భుతాన్ని ఏమాత్రం గ్రహించలేడు. సువార్తికుడు మరికొంత దిగివచ్చి అక్కడ కనిపించే వెలుగును చూస్తున్నావా? అని అడుగగా క్రైస్తవుడు అవును చూసాను అన్నాడు. దూరంగా మిణుకు మిణుకుమంటూ ప్రకాశిస్తున్న వెలుగును అతడు చూశాడు.

అటువంటి దుర్భరమైన జీవితాలు కలిగిన వారి విషయంలో ఇదికూడా సత్యమే. ప్రభువు వారి ఆత్మలో ఆశాకిరణాలను ప్రసరింపచేస్తాడు. అప్పుడప్పుడు దూరంగా వారికి వెలుగు రేఖలు కనిపిస్తాయి దేవుని వద్ద కృప, పాపక్షమాపణ ఉన్నాయని తెలుసుకుంటారు. అప్పుడు సువార్తికుడు అతనితో ఇలా అన్నాడు "ఆ వెలుగును చూస్తూ అక్కడి వరకు నేరుగా వెళ్లు అక్కడ నీకు కనిపించే గుమ్మం దగ్గరకు వెళ్లి తలుపు తట్టినప్పుడు తరువాత ఏంచేయాలో అక్కడ నీకు చెప్పబడుతుంది." ఇది క్రైస్తవుడికి ఎంత స్వేచ్ఛను కలిగించిందో! తన పాపం చేత ఆత్మలో ఉన్న అవసరం చేత ఎటుచూడాలో తెలియని స్థితిలో ఉన్నప్పుడుసురక్షిత మార్గం వైపు నడిపించబడ్డాడు. దూరంగా మిణుకు మిణుకు మంటున్న వెలుగు అతన్ని స్నేహపూర్వకంగా ఆహ్వానిస్తున్నట్లు అతడు చూడగలిగాడు; ఎలాంటి సందేహం లేకుండా ఆ వెలుగునే కళ్లలో నింపుకొని దానివైపుగా వెళ్లమని, అక్కడ రక్షణ పొందుటకు తను ఏంచేయాలో చెప్పబడుతుందని సువార్తికుడు అతని మనస్సులో ముద్రించుకునేలా చెప్పాడు.

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

క్రైస్తవుడు తన దృష్టిలో ఉంచుకొనవలసిన ఈ వెలుగుయొక్క భావమేమిటో యాత్రికుని ప్రయాణంలోని ఒక ఫుట్‌నోట్ సూచిస్తుంది. అది 2పేతురు1:19లోని మార్గనిర్దేశం. అక్కడ దేవుని వాక్యం ఇలా ఉంటుంది "మరియు ఇంతకంటే స్థిరమైన ప్రవచనవాక్యము మనకున్నది. తెల్లవారి వేకువచుక్క మీ హృదయములలో ఉదయించువరకు ఆ వాక్యము చీకటిగల చోటున వెలుగిచ్చు దీపమైనట్టున్నది; దానియందు మీరు లక్ష్యముంచిన ఎడల మీకుమేలు."

ఆ విధంగా గొప్పభారాన్ని మోస్తూ నిరాశతో ఉన్న క్రైస్తవుడు దేవుని వాక్యములోని వాగ్దానాలపై తన దృష్టిని నిలిపేలా తన కన్నులకు శిక్షణనిచ్చి తద్ద్వారా దేవుని యొద్దకు వెళ్లాలని ఆశిస్తూ తన హృదయంలో యేసుక్రీస్తు అనే వేకువ చుక్క ఉదయించే వరకు ఆశతో జీవించాలని సువార్తికుడు కోరుకున్నాడు. ఆ విధంగా సువార్తికుడు సత్‌క్రియలవైపు నడిపించకుండా దేవుని వాగ్దానాలవైపు నడిపించి పశ్చాత్తాపంతో దుఃఖముతో తనవైపుకు మరలి ఆశ్రయముకోరే వాళ్లకు దేవుడు తన కృపను, కనికరమును వాగ్దానముగా అందిస్తున్నాడు. అపరాధముతోను దుఃఖముతోను కృంగియున్న వారికి లోకంలో దొరికే ఏకైక వెలుగుఇదే. ధర్మశాస్త్రంలో గాని మెరుగుపడటంలో గాని క్రియలలో గాని ఈవెలుగు లేదు. క్రైస్తవుడిలా అపరాధమనే బరువునుమోస్తూ చీకటిలో ఉండి రక్షింపబడుటకు నేనేమి చేయవలెను అని కేకలు వేసే వారికి లభించే ఏకైక వెలుగు సువార్త యందలి వాగ్దానాల్లోనే ఉంది. అత్యంత దయనీయమైన పాపులకు దేవుని కృపను గూర్చినవాగ్దానాలు చీకటిలో ప్రకాశించే వెలుగులా ఉంటాయి.

దూరంగా కనిపిస్తున్న వెలుగునే చూస్తు ముందుకు వెళ్లమని చెప్పినప్పుడు సువార్తికుడు క్రైస్తవుడికి ఓ కొత్త సలహా ఏమీ ఇవ్వడంలేదు. ఇది పేతురు ఇచ్చిన సలహానే, "దానియందు మీరు లక్ష్యముంచిన ఎడల మీకుమేలు." దీనిని బట్టి బన్యన్ రాసిన యాత్రికుని ప్రయాణం ఎంత లేఖనానుసారమైనదో మరొకసారి మనం గుర్తించవచ్చు.

అయితే భారంతో ఉన్న క్రైస్తవుడి పాత్రను బన్యన్ అంత జ్ఞానయుక్తంగా తీర్చిదిద్దలేదని భావించేవాళ్లుకూడా చాలామందే ఉన్నారు. బన్యన్ క్రైస్తవుడ్ని నేరుగా క్రీస్తువైపుకు నడిపించి ఉండాల్సింది అంటారు వాళ్లు. అయితే ఇలా చెప్పేవాళ్లు యాత్రికుని ప్రయాణాన్ని మరింత శ్రద్దగా చదవాలి. క్రైస్తవుడ్ని కేవలం ఆ వెలుగు వద్దకే నడిపించాలన్నది సువార్తికుడి ఉద్దేశం కాదు. మరింత ఉన్నతమైనదాని వైపుకు నడిపించాలనుకున్నా క్రైస్తవుడు దాన్ని చూడలేకపోయాడు. పాపభారంతో అపరాధంచేత నలిగిపోతున్న వ్యక్తితో సువార్తికుడు తనకుతాను అన్వయించుకొని క్రైస్తవుడు దూరంగా ఉన్న చిన్నగుమ్మాన్ని చూడలేకపోతున్నానని చెప్పినప్పుడు "అలాగైతే అక్కడ ప్రకాశిస్తున్న వెలుగును చూడగలుగుతున్నావా?" అని అడిగాడు. దయనీయమైన స్థితినుండి తెరువబడిన వారి విశ్వాసనేత్రము ఇప్పటికీ చీకటిగానే ఉండి ఎన్నో లోపాలు కలిగివుంటుంది. అపరాధముచేత పట్టబడిన వ్యక్తికి క్రీస్తుద్వారా, క్రీస్తునందు లభించే రక్షణ గురించి వెంటనే సరైన అవగాన కలుగదు. అపరాధముతో ఉన్నవారి దుర్భరమైన చీకటిరాత్రిలో వారు కేవలం

దూరంగా మిణుకుమిణుకుమంటున్న వెలుగును మాత్రమే చూడగలరు. దయనీయమైన పాపులకు ప్రభువు దగ్గర కనికరము లభిస్తుందని ఆ వెలుగు ప్రకటిస్తుంది. చీకటి రాత్రిలో ప్రకాశించే ఆ వెలుగు సువార్త వాగ్దానమే. ఒక పాపికి సువార్త వాగ్దానాలన్నిటిలో క్రీస్తును చూసేందుకు, ఎన్నో శతాబ్దాలుగా దాచబడిన మార్గంగా మిగిలిపోయిన క్రీస్తునందలి రక్షణ మార్గం గురించి తెలుసుకోవడానికి పరిశుద్ధాత్ముని వెలుగు, నడిపింపు అవసరం. దేవుడు నీతిమంతుడుగా ఉంటూనే, భక్తిహీనుడైన పాపిని క్రీస్తునందు నీతిమంతునిగా తీర్చగలడు అనే మర్మం వెంటనే అర్థమయ్యేది కాదు. సువార్తికుడు దీన్ని చాలా చక్కగా వివరించాడు.

భారంతో నలిగిపోతున్న క్రైస్తవుడికి ఇదంతా అర్థమయ్యేది కాదు గనుక సువార్తికుడు వెంటనే క్రీస్తుతో ఆరంభించి, ఆయనద్వారా లభించే సర్వ సమృద్ధివైపు నడిపించివుంటే అతనికి ఎలాంటి ఆదరణ నిచ్చేది కాదు. అపరాధంతో కృంగివున్న మనిషిని సహజంగా క్రీస్తువద్దకే నడిపించాలి.

అక్కడ దీనిగురించి ఫుట్‌నోట్‌లో కూడ ఇలా చదువుతాం: అతడు వెంటనే క్రీస్తునొద్దకు పారిపోవాలని, ఆ తరువాత అతడు ఏంచెయ్యాలో అక్కడనే చెప్పబడుతుందని సలహా ఇవ్వబడింది. తన పాపపు మూటను పోగొట్టుకోవాలంటే అతడు ముందుగా తన జీవితాన్ని మెరుగుపరచుకొని, తదుపరి సూచనల కోసం విమోచకుని వద్దకు వెళ్లమని అతనికి చెప్పలేదు. వాస్తవానికి వీపుమీద భారమున్న క్రైస్తవుడిని క్రీస్తువద్దకు పంపాలన్నదే బన్యన్ ఉద్దేశం. ముందుగా ప్రజలను మెరుగుపరిచే గృహాలకు పంచి, ఆ తర్వాత వారు బాగుపడినమీదటే క్రీస్తునొద్దకు ఆహ్వానించే సేవకుల బృందానికి చెందినవాడు కాదు బన్యన్. 'కమ్ అండ్ వెల్‌కమ్ టు క్రైస్ట్' అనే తన పుస్తకంలో మనం ఖచ్చితంగా ఇందుకు భిన్నమైనదే చదువుతాం. అపరాధులను బన్యన్ నేరుగా క్రీస్తువద్దకే నడిపించాడు, గాని ఆచరణలో, క్రీస్తు, ఆయన శ్రమ, మరణముల ద్వారా లభించే రక్షణ అనేవి కొత్త పాపికి దాచబడిన మార్గాలుగానే ఉంటాయని క్రైస్తవుడితో మాట్లాడిన సువార్తికుడి మాటల్లో అర్థమవుతుంది.

కాబట్టి సువార్తికుడు తన సంఘంలో అధికశాతంగా ఉండే దయనీయమైన పాపులు గ్రహించగలిగే స్థాయికి దిగివచ్చి, "దూరంగా ప్రకాశిస్తున్న ఆ వెలుగు మీకు కనిపిస్తుందా?" అని అడిగాడు. ఆత్మల గురించి బన్యన్‌కున్న అవగాహన ఇక్కడ తేటగా కనిపిస్తోంది. దుఃఖంతో కృంగిపోయిన వ్యక్తులతో ఎలా వ్యవహరించాలో అతనికి బాగా తెలుసు, అనుకూల సమయంలో వారికి ఓ మాట చెప్పడం ఎలాగో తన యజమాని నుంచి నేర్చుకున్నాడు.

ప్రకాశించే వెలుగువైపు సువార్తికుడు క్రైస్తవుని మళ్లించి, అతన్ని విడిచి వెళ్లిపోయాడు. సువార్తికుడు చెయ్యవలసిన పని చాలా ఉంది. సిగ్గుతో వెనుకంజవేసే ఇతర పాపులను వెతకడానికి, వారిని కూడ బలపరచి, జీవమార్గంలో వారిని నడిపించడానికి అతడు వెళ్లిపోయాడు. అంతకు ముందురోజే విశ్వాసి అనేవ్యక్తిని దేవుని నిత్యపురమునకు నడిపించే మార్గంవైపు మళ్లించాడు, ఇప్పుడేమో క్రైస్తవుడికి తిన్నని ద్వారం వైపుకు నడిపించే మార్గాన్ని చూపాడు.

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

సీనాయి పర్వతం

ఇప్పుడు మనం బన్యన్‌గారి యాత్రికుని ప్రయాణంలోని కొంతభాగాన్ని విడిచి, క్రైస్తవుడు రెండోసారి సువార్తికుడిని కలిసిన సందర్భాన్ని చూద్దాం. రెండోసారి సువార్తికుడు చాలా విచారకరమైన పరిస్థితులలో క్రైస్తవుణ్ణి కలిశాడు. క్రైస్తవుడు చెడు సలహాలు విన్నాడు. అతడు తిన్నని మార్గం విడిచి, తిన్నని ద్వారాన్ని, వెలుగును పోగొట్టుకొని దారితప్పాడు. సీయోను పర్వతపు భయంకరమైన ఉరుములు, మెరుపులు, పిడుగులు అతనిమీద పడ్డాయి. ఈ భయంకరమైన దృశ్యాన్ని చూచిన క్రైస్తవుడు భయకంపితుడై వణికిపోయాడు. నిత్యశ్రమలకు నిలయమైన స్థలంలో తాను ఉన్నట్లు ఊహించుకున్నాడు. ఎంతో దూరంగా ఒరిగివున్న కొండ తనమీద పడిపోయి తనను శాశ్వతంగా సమాధిచేస్తుందని క్రైస్తవుడు భయపడ్డాడు. ఆ కొండలోనుంచి అగ్ని జ్వాలలు ఎగిసిపడటంతో, శపించే ధర్మశాస్త్రపు అగ్ని అతన్ని దహించివేస్తుందని భయపడ్డాడు. అతడు భయంతో వణుకుతూ కంపించిపోయాడు. ఈ స్థితిలో సువార్తికుడు అతన్ని కనుగొని "క్రైస్తవుడా, ఇక్కడేం చేస్తున్నావ్?' అని అడిగాడు. క్రైస్తవునివైపు తీక్షణంగా చూచి 'నాశనపురం వెలుపట నిలిచి ఏడుస్తున్న వ్యక్తివి నువ్వే కదా? ఆ చిన్న దిడ్డిగుమ్మం వైపు వెళ్లమని చెప్పలేదా నీకు? ఇంత త్వరగా నీవు ఎలా దారితొలగిపోయావు? ఇప్పుడు నీవు దారితప్పిపోయావు" అన్నాడు సువార్తికుడు. నాశనపురం వెలుపట తనను కలిసిన తర్వాత జరిగిన సంగతులను పూర్తిగా సిగ్గుపడుతూ, వివరించాడు. తనవీపు మీదనున్న బరువును వదిలించుకోవడానికి తేలికైన అడ్డుదారిని ఎంచుకొనమని మంచిమాటలతో తనను ఒప్పింపచేసిన ఒక పెద్దమనిషిని తాను కలిసినట్లు క్రైస్తవుడు చెప్పాడు. ఈ దగ్గరిదారిలో వెళుతుండగా క్రైస్తవుడు ధర్మశాస్త్రానుసారి అనే వ్యక్తిని కలిసాడు. కొండమీద నివసించే ఇతడు తన భారాన్ని తొలగించనున్నాడు. ధర్మశాస్త్రపు క్రియలద్వారా రక్షణను పొందాలనే ఆశించేవారి చేతుల్లో క్రైస్తవుడు చిక్కుకున్నాడు. భారంతోఉన్న అతన్ని మెరుగుపరచే గృహానికి, దాస్యపుకొండ వద్దకు పంపి తన ఆత్మకు విశ్రాంతిని పొందమన్నారు. అక్కడ పాపభారంతో ఉన్న వ్యక్తికి సమాధానం దొరుకుతుందని గుడ్డివారు, మూర్ఖులు అయిన నాయకులు భావిస్తారు. అయితే వారి సలహాను నమ్మి దానిని పాటించే విషయంలో క్రైస్తవుడుకూడా వారిలాగే గుడ్డివాడు, మూర్ఖుడు అయ్యాడు. ఈ విషయాన్ని సువార్తికుడు గతంలోనే అతనికి చెప్పాడు. యాత్రికుని ప్రయాణంలో ఇది అలంకారిక రూపంలో ఎంతో చక్కగా వర్ణించబడింది. ముందుగా క్రైస్తవుడిని తీవ్రంగా గద్దించి అతడు చేసిన దోషాన్ని అతని కళ్లకు కట్టినట్టుచూపించాడు. క్రైస్తవుడి గమనానికి మూడు సంగతులు తేబడ్డాయి. సువార్తికుడు అతనితో ఇలా చెప్పాడు "అతని సలహాలో నీవు పూర్తిగా అసహ్యించుకోవలసిన మూడు సంగతులు ఉన్నాయి." ఈలోకజ్ఞాని క్రైస్తవుడ్ని దేవుని మార్గంలోనుంచి తప్పించాడు అన్న వాస్తవాన్ని అతడు ద్వేషించాలి. అతడు లోకజ్ఞాని సలహాను పాటించినందుకు దేవుని ఎదుట తనను తాను తగ్గించుకోవాలి. రెండవదిగా అతడిబోధ లోకానుసారమైనది గనుక క్రైస్తవుడు అతడి సలహాను తిస్కరించాలి. శిలువను మోయకుండా పరలోకపు మార్గంలో నడవాలని భావించేవాళ్లు అతని సిద్ధాంతాన్ని నేర్చుకుంటారు.

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

మూడవదిగా మరణపు మార్గంలో అడుగు పెట్టడానికి క్రైస్తవుడు అతని మాటలు విన్నాడు. లోకజ్ఞాని క్రైస్తవుడ్ని ఎవరిదగ్గరికైతే పంపించాడో ఆ ధర్మశాస్త్రానుసారి ఏ ఒక్కరినీ తమ పాపభారంనుంచి విముక్తుడ్ని చేయగలిగే సమర్థుడుకాదు. సువార్తికుడు క్రైస్తవుడి మనస్సులో ఈ మాటలు నాటుకొనేలా చేసాడు. "ఇంతవరకు అతనిచేత భారంనుంచి విముక్తి పొందినవారు ఎవరూ లేరు, ఇక ముందు కూడా ఎవరూ ఉండబోరు. నీవు ధర్మశాస్త్రపు క్రియలచేత నీతిమంతునిగా తీర్చబడలేవు ధర్మశాస్త్రక్రియల ద్వారా బ్రతికి ఉన్న ఏ మానవుడు తన భారాన్ని తొలగించుకోలేడు."

ఈ విధంగా గద్దించి అతనికి బుద్ధిచెప్పిన తరువాత తన మాటలకు సాక్షిగా సువార్తికుడు ఆకాశాన్ని ఆహ్వానించగా దేవుని దృష్టిలో ఏ ఒక్కడూ ధర్మశాస్త్రక్రియల ద్వారా నీతిమంతుడు కాలేడన్న మాటలను నిర్ధారిస్తూ సీనాయి పర్వతం నుండి అగ్నితో కూడిన మాటలు బయటికి వచ్చాయి. క్రైస్తవుడు ఇవన్నీ చూసి విన్న తరువాత తనమీదికి మరణం తప్ప మరొకటి రాదని భావించాడు. అతడు సువార్తికుని వైపు తిరిగి "అయ్యా, నీకేమనిపిస్తుంది? ఇంకా నిరీక్షణ ఉందంటారా? నేను మరలా చిన్న గుమ్మం వరకూ తిరిగి వెళ్లగలనంటారా? ఈ పనిచేసినందుకుగాను నన్ను అక్కడనుంచి అవమానంతో వెనక్కి పంపివేయరంటారా?" అని అడిగాడు. క్రైస్తవుడు తగిన గుణపాఠం నేర్చుకున్నాడు. ధర్మశాస్త్ర క్రియలద్వారా రక్షణ పొందాలన్న తలంపు నుండి అతడు స్వస్థపడ్డాడు. లోకజ్ఞాని, ధర్మశాస్త్రానుసారి చెప్పిన మాటలు వివడం వల్ల అతడు కేవలం దుఃఖాన్ని మరణాన్ని కొనితెచ్చుకున్నాడు. పరలోకానికి బయలుదేరిన ప్రతి యాత్రికుడు ఈ పాఠం నేర్చుకోవడం ఎంతో అవసరం. ఒక పాపి పరిశుద్ధాత్మ చేత తన నాశనస్థితిని గుర్తుచేయబడిన వెంటనే, వారు సహాయం కోసం ఎల్లప్పుడూ క్రియల నిబంధన వైపే మళ్లుతారు. ఇది మన హృదయాల్లో లోతుగా నాటుకుపోయింది. క్రియల నిబంధన క్రింద పుట్టిన ఒక వ్యక్తి తన సహాయంకోసం, విడుదల కోసం ఎల్లప్పుడూ ముందుగా అక్కడికే వెళతాడు. ధర్మశాస్త్ర మూలముగా ఎన్నడూ రక్షణ పొందలేరన్న ప్రకటనను బాల్యం నుంచి వినేవారు సహా, దానివైపుకే మళ్లుతారు. వారు సంస్కరించబడి, మెరుగుపడతారు, దేవున్ని సంతోషపెట్టడానికి శాయశక్తులా ప్రయత్నిస్తారు, దేవుడు తన కృపతో ఎలాగైనా ముందుకు నడిపిస్తాడన్న ఆశతో కొనసాగుతారు.

దేవుని ఎదుట యోగ్యునిగా కనపడేందుకు ఎన్ని ప్రయత్నాలు చేసి ఎంతగా తగ్గించుకున్నా అతడు భక్తిహీనుడైన పాపి తప్ప మరేమీకాడు. అయితే నిజంగా ఇది అవిశ్రాంతి బంధకాలు తప్ప మనకు ఏమీ ఇవ్వలేదు. స్వయంగా తన పాపం నుంచి తప్పించుకోవాలన్న ప్రయత్నాలు పోరాటాల వలన ఎటువంటి సమాధానము లేదా ఆదరణ లభించదు. ఆవిధంగా భయంతో వణికిపోతున్న క్రైస్తవుడు సీనాయి పర్వతం వద్ద కూర్చొని ఉండగా సువార్తికుడు గమనించాడు. ఒక పాపి తన నాశనకరమైన స్థితిని గుర్తించినప్పటికీ ధర్మశాస్త్రమునుంచి సహాయం పొందాలని ఆశించే ప్రతి ఒక్కరి విషయంలో ఇది వాస్తవమే. దాని వలన ఎలాంటి విమోచన కలుగదు. అదివారిమీదికి మరణమును శాపమును తీసుకొస్తుంది. అప్పుడు క్రైస్తవుడు అడిగిన ప్రశ్నలే

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

మనవి అవుతాయి. అవసరంలో, అనిశ్చిత పరిస్థితుల్లో మనం కూడా ఇలా ప్రశ్నిస్తాం. "మీరేమనుకుంటున్నారు? ఇంకా నిరీక్షణ ఉందా? ఇప్పటికైనా నేను వెనుదిరిగి చిన్నద్వారం వద్దకు వెళ్లగలనా? క్రైస్తవుడులాగే పాపికూడా సరైన మార్గాన్ని విడిచినందుకే ఈ దుఃఖకరమైన పరిస్థితులు దాపురించాయని భావిస్తారు. కృప అనే చిన్న ద్వారం గుండా వెళ్లడానికి ఆ రీతిగా రక్షణ పొందడానికి తమ గర్వం అడ్డువచ్చిందని ఆ వ్యక్తి భావిస్తాడు. అయితే సువార్తికుడు సందేహంలో ఉన్న క్రైస్తవుడిని తన దుఃఖంలో అలాగే నశించిపోనివ్వడు. అతడు క్రైస్తవుడితో ఇలా చెప్పాడు "నీ పాపం ఎంతో గొప్పది, అయినా ద్వారం వద్దఉన్న మనిషి నిన్ను స్వీకరిస్తాడు ఎందుకంటే మనుషుల పట్ల అతనికి ఎంతో కనికరం ఉంది. అయితే మరలా దారితొలగకుండా మాత్రం జాగ్రత్తపడు."

ఈ జవాబును బట్టి ఆ క్షణంలో క్రైస్తవుడి గొప్ప సమస్య ఏమిటో సువార్తికుడు గ్రహించాడని మనకు తెలుసు. పరలోకపు యెరూషలేముకు నడిపించే ఆ చిన్నద్వారం వద్ద ప్రజలు అతన్ని స్వీకరించరని భయపడ్డాడు. అలాంటి పాపికి అదే అభిప్రాయం ఉంటుంది. దేవునికృపను వారు ఇంకా అలాగే అపార్థం చేసుకుంటారు. "ఇప్పుడు నేను సరైన మార్గాన్ని విడిచి దేవుని ఎదుట బుద్ధిలేని నేరస్తుడిగా నిలబడాల్సి వచ్చింది కాబట్టి ప్రభువు నన్ను ఏమాత్రం స్వీకరించలేడు, స్వీకరించబోడు" అని ఆలోచిస్తూ ఉంటారు. అతడు ఎల్లప్పుడూ ఇలాగే ఆలోచిస్తూ ఉంటాడు కదా? ఆ కృపలో ఉన్న అద్భుతం–అనగా నేరస్తులైన వారు క్రీస్తు నిమిత్తము క్షమాపణ పొందుతారు అనే దాని గురించి మనకు ఎంత తక్కువగా తెలుసు. అపరాధులను పశ్చాత్తాపము చెందిన వారిని ప్రభువు సంతోషంగా స్వీకరిస్తాడని, ఈ విధంగా కృంగిపోయి, శిక్షావిధికి గురయిన పాపులకు చెప్పవలసిన బాధ్యత సువార్తికుడిదే. అతని ద్వారా దేవుని సేవకులందరి మీద ఆ బాధ్యత ఉంది. వారు అలాంటివాళ్లకు దేవుని గొప్ప కృపాకనికరముల గురించి చెప్పవలసివుంటుంది. అవి ఘోరమైన పాపులకు క్రీస్తునందు బయలుపరచబడినవి. ఈ మాట క్రైస్తవుడు విన్నప్పుడు ఆనందంగా తిరిగి తన ప్రయాణాన్ని కొనసాగించాడు. చిన్నగుమ్మం వరకు అతని ప్రయాణం సాగింది. సువార్తికుడు క్రైస్తవుణ్ణి ముద్దుపెట్టుకొని, దైవాశీస్సులతో పంపినట్లు మనం చదువుతాం. సువార్తికుడు మరల క్రైస్తవుడిని విడిచిపోగా, అతడు త్వరగా బయలుదేరి చిన్న గుమ్మానికి నడిపించే సరియైన మార్గంలో సాగిపోయాడు.

మాయా సంత

క్రైస్తవుడు తన పాత మిత్రుడు, సహాయకుడైన సువార్తికుణ్ణి మూడోసారి కలిసింది మాయాసంత అనే పట్టణపు ద్వారం వద్దనే. పోయినసారి కలిసినప్పటి నుండి క్రైస్తవునికి అద్భుతమైన, ధన్యకరమైన అనుభవాలు ఎదురయ్యాయి. అతడు చిన్నగుమ్మంలో ప్రవేశించాడు, తద్వారా నాశనపురంలో తనకు సంభవించనున్న అపాయాన్ని తప్పించుకున్నాడు. వివరణకర్త ఇంటిలో కొంతకాలం బసచేశాడు. అక్కడే అతనికి రక్షణమార్గం చూపించగా దూరంనుండి పరలోకపు మహిమను

కూడ చూశాడు.

తన వీపుమీద ఉన్న బరువైన మూట పడిపోయిన గొల్గొతా కొండవద్ద తన అపరాధానికి క్రీస్తునందు సమాధానమును కనుగొన్నాడు, అతని మురికి గుడ్డలు మార్చబడి నీతివస్త్రాలు ధరించాడు.

పరలోకపట్టణపు దారిలో క్రైస్తవుడు తన సహచరుడైన విశ్వాసిని కూడ కలిశాడు. వాళ్లిద్దరూ కలిసి ఎన్నో యుద్ధాలలో పోరాడి, అనేకమైన కష్టాలను అధిగమించారు. వారు మరణశ్ఛాయ లోయను దాటివచ్చారు. క్రైస్తవుడూ, అతని స్నేహితుడైన విశ్వాసి పరలోకపట్టణానికి కలిసి ఇప్పటికే చాలాదూరం ప్రయాణం చేశారు. అయితే వాళ్లు అపవాదికి అందనంత దూరమైతే వెళ్లలేదు. ఈ సంగతి వాళ్లకు గుర్తుచెయ్యడానికా అన్నట్టు, వారు ప్రయాణించే ఇరుకు మార్గం ప్రక్కన అపవాదికి ఎరగా చిక్కిన ప్రయాణికుల ఎముకలను ప్రతిరోజూ చూస్తూనే ఉంటారు. ఎంతో ఆనందంగా తమ పరలోక ప్రయాణం ఆరంభించిన అనేకులు పరలోక పట్టణాన్ని ఎన్నడూ చేరుకోలేకపోయారు. ఎందుకంటే వారు నరహంతకుని చేతిలో హతులయ్యారు.

ఆ ఇద్దరు యాత్రికులు ఇప్పుడు ఎంతోమంది తమ విశ్వాసజీవితంలో బ్రద్దలైపోయిన స్థితిని ఎదుర్కొన్న ప్రదేశానికి చేరువ అవుతున్నారు. అది మాయా సంత అనే పట్టణం. ప్రస్తుతం పరలోకమార్గం లోకంగుండా వెళ్తున్నట్లుగానే ఆ ఇరుకుమార్గం సరిగ్గా ఆ పట్టణపు మధ్యభాగంలో నుంచి వెళ్తుంది. పరలోకపు యెరూషలేముకు వెళుతున్న ఆ ఇద్దరు యాత్రికులను సువార్తికుడు కలిశాడు. వెనక్కి తిరిగి చూసిన విశ్వాసి తమను కలవడానికి వెనుక ఎవరో వస్తున్నట్లు గమనించాడు. క్రైస్తవుడు కూడ కాస్త జాగ్రత్తగా గమనించి చూచి, "ఆ వస్తున్నది నా మంచి మిత్రుడైన సువార్తికుడు' అన్నాడు. 'అవును, అతడు నాకు కూడ మిత్రుడే' అన్నాడు విశ్వాసి. 'చిన్నగుమ్మం దగ్గర నన్ను సరైనమార్గంలో నడిపించింది అతడే' అని చెప్పాడు.

ఈలోపు సువార్తికుడు వాళ్లని సమీపించి, వందనాలు చెప్పాడు. "ప్రియులారా మీకును, మీ సహాయకులకును సమాధానము కలుగునుగాక!" ఆ మాటలు విన్న క్రైస్తవుడు "మా మంచి సువార్తికుడా, స్వాగతం స్వాగతం. మీ ముఖాన్ని చూస్తుంటే, గతంలో మీరు నాపట్ల చూపిన ఆదరాభిమానాలు, దయ, నా నిత్య క్షేమంకోసం మీరు పడిన ప్రయాస అన్నీ గుర్తుకొస్తున్నాయి" అన్నాడు. విశ్వాసి కూడ కేకవేసి ఇలా చెప్పాడు, "ఓ మంచి సువార్తికుడా, నీ సహవాసానికి వేయిసార్లు స్వాగతం. మాలాంటి దీనులైన యాత్రికులకు అది ఎంతో కోరదగినది సుమా." సువార్తికునికి, ఈ పరలోకపట్టణం వెళ్తున్న యాత్రికులకు మధ్య జరిగిన హృదయపూర్వకమైన పలకరింపులు అవి. వాళ్లిద్దరు సువార్తికునికి కృతజ్ఞులై ఉండవలసిన వారే. వారిరువురిని చిన్నగుమ్మమునకు నడిపించే సరైన మార్గంలో నిలిపి చివరికి గొల్గొతా కొండకు నడిపించి రక్షకుడైన క్రీస్తు జ్ఞానంలోనికి నడిపించింది ఇతడే. అయితే సువార్తికుడు వాళ్లను మరలా ఎందుకు కలిసినట్టు? వారు కలిసి చక్కగా నడుస్తూ అనేక కష్టాలను అధిగమించారు. వాళ్ల ప్రయాణం

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

ముగింపుకు రాబోతుంది. వారి ముందు పరలోకానికి మార్గం ఇంకా సగమే ఉంది. అలాంటప్పుడు సువార్తికుడు మరొకసారి వాళ్లను దర్శించడం వెనుక ఉన్న కారణం ఏమిటి?

ఆ ఇద్దరు యాత్రికులు త్వరలో మాయా సంత అనే పట్టణంలో ప్రవేశించబోవడమే ఆ కారణం. ఆ ఇద్దరు యాత్రికులు రేపు బీడుభూమిని విడిచి ఆ మహానగరంలో ప్రవేశించబోతున్నారు. అక్కడ వారిమీదికి ఎన్నో శోధనలు రాబోతున్నాయి. మాయా సంత అనే నగరంలో వారు ఊహించ గలిగిన సమస్తము అందుబాటులో ఉంటాయి. ఆ నగరం వారికి ఇళ్లు, భూములు, స్త్రీలు, గౌరవనీయమైన స్థలాలు, బిరుదులు, సంతోషాలు, శరీరసుఖాలు, త్రాగుడు, జూదం లాంటి మరెన్నిటినో వారికి అందిస్తుంది. వారు కేవలం ఆ పట్టణంలోనే ఉండి సీయోనుకు వెళ్లే దారిలో నడవకుండా ఉంటే చాలు. ఆ ఊరివాళ్లు వారిని చక్కగా చేరదీస్తారు. పూర్తిగా ఓ కొత్తలోకం వారిమీదికి రుద్దబడుతుంది. వాళ్లింతవరకు ఎన్నడూ చూడనంత భిన్నమైనది ఆ లోకం. మాయా సంత నగరంలో విశ్వాస జీవితంలో పతనమైన వాళ్లందరు మంచి ఉద్దేశాలతోనే పరలోకపట్టణపు ప్రయాణాన్ని ఆరంభించారు. ఇక్కడ వారు సమస్తాన్ని కోల్పోయారు. వారి ఘనత, గౌరవం, ఆరోగ్యం, ఆస్థిపాస్తులు అన్నిటికన్నా మించి వారి ఆత్మను, రక్షకుడైన క్రీస్తును కోల్పోయారు. ఈ ఇద్దరు యాత్రికులు ఇప్పుడు గొప్ప శోధనలో ప్రవేశించబోతున్నారు కాబట్టి సువార్తికుడు ప్రత్యక్షమయ్యాడు. వారి ఆత్మల కాపరిగా అతడు వారిని కలిశాడు.

సువార్తికుడు వారిని పొగడ్తలతో ముంచెత్తాడు. ఎన్నో శోధనలు జయించి విజేతలుగా నిలిచినందుకు వారిని కలవడం ఎంతో సంతోషంగా ఉందని చెప్పాడు. అయితే వాళ్లను ఈ విధంగా హెచ్చరించాడు కూడా "కాబట్టి నీకున్న దానిని జాగ్రత్తగా పట్టుకొనుడి, మీ కిరీటము ఎవడు అపహరింపకుండ చూసుకొనుడి, పాపముతో పోరాడుటలో మీరు మరణము వరకు ఇంకను అపవాదిని ఎదిరించలేదు." దేవుని రాజ్యము మీదనుంచి తమ దృష్టిని మళ్లించవద్దని, మాయా సంత నగరంలో కనిపించే ఉరులలో చిక్కుకోవద్దని వారిని హెచ్చరించాడు. క్రైస్తవుడు అతని సహచరుడైన విశ్వాసికి ఆ పట్టణంలో ఎన్నో అడ్డంకులు ఎదురవుతాయి ఎందుకంటే వారు పరలోకానికి వెళ్లాలంటే ఏ పట్టణాన్ని దాటి వెళ్లాలో ఆ పట్టణంలో ఒక పెద్ద సర్కస్ జరుగుతోంది. అందులో అన్ని రకాల పాపాలు, శోధనలు అమ్మకానికి పెట్టబడ్డాయి. దాని అధిపతి బయల్జెబూబు తప్ప మరెవరోకాదు. సువార్తికుడికి ఇవన్నీ తెలియడమే కాక సీయోనుకు వెళ్తున్న యాత్రికులను ఎంతగానో ప్రేమిస్తున్నాడు కాబట్టి పరలోక పట్టణానికి వెళ్తున్న ఈ ఇద్దరు యాత్రికులు ఆ నగరంలో ప్రవేశించబోతుండగా వారిని హెచ్చరించడానికి, ఉపదేశించడానికి సువార్తికుడు రావడంలో ఆశ్చర్యం ఏముంటుంది?

ఇప్పుడు సువార్తికుడు వారికి ఇవ్వబోయే సందేశం గతంలో రెండుసార్లు ఇచ్చినవాటికంటే పూర్తిగా భిన్నమైంది. అప్పట్లో వీపుమీద అపరాధం అనే బరువును మోస్తున్న క్రైస్తవుడ్ని చిన్న గుమ్మం నుండి గొల్గొతా వరకు నడిపించాడు. అతడు విశ్వాసికి కూడా పరలోక మార్గాన్ని

చూపించి క్రీస్తు శిలువ వద్దకు నడిపించాడు. ఆ రెండుసార్లు వారు తమ పాపాల నుండి, దుఃఖకరమైన పరిస్థితినుండి ఎలా విడిపించబడాలో బోధించాడు సువార్తికుడు. ఇప్పుడు క్రైస్తవుడూ, అతని సహచరుడైన విశ్వాసి మరొక కష్టాన్ని ఎదుర్కోడానికి సిద్ధంగా ఉన్నారు. కాబట్టి ఇప్పుడు సువార్తికుడు అందించే సందేశం అందుకే భిన్నంగా ఉంటుంది. ఇది త్వరలో వారు ఎదుర్కొనబోయే అపాయాలకు శోధనలకు సంబంధించింది. ఒక క్రైస్తవుడు తన పాపభారంనుండి విడిపించబడడం గురించి మాత్రమే కాకుండా అపవాది కలిగించే శోధనలు, లోకము, వారిసొంత చెడ్డహృదయమునుండి ఎలా తప్పించుకోవాలోకూడా తెలుసుకోవాలి. ఈ వెలుగులో సువార్తికుడి బోధ మనకు కనిపిస్తుంది. లోకసంబంధమైన కంటికి కనిపించే విషయాలపై మనస్సు పెట్టరాదని నిత్యమైన కంటికి కనిపించని విషయాలమీద మనస్సు లగ్నం చేయాలని చెప్పాడు. కనిపించని పరలోకానికి వెళుతున్న ప్రయాణికుడికి ఇది ఎంత చక్కని ఉపదేశమో కదా! మనల్ని సుళువుగా చిక్కులు పెట్టే పాపంలోనే కాదు లోకసంబంధమైన కనిపించే ప్రతిదానిలోను అపాయాలు ఎదురవుతాయి. ఒక వ్యక్తి తన హృదయాన్ని ఆస్థిపాస్తులు, వస్తువులు, హోదాలు, సిరిసంపదలమీద నిలిపి పూర్తిగా వాటిలోనే నిమగ్నమై పోవడం ఎంత సులభమో. క్రైస్తవుడికి ఆస్తులే సర్వస్వం కాకూడదు అతడు లోకాన్ని ఉపయోగించుకోవచ్చు కాని దాన్ని దుర్వినియోగం చేయకూడదు. దానిమీద తన మనస్సు పెట్టకూడదు. రాబోతున్న అపాయాన్నుంచి తప్పించుకోడానికి సువార్తికుడు మంచి సలహాలిచ్చాడు. వారు అదృశ్యమైన దానిలో నిమగ్నం కావాలని అతడు అశించాడు. హృదయంలో పరలోకం, దేవుని అనుగ్రహం, క్రీస్తు ఉన్నట్లయితే లోకం ఏమాత్రం ఆకర్షణీయంగా ఉండదు. "నీ కిరీటము ఎవడును అపహరింపనీయకుడి" అన్నదే సువార్తికుని సలహా. క్రైస్తవుడికి ఒక కిరీటం ఉంది అది పరలోకపు మహిమకిరీటం. అపవాది, లోకము దానిని ఎంత త్వరగా దొంగిలించి దానిని నేలమీద పడవేసి తొక్కివేద్దామా అని ఆశిస్తూ ఉంటాయి. క్రైస్తవుడికి ఉన్న ఈ రాచరికపు విలువే లోకంలో అతడు మలినపడకుండా నిరోధిస్తుంది. వారు లోకంలో ఉన్నారు మాయా సంత అనే నగరంలోగుండా వెళ్లవలసి ఉంది అయితే అపవిత్రమైన మలినపరచబడిన వారిలా కాకుండా జీవకిరీటం ధరించి దేవుని ఆజ్ఞలను పాటించే వారిగా వెళ్లాలి. యాత్రికులను పరలోకంలో దేవుని ఆజ్ఞలను పాటించువారిగానే గుర్తిస్తారు. అంటే వారు పరిపూర్ణులని ఇక మీదట ఎలాంటి పోరాటాలు లేవని దాని భావం కాదు. కానీ దావీదుతో కలిసి "నీఆజ్ఞలను నేను మరువలేదు" అని చెప్పగలిగేవారిలా ఉంటారు. వారు నూతన భక్తిగల జీవము అనే కిరీటాన్ని ధరిస్తారు. అపవాది ఆ కిరీటం మీదనే గురిపెట్టాడు.

పైగా సువార్తికుడు తన ఉపదేశాన్ని తన ఈ మాటలతో ముగించాడు. "అన్నిటికన్నా మించి మీ హృదయాలను వాటిలోని శరీరాశలను జాగ్రత్తగా చూచుకొనుడి." వారు తమ సొంత హృదయాన్ని సహా నమ్మడానికి వీల్లేదు కనుక దానిపై దృష్టిసారించాలి. అందుకనే సువార్తికుడు ఇంకా ఇలా అన్నాడు "అది మోసకరమైనది, ఘోరమైన దుష్టత్వము కలది." హృదయం కోరుకునే సమస్తము లోకంలో ఉన్నది. హృదయపు ఆశలన్నిటినీ తీర్చుకునే మార్గాన్ని అది కల్పిస్తుంది.

"...ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి" మత్తయి 10:8

ఒక క్రైస్తవుడు తన హృదయాన్ని కాపాడుకోవాలి. అందులో ఉండేదంతా బయటికి రాదు దాని ఆశలన్నీ నెరవేర్చబడవు. శరీరం శిలువ వేయబడాలి హృదయాన్ని భద్రంగా కాచుకోవాలి. అయితే అలాంటి హృదయం కలిగిన మనిషి అంత శక్తివంతమైన అపవాది అనే శత్రువును ఎదిరించి ఎంతో వ్యర్థమైన వాటితో నిండిపోయిన లోకంలో పడిపోకుండా ఎలా వెళ్లగలడు? ఆ ఇద్దరు యాత్రికులతో సువార్తికుడు ఇలా చెప్పాడు "భూమి మీదను, పరలోకంలోను ఉన్న సమస్త అధికారము నీవైపున ఉన్నది." ఈ పోరాటంలో యాత్రికుడు ఒంటరివాడు కాదు. పరలోకంలోను భూమిమీదను సర్వాధికారం కలిగిన క్రీస్తు వారి పక్షాన ఉన్నాడు. సువార్తికుడు ఈ ఇద్దరు యాత్రికులను ఆయన వైపుకు నడిపించగలిగాడు. వ్యర్థమైన ఈ లోకంలో వారు ఒంటరివారు కాదు. క్రీస్తువారికి తోడుగా ఉండి, వారి విశ్వాసం సడలకూడదని వారికోసం ప్రార్థిస్తున్నాడు. "నిన్ను విడువను ఎన్నడు ఎడబాయను" అని వాగ్దానం చేసాడు. "ప్రభువు నా సహాయకుడు ఏ కీడుకు నేను భయపడను" అని చెప్పగలిగేలా ఇది దేవుని బిడ్డలకు స్వేచ్ఛనిస్తుంది.

వీడ్కోలు

ఈ మాటలు చెప్పిన తరువాత సువార్తికుడు వారికి వీడ్కోలు పలుకుతాడు. అతడి చివరి హెచ్చరిక మాటలను వారు తమతోపాటు మాయా సంత అనే అపాయకరమైన నగరంలోకి తీసుకెళతారు. "నా కుమారులారా, పరలోకరాజ్యంలో ప్రవేశించడానికి అనేక శ్రమలు పొందాలని సువార్త సత్యమను మాటల్లో మీరు విన్నారు కాబట్టి మీరు ఆ పట్టణంలో ప్రవేశించి నేను చెప్పినవన్నీ నెరవేరినప్పుడు మీ స్నేహితుడ్ని జ్ఞాపకం చేసుకొని నమ్మకమైన సృష్టికర్తయగు దేవుని కాపుదలకు మీ ఆత్మలను అప్పగించుకొని ధైర్యముగా ఉండండి." సువార్తికుడు పలికిన చివరి మాటలు ఇవే. పరలోకమార్గంలో ఉన్న ఆ ఇద్దరు యాత్రికులు, సువార్తికుడు ఇక్కడ విడిపోయి, చివరికి దేవుని నిత్యరాజ్యములో కలుసుకుంటారు.